ఇంటర్మీడియట్

ఆర్థికశాస్త్రం



తెలంగాణ ప్రభుత్వం

సార్వత్రిక విద్యా పీఠం, తెలంగాణ, హైదరాబాదు

తెలంగాణ ప్రభుత్వం

ఇంటర్మీడియట్

ఆర్థికశాస్త్రం

సార్వత్రిక విద్యా పీఠం, తెలంగాణ, హైదరాబాదు

318

అర్థశాస్త్రం

చీఫ్ అడ్వైజర్

శ్రీమతి వాకాటి కరుణ, ఐ.ఏ.ఎస్.
కార్యదర్శి, విద్యాశాఖ,
తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాదు.

ఎడిటర్

ప్రొ॥ ఎస్. లింబాగౌడ్
ప్రొఫెసర్ ఆఫ్ ఎకానిమక్స్ (రిటైర్డ్)
డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్, తెలంగాణ యూనివర్సిటీ,
ప్రిన్సిపాల్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (అటానమస్)
నిజామాబాద్.

పాఠ్యపుస్తక ముద్రణా కమిటీ

శ్రీమతి ఎ.శ్రీదేవసేన, ఐ.ఏ.ఎస్.
సంచాలకులు, విద్యాశాఖ,
తెలంగాణ, హైదరాబాదు.

శ్రీ పి.వి. శ్రీహరి
సంచాలకులు, TOSS,
తెలంగాణ, హైదరాబాదు.

శ్రీ ఎస్. శ్రీనివాస చారి
సంచాలకులు, పాఠ్యపుస్తక ముద్రణాలయం
తెలంగాణ, హైదరాబాదు.

సమన్వయం

శ్రీ ఎం. సోమిరెడ్డి
సంయుక్త సంచాలకులు, TOSS,
తెలంగాణ, హైదరాబాదు.

శ్రీ బి. వెంకటేశ్వర రావు
స్టేట్ కోఆర్డినేటర్, TOSS,
తెలంగాణ, హైదరాబాదు.

ఓపెన్ స్కూలు తెలంగాణ హైదరాబాద్

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, హైదరాబాద్.
ఎస్.సి.ఇ.ఆర్.టి. ప్రాంగణం, ఎల్.బి.స్టేడియం ఎదురుగా,
బషీర్‌బాగ్, హైదరాబాద్ - 500 001
Phone: 040-23299568, Website: telanganaopenschool.org,
E-mail: dintoshyd@gmail.com

© తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ
తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్.

First Published : 2023

No. of Copies : 1021

All Rights Reserved

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted, in any form or by any means without the prior permission, in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover.

This Study Material is Prepared on the basis of Original Economics (Telugu Version) of TOSS, Hyderabad.

ప్రచురణ

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, హైదరాబాద్.

Foreword

Providing education to children is a fundamental right, and it's essential for the overall development of society. The government of Telangana plays a crucial role in ensuring that education is accessible to all, and they often establish institutions like the Telangana Open School Society (TOSS) to cater to children who may be unable to access formal education due to various reasons.

To provide quality education to learners studying Intermediate Education in Telangana Open School Society starting from the 2023 academic year, the textbooks have been revised to align with the changing social situations and incorporate the fundamental principles of the National Education Policy 2020. The guidelines set forth in the policy aim to enhance the overall learning experience and cater to the diverse needs of the learners. Earlier Textbooks were just guides with questions and answers. TOSS has designed the textbook with a student-centric approach, considering the different learning styles and needs of learners. This approach encourages active engagement and participation in the learning process. The textbooks include supplementary teaching materials and resources to support educators in delivering effective and engaging lessons.

This textbook of economics is broadly divided into four areas: introduction to Economics, Microeconomics, Macroeconomics, the Indian Economy, and the Telangana Economy. Inflation, unemployment, economic growth, Demand Analysis, National Income Analysis, Economic Development in India, and human resources are some of the topics of this textbook. Understanding all these chapters is essential for a comprehensive grasp of the subject.

We are indeed very grateful to the Government of Telangana and the Telangana State Board of Intermediate Education. Special thanks to the editor, co-coordinator, teachers, lecturers, and DTP operators who participated and contributed their services tirelessly to write this text book.

Date: .08.2023,
Place: Hyderabad.

Director, TOSS,
Hyderabad.

కోఆర్డినేటర్

శ్రీ గడ్డమీది రథంగపాణిరెడ్డి
జి.ప.ఉ.పా., జానంపేట, మూసాపేట,
మహబూబ్‌నగర్.

పాఠ్యపుస్తక రూపకల్పన కమిటీ

డా॥ డి.ఆడెప్ప,
అసిస్టెంట్ ప్రొఫెసర్, అర్థశాస్త్రం
గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (ఎ), నిజామాబాద్.

డా॥ యలావతి వేణుప్రసాద్
అసిస్టెంట్ ప్రొఫెసర్, అర్థశాస్త్రం
గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (ఎ), నిజామాబాద్.

డా॥ ఎస్. రమేశ్
అసిస్టెంట్ ప్రొఫెసర్, అర్థశాస్త్రం
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మల్కాజ్‌గిరి.

డా॥ ఎం.మల్లిఖార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్, అర్థశాస్త్రం
MVS ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (ఎ), మహబూబ్‌నగర్.

తుంగతుర్తి సుబ్బారావు, ఎస్.ఎ.
జి.ప.ఉ.పా., కామంచికల్,
ఖమ్మం.

డా॥ పడిగెల దశరథ్, పి.జి.టి.
టి.ఎస్.మోడల్ స్కూల్, నవీపేట్,
నిజామాబాద్.

మొహరీర్ రాజేంద్ర కుమార్, పి.జి.టి.
టి.ఎస్.మోడల్ స్కూల్, కేతెపల్లి,
నల్లగొండ.

జి. శ్రీదేవి, పి.జి.టి.
టి.ఎస్.మోడల్ స్కూల్, మిరుదొడ్డి,
సిద్దిపేట.

శ్రీ గడ్డమీది రథంగపాణిరెడ్డి
జి.ప.ఉ.పా., జానంపేట, మూసాపేట,
మహబూబ్‌నగర్.

ఎ.శ్రీనివాస్ గౌడ్, ఎస్.ఎ.
జి.ప.ఉ.పా., నస్రూల్లాబాద్, జడ్చర్ల,
మహబూబ్‌నగర్.

ఎం. ప్రసూన్ కుమార్, ఎస్.ఎ.
జి.ప.ఉ.పా., డోంగ్లి,
కామారెడ్డి.

బాకారం లలిత, ఎస్.ఎ.
జి.ప.ఉ.పా. (బాలికలు), మంచాల్,
రంగారెడ్డి.

జి. వెంకటేశ్వర్లు, ఎస్.ఎ.
జి.ప.ఉ.పా., చంపాపేట్,
రంగారెడ్డి.

డా॥ ఎల్లయ్య జంగటి, పి.జి.టి.
టి.ఎస్.మోడల్ స్కూల్, వల్లాల, శాలిగౌరారం,
నల్లగొండ

నూతిపల్లి బాలరాజు, ఎస్.ఎ.
జి.ప.ఉ.పా., తాడ్వాయి బిగ్, మద్నూరు,
కామారెడ్డి.

తాటిపాముల రమేశ్, ఎస్.ఎ.
జి.ప.ఉ.పా., వర్ధన్నపేట,
వరంగల్.

డా॥ సుశీల ఏలిమి, పి.జి.టి.
టి.ఎస్.మోడల్ స్కూల్, భూదాన్ పోచంపల్లి,
యాదాద్రి భువనగిరి.

కె. గోపీకృష్ణ, రిటైర్డ్ లెక్చరర్,
MJPTBCWR జూనియర్ కళాశాల, ప్రజ్ఞాపూర్,
సిద్దిపేట.

Cover page designing

K. Sudhakara Chary,
MPPS Mylaram, Mdl: Rayaparthy, Warangal

Layout Design

Kannaiah Dara, SCERT, Telangana, Hyderabad.

విషయసూచిక

క్ర.సం.	పాఠం పేరు	పేజి సంఖ్య
	I. అర్థశాస్త్ర పరిచయం	
1.	అర్థశాస్త్రం యొక్క స్వభావం మరియు పరిధి	1-14
2.	ఆర్థిక వృద్ధి మరియు ఆర్థిక అభివృద్ధి	15-24
	II. సూక్ష్మ అర్థశాస్త్రం	
3.	ప్రయోజన విశ్లేషణ	25-34
4.	డిమాండ్ విశ్లేషణ	35-47
5.	ఉత్పత్తి విశ్లేషణ	48-65
6.	సప్లయ్, వ్యయం మరియు రాబడి విశ్లేషణ	66-78
7.	మార్కెట్ విశ్లేషణ	79-91
8.	పంపిణీ సిద్ధాంతాలు	92-104
	III. స్థూల అర్థశాస్త్రం	
9.	జాతీయాదాయ విశ్లేషణ	105-116
10.	ఉద్యోగితా సిద్ధాంతం	117-129
11.	ప్రభుత్వ విత్తం మరియు బడ్జెట్	130-145
12.	ద్రవ్యం	146-156
13.	బ్యాంకింగ్	157-168
14.	ద్రవ్యోల్బణం మరియు వ్యాపార చక్రాలు	169-177
	IV. భారతీయ ఆర్థిక వ్యవస్థ	
15.	భారతదేశంలో ఆర్థికాభివృద్ధి	178-190
16.	జనాభా	191-204
17.	మానవ వనరుల అభివృద్ధి	205-215
18.	జాతీయాదాయ పోకడలు, వివిధ రంగాల వాటా	216-223
19.	పేదరికం మరియు నిరుద్యోగం	224-240
20.	ప్రణాళికలు, నీతి ఆయోగ్	241-253
21.	వ్యవసాయ రంగం	254-269
22.	భారతదేశంలో పారిశ్రామిక రంగం	270-282
23.	తృతీయ రంగం (సేవా రంగం)	283-297
24.	విదేశీ రంగం	298-313
25.	పర్యావరణం - ఆర్థికాభివృద్ధి	314-327
	V. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ	
26.	తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆర్థిక వృద్ధి మరియు నిర్మాణం	328-338
27.	మానవ వనరులు	339-349
28.	తెలంగాణ - ఆర్థిక వ్యవస్థ రంగాలు	350-360
29.	తెలంగాణ బడ్జెట్	361-367
30.	తెలంగాణా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, ఉపాధికల్పన మరియు సంక్షేమ కార్యక్రమాలు	368-382

అధ్యాయం

1

అర్థశాస్త్రం యొక్క స్వభావం మరియు పరిధి

1.0 పరిచయం

1.1 లక్ష్యాలు

1.2 అర్థశాస్త్రం యొక్క నిర్వచనాలు

1.2.1 సంపద నిర్వచనం (1776)

1.2.2 శ్రేయస్సు నిర్వచనం (1890)

1.2.3 కొరత నిర్వచనం (1932)

1.2.4 వృద్ధి నిర్వచనం (1948)

1.2.5 ఆధునిక నిర్వచనం (2011)

1.3 ఆర్థిక వ్యవస్థ – సమస్యలు

1.3.1 ఆర్థిక సమస్య

1.4 అర్థశాస్త్రం యొక్క స్వభావం మరియు పరిధి

1.4.1 అర్థశాస్త్రం యొక్క పరిధి

1.5 సూక్ష్మ అర్థశాస్త్రం మరియు స్థూల అర్థశాస్త్రం

1.5.1 సూక్ష్మ అర్థశాస్త్రం

1.5.2 స్థూల అర్థశాస్త్రం

1.6 నిశ్చిత మరియు ప్రామాణిక అర్థశాస్త్రం

1.6.1 నిశ్చిత అర్థశాస్త్రం

1.6.2 ప్రామాణిక అర్థశాస్త్రం

1.7 ప్రాథమిక భావనలు

1.7.1 వస్తువులు

1.7.2 కోరికలు

1.8 ఆదాయ చక్రియ ప్రవాహం

1.9 సారాంశం

1.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1.11 పదకోశం

1.12 ఉపయుక్త గ్రంథాలు

1.0 లక్ష్యాలు

- అర్థశాస్త్రం యొక్క నిర్వచనాలు
- ఆర్థిక వ్యవస్థ సమస్యలు
- అర్థశాస్త్రం యొక్క స్వభావం మరియు పరిధి
- సూక్ష్మ మరియు స్థూల ఆర్థిక శాస్త్రం మధ్య తేడాలు

1.1 పరిచయం

అర్థశాస్త్రం కొరతగా ఉన్న వనరులతో మానవులు తమ అవసరాల కొరకు ఎలా నిర్ణయాలు తీసుకుంటారనే దానిపై అధ్యయనం చేస్తుంది. అవి వైయక్తిక, కుటుంబ, వ్యాపార లేదా సామాజిక నిర్ణయాలు కావచ్చు. మీరు జాగ్రత్తగా మన చుట్టూ చూస్తే, కొరత అనేది జీవిత వాస్తవం. ఆర్థిక పరంగా సమస్యను అర్థం చేసుకుని దానికి సరైన పరిష్కారం కనుగొనడంలో అర్థశాస్త్రంలోని వివిధ విభాగాల అధ్యయనం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పాఠంలో అర్థశాస్త్ర నిర్వచనాలు, స్వభావం మరియు పరిధి గురించి అధ్యయనం చేద్దాం.

1.2 అర్థశాస్త్రం నిర్వచనాలు: అర్థశాస్త్రం నిర్వచనాల పరిణామం

- సంపద నిర్వచనం (1776) : ఆడమ్ స్మిత్
- శ్రేయస్సు నిర్వచనం (1890) : ఆల్ఫ్రెడ్ మార్షల్
- కొరత నిర్వచనం (1932) : లియోనెల్ రాబిన్స్
- వృద్ధి నిర్వచనం (1948) : P.A. శామ్యూల్సన్
- ఆధునిక నిర్వచనం (2011) : A.C. ధస్

1.2.1. సంపద నిర్వచనం (1776)

అర్థశాస్త్ర పితామహుడిగా పిలిచే ఆడమ్ స్మిత్ 1776లో "యాన్ ఎంక్వైరీ ఇన్‌టు ది నేచర్ అండ్ కాజెస్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ నేషన్స్" అనే పుస్తకాన్ని ప్రచురించారు. అర్థశాస్త్రం ఒక దేశం సహజ వనరులను ఉపయోగించుకొని సంపదను ఏవిధంగా మార్చుకుంటుందో అని తెలియజేసే శాస్త్రంగా ఆడమ్ స్మిత్ పేర్కొన్నారు. ప్రవర్ధన గురించి పరిశీలించే శాస్త్రంగా ఆడమ్ స్మిత్ పేర్కొన్నారు.

సంపద నిర్వచనం యొక్క లక్షణాలు:

- ఇది కేవలం భౌతిక వస్తువుల సంపదపై ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది.
- ఇది సంపద సృష్టి వెనుక గల కారణాలను విశ్లేషిస్తుంది.

విమర్శలు:

- ఇది ఆర్థిక శాస్త్రాన్ని దుర్భరమైన లేదా స్వార్ధ శాస్త్రంగా పరిగణించింది.
- ఇది సంపదను చాలా సంకుచిత అర్థంలో నిర్వచించింది.
- ఇది భౌతిక మరియు ప్రత్యక్ష వస్తువులను మాత్రమే పరిగణించింది.
- ఇది సంపదకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చింది మరియు మనిషిని విస్మరించింది.

1.2.2. శ్రేయస్సు నిర్వచనం (1890)

1890లో తన ప్రఖ్యాత గ్రంథం అయిన 'ది ప్రిన్సిపల్స్ ఆఫ్ ఎకనామిక్స్'లో ఆల్ఫ్రెడ్ మార్షల్, అర్థశాస్త్రం మానవుని సాధారణ జీవన విధానాన్ని పరిశీలిస్తుంది. ఇది మానవుడు, సమాజ శ్రేయస్సును గూర్చి అధ్యయనం చేస్తుంది. భౌతిక వస్తువులతో శ్రేయస్సు పెరుగుతుందని విశ్వసిస్తుంది.

ఇది ఒక వైపు సంపద మరియు మరొక వైపు, సంపద ఆధారంగా మానవ శ్రేయస్సును అధ్యయనం చేస్తుంది.

శ్రేయస్సు నిర్వచనం యొక్క విశిష్ట లక్షణాలు:

- అర్థశాస్త్రం మానవుని గురించి అధ్యయనం చేస్తుంది.
- ఇది మానవుని సంపద గురించి కాకుండా శ్రేయస్సుని గురించి కూడా అధ్యయనం చేస్తుంది.
- మానవ జీవితంలోని ఆర్థిక పరమైన విషయాలు మాత్రమే పరిశీలిస్తుంది. మానవుని సాంఘిక రాజకీయ మతపరమైన ప్రవర్తన గురించి అర్థశాస్త్రానికి సంబంధం లేదు.
- అర్థశాస్త్రం భౌతిక వస్తువుల సంపాదన వినియోగాలతో సంబంధం ఉన్న ఆర్థిక కార్యకలాపాల మాత్రమే పరిశీలిస్తుంది.
- ఇది డబ్బు రూపకంగా కొలవడానికి అనుకూలమైన కార్యకలాపాల పరిధిని పరిమితం చేస్తుంది.

విమర్శలు:

- ఇది అర్థశాస్త్రాన్ని మానవ శాస్త్రంగా కాకుండా సామాజిక శాస్త్రంగా పరిగణించింది.
- సంఘటిత సమాజంలోని మానవులను గూర్చి మాత్రమే పరిశీలించుట అనేది సరియైనది కాదు. శ్రేయస్సు మానసిక భావన. దీనిని గురించి విస్తృతమైన అర్థము సూచించలేదు.

1.2.3. కొరత నిర్వచనం (1932)

రాబిన్స్ ప్రకారం అనంతమైన కోరికలకు ప్రత్యామ్నాయ ప్రయోజనాలు ఉన్న పరిమిత సాధనాలకు మధ్య మానవ ప్రవర్తనను అధ్యయనం చేసేదే అర్థశాస్త్రం.

కోర్కెలను తీర్చే సాధనాలు పరిమితం, కొరతగా ఉన్న వనరులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకుని ప్రయోజనం పొందాలి.

కొరత నిర్వచనం యొక్క విశిష్ట లక్షణాలు:

- మానవుని కోరికలు అపరిమితం. కోరికలను తీర్చడానికి ఉన్న వనరులు కొరతగా ఉంటాయి. ఈ వనరులకు ప్రత్యాన్మాయ ప్రయోజనాలుంటాయి.
- ఇది కొరతగా ఉన్న వస్తువుల ఎంపిక గురించి మానవ ప్రవర్తనపై అధ్యయనం చేస్తుంది.
- ఇది అర్థశాస్త్రానికి పునాదిగా ఉన్న ఆర్థిక సమస్యను సామాజిక శాస్త్రంగా తీసుకురావడానికి ప్రయత్నించింది.
- ఇది అన్ని మానవ కార్యకలాపాలను పరిగణనలోకి తీసుకుంటుంది.

విమర్శలు:

- ఇది ఆర్థిక చక్రీయ అస్థిరత, నిరుద్యోగం, జాతీయాదాయం, ఆర్థిక వృద్ధి మరియు అభివృద్ధి వంటి అనేక ముఖ్యమైన ఆర్థిక సమస్యలపై దృష్టి పెట్టలేదు.
- కాలక్రమేణా వనరులు పెరిగే అవకాశాన్ని ఇది పరిగణనలోకి తీసుకోలేదు.
- ఇది అర్థశాస్త్రాన్ని కొరత యొక్క శాస్త్రంగా మాత్రమే పరిగణించింది.

1.2.4 వృద్ధి నిర్వచనం (1948)

"ప్రజలు, సమాజం ద్రవ్యాన్ని ఉపయోగించి కాని, ఉపయోగించకుండా కాని, ప్రత్యామ్నాయ ప్రయోజనాలుండి కొరతగా ఉండే ఉత్పాదక వనరులను వివిధ వస్తువుల ఉత్పత్తికి, వర్తమానంలో కాని భవిష్యత్తులో కాని, వివిధ వర్గాల మధ్య వినియోగానికి పంపిణీ చేయటానికి ఏ విధంగా ఉపయోగించడం జరుగుతుందో అధ్యయనం చేసేదే అర్థశాస్త్రం" అని శామ్యూల్సన్ నిర్వచించారు.

శ్యామ్యూల్సన్ కుడా రాబిన్స్ వలె సమాజంలో పరిమిత వనరులు, వాటి ప్రత్యాన్మాయ వనరుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్నారు.

వృద్ధి నిర్వచనం యొక్క విశిష్ట లక్షణాలు:

- నిర్వచనం కేవలం ఇచ్చిన వనరుల కేటాయింపుతో మాత్రమే కాకుండా వనరుల పంపిణీకి సంబంధించినది, పెరుగుతున్న మానవ కోరికలను ఎదుర్కోవటానికి వనరుల పెరుగుదల మరియు పంపిణీకి ఎలా ఉపయోగించాలో విశ్లేషించడానికి ప్రయత్నిస్తుంది.
- చలన విధానంగలది.
- ఈ నిర్వచనం ప్రకారం వనరుల కేటాయింపు అనేది సార్వత్రిక సమస్య.
- అన్ని ఆర్థిక వ్యవస్థలు ఈ పరిస్థితిని ఎదుర్కొంటాయి.
- ఈ నిర్వచనం అభివృద్ధి మరియు భవిష్యత్తు అవసరాలను కూడా విశ్లేషిస్తుంది.

1.2.5. ఆధునిక నిర్వచనం (2011)

ప్రొఫెసర్ A.C. దాస్ ప్రకారం, "ఎకనామిక్స్ అనేది వ్యక్తులు, సంస్థలు, సమాజాలు, దేశాలు యొక్క కొరత మరియు మిగులు పరిస్థితులలో ప్రయోజనాలను పెంచుకోవడం. ప్రస్తుత మరియు భవిష్యత్తులో వారి అపరిమిత అవసరాలను సంతృప్తి పరచడం కోసం ఎంపిక చేసుకునే అధ్యయనం."

సంక్షిప్తంగా, సబ్జెక్ట్ అర్థశాస్త్రం అనేది "ప్రస్తుత మరియు భవిష్యత్తు అవసరాలకు కొరత మరియు మిగులు యొక్క అందించిన వనరులతో ఉత్పత్తి మరియు వినియోగ ప్రయోజనాలను పెంచడంలో ఎంపికల సమస్యలపై అధ్యయనం" అని నిర్వచించబడింది.

ఆధునిక నిర్వచనం యొక్క లక్షణాలు:

- ఇది సంపద, సంక్షేమం, కొరత మరియు వృద్ధి వంటి అన్ని నిర్వచనాలను పరిగణనలోకి తీసుకుంటుంది.
- అర్థశాస్త్రంలో సూక్ష్మ మరియు స్థూల అంశాలను ఇది అధ్యయనం చేస్తుంది.
- ఇది ఉత్పత్తి మరియు వినియోగ కార్యకలాపాలు రెండింటినీ పరిగణనలోకి తీసుకుంటుంది.
- ఇది అర్థశాస్త్రంలో కీలకమైన ఎంపిక సమస్యను పరిగణనలోకి తీసుకుంటుంది.
- ఇచ్చిన వనరులతో గరిష్ట ప్రయోజనాలను పొందడం దీని లక్ష్యం.
- ఇది కొరత మరియు మిగులు రెండు పరిస్థితులను అధ్యయనం చేస్తుంది.
- ఇది ప్రస్తుత అభివృద్ధి మరియు సుస్థిరాభివృద్ధిపై అధ్యయనం చేస్తుంది.

1.3 ఆర్థిక వ్యవస్థ సమస్యలు

ప్రాథమిక ఆర్థిక సమస్యలు:

- ఏమి ఉత్పత్తి చేయాలి?
  - ఏ రకమైన ఉత్పత్తులను ఉత్పత్తి చేయాలి?
  - అది ఎంత పరిమాణంలో ఉత్పత్తి చేయాలి?
- ఎలా ఉత్పత్తి చేయాలి?
  - ఏ ఉత్పత్తి పద్ధతిని ఉపయోగించాలి?
- ఎవరి కోసం ఉత్పత్తి చేయాలి?
  - ఎలా పంచాలి?
  - ఏ ప్రమాణాలను ఎంచుకోవాలి?

1.3.1 ఆర్థిక సమస్య

ఆర్థిక సమస్య అనేది ప్రత్యామ్నాయ వస్తువులు మరియు సేవలను ఉత్పత్తి చేయడానికి వనరుల కేటాయింపుకు సంబంధించి సమస్య, కాబట్టి ఇది ఎంపిక సమస్య. ఆర్థిక వ్యవస్థ యొక్క అన్ని సమస్యలకు ఆర్థిక సమస్యలు మూలం. కొరత మరియు ఎంపికలు ప్రాథమిక ఆర్థిక సమస్యలకు మూలం.

ప్రత్యామ్నాయ ఉపయోగాలు కలిగిన వనరులు:

ఉత్పత్తికి సంబంధించిన అన్ని కారకాలను ప్రత్యామ్నాయ ఉపయోగాలు ఉంటాయి. ఉదాహరణకు, ఒక భూమిని వ్యవసాయం చేయడానికి, ఫ్యాక్టరీని నిర్మించడానికి, పాఠశాలను అభివృద్ధి చేయడానికి లేదా ఆసుపత్రిని నిర్మించడానికి ఉపయోగించవచ్చు. పొలాన్ని దున్నడానికి, బుట్టలు చేయడానికి లేదా కూరగాయలు అమ్మడానికి ఒక కూలీని ఉపయోగించవచ్చు. అందువల్ల, వనరులకు ప్రత్యామ్నాయ ఉపయోగాలు ఉన్నాయని అర్థం అవుతుంది.

ఆర్థిక లేదా ఎంపిక సమస్య:

కోరికలు అపరిమితంగా ఉంటాయి కానీ ఆ కోరికలను తీర్చడానికి వనరులు పరిమితం. అందువల్ల, అన్నిఆర్థిక వ్యవస్థలు ఎదుర్కొంటున్న ప్రాథమిక ఆర్థిక సమస్య ఏమిటంటే, అపరిమిత కోరికలు ఉన్నాయి, కానీ ఈ కోరికలను సంతృప్తిపరిచే వనరులు పరిమితం. వనరులకు ప్రత్యామ్నాయ ఉపయోగాలు ఉన్నాయని తెలుసుకున్నాము. వనరుల కొరత కూడా ఎంపిక సమస్యకు దారి తీస్తుంది.

పరిమిత వనరులు:

మానవ అవసరాలను తీర్చడానికి వనరులు పరిమితం. ప్రజలు అధిక లేదా అల్ప ఆదాయం కలిగి ఉండవచ్చు కానీ అపరిమిత ఆదాయం కాదు. అందువల్ల, వినియోగదారులకు అందుబాటులో ఉన్న వనరులు కొరత లేదా పరిమితం. మానవ అవసరాలను తీర్చే వస్తువులు మరియు సేవలను తయారు చేయడానికి ఉపయోగించే ఉత్పత్తి కారకాలు వనరులు. ఈ వనరులలో భూమి, శ్రమ, పెట్టుబడి మరియు వ్యవస్థాపకత ఉన్నాయి.

వనరుల కొరత:

కొరత అంటే వనరులకు వాటి లభ్యత కంటే డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.కోరికలను తీర్చడానికి వనరులు పరిమితం. ప్రజలు అధిక లేదా అల్ప ఆదాయం కలిగి ఉండవచ్చు కానీ అపరిమిత ఆదాయం కాదు. ఈ వనరులలో భూమి, శ్రమ, మూలధనం మరియు వ్యవస్థాపకత ఉన్నాయి.

1.4 అర్థశాస్త్రం యొక్క స్వభావం మరియు పరిధి

- అర్థశాస్త్రం, ఆర్థిక వ్యవస్థలలో వివిధ వస్తువుల ఉత్పత్తి మార్పిడి మరియు వినియోగం గురించి శాస్త్రం.
- కొరతగా ఉన్న వనరులను సంపద మరియు మానవ శ్రేయస్సు పెరుగుదల కొరకు ఎలా ఉపయోగించవచ్చో ఇది సూచిస్తుంది.
- అర్థశాస్త్రం యొక్క ప్రధాన దృష్టి వనరుల కొరత మరియు వాటి ప్రత్యామ్నాయ ఉపయోగాలలో ఎంపికలపై ఉంటుంది.
- వస్తువులను ఉత్పత్తి చేయడానికి అందుబాటులో ఉన్న వనరులు పరిమితం లేదా కొరత. ఈ కొరత ప్రజలను ప్రత్యామ్నాయాల మధ్య ఎంపిక చేసుకునేలా ప్రేరేపిస్తుంది మరియు వాటిలో ఉత్తమమైన వాటిని ఎంచుకోవడానికి ప్రత్యామ్నాయాలను పోల్చడానికి ఆర్థిశాస్త్ర పరిజ్ఞానం ఉపయోగపడుతుంది.

1.4.1 అర్థశాస్త్రం యొక్క పరిధి

అర్థశాస్త్రం యొక్క పరిధి విస్తృతమైనది మరియు వస్తువులు మరియు సేవల ఉత్పత్తి, పంపిణీ మరియు వినియోగానికి సంబంధించిన మానవ ప్రవర్తన యొక్క వివిధ అంశాలను కలిగి ఉంటుంది. అర్థశాస్త్రం అనేది వ్యక్తులు, వ్యాపారాలు, ప్రభుత్వాలు మరియు సమాజాలు తమ అపరిమిత అవసరాలు మరియు అవసరాలను తీర్చడానికి కొరత వనరులను ఎలా వినియోగిస్తారో పరిశీలించే ఒక సామాజిక శాస్త్రం.



1.5 సూక్ష్మ అర్థశాస్త్రం మరియు స్థూల ఆర్థశాస్త్రం

సూక్ష్మ అర్థశాస్త్రం మరియు స్థూల అర్థశాస్త్రం అనేది అర్థశాస్త్రం యొక్క రెండు ప్రాథమిక శాఖలు, ఇవి వివిధ స్థాయిల సముదాయంలో ఆర్థిక వ్యవస్థ యొక్క విభిన్న అంశాలను అధ్యయనం చేస్తాయి. సూక్ష్మ ఆర్థ విశ్లేషణ మరియు స్థూల ఆర్థ విశ్లేషణ ఇప్పుడు ఆర్థిక విశ్లేషణకు రెండు ముఖ్యమైన విధానాలుగా పరిగణించబడుతున్నాయి. 'సూక్ష్మ' మరియు 'స్థూల' అనే పదాలను 1933లో నార్వేజియన్ ఆర్థికవేత్త రాగ్నర్ ఫ్రిష్ ఆర్థికశాస్త్రంలో రూపొందించారు. ఈ పదాలు 'మైక్రోస్' మరియు 'మాక్రోస్' అనే గ్రీకు పదాల నుండి ఉద్భవించాయి, 'మైక్రోస్' అర్థం సూక్ష్మ మరియు 'మాక్రోస్' అర్థం స్థూల.

1.5.1 సూక్ష్మ ఆర్థశాస్త్రం

సూక్ష్మ అర్థశాస్త్రం అధ్యయనం వ్యక్తిగత సంస్థలు మరియు మార్కెట్లోని వారి ఆర్థిక పరస్పర చర్యలపై దృష్టి సారించే అర్థశాస్త్రం యొక్క శాఖ. వ్యక్తులు, గృహాలు మరియు సంస్థలు వనరుల కేటాయింపు, వస్తు సేవల ఉత్పత్తి, వినియోగం మరియు వాటి ధరలు, పరిమాణాలు, మార్కెట్ ఫలితాలను ఎలా ప్రభావితం చేస్తాయో ఇది పరిశీలిస్తుంది.

సూక్ష్మ అర్థశాస్త్రం "పూర్తి స్థాయి ఉపాధి" మరియు "ఉపాంత విశ్లేషణ" అనే ప్రమేయాలపై ఆధారపడి ఉంటుంది. సూక్ష్మ అర్థశాస్త్రం పరిధి ప్రధానంగా మూడు సిద్ధాంతాలను కలిగి ఉంటుంది. 1 ఉత్పత్తి ధరల సిద్ధాంతం 2 కారకాల ధరల సిద్ధాంతం 3 ఆర్థిక శ్రేయస్సు సిద్ధాంతం

సూక్ష్మ అర్థశాస్త్రం యొక్క ప్రాముఖ్యత

- వనరుల కేటాయింపు: పరిశ్రమల మధ్య శ్రమ, మూలధనం మరియు సహజ వనరులు వంటి వనరులు ఎలా కేటాయించబడతాయో అధ్యయనం చేయడానికి సూక్ష్మ అర్థశాస్త్రం సహాయపడుతుంది.
- ధర నిర్ణయాలు: మార్కెట్లలో ధరలు ఎలా నిర్ణయించబడతాయో విశ్లేషించడంలో సూక్ష్మ అర్థశాస్త్రం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.
- విధాన రూపకల్పన: సూక్ష్మ ఆర్థిక విశ్లేషణ పన్నులు, సబ్సిడీలు, నిబంధనలు మరియు వివిధ ఆర్థిక చట్టాలు వంటి సమర్థవంతమైన ఆర్థిక విధానాల రూపకల్పనకు పునాది వేస్తుంది.
- అంతర్జాతీయ వాణిజ్యం: అంతర్జాతీయ వాణిజ్యం నేపథ్యంలో వ్యక్తిగత సంస్థలు మరియు వినియోగదారులను అవగాహన చేసుకోవడంలో సూక్ష్మ అర్థశాస్త్రం దోహదకారిగా ఉంటుంది.
- వినియోగదారు ప్రవర్తన: సూక్ష్మ అర్థశాస్త్రం వినియోగదారుల ఎంపికలు, ప్రాధాన్యతలు మరియు కొనుగోలు విధానాలను ప్రభావితం చేసే అంశాలను పరిశీలిస్తుంది.

1.5.2 స్థూల ఆర్థశాస్త్రం

స్థూల ఆర్థిక శాస్త్రం మొత్తం ఆర్థిక వ్యవస్థతో వ్యవహరిస్తుంది మరియు మొత్తం ఉత్పత్తి స్థాయి, ఉపాధి, ద్రవ్యోల్బణం మరియు ఆర్థిక వృద్ధి వంటి విస్తృత అంశాలపై దృష్టి పెడుతుంది. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థను

పరిశీలిస్తుంది మరియు దాని మొత్తం పనితీరును ప్రభావితం చేసే కారకాలను కూడా పరిశీలిస్తుంది.స్థూల ఆర్థశాస్త్రాన్ని ఆదాయం మరియు ఉపాధి సిద్ధాంతం లేదా సమగ్ర అర్థశాస్త్రం అని కూడా అంటారు. ఇది స్థూల పంపిణీ సిద్ధాంతం, వ్యాపార చక్రియ సిద్ధాంతం, సాధారణ ధర స్థాయి మరియు ద్రవ్యోల్బణం సిద్ధాంతం వంటి వాటి అధ్యయనం చేస్తుంది.

స్థూల అర్థశాస్త్రం యొక్క ప్రాముఖ్యత

- స్థిరత్వం మరియు పెరుగుదల: స్థిర వృద్ధి మరియు సుస్థిరాభివృద్ధి కొరకు తీసుకునే చర్యలు, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో స్థూల అర్థశాస్త్రం ప్రభుత్వానికి సహాయకారిగా ఉంటుంది.
- ద్రవ్యోల్బణం మరియు ధర స్థిరత్వం: ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో మరియు ధరల స్థిరత్వాన్ని నిర్ధారించడంలో స్థూల అర్థశాస్త్రం కీలక పాత్ర పోషిస్తుంది.
- ఉపాధి మరియు నిరుద్యోగం: నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో స్థూల ఆర్థిక విశ్లేషణ కీలకమైనది. ఉద్యోగ స్థాయిలను ప్రభావితం చేయడానికి మరియు ఉద్యోగ వృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి ప్రభుత్వాలు ఆర్థిక మరియు ద్రవ్య విధానాలను నిర్ణయించడంలో స్థూల అర్థశాస్త్రం కీలకమైనది.
- ప్రభుత్వ విధాన రూపకల్పన: సమర్థవంతమైన ఆర్థిక విధానాలను (ప్రభుత్వ వ్యయం మరియు పన్నులు) మరియు ద్రవ్య విధానాలు (డబ్బు సరఫరా మరియు వడ్డీ రేట్ల నియంత్రణ) రూపొందించడానికి ప్రభుత్వాలు స్థూల ఆర్థిక సిద్ధాంతాలను ఉపయోగిస్తాయి.
- వాణిజ్యం మరియు చెల్లింపుల శేషం: స్థూల అర్థశాస్త్రం అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రభావితం చేసే అంశాలైన మారకపు రేట్లు, వాణిజ్య లోటు మరియు మిగులు వంటి అంశాలను పరిశీలిస్తుంది.

సూక్ష్మ అర్థశాస్త్రం మరియు స్థూల అర్థశాస్త్రం మధ్య భేదాలు

సూక్ష్మ అర్థశాస్త్రం	స్థూల అర్థశాస్త్రం
ఇది ఆర్థిక వ్యవస్థలోని వైయుక్తిక సంస్థల (అనగా ఒక వ్యక్తి, గృహం, సంస్థ లేదా పరిశ్రమ.) అధ్యయనం చేస్తుంది.	ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తుంది. ఇది జాతీయ ఆదాయం, సాధారణ ధర స్థాయి, మొత్తం వినియోగం మొదలైన మొత్తం యూనిట్లను అధ్యయనం చేస్తుంది. ఇది విస్తృత ఆర్థిక సమస్యలపై అధ్యయనం చేస్తుంది.
ఇది డిమాండ్, సరఫరా, కారకాల ధర, ఉత్పత్తి ధర, ఆర్థిక శ్రేయస్సు, ఉత్పత్తి, వినియోగం వంటి వివిధ ఆర్థిక సమస్యలకు పరిష్కారం చూపుతుంది. ఇది జాతీయ ఆదాయం, పంపిణీ, ఉపాధి, సాధారణ ధర స్థాయి, ద్రవ్యం చెలామణి లాంటి సమస్యలను పరిశీలిస్తుంది.	ఇది జాతీయ ఆదాయం, పంపిణీ, ఉపాధి, సాధారణ ధర స్థాయి, ద్రవ్యం చెలామణి లాంటి సమస్యలను పరిశీలిస్తుంది
దీనినే 'ధర సిద్ధాంతం' అంటారు.	దీనిని 'ఆదాయం మరియు ఉద్యోగిత సిద్ధాంతం' అంటారు.
సూక్ష్మ అర్థశాస్త్రం ఒక నిర్దిష్ట వస్తువు యొక్క ధరను, పూరక మరియు ప్రత్యామ్నాయ వస్తువుల ధరలతో పాటు నిర్ణయిస్తుంది.	సాధారణ ధర స్థాయిని నిర్వహించడంలో స్థూల అర్థశాస్త్రం సహాయపడుతుంది.

1.6 నిశ్చిత మరియు ప్రామాణిక ఆర్థశాస్త్రం

నిశ్చిత అర్థశాస్త్రం మరియు ప్రామాణిక అర్థశాస్త్రం అనేవి అర్థశాస్త్రం యొక్క రెండు శాఖలు, ఇవి వేర్వేరు ప్రయోజనాలను అందిస్తాయి మరియు ఆర్థిక విశ్లేషణ యొక్క విభిన్న అంశాలపై దృష్టి పెడతాయి. నిశ్చిత అర్థశాస్త్రం ఆర్థిక దృగ్విషయాలను అర్థం చేసుకోవడానికి పునాదిని ఏర్పరుస్తుంది, అయితే ప్రామాణిక అర్థశాస్త్రం విధాన ఎంపికలను మూల్యాంకనం చేయడానికి మరియు విలువ-ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి సహాయకారిగా ఉంటుంది.

1.6.1 నిశ్చిత అర్థశాస్త్రం

నిశ్చిత అర్థశాస్త్రం యొక్క లక్ష్యం ఆర్థిక వాస్తవాలు మరియు దృగ్విషయాల విశ్లేషణ. ఆర్థిక ప్రవర్తన మరియు సంఘటనలు గురించి వాస్తవాలను తెలిసాయజేస్తుంది. అవి మంచివా లేదా చెడ్డవా అనేది వివరించదు. ఉన్న సమాచారాన్ని, గణిత నమూనాలు మరియు ఆర్థిక విశ్లేషణ యొక్క ఇతర సాధనాలను ఉపయోగించి క్రోడీకరించి, ఆర్థిక సమస్యల యొక్క శాస్త్రీయ విశ్లేషణను అందించడంపై దృష్టి కేంద్రీకరిస్తుంది.

1.6.2 ప్రామాణిక అర్థశాస్త్రం

ఆర్థిక వ్యవస్థ ఎలా ఉండాలో ప్రామాణిక ఆర్థిక శాస్త్రం నిర్దేశిస్తుంది.సమాచార ఆధారంగా సూచనలు సలహాలు ఇస్తుంది.ఆర్థిక వ్యవస్థలో విధాన నిర్ణయాలపై అభిప్రాయాలను విశ్లేషిస్తుంది.

1.7 ప్రాథమిక భావనలు

1.7.1 వస్తువులు

మార్కెట్ ఆర్థిక వ్యవస్థల పనితీరులో వస్తువులు ప్రధాన పాత్ర పోషిస్తాయి.వస్తువుల ఉత్పత్తి, పంపిణీ మరియు వినియోగం ఆర్థిక కార్యకలాపాలను నడిపిస్తాయి. వ్యక్తుల మరియు సమాజ శ్రేయస్సుకు దోహదం చేస్తాయి. ఆర్థిక వ్యవస్థను విశ్లేషించడానికి వివిధ రకాల వస్తువులు మరియు వాటి లక్షణాలను అర్థం చేసుకోవడం చాలా అవసరం.

వస్తువుల రకాలు

- **ఉచిత వస్తువులు:** ఉచిత వస్తువులు సహజంగా మరియు సమృద్ధిగా ఉన్న వస్తువులు. వాటికి ధర ఉండదు. ఉదాహరణకు, గాలి మరియు సూర్యకాంతి సాధారణంగా ఉచిత వస్తువులుగా పరిగణించబడతాయి.
- **ఆర్థిక వస్తువులు:** కొరతగా ఉన్న వస్తువులకు ధర ఉంటుంది.వీటిని ఆర్థిక వస్తువులు అంటారు.వస్తూత్పత్తి, పంపిణి వ్యయాలు ధరలో కలాపాడబడి ఉంటాయి.పరిమిత లభ్యత కారణంగానే వీటికి ధరను నిర్ణయిస్తారు.

వినియోగ వస్తువులు

- **మన్నికైన వస్తువులు:** ఇవి సుదీర్ఘ జీవితకాలంతో కూడిన ఉత్పత్తులు మరియు సాధారణంగా మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం పాటు ఉపయోగించబడతాయి. ఉదాహరణలు కార్లు, ఫర్నిచర్ మరియు గృహ ఉపకరణాలు.
- **మన్నిక లేని వస్తువులు:** ఈ వస్తువులు తక్కువ జీవితకాలం కలిగి ఉంటాయి మరియు త్వరగా చెడిపోకముందే ఉపయోగించాలి. ఉదాహరణలు ఆహారం, పానీయాలు మరియు సబ్బులు, సౌందర్య సాధనాలు
- **మూలధన వస్తువులు:** మూలధన వస్తువులు, ఉత్పాదక వస్తువులు అని కూడా పిలుస్తారు. వాటిని ఇతర వస్తువులు మరియు సేవలను ఉత్పత్తి చేయడానికి వ్యాపారాలు ఉపయోగిస్తాయి. అవి తుది-వినియోగదారులచే నేరుగా వినియోగించబడవు కానీ ఉత్పత్తి ప్రక్రియకు అవసరమైనవి. ఉదాహరణలు యంత్రాలు, పరికరాలు మరియు కర్మాగారాలు.
- **మాధ్యమిక వస్తువులు:** మాధ్యమిక వస్తువులు ఇతర వస్తువుల ఉత్పత్తిలో ఉపయోగించే పదార్థాలు మరియు విడి భాగాలు. అవి వినియోగదారులకు విక్రయించబడే తుది ఉత్పత్తులు కాదు కానీ ఉత్పత్తి ప్రక్రియలో భాగం అవుతాయి.
- **కనిపించని వస్తువులు:** వీటిని సేవలు అని కూడా పిలుస్తారు. ఇవి భౌతికేతర ఉత్పత్తులు, ఇవి ప్రత్యక్షమైనవి కావు కానీ వినియోగదారులకు సేవలను అందిస్తాయి. ఉదాహరణలు విద్య, ఆరోగ్య సంరక్షణ, రవాణా, బ్యాంకింగ్ మరియు వినోద సేవలు.

1.7.2 కోరికలు

కోరికలు అనేది ఒక వస్తువును కలిగి ఉండాలనే వాంఛ. అన్ని ఆర్థిక కార్యకలాపాలలో కోరికలు మరియు వాటి సంతృప్తి ప్రధాన పాత్రలను కలిగి ఉంటాయి. మానవ ప్రవర్తన మరియు నిర్ణయాలు తీసుకోవడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. వ్యక్తులు, వ్యాపారాలు మరియు విధాన నిర్ణేతలకు లక్ష్యాలను నిర్దేశించడం మరియు వనరులను సమర్థవంతంగా నిర్వహించడంలో కోరికల లక్షణాలను అర్థం చేసుకోవడం చాలా అవసరం.

కోరికల లక్షణాలు:

- కోరికలు అపరిమితంగా ఉంటాయి: కోరికలు బహుళంగా ఉంటాయి. అవి ఎప్పటికీ అంతం లేనివి. అవి మళ్లీ మళ్లీ పుడతాయి. ఒక కోరిక సంతృప్తి చెందినప్పుడు మరొకటి పుడుతుంది. కోరికలు పెరుగుతూనే ఉంటాయి.
- కోరికలు పునరావృతమవుతాయి:కొన్ని కోరికలు మళ్ళీ మళ్ళీ పుడుతూనే ఉంటాయి. ఒక్కసారి తృప్తిపడినా అవి మళ్ళీ పుడతాయి. ఉదా: ఆకలిని తీర్చుకోవడం.

- కోరికలు పరిపూరకరమైనవి: చాలా సార్లు, కొన్ని కోరికలు తీరడానికి ఇతర వస్తువుల లేదా పూరక వస్తువుల అవసరం ఉంటుంది. ఉదాహరణకు, మోటారు కారు పని చేయడానికి పెట్రోల్ మరియు ఇంజిన్ ఆయిల్ రెండూ అవసరం.
- ఒక నిర్దిష్ట కోరిక సంతృప్తికరంగా ఉంటుంది:మానవ కోరికలు అపరిమితమైనవి మరియు అన్నీ ఒకే సమయంలో సంతృప్తి చెందలేవు, కానీ ఒక నిర్దిష్ట కోరికను సంతృప్తి పరచవచ్చు. ఎవరైనా ఆ కోరిక కోసం ప్రయత్నించినట్లయితే మరియు దానిని సంతృప్తి పరచడానికి వనరులు ఉంటే అది త్వరగా లేదా తరువాత సంతృప్తి చెందుతాయి.
- కోరికలు పోటీ పడతాయి: కోరికలు ఒకదానితో ఇంకొకటి పోటీపడుతూ ఉంటాయి. కానీ అన్ని కోరికలు ఒకేసారి తీర్చడం సాధ్యం కాదు కాబట్టి, ప్రాధాన్యతా క్రమములో ఆ కోరికలను తీర్చాల్సి వస్తుంది.

1.8 ఆదాయ చక్రీయ ప్రవాహం

ఆదాయం చక్రీయ ప్రవాహం అనేది ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల మధ్య ద్రవ్యం మరియు వస్తువుల ప్రవాహాన్ని వివరించే ఆర్థిక భావన. ఇది గృహాలు, వ్యాపారాలు, ప్రభుత్వాలు మరియు విదేశీ రంగం పరస్పరం మరియు ఆర్థిక కార్యకలాపాలలో ఎలా పాల్గొంటుందో చూపిస్తుంది. వృత్తాకార చక్రీయ నమూనా ఆర్థిక వ్యవస్థలో సంభవించే సంక్లిష్ట చర్యలను తెలియజేస్తుంది

ఆదాయం చక్రీయ ప్రవాహం రెండు ప్రధాన మార్గాల ద్వారా నిర్వహించబడుతుంది:

- ఉత్పత్తి మార్కెట్: ఇక్కడే ఉత్పత్తిదారులు గృహాలకు వస్తువులు మరియు సేవలను విక్రయిస్తాయి మరియు గృహాలు ఈ వస్తువులు మరియు సేవలను కొనుగోలు చేస్తాయి.
- కారకాల మార్కెట్: ఇక్కడ గృహ రంగం ఉత్పత్తి కారకాలైన భూమి, శ్రమ మరియు మూలధనంను సప్లయ్ చేస్తాయి. దానికి ప్రతిఫలంగా బాటకం, వేతనం మరియు వడ్డీని పొందుతాయి.



1.9 సారాంశం

అర్థశాస్త్రం కొరతగా ఉన్న వనరులతో ప్రజలు ఎలా తమ అవసరాలకు నిర్ణయాలు తీసుకుంటారనే దానిపై అధ్యయనం చేస్తుంది. మన ప్రపంచంలో సమయం, డబ్బు లేదా సహజ వనరులు లాంటివి చాలా పరిమితం. అందువలన, వ్యక్తులు ఏమి ఉత్పత్తి చేయాలి, ఎలా ఉత్పత్తి చేయాలి, ఎవరినికి ఉత్పత్తి చేయాలి మరియు ఏమి వినియోగించాలి అనే విషయాలపై స్థిరమైన నిర్ణయాలు తీసుకుంటారు. సూక్ష్మ అర్థశాస్త్రం మరియు స్థూల అర్థశాస్త్రం అనేది అర్థశాస్త్రం యొక్క రెండు ప్రాథమిక శాఖలు, ఇవి వివిధ స్థాయిల సముదాయంలో ఆర్థిక వ్యవస్థ యొక్క విభిన్న అంశాలను అధ్యయనం చేస్తాయి.

1.10 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 4-5 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. ఎంపిక సమస్య
2. ప్రత్యామ్నాయ ఉపయోగాలు
3. పరిమిత వనరులు
4. కొరత నిర్వచనం
5. వస్తువులను వర్గీకరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 8-10 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. ఆర్థిక వ్యవస్థలోని సమస్యలను వివరించండి
2. సూక్ష్మ మరియు స్థూల అర్థశాస్త్రంలోని భేదాలను వివరించండి.
3. కోరికల లక్షణాలను వివరించండి.
4. నిశ్చిత మరియు ప్రామాణిక అర్థశాస్త్రంను వివరించండి.

III. ఈ క్రింది ప్రశ్నలకు 16-20 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. అర్థశాస్త్రం నిర్వచనాలను వివరించండి.
2. అర్థశాస్త్రం స్వభావం మరియు పరిధిని వివరించండి.
3. ఆర్థిక వ్యవస్థ యొక్క చక్రియ ప్రవాహాన్ని వివరించండి.
4. సూక్ష్మ మరియు స్థూల ఆర్థిక శాస్త్రం ప్రాముఖ్యతను వివరించండి.

1.11 పదకోశం

- ఆడమ్ స్మిత్ (1723:1790) ఆధునిక ఆర్థిక శాస్త్ర పితామహుడిగా పరిగణించబడ్డాడు. వెల్త్ ఆఫ్ నేషన్స్ రచయిత.
- సూక్ష్మ ఆర్థిక శాస్త్రం: మైక్రో అనే పదం 'మైక్రోస్' అనే గ్రీకు పదం నుండి ఉద్భవించింది, దీని అర్థం చిన్నది.
- ఆర్థిక వస్తువులు: ఈ వస్తువులు మానవ నిర్మిత వస్తువులు. ఈ వస్తువులకు ధర ఉంటుంది. ఈ వస్తువుల సరఫరా ఎల్లప్పుడూ వారి డిమాండ్ కంటే తక్కువగా ఉంటుంది.
- ధర: వస్తువు విలువ ద్రవ్య రూపంలో వ్యక్తీకరించబడుతుంది.
- కనిపించని వస్తువులు: సేవలు అనేది వ్యక్తులచే అందించబడిన విస్తృత శ్రేణి కార్యకలాపాలు.

1.12 ఉపయుక్త గ్రంథాలు

1. Introduction to Economics - David Williams
2. Basic Economics - Thomas Sowell
3. Introduction to Economics - Freakonomics
4. Textbook for intermediate first year - TSBIE
5. BA Economics

అధ్యాయం

2

ఆర్థిక వృద్ధి మరియు ఆర్థిక అభివృద్ధి

2.0 లక్ష్యాలు
2.1 పరిచయం
2.2 ఆర్థిక వృద్ధి మరియు ఆర్థికాభివృద్ధి భావనలు
2.2.1 ఆర్థికాభివృద్ధి భావన
2.2.2 ఆర్థిక వృద్ధి మరియు ఆర్థికాభివృద్ధి మధ్య వ్యత్యాసం
2.3 ఆర్థికాభివృద్ధి సూచికలు
2.3.1 వాస్తవ జాతీయాదాయం
2.3.2 తలసరి స్థూల జాతీయోత్పత్తి
2.3.3 సంక్షేమం
2.3.4 సామాజిక సూచికలు లేదా ప్రాథమిక అవసరాలు
2.3.5 అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ లక్షణాలు
2.4 అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ – భారతదేశం
2.4.1 అల్ప తలసరి ఆదాయం
2.4.2 వ్యవసాయం యొక్క ప్రాబల్యం
2.4.3 మూలధన కొరత
2.4.4 సాంకేతిక వెనుకబాటు
2.4.5 మౌలిక సదుపాయాల కొరత
2.4.6 జనాభా లక్షణాలు
2.4.7 అధిక నిరక్ష్యరాస్యత రేటు
2.4.8 ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ
2.4.9 సహజ వనరుల అల్ప అభివృద్ధి
2.4.10 వ్యవస్థాపకత లోపం
2.4.11 పని మరియు జీవితం పట్ల సంప్రదాయబద్ధ వైఖరులు
2.5 సారాంశం
2.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు
2.7 పదకోశం
2.8 ఉపయుక్త గ్రంథాలు

2.0 లక్ష్యాలు

- ఆర్థిక వృద్ధిని నిర్వచిస్తారు
- ఆర్థిక వృద్ధి మరియు ఆర్థికాభివృద్ధి మధ్య తేడాను గుర్తిస్తారు.
- అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలను గుర్తిస్తారు.
- అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలను యొక్క లక్షణాలను తెలుపుతారు.
- భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల లక్షణాలను విశ్లేషిస్తారు.

2.1 పరిచయం

ఈ పాఠంలో మీరు ఆర్థికాభివృద్ధి, ఆర్థిక వృద్ధి గురించి తెలుసుకుంటారు ఆర్థికాభివృద్ధి యొక్క లక్ష్యాలు మరియు ఆర్థిక అభివృద్ధి సూచికల గురించి అధ్యయనం చేస్తారు.

2.2 ఆర్థిక వృద్ధి మరియు ఆర్థికాభివృద్ధి భావనలు

ఒక దేశం ఉత్పత్తి చేసే వస్తువులు మరియు సేవల మొత్తం పరిమాణంలో పెరుగుదలను ఆర్థిక వృద్ధి అంటారు.

మైఖేల్ తొడరో ప్రకారం, "ఆర్థిక వృద్ధి అనేది ఒక స్థిరమైన ప్రక్రియ, వృద్ధి కొరకు ఉత్పత్తి సామర్థ్యాలను కొంత కాలం పాటు పెంచటం ద్వార జాతీయాదాయం మరియు జాతీయోత్పత్తిలో పెరుగుదల ఏర్పడుతుంది.

ఆర్థిక వృద్ధికి అవసరమైన అంశాలు:

- ఆర్థిక వృద్ధికి సూచనగా జనాభా పెరుగుదల రేటు కంటే వాస్తవ తలసరి ఆదాయంలో అధిక పెరుగుదల రేటు నమోదు అవుతుంది
- ఆర్థిక వృద్ధి ఎల్లప్పుడూ ఆర్థిక వ్యవస్థ యొక్క ఉత్పత్తి సామర్థ్యంలో గణనీయమైన పెరుగుదలతో ముడిపడి ఉంటుంది.
- ఆర్థిక వృద్ధి అనేది దేశం యొక్క వస్తువులు మరియు సేవల ఉత్పత్తిలో స్థిరమైన పెరుగుదలను లేదా తలసరి ఉత్పత్తిలో పెరుగుదల సూచిస్తుంది.

2.2.1 ఆర్థికాభివృద్ధి భావన

ఆర్థిక వృద్ధి కంటే ఆర్థికాభివృద్ధి విస్తృత భావన కలిగియున్నది. ఆర్థిక వృద్ధిలో కేవలము ఉత్పాదకమైన పెరుగుదల మాత్రమే కనబడుతుంది. కానీ ఆర్థికాభివృద్ధిలో ఉత్పాదకతతో పాటు దేశ సామాజిక, ఆర్థిక రంగాలలో కూడా పెరుగుదలను సూచిస్తుంది.

మైఖేల్ పి తొడరో ప్రకారం "అభివృద్ధి" అనేది వేగవంతమైన ఆర్థికవృద్ధి తో పాటు అసమానతలను, మరియు పేదరికాన్ని తగ్గించే దిశగా సామాజిక నిర్మాణంలో, ప్రజా వైఖరులలో మార్పులతో కూడిన బహుళ పరిణామ ప్రక్రియ.

2.2.2 ఆర్థిక వృద్ధి మరియు ఆర్థికాభివృద్ధి మధ్య వ్యత్యాసం

ఆర్థిక వృద్ధి	ఆర్థికాభివృద్ధి
నిర్వచనం: ఇది ఒక నిర్దిష్ట కాలంలో దేశం యొక్క వస్తు, సేవల ఉత్పత్తిలో (ద్రవ్య కొలమానంలో) పెరుగుదలను సూచిస్తుంది.	నిర్వచనం: ఇది ఆర్థిక వృద్ధితో పాటు దేశ ప్రజల జీవన ప్రమాణ నాణ్యతలో మెరుగుదలను సూచిస్తుంది
భావన: ఇది ఆర్థికాభివృద్ధితో పోల్చినప్పుడు సంకుచితమైన భావన కలిగి ఉంది.	భావన: ఇది ఆర్థిక వృద్ధి కంటే విస్తృత భావన కలిగి ఉంటుంది.
పరిధి: ఇది ఒక దేశం యొక్క ఆర్థిక వృద్ధికి సంబంధించిన పరిమాణాత్మక ప్రక్రియ.	పరిధి: ఇది ఒక దేశం యొక్క ఆదాయంతో పాటు జీవన నాణ్యతను చూసే బహుళ-కోణ విధానం.
కాలం: ఇది స్వల్పకాలిక ప్రక్రియ	కాలం: ఇది దీర్ఘకాలిక ప్రక్రియ
కొలత: పరిమాణాత్మకమైనది.	కొలత: పరిమాణాత్మక మరియు గుణాత్మకమైనవి
ప్రాంతం: అభివృద్ధి చెందిన దేశాలు	ప్రాంతం: అభివృద్ధి చెందుతున్న దేశాలు
ప్రభుత్వ సహకారం: ఇది స్వయంచాలక ప్రక్రియ, దీనికి ప్రభుత్వం నుండి జోక్యం అవసరం కావచ్చు లేదా ఉండకపోవచ్చు. ఉదా: స్థూల దేశీయోత్పత్తి, స్థూల జాతీయోత్పత్తి	ప్రభుత్వ సహకారం: అన్ని అభివృద్ధి విధానాలు ప్రభుత్వమే రూపొందించి నందున దీనికి ప్రభుత్వం నుండి జోక్యం అవసరం. ఉదా: మానవాభివృద్ధి సూచిక (హెచ్.డి.ఐ), తలసరి ఆదాయం, పారిశ్రామికాభివృద్ధి

2.2.3 ఆర్థికాభివృద్ధి యొక్క లక్ష్యాలు

తలసరి ఆదాయాల సంపూర్ణ స్థాయిని పెంచడం ద్వారా భౌతిక జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ఆర్థికాభివృద్ధి లక్ష్యం.

తలసరి ఆదాయాన్ని పెంచడం అనేది అన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వ విధానం యొక్క లక్ష్యాలు.

- **అధిక వృద్ధి రేటు:** మన దేశంలో మొదటి మూడు దశాబ్దాల ప్రణాళికలో, ఆర్థిక వృద్ధి రేటు అంత ప్రోత్సాహకరంగా లేదు.కానీ 6వ ప్రణాళిక నుంచి భారత ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మార్పు వచ్చింది.

  6వ ప్రణాళిక – 5.4%

  7వ ప్రణాళిక – 5.8%

  8వ ప్రణాళిక – 6.8%

  9వ ప్రణాళిక – 7%

  10వ ప్రణాళిక – 7.6%

  11వ ప్రణాళిక – 8.0%

- **ఆర్థిక స్వయం సమృద్ధి:** స్వయం-సమృద్ధి అనేది ఒక దేశం తనకు అవసరమైన వాటిని కొనుగోలు చేయడానికి తగినంత మిగులును ఉత్పత్తి చేయడాన్ని సూచిస్తుంది. వాటిని పొందేందుకు అవసరమైన నిధుల వనరుల కోసం ఇతర దేశాలపై ఆధారపడి ఉండదు.

- **ఆధునికీకరణ:** సాంప్రదాయిక వెనుకబడిన పద్ధతులను మార్చడం, గ్రామీణ సమాజ నిర్మాణంలో మార్పులు తీసుకురావడం మరియు సామాజిక సంస్థల ఆధునీకరణ, సాంప్రదాయ గ్రామీణ వ్యవసాయ సమాజం నుండి పట్టణ పారిశ్రామిక సమాజంగా మారడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ఆధునికీకరణ లక్ష్యం.

- **ఆర్థిక స్థిరత్వం:** ఆర్థిక స్థిరత్వాన్ని పొందడం అంటే ఆర్థిక సంక్షోభాలను నివారించడం. స్థూల ఆర్థిక వ్యవస్థలో అధిక హెచ్చుతగ్గులు లేకపోవడాన్ని ఆర్థిక స్థిరత్వం అంటారు.

  ఆర్థిక వనరుల సద్వినియోగం, నాణ్యమైన గృహకల్పనా, ఆహారం మరియు స్థిరమైన జీవన వేతనాన్ని పొందే ఉద్యోగులు ఉండే వ్యవస్థ ఆర్థిక స్థిరత్వం కలిగి ఉంటుంది. ఇలాంటి ఆర్థిక వ్యవస్థలో ప్రజలు సహజ, ఆర్థిక వనరులను పూర్తి స్థాయిలో వినియోగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు.

- **సుస్థిర అభివృద్ధి:** వనరుల వినియోగంలో భవిష్యత్ తరాల అవసరాలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటూ, ఉన్న వనరులతో ప్రస్తుత తరం అవసరాలను తీర్చడమే సుస్థిర అభివృద్ధి.

సుస్థిర అభివృద్ధి అనేది మానవ అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి ఒక సంస్థాగత ప్రణాళికా సూత్రం, అదే సమయంలో ప్రస్తుత ఆర్థిక, సామజిక అవసరాలకు, ప్రస్తుతం ఉన్న సహజ వనరులను సమర్థవంతంగా ఉపయోగిస్తూ, పర్యావరణాన్ని మరియు సహజవనరులను కాపాడే వ్యవస్థా నిర్మాణాన్ని చేపడుతుంది.

- **సమ్మిళిత వృద్ధి:** సమ్మిళిత వృద్ధి అంటే ఉపాధి అవకాశాలను సృష్టించే మరియు పేదరికాన్ని తగ్గించడంలో సహాయపడే ఆర్థిక వృద్ధి. అనగా పేదలకు ఆరోగ్యం మరియు విద్యలో అవసరమైన సేవలను అందించడం. ఇందులో సమాన అవకాశాలను అందించడం, విద్య మరియు నైపుణ్యాభివృద్ధి ద్వారా ప్రజలకు సాధికారత కల్పించడం వంటివి ఉన్నాయి.

2.3 ఆర్థికాభివృద్ధి సూచికలు

2.3.1 తలసరి వాస్తవ దేశీయోత్పత్తి

స్థూల దేశీయోత్పత్తి, ఒక ఆర్థిక వ్యవస్థలో ఒక సంవత్సరంలో జరిగిన మొత్తం ఉత్పత్తి , ఇది దేశం యొక్క మొత్తం ఆదాయంతో సమానం. స్థూల దేశీయోత్పత్తి, ఆ దేశ కొనుగోలు శక్తిని పరిగణలోకి తీసుకోని వాస్తవ జీవన ప్రమాణాన్ని కొలవడానికి ఒక మార్గదర్శిగా ఉపయోగపడుతుంది.

2.3.1 వాస్తవ జాతీయ ఆదాయం

జాతీయ ఆదాయం అంటే ఆర్థిక సంవత్సరంలో ఒక దేశం ఉత్పత్తి చేసే వస్తువులు మరియు సేవలు విలువ, కాబట్టి ఇది ఒక సంవత్సరం వ్యవధిలో ఏదైనా దేశం యొక్క అన్ని ఆర్థిక కార్యకలాపాల యొక్క నికర ఫలితం మరియు ద్రవ్య విలువతో కొలవబడుతుంది .స్థిర ధరల వద్ద జాతీయ ఆదాయం, ద్రవ్యోల్బణం కోసం సర్దుబాటు చేయబడిన స్థిర ధరల వద్ద వాస్తవ జాతీయ ఆదాయాన్ని కొలుస్తారు.

2.3.2 తలసరి స్థూల జాతీయోత్పత్తి

స్థూల దేశీయోత్పత్తి మరియు విదేశాల నుండి వచ్చే నికర కారకాల ఆదాయాన్ని కలిగి ఉంటుంది. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థకు సహకరించిన విదేశీ భారతీయుల సేవలకు చెల్లించిన ప్రతిఫలం.

2.3.3 సంక్షేమం

సంక్షేమం అనేది వనరులు మరియు వస్తువుల కేటాయింపు సామాజిక సంక్షేమాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అధ్యయనం చేస్తుంది. ఇది ఆర్థిక వ్యవస్థ సామర్థ్యం మరియు ఆదాయ పంపిణీలకు ప్రామాణికం అవుతుంది. అలాగే ఈ రెండు అంశాలు ఆర్థిక వ్యవస్థలో ప్రజల శ్రేయస్సును ఎలా ప్రభావితం చేస్తాయో వివరిస్తుంది.

2.3.4 సామాజిక సూచికలు

అభివృద్ధి యొక్క ప్రధాన సామాజిక సూచికలలో విద్య, ఆరోగ్యం, ఉపాధి మరియు నిరుద్యోగం రేట్లు మరియు లింగ సమానత్వం ఉన్నాయి, మరియు ఈ అంశం ఒక దేశం ఎంత "అభివృద్ధి చెందింది" అని కొలవడానికి ప్రపంచ బ్యాంక్ మరియు ఐక్యరాజ్య సమితి వంటి సంస్థలు ఈ సామాజిక సూచికలను ఉపయోగిస్తాయి. ఆర్థిక, జనాభా మరియు పౌర, సామాజిక, ఆరోగ్య భద్రత, సామాజిక భద్రత, పర్యావరణం మరియు శక్తి మొదలైనవి ప్రధాన సూచికలు.

2.3.5 అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల యొక్క లక్షణాలు

తలసరి స్థూల జాతీయోత్పత్తి ఆధారంగా, ప్రపంచ బ్యాంకు నివేదిక (2014) ప్రకారం “రిస్క్ అండ్ ఆపర్చునిటీ, మేనేజింగ్ రిస్క్ ఫర్ డెవలప్మెంట్” అనే పేరుతో దేశాలు అల్ప ఆదాయ మధ్య ఆదాయం మరియు అధిక ఆదాయ దేశాలుగా వర్గీకరించబడ్డాయి.

- సేవలు మరియు పారిశ్రామిక రంగం యొక్క ప్రాముఖ్యత: ప్రస్తుతం, సేవా రంగం దేశ నికర జాతీయ ఉత్పత్తిలో గరిష్ట వాటాను కలిగియున్నది. 2000-01 ప్రకారం, జాతీయ ఆదాయంలో 48.5% వాటా సేవా రంగం నుండి వస్తుంది మరియు మొత్తం శ్రామిక జనాభాలో 22.9% ఈ రంగంలో ఉపాధి పొందుతున్నారు.
- పెట్టుబడి సంచయన యొక్క అధిక రేటు: దేశంలో ఎక్కువ మూలధన సంచయన రేటు ఉంటే అది అధిక ఆర్థిక వృద్ధి రేటుకు చిహ్నం.అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే సాధారణంగా మూలధన సంచితం రేటు చాలా తక్కువగా ఉంటుంది. సాధారణంగా, ఆర్థిక వ్యవస్థ యొక్క మూలధన పెట్టుబడి ఎంత ఎక్కువగా ఉంటే, ఆర్థిక వ్యవస్థ తన మొత్తం ఆదాయాన్ని అంత వేగంగా పెంచుకోగలదు.
- ఆధునిక ఉత్పత్తి సాంకేతికతలు మరియు నైపుణ్యాల ఉపయోగం: ఆధునిక ఉత్పత్తి పద్ధతులు మరియు నైపుణ్యాలు అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థిక అభివృద్ధి ప్రక్రియలో ముఖ్యమైన భాగంగా మారాయి. భౌతిక మానవ వనరుల స్థానంలో అధునాతన సాంకేతిక పద్ధతులు ఉపయోగించబడ్డాయి.

  అభివృద్ధి చెందుతున్న దేశాలు సాంకేతికతను స్వీకరించడం వల్ల వారి ఆర్థిక వ్యవస్థల పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపింది, సమాచార సాంకేతిక నైపుణ్యం ద్వార ఉత్పత్తి యొక్క సహజ వ్యయాలను తగ్గించడం, నాణ్యత కోసం ప్రమాణాలను ఏర్పాటు చేయడం జరిగింది
- అల్ప జనాభా పెరుగుదల: అల్ప జనాభా పెరుగుదల అంటే, సగటున, మహిళలు తక్కువ కలిగి ఉంటున్నారు. ఇది బాలికలు మరియు మహిళలకు విద్య మరియు వృత్తిని కొనసాగించడానికి మరియు పాఠశాల విద్య, స్వయంప్రతిపత్తి మరియు సమానత్వం యొక్క సానుకూల చక్రాన్ని కొనసాగించడానికి అవకాశాన్ని ఇస్తుంది. నెమ్మదిగా జనాభా పెరుగుదల కూడా వలసలకు అధిక విలువను ఇస్తుంది.

2.4 అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల లక్షణాలు: భారతదేశ ఆర్థిక వ్యవస్థ

సాధారణంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు మరియు ముఖ్యంగా భారత ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రధాన లక్షణాలు క్రింది విధంగా ఉన్నాయి:

2.4.1 అల్ప తలసరి ఆదాయం

పేదరికం అల్ప తలసరి గల ఆర్థిక వ్యవస్థలో ప్రతిబింబిస్తుంది. అయితే, ఈ అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో పేదరికం మదింపు చేయడానికి సాపేక్ష పేదరికం కాకుండా కానీ నిరపేక్ష పేదరికం ప్రామాణికంగా తీసుకోవాలి.

జాతీయ ఆదాయం యొక్క మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, 2020–21లో భారతదేశ తలసరి స్థూల దేశీయోత్పత్తి 2020–21లో రూ. 1,08,620/- నుండి 8.7%కి పడిపోయి రూ. 99,155/–కి పడిపోయింది.

2.4.2 వ్యవసాయం యొక్క ప్రాబల్యం

వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన రంగం, ఎందుకంటే ఇది మొత్తం జాతీయాదాయంలో 17% వాటా కలిగియున్నది మరియు జనాభా ప్రకారం 60% మందికి ఉపాధిని అందిస్తుంది. భారతీయ వ్యవసాయం గత కొన్ని దశాబ్దాలుగా అద్భుతమైన వృద్ధిని నమోదు చేసింది.

భారతదేశంలోని వ్యవసాయ రంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగం కనిపిస్తుంది. ప్రచ్ఛన్ననిరుద్యోగాన్ని కనబడని నిరుద్యోగం అని కూడా అంటారు. ఈ రకమైన నిరుద్యోగంలో కొంతమందికి ఉపాధి ఉన్నట్లు అనిపిస్తుంది, కానీ వారు వాస్తవంగా పనిలో ఉండరు.

2.4.3 మూలధన కొరత

అల్ప స్థాయి జాతీయ ఆదాయం మరియు తలసరి ఆదాయం అభివృద్ధి చెందుతున్న దేశాలలో మూలధన కొరతకు మూల కారణం అల్ప స్థాయి వాస్తవ జాతీయ మరియు తలసరి ఆదాయం, ఉండటం వలన పొదుపు పెట్టుబడుల తక్కువగా ఉంటున్నాయి. ఆశించిన మేరకు పెట్టుబడులు లేకపోవడంతో మూలధన సంచయనంలో పెరగలేదు.

2.4.4 సాంకేతిక వెనుకబాటుతనం

భారతదేశం సాంకేతికతలో వెనుకబడి ఉంది, ఎందుకంటే అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తుల పరిశోధన మరియు అభివృద్ధి కోసం తగినంత నిధులు మరియు మౌలిక సదుపాయాలు లేవు. సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులు కూడా తక్కువే. 2021 ప్రపంచ ఆవిష్కరణ సూచికలో భారతదేశం 46వ స్థానంలో ఉంది.

2.4.5 మౌలిక సదుపాయాల కొరత

మౌలిక సదుపాయాల కొరత అంటే అల్ప జీవన ప్రమాణాలు, ఆర్థిక లోటు మరియు పేదరికం. ఉదాహరణకు: ఒక ప్రాంతంలో రోడ్లు వంటి రవాణా మౌలిక సదుపాయాలు లేనప్పుడు, ఆ సంఘంలోని వ్యక్తులు ఉద్యోగాలు మరియు వ్యాపార అవకాశాలు ఉన్న నగరాలు లేదా ప్రదేశాలకు వెళ్లలేకపోతున్నారని అర్థం. నాణ్యమైన వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో ఉండవు.

2.4.6 జనాభా లక్షణాలు

జనాభా గణాంకాలు జనాభా పరిమాణం, లింగ నిష్పత్తి, సాంద్రతని కొలిచే సూచికలను కలిగి ఉంటాయి, అయితే ముఖ్యమైన గణాంకాలు అయినటువంటి సహజ వృద్ధి రేటు, జనన రేటు, సంతానోత్పత్తి రేట్లు, మరణాల రేటు మరియు ఆయుర్దాయం వంటి సూచికలను కలిగి ఉంటాయి.

2.4.7 అధిక నిరక్షరాస్యత రేటు

నిరక్షరాస్యత రేటు జనాభాలో భాగమైన నిరక్షరాస్యుల సభ్యుల నిష్పత్తిని సూచిస్తుంది. జాతీయ గణాంక సంస్థ (NSO) సమాచారం ప్రకారం 2021 సంవత్సరం నాటికి భారతదేశ సగటు అక్షరాస్యత రేటు 77.70%. ఇందులో పురుషుల అక్షరాస్యత 2021 84.70% మరియు స్త్రీల అక్షరాస్యత 70.30%.

2.4.8 ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ

భారత ఆర్థిక వ్యవస్థ ద్వంద్వ లక్షణంగా పరిగణించబడుతుంది ఎందుకంటే ఇది రెండు రకాల ఆర్థిక వ్యవస్థల లక్షణాలను కలిగి ఉంటుంది – అభివృద్ధి చెందని మరియు ప్రగతిశీల. ఆర్థిక వ్యవస్థలో చాలా పెద్ద భాగం అభివృద్ధి చెందని మరియు వెనుకబడిన తరగతికి చెందిన వ్యక్తులను కలిగి ఉంటుంది.

2.4.9 సహజ వనరుల అల్ప వినియోగం

అభివృద్ధి చెందని దేశాలలో సహజ వనరులు అల్ప స్థాయిలో ఉపయోగిస్తారు లేదా నిరుపయోగం అవుతాయి. ఒక దేశం సహజ వనరులలో కొరత కలిగి ఉండవచ్చు, కానీ సంపూర్ణ ఉపయోగంలో నిర్లక్ష్యం ఉండకూడదు.

నేడు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన సవాళ్లలో సహజ వనరుల నిర్వహణ మొదలగునవి. చమురు, గ్యాస్, ఖనిజాలు మరియు కలపతో సహా పునరుత్పాదకలేని సహజ వనరుల దోపిడీ తరచుగా ప్రపంచ వ్యాప్తంగా హింసాత్మక సంఘర్షణలను ప్రేరేపించడం, తీవ్రతరం చేయడం లేదా కొనసాగించడం వంటివి తరచుగా జరుగుతున్నవి.

2.4.10 వ్యవస్థాపకత లోపం

అభివృద్ధి చెందని దేశాల యొక్క మరొక లక్షణం వ్యవస్థాపక సామర్థ్యం లేకపోవడం. సామాజిక వ్యవస్థలో లోపాల కారణంగా సృజనాత్మక మరియు వ్యాపార విస్తరణ అవకాశాలకు అవరోధంగా ఉంటున్నాయి.

తక్కువ మార్కెట్ పరిమాణం, మూలధనం మరియు మౌలిక సదుపాయాల కొరత, సాంకేతిక వెనుకబాటుతనం మరియు స్వంత ఆస్తి లేకపోవడం, వాణిజ్య ఒప్పందాలలో స్వేచ్ఛ లేకపోవడం మరియు చట్టపరమయిన అవరోధాలు మొదలైన వ్యవస్థపరమయిన లోపాలు ఉన్నాయి. వీటి వలన సంస్థల నిర్వహణ కష్టంగా ఉంది.

2.4.11 పని మరియు జీవితం పట్ల సంప్రదాయ బద్ధ వైఖరులు

భారతీయ సమాజం అనేక కులాలు మరియు ఉపకులాలుగా విభజించబడి సమాజంలో ఘర్షణలకు దారి తీస్తుంది. సమాజంలో పని పట్ల వైఖరి అనుకూలంగా లేదు. వ్యక్తుల వైఖరి సంప్రదాయాలకు కట్టుబడి ఉన్నాయి. సమానత్వం లేదు.

2.5 సారాంశం

ఆర్థిక వృద్ధి మరియు ఆర్థిక అభివృద్ధి, భిన్నమైన భావనలు అయినప్పటికీ పరస్పర సంబంధం కలిగి ఉంటాయి మరియు పరస్పరం ఆధారపడి ఉంటాయి. ఆర్థిక అభివృద్ధి యొక్క భావన ఆర్థిక అభివృద్ధిలో ఆర్థిక మరియు ఆర్థికేతర కారకాల మధ్య సంబంధాలను ప్రతిబింబిస్తుంది. అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల లక్షణాలు పూర్తిగా భిన్నమైనవి కావు, కానీ అభివృద్ధి స్థాయిలలో వేర్వేరు స్థానాలలో ఉంటాయి.

2.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలను వ్రాయండి.

1. ఆర్థిక వృద్ధి
2. ఆర్థికాభివృద్ధి
3. స్వావలంబన

II. ఈ క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలను వ్రాయండి.

1. ఆర్థిక వృద్ధి మరియు ఆర్థికాభివృద్ధి మధ్య వ్యత్యాసాన్ని వివరించండి.
2. ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను పేర్కొనండి.

III. ఈ క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలను వ్రాయండి.

1. అధునాతన ఆర్థిక వ్యవస్థల లక్షణాలను వివరించండి.
2. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల లక్షణాలను విశ్లేషించండి.

2.7 పారిభాషిక పదాలు

ఆర్థిక వృద్ధి: ఒక సంవత్సరంలో వస్తువులు మరియు సేవల ఉత్పత్తిలో పెరుగుదల.

ఆర్థికాభివృద్ధి: ఆర్థికవృద్ధితో పాటు సామాజిక, సాంకేతిక మరియు మొత్తం అభివృద్ధిలో మార్పులు

సంస్థాగత మార్పులు: ఈ మార్పులు స్థూల దేశీయోత్పత్తి మరియు వివిధ రంగాలు – ప్రాథమిక, ద్వితీయ మరియు సేవా రంగాల ఉపాధికలో సాపేక్ష మార్పులను సూచిస్తాయి.

స్వావలంబన: ఒక దేశం తనకు అవసరమైన వాటిని కొనుగోలు చేయడానికి తగినంత ఉత్పత్తి సాదించడాన్ని స్వావలంబనం సూచిస్తుంది. వాటిని పొందేందుకు అవసరమైన నిధుల వనరుల కోసం ఇతర దేశాలపై ఆధారపడదు.

సుస్థిర అభివృద్ధి: భవిష్యత్ తరాల అవసరాలతో రాజీ పడకుండా ప్రస్తుత తరం అవసరాలను తీర్చడం.

సమ్మిళిత వృద్ధి: ఉపాధి అవకాశాలను సృష్టించే మరియు పేదరికాన్ని తగ్గించడంలో సహాయపడే ఆర్థిక వృద్ధి.

2.8 ఉపయుక్త గ్రంథాలు

1. ఎకనామిక్ గ్రోత్ డెవలప్మెంట్ – సిబాబ్రేట్ దాస్, అలెక్స్ మౌర్మోర్స్.
2. హెండ్రిక్ వాన్ డెన్ బెర్గ్ ద్వారా ఆర్థిక వృద్ధి అభివృద్ధి.
3. అర్థశాస్త్రం రెండవ సంవత్సరం – ఇంటర్మీడియట్ బోర్డు, తెలంగాణ

అధ్యాయం 3

3. ప్రయోజన విశ్లేషణ

3.0 లక్ష్యాలు

3.1 పరిచయం

3.2 ప్రయోజనం

3.2.1 ప్రయోజనాన్ని కొలవడం

3.2.2 ప్రయోజనము రకాలు

3.3 క్షీణోపాంత ప్రయోజన సూత్రం

3.4 సమోపాంత ప్రయోజన సూత్రం

3.5 సారాంశం

3.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

3.7 పదకోశం

3.8 ఉపయుక్త గ్రంథాలు

3.0. లక్ష్యాలు

- ప్రయోజనాలను అర్థం చేసుకుంటారు.
- ఉపాంత ప్రయోజనాన్ని, మొత్తం ప్రయోజనాన్ని తెలుసుకుంటారు.
- కార్డినల్ ప్రయోజనము మరియు ఆర్డినల్ ప్రయోజనములను గురించి తెలుసుకొంటారు.
- మొత్తం ప్రయోజనము మరియు ఉపాంత ప్రయోజనము మధ్య సంబంధంను అర్థం చేసుకుంటారు.
- క్షీణోపాంత ప్రయోజన సూత్రంని విశ్లేషిస్తారు.

3.1. పరిచయం

అర్థశాస్త్రంలో ప్రయోజన విశ్లేషణ అనే భావనను సాధారణంగా ఉపయోగిస్తారు. డిమాండ్, సిద్ధాంతంలో మరియు హేతుబద్ధ నిర్ణయాలలో, ప్రయోజన ఆధారిత ఎంపికలలో వాటి మూల్యాంకనాలలో, వినియోగదారుని సంతృప్తిని కొలవడంలో ప్రయోజన విశ్లేషణను ఉపయోగిస్తారు.

3.2. ప్రయోజనం

ప్రయోజన భావనను ఆర్థిక తత్త్వశాస్త్రంలో విలియం స్టాన్లీ జివాన్స్ 1871లో ప్రవేశపెట్టాడు. ప్రజలు తమ కోరికలను తీర్చుకొనుటకు వస్తువులను మరియు సేవలను డిమాండ్ చేస్తారు. "కోరికను సంతృప్తి పరచగలిగే శక్తిని ప్రయోజనం" అంటాం. ప్రయోజనం అంటే ఒక వస్తువును వినియోగిస్తున్నప్పుడు వినియోగదారుడు పొందే సంతృప్తి. ప్రయోజనం ఒక మానసిక భావన. అది వివిధ వ్యక్తులలో వివిధ రకాలుగా ఉంటుంది. అనగా ఒక వస్తువు నుండి వివిధ వ్యక్తులు వివిధ రకాలైన సంతృప్తి స్థాయిని పొందవచ్చు.

3.2.1 ప్రయోజనము కొలిచే పద్ధతులు

ప్రయోజనమును కొలిచే పద్ధతులు రెండు అవి:

A) కార్డినల్ ప్రయోజనము:

ఆల్‌ఫ్రెడ్ మార్షల్ ప్రకారం ప్రయోజనాన్ని కచ్చితంగా కార్డినల్ అంకెలలో కొలువచ్చు. వినియోగదారుని సంతృప్తి స్థాయిని కార్డినల్ అంకెలయిన 1, 2, 3, 4 లలో చెప్పవచ్చు. ఈ పద్ధతిని కార్డినల్ విశ్లేషణ అంటారు.

ఉదా: ఒక ఆపిల్ 25 యూనిట్స్ సంతృప్తిని ఇచ్చింది. అనగా ఇక్కడ 25 అనేది కార్డినల్ ప్రయోజనం.

B) ఆర్డినల్ ప్రయోజనము:

J.R. హెక్స్ మరియు R.J.D. ఎలెన్‌లు ఆర్డినల్ ప్రయోజన పద్ధతిని ఉపయోగించారు. ఈ పద్ధతి ప్రకారం వినియోగదారుని సంతృప్తిని అంకెల రూపంలో కొలవలేము కాని ఒక దానితో ఒకటి పోల్చి సంతృప్తి స్థాయిని తెలుపగలం.

ఉదా: కాఫీ, టీ కన్నా ఎక్కువ సంతృప్తిని ఇచ్చింది. సంతృప్తిని 1వ, 2వ, 3వ, 4వ మొదలయిన వరుస క్రమంలో సంతృప్తని చెప్పవచ్చును.

3.2.2. ప్రయోజనము రకాలు: ఇవి నాలుగు రకాలు

A) అకార ప్రయోజనము (Form Utility): ఏదైన ఒక వస్తువు ఒక ఆకారములో ఉన్నప్పుడు మాత్రమే ఆ వస్తువు నుండి ప్రయోజనము పొందగలుగుతాయి. ఉదా: కలపను బల్లగా, కూర్చీగా మార్చనప్పుడు.

B) స్థాన ప్రయోజన (Place Utility): వస్తువును దానిని కోరే వ్యక్తులు ఉండే చోటుకు చేర్చడము వలన ఏర్పడే ప్రయోజనాన్ని స్థాన ప్రయోజనం అంటారు. ఉదా: ముడి పదార్థాలు కర్మాగారాలకు తయారు అయిన వస్తువుల వినియోగదారుడు ఉన్న మార్కెట్‌కు తరలించడం వల్ల స్థాన ప్రయోజనం ఏర్పడుతుంది.

C) కాల ప్రయోజనము (Time Utility): కొన్ని వస్తువులకు కొన్ని కాలములలో మాత్రమే వాటి నుండి ప్రయోజనము పొందుతాము. ఉదా: వేసవి కాలంలో శీతల పానీయాలకు, శీతాకాలంలో టీ మరియు కాఫీ, స్వెట్టర్స్, వర్షాకాలంలో గొడుపు మొదలగునవి.

D) సేవ ప్రయోజనము (Service Utility): కొన్ని రకాల సేవలు కూడా మానవుని కోరికలను సంతృప్తిపరుస్తాయి. ఉదా: వైద్యుడు, ఉపాధ్యాయుడు మొదలగువారు అందించే సేవల వలన ప్రయోజనం పొందుతాము.

3.3 క్షీణోపాంత ప్రయోజన సూత్రము

పరిచయం: క్షీణోపాంత ప్రయోజన సూత్రమును మొదటిసారిగా 1854 సం॥లో H. H. గాసీన్ అను ఆర్థికవేత్త వివరించాడు. అందుకే ఈ సూత్రాన్ని గాసీన్ మొదట సూత్రము అని అంటారు. అల్‌ఫ్రెడ్ మార్షల్ తన ప్రసిద్ధ గ్రంథమయిన "The Principles of Economics" 1890లో దీనిని శాస్త్రీయ బద్ధంగా అభివృద్ధి పరిచి ప్రాచుర్యంలోకి తీసుకొచ్చాడు.

నిర్వచనం: ఆల్‌ఫ్రెడ్ మార్షల్ ప్రకారం "ఏదేని ఒక వస్తువులను ఎక్కువ పరిమాణంలో వినియోగించినప్పుడు ఆ వస్తువు నుండి లభించే అదనపు ప్రయోజనం క్రమేపి క్షీణిస్తుంది.

అర్థం: ఏదేని ఒక వినియోగదారుడు తన వస్తురాశిని క్రమానుగతంగా పెంచుకుంటూ పోయినట్లయితే, అదనపు వస్తువు నుండి వచ్చే అదనపు ప్రయోజనం క్రమంగా క్షీణిస్తుంది.

ప్రమేయాలు: ఈ సూత్రం క్రింది ప్రమేయాలపై ఆధారపడి ఉంది.

1. **హేతుబద్ధత:** వినియోగదారుడు హేతబద్ధంగా వ్యవహరిస్తాడు. వినియోగదారుడి లక్ష్యం గరిష్ఠ సంతృప్తి.

2. **కార్డినల్ ప్రయోజనము:** వినియోగాదరుని ప్రయోజనాన్ని అంకెల రూపంలో కొలవచ్చు. ఉదా: 1, 2, 3, ...

3. **స్వతంత్ర ప్రయోజనం:** వస్తువుల ప్రయోజనం స్వతంత్రంగా ఉంటుంది.

4. **ద్రవ్యం ఉపాంత ప్రయోజనం:** ద్రవ్య ఉపాంత ప్రయోజనం స్థిరంగా ఉంటుంది. ఆదాయ స్థాయిలో ఎలాంటి మార్పు ఉండదు.

5. **సజాతీయ వస్తువులు:** వస్తువులు సజాతీయంగా ఉంటాయి. అనగా పరిమాణంలో, నాణ్యతలోను ఒకే విధంగా ఉంటాయి.

6. వస్తు పరిమాణం ప్రమాణంగా ఉంటుంది.

7. ఒక యూనిట్ వినియోగానికి, మరొక యూనిట్ వినియోగానికి మధ్య కాలవ్యవధి, వ్యత్యాసం ఉండరాదు.

8. వస్తువులను విభజించవచ్చు.

9. వినియోగదారుని అభిరుచులు, అలవాట్లు స్థిరముగా ఉంటాయి.

10. మార్కెట్‌ను గురించి పూర్తి జ్ఞానం ఉంటుంది.

మొత్తం ప్రయోజనం (Total Utility) TU = ఒక వస్తువు యొక్క వివిధ యూనిట్లను ఉపయోగిస్తున్నప్పుడు వాటన్నింటి నుండి వచ్చే ప్రయోజనములను కలుపగా వచ్చేదే మొత్తం ప్రయోజనం

$TUn = F(Qn)$ TU = మొత్తం ప్రయోజనం, n = వస్తువు, f = కార్యకరణ సంబంధం, Qn = వస్తువుల పరిమాణం.

ఉపాంత ప్రయోజనం = Marginal Utility MU :– ఒక వస్తువును అదనముగా వినియోగించడం వలన ఆ అదనపు వస్తువు నుండి వచ్చే ప్రయోజనాన్ని ఉపాంత ప్రయోజనం అంటారు.

$$\text{ఉపాంత ప్రయోజనం} = \frac{\text{మొత్తం ప్రయోజనంలో వచ్చే మార్పు}}{\text{వస్తు పరిమాణంలో వచ్చే మార్పు}}$$

$$MU = \Delta TU / \Delta Q$$

లేదా

$$MU_n = TU_n - TU_{n-1}$$

ఉపాంత ప్రయోజనం = ప్రస్తుత ప్రయోజనం – పూర్వపు ప్రయోజనం

క్షీణోపాంత ప్రయోజన సూత్రము వివరణ:

క్షీణోపాంత ప్రయోజన సూత్రము వస్తు పరిమాణానికి, ప్రయోజనాకి మధ్య ఉండే సంబంధాన్ని వివరిస్తుంది. వినియోగాదరుడు ఏదేని ఒక వస్తువులను ఎక్కువ పరిమాణంలో వినియోగించి నట్లయితే ఆ అదనపు వస్తువుల

ద్వారా వచ్చే ఉపాంత ప్రయోజనం క్రమంగా క్షీణిస్తుంది. ఇంక పెంచినట్లయితే ఉపాంత ప్రయోజనం సున్నం అవుతుంది. ఒక స్థాయి దాటిన తరువాత ఉపాంత ప్రయోజనం ఋణత్మకంగా మారుతుంది. దీనిని ఈ క్రింది పట్టిక ద్వారా అర్థం చేసుకోవచ్చు.

పట్టిక-1

వస్తు పరిమాణం "ఆపిల్స్" Q	మొత్తం ప్రయోజనం TU	ఉపాంత ప్రయోజనం MU
1	8	8
2	14	6
3	18	4
4	20	2
5	20	0
6	18	-2

పై పట్టిక వస్తు పరిమాణానికి మరియు ఉపాంత ప్రయోజనం, మొత్తం ప్రయోజనానికి మధ్య సంబంధాన్ని వివరిస్తుంది. వినియోగదారుడు "అపిల్స్"ని వినియోగిస్తున్నాడు. వినియోగదారుడు క్రమనానుగతంగా అపిల్స్‌ని వినియోగించుకుంటూ పోయినట్లయితే అదనపు వస్తువు నుండి వస్తున్న అదనపు ప్రయోజనం క్రమంగా క్షీణిస్తుంది. 4వ అపిల్ వరకు మొత్తం ప్రయోజనం "TU" పెరుగుతుంది. కాని తగ్గుతున్న రేటులో పెరుగుతుంది. ఉపాంత ప్రయోజనం MU తగ్గుతుంది. 5వ అపిల్ వద్ద మొత్తం ప్రయోజనంకు గరిష్ఠ కాని ఉపాంత ప్రయోజనం సూన్న. ఇంక వినియోగదారుడు తన వస్తురాశిని పెంచినట్లయితే 6వ అపిల్ దగ్గర మొత్తం ప్రయోజనం TU తగ్గుతుంది మరియు ఉపాంత ప్రయోజనం "MU" ఋణాత్మకం అవుతుంది.

పటం



వస్తు పరిమాణం అపిల్స్

A) మొత్తం ప్రయోజనం TU తగ్గుతున్నా రేటులో పెరుగుతున్నప్పుడు, ఉపాంత ప్రయోజనం MU క్షీణిస్తుంది?

B) మొత్తం ప్రయోజనం TU గరిష్ఠం అయినప్పుడు ఉపాంత ప్రయోజనం MU సున్నా అవుతుంది.

C) మొత్తం ప్రయోజనం TU తగ్గుతున్నప్పుడు ఉపాంత ప్రయోజనం MU ఋణాత్మకం అవుతుంది.

A) మొత్తం

ఈ సూత్రానికి ఉన్న పరిమితులు:

క్షీణోపాంత ప్రయోజన సూత్రం కొన్ని పరిమితులకు లోనయి ఉంది. అవి:

1) ఈ సూత్రం కొన్ని అవాస్తవ ప్రమేయాలపై ఆధారపడింది.

2) వినియోదారుడు అన్ని పరిస్థితులలో హేతుబద్ధంగా ఉండడం.

3) వస్తువులు సజాతీయాలు కాకపోతే ఈ సూత్రం పనిచేయదు.

4) వినియోగదారుని ఆదాయంలో, అభిరుచులు, అలవాట్లలో మార్పు వస్తే ఈ సూత్రం పనిచేయదు.

5) ఈ సూత్రం మన్నికగల వస్తువులకు పనిచేయదు.

6) వినియోగదారుని అలవాటు అయిన తపాలబిళ్లలు, నాణేల సేకరణ వంటి వాటికి ఈ సూత్రం పనిచేయదు.

7) పిసినారి వినియోదారునికి ఈ సూత్రం వర్తించదు.

ఈ సూత్రం ప్రాముఖ్యత:

1) ఈ సూత్రాన్ని దృష్టిలో ఉంచుకొని ఉత్పత్తిదారులు తమ వస్తువుల డిజైన్‌ను, విధానాన్ని ప్యాకింగ్‌ని మారుస్తుంటారు.

2) ఈ సూత్రం వస్తువుల ధరలు, విలువల సిద్ధాంతాన్ని వివరిస్తుంది.

3) ఈ సూత్రం ఆధారంగా ప్రభుత్వాలు పన్ను విధానాలను రూపొందించవచ్చు.

4) ఈ సూత్రం ద్వారా వజ్రోదక వైపరీత్యం (Water paradox– Diamond) వివరించవచ్చు. 3.

3.4 సమోపాంత ప్రయోజన సూత్రం

పరిచయం: సమోపాంత ప్రయోజన సూత్రం ఒక ముఖ్యమైన వినయోగ సూత్రం. ఈ సూత్రం కూడా H.H. గాసీన్ పేరుతో ముడిపడి ఉంది. అందుకే దీనిని గాసీన్ యొక్క రెండవ సూత్రం అంటారు మరియు గరిష్ఠ సంతృప్తి సూత్రం అని కూడా అంటారు.

నిర్వచనం: అల్‌ఫ్రెడ్ మార్షల్ ప్రకారం ఒక వ్యక్తి. తన దగ్గర ఉన్న వస్తువుకు అనేక ఉపయోగాలున్నట్లయితే అన్ని ఉపయోగాల ద్వారా ఉపాంత ప్రయోజనం సమానంగా ఉండే విధంగా దానిని పంపిణీ చేస్తాడు.

సమోపాంత ప్రయోజన సూత్రం ప్రకటన: వినియోగదారునికి స్థిర ఆదాయం ఉండి, వస్తువుల ధరలు స్థిరంగా ఉన్నప్పుడు, వివిధ వస్తువులపై ద్రవ్య వ్యయాన్ని చేసేటప్పుడు, వివిధ రకాల వస్తువులపై ఖరీదు చేసిన చివరి రూపాయల ఉపాంత ప్రయోజనాల సమానత్వం వల్ల వినియోగదారుడు గరిష్ఠ సంతృప్తిని పొంది సమతౌల్యాన్ని చేరతాడు.

వినియోగదారుని గరిష్ఠ సంతృప్తిని, సమతౌల్యానికి కావలసిన ప్రాథమిక నిబంధనను కింది విధంగా రాయవచ్చు.

MUX/Px = MUY / Py = MUz/Pz = MUn/ Pn

MU_X, MU_Y, MU_Z లు వరుసగా x, y, z వస్తువుల ఉపాంత ప్రయోజనాలు, Px, Py, Pz లు మరియు Pn లు x, y, z వస్తువుల ధరలు.

సమోపాంత ప్రయోజనం సూత్రం ప్రమేయాలు:

1) ప్రయోజనాన్ని సంఖ్యల రూపంలో కొలవచ్చును.

2) వినియోగదారుడు హేతుబద్ధంగా వ్యవహరిస్తాడు. గరిష్ఠ సంతృప్తిని పొందడానికి ప్రయత్నిస్తాడు.

3) ద్రవ్య ఉపాంత ప్రయోజనం స్థిరంగా ఉంటుంది.

4) వస్తువుల ధరలు స్థిరంగా ఉంటాయి.

సమోపాంత ప్రయోజన సూత్రాన్ని ఈ క్రింది పట్టిక సహాయంతో వివరించవచ్చు.

పట్టిక-2

ద్రవ్య యూనిట్లు	A వస్తువు ఉపాంత ప్రయోజనం	B వస్తువుల ఉపాంత ప్రయోజనం
1	20 (1st)	18 (3rd)
2	18 (2nd)	16 (5th)
3	16 (4th)	14
4	14	12
5	12	10
మొత్తం ప్రయోజనం	80	70

పై పట్టికను పరిశీలించినట్లయితే వినియోదారుడు తన దగ్గర ఉన్న 5 రూ॥లను రెండు వస్తువులపై విభజన చేశాడు. రూ॥ 3 A వస్తువుల పైన రూ॥ 2 B వస్తు పైన గరిష్ఠ సంతృప్తి వచ్చే విధంగా పంపిణీ చేశాడు. A వస్తుల మీద 2 ఈ 3 ఖర్చు చేయడం వల్ల 54 యూనిట్ల ప్రయోజనం పొందాడు. B వస్తువు పైన రూ॥ 2 ఖర్చు చేసి 34 యూనిట్ల ప్రయోజనం పొందాడు. అనగా (54+34) 88 యూనిట్ల గరిష్ఠ ప్రయోజనంని తన దగ్గర ఉన్న రూ॥5 పెంచి పొందాడు.

సమోపాంత ప్రయోజన సూత్ర పరిమితులు:

ఈ సూత్రం క్రింద వివరించిన కొన్ని పరిమితులకు లోబడి పనిచేస్తుంది.

1. అవిభాజ్య వస్తువుల విషయంలో ఇది వర్తించదు.
2. ఈ చట్టం నిర్దిష్ట అవాస్తవ ఊహపై ఆధారపడి ఉంటుంది.
3. అజ్ఞాన వినియోగదారు విషయంలో ఈక్వి-మార్జినల్ యుటిలిటీ చట్టం వర్తించదు.
4. వాస్తవానికి డబ్బు యొక్క ఉపాంత ప్రయోజనం స్థిరంగా ఉండదు.
5. వినియోగదారునికి సంపూర్ణ జ్ఞానం ఉందని భావించబడుతుంది. కానీ ఇది సరైనది కాదు.

సమోపాంత ప్రయోజన సూత్రం ప్రాముఖ్యత:

1. ఈ సూత్రం వినియోగదారుని వ్యయానికి ఆధారం.
2. ఉత్పత్తి సిద్ధాంతానికి ఈ సూత్రం ఉపయోగపడుతుంది.
3. పంపిణీ సిద్ధాంతానికి కూడా ఈ సూత్రం ఉపయోగపడుతుంది.
4. బడ్జెట్ తయారీలో ఈ సూత్రం ఉపయోగపడుతుంది.

3.5 సారాంశం

ప్రయోజన విశ్లేషణ, ప్రయోజనం యొక్క భావాన్ని ప్రయోజనం రకాలను మరియు ప్రయోజనాన్ని కొలిచే పద్ధతులను, క్షీణోపాంత ప్రయోజన సూత్రము మరియు సమోపాంత ప్రయోజన సూత్రము ఆధారంగా వివరించింది.

3.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 4-5 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. ప్రయోజనం అనగానేమి?
2. కార్డినల్ ప్రయోజనం అనగానేమి?

3. ఆర్డినల్ ప్రయోజనం అనగానేమి?

4. మొత్తం ప్రయోజనాన్ని వివరించండి.

5. ఉపాంత ప్రయోజనాన్ని వ్రాయండి.

6. క్షీణోపాంత ప్రయోజన సూత్రాలను నిర్వచించండి.

7. సమోపాంత ప్రయోజన సూత్రం గురించి వ్రాయండి.

8. ప్రయోజనంకు మరియు ఉపాంత ప్రయోజనానికి భేదం వ్రాయండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 8-10 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. ప్రయోజన విశ్లేషణ భావనని వివరించండి.

2. ఉపాంత ప్రయోజనానికి మరియు మొత్తం ప్రయోజనానికి మధ్య భేదంను తెలియచేయండి.

3. కార్డినల్ మరియు ఆర్డినల్ ప్రయోజన భావనలను వివరించండి.

4. కీణోపాంత ప్రయోజన సూత్రాన్ని నిర్వచిస్తూ, దాని ప్రమేయాలను వ్రాయండి.

5. సమోపాంత ప్రయోజన సూత్రం యొక్క ప్రాధాన్యత మరియు పరిమితులను గురించి వ్రాయండి.

6. సమోపాంత ప్రయోజన సూత్ర భావన మరియు ప్రమేయాలను వివరించండి.

III. ఈ క్రింది ప్రశ్నలకు 16-20 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. క్షీణోపాంత ప్రయోజనం వివరిస్తూ దాని పరిమితులను ప్రాధాన్యతను వివరించండి.

2. సమోపాంత ప్రయోజన సూత్రాన్ని వివరణాత్మకంగా వివరించండి.

3.7 పదకోశం

- **ప్రయోజనం:** మానవుని యొక్క కోరికను తీర్చే వస్తువు కుండే శక్తిని ప్రయోజనం అంటారు.
- **కార్డినల్ ప్రయోజనం:** వినియోగారుని ప్రయోజనాన్ని సంఖ్య రూపంలో అనగా 1, 2, 3, 4 కొలువవచ్చు.
- **ఆర్డినల్ ప్రయోజనం:** వినియోదారుని ప్రయోజనాన్ని అంకెల రూపంలో కొలవలేము. కాని ప్రయోజనాన్ని ఒక దానితో మరొకటి పోల్చి చెప్పవచ్చు.

- **మొత్తం ప్రయోజనం:** వస్తువు యొక్క అన్ని యూనిట్ల వినియోగం ద్వారా వినియోగదారుడు పొందగలిగే మొత్తం ప్రయోజనం
- **ఉపాంత ప్రయోజనం:** వినియోగదారుడు ఒక అదనపు వస్తువులను ఉపయోగించడం వల్ల పొందిన అదనపు ప్రయోజనం

3.8 ఉపయుక్త గ్రంథాలు

1. Telugu Academy intermediate I[st] year text book.
2. Telugu Academy B.A. 1[st] Year Micro Economics text book.
4. Micro Economic theory – M.L. Jhingan.

అధ్యాయం

4

డిమాండ్ విశ్లేషణ

4.0 లక్ష్యాలు

4.1 పరిచయం

4.2 డిమాండ్ ఫలం

4.2.1 డిమాండ్‌ను ప్రభావితం చేసే అంశాలు

4.3 డిమాండ్ సూత్రం

4.3.1 డిమాండ్ సూత్రం యొక్క లక్షణాలు

4.3.2 డిమాండ్ సూత్రం యొక్క ప్రమేయాలు

4.4 డిమాండ్ రకాలు

4.4.1 ధర డిమాండ్

4.4.2 ఆదాయ డిమాండ్

4.4.3 జాత్యంతర రడిమాండ్

4.5 సారాంశం

4.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

4.7 పదకోశం

4.8 ఉపయుక్త గ్రంథాలు

4.0. లక్ష్యాలు

- డిమాండ్ యొక్క అర్థాన్ని వివరించగలరు.
- డిమాండ్‌లోని రకాలను వర్గీకరిస్తారు.
- మార్కెట్ డిమాండ్ షెడ్యూల్‌ను విశ్లేషిస్తారు.
- డిమాండ్‌పై ఆదాయ ప్రభావాన్ని వివరించగలరు.
- జాత్యంతర డిమాండ్‌ను వివరించగలరు.

4.1 పరిచయం

డిమాండ్ అనేది "అర్థశాస్త్రం"లో మనం నేర్చుకొనే మొదటి మరియు ప్రాథమిక భావన. ప్రతి ఒక్కరు డిమాండ్ (గిరాకీ)ను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ పాఠంలో డిమాండ్ యొక్క అర్థం, డిమాండ్ ఫలం, డిమాండ్ యొక్క నిర్ణాయకాలు/ కారకాలు, డిమాండ్ సూత్రం మరియు డిమాండ్ రకాలను గురించి తెలుసుకుంటారు.

డిమాండ్-అర్థం: సాధారణంగా, డిమాండ్ మరియు కోరిక అనే పదాలు వస్తువులు, సేవలను కొనుగోలు చేయడంలో ఉపయోగించే పర్యాయ పదాలు."అర్థశాస్త్రం"లో డిమాండ్ అంటే 'ఒక వస్తువును కొనుగోలు చేయాలనే సముఖత మరియు కొనుగోలు చేసే శక్తి కలిగియుండి దానికి మద్దతునిచ్చే కోరిక' అని అర్థం.

ఉదా: ఒక పేద వ్యక్తి కారు కొనాలి అనే కోరిక కలిగియుండడం డిమాండ్ కాదు. అలా అని ఆర్థిక స్థోమత కలిగియున్న వ్యక్తి కారు కావాలని అనుకున్నప్పటికీ కారు ధరను చెల్లించి కొనుగోలు చేయుటకు ఆసక్తి చూపనట్లయితే దానిని కూడా 'డిమాండ్'గా పరిగణించే అవకాశం లేదు. అనగా కారు కావాలనే కోరిక కలిగినప్పుడు ఆర్థిక స్థోమత కలిగియుండి దాని ధరను చెల్లించి కొనుగోలు చేయుటకు సిద్ధమైనప్పుడు మాత్రమే దానిని 'డిమాండ్'గా పరిగణించవచ్చు.

డిమాండ్‌కు కింది లక్షణాలుండాలి.

- వస్తువును కొనాలి అనే కోరిక ఉండాలి.
- కోరికను తీర్చగల ఆర్థిక స్థోమతకలిగి ఉండాలి.
- ధరను చెల్లించుటకు సిద్ధంగా/ ఆసక్తి ఉండాలి.

పై మూడు లక్షణాలు కలిగి ఉన్నప్పుడు మాత్రమే వినియోగదారుడు మార్కెట్‌లో తన డిమాండ్‌ను ప్రదర్శించగలడు.

నిర్వచనం

ఒక వస్తువు కోసం వినియోగదారుడు నిర్దిష్ట సమయంలో, నిర్దిష్ట ధర వద్ద కొనుగోలు చేయడానికి ఇష్టపడే పరిమాణంనే 'డిమాండ్' అంటారు.

4.2 డిమాండ్ ఫలం

ఒక వస్తువుకు ఉన్న డిమాండ్, ఆ డిమాండ్‌ను ప్రభావితం చేసే వివిధ అంశాలకు మధ్య ఉన్న సంబంధాన్ని 'డిమాండ్ ఫలం' తెలియజేస్తుంది. డిమాండ్ ఫలాన్ని కింది విధంగా సాంకేతిక పదాల ద్వారా తెలుసుకోవచ్చు.

$D_x = f(P_x, P_1, \ldots, P_n, Y, T)$

P_x = వస్తువు ధర

$P_1, \ldots, P_n$ = ప్రత్యామ్నాయ, పూరక వస్తువుల ధరలు

Y = వినియోగదారుని ఆదాయం

T = వినియోగదారుని అభిరుచులు

f = ప్రమేయ సంబంధం. ఈ ప్రమేయ సంబంధంలో డిమాండ్ ఆధార చలాంకం కాగా $P_1, \ldots, P_n, Y,$ T లు స్వతంత్ర చలాంకాలు.

4.2.1. డిమాండ్‌ను ప్రభావితం చేసే అంశాలు/ కారకాలు

మార్కెట్‌లో ఒక వస్తువు యొక్క డిమాండ్‌ను అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. ఒక వస్తువు యొక్క డిమాండ్‌ను, దాన్ని నిర్ణయించే అంశాలను గురించి 'డిమాండ్ ఫలం' తెలియజేస్తుంది.

డిమాండ్‌ను నిర్ణయించే అంశాలు కింది విధంగా ఉంటాయి.

వస్తువు ధర: ఒక వస్తువు యొక్క డిమాండ్ ఆ వస్తువు యొక్క ధరపై ఆధారపడి ఉంటుంది. డిమాండ్‌ను నిర్ణయించే ఇతర అంశాలు స్థిరంగా ఉండి వస్తువు ధరలో మార్పు జరిగినపుడు డిమాండ్‌లో మార్పు జరుగుతుంది. వస్తువు ధర పెరిగినపుడు, వస్తువు యొక్క డిమాండ్ తగ్గుతుంది. అనగా వస్తువు ధర మరియు డిమాండ్ 'విలోమ' సంబంధాన్ని కలిగి ఉంటాయి.

$$P_x \uparrow \dashrightarrow D_x \downarrow$$

ప్రత్యామ్నాయ, పూరక వస్తువులు - వాటి ధరలు:

ప్రత్యామ్నాయ, పూరక వస్తువుల ధరలు ఒక వస్తువు డిమాండ్‌ను ప్రభావితం చేస్తాయి. కాఫీ, టీ మరియు స్కూటర్, మోటర్ సైకిల్ సమీప ప్రత్యామ్నాయాలు. వీటిలో ఒక వస్తువు ధర పెరిగితే మరొక వస్తువు డిమాండ్ పెరుగుతుంది. అందువలన ప్రత్యామ్నాయ వస్తువుల విషయంలో ధర, డిమాండ్ ధనాత్మక సంబంధాన్ని కలిగి ఉంటుంది.

పూరక వస్తువులు అనగా రెండింటిని కలిపి ఉపయోగించేవి. ఉదా: టెన్నిస్ రాకెట్, టెన్నిస్ బంతి మరియు పెట్రోల్, కారు. వీటి విషయంలో ఒక వస్తువు ధర పెరిగినప్పుడు మరొక వస్తువు డిమాండ్ తగ్గుతుంది. ఉదా: పెట్రోల్ ధర పెరిగినప్పుడు, కార్లకు డిమాండ్ తగ్గి వినియోగదారులు ప్రజా రవాణాకు మారే అవకాశం ఉంటుంది. పూరక వస్తువుల విషయంలో ధర, డిమాండ్ రుణాత్మక సంబంధం కలిగి ఉంటాయి. పూరక వస్తువులకు ఉమ్మడి డిమాండ్ ఉంటుంది.

వినియోగదారుని ఆదాయం: వినియోగదారుని యొక్క ఆదాయంఅతని కొనుగోలు శక్తిని ప్రభావితం చేస్తుంది. ఇతర అంశాలలో మార్పు లేకుండా వినియోగదారుని ఆదాయం పెరిగినప్పుడు సాధారణ వస్తువుల డిమాండ్ పెరుగుతుంది. కాని నాసిరకం వస్తువుల విషయంలో డిమాండు తగ్గుతుంది. ఉదా: వినియోగదారుని ఆదాయం పెరిగినపుడు ఎక్కువ నాణ్యత కలిగిన వస్తువులకు మారుతాడు. అంటే తక్కువ ఖరీదు కారు నుండి ఎక్కువ ఖరీదు కారుకు మారుతాడు. అలాగే మొబైల్ ఫోన్ల విషయంలో కూడా నాణ్యత కలిగి ఉన్న ఖరీదైన వాటికి మారుతారు.

వినియోగదారుని అభిరుచులు – ప్రాధాన్యతలు: సమాజంలోని ఏ ఒక్క వినియోగదారుని అభిరుచులు, ప్రాధాన్యతలు ఒకే విధంగా ఉండవు. వ్యక్తి వ్యక్తికీ మారుతూ ఉంటాయి. వినియోగదారుని అభిరుచులు, ప్రాధాన్యతలు వస్తువు వస్తువుకు మారుతాయి. ఉదాహరణకు ఫ్యాషన్ వస్తువుల విషయంలో, దుస్తుల విషయంలో వినియోగదారుని అభిరుచిని బట్టి డిమాండ్‌లో మార్పు చోటు చేసుకుంటుంది.

జనాభా: ఒక దేశ జనాభా పరిమాణం కూడా ఆదేశంలోని వస్తువుల డిమాండ్ పరిమాణాన్ని ప్రభావితం చేస్తుంది. ఉదా: జనాభా పెరిగినపుడు ఆహార ధాన్యాలు, వస్త్రాలు, గృహాలు మొదలగు వాటికి డిమాండ్ పెరుగుతుంది.

సాంకేతిక పరమైన మార్పులు: సాంకేతిక విజ్ఞానంలో పురోగతిసాధించడం వల్ల నూతన ఆవిష్కణలు జరుగుతాయి. అలాంటపుడు పాత వస్తువులకు డిమాండ్ తగ్గి నూతన వస్తువుల విషయంలో డిమాండ్ పెరుగుతుంది. ఉదా: ల్యాండ్ ఫోన్లకు రిమాండ్ తగ్గి సెల్ ఫోన్లకు డిమాండ్ పెరగడం.

వాతావరణంలో మార్పులు: వాతావరణంలో మార్పులు కూడా వస్తువుల యొక్క డిమాండ్ పరిమాణాన్ని నిర్ణయిస్తాయి. ఉదా: శీతాకాలంలో ఉన్ని వస్త్రాలు, గీజర్లు, హీటర్లు; వర్షాకాలంలో గొడుగులు, రెయిన్ కోట్లు; మరియు ఎండాకాలంలో ఎయిర్ కండిషనర్లు, కూలర్లు, శీతల పానీయాలు మొదలగు వాటికి డిమాండ్ పెరుగుతుంది.

4.3 డిమాండ్ సూత్రం

డిమాండ్ సూత్రం వస్తువు ధరకు మరియు దాని డిమాండ్ పరిమాణానికి ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుంది. సాధారణంగా వస్తువు ధర పెరిగినప్పుడు వినియోగదారుడు తక్కువ వస్తువులను కొనుగోలు చేస్తాడు. అదే వస్తువు ధర తగ్గినపుడు ఎక్కువ వస్తువులను కొనుగోలు చేస్తాడు.

మార్షల్ ప్రకారం వస్తువు ధర పెరిగినప్పుడు డిమాండులో తగ్గుదల, వస్తువు ధర తగ్గినప్పుడు డిమాండులో పెరుగుదల ఏర్పడుతుంది.

4.3.1 డిమాండ్ సూత్రం, లక్షణాలు:

డిమాండ్ సూత్రం మూడు నిర్దిష్ట లక్షణాలను కలిగి ఉంటుంది. 1) సాధారణ ధోరణి 2) సమయంతో సంబంధం 3) ధర మరియు డిమాండ్ సంబంధం.

1) ధర మరియు డిమాండ్ సంబంధం: ధరలలో పెరుగుదల లేదా తగ్గుదల నిర్దిష్ట సమయంలో డిమాండ్ చేయబడిన పరిమాణాన్ని తప్పకుండా ప్రభావితం చేస్తుంది. కాబట్టి ధర మరియు డిమాండ్ సంబంధం డిమాండ్‌ను ప్రభావితం చేస్తుంది.

2) సమయంతో సంబంధం: డిమాండ్ సూత్రం ఎల్లప్పుడూ సమయానికి సంబంధించినది. ఎందుకంటే ధరలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. అంతేకాకుండా ధరలు ఎల్లప్పుడూ స్థిరంగా ఉండవు. అందువల్ల ధరలు మరియు డిమాండ్ చేయబడిన పరిమాణాల మధ్య సహ సంబంధాన్ని నిర్దిష్ట సమయం లేదా అప్పటికప్పటి కోసం పరిగణించాలి.

3) ఇతర పరిస్థితులు: ఇది డిమాండ్ సూత్రం యొక్క అతి ముఖ్య ప్రమేయం. డిమాండ్‌ను ప్రభావితం చేసే ఇతర అంశాలన్నీ స్థిరంగా ఉంటాయి. కేవలం ధరను మాత్రమే పరిశీలిస్తారు.

4.3.2 డిమాండ్ సూత్రం ప్రమేయాలు

డిమాండ్ సూత్రం క్రింది ప్రమేయాలపై ఆధారపడి అభివృద్ధి చేయబడింది:

1. వినియోగదారుల ఆదాయం స్థిరంగా ఉండాలి.
2. వినియోగదారుల అభివృద్ధిలో ప్రాధాన్యతలు అలవాట్లు మారకూడదు.
3. ప్రత్యామ్నాయ పూరక వస్తువుల ధరలు మారకూడదు.
4. నూతన ప్రత్యామ్నాయాలు లభ్యం కాకూడదు.
5. భవిష్యత్తులో నెలలో వచ్చే మార్పులను అంచనా వేయకూడదు.

- డిమాండ్ సూత్రం ప్రమేయాలను తెలపండి.

పటం-1: అసాధారణ డిమాండ్ రేఖ/ మినహాయింపు



డిమాండ్ సూత్రానికి మినహాయింపులు

డిమాండ్ సూత్రం ప్రకారం వస్తువు ధర డిమాండ్ విలోమ సంబంధాన్ని కలిగి ఉంటాయి. కానీ కొన్ని పరిస్థితులలో సంబంధాన్ని కలిగి ఉంటాయి. అంటే ఒక వస్తువు ధర పెరిగినప్పుడు వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు మరియు ధర తగ్గినప్పుడు తక్కువగా కొనుగోలు చేస్తారు. ఇటువంటి సందర్భాలలో డిమాండ్ రేఖ ఎడమ నుండి కుడికి పైకి వాలి ఉంటుంది.

పటం-1లో X అక్షంపై డిమాండ్ పరిమాణాన్ని, OY అక్షంపై ధరను చూపించడం జరిగింది. DD డిమాండ్ రేఖ ఎడమ నుండి కుడికి పైకి వాలి ఉంది. ధర OPగా ఉన్నప్పుడు డిమాండ్ పరిమాణం OQ గా ఉన్నది. ధర OP1 గా పెరిగినపుడు OQ1 పరిమాణంకు పెరిగింది. ఈ పరిస్థితి డిమాండ్ సూత్రానికి విరుద్ధం. కింద తెలిపిన అంశాలు డిమాండ్ సూత్రానికి మినహాయింపులుగా చెప్పవచ్చు.

1) అంచనా ప్రభావం: ఒక వస్తువు ధర పెరిగినపుడు, ప్రజలు దానిధర మరింత పెరుగుతుందని ఊహించి మునుపటికంటె ఎక్కువ పరిమాణంలో కొనుగోలు చేయవచ్చు. మరోవైపు ధర తగ్గినప్పుడు ప్రజలు వెంటనే స్పందించకపోవచ్చు మరియు ధర మరింత తగ్గించాని ఎదురుచూస్తూ మునపటి మాదిరిగానే కొనుగోలు చేయవచ్చు. ఈ రెండు సందర్భాలలో డిమాండ్ సూత్రం పని చేయడం లేదు. దీనినే 'ఊహాజనిత ప్రభావం' అంటారు. ఉదా: స్టాక్ మార్కెట్, రియల్ ఎస్టేట్ మొదలగునవి.

2) గీఫెన్ వైపరీత్యం: 19వ శతాబ్దంలో సర్ రాబర్ట్ గిఫెన్, బ్రిటీష్ ఆర్థికవేత్త ఇంగ్లాండ్‌లోని శ్రామికులు ధరపెరగని మాంసం వినియోగం తగ్గించి, ధర పెరిగిన రొట్టెను ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడాన్ని గమనించాడు. ఈ పరిస్థితిని 'గీఫెన్ వైపరీత్యం' అంటారు. ఇంగ్లాండ్‌లో తక్కువ ఆదాయ వర్గాల వారు మాంసం ధర స్థిరంగా ఉండి రొట్టె ధర పెరిగినప్పుడు మాంసానికి బదులుగా రొట్టెను ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడాన్ని గిఫిన్ పరిశీలించాడు. రొట్టె అత్యంత ఆవశ్యకమైనది. కాబట్టి దాని ధర పెరిగితే దానినే ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అంటే నాసిరకం వస్తువుల ధర తగ్గితే డిమాండ్ తగ్గడం, నాసిరకం వస్తువుల ధర పెరిగితే మేలు రకం వస్తువుల వినియోగం తగ్గి, నాసిరకం వస్తువులగు డిమాండ్ పెరుగుతుంది. ఈ పరిస్థితిలో డిమాండ్ రేఖ ఎడమనుండి కుడికి పైకి వాలుతుంది.

3) వెబ్లన్ ప్రభావం: (గౌరవసూచిక వస్తువులు) వెబ్లన్ వివరించిన దాని ప్రకారం వినియోగదారులు ఒక వస్తువు కోరుకోవడమనేది దాని ఉపయోగం కంటే దాని విలువ ఆధారంగా కొనుగోలు చేస్తారు. ఉదాహరణకు ప్రతిష్ఠాత్మకమైన (గౌరవ సూచిక) వస్తువులుగా పరిగణించబడే వజ్రాలు, విలువైన లోహాలు, ఆభరణాలు, ఖరీదైన ఫర్నీచర్, పెద్ద కార్లు వంటి వాటిని ధర ఎక్కువగా ఉన్నప్పుడు హోదా పెరుగుతుందని ఎక్కువమంది ధనవంతులు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తారు. కాని వీటి ధర తగ్గి మధ్య తరగతి బీదవారు కూడా కొనుగోలు చేస్తున్నపుడు ధనవంతులు వీటి కొనుగోలునుఆపుతారు.

4) భ్రాంతి (Illusion): కొంత మంది వినియోగదారులు ఎక్కువ ధర కలిగిన వస్తువులు ఎక్కువ నాణ్యతను కలిగియుంటాయన్న భ్రాంతిలో వాటిని ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అదేవిధంగా ఆ వస్తువు ధర తగ్గినపుడు వస్తువుల యొక్క నాణ్యత కూడా తగ్గుతందునే భ్రాంతిలో కొనుగోలును తగ్గిస్తారు. మధ్య తరగతి వారు ఈ వస్తువులను ఎక్కువగా కోరుకుంటారు.

5) అవసరమైన వస్తువులు: టీవీలు, వాషింగ్ మెషిన్లు, వంటగ్యాస్, పెట్రోలియం ఉత్పత్తులు మొదలైన నిత్యావసర వస్తువుల ధర పెరిగినప్పటికీ డిమాండ్ చెక్కుచెదరకుండా ఉంటుంది. ప్రజలు నిత్యావసర వస్తువుల కొనుగోలును ఆపలేరు.

6) కొరత భయం: యుద్ధం లేదా కరువు లేదా ఆర్థిక మాంద్యం వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉన్నందున సమీప భవిష్యత్తులో సరుకుల కొరత ఏర్పడుతుందని అంచనా వేసినప్పుడు, వినియోగదారుడు అందుబాటులో ఉన్న ధరకు, అధిక ధరకు కూడా వస్తువులను కొనుగోలు చేయడం ప్రారంభిస్తారు.

4.4 డిమాండ్ రకాలు

డిమాండ్‌ను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. ధర డిమాండ్ (Price demand)
2. ఆదాయ డిమాండ్ (Income demand)
3. జాత్యంతర డిమాండ్ (Cross demand)

4.4.1 ధర డిమాండ్ (Price demand)

ధర డిమాండ్ అనగా ఒక నిర్ణీత సమయంలో ఒక నిర్ణీత ధర వద్ద మార్కెట్‌లో కొనుగోలు చేయబడిన వస్తువులు లేదా సేవల పరిమాణం. దీనిలో ధరకు, డిమాండ్‌కు విలోమ సంబంధం ఉంటుంది. అంటే ఒక వస్తువు ధర పెరిగినపుడు డిమాండ్ తగ్గుతుంది. అదే వస్తువు ధర తగ్గితే డిమాండ్ పెరుగుతుంది.

పట్టిక 1: వ్యక్తిగత డిమాండ్ పట్టిక

నారింజ ధర (రూ.)	డిమాండ్ రేఖ
50	5
40	10
30	15
20	20
10	25

మార్కెట్ డిమాండ్ పట్టిక

మార్కెట్ డిమాండ్ పట్టిక అనేది మార్కెట్లోని వినియోగదారులందరూ ఇచ్చిన ధరకు కొనుగోలుచేసే వస్తువు పరిమాణం యొక్క పట్టిక. ఏదైనా ధర వద్ద, పట్టికలోని సంబంధిత విలువ ఆధారం వద్ద డిమాండ్ చేయబడిన అన్ని వినియోగదారుల పరిమాణాల మొత్తం. ఇది వ్యక్తిగత డిమాండ్‌లను కలపగా వచ్చినది మరియు ఒక వస్తువు ధరకు సంబంధించి వివిధ కస్టమర్ల డిమాండ్ను వర్ణిస్తుంది.

నారింజ ధర (రూ.)	డిమాండ్ రేఖ			నారింజ ధర (రూ.)
	వినియోగదారు ఎ	వినియోగదారు బి	వినియోగదారు సి	
25	4	5	6	15
24	6	8	10	24
23	8	11	14	33
22	10	14	18	42
21	12	17	22	51

వైయక్తిక డిమాండ్ రేఖలు



పటం–2: వైయక్తిక డిమాండ్ రేఖలు మరియు మార్కెట్ డిమాండ్ రేఖ

4.4.3 ఆదాయ డిమాండ్

వినియోగదారుని యొక్క ఆదాయానికి, వారు కొనుగోలు చేసే వస్తు పరిమాణానికి గల సంబంధాన్ని ఈ ఆదాయం డిమాండ్ తెలియజేస్తుంది. వివిధ ఆదాయ స్థాయిలలో వినియోగదారులు వస్తువులను ఏయే పరిమాణాలలో డిమాండ్ చేస్తారనే విషయాన్ని ఆదాయ డిమాండ్ తెలుపుతుంది. వినియోగదారుని అభిరుచి, అలవాట్లు, వస్తువు యొక్క ధర, ప్రత్యామ్నాయ, పూరక వస్తువుల ధరలు స్థిరంగా ఉండి వినియోగదారుని ఆదాయంలో మార్పులు సంభవించినప్పుడు ఏర్పడే డిమాండ్‌ను ఆదాయ డిమాండ్ వివరిస్తుంది.

ఆదాయం పెరిగే కొద్దీ మేలు రకం లేదా సాధారణ వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. ఈ వస్తువుల విషయంలో ఆదాయానికి, డిమాండ్‌కు అనులోమ సంబంధం ఉంటుంది. అంటే ఆదాయం పెరుగుతుంటే మేలు రకం వస్తువుల విషయంలో డిమాండ్ పెరుగుతుంది. అదే ఆదాయం తగ్గినపుడు నాసిరకం వస్తువుల డిమాండ్‌ను, ఆదాయానికి విలోమ సంబంధం ఉంటుంది. అంటే వినియోగదారుని ఆదాయం తగ్గినపుడు నాసిరకం వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. వినియోదారుని ఆదాయం పెరుగుతున్న కొద్దీ నాసిరకం వస్తువులకు డిమాండ్ తగ్గి, మేలు రకం వస్తువుల డిమాండ్ పెరుగుతుంది.

ఆదాయానికి డిమాండ్‌కు ఉన్న ప్రమేయం సంబంధాన్ని కింది సమీకరణం ద్వారా చూపవచ్చు.

$Dx = f(Y)$

ఇక్కడ Dx = X వస్తువు డిమాండ్ పరిమాణం, Y = వినియోగదారుని ఆదాయం, f = ప్రమేయ సంబంధం.

పట్టిక–2: ఆదాయ డిమాండ్

ఆదాయం (రూ. లలో)	డిమాండ్ పరిమాణం (కేజీలు)	
	మేలు రకం వస్తువులు	నాసిరకం వస్తువులు
2000	4	12
4000	6	10
6000	8	8
8000	10	6
10000	12	4

పై (ఆదాయం-డిమాండ్) పట్టికను పరిశీలించినపుడు ఆదాయం పెరిగేకొద్దీ మేలు రకం వస్తువులకు డిమాండ్ పెరుగుతుందని, నాసిరకం వస్తువుల డిమాండ్ తగ్గుతుందని తెలుస్తుంది.

మేలు రకం వస్తువులు/ సాధారణ వస్తువుల ఆదాయ డిమాండ్

వినియోగదారుని ఆదాయం పెరిగినపుడు మేలు రకం వస్తువులు లేదా సాధారణం రకం వస్తువుల డిమాండ్ పెరుగుతుంది. అంటే మేలు రకం వస్తువుల డిమాండ్ విషయంలో డిమాండ్‌కు, ఆదాయానికి మధ్య ధనాత్మక సంబంధం కలిగియుండి డిమాండ్ రేఖ ధనాత్మక వాలును కలిగి ఎడమ నుండి కుడికి పైకి వెళుతుంది.



పటం-3: మేలైన వస్తువులకు ఆదాయ డిమాండ్

పటం-4.3లో OX అక్షం మీద డిమాండ్ పరిమాణాన్ని, OY అక్షం మీద ఆదాయాన్ని తీసుకున్నాం. ఆదాయం OY గా ఉన్నపుడు OQ వస్తువు పరిమాణం డిమాండ్ చేయబడింది. ఆదాయం OY నుండి OY1 కు పెరిగినపుడు మేలు రకం వస్తువుల డిమాండ్ OQ నుండి OQ1 కు పెరిగింది. YD ఆదాయ డిమాండ్ రేఖ ధనాత్మక వాలును కలిగి ఉంటుంది. వెబ్లెన్ వస్తువుల విషయంలో కూడా డిమాండ్ రేఖ ఇలాగే ధనాత్మక వాలు కలిగి ఉంటుంది.

నాసిరకం వస్తువుల ఆదాయ డిమాండ్:

నాసిరకం వస్తువుల విషయంలో వినియోగదారుని ఆదాయం పెరిగినపుడు డిమాండ్ తగ్గుతుంది. ఈ వస్తువుల విషయంలో ఆదాయానికి డిమాండ్‌కు 'విలోమ' సంబంధం ఉంటుంది.



పటం-4: ఆదాయం డిమాండ్ రేఖ (నాసిరకం వస్తువులు)

పటం-4.4లో OX అక్షం మీద OY అక్షం మీద ఆదాయాన్ని తీసుకున్నాం. ఆదాయం OY నుండి OY1 కు పెరిగినపుడు డిమాండ్ పరిమాణం OQ నుండి OQ1 తగ్గింది. YD డిమాండ్ రేఖ రుణాత్మక వాలును కలిగి ఎడమ నుండి కుడికి వాలి ఉంటుంది.

4.4.4 జాత్యంతర డిమాండ్

ప్రత్యామ్నాయ మరియు పూరక వస్తువుల ధరలలో మార్పు వచ్చినపుడు ఆయా వస్తువుల డిమాండ్లలో వచ్చే మార్పులను జాత్యంతర డిమాండ్ తెలియజేస్తుంది. జాత్యంతర డిమాండ్ విశ్లేషణలో ఇతర అంశాలు అనగా వస్తువు ధర, వినియోగదారుని ఆదాయం, అభిరుచులు స్థిరంగా ఉంటాయి అని ప్రమేయం చేయబడుతుంది.

జాత్యంతర డిమాండ్ ప్రత్యామ్నాయ, పూరక వస్తువుల ధరల్లో వచ్చే మార్పులకు వాటి డిమాండ్‌లో వచ్చే మార్పులకు ఉన్న ప్రమేయ సంబంధాన్ని సూచిస్తుంది. దీనిని కింది సమీకరణం ద్వారా చూపవచ్చు.

$Dx = f(Py)$, ఇక్కడ Dx = X వస్తువు డిమాండ్ పరిమాణం, Py = Y ప్రత్యామ్నాయ వస్తువు ధర, f=ప్రమేయ సంబంధం

ప్రత్యామ్నాయ వస్తువులు: ఒకే రకమైన కోరికను తీర్చగల వివిధ వస్తువులను ప్రత్యామ్నాయ వస్తువులు అంటారు. ఉదా: టీ-కాఫీ, కోల్గేట్-క్లోజప్, పెప్సీ-థమ్సప్ మొదలగు ప్రత్యామ్నాయ వస్తువులు.

పట్టిక-3: ప్రత్యామ్నాయ వస్తువుల ధర, డిమాండ్

కాఫీ		టీ	
ధర	డిమాండ్	ధర	డిమాండ్
10	500	10	500
9	600	10	400

ప్రత్యామ్నాయ వస్తువుల డిమాండ్ రేఖ



పటం-5:

టీ డిమాండ్

OX అక్షం మీద టీ డిమాండ్ పరిమాణాన్ని, OY అక్షం మీద కాఫీ ధరను తీసుకున్నాం. కాఫీ ధర OY నుండి OY1 కు తగ్గినపుడు, టీ డిమాండ్ OQ నుండి OQ1కు తగ్గింది. జాత్యంతర డిమాండ్ రేఖ ధనాత్మక వాలును అనగా ఎడమ నుండి కుడికి వెళ్తుంది.

పూరక వస్తువులు:

ఒకే కోరికను తీర్చడానికి కొన్ని వస్తువులు సమిష్టిగా ఉపయోగించబడతాయి. అలాంటి వస్తువులను పూరక వస్తువులు అంటారు. ఉదా: కారు-ఇంధనం, బ్రెడ్-జామ్ మొదలగునవి.

కారు		ఇంధనం	
ధర (లక్షల్లో)	డిమాండ్	ధర (రూ.లలో)	డిమాండ్ (లీటర్లలో)
5	1000	75	500
5	2000	50	1000

పట్టిక ప్రకారం కార్ల ధరకు, ఇంధన డిమాండ్‌కు మధ్య రుణాత్మక సంబంధం ఉంటుంది. ఇంధనం ధర తగ్గితే కార్ల డిమాండ్ పెరిగింది. ఇంధనం ధర పెరిగితే కార్ల డిమాండ్ తగ్గింది.



పటం-6: పూరక వస్తువుల డిమాండ్ రేఖ

పటం ప్రకారం OX అక్షం మీద కార్ల డిమాండ్ పరిమాణాన్ని, OY అక్షం మీద ఇంధనం ధరను తీసుకున్నాం. ఇంధన ధర OP నుండి OP1కు తగ్గినపుడు కార్ల డిమాండ్ OQ నుండి OQ1 పెరిగింది. CD జాత్యంతర డిమాండ్ రేఖ ఎడమ నుండి కుడికి కిందకు (రుణాత్మక) వాలు కలిగి ఉంది.

4.6 సారాంశం

అర్థశాస్త్ర విశ్లేషణ ప్రకారం కోరికతో పాటు కొనుగోలు శక్తి ఉన్నప్పుడే డిమాండ్ ఏర్పడుతుంది. వస్తువు యొక్క డిమాండ్, ఆ డిమాండ్‌ను ప్రభావితం చేసే అంశాలకు మధ్య ఉన్న సంబంధాన్ని తెలియజేసేది డిమాండ్ ఫలం. డిమాండును నిర్ణయించే ఇతర కారకాలలో మార్పు లేనపుడు ధరకు, డిమాండ్‌కు విలోమ సంబంధం ఉంటుంది. కానీ కొన్ని (గిఫెన్) వస్తువుల విషయంలో అనులోమ సంబంధం ఉంటుంది. డిమాండ్‌కు ఆదాయానికి మధ్య మేలు రకం వస్తువుల విషయంలో ధనాత్మక సంబంధం ఉంటుంది. అదే నాసిరకం వస్తువుల విషయంలో ఆదాయానికి, రిమాండుకు రుణాత్మక సంబంధం ఉంటుంది. ప్రత్యామ్నాయ, పూరక వస్తువుల డిమాండ్ గురించి 'జాత్యంతర డిమాండ్' తెలియ చేస్తుంది.

4.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. డిమాండ్ను నిర్వచించండి.
2. డిమాండ్ ఫలంను వివరించండి.
3. ధర డిమాండ్‌ను వివరించండి.
4. ప్రత్యామ్నాయ వస్తువులు అనగా నేమి? ఉదాహరణలు రాయండి.
5. ఆదాయ డిమాండ్ అనగానేమి?
6. పూరక వస్తువులను ఉదాహరణలతో వివరించండి.
7. గీఫెన్ వైపరీత్యంను వివరించండి.

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. డిమాండు సూత్రం లక్షణాలను వివరించండి.
2. డిమాండు సూత్రం ప్రమేయాలను తెలుపండి.
3. జాత్యంతర డిమాండును గురించి వివరించండి.
4. ఆదాయ డిమాండ్‌ను పట్టిక మరియు పటం సహాయంతో వివరించండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. డిమాండును నిర్ణయించే కారకాలను పేర్కొని, ఏవేని రెండింటి గురించి వివరించండి.
2. డిమాండు సూత్రానికి గల మినహాయింపులను గురించి వివరించండి.
3. డిమాండ్ రకాలను పేర్కొని, ఏదేని ఒక దాని గురించి పటం సహాయంతోవివరించండి.

4.8 పదకోశం

- డిమాండ్: ఒక వస్తువును లేదా సేవను కొనుగోలు చేయాలనే సుముఖత కొనుగోలు చేసే శక్తి ఉంటేనే దానిని 'డిమాండ్' అంటారు.
- డిమాండ్ ఫలం:ఒక వస్తువుకున్న డిమాండ్, ఆ డిమాండ్‌ను నిర్ణయించే అంశాలకు మధ్య ఉన్న సంబంధాన్ని తెలియజేసేది డిమాండ్ ఫలం.
- ప్రత్యామ్నయ వస్తువులు:ఒకే కోర్కెను తీర్చుటకు ఉపయోగపడే వివిధ వస్తువులు.
- పూరక వస్తువులు: ఒకే కోర్కెను తీర్చడానికి సంయుక్తంగా ఉపయోగపడే వస్తువులు.
- ధర డిమాండ్: ఒక వస్తువు ధరకు, వస్తువు డిమాండ్ పరిమాణానికి మధ్య ఉన్న ప్రమేయ సంబంధాన్ని 'ధర డిమాండ్' అంటారు.
- ఆదాయ డిమాండ్: వినియోగదారుని ఆదాయానికి, డిమాండ్ పరిమాణానికి ఉన్న సంబంధాన్ని 'ఆదాయ డిమాండ్'అంటారు.
- జాత్యంతర డిమాండ్: వస్తువు డిమాండుకు, దాని ప్రత్యామ్నాయ, పూరక వస్తువుల ధరలలో మార్పుకు ఉన్న సంబంధాన్ని జాత్యంతర డిమాండ్ అంటాం.

4.8 ఉపయుక్త గ్రంథాలు

- ఎకనామిక్స్ పాఠ్యపుస్తకం మొదటి సంవత్సరం, TSBIE
- B.A. ఎకనామిక్స్
- NCERT పాఠ్యపుస్తకం 12వ తరగతి
- ఎకనామిక్స్ పాఠ్యపుస్తకం NIOS

అధ్యాయం
5

ఉత్పత్తి విశ్లేషణ

5.0 లక్ష్యాలు

5.1 పరిచయం

5.1.1 ఉత్పత్తి భావన

5.2 ఉత్పత్తి కారకాలు

5.3 ఉత్పత్తి ఫలం

5.4 చరానుపాతాల సూత్రం లేదా క్రమక్షీణ ప్రతిఫల సూత్రం

5.5 తరహానుసరించి ప్రతిఫలాల సూత్రం

5.6 తరహానుసరించి ఆదాలు

5.7 సారాంశం

5.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

5.10 పదకోశం

5.11 ఉపయుక్త గ్రంథాలు

5.0 లక్ష్యాలు

- ఉత్పత్తి యొక్క భావన మరియు అర్థాన్ని అవగాహన చేసుకుంటారు.
- ఉత్పత్తి ఫలానికి సంబంధించిన భావనను వివరించగలుగుతారు మరియు ఉత్పత్తి ఫలం యొక్క రకాలను గుర్తించగలుగుతారు.
- ఉత్పత్తి కారకాలను తెలుసుకొని వాటి లక్షణాలను అవగాహన చేసుకుంటారు.
- చరానుపాతాల సూత్రంను విశ్లేషిస్తారు. క్షీణ ప్రతిఫలాలకు గల కారణాలను తెలుసుకుంటారు. ఈ సూత్రం యొక్క ప్రాధాన్యతను గుర్తిస్తారు.
- తరహా అనుసరించి ప్రతిఫలాలను గుర్తించి వాటి రకాలను వర్గీకరిస్తారు.
- తరహాను అనుసరించి ఆదాలను అవగాహన చేసుకుని అంతర్గత మరియు బహిర్గత ఆదాలను విశ్లేషించగలుగుతారు.

5.1 పరిచయం

మానవ కోరికలు అపరిమితమైనవి. కోర్కెలను తీర్చుకునే సాధనాలు పరిమితము మరియు ప్రత్యామ్నాయ ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. మానవుడు, తన కోరికలను తీర్చుకోవడానికి వస్తు సేవలను ఉపయోగించుకొని తృప్తి పొందుతాడు. మరి ఈ వస్తు సేవలను పొందడానికి ఉత్పత్తి దోహదపడుతుంది. ఈ అధ్యాయంలో మనం ఉత్పత్తిని గురించినటువంటి వివిధ అంశాలను అధ్యయనం చేస్తాం.

5.1.1 ఉత్పత్తి భావన

ఉత్పత్తి అనేది ఒక ముఖ్యమైన ఆర్థిక కార్యకలాపం. దీని ద్వారా వస్తు సేవల సప్లయ్ జరుగుతుంది. వినియోగదారుని కోరికలను సంతృప్తిపరిచే లక్ష్యంతో శ్రమ, మూలధనం మరియు ఇతర సహజ వనరులను ఉపయోగించుకొని ఉత్పత్తి ప్రక్రియను నిర్వహించడం ద్వారా వినియోగానికి అవసరమైన వస్తు సేవలను ఉత్పత్తి చేయడం జరుగుతుంది. ఉత్పత్తి అంటే నూతన వస్తువుల సృష్టి కాదు. ఉత్పత్తి కారకాలను ఉపయోగించుకుని ముడి పదార్థాలకు ప్రయోజనం చేకూర్చి అంతిమ వస్తువులుగా మార్పు చేసే ప్రక్రియనే ఉత్పత్తి అంటారు. ఉత్పత్తి కారకాలను వివిధ కలయికలలో మేళవించడం ద్వారాను లేదా వాటి అనుపాతం పెంచడం లేదా తగ్గించడం ద్వారా ఉత్పత్తిలో మార్పులు చేయవచ్చును.

ఉత్పత్తి అనేది నాలుగు ఉత్పాదక కారకాలైన భూమి, శ్రమ, మూలధనం మరియు వ్యవస్థాపనల సమన్వయం ఫలితం. ఈ నాలుగు ఉత్పత్తి కారకాలలో ఏ ఒక్కదాని సహాయం లేకుండా ఏ ఒక్క వస్తువును కూడా ఉత్పత్తి చేయలేము అనేది నిరూపితమైన వాస్తవం. అందువల్ల, ఉత్పత్తిదారుడు నాలుగు ఉత్పత్తి కారకాలను సాంకేతిక నిష్పత్తిలో మిళితం చేసి ఉత్పత్తి చేస్తాడు.

5.2 ఉత్పత్తి కారకాలు

వస్తు సేవల ఉత్పత్తికి అవసరమైన వాటినే ఉత్పత్తి కారకాలు లేదా ఉత్పాదకాలు అంటారు. ఈ ఉత్పత్తి కారకాలు సహజసిద్ధంగా లభించవచ్చు లేదా మానవ నిర్మితమైనవి కావచ్చు.

నిర్వచనాలు: 'ఉత్పత్తి ప్రక్రియకు దోహదం అన్నీ రకాల వస్తుసేవలను ఉత్పత్తి కారకాలు అంటారు'. బి.బెన్. హామ్.

ఉత్పత్తి కారకాల రకాలు

సాధారణ అర్థశాస్త్రంలో ఉత్పత్తి కారకాలు నాలుగు రకాలు అవి 1. భూమి, 2. శ్రమ, 3. మూలధనం, 4. వ్యవస్థాపన. ఇటీవల కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉత్పత్తి కారకంగా కొందరు ఆర్థికవేత్తలు పేర్కొంటూ ఉన్నారు. అయితే ఆధునిక ఆర్థికవేత్తలు వ్యవస్థాపనని శ్రమలో భాగంగానూ, భూమిని మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని మూలధనంలో భాగంగా చేరుస్తూ ఉత్పత్తి కారకాలను రెండుగా విభజించారు. అవి 1. శ్రమ, 2. మూలధనం. ఆర్థిక వ్యవస్థలో మొత్తం ఉత్పత్తి అనేది ఉత్పత్తి కారకాల లభ్యత, పరిమాణం మరియు వాటి నాణ్యత పైన ఆధారపడి ఉంటుంది. ఈ ఉత్పత్తి కారకాలను గురించి మనం మరింత వివరంగా తెలుసుకుందాం

1. భూమి: భూమి అనే పదం మనం నేలగా చూసే ఉపరితల భాగాన్ని లేదా మృత్తికను సూచిస్తుంది. కానీ ఆర్థిక శాస్త్రంలో భూమి అనేది సాధారణ అర్థంలోని భూమి మాత్రమే కాకుండా, భూమి, నీరు, గాలి, కాంతి మరియు వేడి వంటి మానవ అవసరాల కోసం ప్రకృతి అందించే మొత్తం వనరులు మరియు శక్తులను కలిగి ఉంటుంది. అందువల్ల భూమి అంటే వస్తువులు మరియు సేవలను ఉత్పత్తి చేయడానికి భూమి నుండి వచ్చే ఏ సహజ వనరును నైనా కలిగి ఉంటుంది. భూమి లేదా సహజ వనరులకు ఉదా: నీరు, చమురు, రాగి, సహజ వాయువు, బొగ్గు మరియు అడవులు. భూ వనరులు ఉత్పత్తి ప్రక్రియలో ముడి పదార్థాలు. ఈ వనరులు అడవులు వంటి పునరుత్పాదకమైనవి లేదా చమురు లేదా సహజ వాయువు వంటి పునరుత్పాదకం కానివి అని రెండు రకాలుగా ఉంటాయి.

2. శ్రమ: శ్రమ అనేది వస్తువులు మరియు సేవల ఉత్పత్తికి మనిషి చేసే కృషి. సాధారణ భాషలో శ్రమ అనేది చాలా తరచుగా శారీరక శ్రమను సూచించడానికి ఉపయోగించబడుతుంది. కానీ ఆర్థిక శాస్త్రంలో దీనిని విస్తృత అర్థంలో ఉపయోగిస్తారు. శ్రమ అంటే మానసికంగా లేదా శారీరకంగా ద్రవ్య ప్రతిఫలం కోసం చేపట్టే ఏదైనా పని. ఈ శ్రమ కింది స్థాయి నుండి అత్యున్నత వృత్తిపరమైన పని వరకు ద్రవ్య ప్రతిఫలం కోసం చేపట్టే పనిని కలిగి మరియు ఆనందం లేదా ప్రేమ కోసం చేపట్టే పనిని మినహాయిస్తుంది. శ్రమ అనేది అత్యంత ముఖ్యమైన ఉత్పత్తి కారకం.

3. మూలధనం: ఆర్థిక శాస్త్రంలో, మూలధనం అంటే సాధారణంగా ద్రవ్యాన్ని సూచిస్తుంది. అయితే, ద్రవ్యం ఉత్పత్తి కారకం కాదు ఎందుకంటే ఇది ఒక వస్తువు లేదా సేవను ఉత్పత్తి చేయడంలో ప్రత్యక్షంగా పాల్గొనదు.

అయితే, ఇది ఉత్పత్తి ప్రక్రియలను సులభతరం చేసేందుకు ఉత్పత్తికి అవసరమైన కర్మాగారాలు, యంత్రాలు, పరికరాలు, సాధనాలు, ముడి పదార్థాలు, సంపద మొదలగునవి కొనుగోలు చేయడానికి వ్యవస్థాపకులు మరియు సంస్థల యజమానులకు ఉపయోగపడుతుంది. అందువల్ల, ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగించే మానవ నిర్మిత వనరులన్నింటినీ మూలధనం అంటారు.

మూలధనం అనేది ఒక వ్యక్తి లేదా సమూహాము ప్రస్తుత సంపదలోని కొంత భాగాన్ని పొదుపు చేయడం ద్వారా సృష్టించబడి భవిష్యత్తులో సంపద సృష్టికి దోహదపడుతుంది. మూలధనాన్ని ఉత్పత్తి చేయబడిన ఉత్పత్తి కారకం అని కూడా అంటారు. మూలధనం యొక్క లభ్యతలో తేడాలు మరియు మార్పులు ఉంటాయి. మూలధనానికి గమన శీలత ఉంటుంది.

4. వ్యవస్థాపన లేదా వ్యవస్థాపకుడు: వ్యవస్థాపన అనగా, వ్యవస్థాపక సేవలను అందించడం. వ్యవస్థాపకుడు భూమి, శ్రమ మరియు మూలధనం వంటి ఇతర ఉత్పత్తి ఏజెంట్ల కార్యకలాపాలను సమన్వయం చేస్తాడు. వ్యవస్థాపకుడు ఉత్పత్తి కారకాలను ఒకే చోటకు తీసుకువచ్చే వ్యక్తి. అతను వాటిని ఉత్పత్తి ప్రక్రియ కోసం ఉపయోగిస్తాడు. వ్యవస్థాపకత అనేది వినూత్న ఆలోచనలను రూపొందించడం మరియు వాటిని సరైన ప్రణాళిక మరియు నిర్వహణ ద్వారా ఉత్పత్తిలో కార్యరూపంలోకి తీసుకురావడం. వ్యవస్థాపకులు ముఖ్యమైన వారు. ఎందుకంటే వారు వ్యాపారంలో నష్టాలను భరిస్తూ మరియు సంభావ్య అవకాశాలను గుర్తిస్తారు. వ్యవస్థాపకులు సంపాదించే ఆదాయంనే లాభం అంటారు.

5.3 ఉత్పత్తి ఫలం

సరళంగా చెప్పాలంటే, ఉత్పత్తి ఫలం అనేది ఉత్పాదకాలకు, ఉత్పత్తికి మధ్య క్రియాత్మక సంబంధాన్ని సూచిస్తుంది. ఇవ్వబడిన ఉత్పాదకాలు, నిర్ణీత కాలం మరియు సాంకేతికతలతో ఉత్పత్తి చేయగల వస్తువు యొక్క గరిష్ట పరిమాణాన్ని ఉత్పత్తి ఫలం నిర్దేశిస్తుంది.

గణితశాస్త్ర పరంగా ఉత్పాదకాలకు, ఉత్పత్తికి మధ్య ప్రాథమిక సంబంధాన్ని ఇలా వ్యక్తీకరించవచ్చు:

$Q = f(N, K, L, O)$

ఇక్కడ Q = నిర్ణీత కాలంలో ఉత్పత్తి చేయబడిన ఉత్పత్తి పరిమాణం, K = మూలధనం, మరియు L= శ్రమ, N = భూమి, O = వ్యవస్థాపన/ వ్యవస్థాపకుడు.

ఉత్పత్తిలో మార్పు చేయాలంటే ఉత్పత్తి కారకాలలో మార్పు చేయాలి. ఉత్పత్తి ఫలం రెండు రకాలుగా వర్గీకరించారు. అవి:

1. **స్వల్ప కాలిక ఉత్పత్తి ఫలం:** స్వల్ప కాలంలో, ఇతర ఉత్పత్తి కారకాలను స్థిరంగా ఉంచి ఒక ఉత్పత్తి కారకాన్ని మార్పు చేయడం ద్వారా ఉత్పత్తిని పెంచవచ్చు. దీనిని చర అనుపాతాల సూత్రము లేదా క్షీణ ప్రతిఫల సూత్రము అంటారు. ఉత్పత్తిదారుడు, ఒక ఉత్పత్తి కారకాన్ని మార్చడం ద్వారా ఉత్పత్తి కారకాల కలయిక నిష్పత్తిలో మార్పు చేసి ఉత్పత్తిలో మార్పులను తీసుకువస్తాడు. ఈ నిష్పత్తుల సంబంధాన్ని కారక ప్రతిఫల సూత్రం అంటారు.

2. **దీర్ఘకాలిక ఉత్పత్తి ఫలం:** ఉత్పత్తి కారకాల అన్నింటిని మార్పు చేయడం ద్వారా ఉత్పత్తిని మార్పు చేయడానికి వీలున్న కాలాన్ని దీర్ఘకాలం అంటారు. దీర్ఘకాలంలో ఉత్పత్తి కారకాలు అన్నింటిని చర ఉత్పత్తి కారకాలుగా పేర్కొంటారు. దీర్ఘకాలంలో ఉత్పత్తి కారకాలను ఒకే అనుపాతంలో పెంచినప్పుడు ఉత్పత్తి ఏ విధంగా పెరుగుతుందో తెలియజేసేదదే తరహానానుసరించి ప్రతిఫలాల సూత్రము.

   దీర్ఘకాలంలో, ఒక సంస్థ అన్ని ఉత్పత్తి కారకాలను వాటి తరహా ప్రకారం మార్చడం సాధ్యమవుతుంది. దీనిని తరహానానుసరించి ప్రతిఫలాల సూత్రము అంటారు. ఈ సందర్భంలో ఉత్పత్తిదారుడు ఉత్పాదకాలన్నింటిని అదే నిష్పత్తిలో మార్పు చేస్తాడు. అందువలన, ఉత్పత్తికి మరియు ఉత్పత్తి కారకాలను మధ్య గల నైష్పత్తిక సంబంధాన్ని తరహానానుసరించి ప్రతిఫలాల సూత్రము అంటారు

5.4 చర అనుపాతాల సూత్రం లేదా క్రమక్షీణ ప్రతిఫల సూత్రం

చర అనుపాతాల సూత్రం ఆర్థిక సిద్ధాంతాలలో ఒక ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించింది ఒకటి. స్వల్ప కాలంలో ఇతర ఉత్పత్తి కారకాలను స్థిరంగా ఉంచి ఒక ఉత్పత్తి కారకాన్ని మార్పు చేయడం ద్వారా ఉత్పత్తిని పెంచినప్పుడు జరిగే దృగ్విషయం. స్వల్పకాలంలో, ఉత్పత్తి కారకాలు రెండుగా వర్గీకరించబడ్డాయి. అవి 1. స్థిర కారకాలు, 2. చర కారకాలు. స్వల్ప కాలంలో స్థిర ఉత్పత్తి కారకాలను పెంచడం ద్వారా ఉత్పత్తిని పెంచడం సాధ్యం కాదు.

చరానుపాతాల సూత్రం ప్రారంభంలో మార్షల్ క్షీణ ప్రతిఫల సూత్రం అని పిలిచారు. క్షీణ ప్రతిఫల సూత్రం ఇలా చెబుతోంది 'భూమి యొక్క సాగులో మూలధనం మరియు శ్రమలను పెంచడం వల్ల, సాధారణంగా మొత్తం ఉత్పత్తి ప్రారంభంలో పెరుగుదల రేటుతో పెరుగుతూ, తర్వాత క్షీణించే రేటుతో పెరిగి, చివరికి క్షీణిస్తుంది'.

నిర్వచనాలు: "ఉత్పత్తి కారకాల సమ్మేళనంలో ఒక ఒక కారకం యొక్క పరిమాణం పెంచే కొద్దీ, ఒక దశ దాటిన తర్వాత మొదట ఆ కారకం ఉపాంత ఉత్పత్తి, తర్వాత సగటు ఉత్పత్తి క్షీణిస్తాయి." బి.బెన్.హామ్

"ఇవ్వబడిన సాంకేతిక పరిజ్ఞానంతో స్థిర కారకాలతో పోల్చినప్పుడు కొన్ని కారకాలను పెంచినప్పుడు ఉత్పత్తి పెరుగుతుంది. అయితే ఒక స్థాయి తర్వాత ఉత్పాదకాలను అదే స్థాయిలో పెంచడం వల్ల వచ్చే అదనపు ఉత్పత్తి తక్కువై మరియు తగ్గుతూ ఉంటుంది." –శామ్యూల్సన్.

ప్రమేయాలు: చరానుపాతాల సూత్రం లేదా క్షీణ ప్రతిఫల సూత్రం క్రింది ప్రమేయాలపై ఆధారపడి పని చేస్తుంది.

1. స్థిర సాంకేతిక పరిజ్ఞానము: స్వల్ప కాలంలో అమలులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానము ఇవ్వబడి ఉండి స్థిరంగా ఉంటుంది. ఈ కాలంలో ఉత్పత్తి పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం మార్పు లేకుండా ఉంటాయి.
2. సజాతీయ కారక యూనిట్లు: చర ఉత్పత్తి కార్యక్రమం యొక్క అన్ని యూనిట్లు సజాతీయంగా ఉంటాయి. మరియు ప్రతి యూనిట్, ప్రతి ఇతర యూనిట్‌లతో పోల్చినప్పుడు నాణ్యత మరియు పరిమాణం ఒకేలా ఉంటుంది.
3. స్వల్ప కాలం: ఈ సూత్రము స్వల్పకాలానికి పనిచేస్తుంది ఎందుకంటే స్వల్ప కాలంలో అన్నీ ఉత్పత్తి కారకాలను మార్చటానికి వీలుండదు.
4. చర కారకాల అనుపాతం: ఉత్పత్తి కారకాల అనుపాతంలో మార్పు చేయవచ్చును అని ఈ సూత్రం భావిస్తుంది. ఒక వేళ ఉత్పత్తి కారకాల అనుపాతం స్థిరంగా ఉంటే ఈ సూత్రం చెల్లుబాటు ఉండదు.
5. ఉత్పత్తిని భౌతిక యూనిట్లలో కొలవవచ్చు.

ఈ సూత్ర విశ్లేషణను వివరంగా చర్చించే ముందు, మొదటగా చరానుపాతాల సూత్రంలో ఉపయోగించే విభిన్న పదాలను గురించి అవగాహన చేసుకోవాల్సి ఉంటుంది.

1. మొత్తం ఉత్పత్తి (TP): అన్ని ఉత్పత్తి కారకాల యొక్క ప్రయత్నాల ఫలితంగా ఏర్పడినదే మొత్తం ఉత్పత్తి.
2. సగటు ఉత్పత్తి (AP): మొత్తం ఉత్పత్తిని చర ఉత్పత్తి కారకాల పరిమాణంతో భాగిస్తే సగటు ఉత్పత్తి వస్తుంది. మరొక విధంగా చెప్పాలంటే ఒక యూనిట్ చర ఉత్పత్తి కారకం యొక్క మొత్తం ఉత్పత్తి.

   $AP = TP/N$ సగటు ఉత్పత్తి = మొత్తం ఉత్పత్తి/శ్రామికుల సంఖ్య
3. ఉపాంత ఉత్పత్తి (MP): అదనంగా ఒక చర ఉత్పత్తి కారకాన్ని ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగించడం ద్వారా మొత్తం ఉత్పత్తికి చేకూరిన అదనపు ఉత్పత్తిని ఉపాంత ఉత్పత్తి అంటారు. ఉత్పత్తిదారుడు చర ఉత్పత్తి కారకాలను అదనంగా ఉపయోగించినప్పుడు ఉపాంత ఉత్పత్తి ఉత్పన్నమవుతుంది.

   $MP = \Delta TP/\Delta N$ (or) $MP = TP_n - TP_{n-1}$

సూత్రం యొక్క వివరణ:

చర అనుపాతాల సూత్రం అర్థం చేసుకోవడానికి వ్యవసాయాన్ని ఉదాహరణగా తీసుకుందాం. ఉత్పత్తికి భూమి మరియు శ్రమ అను రెండు ఉత్పత్తి కారకాలు మాత్రమే ఉన్నాయి అనుకుందాం. ఉత్పత్తికి 10 ఎకరాల భూమి మరియు 1 యూనిట్ కార్మికుడు ఉన్నారనుకుంటే భూమి-శ్రమ నిష్పత్తి 10:1గా ఉంటుంది. భూమిని స్థిరంగా ఉంచి 1 యూనిట్ కార్మికుడిని పెంచితే అప్పుడు భూమి-శ్రమ నిష్పత్తి 5:1గా ఉంటుంది.

తద్వారా, ఉత్పత్తి పై కారకాల నిష్పత్తిలో మార్పు యొక్క ప్రభావాలను ఈ సూత్రం విశ్లేషించటాన్ని మనం గమనించవచ్చు. అందువల్ల దీనిని చరానుపాతాల సూత్రం అని పిలుస్తారు. భూమిని స్థిరంగా ఉంచి చర ఉత్పత్తి కారకమైన శ్రామికుల సంఖ్యను పెంచుతూ వెళ్తే ఉత్పత్తిలో ఏ విధంగా మార్పులు వస్తాయో మనం క్రింది పట్టిక సహాయంతో తెలుసుకోవచ్చు.

పట్టిక-1

భూమి యూనిట్లు	శ్రామికుల యూనిట్లు	మొత్తం ఉత్పత్తి (TP)	సగటు ఉత్పత్తి (AP)	ఉపాంత ఉత్పత్తి (MP)
10	1	20	20	20
10	2	50	25	30
10	3	90	30	40
10	4	120	30	30
10	5	140	28	20
10	6	150	25	10
10	7	150	21.3	0
10	8	140	17.5	-10

పట్టిక-1 ప్రకారం చరానుపాతాల సూత్రంలో మూడు దశలు ఉన్నాయని స్పష్టమవుతుంది.

మొదటి దశ: మొదటి దశలో స్థిర కారకం (భూమి)తో పనిచేసే కార్మికుల సంఖ్యను పెంచుతుండటం వల్ల సగటు ఉత్పత్తి పెరుగుతుంది. పట్టికలో మొత్తం ఉత్పత్తి, సగటు ఉత్పత్తి మరియు ఉపాంత ఉత్పత్తి పెరుగుదలను ఈ దశలో మనం చూస్తాము, అయితే సగటు ఉత్పత్తి మరియు ఉపాంత ఉత్పత్తి 40 యూనిట్ల వరకు పెరుగుతాయి. తరువాత, రెండూ తగ్గడం ప్రారంభించాయి ఎందుకంటే భూమి-కార్మికుల నిష్పత్తి సరిపోతుంది మరియు భూమి సరిగ్గా ఉపయోగించడం లేదు. ఇది మొదటి దశ ముగింపు.

రెండవ దశ: మొదటి దశ ఎక్కడ ముగుస్తుందో లేదా ఎక్కడైతే సగటు ఉత్పత్తి ఉపాంత ఉత్పత్తికి సమానమవుతుందో (AP=MP) అక్కడ నుండి రెండవ దశ ప్రారంభమవుతుంది. ఈ దశలో, సగటు ఉత్పత్తి మరియు ఉపాంత ఉత్పత్తి పడిపోవడం ప్రారంభమవుతుంది. ఉపాంత ఉత్పత్తి సగటు ఉత్పత్తి కంటే వేగవంతమైన రేటుతో పడిపోతుందని మనం గమనించాలి. ఇక్కడ, మొత్తం ఉత్పత్తి తగ్గుతున్న రేటుతో పెరుగుతుంది. ఇది 7 యూనిట్ల శ్రమ వద్ద గరిష్టంగా ఉంటుంది. అక్కడ ఉపాంత ఉత్పత్తి సున్నా అవుతుంది, అయితే సగటు ఉత్పత్తి ఎప్పుడూ కూడా సున్నా లేదా రుణాత్మకంగా ఉండదు.

మూడవ దశ: రెండవ దశ ముగిసే చోట మూడవ దశ ప్రారంభమవుతుంది. ఇది 8వ యూనిట్ నుండి ప్రారంభమవుతుంది. ఇక్కడ, ఉపాంత ఉత్పత్తి రుణాత్మకంగా ఉంటుంది మరియు మొత్తం ఉత్పత్తి తగ్గుతూ ఉంటుంది. కానీ సగటు ఉత్పత్తి ఇప్పటికీ ధనాత్మకంగా ఉంటుంది. ఈ దశలో, కార్మిక యూనిట్లలో ఏదైనా అదనపు పెరుగుదల రుణాత్మక ఉపాంత ఉత్పత్తికి దారి తీస్తుంది.

రేఖా చిత్ర వివరణ:

పటం-1లో, OX అక్షం మీద కార్మికుల సంఖ్యను, OY అక్షంపైన ఉత్పత్తి పరిమాణంను కొలమానంగానూ చూపబడింది. TP అనేది మొత్తం ఉత్పత్తి వక్రరేఖ. పాయింట్ 'E' వరకు, మొత్తం ఉత్పత్తి పెరుగుతున్న రేటుతో పెరుగుతోంది. E మరియు R పాయింట్ల మధ్య ఇది తగ్గుతున్న రేటుతో పెరుగుతోంది. ఇక్కడ ఉపాంత ఉత్పత్తి తగ్గడం ప్రారంభమైంది. మొత్తం ఉత్పత్తి 'M' పాయింట్ వద్ద అంటే, 7 యూనిట్ల కార్మికులు పనిచేసినప్పుడు, గరిష్టంగా ఉండగా, ఉపాంత ఉత్పత్తి శూన్యంగా ఉంటుంది. ఆ తర్వాత, రుణాత్మక ఉపాంత ఉత్పత్తికి అనుగుణంగా తగ్గడం ప్రారంభమవుతుంది. పటం యొక్క దిగువ భాగంలో ఉపాంత ఉత్పత్తి MP వక్రరేఖ ఉంటుంది.



Fig 1.

ఉపాంత ఉత్పత్తి 'H' పాయింట్ వరకు పెరుగుతుంది. పాయింట్ 'H' వద్ద, అంటే, 3 యూనిట్ల కార్మికులు పనిచేసినప్పుడు, ఇది గరిష్టంగా ఉంటుంది. ఆ తరువాత, ఉపాంత ఉత్పత్తి తగ్గడం ప్రారంభమవుతుంది. ఉపాంత ఉత్పత్తి పాయింట్ 'C' వద్ద శూన్యంగా ఉండి, తర్వాత అది రుణాత్మకంగా మారుతుంది. AP వక్రరేఖ సగటు ఉత్పత్తిని సూచిస్తుంది. పాయింట్ 'I' కి ముందు, సగటు ఉత్పత్తి ఉపాంత ఉత్పత్తి కంటే తక్కువగా ఉంటుంది. పాయింట్ 'I' వద్ద సగటు ఉత్పత్తి గరిష్టంగా ఉంటుంది. పాయింట్ 'I' వరకు, సగటు ఉత్పత్తి పెరుగుతుంది కానీ ఆ తర్వాత అది తగ్గిపోతుంది.

హేతుబద్ధంగా ఆలోచించే ఉత్పత్తి దారుడు ప్రతిఫలాలు వృద్ధి రేటులో ఉన్న మొదటి దశలో ఉత్పత్తిని ఆపడు. అలాగే ఋణ ప్రతిఫలాలు లభిస్తున్న మూడవ దశలోకి వెళ్ళి ఉత్పత్తిని చేయదు. అందువల్ల, మొత్తం ఉత్పత్తి గరిష్టమై, ఉపాంత ఉత్పత్తి శూన్యమైన రెండవ దశ చివరి లోపల ఉత్పత్తి జరుపుతూ సమతౌల్యంలో ఉంటాడు.

చర అనుపాతాల సూత్రం ప్రాధాన్యత మరియు అన్వయం:

చర అనుపాతాల సూత్రం ఏ ఉత్పత్తి శాఖలో నైనా సార్వత్రిక అన్వయతను కలిగి ఉంటుంది. ఇది ఆర్థిక శాస్త్రంలో అనేక సిద్ధాంతాలకు ఆధారం. వ్యవసాయంలో రాబడులు తగ్గుముఖం పట్టే ఈ సూత్రం కారణంగా జనాభా పెరుగుదల కంటే ఆహార సరఫరా వేగంగా పెరగదు అనే వాస్తవం నుండి మాల్థూసియన్ జనాభా సిద్ధాంతం ఏర్పడింది.

రికార్డో తన భాటక సిద్ధాంతాన్ని కూడా ఈ సూత్రం ఆధారంగా రూపొందించాడు. అతని ప్రకారం అదనపు యూనిట్ల శ్రమ మరియు మూలధనాన్ని భూమి పైన ఉపయోగించటం వలన క్షీణ ప్రతిఫలాల సూత్రం వర్తించటం వల్ల భాటకం ఉద్భవిస్తుంది. అదేవిధంగా క్షీణోపాంత ఉపాంత ప్రయోజన సూత్రం మరియు పంపిణీ సిద్ధాంతంలోని క్షీణోపాంత భౌతిక ఉత్పాదకత కూడా ఈ సిద్ధాంతంపై ఆధారపడి ఏర్పడినాయి.

ఈ సూత్రం ప్రాథమికంగా అభివృద్ధి చెందని దేశాల సమస్యలను అర్థం చేసుకోవడానికి ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఇటువంటి వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలలో జనాభా పెరుగుదలతో భూమిపై జనాభా ఒత్తిడి పెరుగుతుంది. ఇది శ్రామికుల యొక్క ఉపాంత ఉత్పాదకత క్షీణతకు లేదా సున్నా లేదా రుణాత్మకతకు దారితీస్తుంది. ఇది దాని సాంద్ర రూపంలో వెనుక బడిన దేశాలలో LDC చర అనుపాతాల సూత్రం యొక్క కార్యాచరణను వివరిస్తుంది. ఉపాంత ఉత్పాదకత సున్నా లేదా రుణాత్మకంగా ఉన్న నిరుద్యోగ శ్రామికులను వ్యవసాయ రంగం నుంచి ఉపసంహరించుకుని ఉపాంత ఉత్పాదకత ధనాత్మకంగా ఉన్న ఇతర రంగాలలో వారిని ఉపయోగించుకునే మార్గాలను చూడాలని రాగ్నార్ నర్క్స్ సూచించారు.

5.5 తరహానుసరించి ప్రతిఫలాల సూత్రం

ఇది దీర్ఘకాలానికి సంబందించిన విశ్లేషణ. అన్ని ఉత్పాదకాలను ఒకే నిష్పత్తిలో పెంచినప్పుడు దీర్ఘకాలంలో ఉత్పత్తి మరియు ఉత్పాదకాల తరహా మధ్య సంబంధాన్ని తరహానుసరించి ప్రతిఫలాల సూత్రం వివరిస్తుంది. డిమాండ్ లో దీర్ఘకాలిక మార్పులను తీర్చడానికి, ఎక్కువ స్థలం, ఎక్కువ యంత్రాలు మరియు కార్మికులను కర్మాగారంలో ఉపయోగించడం ద్వారా సంస్థ దాని ఉత్పత్తి స్థాయిని పెంచుతుంది.

ప్రమేయాలు:

1. ఉత్పత్తి కారకాలన్ని చర ఉత్పత్తి కారకాలే. అవి శ్రమ మరియు మూలధనం. ఇక్కడ ఉత్పత్తి కారకాలైన వ్యవస్థాపనని శ్రమలో భాగంగాను భూమిని మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని మూలధనంలో భాగంగాను పేర్కొనడం జరిగింది.
2. సాంకేతిక పరిజ్ఞానం స్థిరంగా ఉంటుంది.
3. సంపూర్ణ పోటీ మార్కెట్ ఉంటుంది.
4. ఉత్పత్తిని భౌతిక రూపంలో కొలువవచ్చును.
5. ఉత్పత్తి కారకాలన్నీ సజాతీయంగా ఉంటాయి.

నిర్వచనాలు: "ఉత్పత్తిలో మార్పులు మరియు ఉత్పత్తి యొక్క అన్ని కారకాలలో దామాషా మార్పుల మధ్య సంబంధాన్ని తరహానుసరించి ప్రతిఫలాల సూత్రం సూచిస్తుంది" బి. రోజర్ మిల్లర్.

లెబెన్ స్కీ ప్రకారం, "దీర్ఘ కాలంలో వైవిధ్యమైన ఉత్పాదకాల వల్ల మొత్తం ఉత్పత్తి ప్రవర్తనను తరహానుసరించి ప్రతిఫలాలు సూచిస్తాయి".

తరహానుసరించి ప్రతిఫలాల రకాలు: తరహానుసరించి మూడు రకాలుగా వర్గీకరించ బడ్డాయి. అవి, I.తరహానుసరించి పెరుగుతున్న లేదా వృద్ధి ప్రతిఫలాలు, II. తరహానుసరించి స్థిర ప్రతిఫలాలు, III.తరహానుసరించి తగ్గుతున్న లేదా క్షీణ ప్రతిఫలాలు.

తరహానుసరించి ప్రతిఫలాల సూత్రం యొక్క ప్రవర్తనను వివరించడానికి ఒక సంఖ్యాపరమైన ఉదాహరణను తీసుకుందాం.

పట్టిక-2 తరహా అనుసరించి ప్రతిఫలాలు

యూనిట్	**ఉత్పత్తి కారకాల తరహా మార్పు క్రమ సంఖ్య + భూమి (ఎకరాలు)**	**మొత్తం ఉత్పత్తి**	**ఉపాంత ఉత్పత్తి**	**ప్రతిఫలాలు**
1	**1 Labour + 2 Acres of Land**	**4**	**4**	Stage I తరహానుసరించి వృద్ధి ప్రతిఫలాలు
2	**2 Labour + 4 Acres of Land**	**10**	**6**	
3	**3 Labour + 6 Acres of Land**	**18**	**8**	
4	**4 Labour + 8 Acres of Land**	**28**	**10**	Stage II తరహానుసరించి స్థిర ప్రతిఫలాలు
5	**5 Labour + 10 Acres of Land**	**38**	**10**	
6	**6 Labour + 12 Acres of Land**	**48**	**10**	
7	**7 Labour + 14 Acres of Land**	**56**	**8**	Stage III తరహానుసరించి క్షీణ ప్రతిఫలాలు
8	**8 Labour + 16 Acres of Land**	**62**	**6**	

పట్టిక-2 యొక్క దత్తాంశమును పటం-2లో సూచించవచ్చు.

పటం-2లో, OX అక్షం ఉత్పత్తి స్థాయిని (శ్రమ మరియు భూమి పెరుగుదల) సూచిస్తుంది, అయితే OY అక్షం ఉపాంత రాబడిలో (ఉపాంత ఉత్పత్తి) పెరుగుదలను చూపుతుంది. ఎప్పుడైతే శ్రమ మరియు భూమిలను పెంచినప్పుడు, ఉత్పత్తి R నుండి P వరకు పెరుగుతుంది, ఇది కారకాల పెరుగుదల కంటే ఎక్కువగా ఉంది.

Figure 1



పటం-2, తరహా అనుసరించి ప్రతిఫలాలు సూత్రము- రేఖా చిత్రా వివరణ

RS = తరహానుసరించి ప్రతిఫలాల రేఖ

RP = సెగ్మెంట్, వృద్ధి ప్రతిఫలాలు

PQ = సెగ్మెంట్, స్థిర ప్రతిఫలాలు

QS = సెగ్మెంట్, క్షీణ ప్రతిఫలాలు

I. తరహానుసరించి వృద్ధి (పెరుగుతున్న) ప్రతిఫలాలు: పటం-2లో, మొదటి దశ వృద్ధి ప్రతిఫలాలను సూచిస్తుంది. ఈ దశలో, సంస్థ పరిమాణపు ఆదాలు, అవిభాజ్యత వల్ల లబించే ఆదాలు, ప్రత్యేకీకరణ యొక్క ఆదాలు, సాంకేతిక ఆదాలు, నిర్వాహణ మరియు మార్కెటింగ్ ఆదాలు వంటి వివిధ అంతర్గత మరియు బహిర్గత ఆదాలను అనుభవిస్తుంది. ఆదాలు అంటే కేవలం సంస్థలు పొందే ప్రయోజనాలు. ఈ ఆదాల కారణంగా, సంస్థ వృద్ధి ప్రతిఫలాలను పొందుతుంది. ఉత్పత్తి తరహా విస్తరణ మరియు కారక ఉద్యోగిత యూనిట్ యొక్క మెరుగైన నిర్వహణ ద్వారా సంస్థలో శ్రమ మరియు మూలధనం యొక్క "పెరిగిన సామర్థ్యం" పరంగా వృద్ధి ప్రతిఫలాలను మార్షల్ వివరిస్తాడు. ఇది ఉత్పత్తి యొక్క ప్రారంభ దశలలో ఒక సంస్థ యొక్క ఆదాలుగా పేర్కొనబడతాయి. వృద్ధి ప్రతిఫలాలకు గల కారణాలు:

1. యంత్రాలు, యాజమాన్యం, శ్రమ, విత్తం (Finance) మొదలైన వాటిలో అవిభాజ్యతలు ఉండవచ్చు. కొద్దిపాటి సామగ్రి లేదా కొన్ని కార్యకలాపాలలో ఇవి కనీస పరిమాణాన్ని కలిగి ఉంటాయి. ఇవి అంతకంటే చిన్న చిన్న యూనిట్లుగా విభజించబడవు.

2. వృద్ధి ప్రతిఫలాలు అనేవి ప్రత్యేకీకరణ మరియు శ్రామిక విభజన వల్ల కూడా వస్తాయి, సంస్థ తరహా పెరిగుతున్నప్పుడు, ప్రత్యేకీకరణ మరియు శ్రమ విభజన ఎక్కువ అవకాశం ఉంటుంది.

3. సంస్థ విస్తరిస్తున్న కొద్దీ ఉత్పత్తి యొక్క అంతర్గత ఆదాలను అనుభవిస్తుంది. మెరుగైన యంత్రాలను ఉపయోగించడం, సులభ వడ్డీలకే రుణాలను పొందడం, మరింత సమర్థవంతమైన యాజమాన్య నిర్వహణ పద్ధతులను అనుసరించడం మరియు కార్మికుల సేవలను పొందగలగడం, ఉత్పత్తులను మరింత సులభంగా విక్రయించగలడం వంటి సామర్థ్యాలను అలవరచుకుంటుంది.

II. తరహానుసరించి స్థిర ప్రతిఫలాలు: పటం-2లో, రెండవ దశ తరహానుసరించి స్థిర ప్రతిఫలాలను సూచిస్తుంది. ఈ దశలో, మొదటి దశలో ఏర్పడిన ఆదాలు అదృశ్యం కావడం మరియు నష్ట దాయకాలు తలెత్తడం ప్రారంభిస్తాయి. నష్ట దాయకాలు అనే పదం సంస్థ యొక్క విస్తరణను పరిమితం చేసే కారకాలను సూచిస్తుంది. ఒక సంస్థ ఒక నిర్దిష్ట స్తాయికి మించి విస్తరించినప్పుడు నష్ట దాయకాల ఆవిర్భావం సహజ ప్రక్రియ. రెండవ దశలో, తరహానుసరించి ఆదాలు మరియు తరహానుసరించి నష్ట దాయకాలు నిర్దిష్ట స్థాయి ఉత్పత్తిలో సరిగ్గా సమతుల్యతతో ఉంటాయి. ఒక సంస్థలో తరహా ననుసరించి స్థిర ప్రతిఫలాలను ఉన్నప్పుడు, ఉత్పత్తి కారకాలను పెంచిన అనుపాతంలోనే ఉత్పత్తి కూడా పెరుగుతుంది.

స్థిర ప్రతిఫలాలకు గల కారణాలు:

1. ఒక సంస్థ అనుభవిస్తున్న అంతర్గత ఆదాలు అంతర్గత నష్ట దాయకాల ద్వారా తటస్థీకరించబడినప్పుడు తరహా ననుసరించి ప్రతిఫలాలు మారవు, తద్వారా అదే నిష్పత్తిలో ఉత్పాదకత పెరుగుతుంది.

2. బహిర్గత ఆదాలు మరియు బహిర్గత నష్టదాయకాల మధ్య సమతుల్యత ఏర్పడటం మరొక కారణం.

3. ఉత్పత్తి కారకాలు సంపూర్ణంగా విభజించదగినవి, ప్రత్యామ్నాయం చేయదగినవి, ప్రమాణీకరించబడినవి మరియు వాటి సరఫరాలు ఇచ్చిన ధరల వద్ద సంపూర్ణ వ్యాకోచత్వము అయినప్పుడు తరహాననుసరించి స్థిర ప్రతిఫలాలు సంభవిస్తాయి.

అందువలననే తరహాననుసరించి స్థిర ప్రతిఫలాలో ఉత్పత్తి ఫలం, "ఏక ఘాత సజాతీయ ఉత్పత్తి ఫలం"గా ఉంటుంది.

III. తరహా ననుసరించి క్షీణ (తగ్గుతున్న) ప్రతిఫలాలు: పటం-2లో, మూడవ దశ తరహాననుసరించి క్షీణ ప్రతిఫలాలను సూచిస్తుంది. స్థిర ప్రతిఫలాల స్థాయి తరవాత కూడా సంస్థ తన కార్యకలాపాలను విస్తరించినప్పుడు ఈ పరిస్థితి తలెత్తుతుంది. క్షీణ ప్రతిఫలాలలు అంటే మొత్తం ఉత్పత్తిలో పెరుగుదల ఉత్పాదకాలలో పెరుగుదలకు అనుగుణంగా ఉండకపోవడం. దీని కారణంగా, ఉపాంత ఉత్పత్తి తగ్గడం ప్రారంభమవుతుంది (పట్టిక-2లో చూడండి). క్షీణ ప్రతిఫలాలను నిర్ణయించే ముఖ్యమైన కారకాలు నిర్వాహక అసమర్థత మరియు సాంకేతిక పరిమితులు. క్షీణ ప్రతిఫలాలకు గల కారణాలు:

1. అవిభాజ్య కారకాల పోటీతత్వలేమి మరియు తక్కువ ఉత్పాదకత కలవిగా మారడం.

2. సంస్థ అంతర్గత ఆర్థిక నష్ట దాయకాలను ఎదుర్కోవడం. వ్యాపార విస్తరణ వల్ల పర్యవేక్షణ మరియు సమన్వయ సమస్యలు ఏర్పడతాయి. నియంత్రణ మరియు దృఢత్వం యొక్క సంక్లిష్టతలను భారీ నిర్వహణ సృష్టిస్తుంది.

3. ఈ అంతర్గత నష్టదాయకాలకు, బహిర్గత నష్టదాయకాలు తోడవుతాయి. ఇవి అధిక కారకాల ధర లేదా కారకాల ఉత్పాదకత తగ్గడం నుండి సంభవిస్తాయి.

5.6 తరహాననుసరించి ఆదాలు

తరహాననుసరించి ఆదాలు అనేవి సంస్థలు వృద్ధి చెందుతున్నప్పుడు మరియు మరింత సమర్థవంతంగా మారినప్పుడు అవి అనుభవించే వ్యయ ప్రయోజనాలను సూచిస్తాయి. ఒక సంస్థ పరిమాణంలో పెరుగుతూ మరియు పెద్ద సంఖ్యలో వస్తువుల యూనిట్లలో ఉత్పత్తి వ్యయాన్ని విస్తరించగలిగినప్పుడు తరహాననుసరించి ఆదాలు లభిస్తాయి. పెద్ద తరహా ఉత్పత్తి వల్ల లభించే ఆదాలను మార్షల్ అంతర్గత ఆదాలు మరియు బహిర్గత ఆదాలుగా వర్గీకరించారు.

ఎ) అంతర్గత ఆదాలు-కారణాలు మరియు రకాలు

ఉత్పత్తి ఖర్చులు తగ్గి మరియు ఉత్పత్తి పెరిగినప్పుడు అంతర్గత ఆదాలు సంస్థలకు అంతర్గతంగా ఉంటాయి. ఇవి "ఇతర సంస్థల కార్యకలాపాలతో సంబంధం లేకుండా ఒకే కర్మాగారానికి లేదా ఒకే సంస్థకు లభిస్తాయి. అవి సంస్థ యొక్క ఉత్పత్తి తరహా పెరుగుదల ఫలితంగా ఏర్పడతాయి మరియు ఉత్పత్తి పెరిగితే తప్ప వాటిని సాధించలేము. ఈ ఆదాలు ఒక చిన్న సంస్థ విలువైనదిగా భావించని తెలిసిన ఉత్పత్తి పద్ధతులను ఉపయోగించడం వల్ల లభిస్తాయి కానీ ఇవి ఏ రకమైన ఆవిష్కరణల ఫలితం కాదు".

కారణాలు - అంతర్గత ఆదాలు సంబందిత సంస్థలు విస్తరిస్తున్నప్పుడు ఉద్భవిస్తాయి మరియు క్రింద చర్చించబడిన రెండు కారకాల వల్ల ఏర్పడతాయి. అవి (1) అవిభాజ్యతలు, (2) ప్రత్యేకీకరణ.

1. అవిభాజ్యతలు- చాలా ఉత్పత్తి కారకాలు స్థిర నిష్పత్తిలో ఉండటం వల్ల వాటిని నిర్ణీత కనిష్ట పరిమాణంలో ఉపయోగించవలసి ఉంటుంది. ఇటువంటి "ఉత్పత్తి కారకాలు చాలా పెద్ద ఎత్తున ఉత్పత్తి జరుగుతున్నప్పుడు అత్యంత సమర్ధవంతంగా ఉపయోగించబడతాయి, కానీ చిన్న స్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నప్పుడు తక్కువ సమర్ధవంతంగా పని చేస్తాయి ఎందుకంటే ఆ కారకాలను చిన్న యూనిట్‌లుగా విభజించలేము." ఈ విధంగా విడదీయరాని కారకాలు ఉత్పత్తి పెరిగే కొద్దీ, అప్పటివరకూ వాటి సామర్థ్యం కంటే తక్కువగా ఉపయోగించబడుతున్న పూర్తి సామర్థ్యం మేరకు ఉపయోగించబడతాయి, తద్వారా ఖర్చులు తగ్గుతాయి. ఈ విధమైన అవిభాజ్యతలు కార్మికులు, యంత్రాలు, మార్కెటింగ్, ఫైనాన్స్ మరియు పరిశోధనల విషయంలో కూడా తలెత్తుతాయి.

2. ప్రత్యేకీకరణ - శ్రమ విభజన ప్రత్యేకీకరణకు దోహదపడి అంతర్గత ఆదాలు ఏర్పడటానికి మరొక కారణం అవుతాయి. ఒక సంస్థ పరిమాణంలో విస్తరించినప్పుడు, దాని ఉత్పత్తి పెరగడమే కాకుండా, ఉత్పాదకాల మొత్తం మరియు కార్మికుల సంఖ్య కూడా పెరుగుతుంది. ఎక్కువ సామర్థ్యం కోసం ఉత్పత్తి ప్రక్రియలను, ఉప ప్రక్రియలుగా విభజించడం ద్వారా, ప్రతి కార్మికుడికి ఒక నిర్దిష్ట పనిని కేటాయించటానికి శ్రమ విభజన అవసరం.

అంతర్గత ఆదాల రకాలు

1. **సాంకేతిక ఆదాలు:** మంచి పరికరాలు మరియు సాంకేతిక ఉత్పత్తి పద్ధతులను ఉపయోగించడం వల్ల లబించేవి సాంకేతిక ఆదాలు. పర్యవసానంగా ఉత్పత్తి పెరుగుతుంది మరియు యూనిట్ తయారీ వ్యయం తగ్గుతుంది. వీటిని మరలా ఐదు వర్గాలుగా విభజించారు. అవి ఉన్నత సాంకేతికతలు, పరిమాణంలో మార్పు వల్ల లభించే ఆదాలు, ఉత్పత్తి ప్రక్రియలను లింక్ చేయడం వల్ల లభించే ఆదాలు, ఉప ఉత్పత్తుల ద్వారా లభించే ఆదాలు మరియు ప్రత్యేకీకరణ వల్ల లభించే ఆదాలు.

2. **మార్కెటింగ్ ఆదాలు:** మార్కెట్‌లను పరిగణలోకి తీసుకుంటే అవి భారీ వ్యాపార ఆదాలను అందిస్తాయి.. ఈ సంస్థలు వీటికి అవసరమైన ముడి పదార్థాలను పెద్దమొత్తంలో ఒకేసారి కొనుగోలు చేస్తాయి మరియు అందువల్ల మెరుగైన నాణ్యత గల ఉత్పాదకాలను, తక్షణ డెలివరీ, రవాణా రాయితీలు మొదలగు నిర్మాణాత్మక నిబంధనలను రూపొందించుకుని సురక్షితంగా ఉండగకూగుతాయి.

3. **యాజమాన్య పరమైన ఆదాలు:** వివిధ విభాగాలను పర్యవేక్షించడానికి మరియు నియంత్రించడానికి నిపుణులను నియమించడం ద్వారా యాజమాన్యపరమైన ఆదాలు లభిస్తాయి. తయారీ, అసెంబ్లింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ మరియు సాధారణ పరిపాలన మొదలైన వాటికి ప్రత్యేక నిపుణులైన అధిపతులను నియమించవచ్చు. ఇది విధుల పరంగా ఉత్పాదక సామర్థ్య పెంపుదలకు మార్గ నిర్దేశం చేస్తుంది.

4. **విత్త పరమైన ఆదాలు:** తరహాను పెంచుకున్న పెద్ద సంస్థలు పెద్ద మొత్తంలో ఆస్తులను మరియు మార్కెట్లో మంచి గుర్తింపు, పలుకుబడితో మంచిపేరును కలిగి ఉంటాయి. కావున మార్కెట్ నుండి సులభంగా అవి తక్కువ వడ్డీకే రుణాలను పొందగలుగుతాయి. అంతేకాకుండా షేర్లు, డిబెంచర్ల ద్వారా పెద్ద మొత్తంలో పెట్టుబడులను సులభంగా తక్కువ వ్యయంతో సమీకరించుకోగలుగుతాయి.

5. **నష్టభయ ఆదాలు:** తరహాను పెంచుకున్న పెద్ద సంస్థలు చిన్న సంస్థలు ఎదుర్కొలేని వ్యాపారంలో సంభవించే పలు రకాలైన నష్టభయాలను సులభంగా ఎదుర్కోగలుగుతాయి. ఎందుకంటే పెద్ద సంస్థలు అనేక రకాల ఉత్పత్తులను చేపడతాయి. ఒక ఉత్పత్తిలో నష్టం వస్తే, ఇతర ఉత్పత్తులలో వచ్చే లాభాలతో, ఆ నష్టాన్ని భర్తీ చేసుకొని మార్కెట్లో మనగలుగుతాయి.

6. **పరిశోధన ఆదాలు:** తరహాను పెంచుకున్న పెద్ద సంస్థలు, చిన్న సంస్థల కంటే పెద్ద ఎత్తున వనరులను కలిగి ఉండి, స్వంత పరిశోధనా ప్రయోగశాలను మరియు శిక్షణ పొందిన పరిశోధకులను నియమించుకుంటాయి. వారు కొత్త ఉత్పత్తి సాంకేతికతలను లేదా పురోగతులను కనిపెట్టినప్పుడు అవి ఆ సంస్థ యొక్క ఆస్తిగా మారుతుంది. వీటిని ఆ సంస్థ దాని ఉత్పత్తిని పెంచడానికి మరియు ఖర్చులను తగ్గించడానికి వాటిని ఉపయోగించుకుంటుంది.

బి) బహిర్గత ఆదాలు

పరిశ్రమల తరహా విస్తరించినప్పుడు, ఆ పరిశ్రమలోని సంస్థలన్నిటి ఉత్పత్తి పెరిగి లభించే ఆదాలను బహిర్గత ఆదాలు అంటారు. "ఏదైనా పరిశ్రమ లేదా గ్రూప్ లేదా పరిశ్రమలు ఉత్పత్తి తరహా పెరుదుతున్నప్పుడు ఈ ఆదాలలో పరిశ్రమలోని అన్ని సంస్థలకు తగు వాటా లభిస్తుంది. పరిమాణం పెరిగుతున్నప్పుడు, ఇవి ఒకే గుత్తాదిపత్య సంస్థకు లబించవు, కానీ వృద్ధి చెందుతున్నప్పుడు ఇతర సంస్థలకు కూడా లభిస్తాయి.

పరిశ్రమ పరిమాణం విస్తరిస్తున్నందున బహిర్గత ఆదాలు పరిశ్రమలోని అన్ని సంస్థలకు లాభాలను అందిస్తాయి. ఆవిష్కరణలు మరియు ప్రత్యేకీకారణాలను అభివృద్ధి చేసి పరిశ్రమ ఒక నిర్దిష్ట ప్రాంతంలో స్థానికీకరించ బడినప్పుడు ఇటువంటి ఆదాలు ఉత్పన్నమవుతాయి.

బహిర్గత ఆదాల రకాలు

1. **కేంద్రీకృత ఆదాలు:** ఒక పరిశ్రమ నిర్దిష్ట ప్రాంతంలో కేంద్రీకరించబడినప్పుడు సంస్తలన్నింటికి ఈ విస్తృత ఆదాలు ఉత్పన్నమవుతాయి. నైపుణ్యం కలిగిన కార్మికులు అన్ని సంస్థలకు అందుబాటులో ఉన్నారు. రవాణా మరియు సమాచార మార్గాలు గణనీయంగా మెరుగుపడతాయి. మరిన్ని వ్యాగన్లు, లోడ్ చేయడం మరియు ఖాళీ చేయడం మొదలైన అదనపు సౌకర్యాల కోసం పరిశ్రమ రైల్వే నిర్వాహకులను అడగవచ్చు.

2. **సమాచార ఆదాలు:** ఒక పరిశ్రమ పెద్ద ఎత్తున వనరులను సమీకరించగల సామర్థ్యాన్ని కలిగి ఉండి, పరిశోధనా ప్రయోగశాలలను స్థాపించగలిగే మంచి స్థితిలో ఉంటుంది. ఇది అధిక జీతం మరియు అనుభవజ్ఞులైన పరిశోధనా సిబ్బందిని నియమించగలదు. ఆ నూతన ఆవిష్కరణలను శాస్త్రీయ పత్రిక ద్వారా సంస్థాలన్నింటికి అందించి వారి ఫలాలను అందరికీ అందిస్తాయి.

3. **శ్రేయస్సుకు సంబంధించిన ఆదాలు:** పరిశ్రమ మరింత ప్రయోజనకరమైన స్థితిలో ఉండి కార్మికులకు సంక్షేమ సౌకర్యాలు కల్పించడానికి సంబంధించినదవి ఈ ఆదాలు. కార్మికులకు హౌసింగ్ కాలనీలు ఏర్పాటు చేయడానికి రాయితీ ధరల వద్ద భూమిని పొందవచ్చు మరియు ప్రజారోగ్యం మరియు వినోద సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి ఆ ప్రాంతంలోని మున్సిపల్ కార్పొరేషన్ నుండి సౌకర్యాలను పొందవచ్చు.

4. **ప్రత్యేకీకరణ ఆదాలు పరిశ్రమ ప్రత్యేకీకరణ** వలస కూడా ఆదాలను ఉత్పన్నం చేయవచ్చు. పరిశ్రమ పరిమాణం పెరుగుతున్నప్పుడు, ఉత్పత్తి వివిధ ప్రక్రియలలో ప్రత్యేకీకరణ చేపట్టడంతో మొత్తం పరిశ్రమలోని సంస్తలన్నింటికి ప్రయోజనాలను పొందుతాయి.

5. **అవస్థాపన ఆదాలు:** పరిశ్రమలోని అన్ని సంస్థలు ఒకే చోట కేంద్రీకృతమై ఉన్నప్పుడు, రవాణా, బ్యాంకింగ్, బీమా, సమాచారం, విద్యుత్ మొదలైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం అందిస్తుంది, కొన్ని సందర్భాల్లో ప్రైవేట్ సంస్థలు కూడా ఈ మౌలిక సదుపాయాలను అందించగలవు. అన్నింటినీ ఒకే చోట కలిగి ఉండటం వలన ఈ ప్రదేశంలో సంబంధిత పరిశ్రమలకు చెందిన సంస్థలకు ఈ సౌకర్యాలకు సంబంధించిన ఖర్చులు తగ్గుతాయి.

5.7 సారాంశం

ఉత్పాదకాలను అంతిమ వస్తువులుగా మార్చే ప్రక్రియను ఉత్పత్తి అంటారు. ఉత్పత్తి కారకాలకు, ఉత్పత్తికి మధ్య గల సంబంధాన్ని తెలిపే దానిని ఉత్పత్తి ఫలం అంటారు. స్వల్ప కాలంలో ఇతర ఉత్పత్తి కారణాలను స్థిరంగా ఉంచి, ఒక్క కారకాన్ని మాత్రమే పెంచినప్పుడు మొత్తం ఉత్పత్తి ఏ విధంగా పెరుగుతుందో చరానుపాతాల మాత్రం తెలియజేస్తుంది. దీర్ఘకాలంలో అన్ని ఉత్పత్తి కారకాలను ఒకే అనుపాతంలో పెంచినప్పుడు, ఉత్పత్తి ఏ అనుపాతంలో పెరుగుతుందో తరహానుసరించి ప్రతిఫలాల సూత్రం తెలియజేస్తుంది. తరహానుసరించి ఆదాలు అనేవి సంస్థలు అభివృద్ధి చెందుతున్నప్పుడు మరియు మరింత సమర్థవంతంగా మారినప్పుడు అవి అనుభవించే వ్యయ ప్రయోజనాలను సూచిస్తాయి. పెద్ద తరహా ఉత్పత్తి వల్ల లభించే ఆదాలను మార్షల్ అంతర్గత ఆదాలు మరియు బహిర్గత ఆదాలుగా వర్గీకరించాడు.

5.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ఉత్పత్తి కారకాలు ఏమిటి?
2. తరహానుసరించి స్థిర ప్రతిఫలాలను నీవు ఏ విధంగా అర్థం చేసుకునావు?
3. ఉత్పత్తి ఫలం అంటే ఏమిటి?

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. అంతర్గత ఆదాలు అంటే ఏమిటి?
2. భూమి యొక్క లక్షణాల గురించి వ్రాయండి.
3. దీర్ఘకాలిక ఉత్పత్తి ఫలాన్ని నీవు ఏ విధంగా అర్థం చేసుకునావు?

III. క్రింది ప్రశ్నలకు 10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. తగిన రేఖాచిత్రంతో చరానుపాతాల సూత్రమును గురించి వ్రాయండి.
2. తరహా ననుసరించి ఆదాలను చర్చించండి.
3. తరహానుసరించి ప్రతిఫలాల సూత్రం గురించి క్షుణ్ణంగా వివరించండి.

5.10 పదకోశం

1. ఉత్పత్తి: ముడిపదార్థాలకు ప్రయోజనాన్ని కల్పించి, వాటిని అంతిమ వినియోగ వస్తువులుగా మార్చే ప్రక్రియను ఉత్పత్తి అంటారు.

2. ఉత్పత్తి కారకాలు: ఉత్పత్తి కారకాలను ఉపయోగించుకుని ముడి పదార్థాలకు ప్రయోజనం చేకూర్చి అంతిమ వస్తువులుగా మార్పు చేసే ప్రక్రియనే ఉత్పత్తి అంటారు. ఈ కారకాలు ప్రకృతి సిద్ధంగా లేదా మానవులు తయారు చేయడం ద్వారా లభిస్తాయి. అవి: భూమి, శ్రమ, మూలధన మరియు వ్యవస్థాపన.

3. ఉత్పత్తి ఫలం: ఉత్పత్తి ఫలం అనేది ఉత్పాదకాలకు, ఉత్పత్తికి మధ్య క్రియాత్మక సంబంధాన్ని సూచిస్తుంది. ఇవ్వబడిన ఉత్పాదకాలు, నిర్ణీత కాలం మరియు సాంకేతికతలతో ఉత్పత్తి చేయగల వస్తువు యొక్క గరిష్ట పరిమాణాన్ని ఉత్పత్తి ఫలం నిర్దేశిస్తుంది

4. చరామపాతాల సూత్రం: స్వల్పకాలంలో ఇతర ఉత్పత్తి కారణాలను స్థిరంగా ఉంచి, ఏదేనీ ఒక చర ఉత్పత్తి కారకాన్ని పెంచుతూ పోతే, మొత్తం ఉత్పత్తి ఏవిధంగా పెరుగుతుందో తెలిపేదే చరానుపాతాల సూత్రం. ఈ సూత్రం ప్రకారం, ఇతర కారకాలను స్థిరంగా ఉంకి ఒక్ ఉత్పత్తి కారకాన్ని పెంచితే ఉపాంత ఉత్పత్తి క్షీణిస్తూ ఉంటుంది.

5. మొత్తం ఉత్పత్తి: ఒక నిర్ణీత కాలంలో ఉత్పత్తి కారకాలన్నీ కలిసి చేసిన ఉత్పత్తిని మొత్తం ఉత్పత్తి అంటారు. ఉత్పత్తి కారకం వివిధ యూనిట్ల వద్ద ఉన్న ఉపాంత ఉత్పత్తులన్నింటిని కలిపితే మొత్తం ఉత్పత్తి వస్తుంది.

6. సగటు ఉత్పత్తి: మొత్తం ఉత్పత్తిని శ్రామికుల సంఖ్యచేత భాగిస్తే సగటు ఉత్పత్తి వస్తుంది. మరొక విధంగా చెప్పాలంటే సగటున ఒక్కొక్క యూనిట్ చర ఉత్పత్తి కారకం ద్వారా జరిగే మొత్తం ఉత్పత్తి.

7. ఉపాంత ఉత్పత్తి: అదనంగా ఒకచర ఉత్పత్తి కారకాన్ని నియమించటం ద్వారా మొత్తం ఉత్పత్తిలో జరిగే అదనపు ఉత్పత్తిని ఉపాంత ఉత్పత్తి అంటారు. మొత్తం ఉత్పత్తిలో వచ్చిన మార్పును, చర ఉత్పత్తి కారకంలో వచ్చిన మార్పుతో భాగిస్తే ఉపాంత ఉత్పత్తి లభిస్తుంది.

8. తరహానుసరించి ప్రతిఫలాలు: ఇది దీర్ఘకాలానికి సంబందించిన విశ్లేషణ. దీర్ఘకాలంలో అన్ని ఉత్పత్తి కారకాలను ఒకే అనుపాతంలో మార్చినప్పుడు ఉత్పత్తిలో వచ్చే మార్పులను తెలిపే దానిని తరహానుసరించి ప్రతిఫలాలు అంటారు.

9. అంతర్గత ఆదాలు: ఒక సంస్థ యొక్క తరహా పెరిగినప్పుడు లేదా పెద్దఎత్తున ఉత్పత్తిని చేపట్టినప్పుడు ఆసంస్థకు మాత్రమే లభించే ఆదాలను అంతర్గత ఆదాలు అంటారు. ప్రాథమికంగా, అంతర్గత ఆదాలు ప్రతి సంస్థకు ప్రత్యేకంగా లభిస్తాయి. ఉదాహరణకు, ఒక సంస్థ మంచి నిర్వహణ యొక్క ప్రయోజనాన్ని పొందుతుంది. మరొకటి ఉత్పత్తి యొక్క సాంకేతికతలలో ప్రత్యేకత యొక్క ప్రయోజనాన్ని కలిగి ఉండవచ్చు.

10. బహిర్గత ఆదాలు: పరిశ్రమల తరహా విస్తరించినప్పుడు, ఆ పరిశ్రమలోని సంస్థలన్నిటి ఉత్పత్తి పెరిగి లభించే ఆదాలను బహిర్గత ఆదాలు అంటారు. "ఏదైనా పరిశ్రమ లేదా గ్రూప్ లేదా పరిశ్రమలు ఉత్పత్తి తరహా పెరుదుతున్నప్పుడు ఈ ఆదాలలో పరిశ్రమలోని అన్ని సంస్థలకు తగు వాటా లభిస్తుంది. పరిమాణం పెరిగుతున్నప్పుడు,ఇవి ఒకే గుత్తాదిపత్య సంస్థకు లబించవు, కానీ వృద్ధి చెందుతున్నప్పుడు ఇతర సంస్థలకు కూడా లభిస్తాయి.

5.11 ఉపయుక్త గ్రంధాలు

1. Advanced Economic Theory - HL Ahuja
2. Modern Micro Economics - HL Ahuja

అధ్యాయం

6

సప్లయ్, వ్యయం మరియు రాబడి విశ్లేషణ

6.1 పరిచయం

6.2 సప్లయ్ అర్థం

6.3 సప్లయ్ ఫలం

6.3.1 సప్లయ్‌ని నిర్ణయించే అంశాలు

6.3.2 సప్లయ్ సూత్రం

6.3.3 సప్లయ్ పట్టిక

6.3.4 సప్లయ్ రేఖ

6.3.5 సప్లయ్‌లో పెరుగుదల,తగ్గుదల

6.4. వ్యయ విశ్లేషణ

6.4.1 వ్యయాల రకాలు

6.4.2 స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యయాలు

6.4.3 స్వల్పకాలిక వ్యయాలు – వ్యయరేఖల స్వభావం

6.4.4 సగటు వ్యయం,ఉపాంత వ్యయం మధ్య సంబంధం

6.5 రాబడి విశ్లేషణ

6.5.1 రాబడి భావనలు

6.5.2 సంపూర్ణ పోటీలో సగటు రాబడి, ఉపాంత రాబడి రేఖలు

6.6 సారాంశం

6.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

6.8 పారిభాషిక పదకోశం

6.9 ఉపయుక్త గ్రంథాలు

6.0 అభ్యసన ఫలితాలు

- సప్లయ్ గురించి వివరిస్తారు.
- సప్లయ్‌ని నిర్ణయించే అంశాలను వర్గీకరిస్తారు.
- సప్లయ్‌లో వచ్చే పెరుగుదల, తగ్గుదలను వివరిస్తారు.
- వ్యయాలలో రకాలను వర్గీకరిస్తారు.
- స్వల్పకాలిక వ్యయాలు – వ్యయరేఖల స్వభావం గురించి వివరిస్తారు.
- రాబడి రకాలను వర్గీకరిస్తారు.

6.1 పరిచయం

ధర ఉత్పత్తి వ్యయాలలో మార్పు కారణంగా మార్కెట్‌లో అమ్మడానికి సిద్ధంగా ఉండే వస్తుపరిమాణాన్ని సూచించడానికి సప్లయ్ అనే పదాన్ని వాడతారు. విభిన్న ధరల వద్ద మార్కెట్‌లో అమ్మడానికి సిద్ధంగా ఉండే వస్తు పరిమాణం హేతుబద్ధ సప్లయ్‌దారుల ప్రవర్తనను తెలియజేస్తుంది. ఒక వస్తువు సప్లయ్, మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అ వస్తువు పరిమాణాన్ని సూచిస్తుంది. వస్తువులను ఉత్పత్తి చేయడానికి సంస్థలు ఉత్పత్తి కారకాలను ఉపయోగిస్తాయి. ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగించే ఉత్పత్తి కారకాలకు చెల్లించే ప్రతిఫలాలైన వేతనాలు, జీతాలు మొదలైనవి ఉత్పత్తి వ్యయం అవుతుంది.

వివిధ ధరలకు ఒక సంస్థ కొంత పరిమాణంలో వస్తువులను అమ్మితే పొందిన ఆదాయాన్ని రాబడిగా పరిగణిస్తాము. కాబట్టి ఉత్పత్తి వ్యయాలతోపాటు సంస్థల రాబడులను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ యూనిట్‌లో మనం సప్లయ్, వ్యయం మరియు రాబడి విశ్లేషణ తెలుసుకుందాం.

6.2 సప్లయ్ అర్థం

ఒక నిర్ణీత ధర వద్ద నిర్ణీత సమయంలో ఒక ఉత్పత్తిదారుడు అమ్మకానికి సిద్ధంగా ఉన్న వస్తు పరిమాణాన్ని ఆ వస్తువు సప్లయ్ అంటారు. సప్లయ్‌కి నిల్వకు (Stock) గల తేడా మనం గుర్తుంచుకోవాలి. నిలువ (Stock) అనగా సంస్థ ఉత్పత్తి చేసిన వస్తువులను గిడ్డంగులలో నిల్వ చేయడం. సంస్థ ఒక నిర్ణీత ధర వద్ద నిల్వలో ఎంత భాగాన్ని మార్కెట్లో అమ్మకానికి ఉంచుతుందో దానిని సప్లయ్ అంటారు.

6.3 సప్లయ్ ఫలం

ఒక వస్తువు సప్లయ్‌ని నిర్ణయించే అంశాలకు ఆ వస్తువు సప్లయ్‌కి మధ్య ఉన్న సంబంధం గురించి సప్లయ్ ఫలం వివరిస్తుంది. వస్తువు సప్లయ్‌ని ఆ వస్తువు ధర, ప్రత్యామ్నాయ, పూరక వస్తువుల ధరలు, ఉత్పత్తి కారకాల ధరలు, సాంకేతిక అభివృద్ధి స్థాయి, ఉత్పత్తిదారుని లక్ష్యాలు, ప్రభుత్వ విధానాలు మొదలైన అంశాలు నిర్ణయిస్తాయి. సప్లయ్ ఫలాన్ని క్రింది సమీకరణం ద్వారా తెలుపవచ్చు.

$S_x=f(P_x, P_t, P_f, T, G_f, G_p)$

S_x=X వస్తువు సప్లయ్, P_x=X వస్తువు ధర, P_t= X వస్తువుతో సంబంధమున్న ఇతర వస్తువుల ధరలు, P_f=ఉత్పత్తి కారకాల ధరలు, T=సాంకేతికత స్థాయి, G_f=సంస్థ లక్ష్యాలు, G_p=ప్రభుత్వ విధానాలు.

పైన చూపిన సప్లయ్ ఫలంలో వస్తువు సప్లయ్ అనేక అంశాలపై ఆధారపడే చలాంకం. P_x,P_t,P_f,T,G_f,Gp అనేవి స్వతంత్ర చలాంకాలు. ఈ అంశాలలో ఏ ఒక్క దానిలో మార్పు వచ్చినా సప్లయ్‌లో మార్పులు వస్తాయి.సప్లయ్‌ని నిర్ణయించడంలో అన్నిటికంటే ప్రధానమైన అంశం ధర. అందువల్ల మిగతా అన్ని అంశాలు స్థిరంగా ఉంటే సప్లయ్ ఫలం ఈ విధంగా ఉంటుంది. $S_X=f(Px)$

6.3.1 సప్లయ్‌ని నిర్ణయించే అంశాలు

వస్తు సప్లయ్‌ని నిర్ణయించే అంశాల గురించి తెలుసుకుందాము.

1. వస్తువు ధర: ఇతర అంశాలలో మార్పు లేనంతవరకు ఒక వస్తువు ధర పెరిగితే దాని సప్లయ్ పెరుగుతుంది. వస్తువు ధర తగ్గితే సప్లయ్ తగ్గుతుంది. అంటే ధరకు, సప్లయ్‌కి ప్రత్యక్ష సంబంధం ఉంటుంది.

2. ఇతర వస్తువుల ధరలు (ప్రత్యామ్నాయ, పూరక వస్తువుల ధరలు): ఒక వస్తువు సప్లయ్ అ వస్తువు ధరపైనే కాకుండా ఇతర వస్తువుల ధరలు (ప్రత్యామ్నాయ, పూరక వస్తువుల ధరలు)పై ఆధారపడుతుంది. ఇతర వస్తువుల ధరలు ఎక్కువగా ఉంటే వాటిని ఉత్పత్తి చేయడానికి ఉత్పత్తిదారులు ఇష్టపడతారు. కాబట్టి ఒక వస్తువు ధర నిలకడగా ఉన్నప్పటికీ ఇతర వస్తువుల ధరల్లో మార్పు వస్తే దాని సప్లయ్‌లో కూడా మార్పు వస్తుంది.

3. ఉత్పత్తి కారకాల ధరలు: ఉత్పత్తి కారకాలకు అయ్యే వ్యయాన్ని బట్టి కూడా వస్తు సప్లయ్‌లో మార్పు వస్తుంది. ఉత్పత్తి కారకాల ధరలు పెరిగితే ఉత్పత్తి చేసే వస్తువు వ్యయం పెరుగుతుంది. అందువల్ల ఉత్పత్తి తగ్గి సప్లయ్ తగ్గుతుంది. ఉత్పత్తి కారకాల ధరలు తగ్గితే సప్లై పెరుగుతుంది.

4. ఉత్పత్తిదారుని లక్ష్యాలు: ఉత్పత్తిదారుడు గరిష్ఠ లాభాలను అర్జించాలనుకొన్నప్పుడు వస్తువులను తక్కువ స్థాయిలో ఉత్పత్తి చేసి లాభాలను అర్జిస్తాడు. అలా కాకుండా లాభాలకన్నా అమ్మకాలను పెంచుకోవాలనుకొన్నప్పుడు సప్లయ్‌ని పెంచుతాడు.

5. సాంకేతిక పరిజ్ఞానం స్థాయి: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుదల వల్ల కొత్త యంత్రాల అష్టి వల్ల ఉత్పత్తి పద్ధతుల్లో మార్పులు వస్తాయి. ఫలితంగా ఉత్పత్తి వ్యయంతగ్గి సప్లయ్ పెరుగుతుంది. అందుకే సాంకేతిక పరిజ్ఞానంలో మార్పుల వల్ల వస్తు సప్లయ్‌లో మార్పులు వస్తాయి.

6. ప్రభుత్వ విధానాలు: ప్రభుత్వం వస్తువులపై అధిక పన్నులను విధిస్తే అది వస్తువుల ఉత్పత్తిని నిరుత్సాహ పరుస్తుంది. ఫలితంగా వస్తువుల సప్లయ్ తగ్గుతుంది. ప్రభుత్వం తక్కువ పన్నులు విధించడంతో పాటు రాయితీలను ఇస్తే వస్తువుల సప్లయ్ పెరుగుతుంది.

6.3.2 సప్లయ్ సూత్రం

సప్లయ్ సూత్రం ఒక వస్తువు ధరకు ఆ వస్తువు సప్లయ్ పరిమాణానికి మధ్య గల సంబంధాన్ని తెలుపుతుంది. ఇతర అంశాలలో మార్పు లేనప్పుడు వస్తువు ధర పెరిగితే దాని సప్లయ్ పెరుగుతుంది.వస్తువు ధర తగ్గితే దాని సప్లయ్ తగ్గుతుంది. అంటే ధరకు,సప్లయ్ కు మధ్య ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. సప్లయ్ సూత్రాన్ని సప్లయ్ పట్టిక, సప్లయ్ రేఖ ద్వారా తెలుసుకుంటారు.

6.3.3 సప్లయ్ పట్టిక

వివిధ ధరల వద్ద ఎంత పరిమాణంలో వస్తురాశి మార్కెట్లో అమ్మటానికి సిద్ధంగా ఉందో తెలియజేసే పట్టికను సప్లయ్ పట్టిక అంటారు.

పట్టిక-1: వివిధ ధరల వద్ద వస్తువు సప్లయ్

వస్తువు ధర (రూ.లలో) P	వస్తువు సప్లయ్ (యూనిట్లలో) Q
10	500
20	600
30	700
40	800
50	900

పైన చూపిన సప్లై పట్టిక వస్తువు ధరకు వస్తువు సప్లయ్‌కి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని చూపిస్తుంది. వస్తువు ధర 10 రూపాయలు ఉన్నప్పుడు సప్లయ్ 500 యూనిట్లుగా ఉంది. వస్తువు ధర 20 రూపాయలకు పెరిగితేసప్లయ్ పరిమాణం 600 యూనిట్లకు పెరిగింది.పట్టికలోని సమాచారాన్ని గమనించినట్లైతే ధర పెరిగిన కొద్దీ వస్తువుల సప్లయ్ పెరుగుతున్నట్లుగా మనకు అర్థమవుతుంది. ధరలు తగ్గితే సప్లయ్ పరిమాణం తగ్గుతుంది.

6.3.4 సప్లయ్ రేఖ



పటం–6.1: సప్లయ్ రేఖ

పై పటంలో X-అక్షంపై వస్తువు సప్లయ్‌ను Y-అక్షంపై వస్తువు ధరను కొలుస్తాం. ధరకు సప్లయ్‌కి మధ్య ధనాత్మక సంబంధం ఉంది. కాబట్టి సప్లయ్ రేఖ ఎడమ నుంచి కుడికి పైకి వాలుతుంది. అంటే ధర పెరిగితేఅధిక వస్తు పరిమాణానాన్ని,ధర తగ్గితే తక్కువ వస్తు పరిమాణానాన్ని కొనుగోలు చేస్తున్నారు. ధర పెరిగితే సప్లయ్ రేఖ ఎడమ నుంచి కుడి వైపు కదులుతూ ఉంటుంది. సప్లయ్ పరిమాణం పెరుగుతుంది. ప్రారంభంలో ధర 10 రూపాయలు ఉంటే వస్తు పరిమాణం 500 యూనిట్లు ఉండగా ధర 50 రూపాయలు పెరిగినపుడు సప్లయ్ పరిమాణం 900 యూనిట్లకు పెరగడాన్ని పటం 6.1లో చూడవచ్చు.

6.3.5 సప్లయ్‌లో పెరుగుదల, తగ్గుదల

మనం పరిశీలిస్తున్న వస్తువు ధరలో మార్పు లేకుండా ఇతర పరిస్థితులలో మార్పు కారణంగా వస్తువు సప్లయ్‌లో వచ్చే మార్పులను సప్లయ్‌లో పెరుగుదల, తగ్గుదల అని పిలుస్తారు. OX అక్షంపై సప్లయ్ పరిమాణం OY అక్షంపై ధరను కొలుస్తాం. SS సప్లయ్ రేఖ దగ్గర OP ధర ఉంది. కాబట్టి OP ధరకు సంస్థ OQ వస్తు పరిమాణాన్ని సప్లయ్ చేస్తుంది. ఇతర పరిస్థితుల్లో మార్పు వచ్చినప్పుడు (ఉదాహరణకు ఉత్పత్తి కారకాల వ్యయం తగ్గినప్పుడు) సప్లయ్‌ను పెంచడం వలన సప్లయ్ రేఖ S_1S_1గా కుడికి కదులుతుంది. అప్పుడు ఇంతకు ముందు ఉన్న OP ధరకే సంస్థ అధిక సప్లయ్‌ని OQ_1చేస్తుంది. లేదా OQ సప్లయ్‌ని తక్కువ ధరకు OP_1కు అమ్ముతుంది. ఇతర పరిస్థితులు మారి సప్లయ్ తగ్గితే సప్లయ్ రేఖ S_2S_2గా ఎడమవైపుకు కదులుతుంది. అప్పుడు సప్లయ్ OQ_2 కి తగ్గుతుంది.ఇలాంటి స్థితిలో సంస్థ ప్రారంభంలో గల వస్తు పరిమాణం OQను అధిక ధర OP_2 కు లేదా ప్రారంభ ధర OP వద్ద తక్కువ వస్తు పరిమాణమైన OQ_2ను అమ్మకం చేస్తుంది.



పటం–6.2: సప్లయ్‌లో పెరుగుదల, తగ్గుదల

6.4 వ్యయ విశ్లేషణ

సంస్థలు వస్తువులను ఉత్పత్తి చేస్తాయి. వస్తువులను ఉత్పత్తి చేయడానికి సంస్థలు ఉత్పత్తి కారకాలను ఉపయోగిస్తాయి. ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగించే ఉత్పత్తి కారకాలకు చెల్లించే ప్రతిఫలాలైన వేతనాలు, భవనాల అద్దె, వడ్డీ చెల్లింపులు మొదలైనవి ఉత్పత్తి వ్యయం అవుతుంది. ఒక సంస్థలో జరిగే వస్తువు ఉత్పత్తి దాని వ్యయంపై ఆధారపడుతుంది. ఒక వస్తువుకున్న డిమాండ్, దాని సప్లయ్‌లు కలిసి దాని ధరను నిర్ణయిస్తాయి. వివిధ వ్యయ భావనలు తెలుసుకొన్నప్పుడే వ్యయ విశ్లేషణ ఉపయోగపడుతుంది.

6.4.1.వ్యయాలలో రకాలు

వ్యయాలను ముఖ్యంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి ద్రవ్య వ్యయాలు, వాస్తవిక వ్యయాలు, అవకాశ వ్యయాలు.

1. ద్రవ్య వ్యయాలు: ఒక సంస్థ వస్తువును ఉత్పత్తి చేయడానికి చేసే ద్రవ్యపరమైన ఖర్చులను ద్రవ్య వ్యయంఅంటారు. ఉదాహరణకు శ్రామికుడికిచ్చే వేతనాలు,ఉత్పత్తికి ఉపయోగించే ముడిసరుకు,యంత్రాలు, ఇంధనం, తరుగుదల మొదలైనవాటిపై ఖర్చులు, విద్యుచ్ఛక్తి, ప్రకటనలు, బీమా ప్రీమియం, పన్నులు, రవాణా కోసం చేసిన చెల్లింపులు మొదలైనవి ద్రవ్య వ్యయాలు అవుతాయి.

ద్రవ్య వ్యయాలను మరల ప్రకటిత, అప్రకటిత వ్యయాలు అంటారు. వస్తు ఉత్పత్తి కోసం బయటి నుంచి కొనుగోలు చేసిన ఉత్పత్తి కారకాలకు సంస్థ ద్రవ్య రూపంలో చెల్లించే ప్రతిఫలాలను ప్రకటిత వ్యయాలు అంటారు. ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తిదారులు తన సొంత వనరులను లేదా సేవలను ఉపయోగిస్తే వాటి విలువను అప్రకటిత వ్యయాలు అంటారు.

2. వాస్తవిక వ్యయాలు: ఒక వస్తువును ఉత్పత్తి చేయడానికి సమాజంలో వివిధ వ్యక్తులు చేసిన ప్రయత్నాలు, త్యాగాలే వాస్తవిక వ్యయాలని ఆల్ఫ్రెడ్ మార్షల్ వివరించారు. ఉదాహరణకు భూస్వామి భూమిని ఇచ్చినప్పు డు తాను కోల్పోయిన పంట, శ్రామికుడు పని చేయుట ద్వారా కోల్పోయిన విశ్రాంతి, పెట్టుబడిదారుడు పెట్టిన పెట్టుబడివల్ల తాను కోల్పోయిన వినియోగం మొదలైన వాటిని వాస్తవిక వ్యయాలు అంటారు. వాస్తవిక వ్యయాలు, ద్రవ్య వ్యయాలు ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయి.

3. అవకాశ వ్యయాలు: అవకాశ వ్యయాన్ని ప్రత్యామ్నాయ వ్యయం లేదా బదిలీ వ్యయం అంటారు. ఒక ఉత్పత్తి కారకం ప్రస్తుతం నిమగ్నమైన పనిలో కాకుండా మరొక ఉత్తమ ప్రత్యామ్నాయంలో నిమగ్నమైతే పొందే ప్రతిఫలాన్ని అవకాశ వ్యయం అంటారు. ఉదాహరణకు ఒక వ్యవసాయదారుడు అతని భూమిలో వరి పంటకు బదులుగా గోధుమ పంట పండించినట్లయితే, ఆ భూమిలో పండించగలిగి ఉండే వరి పంట విలువయే గోధుమ పంట ఆవకాశ వ్యయం.

6.4.2 స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యయాలు

కాలాన్ని ఆధారం చేసుకుని వ్యయాలను స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యయాలుగా వర్గీకరించవచ్చు. స్వల్ప కాలంలో కొన్ని ఉత్పత్తి కారకాలు స్థిరంగా మరికొన్ని చరంగాను ఉంటాయి. దీర్ఘ కాలంలో అన్ని ఉత్పత్తి కారకాలు చరకారకాలే. కాబట్టి దీర్ఘకాలిక వ్యయాలన్నీ చరవ్యయాలే.

1. స్థిర వ్యయాలు: స్వల్పకాలంలో ఉత్పత్తిలో వచ్చే మార్పులకనుగుణంగా మారకుండా స్థిరంగా ఉండే వ్యయాలను స్థిర వ్యయాలు అంటారు. ఉత్పత్తి చేసినా చేయకపోయినా లేదా సంస్థ ఉత్పత్తిని ఆపివేసినా ఉత్పత్తి దారులు స్థిర వ్యయాలను భరించాల్సి ఉంటుంది. ఉదాహరణకు భవనాలు, యంత్రాలు, శాశ్వత సిబ్బందికి చెల్లించే వేతనాలు, మూలధనంపై వడ్డీ, యంత్రాలు, తరుగుదల మొదలగునవి. వీటిని అనుబంధ వ్యయాలు లేదా వ్యవస్థాపరమైన వ్యయాలు అని కూడా అంటారు.

2. చర వ్యయాలు: చర వ్యయాలు ఉత్పత్తి పరిమాణంతో పాటు మారుతూ ఉంటాయి. ఉత్పత్తి పెంచితే చరవ్యయాలు పెరుగుతాయి. ఉత్పత్తి తగ్గితే చరవ్యయాలు తగ్గుతాయి. ఒకవేళ సంస్థ ఉత్పత్తిని ఆపివేస్తే చర వ్యయాలు ఉండవు. ఉదాహరణకు సిబ్బందికి చెల్లించే రోజువారి వేతనాలు, ముడి సరుకులు, ఇంధనానికి, విద్యుచ్ఛక్తికి చేసే చెల్లింపులు.

6.4.3 స్వల్పకాలిక వ్యయాలు - వ్యయరేఖల స్వభావం

ఒక సంస్థకు సంబంధించిన వివిధ రకాలైన స్వల్పకాలిక వ్యయాలు, ఉత్పత్తి ప్రక్రియలోవాటి స్వభావాన్ని పట్టిక-2లో గల వివరాల ద్వారా తెలుసుకుందాము.

చర వ్యయం.

పట్టిక–2: స్వల్పకాలిక వ్యయాలు

ఉత్పత్తి యూనిట్లలో (Q)	మొత్తం స్థిర వ్యయం (TFC)	మొత్తం చర వ్యయం (TVC)	మొత్తం వ్యయం (TC)	సగటు వ్యయం (ATC)	ఉపాంత వ్యయం (MC)
0	100	-	100	100	-
1	100	20	120	120	0
2	100	38	138	69	18
3	100	52.5	152.5	50.8	14.5
4	100	66	166	41.5	13.5
5	100	80	180	36	14
6	100	99	199	33.2	19
7	100	140	240	34.3	41
8	100	184	284	35.5	44

పట్టిక–2లో చూపిన విధంగా ఉత్పత్తిదారుడు స్వల్పకాలంలో స్థిర వ్యయాన్ని మార్చకుండా చర వ్యయాన్ని మాత్రమే మార్చడం ద్వారా వస్తువుల ఉత్పత్తిని మార్చగలడు. అందువల్ల స్వల్పకాలంలో స్థిర వ్యయాలు, చర వ్యయాలు కూడా ఉంటాయి. ఒకవేళ సంస్థ తన ఉత్పత్తిని పెంచితే మొత్తం చర వ్యయాలు పెరుగుతాయి. ఉత్పత్తిని తగ్గిస్తే మొత్తం చర వ్యయాలు తగ్గుతాయి. అంటే ఉత్పత్తి పరిమాణంతో పాటు మొత్తం చర వ్యయాలు మారుతాయి. పట్టికలో మొత్తం స్థిర వ్యయం మారకుండా ఉంది. అంటే ఉత్పత్తి పెరిగినా తగ్గినా మొత్తం స్థిరవ్యయం 100 రూపాయలుగానే ఉంది. కానీ ఉత్పత్తి పెరిగేకొద్దీ చరవ్యయం పెరుగుతుంది. అయితే ఇది ప్రారంభంలో వేగంగా పెరిగి తర్వాత తరహానుసరించిన అదాలవల్ల తగ్గుతున్న రేటులో పెరిగింది. ఆ తర్వాత తరహానుసరించిన నష్టాల వల్ల మొత్తం చర వ్యయం పెరుగుతున్న రేటులో పెరిగింది.

TC=TFC+TVC. పై సమీకరణంలో TC= మొత్తం వ్యయం, TFC= మొత్తం స్థిర వ్యయం,TVC= మొత్తం చర వ్యయం.



పటం–6. 3: మొత్తం వ్యయం,మొత్తం స్థిర వ్యయం,మొత్తం చర వ్యయం

పై పటంలో OX అక్షంపై ఉత్పత్తిని OY అక్షం పైన వ్యయాన్ని కొలుస్తున్నాం. TFC రేఖ మొత్తం స్థిర వ్యయాన్ని TVC రేఖ మొత్తం చర వ్యయాన్ని TC రేఖ మొత్తం వ్యయాన్ని చూపిస్తున్నాయి. స్వల్పకాలంలో మొత్తం స్థిరవ్యయం మారదు కనుక TFC రేఖ X–అక్షానికి సమాంతరంగా ఉంది. మొత్తం చరవ్యయ రేఖ TVC మూల బిందువు దగ్గర ప్రారంభమైంది. ఎందుకంటే ఉత్పత్తి శూన్యమైతే TVC కూడా శూన్యం. దీని అర్థం ఉత్పత్తి పెరిగితే మొత్తం చరవ్యయం పెరుగుతుంది. ఉత్పత్తి తగ్గితే మొత్తం చరవ్యయం తగ్గుతుంది. ప్రారంభంలో కొన్ని యూనిట్ల వరకు మొత్తం చరవ్యయం తగ్గుతున్న రేటులో పెరుగుతుంది. కారణం తరహానుసరించిన ఆదాలు ఉండటమే. ఒక స్థాయి దాటిన తర్వాత తరహానుసరించిన నష్టాల కారణంగా TVC క్రమంగా పెరుగుతున్న రేటులో పెరిగింది. మొత్తం వ్యయం కూడా ప్రారంభంలో తగ్గుతున్న రేటులో పెరిగి తిరిగి ఒక స్థాయి ఉత్పత్తి తర్వాత ఇది కూడా క్రమంగా పెరుగుతున్న రేటులో పెరిగింది.

6.4.4 సగటు వ్యయం, ఉపాంత వ్యయం మధ్య సంబంధం

స్వల్ప కాలంలో మొత్తం వ్యయం కంటే సగటు వ్యయం ముఖ్యం. ఉత్పత్తికి ఉన్న ధర తెలిస్తే నిర్ణీత ఉత్పత్తి స్థాయి వద్ద సంస్థకు లాభమా, నష్టమా తెలియాలంటే స్వల్పకాలిక సగటు వ్యయం తెలుసుకోవాలి. స్వల్ప కాలిక సగటు వ్యయం SAC అనేది ఒక యూనిట్ ఉత్పత్తికి అయ్యే వ్యయం. అనగా SAC=TC/Q అలాగే సగటు స్థిర వ్యయం AFC =TFC/Qకు సమానం కాగా AVC =TFC/Q కు సమానం. అందువలన సగటు వ్యయ సమీకరణాన్ని క్రింది విధంగా తెలుపవచ్చు. SAC =TC/Q =TVC+TFC/Q=AFC+AVC.

పై సమీకరణం ప్రకారం స్వల్పకాలిక సగటు వ్యయం (SAC), సగటు స్థిర, చర వ్యయాల వల్ల ప్రభావితం అవుతుంది. ఉపాంత వ్యయం అనగా ఒక యూనిట్ ఉత్పత్తిని అదనంగా చేసినపుడు మొత్తం వ్యయంలో ఏర్పడిన మార్పు అని చెప్పవచ్చు. ఉపాంత వ్యయం MC= TC/Q



పటం–6.4: సగటు వ్యయం, ఉపాంత వ్యయం మధ్య సంబంధం

స్వల్పకాలిక ఉపాంత వ్యయరేఖ SMC స్వల్పకాలిక సగటు వ్యయరేఖ SACపటం 6.4లో చూపిన విధంగా మొదట్లో U ఆకారంలో ఉంటాయి. ప్రారంభంలో SMC, SAC రేఖలు ఎడమ నుంచి కుడికి కిందికి వాలి ఉంటాయి. ఈ సమయంలో SAC రేఖకు SMC రేఖ కింద ఉంటుంది. SMC రేఖ SACరేఖ కంటే ముందే కనిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. ఆ తర్వాత SMC రేఖ SAC రేఖలు రెండూ పెరుగుతున్నాయి. పెరుగుతున్న SMC రేఖ SAC రేఖను దాని కనిష్ఠ బిందువు వద్ద ఖండిస్తూ పైకి పోతుంది. అప్పుడు SMC రేఖ SAC రేఖకు పై భాగంలో ఉంటుంది. SAC కనిష్ఠ బిందువు Aకు ఎడమవైపు SMC <SACకాగా కుడివైపు SMC>SAC.

6.5.రాబడి విశ్లేషణ

వస్తు సేవల సప్లై వాటి ఉత్పత్తి వ్యయాలపై ఆధారపడి ఉంటుంది. వస్తువులకు ఉండే డిమాండ్ సప్లై రెండుకలిసి వస్తువులకు ధరను నిర్ణయిస్తాయి. వివిధ ధరలకు ఒక సంస్థ కొంత పరిమాణంలో వస్తువులను అమ్మితే పొందిన ఆదాయాన్ని రాబడిగా పరిగణిస్తాము. సంస్థ ప్రధాన ధ్యేయం వస్తు ఉత్పత్తికి అయ్యే వ్యయాన్ని కనిష్టంగా ఉంచి గరిష్ట లాభాలను ఆర్జించడమే. కాబట్టి ఉత్పత్తి వ్యయాలతో పాటు సంస్థల రాబడులను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

6.5.1 రాబడి భావనలు

రాబడి అంటే ఒక సంస్థ వివిధ ధరలకు వస్తువులను అమ్మగా పొందిన ఆదాయం. సంస్థ రాబడికి సంబంధించిన 3 రకాల భావనలను అర్థం చేసుకోవచ్చు. అవి 1.మొత్తం రాబడి 2.సగటు రాబడి 3.ఉపాంత రాబడి.

1. మొత్తం రాబడి: ఒక ధర వద్ద ఒక వస్తువు యొక్క వివిధ యూనిట్లను అమ్మడం ద్వారా పొందిన అదాయాన్నే మొత్తం రాబడి అంటారు. ఉదాహరణకు ఒక సంస్థ 50 పుస్తకాలను ఒక్కొక్కటి 20 రూపాయల చొప్పున అమ్మితే లభించే మొత్తం రాబడి 1000 రూపాయలు. మొత్తం రాబడి (TR)=వస్తువు ధర (P) x వస్తు పరిమాణం (Q)

2. సగటు రాబడి: ఒక యూనిట్ వస్తువు ధరనే సగటు రాబడి అని అంటారు. సంస్థ మొత్తం రాబడిని అమ్మిన వస్తురాశితో భాగించి సగటు రాబడిని తెలుసుకోవచ్చు.ఉదాహరణకు ఒక సంస్థ 50 పుస్తకాలను అమ్మగా వచ్చిన మొత్తం రాబడి 1000 రూపాయలు అనుకుందాం. అప్పుడు సగటు రాబడి=రూ.20.

$$\text{సగటురాబడి} = \frac{\text{మొత్తం రాబడి}}{\text{అమ్మిన వస్తుపరిమాణం}} \quad (\text{లేదా}) \quad AR = \frac{TR}{Q} \quad (\text{లేదా}) \quad P = \frac{PxQ}{Q}$$

3. ఉపాంత రాబడి: ఒక వస్తువును అదనంగా అమ్మడం వల్ల అదనంగా వచ్చే రాబడిని ఉపాంత రాబడి అంటారు.లేదా ఒక వస్తువును అదనంగా అమ్మడం వల్ల మొత్తం రాబడి లో ఏర్పడిన మార్పును ఉపాంత రాబడి అంటారు.

$$\text{ఉపాంత రాబడి} = \frac{\text{మొత్తం రాబడిలో మార్పు}}{\text{వస్తు పరిమాణంలో మార్పు}} \qquad MR = \frac{\triangle TR}{\triangle Q}$$

6.5.2 సంపూర్ణ పోటీలో సగటు రాబడి, ఉపాంత రాబడి రేఖలు

సంపూర్ణ పోటీ మార్కెట్‌లో అమ్మకందారులు కొనుగోలుదారుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వస్తువులన్నీ సజాతీయంగా ఉంటాయి. వస్తువు ధర దాని సప్లై, డిమాండులను బట్టి నిర్ణయించడం జరుగుతుంది. పరిశ్రమ అంతటా ఒకే ధర ఉంటుంది. కాబట్టి పరిశ్రమలో ఉన్న సంస్థలన్నీ ఈ ధరకే ఎంత పరిమాణంలోనైనా తమ వస్తువులను అమ్ముకోవచ్చు. సంస్థ ఉత్పత్తికుండే డిమాండ్ రేఖ సంపూర్ణ వ్యాకోచత్వాన్ని కలిగి ఉండి OX అక్షానికి సమాంతరంగా ఉంటుంది. సంస్థ డిమాండ్ రేఖనే రాబడి రేఖ కావున సగటు రాబడి, ఉపాంత రాబడి సమానంగా ఉంటాయి.

పట్టిక–3: సంపూర్ణ పోటీలో మొత్తం రాబడి సగటు రాబడి,ఉపాంత రాబడి

వస్తు పరిమాణం (Q)	ధర (P)	మొత్తం రాబడి (TR)	సగటు రాబడి (AR)	ఉపాంత రాబడి (MR)
1	15	15	15	15
2	15	30	15	15
3	15	45	15	15
4	15	60	15	15
5	15	75	15	15
6	15	90	15	15
7	15	105	15	15
8	15	120	15	15
9	15	135	15	15
10	15	150	15	15

సంపూర్ణ పోటీ మార్కెట్లో ధర మారకుండా స్థిరంగా ఉంది.కావున సగటు రాబడి, ఉపాంత రాబడి సమా నంగా ఉన్నాయి. వస్తువు ధర 15 రూపాయలుగా స్థిరంగా ఉంది. ఈ ధర వద్ద ఎంత పరిమాణాన్నైనా అమ్ముకోవచ్చు. ధర మారలేదు కాబట్టి సగటు రాబడి ఉపాంత రాబడులు సమానంగా ఉన్నాయి.



పటం-6. 5: సంపూర్ణ పోటీలో సగటు రాబడి,ఉపాంత రాబడి రేఖలు

6.6 సారాంశం

ఒక నిర్ణీత సమయంలో నిర్ణీత ధర వద్ద మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వస్తుపరిమాణాన్ని తెలియజేయడానికి సప్లయ్ అనే పదాన్ని ఉపయోగించడం జరుగుతుంది. ధర పెరిగితే సప్లయ్ పెరుగుతుంది. ధర తగ్గితే సప్లయ్ తగ్గుతుందని సప్లై సూత్రం వివరిస్తుంది. ధరలో మార్పు లేకుండా సప్లయ్ నిర్ణాయకాలలో మార్పులు వస్తే సప్లయ్ రేఖలో కూడా మార్పులు వస్తాయి.

ఒక వస్తువు ఉత్పత్తి ప్రక్రియలో వివిధ కారకాలకు చెల్లించే మొత్తం ప్రతిఫలమే ఉత్పత్తి వ్యయం. వ్యయాలు ముఖ్యంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి ద్రవ్య వ్యయాలు, వాస్తవిక వ్యయాలు, అవకాశ వ్యయాలు. రాబడి అంటే ఒక సంస్థ వివిధ ధరలకు వస్తువులను ఆమ్మగా పొందిన ఆదాయం. సంస్థ రాబడికి సంబందించిన మూడు రకాల భావనలను అర్థం చేసుకోవచ్చు. అవి 1. మొత్తం రాబడి 2. సగటు రాబడి 3. ఉపాంత రాబడి. సంపూర్ణ పోటీలో AR రేఖ MR రేఖ X అక్షానికి సమాంతరంగా ఉంటాయి.

6.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. సప్లయ్ ఫలాన్ని వివరించండి.
2. సప్లయ్ సూత్రాన్ని నిర్వచించండి.
3. సప్లయ్ పట్టికను వివరించండి.
4. స్థిర వ్యయాలు అనగానేమి?
5. చర వ్యయాలు అనగానేమి?
6. మొత్తం రాబడి అంటే ఏమిటి?

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. సప్లయ్‌ని నిర్ణయించే అంశాలను గురించి రాయండి.
2. సప్లయ్‌లో వచ్చే మార్పులను వివరించండి.
3. వ్యయాల రకాలను వర్గీకరించండి.
4. సగటు వ్యయం, ఉపాంత వ్యయాల మధ్య సంబంధాన్ని వివరించండి.
5. వివిధ రకాల రాబడి భావనలను తెలపండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. స్వల్పకాలిక వ్యయరేఖల స్వభావాన్ని గ్రాఫ్ సహాయంతో వివరించండి.
2. సంపూర్ణ పోటీలో సగటు రాబడి,ఉపాంత రాబడి రేఖల స్వభావాన్ని వివరించండి.

6.8 పదకోశం

సప్లయ్ : ఒక నిర్ణీత ధర వద్ద నిర్ణీత సమయంలో ఒక ఉత్పత్తిదారుడు అమ్మకం చేయుటకు సిద్ధంగా ఉన్న వస్తు పరిమాణాన్నిఆ వస్తువు సప్లయ్ అంటారు

సప్లయ్ సూత్రం : ఒక వస్తువు ధరకు ఆ వస్తువు సప్లయ్ పరిమాణానికి మధ్య గల సంబంధాన్ని సప్లయ్ సూత్రం తెలుపుతుంది.

ద్రవ్య వ్యయం : ఒక సంస్థ వస్తువును ఉత్పత్తి చేయడానికి చేసే ద్రవ్యపరమైన ఖర్చులను ద్రవ్య వ్యయం అంటారు.

స్థిర వ్యయాలు : స్వల్ప కాలంలో ఉత్పత్తిలోని మార్పులతో పాటు మారకుండా స్థిరంగా ఉండే వ్యయాలను స్థిర వ్యయాలు అంటారు.

మొత్తం రాబడి : ఒక ధర వద్ద ఒక వస్తువు యొక్క వివిధ యూనిట్లను అమ్మడం ద్వారా పొందిన అదాయాన్నే మొత్తం రాబడి అంటారు.

6.10 ఉపయుక్తగ్రంథాలు

1. సూక్ష్మ అర్థశాస్త్రం - డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
2. సూక్ష్మ అర్థశాస్త్రం - బి.ఎ. మొదటి సంవత్సరం తెలుగు అకాడమి.
3. Micro Economic Theory- M.L JHINGAN

అధ్యాయం

7

మార్కెట్ విశ్లేషణ

7.0 లక్ష్యాలు
7.1 పరిచయం
7.2 మార్కెట్ల అర్థం మరియు వర్గీకరణ
7.2.1 మార్కెట్ అర్థం
7.2.2 మార్కెట్ వర్గీకరణ
7.2.2 (ఎ) కాల ఆధార మార్కెట్లు
7.2.2 (బి) స్థల ఆధార మార్కెట్లు
7.2.2 (సి) పోటీ ఆధార మార్కెట్లు
7.3 సంపూర్ణ పోటీ మార్కెట్ - అర్థం, లక్ష్యాలు మరియు ధర నిర్ణయం
7.3.1 సంపూర్ణపోటీ మార్కెట్ - అర్థం
7.3.2 సంపూర్ణ పోటీ మార్కెట్ - అక్షణాలు
7.3.3 సంపూర్ణ పోటీ మార్కెట్‌లో ధర నిర్ణయం
7.4 అసంపూర్ణ పోటీ మార్కెట్ : ఏకస్వామ్యం, సంపూర్ణపోటీ మార్కెట్ మరియు ఏకస్వామ్యాల మధ్య పోలిక, ఏకస్వామ్యపు పోటీ, పరిమిత మరియు ద్విదాధిపత్యం
7.4.1 ఏకస్వామ్య
7.4.1 (ఎ) ఏకస్వామ్యం - అర్థం
7.4.1 (బి) ఏకస్వామ్యం - లక్షణాలు
7.4.2 ఏకస్వామ్యం మరియు సంపూర్ణపోటీ మార్కెట్ల మధ్య పోలిక
7.4.3 ఏకస్వామ్యపు పోటీ
7.4.3.1 (ఎ) ఏకస్వామ్యపు పోటీ - అర్థం
7.4.3.1 (బి) ఏకస్వామ్యపు పోటీ లక్షణాలు
7.4.4 పరిమితస్వామ్యం
7.4.4.1 పరిమితస్వామ్యం - అర్థము
7.4.4.2 పరిమితస్వామ్యపు - లక్షణాలు
7.4.5 ద్విదాధిపత్యం
7.4.5.1 ద్విదాధిపత్యం - అర్థం
7.4.5.2 ద్విదాధిపత్యపు - లక్షణాలు
7.5 సారాంశం
7.6 మాదిరి ప్రశ్నలు
7.7 పదకోశం
7.8 ఉపయుక్త గ్రంథాలు

7.0. లక్ష్యాలు / ఉద్దేశ్యాలు

- మార్కెట్ భావనను అర్థం చేసుకుంటారు.
- సంపూర్ణ పోటీ మార్కెట్ అర్థం మరియు లక్షణాలను తెలుసుకుంటారు.
- సంపూర్ణ పోటీ మార్కెట్లో ధర నిర్ణయం ఏవిధంగా జరుగుతుందో అర్థం చేసుకుంటారు.
- ఏకస్వామ్యపు మార్కెట్ అర్థం, లక్షణాలను వివరించగల్గుతారు.
- ఏకస్వామ్యపు పోటీ మార్కెట్ – అర్థం, లక్షణాలను అర్థం చేసుకోగల్గుతారు.
- పరిమిత స్వామ్యం మరియు ద్విదాధిపత్యం మార్కెట్ల అర్థం, లక్షణాలను అర్థం చేసుకుంటారు.

7.1 పరిచయం

మన దైనందిన జీవితంలో జరిగే వస్తు సేవల అమ్మకాలు, కొనుగోళ్ళకు చెందిన కార్యకలాపాలను మారకం అంటారు. ఈ అమ్మకాలు, కొనుగోళ్ళ వ్యవహారాలు మార్కెట్లో జరుతాయి. ఈ యూనిట్లో మనం మార్కెట్ – అర్థం, వర్గీకరణ, లక్షణాలు తెలుసుకుంటాము. అంతేకాకుండా సంపూర్ణ పోటీ, అసంపూర్ణ పోటీలోని ఏకస్వామ్యం, ఏకస్వామ్యపు పోటీ, పరిమితస్వామ్యం మరియు ద్విదాధిపత్యం – అర్థం – లక్షణాలు, పోలికలు, ధర నిర్ణయం మొదలైనన వాటిని ఈ యూనిట్ వివరిస్తుంది.

7.2 మార్కెట్లు - అర్థం మరియు వర్గీకరణ

7.2.1 మార్కెట్ల - అర్థం

ఎడ్వర్డ్స్ ప్రకారం మార్కెట్ అనగా – కొనుగోలుదారులను – అమ్మకందారులు ఒక చోటుకి చేర్చే యంత్రాంగం.

సాధారణ పరిభాషలో మార్కెట్ అంటే వస్తుసేవల అమ్మకాలు – కొనుగోళ్ళు జరిగే ఒక ప్రదేశం. మార్కెట్ అనే పదాన్ని మామూలుగా మనం కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్, బులియన్ మార్కెట్, షేర్ మార్కెట్ మొదలైన వాటిని తెలియజేయడానికి ఉపయోగిస్తాం. ఆధునిక కాలంలో వస్తు సేవల అమ్మకాలు – కొనుగోళ్ళ వ్యవహారాలు మార్కెట్‌కు వెళ్ళకుండానే అంతర్జాల (ఇంటర్నెట్) సహాయంతో మన సమాచార సాధనాలైన చరవాణి ద్వారా మారకం జరగడాన్ని మనం గమనించవచ్చు.

7.2.2 మార్కెట్ల వర్గీకరణ

అమ్మకందారులు, కొనుగోలుదారుల మధ్య ఆర్థిక వ్యవహారాలు జరిగే ఒక ప్రదేశాన్ని మార్కెట్‌గా మనం తెలుసుకున్నాం. మూడు అంశాల ఆధారంగా మార్కెట్ల వర్గీకరణ జరుగుతుంది. అది

i) కాలవ్యవధి / కాల ఆధిరత మార్కెట్లు

ii) స్థల ఆధారిత మార్కెట్లు

iii) పోటీ ఆధారిత మార్కెట్లు

7.2.2 (ఎ) కాల ఆధారిత మార్కెట్లు

కాలవ్యవధి ఆధారంగా వస్తు సప్లైలో సర్దుబాట్లు జరుగుతాయి. కాలవ్యవధిని ఆధారంగా చేసుకొని మార్కెట్లను మూడు రకాలుగా వర్గీకరించడం జరిగింది. అవి: అతి స్వల్పకాలిక మార్కెట్, స్వల్పకాలిక మార్కెట్, దీర్ఘకాలిక మార్కెట్.

i. దీర్ఘకాలిక మార్కెట్: దీర్ఘకాలంలో ఉత్పత్తిదారుడు వస్తు డిమాండ్‌కు అనుగుణంగా అన్ని ఉత్పాదకాలను మార్చడం ద్వారా వస్తు సప్లైలో మార్పులు చేయవచ్చును.

ii. స్వల్పకాలిక మార్కెట్: స్వల్పకాలంలో ఉత్పత్తిదారుడు వస్తు సప్లైను కొంతవరకు మార్చవచ్చును. శ్రమ లాంటి చర ఉత్పాదకాలను మార్చడం ద్వారా వస్తు సప్లై మారును.

iii. అతి స్వల్పకాలిక మార్కెట్ / మార్కెట్ కాలం: అతి స్వల్పకాలంలో ఉత్పత్తిదారుడు వస్తుత్పత్తిలో ఎలాంటి మార్పులు చేయలేడు. అందువల్ల సప్లై స్థిరంగా ఉంటుంది. నశ్వర వస్తువులు ఈ మార్కెట్‌కు వర్తిస్తాయి.

7.2.2 (బి) స్థల ఆధారిత మార్కెట్లు

స్థలం ఆధారంగా మార్కెట్లను స్థానిక, జాతీయ అంతర్జాతీయ మార్కెట్లుగా వర్గీకరించడం జరిగింది. ఈ స్థల ఆధారిత మార్కెట్లు ఒక వస్తువు అమ్మకానికి మార్కెట్ పరిమాణం లేదా విస్తరణ ఎంతో తెలియజేస్తుంది. ఒక వస్తువుకుండే మార్కెట్ విస్తీర్ణం దానికుండే డిమాండ్, రవాణా సౌకర్యాలు, వస్తువు మన్నిక మొదలగువాటిపై ఆధారపడి ఉంటుంది.

i. స్థానిక మార్కెట్: ఒక వస్తువు ఉత్పత్తి అయిన ప్రాంతంలోనే అమ్మకాలు జరిగితే దానిని స్థానిక మార్కెట్ అంటారు. ఈ మార్కెట్ వస్తువులకు మన్నిక తక్కువ. పూలు, పండ్లు, కూరగాయలు మొదలగు నశ్వర వస్తువులు ఉత్పత్తి ప్రాంతంలోనే మార్కెట్ జరుగుతుంది.

ii. జాతీయ మార్కెట్: ఒక వస్తువుకు దేశవ్యాప్తంగా డిమాండ్, సప్లై ఉన్నట్లైతే అది జాతీయ మార్కెట్‌గా పిలువబడుతుంది. ఉదా: గోధుమ, బియ్యం, ప్రత్తి మొదలగునవి.

iii. అంతర్జాతీయ మార్కెట్: ప్రపంచ వ్యాప్తంగా ఏ వస్తువులకైతే మార్కెట్ జరుగుతుందో వాటిని అంతర్జాతీయ మార్కెట్‌గా పిలుస్తారు. ఉదా: బంగారం, వెండి, పెట్రోల్ మొదలగునవి.

7.2.2 (సి) పోటీ ఆధారిత మార్కెట్లు

పోటీ స్వభావం ఆధారంగా మార్కెట్లను సంపూర్ణ పోటీ మార్కెట్, అసంపూర్ణ పోటీ మార్కెట్లుగా వర్గీకరించవచ్చు.

i. సంపూర్ణ పోటీ మార్కెట్: అత్యధిక సంఖ్యలో అమ్మకందారులు, కొనుగోలుదారులు ఉంటూ, ఎలాంటి కృత్రిమ అడ్డంకులు లేకుండా మార్కెట్ అంతటా ఒకే ధర ఉండి సజాతీయ వస్తువుల కొనుగోళ్ళు, అమ్మకాలు జరిగే మార్కెట్‌ను సంపూర్ణపోటీ మార్కెట్ అంటారు.

ii. అసంపూర్ణ పోటీ మార్కెట్: అమ్మకందారుల మధ్య కాని, కొనుగోలుదారుల మధ్య కాని సంపూర్ణ పోటీ లేనటువంటి మార్కెట్‌ను అసంపూర్ణ పోటీ మార్కెట్ అంటారు. ఈ మార్కెట్లో ఒకే రకం వస్తువుకు వేర్వేరు ధరలుంటాయి. ఈ మార్కెట్‌ను ఏకస్వామ్యం, ఏకస్వామ్యపు పోటీ, పరిమిత స్వామ్యం, మరియు ద్విదాధిపత్యం మార్కెట్లుగా విభజించడం జరిగింది.

7.3 సంపూర్ణ పోటీ మార్కెట్ - అర్థం, లక్షణాలు మరియు ధర నిర్ణయం

7.3.1. సంపూర్ణ మార్కెట్ - అర్థం

సజాతీయ వస్తువులను తయారు చేసే సంస్థలు అధిక సంఖ్యలు ఉండి, పరిశ్రమలోనికి సంస్థలు ప్రవేశించడానికీ, నిష్క్రమించడానికి స్వేచ్ఛ ఉండే మార్కెట్ పరిజ్ఞానం కలిగి ఉండి, ఉత్పత్తిదారులకు పూర్తి గమనశీలత, రవాణా వ్యయాలు లేకుండటం అనే లక్షణాలుంటే దానిని సంపూర్ణ పోటీ మార్కెట్ అంటారు.

7.3.2. సంపూర్ణ మార్కెట్ - లక్షణాలు

క్రింద ఇవ్వబడిన సంపూర్ణ పోటీ మార్కెట్ ముఖ్య లక్షణాలను అధ్యయనం చేద్దాం.

1. అత్యధిక సంఖ్యలో అమ్మకందారులు మరియు కొనుగోలుదారులు

సంపూర్ణ పోటీ మార్కెట్లో అధిక సంఖ్యలో అమ్మందారులు, కొనుగోలుదారులు ఉంటారు. ఏ ఒక్క అమ్మకందారుని, కొనుగోలుదారుని చర్యలు వస్తు పరిమాణాన్ని మార్కెట్ ధరను ప్రభావితం చేయవు. సంపూర్ణ పోటీ మార్కెట్లో అమ్మకందారు, కొనుగోలుదారులు ధరను అంగీకరిస్తారే తప్ప ధరను నిర్ణయించరు. వస్తువు ధరను మార్కెట్ నిర్ణయిస్తుంది.

2. సజాతీయ వస్తువులు

పరిశ్రమలోని అన్ని సంస్థలు అన్ని విషయాల్లో అనగా నాణ్యత, పరిమాణం, ప్యాకింగ్‌లలో ఒకే విధంగా ఉండే సజాతీయ వస్తువులను తయారు చేస్తాయి. ఈ లక్షణాలు పోటీ మార్కెట్ అంతటా ఒకే ధర ఉండునట్లు చేస్తాయి.

3. సంస్థలు ధరను స్వీకరిస్తాయి

వస్తువు ధరను సంస్థలు నిర్ణయించనప్పటికీ పరిశ్రమచే నిర్ధారించబడిన ధరకే సంస్థలు వస్తువులను అమ్మాలి. మార్కెట్ లేదా పరిశ్రమ వస్తువుకు గల డిమాండ్ మరియు సప్లయ్ ఆధారంగా ధర నిర్ణయిస్తుంది. కావున పరిశ్రమ ధరను నిర్ణయిస్తే సంస్థ ధరను ఆమోదిస్తుంది.

4. ప్రవేశించడానికి, నిష్క్రమించడానికి సంస్థలకు స్వేచ్ఛ ఉండడం

సంపూర్ణ పోటీ మార్కెట్లో పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడూ కొత్త సంస్థలు వ్యాపారంలోకి ప్రవేశించే వీలుంది. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు సంస్థ ఏదైనా తమ కోరిక మేరకు పరిశ్రమను నుంచి నిష్క్రమించే స్వేచ్ఛ కలదు. ఫలితంగా పోటీ అధికంగా ఉంటుంది.

5. మార్కెట్ గురించి సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండడం

సంపూర్ణ పోటీ మార్కెట్‌లో అమ్మకందారులకు, కొనుగోలుదారులకు మార్కెట్ గూర్చి సంపూర్ణ పరిజ్ఞానం ఉంటుంది. అందువల్ల మార్కెట్లో ధర విచక్షణకు అవకాశం ఉండదు. మార్కెట్ అంతటా ఒకే ధర ఉండును.

6. సంపూర్ణ గమనశీలత కలిగి ఉండడం

సంపూర్ణ పోటీ మార్కెట్లో ఉత్పత్తి కారకాలు (భూమి, శ్రమ, మూలధనం, ఉద్యమిత్వం) ఒక సంస్థ నుం మరొక సంస్థలోకి అధిక ఆదాయం పొందే ఉత్పత్తి కార్యకలాపాల్లోకి మారతాయి. అదేవిధంగా వస్తుసేవల మార్కెట్లో ఉత్పత్తికారకాలకు పూర్తి గమనశీలత ఉంటుంది. అందువల్ల మార్కెట్లో ఒకే ధర ఉండును.

7. అమ్మకపు వ్యయాలు ఉండవు

సంపూర్ణ పోటీ మార్కెట్లో అమ్మకపు వ్యయాలుండవు. దీనికి గల కారణాలు మార్కెట్ సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండటం, సజాతీయ వస్తువులు కల్గి ఉండడం. అందువల్ల ఉత్పత్తిదారునకు ప్రకటన వ్యయాలుండవు.

7.3.3. సంపూర్ణ పోటీ మార్కెట్లో ధర నిర్ణయం

సంపూర్ణ పోటీ మార్కెట్లో మార్కెట్ శక్తులైన డిమాండ్, సప్లైల సహాయంతో పరిశ్రమ ధరను నిర్ణయిస్తుంది. సంస్థలు నిర్ణయించిన ధరను అనుసరిస్తాయి. అమ్మకందారులు, కొనుగోలుదారులు ధరను నిర్ణయించరు. కానీ ధరను స్వీకరిస్తారు. ఈ క్రింద ఇవ్వబడిన పట్టిక, పటం సహాయంతో సమతౌల్యధర నిర్ణయాన్ని అర్థం చేసుకోవచ్చు.

పట్టిక 7.3.3 (ఎ) డిమాండ్, సప్లై పట్టిక

ధర రూ॥లలో	డిమాండ్ పరిమాణం (కేజీలలో)	సప్లై పరిమాణం (కేజీలలో)
10	70	30
20	60	40
30	50	50
40	40	60
50	30	70

పై పట్టిక ద్వారా వస్తు డిమాండ్, సప్లైలను తెలుసుకోవచ్చు. ధరలోని మార్పుల వల్ల డిమాండ్ పరిమాణం, సప్లై పరిమాణంలో, ధర తగ్గితే డిమాండ్ పెరగడం, ధర పెరిగితే డిమాండ్ తగ్గడం ధరకు డిమాండ్‌లకు విలోమ సంబంధం ఉంటుంది. ధర పెరిగితే సప్లై పరిమాణం పెరుగుతుంది. ఇక్కడ ధరకు – సప్లైకు మధ్య అనులోమ సంబంధాన్ని సూచిస్తుంది.

ధర రూ.10 ఉన్నప్పుడు డిమాండ్ పరిమాణం 70 కేజీలుగానూ, సప్లై పరిమాణం 30 కేజీలుగానూ ఉన్నాయి. ధర రూ.20 ఉన్నప్పుడు డిమాండు, సప్లై పరిమాణాలు వరుసగా 60 కేజీలు, 40 కేజీలు ఉన్నాయి. ధర రూ.20 నుండి 30 రూపాయలకు పెరిగినప్పుడు వస్తు డిమాండు, సప్లై పరిమాణాలు రెండూ సమానంగా 50 కేజీలు ఉన్నాయి. ఈ ధర (రూ.30) సమతౌల్య ధరగా పిలవబడుతుంది. సమతౌల్య డిమాండ్, సప్లై పరిమాణాలు 50 కేజీలు.

ఈ ప్రక్రియనే పటం సహాయంతో వివరించడం జరిగింది.



పటం-7.1: ధర నిర్ణయం

పటంలో OX అక్షంపై వస్తు డిమాండ్, సప్లైలను, OY అక్షంపై వస్తుధరను చూపించడం జరిగింది. 'DD' - డిమాండ్ రేఖ, ''SS'' సప్లై రేఖ OP ధర వద్ద 'E' సమతౌల్య బిందువు వద్ద డిమాండ్ సప్లై రేఖలు ఖండించుకున్నాయి. OP ధర అనేది సమతౌల్య ధర (రూ.30) వద్ద OQ రూ పరిమాణం సమౌతల్య సప్లై, డిమాండ్ పరిమాణం (50 కేజీలు).

7.4 అసంపూర్ణ పోటీ మార్కెట్

నిజ జీవితంలో సంపూర్ణ పోటీ మార్కెట్ లక్షణాలు ఎక్కడా ఉండవు. అవి ఆదర్శ నిబంధనలు మాత్రమే. అందువల్ల మరొక మార్కెట్ అయిన అసంపూర్ణపోటీ మార్కెట్ గూర్చి తెలుసుకుందాం. అసంపూర్ణ పోటీ మార్కెట్‌లో ఎక్కువ మంది అమ్మకందారులు ఉండీ, మార్కెట్లో పోటీ ఎక్కువ ఉంటుంది. సంపూర్ణ పోటీ మార్కెట్‌కు ఇది పూర్తి భిన్నమైన మార్కెట్. మార్కెట్లోని అమ్మకందారుల సంఖ్య ఆధారంగా అసంపూర్ణ పోటీ మార్కెట్ నాలుగు విధాలుగా వర్గీకరించవచ్చు. అవి: i) ఏకస్వామ్య ii) ఏకస్వామ్యపు పోటి iii) పరిమిత స్వామ్యం iv) ద్విదాధిపత్యం.

7.4.1. ఏకస్వామ్యం - అర్థం, లక్షణాలు

7.4.1 (ఎ) ఏకస్వామ్యం - అర్థం

సంపూర్ణ పోటీ మార్కెట్‌తో పోల్చినప్పుడు ఏకస్వామ్యం పూర్తిగా భిన్నమయిన మార్కెట్. ఏకస్వామ్యం అంటే ఒకే ఉత్పత్తిదారుడు ఉన్న మార్కెట్ అని అర్థం (Mono means single and poly means seller) మార్కెట్లో సమీప ప్రత్యామ్నాయ వస్తువులు లేని వస్తువును ఒకే సంస్థ ఉత్పత్తి, సప్లై చేసినట్లైతే దానిని ఏకస్వామ్యం అంటారు. ఈ మార్కెట్లోకి ప్రవేశించడానికి నిబంధనలు ఉంటాయి. ఉదా: భారత రైల్వేలు - ప్రభుత్వ ఆధీనంలో మాత్రమే నిర్వహించడం.

7.4.1 (బి) ఏకస్వామ్యం - లక్షణాలు

- అకే ఒక్క అమ్మందారుడు ఉండటం.
- మార్కెట్లో వస్తువుకు సమీప ప్రత్యామ్నాయాలు ఉండవు.
- మార్కెట్లోకి నూతన సంస్థలు ప్రవేశించడానికీ వీలులేని నిబంధనలుంటాయి.
- సంస్థ, పరిశ్రమ రెండూ ఒకటే.
- ఉత్పత్తిదారుడు వస్తుధరను, వస్తు సప్లైను ఏక కాలంలో నియంత్రించలేడు. ఏదేని ఒక దానిని మాత్రమే నియంత్రిస్తాడు.
- ఏకస్వామ్యదారుడు కనీస వ్యయాలకు గరిష్ట లాభాలను పొందాలనే లక్ష్యాన్ని కలిగి ఉంటాడు.

7.4.2 సంపూర్ణ పోటీ మార్కెట్ మరియు ఏకస్వామ్యాల మధ్య పోలిక

సంపూర్ణ పోటీ మార్కెట్	ఏకస్వామ్యం
1. అధిక సంఖ్యలో అమ్మకందారులు, కొనుగోలు దారులు ఉంటారు.	1. ఒకే ఒక్క అమ్మకందారుడు, అనేక మంది కొనుగోలు దారులు ఉంటారు.
2. సంపూర్ణ ప్రత్యామ్నాయాలు ఉంటాయి.	2. నూతన సంస్థల ప్రవేశానికి, నిష్క్రమణకు అవకాశం లేదు.
3. సంస్థలకు పరిశ్రమలోకి ప్రవేశించే నిష్క్రమించే స్వేచ్ఛ ఉంటుంది.	3. సమీప ప్రత్యామ్నాయాలు ఉండవు.
4. పరిశ్రమ వేరు, సంస్థ వేరు.	4. సంస్థ, పరిశ్రమ ఒకటే.
5. అమ్మకందారు, కొనుగోలుదారులు ధరను స్వీకరిస్తారు. పరిశ్రమ ధరను నిర్ణయిస్తుంది.	5. ఉత్పత్తిదారుడు ధరను లేదా లేదా ఉత్పత్తిని లేదా రెండింటిని నిర్ణయిస్తాడు.
6. మార్కెట్ అంతటా ఒకే ధర ఉండును.	6. వస్తువులన్నీ సజాతీయాలు కావు.
7. సజాతీయ వస్తూత్పత్తి ఉంటుంది.	7. సజాతీయ వస్తూత్పత్తి ఉండవచ్చు. ఉండకపోవచ్చు.
8. ధర, సగటు, ఉపాంత రాబడులు సమానం, ఈ రేఖ OX – అక్షానికీ సమాంతరంగా ఉంటుంది. P=AR=MR.	8. AR, MR రేఖలు వేరుగా ఉంటాయి. ఈ రెండు రేఖలు ఎడమ నుండీ కుడికీ కిందకు వాలుతాయి. P=AR=MR.

7.4.3. ఏకస్వామ్యపు పోటీ - అర్థం, లక్షణాలు

7.4.3.1. (ఎ) ఏకస్వామ్యపు పోటీ - అర్థం

అధిక సంఖ్యలో అమ్మకందారులు ఉండీ, మొత్తం వస్తూత్పత్తిలో ఒక్కొక్క అమ్మకందారు వేరువేరుగా వాటాలు కలిగి ఉండే మార్కెట్‌ను ఏకస్వామ్యపు పోటీ మార్కెట్ అంటారు. ఈ మార్కెట్‌లో వస్తువైవిధ్యం ఉండును.

జె.యస్. బెన్స్ ప్రకారం అధిక సంఖ్యలో అమ్మకందారులు ఉండి వస్తు వైవిధ్యత కలిగి దగ్గరి ప్రత్యామ్నాయ వస్తువులు ఉన్నటువంటి మార్కెట్‌ను ఏకస్వామ్య పోటీ మార్కెట్ అంటారు. ఉదా॥ రెస్టారెంట్స్, సబ్బులు మొ॥నవి.

7.4.3.2 (బి) ఏకస్వామ్యపు పోటీ - లక్షణాలు

చాంబర్లీన్ ప్రకారం ఈ క్రింది ముఖ్య లక్షణాలు ఉండును.

1. ఎక్కువ సంఖ్యలో సంస్థలు: ఏకస్వామ్య పోటీ మార్కెట్‌లో సంస్థల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సంపూర్ణ పోటీ మార్కెట్‌తో పోల్చినప్పుడు ఈ సంఖ్య తక్కువ. మార్కెట్లో అధిక పోటీ అమ్మకందారుల మధ్య ఉండడం వల్ల ఏ ఒక్క ఉత్పత్తిదారుడు మార్కెట్‌కు సంబంధించిన మొత్తం ఉత్పత్తిని ప్రభావితం చేయలేడు.

2. వస్తు వైవిధ్యం: ఏకస్వామ్య పోటీ లక్షణాలలో వస్తు వైవిధ్యత అతిముఖ్యమైనది. ఒక సంస్థ ఉత్పత్తి చేసిన వస్తువును మార్కెట్లోని ఇతర సంస్థలు ఉత్పత్తి చేసిన వస్తువులతో పోల్చినప్పుడూ కొన్ని తేడాలుంటాయి. అంటే సంస్థల ఉత్పత్తులకు సమీప ప్రత్యామ్నాయాలు ఉంటాయి. ఉదా: మీరు రకరకాల సబ్బులను చూసే ఉంటారు. వివిధ రంగులలో కనిపించినా ఒకే రకమైన అవసరం కోసం వాడతారు.

3. అమ్మకపు వ్యయాలు: సంస్థలు వినియోగదారులను ఆకర్షించడానికి తమ ఉత్పత్తుల అమ్మకాలను పెంచడానికి ప్రకటన వ్యయాలను ఒక సాధనంగా ఉపయోగించుకోవడం అనేది ఏకస్వామ్య పోటీ ముఖ్య లక్షణం. ఈ వ్యయాలనే అమ్మకపు వ్యయాలు అంటారు. అమ్మకంపు వ్యయాలు, ఉత్పత్తి వ్యయాలు వేరువేరుగా ఉంటాయి.

4. స్థిర ధర పోటీ: ధరలో మార్పు లేకుండానే పరిశ్రమలోని సంస్థలు తమ అమ్మకాలను పెంచుకోవడానికీ వివిధ ప్రకటనలు, స్కీములు, ఆఫర్ ద్వారా ఒకదానితో మరొకటి పోటీపడుతుంటాయి. ఉత్పత్తిదారులు సాధ్యమైనంత వరకు వినియోగదారులను ఆకర్షించి తమ ఉత్పత్తులకు గరిష్ఠ మార్కెట్ వాటాను పొందాలని చూస్తారు.

5. నూతన సంస్థలు ప్రవేశించే నిష్క్రమించే స్వేచ్ఛ: దీర్ఘ కాలంలో పరిశ్రమలోకి నూతన సంస్థలు ప్రవేశించే వీలుంది. అలాగే నిష్క్రమించే స్వేచ్ఛ ఉంది.

6. డిమాండ్ రేఖ స్వభావం: ఏకస్వామ్య పోటీలో సంస్థకుండే డిమాండ్ రేఖ ఎడమ నుండీ కుడికి క్రిందకు వాలుతుంది. మార్కెట్‌లో ఎక్కువ మంది పోటీదారులు ఉంటారు. కావున డిమాండ్ రేఖ అధిక వ్యాకోచత్వాన్ని కలిగి ఉంటుంది.

7.4.4. పరిమిత స్వామ్యం (Oligopoly)

7.4.4.1 పరిమిత స్వామ్యం అర్థం

'Oligopoly' అనే పదం గ్రీకు పదాలైన 'oligos' 'pollein' అనే పదాల నుంచి గ్రహించడమైంది. 'oligos' అంటే కొద్దిమంది అనీ 'pollein' అంటే "అమ్మకం" అని అర్థం. "కొద్ది మంది అమ్మకందారుల మధ్య ఉండే పోటీ అని అర్థం. ఇ. హెచ్. చాంబర్లీన్, హాల్ & పాల్ యం. స్వీజి పరిమితస్వామ్య సిద్ధాంతాలను అభివృద్ధి చేశారు. పరిమితస్వామ్యంలో సజాతీయ వస్తువులు ఉండడం లేదా దగ్గరి ప్రత్యామ్నాయ వస్తువులు ఉంటాయి. ఉదా: కార్ల పరిశ్రమ, ఎయిర్‌లైన్ మొదలైనవి.

7.4.4.2 పరిమితస్వామ్యం - లక్షణాలు

ఈ క్రింది లక్షణాలు పరిమితస్వామ్యానికి ఉంటాయి.

1. వస్తువును అమ్మే సంస్థలు పరిమితంగా ఉంటాయి.
2. సంస్థల మధ్య పరస్పర ఆధార సంబంధం ఉంటుంది.
3. ప్రకటన వ్యయాలు / అమ్మకపు వ్యయాలుండను.
4. ఉత్పత్తిదారులందరూ కలిసి సంఘటితంగా ఏర్పడి పోటీ లేకుండా చేసుకుంటారు. సంస్థలన్నీ కలిసి ధరను నిర్ణయిస్తాయి.
5. ధర దృఢత్వం ఉండును.

7.4.5. ద్విదాధిపత్యం

7.4.5.1. ద్విదాధిపత్యం - అర్థం

గ్రీకు భాషలో 'duo' అంటే 'ఇద్దరు' అనీ, 'poly' అంటే అమ్మకందారులు అని అర్థం. ఈ రకం మార్కెట్ వ్యవస్థలో ఇద్దరు ఉత్పత్తిదారులు మాత్రమే వస్తూత్పత్తినీ కొనసాగిస్తారు. ద్విదాధిపత్యం సూక్ష్మరూపంలో ఉండే పరిమితస్వామ్యం. 1838లో ఫ్రెంచి ఆర్థికవేత్త ఆగస్టిన్ కూర్నాట్ ద్విదాధిపత్య నమూనాను అభివృద్ధి చేశాడు.

7.4.5.2. ద్విదాధిపత్యం - లక్షణాలు

1. ఇద్దరు అమ్మకందారులు ఉంటారు.
2. వస్తువులు సజాతీయాలు.
3. ఉత్పత్తి వ్యయం శూన్యం.
4. అమ్మకందారులు పరస్పరం ఆధారపడటాన్ని గుర్తించరు.

7.5. సారాంశం

ఈ పాఠ్యభాగ అధ్యయంలో మార్కెట్ నిర్వచనం, మార్కెట్ రకాలు, సంపూర్ణ పోటీ మార్కెట్ లక్షణాలు, ధర నిర్ణయం గూర్చి క్లుప్తంగా వివరించడం జరిగింది. అసంపూర్ణ పోటీ మార్కెట్‌లో ఏకస్వామ్యం, ఏకస్వామ్యపుపోటీ, పరిమితస్వామ్యం ద్విదాధిపత్యం అర్థం, లక్షణాలను తెలుసుకున్నాం.

7.6. మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 4-5 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. మార్కెట్ అనగా నేమి?
2. స్థల ఆధారిత మార్కెట్ గురించి వ్రాయండి.
3. కాల ఆధారిత మార్కెట్ గురించి వ్రాయండి.
4. పోటీ ఆధారిత మార్కెట్ గురించి వ్రాయండి.
5. పరిపూర్ణ పోటీ మార్కెట్ అనగానేమి?
6. ఏకస్వామ్యాన్ని నిర్వచించండి.
7. ఏకస్వామ్య పోటీ మార్కెట్ అనగానేమి.
8. పరిమిత స్వామ్యాన్ని నిర్వచించండి.
9. ద్విదాధిపత్యం అనగానేమి?
10. సమతౌల్య ధరను వివరించండి.
11. అమ్మకపు వ్యయాలు అనగానేమి?

II. ఈ క్రింది ప్రశ్నలకు 8-10 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. స్థలము మరియు కాలం ఆధారంగా మార్కెట్‌లను వర్గీకరించండి.
2. సంపూర్ణ పోటీ మార్కెట్‌లో ధర నిర్ణయాన్ని వివరించండి.
3. ఏకస్వామ్యం అనగానేమి? దాని లక్షణాలను వివరించండి.
4. పరిమిత స్వామ్యం అనగానేమి? దాని లక్షణాలను వివరించండి.
5. ద్విదాధిపత్యం అనగానేమి? దాని లక్షణాలను వివరించండి.
6. పరిపూర్ణ పోటీ మార్కెట్‌కు మరియు ఏకస్వామ్యంకు మధ్య భేదము ఏమి?

III. ఈ క్రింది ప్రశ్నలకు 16-20 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. మార్కెట్‌లను వర్గీకరించండి.
2. సంపూర్ణ పోటీ మార్కెట్ లక్షణాలను వివరించండి.
3. సమతౌల్య ధర అనగానేమి? అది ఎలా నిర్ణయించబడుతుందో గ్రాఫ్ ద్వారా వివరించండి.

7.7. పదకోశం

- **మార్కెట్:** వస్తు, సేవలు అమ్మకాలు, మరియు కొనుగోళ్లు జరిగే ప్రదేశం.
- **పరిపూర్ణ పోటీ:** అనేకమంది అమ్మకందారులు, అనేక మంది కొనుగోలుదారులు ఉండే మార్కెట్, ఈ మార్కెట్‌లో వస్తువులు సజాతీయంగా ఉండి, ఒకే ధర కలిగి ఉంటాయి.
- **ఏకస్వామ్యం:** ఒకే ఒక అమ్మకందారుడు అనేక మంది కొనుగోలుదారులు ఉండి, సమీప ప్రత్యామ్నాయాలు లేని మార్కెట్.
- **వస్తు వైవిధ్యం:** వస్తువులలో గుర్తుపట్టలేనంత, చిన్న తేడాలుండడం. వాటి ప్రత్యామ్నాయ డిమాండ్ వ్యాకోచత్వం ఎక్కువ.
- **అమ్మకం వ్యయాలు:** వస్తువులను అమ్మడం కొరకు సంస్థలు చేసే వ్యయాలు. ఉదా: అడ్వర్‌టైజ్‌మెంట్.
- **పరిమితస్వామ్యం:** ఒకే రకమయిన వస్తువులను అమ్మే కొద్దిమంది అమ్మకందారులు ఒక సంఘంగా ఏర్పడే మార్కెట్.
- **ద్విదాధిపత్యం:** ఇద్దరే అమ్మకందారులు ఉండి ఒకపై ఒకరు ఆధారపడే మార్కెట్.
- **సమతౌల్య ధర:** డిమాండ్, సప్లైలు కలిసి నిర్ణయించే ధర.

7.8. చదవవలసిన గ్రంథాలు

1. Telugu Acadamy Intermediate 1st year.

2. Senior Secondary course Economics (318), National Institute of Open Schooling.

3. B.A. second year Macro Economics from Telugu Academy.

4. Macro Economics M.L. Seth, Published by Lakshmi Narain Agarwal

అధ్యాయం
8

పంపిణీ సిద్ధాంతాలు

8.0 లక్ష్యాలు

8.1 పరిచయం

8.2 ఆదాయ పంపిణీ

8.2.1 విధులననుసరించి పంపిణీ

8.2.2 వైయక్తిక పంపిణీ

8.3 ఉత్పత్తికారక ధర నిర్ణయం

8.4 ఉపాంత ఉత్పాదకత పంపిణీ సిద్ధాంతం

8.4.1 సిద్ధాంతం

8.4.2 సిద్ధాంత ప్రమేయాలు,

8.4.3 విమర్శ

8.5 భాటకం: అర్థం, భావనలు మరియు రికార్డో భాటక సిద్ధాంతం

8.5.1 భాటకం అర్థం

8.5.2 భాటకం భావనలు

8.5.3 రికార్డో భాటకసిద్ధాంతం

8.6 వేతనాలు, భావనలు, రకాలు

8.6.1 వేతనాలు భావన.

8.6.2 వేతనాలలో రకాలు

8.6.3 వాస్తవిక వేతనాన్ని నిర్ణయించే అంశాలు

8.7 వడ్డీ భావనలు.

8.7.1 వడ్డీ

8.7.2 వడ్డీ భావనలు

8.8 లాభాలు, భావనలు

8.8.1 లాభాల స్వభావం,

8.8.2 లాభం భావనలు

8.9 ముగింపు

8.10 మాదిరి పరీక్ష ప్రశ్నలు

8.11 పదకోశం

8.12 ఉపయుక్త గ్రంథాలు

8.0 లక్ష్యాలు

- ఆదాయ పంపిణీలో రకాలను వర్గీకరిస్తారు.
- ఉపాంత ఉత్పాదకత పంపిణీ సిద్ధాంతం గురించి వివరిస్తారు.
- రికార్డో భాటకసిద్ధాంతం గురించి వివరిస్తారు.
- వాస్తవిక వేతనాన్ని నిర్ణయించే అంశాలను గురించి వివరిస్తారు.
- వడ్డీ భావనలను వివరిస్తారు.
- లాభం భావనలను వివరిస్తారు.

8.1 పరిచయం

వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఉత్పత్తి కారకాలు అవసరము. భూమి శ్రమ, మూలధనం, వ్యవస్థాపన. వీటినే ఉత్పత్తి కారకాలు అంటారు. ఉత్పత్తి ప్రక్రియలో సేవలందించినందుగాను వీటికి ప్రతిఫలాలు చెల్లించాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తి కారకాలైన భూమికి చెల్లించే ప్రతిఫలాన్ని భాటకం అని, శ్రమకు ఇచ్చే ప్రతిఫలాన్ని వేతనం అని, మూలధనం సేవలకు ఇచ్చే మూల్యాన్ని వడ్డీ అని,వ్యవస్థాపకుని సేవలకు ఇచ్చిన ప్రతిఫలాన్ని లాభం అని అంటారు. ఉత్పత్తి కారకాలు పొందిన ప్రతిఫలాలన్నింటిని కలిపితే జాతీయ ఆదాయం వస్తుంది. కాబట్టి ఉత్పత్తి కారకాల మధ్య ఆదాయ పంపిణీ ఏ విధంగా జరుగుతుందో ఈ యూనిట్ ద్వారా తెలుస్తుంది.

8.2 ఆదాయ పంపిణీ

ఆదాయ పంపిణీలో రెండు రకాలున్నాయి. 1.విధులననుసరించి పంపిణీ 2.వైయక్తిక పంపిణీ.

8.2.1 విధులననుసరించి పంపిణీ

ఉత్పత్తి కారకాల విధులకు అంటే వాటి సేవలకు చెల్లించే ప్రతిఫలాన్ని, విధులను అనుసరించి జరిగే పంపిణీ అంటారు. భూమికి ప్రతిఫలంగా బాటకం, శ్రమకు ప్రతిఫలంగా వేతనం, మూలధనానికి వడ్డీ, వ్యవస్థాపకునికి లాభం. విధులననుసరించి జరిగే పంపిణీని ఉపాంతఉత్పాదకత పంపిణీ సిద్ధాంతం తెలుపుతుంది.

విధులను అనుసరించి జరిగే పంపిణీని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. 1.సూక్ష్మ పంపిణీ 2.స్థూల పంపిణీ.

1. సూక్ష్మ పంపిణీ: సూక్ష్మపంపిణీ ఉత్పత్తికారకాల ధరలు ఏవిధంగా నిర్ణయించబడుతుందో తెలుపుతుంది. ఉత్పత్తి కారకాల సేవలకు ప్రతిఫలంగా రేట్లను నిర్ణయిస్తుంది. భూమికి బాటకం, శ్రమకు వేతనం, మూలధనానికి వడ్డీ, వ్యవస్థాపకునికి లాభం గురించి తెలుపుతుంది.

2. స్థూల పంపిణీ: ఇది జాతీయ ఆదాయంలో ఉత్పత్తి కారకాల వాటాను తెలుపుతుంది. అంటే మొత్తం జాతీయాదాయంలో బాటకం వాటాఎంత,వేతనం వాటా ఎంతనే విషయాన్ని తెలుపుతుంది.

8.2.2 వైయక్తిక పంపిణీ

వ్యక్తుల మధ్య జరిగే జాతీయ ఆదాయం పంపిణీని వైయక్తిక పంపిణీ అంటారు. వ్యక్తుల మధ్య ఆదాయ అసమానతలకు గల కారణాలను విశ్లేషిస్తుంది.

8.3 ఉత్పత్తి కారక ధర నిర్ణయం

వస్తువుల ధరలను సప్లయ్, డిమాండ్‌లు నిర్ణయించినట్లుగానే. ఉత్పత్తికారకాల సేవల ధరలను కూడా వాటి సప్లయ్, డిమాండ్లు నిర్ణయిస్తాయి. అయితే ఈ రెండిటి మధ్య తేడాలున్నాయి. ఉత్పత్తి కారకం డిమాండ్ సప్లయ్‌ను నిర్ణయించే అంశాలు.

1. ఉత్పత్తి కారకాలకు ఉండే డిమాండ్ పరోక్ష డిమాండ్ లేదా ఉత్పన్న డిమాండ్. అంటే వస్తువులకు డిమాండ్ ఉంటే వాటిని ఉత్పత్తి చేసే ఉత్పత్తి కారకాలకు డిమాండ్ ఉంటుంది.
2. ఉత్పత్తి కారకాల సప్లయ్, వాటి అవకాశ వ్యయంపై ఆధారపడి ఉంటుంది.
3. భూమికి, శ్రమకు ఉత్పత్తి వ్యయాలు ఉండవు. కావున వీటి ధరలు సామాజిక, మానవ కారణాలను బట్టి ఉంటాయి.

8.4 ఉపాంత ఉత్పాదకత పంపిణీ సిద్ధాంతం

8.4.1 సిద్ధాంతం

ఈ సిద్ధాంతం ప్రకారం ఒక ఉత్పత్తికారకం యొక్క ధర దాని ఉపాంత ఉత్పాదకత ఆధారంగా నిర్ణయించబడుతుంది. మిగతా ఉత్పత్తికారకాలను స్థిరంగాఉంచి ఒక యూనిట్ ఉత్పత్తి కారకాన్ని అదనంగా నియమించినట్లయితే అది దాని యొక్క ఉపాంతఉత్పత్తి అవుతుంది. ఈ సిద్ధాంతం ప్రకారం ఒక ఉత్పత్తి కారకం ధర, దాని ఉపాంత ఉత్పాదకతకు సమానం. ఈ సిద్ధాంతాన్ని J.B.క్లార్క్ అభిఅద్ధి పరచడమైనది. ఉపాంత ఉత్పాదకత అనగా ఒక ఉత్పత్తి కారకాన్ని ఉపయోగించడంవల్ల అదనంగా వచ్చే ఉత్పత్తి. దీన్ని

ఇంకో రకంగా చెప్పాలంటే అదనంగా ఒక ఉత్పత్తికారకాన్ని ఉపయోగించడం వల్ల మొత్తం ఉత్పత్తిలో వచ్చే పెరుగుదలే ఉపాంత ఉత్పత్తి అవుతుంది. ఉత్పత్తికారకాలు సజాతీయం కావున ఒక కారకానికి బదులు మరొక కారకాన్ని ప్రతిస్థాపన చేయడానికి వీలుంటుంది, కావున ఉత్పత్తి దారుడు అన్ని ఉత్పత్తి కారకాల ఉపాంత ఉత్పాదకతకు సమానమయ్యే వరకు ఒకదానికి బదులుగా మరొక ఉత్పత్తి కారకాన్ని ప్రతిస్థాపన చేస్తూ ఉంటాడు.

ఈ సిద్ధాంతాన్ని క్రింది ఉదాహరణ ద్వారా తెలుపవచ్చు. ఉదాహరణకు 10 మంది శ్రామికులు కలిసి 100 పుస్తకాలను తయారు చేశారనుకుందాం. అదనంగా ఒక శ్రామికుడిని అనగా 11వ శ్రామికుడిని నియమించడం వల్ల మొత్తంఉత్పత్తి 110 పుస్తకాలకు పెరిగింది. మొత్తం ఉత్పత్తిలో వచ్చిన అదనపు పెరుగుదల 110−100=10 పుస్తకాలు. మొత్తం పెరుగుదలలో వచ్చిన 10 పుస్తకాలను ఉపాంత భౌతిక ఉత్పత్తి (MPP)అంటారు. భౌతిక ఉపాంత ఉత్పత్తి లేదా అదనపు ఉత్పత్తిని వస్తువు యొక్క ధరతో గుణిస్తే ఉపాంత ఉత్పత్తి విలువ (MVP) లేదా ఉపాంత ఉత్పత్తి రాబడి (MRP) వస్తుంది.

అదనంగా ఒక యూనిట్ ఉత్పత్తికారకాన్ని ఉపయోగించినపుడు మొత్తం రాబడిలో వచ్చిన మార్పునే ఉపాంత ఉత్పత్తిరాబడి అంటారు. సంపూర్ణ పోటీలో ఉపాంత రాబడి ధాని ధరతో సమానం. ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తి కారకాలను నియమించేటపుడు ప్రతి సంస్థ ఉపాంత కారకం యొక్క వ్యయాన్ని (MFC) ఉపాంత ఉత్పత్తి రాబడి (MRP)తో పోల్చి చూసుకుంటుంది. ఉపాంత కారక వ్యయం (MFC) కంటే ఉపాంత ఉత్పత్తి రాబడి (MRP) ఎక్కువగా ఉన్నంత వరకు ఉత్పత్తి కారకాలను ఉత్పత్తి ప్రక్రియలో నియమిస్తుంది. దీర్ఘ కాలంలో ఉపాంతకారక వ్యయం (MFC) ఉపాంత ఉత్పత్తి రాబడి (MRP)కి మరియు సగటు ఉత్పత్తి రాబడికి (ARP) సమానమైనప్పుడు సంస్థలు ఉత్పత్తికారకాల నియామకాన్ని నిలిపివేస్తాయి. అంటే దీర్ఘ కాలంలో (AFC=MFC=MRP=ARP) సమానమైనప్పుడు సంస్థలు సమతౌల్యాన్ని చేరుకుంటాయి.



చిత్రం−1: ఉత్పత్తి కారకాల మార్కెట్‌లో సంస్థల సమతౌల్యం

సంస్థ E బిందువు వద్ద సమతౌల్యంలో ఉన్నప్పుడు AFC=MFC, ARP మరియు MRPకి సమానంగా ఉంటాయి. ఇక్కడ OF పరిమాణంలో ఉత్పత్తి కారకాలను నియమిస్తుంది. OW పరిమాణంలో ఉత్పత్తి కారకాలకు ధర చెల్లిస్తుంది. ఉత్పత్తి కారక వ్యయం OW-OW_1కు పెరిగితే సంస్థకు E1-S1 పరిమాణంలో నష్టాలు వస్తాయి. ఉత్పత్తి కారకాలకు చెల్లించే వ్యయం F_1E_1 గా ఉంది. ఇది F_1S_1 కంటే ఎక్కువ. అంటే సగటు ఉత్పత్తి వ్యయం సగటు రాబడి కంటే ఎక్కువ. ఈ పరిస్థితుల్లో కొన్ని సంస్థలు పరిశ్రమ నుంచి వెళ్లిపోతాయి. కావున తిరిగి OW వద్ద ఉత్పత్తికారక వ్యయం AFC కి పడిపోయి సంస్థ సమతౌ ల్యాన్ని చేరుతుంది. ఒకవేళ ఉత్పత్తి కారక వ్యయం OW_2కి పడిపోతే సంస్థకు S_2E_2 లాభాలు వస్తాయి. ఈ సమయంలో పరిశ్రమలోకి కొత్త సంస్థలు ప్రవేశించి OW స్థాయికి AFC పెరిగి E బిందువు వద్ద సంస్థ సమతౌల్యంలో ఉంటుంది. ఈ OW ధర వద్ద ARP=MRP=AFC=MFC.

8.4.2 సిద్ధాంత ప్రమేయాలు

1. వస్తుమార్కెట్ మరియు ఉత్పత్తి కారకాల మార్కెట్లో పరిపూర్ణ పోటీ ఉంటుంది.
2. ఉత్పత్తి కారకాలకు సంపూర్ణ ఉద్యోగిత ఉంటుంది.
3. ఉత్పత్తి కారక యూనిట్లు అన్ని సజాతీయాలు.
4. ఉత్పత్తికారకాలకు గమనశీలత ఉంటుంది.
5. ఉత్పత్తి కారకాలను ప్రతిష్టాపన చేయవచ్చు.
6. ఉత్పత్తి కారకాలను ఉత్పత్తి ప్రక్రియకు అనుగుణంగా విభజించవచ్చు.
7. సాంకేతిక విధానంలో మార్పు ఉండదు.
8. ఈ సిద్ధాంతం దీర్ఘకాలానికి సంబంధించినది.

8.4.3 విమర్శ

1. ఉత్పత్తి కారక యూనిట్లు సజాతీయం కావు.
2. ఉత్పత్తి కారకాలకు పూర్తి గమనశీలత ఉండదు.
3. ఉత్పత్తి కారకాల మార్కెట్లో సంపూర్ణ పోటీ ఉండదు.
4. ఉత్పత్తి కారకాలకు సంపూర్ణ ఉద్యోగిత ఉండదు.
5. ఉత్పత్తి కారకాలను అన్ని వేళల్లో ప్రతిస్థాపన చేయలేము.
6. సాంకేతిక రంగంలో వచ్చే మార్పులను విస్మరించింది.
7. స్వల్ప కాలంలో ఈ సిద్ధాంతం వర్తించదు.
8. ఉత్పత్తి కారకాలను విభజించడానికి వీలుకాదు.
9. ఈ సిద్ధాంతంలోని ప్రధానంలోపం అది సప్లయ్‌ను విస్మరించింది.

8.5 భాటకం అర్థం : భాటకం భావనలు, రికార్డో భాటకసిద్ధాంతం

8.5.1 భాటకం అర్థం

సాధారణ భాషలో భాటకం అంటే భూమిగానీ, ఇల్లుగానీ, దుకాణం వంటివి ఉపయోగించినప్పుడు వాటి సొంతదారులకు చెల్లించే అద్దె అనే అర్థం. ఆచార్య మార్షల్ ప్రకారం "ప్రక అతి ప్రసాదించిన భూమి దాని నుంచి యజమానికి లభించే ఆదాయం" భాటకం అని పేర్కొన్నాడు.

8.5.2 భాటకం భావనలు

భాటకంలో రెండు భావనలున్నాయి. 1. ఒప్పంద భాటకం 2. ఆర్థిక భాటకం

1.ఒప్పంద భాటకం: భూమి, ఇల్లు యంత్రాలు వంటి వాటి సేవలను నిర్ణీత కాలానికి ఉపయోగించుకున్నందుకు ముందుగా నిర్ణయించుకున్న ఒప్పందం ప్రకారం యజమానికి చెల్లించే మొత్తాన్ని ఒప్పంద భాటకం అంటారు.

ఒప్పంద భాటకాన్ని స్థూల భాటకం అనికూడా అంటారు. ఇందులో a) ఆస్తుల మెరుగుదలకు ఉపయోగించిన పెట్టుబడికి వడ్డీ b) నిర్వహణకయ్యే వేతనాలు c) తరుగుదల, నిర్వహణ ఛార్జీలు d) నష్టభయాన్ని భరించినందుకుగాను పొందిన లాభాలు.

2.ఆర్థిక భాటకం: సంప్రదాయ ఆర్థికవేత్తల అభిప్రాయంలో భూమిని ఉపయోగించుకున్నందుకు చెల్లించే చెల్లింపు మాత్రమే ఆర్థిక భాటకం అంటారు. రికార్డో అభిప్రాయం ప్రకారం ఉపాంత లేక తక్కువ సారవంతమైన భూముల కంటే ఎక్కువ సారవంతమైన భూములపై వచ్చే మిగులే ఆర్థిక భాటకం

8.5.3 రికార్డో భాటక సిద్ధాంతం

ఇంగ్లాండ్‌కు చెందిన 19 వ శతాబ్దపు సంప్రదాయ ఆర్థికవేత్తలలో పేరెన్నికగన్న ఆర్థికవేత్త డేవిడ్ రికార్డో సాంప్రదాయ భాటక సిద్ధాంతాన్ని తెలియజేశారు. రికార్డో నిర్వచనం ప్రకారం" భూమి యొక్క సహజమైన, నాశనం చేయలేని శక్తులను ఉపయోగించుకున్నందుకు పండిన వంటలో భూస్వామికి చెల్లించే భాగమే భాటకం"

1.వివరణ

భూసారంలో తేడాల వల్ల భాటకం ఎలా ఏర్పడుతుందో రికార్డో ఒక ఉదాహరణ ద్వారా వివరించాడు. భూసారంలోని తేడాలను బట్టి భూములను A, B, C గ్రూపులుగా విభజించడమైనది. జనాభా పెరిగే కొద్దీ తమ ఆహార అవసరాల కోసం కొంత మంది ప్రజలు ఒక కొత్త ప్రదేశానికి వెళ్ళారనుకుందాం. మొదట ఆ ప్రాంతానికి వచ్చిన వారు అధిక సారవంతమైన A గ్రేడ్ భూమిని సాగు చేస్తారు. శ్రమ మరియు మూల ధనం రూపంలో రూ. 4500 పెట్టుబడిగా పెట్టి 250 బస్తాల ధాన్యాన్ని ఉత్పత్తి చేశారనుకుందాం. పంటను అమ్మగా వచ్చే రాబడి ఉత్పత్తి వ్యయానికి సమానంగా ఉన్నందున మిగులు ఉండదు. కాబట్టి A గ్రేడ్ భూమిలో భాటకం ఉండదు. కొంత కాలానికి జనాభా పెరగడం వల్ల మరికొంత మంది ఆ ప్రాంతానికి

వలస రావడంతో ఆహార ధాన్యాలకు డిమాండ్ పెరుగుతుంది. వీరికి అందుబాటులో ఉన్న తక్కువ సారవంతమైన B గ్రేడ్ భూములను అదే పెట్టుబడి రూ.4500 పెట్టి సాగు చేస్తే 200 బస్తాల ధాన్యం మాత్రమే పండుతుంది. A గ్రేడ్ భూమితో పోలిస్తే B గ్రేడ్ భూమిలో ఉత్పత్తి వ్యయం ఎక్కువ. కావున A గ్రేడ్ భూమిలో ఉత్పత్తిపరంగా వచ్చే మిగులు 250−200=50 బస్తాలు. ఇది A గ్రేడ్ భూమిలో ఉత్పన్నమైన ఆర్థిక భాటకం. మరికొంత కాలానికి జనాభా పెరగడం వలన మరికొంత మంది ఆ ప్రాంతానికి వలస రావడంతో భూమికి డిమాండ్ పెరిగి తక్కువ సారవంతమైన C గ్రేడ్ భూములను సాగు చేయాల్సి వస్తుంది. వీళ్ళు రూ.4500 పెట్టుబడి పెట్టి 150 బస్తాల ధాన్యాన్ని మాత్రమే పండించగలుగుతారు. మొత్తం ఉత్పత్తి వ్యయం, మొత్తం రాబడి సమానంగా ఉన్నందువలన C గ్రేడ్ భూములపై ఎలాంటి భాటకం ఉత్పన్నం కాదు. ఈ భూమినే ఉపాంత భూమి అంటారు. C గ్రేడ్ భూములను సాగుచేస్తే A గ్రేడ్ భూమిలో 100 బస్తాల ధాన్యం భాటకంగాను (250−150=100). B గ్రేడ్ భూమిలో 50 బస్తాల ధాన్యం భాటకం (200−150=50) గాను పొందుతున్నాం. దీన్ని పట్టిక రూపంలో చెప్పవచ్చు.

పట్టికలో C గ్రేడ్ భూమి భాటకం లేని భూమి. ఇక్కడ మొత్తం ఉత్పత్తి వ్యయం, రాబడి సమానంగా ఉన్నాయి. C గ్రేడ్ భూమిలో ఒక బస్తా ధాన్యం పండించడానికి అయిన ఖర్చు రూ.30 (4500/150=30) A గ్రేడ్ భూమిలో 100 బస్తాల ధాన్యం విలువ రూ.3000 (30X100=3000)

అదే విధంగా B గ్రేడ్ భూమి 50 బస్తాల ధాన్యం విలువ రూ.1500 (30X50=1500)

భూమి రకాలు	ఉత్పత్తి వ్యయం రూ.లలో	ఉత్పత్తి బస్తాలలో	భాటకం భౌతిక రూపంలో	ద్రవ్య విలువ రూ.లలో
A	4500	250	100	3000
B	4500	200	50	1500
C	4500	150	-	-



చిత్రం-2: భాటక నిర్ణయం

పై పటంలో C గ్రేడ్ భూమి ఉపాంత భూమి కాబట్టి ఈ భూమిలో భాటకం లేదు. మిగిలిన భూములలో షేడ్ చేసిన ప్రాంతం భాటకం లేదా తారతమ్య మిగులును సూచిస్తుంది.

2. ప్రమేయాలు

1. మార్కెట్లో సంపూర్ణ పోటీ ఉంటుంది.
2. భూమి సప్లై స్థిరంగా ఉంటుంది.
3. భూసారంలో తేడాలుంటాయి.
4. భూమికి మూలమైన నాశనం చేయలేని శక్తులు ఉన్నాయి.
5. కిల ప్రతిఫలాలు వర్తిస్తాయి.
6. భూమినుంచి భాటకం మాత్రమే ఏర్పడుతుంది.
7. దీర్ఘ కాలంలో భాటకం ఏర్పడుతుంది.

3. విమర్శ

1. మార్కెట్లో సంపూర్ణ పోటీ లేదు.
2. భూమికి మూలమైన నాశనం చేయలేని శక్తులు ఏమీలేవు
3. అతి సారవంతమైన భూములను ముందు వాడతారనే ప్రమేయం అన్ని సందర్భాలలో నిజం కాదు.
4. భూమినుంచి భాటకం మాత్రమే ఏర్పడుతుంది అనే ప్రమేయం నిజం కాదు. అన్ని ఉత్పత్తి కారకాల ఆదాయాలలో ఆర్థికభాటకం ఉంటుంది.
5. స్వల్ప కాలంలో కూడా స్థిర కారకాలకు భాటకం ఏర్పడుతుంది. దీన్నే మార్షల్ కృత్రిమ భాటకం అన్నాడు.

8.6 వేతనాలు: భావనలు, రకాలు

8.6.1 వేతనాలు భావన

శ్రామికుని శ్రమకు ప్రతిఫలంగా యజమాని ఇచ్చే మొత్తం ద్రవ్యాన్ని వేతనంగా చెప్పవచ్చు. శ్రామికుని శ్రమ భౌతికమైనది కావచ్చు లేదా మానసిక శ్రమ కావచ్చు. శ్రామికులు తమ శ్రమ ప్రతిఫలాన్ని జీతాల రూపంలో కాని, కూలి రూపంలో గానీ పొందవచ్చు. శ్రామికులు పొందే వేతనం దినసరి లేదా వారాల వారీగా లేదా నెలకొకసారి కాని సంవత్సరం కానీ కావచ్చు. దీన్ని కాల వేతనం (TimeWage) అంటారు. శ్రామికులు చేసే పనిని బట్టి వేతనం ఇస్తే దాన్ని పనిని బట్టి వేతనం అంటారు. ఉదాహరణకు టైలర్ ఒక జత వస్త్రాలు కుట్టినందుకు రూ. 400 చెల్లించడం

8.6.2 వేతనాలలో రకాలు

వేతనాలు రెండు రకాలున్నాయి. 1. ద్రవ్య వేతనాలు, 2. వాస్తవిక వేతనాలు.

i) ద్రవ్య వేతనాలు (Money Wages): ఉత్పత్తి ప్రక్రియలో సేవలందించినందుకు గాను శ్రామికులు ప్రతిఫలంగా వేతనాలను ద్రవ్య రూపంలో పొందితే వాటి ద్రవ్య వేతనాలు అంటారు.

ii) వాస్తవిక వేతనాలు (Real Wages): ద్రవ్య వేతనం వల్ల శ్రామికుడి కొనుగోలు శక్తిని వాస్తవిక వేతనం అంటారు.

8.6.3 వాస్తవిక వేతనాన్ని నిర్ణయించే అంశాలు

1. ధరల స్థాయి: ద్రవ్యం కొనుగోలు శక్తి ధరల స్థాయిపై ఆధారపడి ఉంటుంది. ధరల స్థాయి పెరిగితే కొనుగోలు శక్తి తక్కువగా ఉంది. ధరల స్థాయి తగ్గితే ద్రవ్య కొనుగోలు శక్తి ఎక్కువగా ఉంటుంది.
2. నగదు వేతనం: మిగతా పరిస్థితులు మారనప్పుడు నగదు వేతనానికి వాస్తవిక వేతనానికి ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. నగదు వేతనం పెరిగితే వాస్తవిక వేతనం పెరుగుతుంది. నగదు వేతనం తగ్గితే వాస్తవిక వేతనం తగ్గుతుంది.
3. ఉద్యోగ స్థిరత్వం: ద్రవ్య వేతనం తక్కువగా ఉన్న ఉద్యోగం పర్మినెంట్ అయితే వాస్తవిక వేతనం ఎక్కువ. ఉద్యోగం తాత్కాలికం అయితే ద్రవ్య వేతనం అధికంగా ఉన్నప్పటికీ వాస్తవిక వేతనం తక్కువగా ఉంటుంది.
4. పని స్వభావం: శ్రామికుడు పనిచేసే పని ప్రమాదకరమైనదిగా, ఎక్కువ రిస్క్‌తో కూడుకుని ఉన్నప్పుడు ద్రవ్యవేతనం ఎక్కువగా ఉన్నప్పటికీ వాస్తవికత వేతనం తక్కువగా ఉన్నట్లే.
5. భవిష్యత్ అవకాశాలు: శ్రామికుడు చేసే ఉద్యోగంలో భవిష్యత్తులో పదోన్నతులకు అవకాశం ఉన్నట్లయితే అక్కడ వాస్తవిక వేతనాలు ఎక్కువ. ఏ విధమైన పదోన్నతులు, ఎక్కువ వేతనాలు లేకుంటే వాస్తవిక వేతనం తక్కువగా ఉంటుంది.
6. అదనపు రాబడి: కొన్ని వృత్తులలో ద్రవ్య వేతనం తక్కువైనా అదనపు రాబడిని ఆర్జించడానికి అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ఇంజనీర్లు. దీని వల్ల వాస్తవిక వేతనం పెరుగుతుంది.
7. సాంఘిక హోదా: కొన్ని ఉద్యోగాలు సంఘంలో గౌరవ ప్రతిష్టలను కలుగజేస్తాయి. దాని వలన వారి ద్రవ్య వేతనం తక్కువగా ఉన్నా వాస్తవిక వేతనం ఎక్కువ. ఉదాహరణకు బ్యాంకు ఉద్యోగి మరియు న్యాయమూర్తి ద్రవ్య వేతనాలు సమానమైనప్పటికీ సాంఘిక హోదా వల్ల న్యాయమూర్తి వాస్తవిక వేతనం ఎక్కువ.

8. చెల్లింపు విధానం : కార్మికులు సాధారణంగా వేతనాలు ద్రవ రూపంలో పొందుతారు.కానీ కొన్నిసార్లు ద్రవ్యవేతనాలతో పాటు వారికి ఉచిత వసతి, వైద్య,రవాణా సౌకర్యాన్ని కల్పించడం వల్ల వారి వాస్తవిక వేతనం పెరుగుతుంది.

8.7 వడ్డీ భావనలు.

8.7.1 వడ్డీ

అప్పుగా తీసుకున్న రుణానికి రుణగ్రహీత రుణదాతకు చెల్లించే మొత్తాన్ని వడ్డీ అంటారు. దీన్ని సాధారణంగా సంవత్సరానికి రూ.100 ఇంత రేటు అని నిర్ణయిస్తారు. కానీ అర్థశాస్త్ర దృష్ట్యా మూలధన సేవలకు చెల్లించేదాన్ని వడ్డీ అంటారు. మిల్ వడ్డీని పరిత్యాగానికి ఇచ్చే ప్రతిఫలం అన్నారు. మార్షల్ వడ్డీని నిరీక్షణకు ఇచ్చే ప్రతిఫలం అన్నారు.

ప్రజలు తమ ద్రవ్యానికున్న ద్రవ్యత్వాన్ని వదులుకున్నందుకు పొందే ప్రతిఫలమే వడ్డీ కీన్స్ అన్నారు.

8.7.2 వడ్డీ భావనలు

వడ్డీ భావనలు రెండు రకాలు. అవి 1.స్థూల వడ్డీ 2.నికర వడ్డీ

1. స్థూల వడ్డీ: అప్పు తీసుకున్న వ్యక్తి. అప్పు ఇచ్చిన వ్యక్తికి అసలు మొత్తం కాకుండా అదనంగా చెల్లించే మొత్తాన్ని స్థూలవడ్డీ అంటారు. ఇందులో కింద పేర్కొన్న అంశాలు కలిసి ఉంటాయి.

i. నికర వడ్డీ: కేవలం మూలధన సేవలకిచ్చే ప్రతిఫలాన్ని నికర వడ్డీ అంటారు.

ii. నష్ట భయానికి పొందే ప్రతిఫలం: రుణదాత అప్పు ఇచ్చినప్పుడు నష్టపోయాన్ని ఎదుర్కొంటాడు. ఇచ్చిన రుణం తిరిగి రాకపోవచ్చు. కాబట్టి రుణదాత అదనపు ప్రతిఫలాన్ని పొందాలనుకుంటాడు. నష్ట భయం ఎక్కువైతే స్థూల వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుంది. పూచీ ఉన్న అప్పుల విషయంలో వడ్డీ రేటు తక్కువగాను, పూచీలేని అప్పుల విషయంలో వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుంది.

iii. అసౌకర్యానికి ప్రతిఫలం: అప్పు ఇచ్చే వ్యక్తి. తాత్కాలికంగా డబ్బును వదులుకోవడం వల్ల కొంత అసౌకర్యానికి లోనవుతాడు. అతనికి అవసరమైనపుడు ఆ సొమ్ము తిరిగి రాకపోవచ్చు. ఇంకొకచోట అప్పు తీసుకోవాల్సి రావచ్చు. ఈ అసౌకర్యానికి రుణదాత రుణగ్రస్తుని నుంచి వడ్డీ రూపంలో కొంత రాబట్టుకోవాలనుకుంటాడు.

iv. పరిపాలనాఖర్చులు: రుణదాత రుణగ్రస్తుల ఖాతాలను నిర్వహించడానికి కొంత ఖర్చు చేయాలిసిబ్బంది జీతాలను భరించాలి. కొన్నిసార్లు న్యాయస్థానాలకు వెళ్లాలి. ఈ శ్రమకు, ఖర్చులను భరించాలంటే కొంత మొత్తాన్ని తీసుకుంటాడు. ఇది కూడా స్థూలవడ్డీ రేటులో కలిసి ఉంటుంది.

2.నికర వడ్డీ: స్థూల వడ్డీలో నుంచి నష్ట భయానికిచ్చే ప్రతిఫలాన్ని, అసౌకర్యానికిచ్చే ప్రతిఫలాన్ని, పరిపాలన ఖర్చులను తీసివేస్తే మిగిలింది నికర వడ్డీ.

8.8 లాభాలు, భావనలు

వ్యవస్థాపకుడు వివిధ ఉత్పత్తికారకాలను ఉపయోగించి వస్తువులను ఉత్పత్తి చేస్తారు. ఈ వస్తువులను మార్కెట్లో అమ్మినప్పుడు రాబడి పొందుతారు. వ్యవస్థాపకుడు మిగతా ఉత్పత్తి కారకాలకు ప్రతి ఫలాలను చెల్లించిన తర్వాత మిగిలిన ఆదాయాన్ని లాభంగా పొందుతాడు. వ్యవస్థాపకునికి ఉత్పత్తి వ్యయాని కంటే ఎక్కువగా ఉన్న మిగులు ఆదాయాన్ని లాభం అంటారు.

8.8.1 లాభాల స్వభావం

లాభాలను ఆర్థిక వేత్తలు వివిధ రకాలుగా వివరించారు.

టాసిగ్ "లాభాన్ని మిశ్రమమైన విసుగు పుట్టించే ఆదాయంగా పరిగణించాడు."

వెబ్లన్, హసన్‌లు "లాభాన్ని ఆర్జించని ఆదాయంగా పరిగణించి కొద్ది మంది పెట్టుబడిదారులు సంస్థాగతమైన ఏకస్వామ్యలను ఏర్పరచడం వల్ల లాభం ఏర్పడుతోందన్నారు".

క్లార్క్, నైట్, షుంపీటర్‌లు చలన ప్రపంచంలో మార్పులు, అనిశ్చిత, నవకల్పనల వల్ల లాభాలు ఏర్పడతాయన్నారు.

8.8.2 లాభం భావనలు

లాభాలలో వివిధ భావనలన్నాయి. అవి స్థూల లాభాలు, నికర లాభాలు, సాధారణ లాభాలు, గరిష్ట లాభాలు.

1. స్థూల లాభం: వ్యవస్థాపకునికి లభించే మొత్తం ఆదాయాన్నే స్థూల లాభం అంటారు. మొత్తం రాబడికి, మొత్తం వ్యయానికి మధ్య గల తేడాని స్థూల లాభంగా పరిగణిస్తారు. స్థూల లాభంలో కింది అంశాలు ఉంటాయి.

a) ఉత్పత్తి దారుడు తన సొంత భూమిని లేదా భవనాలను ఉపయోగించి ఉంటే వాటికి చెల్లించాల్సిన ప్రతిఫలాలను స్థూల లాభంలో ఉంటాయి. b) వ్యాపార నిర్వహణకు ఇవ్వాల్సిన వేతనం మరియు తరుగుదల ఛార్జీలు. c) ఉద్యమదారుడు తన మూలధనాన్ని వాడితే దానికి చెల్లించాల్సిన వడ్డీ.

2. నికర లాభం: వ్యవస్థాపకుని ఉత్పత్తిపరమైన సేవలకు మాత్రమే వచ్చే ప్రతిఫలాన్ని నికర లాభం అంటారు. నికరలాభాన్ని శుద్ధ లాభం అని కూడా అంటారు. నికర లాభంలో కింది అంశాలు చేరి ఉంటాయి.

i. వ్యాపారంలో వ్యవస్థాపకుడు భీమా చేయలేని నష్టభయాలను, అనిశ్చితలను భరిస్తున్నందుకు వచ్చే ప్రతిఫలం నికర లాభంలో ఉంటుంది.

ii. ఉద్యమదారుని సామర్థ్యానికి ఇచ్చే పారితోషికం.

iii. సరైన అనుపాతంలో ఉత్పత్తి కారకాలను సమన్వయ పరిచినందుకు వచ్చే ప్రతిఫలం.

iv. నూతన వస్తువులను,నూతన ఉత్పత్తి పద్ధతులను ప్రవేశపెట్టడం వంటి నవకల్పనలు ప్రవేశపెట్టి నందుకు వచ్చే పారితోషికం.

v. ద్రవ్యోల్బణం,ఇతర సంస్థలు మూతపడటం, ప్రకఅతి వైపరీత్యాల వంటి కారణాలవల్ల లభించే ఆకస్మిక లాభాలు నికరలాభంలో భాగంగా ఉంటాయి.

3. సాధారణ లాభాలు: ఉద్యమదారుడు వ్యాపారాన్ని నిర్వహించినందుకుగాను ప్రతిఫలంగా పొందిన లాభాలను సాధారణ లాభాలు అంటారు. సాధారణ లాభం ఉత్పత్తి వ్యయంలో వస్తువుల ధరలోను భాగంగా ఉంటాయి.సాధారణ లాభాలునప్పుడు కొత్త సంస్థ పరిశ్రమలోకి ప్రవేశించడం కాని ఉన్న సంస్థలు నిష్క్రమించడం కాని జరగదు.

3. అసాధారణ లాభాలు: సంస్థ మొత్తం ఉత్పత్తికయ్యే వ్యయం కన్నా రాబడి అధికంగా ఉంటే వచ్చే లాభాలను అసాధారణ లాభాలు అంటారు.

8.9 ముగింపు

పంపిణీ సిద్ధాంతం, వివిధ ఉత్పత్తి కారకాలకు మరియు వాటి ప్రతిఫలాలను గురించి వివరిస్తుంది. సాధారణంగా ఏ ఉత్పత్తికారకం ధర అయినా దాని సప్లయ్ మరియు డిమాండ్లను బట్టి నిర్ణయించబడుతుంది. ఉపాంత ఉత్పాదకతా పంపిణీ సిద్ధాంతం అన్ని ఉత్పత్తి కారకాల ధరల నిర్ణయానికి వర్తింపచేవచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం ఏ ఉత్పత్తి కారకం ధర దాని ఉపాంత ఉత్పాదకత రాబడికి సమానంగా ఉండాలని తెలియజేస్తుంది.భూమికి భాటకం భూసారంలోని తేడాల వల్ల ఏర్పడుతుందని డేవిడ్ రికార్డో తెలిపాడు. అయితే ఆధునిక బాటక సిద్ధాంతం మాత్రం ఉత్పత్తి కారకాలు కొరతగా ఉన్నందువలన భాటకం ఏర్పడుతుందని తెలియజేస్తుంది.

శ్రామికుని సేవలకిచ్చే ప్రతిఫలం వేతనం అని, ద్రవ్య వేతనాల కంటే వాస్తవ వేతనాలు ముఖ్యమని ఈ సిద్ధాంతం తెలియజేస్తుంది. మూలధన యజమాని పొందే ఆదాయమే వడ్డీ. ఉత్పత్తి ప్రక్రియలో ఉద్యమదారుల సేవలకు చెల్లించే ప్రతిఫలమే లాభం.

8.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ఆర్థిక భాటకం అంటే ఏమిటి?

2. కాలాన్ని బట్టి వేతనాలు అనగానేమి?

3. నికరవడ్డీ అంటే ఏమిటి?

4. నికర లాభం అనగానేమి?

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ఆదాయ పంపిణీలోని రకాలను వర్గీకరించండి.
2. ద్రవ్య వేతనాలకు,వాస్తవిక వేతనాలకు మధ్య తేడాలను రాయండి.
3. స్థూల లాభంను వివరించండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. రికార్డో భాటక సిద్ధాంతం గురించి విమర్శనాత్మకంగా వివరించండి.
2. వాస్తవిక వేతనాలు అంటే ఏమిటి? వాస్తవిక వేతనాలను నిర్ణయించే అంశాలు ఏవి?
3. లాభం అంటే ఏమిటి? వివిధ లాభ భావనలను వివరించండి?

8.11 పారిభాషిక పదకోశం

స్థూల పంపిణీ : జాతీయ ఆదాయంలో ఉత్పత్తి కారకాల వాటాను తెలుపుతుంది.

ఒప్పంద భాటకం : భూమి, ఇల్లు యంత్రాలు వంటివాటి సేవలను నిర్ణీత కాలానికి ఉపయోగించుకున్నందుకు ముందుగా నిర్ణయించుకున్న ఒప్పందం ప్రకారం యజమానికి చెల్లించే మొత్తాన్ని ఒప్పంద భాటకం అంటారు.

నికర వడ్డీ : మూలధన సేవలకిచ్చే ప్రతిఫలాన్ని నికర వడ్డీ అంటారు

అసాధారణ లాభాలు : సంస్థ మొత్తం ఉత్పత్తికయ్యే వ్యయం కన్నా రాబడి అధికంగా ఉంటే వచ్చే లాభాలను అసాధారణ లాభాలు అంటారు.

8.12 ఉపయుక్త గ్రంథాలు

1. సూక్ష్మ అర్థశాస్త్రం - డా.బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
2. సూక్ష్మ అర్థశాస్త్రం - బి.ఎ. మొదటి సంవత్సరం తెలుగు అకాడమి.
3. Micro Economic Theory - M.L. JHINGAN

అధ్యాయం

9

జాతీయాదాయ విశ్లేషణ

9.0. లక్ష్యాలు

9.1. పరిచయం

9.2. జాతీయాదాయ నిర్వచనాలు

9.3. జాతీయాదాయాన్ని నిర్ణయించే అంశాలు

9.4. జాతీయాదాయ భావనలు

9.5. జాతీయాదాయంలో భాగాలు

9.6. జాతీయాదాయాన్ని కొలిచే పద్ధతులు

9.7. జాతీయాదాయ అంచనాలో ఉన్న ఇబ్బందులు

9.7.1. జాతీయాదాయ అంచనా ప్రాముఖ్యత

9.8. భారతదేశంలో జాతీయాదాయ అంచనాలు

9.9. సారాంశం

9.10. మాదిరి పరీక్ష ప్రశ్నలు

9.11. పదకోశం

9.12. ఉపయుక్త గ్రంథాలు

9.0 లక్ష్యాలు

- జాతీయాదాయం యొక్క అర్థాన్ని తెలుసుకోగల్గుతారు.
- స్థూల ఆదాయం మరియు నికర ఆదాయం మధ్య భేదాన్ని తెలుసుకోగల్గుతారు.
- జాతీయాదాయాన్ని నిర్ణయించే అంశాల గురించి తెలుసుకుంటారు.
- మాధ్యమిక వస్తువులకు మరియు అంతిమ వస్తువులకు మధ్య భేదంను తెలుసుకుంటారు.
- జాతీయాదాయం యొక్క వివిధ భావనలను తెలుసుకోగల్గుతారు.
- జాతీయాదాయంలోని వివిధ భాగాలను వివరించగలరు.
- ఉత్పత్తి కారకాల ధరలకు, మార్కెట్ ధరలకు మధ్య భేదాన్ని తెలుసుకుంటారు.
- జాతీయాదాయంలోని వివిధ రంగాలను గురించి తెలుసుకుంటారు.
- జాతీయాదాయం యొక్క ప్రాముఖ్యతను గురించి తెలుసుకుంటారు.

9.1 పరిచయం

స్థూలార్థశాస్త్రంలో జాతీయాదాయం అతి ముఖ్యమైన భావన. జాతీయాదాయం ద్వారా ఒక దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరును అంచనా వేయవచ్చును. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిని కొలవడంలో ఇది ఒక కొలబద్దగా ఉపయోగపడుతుంది. ఈ పాఠంలో జాతీయాదాయ వివిధ నిర్వచనాలు, భావాలు, భాగాలు, జాతీయాదాయాన్ని మదించే పద్ధతులు, జాతీయాదాయ అంచనా ప్రాముఖ్యత, జాతీయాదాయ అంచనాలో ఉన్న ఇబ్బందుల గురించి తెలుసుకుందాం.

9.2. జాతీయాదాయ నిర్వచనాలు

జాతీయాదాయాన్ని అనేక విధాలుగా నిర్వచించినారు.

"ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తు సేవల విలువలను ఆ దేశపు జాతీయాదాయం అంటారు."

"ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి చేసిన అన్ని వస్తు సేవల యొక్క మొత్తం ద్రవ్య విలువను జాతీయాదాయం అని కూడా అంటారు." ఉత్పత్తి కారకాలు, వేతనం, భాటకం, వడ్డీ మరియు లాభం రూపంలో పొందిన మొత్తం విలువను జాతీయాదాయం అంటారు.

జాతీయాదాయానికి వివిధ ఆర్థికవేత్తలు వివిధ నిర్వచనాలు అందించినారు.

అందులో నూతనమైన నిర్వచనాన్ని Simon Kuznet ఇవ్వడం జరిగింది.

Simon Kuznet ప్రకారం జాతీయాదాయం అనగా "దేశంలోని ఉత్పాదక వనరుల ద్వారా జనితమై ఏటా తుది వినియోగదారులను చేరే వస్తు సేవల మొత్తం నికర విలువను లేదా మూలధన రాశికి జత చేయబడే నికర విలువను జాతీయాదాయమని అంటారు.

9.3 జాతీయాదాయాన్ని నిర్ణయించే అంశాలు

ఒక దేశ జాతీయాదాయాన్ని అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. ఈ అంశాల కారణంగానే వివిధ దేశాల జాతీయాదాయ పరిమాణంలో వ్యత్యాసాలు కనిపిస్తాయి.

A) సహజ మరియు మానవ వనరులు

ఒక దేశంలో లభ్యమయ్యే సహజ వనరుల పరిమాణంపై ఆ దేశ జాతీయాదాయం ఆధారపడి ఉంది.

ఉదాహరణ సారవంతమైన నేలలు, గనులు, ఇంధన వనరులు, వ్యాపారయోగ్యమైన శీతోష్ణస్థితి, నిరంతరం ప్రవహించే నదులు మొదలైనవి అధికంగా, అనుకూలంగా లభ్యమయ్యే దేశాలలో అన్ని రంగాలలో అధిక ఉత్పత్తి సాధించవచ్చు. అందువల్ల జాతీయాదాయం పెరుగుతుంది.

ఉద్యమదారితత్వం: నైపుణ్యాలు, శక్తి సామర్థ్యాలు కలిగిన శ్రామిక శక్తి కూడా జాతీయాదాయ పెరుగుదలకు ఉపయోగపడుతుంది. ఉదాహరణ: ఆలోచించే సామర్థ్యం ఉద్యమదారి నైపుణ్యాలు, తెలివైన నిర్ణయాలు తీసుకొనే కౌశలము మొదలైనవి.

మూలధన సంచయనం: ఒక దేశంలో లభించే మూలధనం కూడా దేశ ఆదాయాన్ని ప్రభావితం చేస్తుంది.

B) సాంకేతిక ప్రగతి

ఒక దేశంలో సాంకేతిక విజ్ఞానం ప్రగతిని అనుసరించి ఉత్పత్తి, జాతీయాదాయ పరిమాణం. నిర్ణయించపడుతుంది. ప్రకృతి వనరులు అభిలషణీయ వినియోగానికి అధునాతన ఉత్పత్తి పద్ధతులు దోహదం చేస్తాయి.

C) రాజకీయ స్థిరత్వం

జాతీయాదాయ వృద్ధి రేటు పెంపుకు, ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధికి రాజకీయ నిర్ణయాలు, రాజకీయ స్థిరత్వం దోహదం చేస్తాయి.

9.4 జాతీయాదాయ భావనలు

ఇప్పుడు జాతీయాదాయం యొక్క వివిధ భావనల గురించి తెలుసుకుందాం. జాతీయాదాయ వివిధ భావనలు అర్థం కావాలంటే రెండు ముఖ్యమైన అంశాలను అర్ధం చేసుకోవాలి. అవి:

ఎ) మార్కెట్ ధరల దృష్ట్యా = ఉత్పత్తి కారకాల వ్యయం + పరోక్ష పన్నులు – సబ్సిడీలు

బి) ఉత్పత్తి కారకాల దృష్ట్యా = ఉత్పత్తి కారకాల వ్యయం + సబ్సిడీలు – పరోక్ష పన్నులు

9.4.1. మార్కెట్ ధరల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి (GNP_{MP})

మార్కెట్ ధరలలో స్థూల జాతీయోత్పత్తి అనగా ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి చేసిన అంతిమవస్తు సేవల విలువలను మార్కెట్ ధరలతో భాగించి ఇతర దేశాల నుండి వచ్చే ఆదాయాన్ని కలిపి, ఇతర దేశాలకు చెల్లించాల్సింది తీసివేస్తే, మార్కెట్ ధరల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి వస్తుంది.

$$GNP_{MP} = C + I + G + (X-M) + (R-P)$$

పై సూత్రంలో ప్రధాన భాగాలు

C = మొత్తం వినియోగం, I = స్థూల పెట్టుపడి, G = ప్రభుత్వ వ్యయం, (X-M) = అంతర్జాతీయ వ్యాపారం ద్వారా ఆర్జించిన ఆదాయం (ఎగుమతులు – దిగుమతుల విలువ), R = ఇతర దేశాల నుండి వచ్చే ఆదాయం, P = ఇతర దేశాలకు చెల్లించే ఆదాయం.

9.4.2. ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి [GNP Factor Cost]

ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి అనగా ఉత్పత్తి కారకాల (భూమి, శ్రమ, మూలధనం, వ్యవస్థాపకుడు) ఒక సంవత్సర కాలంలో ఒక దేశంలో ఆర్జించిన మొత్తం ద్రవ్య విలువలను ఉత్పత్తి కారకాల దష్ట్యా జాతీయదాయం అని అంటారు.

GNP at FC = మార్కెట్ ధరలో స్థూల జాతీయోత్పత్తి – పరోక్ష పన్నులు + సబ్సిడీలు

9.4.3. స్థూల దేశీయోత్పత్తి (GDP)

స్థూల దేశీయోత్పత్తి, స్థూల జాతీయోత్పత్తిలో ఒక భాగం. దేశీయ ఉత్పత్తి కారకాల ద్వారా ఒక సంవత్సర –కాలంలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవల విలువను స్థూల దేశీయోత్పత్తి అంటారు. ఇందులో ఇతర దేశాల నుండి వచ్చే నికర ఆదాయం కలిసి ఉండదు.

GDP = GNP – ఇతర దేశాల నుండి వచ్చే నికర ఆదాయం

లేదా

$$GDP = C + I + G + Z$$

ఇందులో ప్రధాన భాగాలు C=మొత్తం వినియోగం, I=మొత్తం పెట్టుబడి, G=మొత్తం ప్రభుత్వ వ్యయం, Z=నికర ఎగుమతులు

ఒకవేళ నికర ఎగుమతులు ఎక్కువగా ఉంటే స్థూల దేశీయోత్పత్తి పెరుగుతుంది.

$Z\uparrow - GDP\uparrow$

ఒకవేళ నికర ఎగుమతులు ఋణాత్మకంగా ఉంటే స్థూల దేశీయోత్పత్తి తగ్గుతుంది.

$Z\downarrow - GDP\downarrow$

9.4.4. మార్కెట్ ధరల దృష్ట్యా నికర జాతీయోత్పత్తి [NNP at MP]

వస్తు సేవల ఉత్పత్తిలో వినియోగించబడే స్థిర మూలధనం (యంత్రాలు, యంత్ర పరికరాలు) కొంత కాలం తరువాత కొంత తరుగుదలకు, అరుగుదలకు గురిఅవుతాయి. ఈ కారణం వల్ల స్థూల జాతీయోత్పత్తి నుండి కొంత భాగంను తరుగుదల, అరుగుదల రూపంలో మినహాయించగా మార్కెట్ ధరలలో నికర జాతీయోత్పత్తి వస్తుంది.

మార్కెట్ ధరలలో నికర జాతీయోత్పత్తి = మార్కెట్ ధరలలో స్థూల జాతీయోత్పత్తి – తరుగుదల (స్థిర మూలధన వినియోగం)

9.4.5. ఉత్పత్తి కారకాల ఖరీదు దృష్ట్యా నికర జాతీయోత్పత్తి [NNP at FC]

ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర జాతీయోత్పత్తినే జాతీయాదాయం అని కూడా అంటారు. ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి కారకాలు పొందే ద్రవ్యరూప ప్రతిఫలమైన బాటకం, వేతనం, వడ్డీ మరియు లాభం కలిపితే మొత్తాన్ని ఉత్పత్తి కారకాల దృష్ట్యా జాతీయోత్పత్తి లేదా జాతీయాదాయం అని అంటారు.

ఉత్పత్తి కారకాల ఖరీదు దృష్ట్యా నికర జాతీయోత్పత్తి లేదా జాతీయాదాయం = ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి – తరుగుదల

(లేదా)

ఉత్పత్తి కారకాల దృష్ట్యా జాతీయోత్పత్తి = మార్కెట్ ధరలలో నికర జాతీయోత్పత్తి – పరోక్ష పన్నులు + సబ్సిడీలు.

9.4.6 వ్యష్టి ఆదాయం (Personal Income)

వ్యష్టి ఆదాయం అనగా ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ఆ దేశ పౌరులు పొందే మొత్తం ఆదాయం.

వ్యష్టి ఆదాయం = ఉత్పత్తికారకాల దృష్ట్యా నికర జాతీయాదాయం – సాంఘిక భద్రత విరాళాలు – కార్పొరేట్ పన్నులు – పంపిణీ చేయబడని కార్పొరేట్ లాభాలు + బదిలీ చెల్లింపులు.

9.4.7 వ్యయార్హ ఆదాయం (Disposable income)

వ్యక్తి తనకు వచ్చిన ఆదాయం నుంచి ప్రత్యక్ష పన్నులైన ఆదాయ పన్ను, ఆస్తి పన్ను మొదలైనవి ప్రభుత్వానికి చెల్లించవలసి ఉంటుంది. వ్యష్టి ఆదాయం నుండి వ్యష్టి పన్నులు తీసివేయగా వచ్చేది వ్యయార్హ ఆదాయం.

వ్యయార్హ ఆదాయం = వ్యష్టి ఆదాయం – వ్యష్టి పన్నులు.

వ్యయార్హ ఆదాయం మొత్తం వినియోగించవచ్చు లేదా పొదుపు చేయవచ్చు. కావున,

వ్యయార్హ ఆదాయం = వినియోగం + పొదుపు

9.4.8 నామమాత్రపు ఆదాయం (Nominal Income)

మార్కెట్ ధరల దృష్ట్యా జాతీయాదాయంను నామమాత్రపు ఆదాయం అంటారు. జాతీయాదాయాన్ని ప్రస్తుత ధరలలో లెక్కిస్తే దానిని 'నామమాత్రపు ఆదాయం' అని అంటారు.

9.4.9 నిజ జాతీయాదాయం (Real National Income)

నిజ జాతీయాదాయాన్నే స్థిర ధరలలో జాతీయాదాయం అని అంటారు. జాతీయాదాయ లెక్కించడానికి ఏదైనా ఒక సంవత్సరాన్ని ఆధార సంవత్సరంగా తీసుకుంటారు. ఈ ఆధార సంవత్సర ధరలలో ఎక్కువగా హెచ్చు, తగ్గులు లేక సమానంగా ఉంటాయి. సాధారణంగా ఆధార సంవత్సర ధరలను 100కు సమానం అని భావిస్తారు. ప్రస్తుత సంవత్సరపు జాతీయాదాయ విలువను ఆధార సంవత్సర ధరలలోకి మార్చే ప్రక్రియను నిజ జాతీయాదాయం వివరిస్తుంది.

ప్రస్తుత ఆధార సంవత్సరం 2011-2012.

9.4.10 జోడించిన స్థూల విలువ (Gross value added)

మొత్తం ఉత్పత్తి విలువ నుండి మాధ్యమిక వస్తువులను తీసివేయగా జోడించబడిన స్థూల విలువ వస్తుంది.

జోడించిన విలువ = ఉత్పత్తి విలువ - మాధ్యమిక వస్తువులు.

9.4.11 తలసరి ఆదాయం (Per Capita Income)

ఒక నిర్దేశిత సంవత్సరంలో ఒక దేశ ప్రజల సగటు ఆదాయాన్ని తలసరి ఆదాయం అంటారు. ప్రస్తుత సంవత్సర జాతీయాదాయాన్ని ఆ దేశ జనాభాచే భాగించడం ద్వారా తలసరి ఆదాయం లెక్కిస్తారు.

$$\text{తలసరి ఆదాయం} = \frac{\text{జాతీయాదాయం}}{\text{జనాభా}}$$

తలసరి ఆదాయాన్ని ప్రస్థుత ధరలలో లెక్కిస్తే, నామమాత్రపు ఆదాయం అంటారు. అదే ఆధార సంవత్సర ధరలలో లెక్కించినట్లుయితే నిజ తలసరి ఆదాయం అంటారు.

9.5 జాతీయాదాయ భాగాలు

జాతీయాదాయంలో [Y] అయిదు ప్రధాన భాగాలున్నాయి. అవి 1) వినియోగం [C] 2) పెట్టుబడి [I] 3) ప్రభుత్వవ్యయం [G] 4) ఎగుమతులు [X] 5) దిగుమతులు [M].

మొదటి నాలుగు భాగాలు దేశంలో ఆదాయాన్ని సృష్టిస్తాయి. అయిదవది ఇతర దేశస్తులకు ఆదాయాన్ని సృష్టిస్తుంది. కావున జాతీయాదాయాన్ని ఈ కింది విధంగా చూపించవచ్చు

$$Y = C + I + G + (X-M)$$

వినియోగం (Consumption): వస్తు సేవలపై చేసే మొత్తం వ్యయాన్ని వినియోగం అంటారు. వినియోగ వ్యయం వ్యక్తుల ఆదాయ స్థాయిపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు ఎప్పుడైతే ఆదాయం పొందుతారో అందులో కొంత భాగం ఖర్చు చేస్తారు. మరికొంత భాగం పొదుపు చేస్తారు. కావున మొత్తం ఆదాయం (Y), వినియోగం (C) మరియు పొదుపు (S)ల కలయిక.

Y = C + S

పెట్టుబడి (Investment): ప్రస్తుత వినియోగానికి వీలుకాని వస్తువులను, సేవలను ఉత్పత్తి చేయడానికి ఉత్పాదక లేదా మూలధన వస్తువులపై సంస్థలు చేసే ఖర్చును పెట్టుబడి అంటారు. ఉదాహరణ అవస్థాపన సౌకర్యాలపై చేసే వ్యయం మొదలగునవి.

ప్రభుత్వ వ్యయం (Govt Expenditure): ప్రభుత్వం సమాజ సంక్షేమం కోసం చేసే వ్యయన్ని ప్రభుత్వ వ్యయం అంటారు. ఉదాహరణ విద్య, వైద్యం, సైన్యం, పోలీసు, రోడ్లు, రైల్వేలు మొదలగువాటిపై చేసే ఖర్చు.

ఎగుమతులు (Exports): ఒక దేశంలో దేశీయ సంస్థల ద్వారా ఉత్పత్తి అయిన అంతిమ వస్తు సేవలను ఇతర దేశాలకు ఎగుమతి చేయాడాన్ని ఎగుమతులు అంటారు.

దిగుమతులు (Imports): ఇతర దేశాలలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తు సేవలను, ఒక దేశ ప్రజలు వారి అవసరాల నిమిత్తం దిగుమతి చేసుకోవడంను దిగుమతులు అంటారు.

నికర విదేశీ ఆదాయం (ఎగుమతులు – దిగుమతులు ఒక X-M)

దేశ జాతీయాదాయ గణనలో ఎగుమతుల విలువ దిగుమతుల విలువల మధ్య వ్యత్యాసాన్ని ధనాత్మకం లేదా రుణాత్మకం) పరిగణించాల్సి ఉంటుంది. ఎగుమతులు ఎక్కువగా ఉంటే నికర ఆదాయం పెరుగుతుంది. దిగుమతులు ఎక్కువగా ఉంటే నికర ఆదాయం తగ్గుతుంది.

జాతీయాదాయానికి చోదకంగా పెటుబడులు [I] ఎగుమతులు [X] మరియు ప్రభుత్వ వ్యయం [G] దోహదపడుతాయి. జాతీయాదాయానికి చిద్రంగా పొదుపు [S] దిగుమతులు [M] మరియు పన్నులు [T] దోహద పడుతాయి.

9.6 జాతీయాదాయ గణన (Measurement of National Income)

జాతీయాదాయాన్ని గణించడానికి మూడు పద్ధతులు అమలులో ఉన్నాయి. అవి:

ఎ) ఉత్పత్తి పద్ధతి లేదా ఉత్పాదిత పద్ధతి

బి) ఆదాయాల పద్ధతి

సి) వ్యయాల పద్ధతి లేదా ఖర్చు పద్ధతి

9.6.1 ఉత్పత్తి మదింపు పద్ధతి (Product method)

దీనినే విలువ జోడించు పద్ధతి అని, ఇన్వెంటరి పద్ధతి అని, వస్తుసేవ పద్ధతి అని కూడా అంటారు. ఈ పద్ధతిలో స్థూల జాతీయోత్పత్తి గణించడానికి ఒక సంవత్సర కాలంలో వివిధ రంగాలలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవల పరిమాణాన్ని వాటి మార్కెట్ ధరలతో గుణించి వాటి విలువను నిర్ణయిస్తారు.

స్థూల జాతీయోత్పత్తి (GNP) = $(P_1Q_1 + P_2Q_2 + \ldots\ldots + P_nQ_n)$ + విదేశీ నికర ఆదాయం.

పై సూత్రంలో, GNP = స్థూల జాతీయత్పత్తి, P = ధర, Q = వస్తు పరిమాణం 1, 2, 3, n-వివిధ రంగాలు ఉత్పత్తి చేసిన వస్తు సేవలు. ఈ పద్ధతిలో ముడిసరుకులు, మాధ్యమిక వస్తువులు మొదలైన వాటి విలువలను లెక్కించకూడదు. ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తు సేవల విలువలను మాత్రమే లెక్కించాలి.

9.6.2 ఆదాయాల మదింపు పద్ధతి (Income method)

ఈ పద్ధతినే ఉత్పత్తి కారకాల ఆదాయ పద్ధతి అని, డివిడెండ్ పద్ధతి అని కూడా అంటారు. ఈ పద్ధతిలో దేశంలో వివిధ ఉత్పత్తి కారకాలకు ప్రతిఫలంగా లభించే బాటకం, వేతనం, వడ్డీ, సంస్థలకు వచ్చిన లాభం కలిపితే జాతీయాదాయం తెలుస్తుంది.

జాతీయాదాయం = R + W + I + P

R = బాటకం, W = వేతనం, I = వడ్డీ, P = లాభం.

బదిలీ చెల్లింపుల ద్వారా వచ్చిన ఆదాయంను కలుపకూడదు. స్వయం ఉపాధి వల్ల అర్జించే ఆదాయాలను కలపాలి.

ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయంలో ఉత్పత్తి కారకాల వాటాలను ఈ పద్ధతి ద్వారా మనం ఉత్పత్తి తెలుసుకోగలుగుతాం.

9.6.3 వ్యయాల మదింపు పద్ధతి (Expenditure method)

దీనినే మెత్తం ఖర్చు పద్ధతి అని, డిస్పోసబల్ పద్ధతి అని, నవీన పద్ధతి అని కూడా అంటారు. ఈ పద్ధతిలో ఒక సంవత్సర కాలంలో వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వం, వస్తుసేవలపై చేసిన ఖర్చు మొత్తాలను, నికర ఎగుమతులు, విదేశీ నికర ఆదాయం కూడితే జాతీయాదాయం తెలుస్తుంది.

NI = EH + EF + EG + NET Exports

పై సూత్రంలో, NI = జాతీయాదాయం, EH = గృహరంగం చేసిన ఖర్చు, EF = సంస్థలు చేసిన ఖర్చు, EG = వస్తు సేవలపై ప్రభుత్వం చేసిన ఖర్చు

Net exports = నికర ఎగుమతులు

ఈ పద్ధతి జాతీయాదాయం జాతీయ వ్యయానికి సమానమే అనే ప్రమేయం ద్వారా మదింపు జరుగుతుంది.

పైన వివరించిన మూడు పద్ధతులను ఉపయోగించి జాతీయాదాయాన్ని అంచనా వేయవచ్చు.

9.7 జాతీయాదాయ మదింపులో సమస్యలు

ఒక దేశం యొక్క జాతీయాదాయాన్ని మదింపు చేసే సమయంలో అనేక సమస్యలు వస్తాయి. ఆ సమస్యలలో కొన్ని ప్రధాన సమస్యలు:

ఎ) వ్యవసాయ రంగం నుండి వచ్చే ఉత్పత్తిని లెక్కించడం కష్టం. ఎందుకనగా పండిన పంటలో కొంత భాగం రైతు తమ సొంత వినియోగం కొరకు ఉంచుకుంటాడు. కావున ఎంత ఉత్పత్తి అయినదో చెప్పడం కష్టం.

బి) చాలా మంది గ్రామీణ వ్యవసాయదారులు నిరక్షరాస్యులు. ఉత్పత్తి గురించి వారు సరియైన సమాచారం ఇవ్వరు.

సి) గృహిణి యొక్క సేవలను జాతీయాదాయంలో లెక్కించడం కష్టం.

డి) వస్తు సేవలు ఒక స్థానం నుండి మరొక స్థానానికి మారినప్పుడు వాటిని రెండు సార్లు లెక్కించే అవకాశం ఉంది.

ఇ) అసాంఘిక కార్యకలాపాల ద్వారా సంపాదించిన ఆదాయంను జాతీయాదాయంలో కలుపలేము.

ఎఫ్) ఉచితంగా చేసిన సేవలను జాతీయాదాయంలో కలుపలేము. కాని అవి సంక్షేమాన్ని పెంచుతాయి.

జి) జాతీయాదాయం లెక్కింపులో మన్నిక గల వస్తువుల విలువను చేర్చడం కూడా ఒక సమస్య.

9.7.1 జాతీయాదాయ అంచనాల ప్రాముఖ్యత

అనేక కారణాల వల్ల జాతీయాదాయ అంచనాల ప్రాధాన్యత పెరుగుతుంది. జాతీయాదాయం అంచనాల ప్రాధాన్యతను ఈ క్రింది అంశాల ద్వారా తెలుసుకోవచ్చు.

ఎ) దేశంలోని వివిధ రంగాల పనితీరును తెలుసుకోవాడానికి జాతీయాదాయ అంచనాలు ఉపయోగపడుతాయి.

బి) తలసరి ఆదాయం ద్వారా దేశంలో నివసిస్తున్న ప్రజల జీవన ప్రమాణ స్థాయిని తెలుసుకోవచ్చు.

సి) ఆర్థిక సంక్షేమం అనేది జాతీయాదాయ పెరుగుదల పైన, ప్రజల జీవన ప్రమాణ స్థాయి పైన ఆధారపడి ఉంటుంది.

డి) వివిధ సంవత్సరాల జాతీయాదాయ అంచనాలను పోల్చుతూ దేశ ఆర్థిక ప్రగతి పెరుగుతుందా, స్థిరంగా ఉందా, తగ్గుతుందా అని చెప్పవచ్చు.

ఇ) బడ్జెట్‌కు సంబంధించి కేటాయింపులకు జాతీయాదాయ అంచనాలు ఉపయోగపడతాయి.

ఎఫ్) జాతీయాదాయ అంచనాలు దేశంలో వివిధ వర్గాల ఆదాయ పంపిణీ కోసం ఉపయోగపడతాయి.

జి) ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పాత్రను అంచనా వేయడానికి వీలు కలుగుతుంది.

9.8 భారతదేశంలో జాతీయాదాయ అంచనాలు

స్వాతంత్ర్యానికి పూర్వమే భారతదేశంలో జాతీయాదాయానికి అనేక మంది ఆర్థికవేత్తలు అనేక రకాలుగా, అంచనా వేశారు. మొట్టమొదటసారిగా దాదాబాయి నౌరోజి 1867-68 లో అంచనా వేశరు. తరువాత విలియం దిగ్బే, ఫిండ్లే షిరాస్, కె.టి. షా, కాంబట్టా, ఆర్.సి.దేశాయ్ మొదలగు అనేక మంది అంచనా వేశారు. 1931-32 సంవత్సరంలో వి.కె.ఆర్.వి.రావు మొట్టమొదటిసారిగా జాతీయాదాయాన్ని శాస్త్రీయబద్ధంగా అంచనా వేశారు.

స్వాతంత్ర్యానంతరం జాతీయాదాయాల అంచనాలను అధికారకంగా ఆంచనా చేయడానికి భారత ప్రభుత్వం ఆగస్టు 1949వ సంవత్సరంలో ఆచార్య పి.సి.మహాలనోబిస్ అధ్యక్షతన డి.ఆర్. గాడ్గిల్, వి.కె.ఆర్.వి. రావు సభ్యులతో జాతీయాదాయ అంచనాల కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం భారతదేశం జాతీయ గణాంక సంస్థ (NSO) జాతీయాదాయ అంచనాలను తయారు చేస్తుంది.

భారతదేశంలో జాతీయాదాయం రెండు పద్దతులలో లెక్కించబడుతుంది. అవి: 1. ఉత్పత్తి మదింపు పద్ధతి 2) ఆదాయం మదింపు పద్ధతి.

కేంద్రీయ గణాంక సంస్థ భారత ఆర్థిక వ్యవస్థను 13 రంగాలుగా విభజించింది. అవి: 1. వ్యవసాయం, పశుపోషణ 2. చేపలు పట్టడం 3. అడువులు, లాగింగ్ 4. గనుల త్రవ్వకం 5. తయారీ సంస్థలు (రిజిస్టర్ అయినవి, రిజిస్టర్ కానివి) 6. నిర్మాణం 7. విద్యుచ్ఛక్తి, గ్యాస్ మరియు నీటి సరఫరా 8. రవాణా నిలువ, కమ్యూనికేషన్ 9. వ్యాపారం, హొటళ్ళు, రెస్తారెంట్లు 10. బ్యాంకింగ్, బీమా 11. రియల్ ఎస్టేట్, నివాస స్థలాల ఆధిపత్యం మరియు ఇతర వ్యాపార సేవలు 12. ప్రభుత్వ పరిపాలన, రక్షణ 13. ఇతర సేవలు.

9.9 సారాంశం

జాతీయాదాయం, స్థూలార్ధశాస్త్రంలో అతి మూల్యమైన భావన. ఇది ఒక దేశపు ఆదాయ వివరాలను విశదీకరిస్తుంది. ఒక దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు అంచనాకు జాతీయాదాయాన్ని ఒక కొలబద్దగా ఉపయోగిస్తారు. జాతీయాదాయ మదింపుకు సంబంధించిన మూడు రకాలైన పద్ధతుల్లో అంచనా వేస్తారు. ఈ పద్ధతుల్లో వ్యయం మదింపు శ్రేష్ఠమైంది. జాతీయాదాయాన్ని అంచనా వేయడం ద్వారా ప్రజల తలసరి ఆదాయాన్ని మరియు ప్రజల జీవన ప్రమాణ స్థాయిని అర్థం చేసుకోవచ్చు.

9.10. మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1) సూలా జాతీయోత్పత్తి అనగానేమి?

2) తలసరి ఆదాయం అనగానేమి?

3) ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర జాతీయోత్పత్తిని వ్రాయండి.

4) వ్యష్టి ఆదాయం అనగానేమి?

5) వ్యయాల మదింపు పద్ధతిని వ్రాయండి.

6) సబ్సిడీలు అనగానేమి?

7) మాధ్యమిక వస్తువులు అనగానేమి?

8) నామమాత్రపు జాతీయాదాయం అనగానేమి?

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1) జాతీయాదాయాన్ని నిర్ణయించే అంశాలను వ్రాయండి.

2) వ్యష్టి ఆదాయానికి, వ్యయార్హ ఆదాయానికి మధ్య భేదంను వివరించండి.

3) జాతీయాదాయంలోని భాగాలను వివరించండి.

4) ఉత్పత్తి కారకాల దృష్ట్యా జాతీయాదాయానికి, మార్కెట్ ధరల దృష్ట్యా జాతీయాదాయానికి మధ్య భేదంను వివరించండి.

5) నామమాత్రపు జాతీయాదాయానికి, నిజ జాతీయాదాయానికి మధ్య తేడాను వివరించండి.

6) జాతీయాదాయ అంచనా యొక్క ప్రాముఖ్యతను వివరించండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1) జాతీయాదాయం అనగానేమి? జాతీయాదాయ వివిధ భావనల గురించి వివరించండి.

2) జాతీయాదాయ, వివిధ అంచనా పద్ధతులను వివరించండి.

3) జాతీయాదాయ అంచనాలో ఉన్న సమస్యల గురించి వ్రాయండి.

4) జాతీయాదాయ అంచనా యొక్క ప్రాముఖ్యత గురించి వివరించండి.

9.11 పదకోశం

1) జాతీయాదాయం: ఒక దేశంలో, ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవల విలువలను ఆ దేశపు జాతీయాదాయం అంటారు.

2) మాధ్యమిక వస్తువులు: ఉత్పత్తి ప్రక్రియలో ఉన్న వస్తువులు.

3) తరుగుదల: స్థిర మూలధనం యొక్క అరుగుదల.

4) ఉత్పత్తికారక వ్యయం: ఉత్పత్తిదారుని దృష్ట్యా వస్తువు యొక్క ధర.

5) నికర జాతీయోత్పత్తి: స్థూల జాతీయోత్పత్తి నుంచి తరుగుదలను మినహాయించాలి.

6) స్థూల దేశీయోత్పత్తి (GDP): దేశీయోత్పత్తి కారకాల ద్వారా ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవల విలువ. దీనికి విదేశీ నిరకర ఆదాయాన్ని కలుపకూడదు.

7) తలసరి ఆదాయం: ఇది దేశ ప్రజల సగటు ఆదాయాన్ని తెలుపుతుంది. జాతీయాదాయాన్ని, ఆ దేశ ప్రజలతో భాగిస్తే తలసరి ఆదాయం వస్తుంది.

$$\text{తలసరి ఆదాయం} = \frac{\text{జాతీయాదాయం}}{\text{జనాభా}}$$

8) జోడించిన స్థూల విలువ (GNA): ఉత్పత్తి విలువ – మాధ్యమిక వస్తువులు

9.12 ఉపయుక్త గ్రంథాలు

1. Principles of Micro Economics- C.Rangarajan, B.H. Dholakia
2. Modern Economics Theory- K.K. Dewett
3. Macro Economic Theory- MC. Vaish

అధ్యాయం

10

ఉద్యోగితా సిద్ధాంతం

10.0 లక్ష్యాలు

10.1 పరిచయం

10.2 ఆదాయం మరియు ఉపాధికి సంబంధించిన సంప్రదాయ సిద్ధాంతం

10.2.1 ప్రమేయాలు

10.2.2 వస్తు, ద్రవ్య మార్కెట్ సమతౌల్యం: సే మార్కెట్ సిద్ధాంతం

10.2.3 ద్రవ్య మార్కెట్ సమతౌల్యం

10.2.4 శ్రామిక మార్కెట్ సమతౌల్యం

10.2.5 వేతన కోత సిద్ధాంతం

10.2.6 సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం యొక్క ప్రధాన అంశాలు

10.2.7 సిద్ధాంతం యొక్క పరిమితులు మరియు విమర్శ

10.3 కీన్స్ ఆదాయ, ఉద్యోగితా సిద్ధాంతం

10.3.1 సమిష్టి సప్లయ్

10.3.2 సమిష్టి డిమాండ్

10.3.3 సార్థక డిమాండ్

10.3.4 కీన్స్ ఆదాయ, ఉద్యోగితా సిద్ధాంతం యొక్క ప్రధాన అంశాలు

10.4. సారాంశం

10.5 మాదిరి పరీక్ష ప్రశ్నలు

10.6. పదకోశం

10.7 ఉపయుక్త గ్రంథాలు

10.0 లక్ష్యాలు

- సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం వివరిస్తారు.
- సమిష్టి డిమాండ్, మొత్తం సరఫరా మరియు సార్థక డిమాండ్ యొక్క అర్థాన్ని వివరిస్తారు.
- కీన్స్ ఆదాయ, ఉద్యోగితా సిద్ధాంతాన్ని వివరిస్తారు.

10.1 పరిచయం

సంప్రదాయ ఆర్థికవేత్తలు స్వేచ్ఛా వ్యాపార భావనను సమర్థించారు. సాంప్రదాయ ఆర్థికవేత్తల ప్రధాన లక్ష్యం స్వేచ్ఛా మార్కెట్లు తమను తాము నియంత్రించుకోవడమే. దీనిని లైసెజ్-ఫెయిర్ అంటారు. మార్షల్ పిగో వంటి సాంప్రదాయ ఆర్థికవేత్తలు ముందుకు తీసుకువెళ్లిన సంప్రదాయ ఆర్థిక సిద్ధాంతానికి, సే సంప్రదాయ మార్కెట్ సిద్ధాంతం మూలమైనది. ఈ అధ్యాయంలో, వస్తువులు మరియు ద్రవ్య మార్కెట్ సమతుల్యత, సే మార్కెట్ల సూత్రం, శ్రామిక మార్కెట్ సమతౌల్యం: పిగో వేతన కోత సిద్ధాంతం, కీన్స్ ఆదాయ, ఉద్యోగితా సిద్ధాంతం గురించి తెలుసుకుందాం.

10.2 ఆదాయం మరియు ఉద్యోగితకు సంబంధించిన సంప్రదాయ సిద్ధాంతం

సాంప్రదాయిక ఆర్థికవేత్తల ప్రకారం, దేశ ఆర్థిక వ్యవస్థ సమతౌల్య స్థాయిలో పూర్తి ఉపాధిని కలిగి ఉంటుంది. స్వేచ్ఛ వ్యాపార (లైసెజ్-ఫెయిర్) ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ ఉద్యోగితా సాధిస్తుందని వారు గట్టిగా నమ్ముతున్నారు. దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగం ఉండదని అర్థం. వారికి, సంపూర్ణ ఉద్యోగితా సాధారణ పరిస్థితి, ఒకవేళ అలాంటి పరిస్థితి లేనట్లయితే దానిని అసాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మార్షల్, పిగో వంటి సాంప్రదాయ ఆర్థికవేత్తలు ముందుకు తీసుకువెళ్లిన సంప్రదాయ ఆర్థిక సిద్ధాంతానికి, 'సే' సంప్రదాయ మార్కెట్ సిద్ధాంతం ఆధారం.

10.2.1 ప్రమేయాలు

- స్వేచ్ఛాపూరిత ధరల వ్యవస్థ ఉంటుంది.
- ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ ఉద్యోగితా ఉంటుంది.
- పరిపూర్ణ మార్కెట్ పోటీ ఉంటుంది.

- శ్రామిక శక్తి సజాతీయంగా ఉంటుంది.
- ఆర్థిక వ్యవస్థ యొక్క మొత్తం ఉత్పత్తిని వినియోగం మరియు పెట్టుబడిగా విభజించాలి.
- దీర్ఘకాలంలో, సమతౌల్యత కొనసాగుతుంది.
- మార్కెట్ పరిధి పరిమితం కాదు. ఇది విస్తరిస్తుంది.

10.2.2 వస్తువులు మరియు ద్రవ్య మార్కెట్ సమతౌల్యం: సే మార్కెట్ సూత్రం

19వ శతాబ్దం ప్రారంభంలో ఫ్రెంచ్ ఆర్థికవేత్త జీన్ బాప్టిస్ట్ సే ప్రసిద్ధ మార్కెట్ సూత్రం అభివృద్ధి చేశారు. "సప్లయ్ డిమాండ్‌ను తనంతట తానే సృష్టించుకుంటుంది". JB సే చట్టం ప్రకారం, సప్లయ్ దాని స్వంత డిమాండ్‌ను సృష్టిస్తుంది. పరిపూర్ణ మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి చేయబడిన వస్తువులకు ఎల్లప్పుడూ డిమాండ్, సరఫరాకు సమానంగా (S = D) ఉంటాయి. ఉత్పత్తి ప్రక్రియ వస్తువుకు మార్కెట్లను స్పృశిస్తుంది. అనగా అమ్మకాలు మరియు కొనుగోలు వస్తూత్పత్తికి అనుగుణంగా జరుగుతాయి. ఇది మరింత ఉత్పత్తికి దారి తీస్తుంది. ఉత్పత్తి ప్రక్రియలో, ఆదాయం, బాటకం, వేతనాలు, వడ్డీ మరియు లాభం రూపంలో సృష్టించబడుతుంది. ఆ ఆదాయం డిమాండ్‌కు దారి తీస్తుంది. నిరుద్యోగిత ఉండదు. ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ ఉద్యోగితా సాధించబడుతుంది. అందువల్ల, ఆర్థిక వ్యవస్థలో సాధారణ అధిక ఉత్పత్తి మరియు నిరుద్యోగిత సమస్య ఉండదు. ఆర్థిక వ్యవస్థలో సాధారణ అధికోత్పత్తి ఉంటే, కొంతమంది శ్రామికులు తమ ఉద్యోగాలను విడిచిపెట్టమని కోరవచ్చు. స్వల్ప కాలంలో ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగిత సమస్య తలెత్తుతుంది, కానీ అది తాత్కాలికమే. దీర్ఘ కాలంలో, వస్తువుల డిమాండ్ మరియు సప్లయ్ సమానంగా మారినప్పుడు ఆర్థిక వ్యవస్థ స్వయంచాలకంగా సంపూర్ణ ఉద్యోగితా వైపు వస్తుంది.

10.2.3 ద్రవ్య మార్కెట్ సమతౌల్యం

వస్తువుల మార్కెట్ సమతౌల్యం ద్రవ్య మార్కెట్ సమతుల్యత మరియు శ్రామిక మార్కెట్ సమతుల్యతకు దారితీస్తుంది. ఉత్పత్తి కారకాలు సంపాదించిన ఆదాయం అంతా మళ్ళీ ఉత్పత్తి పైనే ఖర్చు చేస్తాయి.. ఆదాయం వినియోగం మరియు పొదుపు ద్వారా ఉపయోగించబడుతుంది. పొదుపు ద్వారా వచ్చిన ఆదాయాన్ని మూలధన వస్తువుల కొనుగోలుపై ఖర్చు చేస్తే, దానిని పెట్టుబడి అంటారు. పొదుపు మరియు పెట్టుబడి మధ్య సంబంధం సానుకూలంగా మరియు సమానంగా ఉంటుంది (S=I). ద్రవ్య మార్కెట్ సమతుల్యతలో సరళత్వ వడ్డీ రేటు ప్రముఖ పాత్ర పోషిస్తుంది.



పటం 10.1 మనీ మార్కెట్ సమతౌల్యం

పొదుపులు మరియు పెట్టుబడుల సమానంతో (S=I) ద్రవ్య మార్కెట్ సమతౌల్యంగా ఉంటుందని పై రేఖాచిత్రం ద్వారా తెలుసుకోవచ్చు. OX- అక్షం పొదుపు/ పెట్టుబడులను మరియు OY- అక్షం వడ్డీ రేటును చూపుతుంది. పొదుపులు మరియు పెట్టుబడులు వడ్డీ రేటుతో సమానంగా ఉంటాయి. E అనేది సమతౌల్య స్థానం. వడ్డీ రేటు స్వయంచాలకంగా మారుతుంది మరియు ఈ సమతౌల్య బిందువుపై ఆధారపడి పొదుపు మరియు పెట్టుబడి కూడా మారుతాయి.

10.2.4 శ్రామిక మార్కెట్ సమతౌల్యం

శ్రామిక మార్కెట్‌లో, శ్రామికుల డిమాండ్ మరియు శ్రామికుల సప్లయ్ ఉత్పత్తి మరియు ఉద్యోగితా స్థాయిని నిర్ణయిస్తాయి. సాంప్రదాయిక ఆర్థికవేత్తలు శ్రామికుల డిమాండ్‌ను నిజమైన వేతన రేటు యొక్క ప్రమేయంగా పరిగణిస్తారు.

DN = f (W/P) ఇక్కడ DN = శ్రమకు డిమాండ్, W = వేతన రేటు మరియు P = ధర స్థాయి. వేతన రేటు (W), ధర స్థాయి (P) ద్వారా విభజించడం, నిజమైన వేతన రేటు (W/P) అవుతుంది.

10.2.5 వేతన కోత సిద్ధాంతం

ఆర్థిక వ్యవస్థలో ఎల్లప్పుడూ పూర్తి ఉపాధి ఉంటుందని సంప్రదాయ ఆర్థికవేత్తలు విశ్వసించారు. అధిక వేతన రేట్లు నిరుద్యోగానికి ప్రధాన కారణాలలో ఒకటి అని సంప్రదాయ ఆర్థికవేత్తలు గట్టిగా అభిప్రాయపడ్డారు. నిరుద్యోగం విషయంలో, వేతనాలలో సాధారణ కోత ఆర్థిక వ్యవస్థను పూర్తి ఉపాధి స్థాయికి తీసుకువెళుతుంది. ఈ వాదన ద్రవ్య వేతనాలు మరియు నిజమైన వేతనాల మధ్య ప్రత్యక్ష మరియు అనుపాత సంబంధం ఉందనే ప్రమేయంపై ఆధారపడింది.

ఆర్థికవేత్త ఆర్థర్ సి.పీగూ పేరు పెట్టబడిన పీగూ వేతన కోత సిద్ధాంతం ప్రకారం, ఆర్థిక మాంద్యం సమయంలో అధిక వేతనాలను తగ్గించడం నిరుద్యోగాన్ని తగ్గించడానికి మరియు ఉద్యోగిత పెరగడానికి సహాయ పడుతుందని సూచించే ఆర్థిక సిద్ధాంతం. ఈ సిద్ధాంతం నిరుద్యోగానికి ప్రధాన కారణం అధిక వేతనాలు మరియు

ధరల మధ్య అసమానత అనే ప్రమేయంపై ఆధారపడింది. పీగూ సిద్ధాంతంలో, వేతనాలు మరింత అనువైనవి మరియు తగ్గడానికి అనుమతించినట్లయితే, సర్దుబాటు ప్రక్రియ సున్నితంగా ఉంటుంది. తక్కువ వేతనాలు సంస్థల ఖర్చులను తగ్గిస్తాయి, మార్కెట్లో ధరలను తగ్గిస్తుంది, తద్వారా వస్తువులు మరియు సేవలకు డిమాండ్ పెరుగుతుంది. ఈ డిమాండ్ పెరుగుదల సంస్థలకు ఎక్కువ మంది శ్రామికులను నియమించుకోవడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుంది, తద్వారా నిరుద్యోగిత తగ్గుతుంది.



పటం -10.2: శ్రామిక మార్కెట్ సమతౌల్యం: వేతన కోత సిద్ధాంతం.

పటం 10.2 శ్రామిక మార్కెట్ సమతుల్యతలో, OX- అక్షం శ్రామికుల డిమాండ్ సప్లయ్ మరియు OY- అక్షం వాస్తవ వేతన రేటుపై. వేతన రేట్లు OW2 అయితే, శ్రామికుల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది మరియు సరఫరా తక్కువగా ఉంటుంది (DL>SL). అందువల్ల వేతన రేటు పెరుగుతుంది. వేతన రేటు OW1, శ్రామికుల సప్లయ్ ఎక్కువ మరియు శ్రామికుల డిమాండ్ తక్కువగా ఉంది (DL>SL). అందువల్ల, వేతన రేటు పడిపోతుంది. OW వేతన రేటు వద్ద, శ్రామికుల సరఫరా మరియు డిమాండ్ సమానంగా ఉంటాయి (DL=SL). ఇది సంపూర్ణ ఉద్యోగితాతో సమతుల్యత 'E' కు దారితీస్తుంది.

10.2.6 సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం యొక్క ప్రధాన అంశాలు

- సంపూర్ణ ఉద్యోగితాకి ప్రాముఖ్యత
- అసంకల్పిత నిరుద్యోగిత లేదు
- పరిపూర్ణ పోటీలో సాధారణ నిరుద్యోగిత ఉండదు.
- ద్రవ్య వేతనాలలో తగ్గుదల నిజమైన వేతనాలను కూడా తగ్గిస్తుంది.
- వేతనం మరియు ధరల సరళత్వం 'సే' యొక్క మార్కెట్ సిద్ధాంతం ప్రకారం జరుగుతుంది.
- సే మార్కెట్ సూత్రం ప్రకారం, అధిక ఉత్పత్తి మరియు సాధారణ నిరుద్యోగ సమస్య లేదు.

- ప్రజలు తమ మొత్తం ఆదాయాన్ని వినియోగం మరియు పెట్టుబడిపై ఖర్చు చేస్తారు.
- పొదుపు, పెట్టుబడితో సమానం.
- పొదుపులు మరియు పెట్టుబడులను సమం చేసేందుకు వడ్డీ రేటును మార్చవచ్చు.

10.2.7 సంప్రదాయ సిద్ధాంతం యొక్క పరిమితులు మరియు విమర్శ

- సంప్రదాయ సిద్ధాంతం యొక్క ప్రమేయం వాస్తవ ప్రపంచంలో వర్తించదు.
- పూర్తి ఉపాధి అవాస్తవమైనది.
- సప్లయ్ దాని డిమాండ్‌ను అదే సృష్టిస్తుంది, అనేది ఎల్లప్పుడూ సాధ్యం కాదు.
- సాధారణ ఉద్యోగితా వేతన కోత విధానాన్ని పాటించడం సాధ్యం కాదు.
- వేతన పెరుగుదల వల్ల నిరుద్యోగం ఏర్పడిందన్న సంప్రదాయ ఆర్థికవేత్త వాదనలో నిజం లేదు.
- ఆర్థిక వ్యవస్థలో, ఉత్పత్తి మరియు ఉద్యోగితాని నిర్ణయించడంలో ద్రవ్యం కీలక పాత్ర పోషిస్తుంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో, ద్రవ్యం సప్లయ్ మరియు డిమాండ్ మధ్య సమతుల్యతను సాధించడం సాధ్యం కాదు.
- సాంప్రదాయిక ఆర్థికవేత్తలు పొదుపు పెట్టుబడి మరియు మూలధన సంచితం, ఆర్థిక వృద్ధికి దారితీస్తుందని వాదించారు. అయినప్పటికీ, పెరిగిన పొదుపులు తప్పనిసరిగా పెరిగిన పెట్టుబడిగా మరియు సమిష్టి డిమాండ్‌గా మారని పరిస్థితి ఉండవచ్చు. ఎందుకంటే పొదుపు వల్ల వినియోగ వ్యయం తగ్గుతుంది, ఇది మొత్తం ఆర్థిక కార్యకలాపాల్లో క్షీణతకు దారి తీస్తుంది.
- సంప్రదాయ ఆర్థిక సిద్ధాంతం స్వేచ్ఛా మార్కెట్ల స్వీయ-సర్దుబాటు విధానాలపై ఆధారపడి, ఆర్థిక వ్యవస్థలో కనీస ప్రభుత్వ జోక్యాన్ని సమర్థిస్తుంది. అయితే సంక్షేమ ప్రభుత్వాలను అమలు చేయడం సాధ్యం కాదు.

10.3 కీన్స్ ఆదాయ, ఉద్యోగితా సిద్ధాంతం

1930లలో బ్రిటిష్ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ అభివృద్ధి చేసిన ఆదాయం మరియు ఉద్యోగితాకి సంబంధించిన కీన్స్ సిద్ధాంతం, ఉద్యోగితాకి సంబంధించిన సంప్రదాయ ఆర్థిక సిద్ధాంతానికి ప్రత్యామ్నాయ దృక్పథాన్ని అందిస్తుంది. జె.ఎం.కీన్స్ తన ప్రసిద్ధ గ్రంథం 'జనరల్ థియరీ'ని వ్రాశాడు. అందులో అతను 1930 నాటి మహా మాంద్యం యొక్క వివరణను సమర్పించాడు మరియు పరిష్కారానికి చర్యలను సూచించాడు. అతను

తన ఆదాయ మరియు ఉద్యోగితా సిద్ధాంతాన్ని వివరించాడు. ఇది మొత్తం డిమాండ్ పాత్ర మరియు అసంకల్పిత నిరుద్యోగానికి దారితీసే మార్కెట్ వైఫల్యాల సంభావ్యతపై దృష్టి పెడుతుంది.

10.3.1 సమిష్టి సరఫరా

ఆర్థిక వ్యవస్థలో ఒక నిర్దిష్ట స్థాయి ఉద్యోగితాలో ఉత్పత్తిదారులు, అంతా కలిసి ఉత్పత్తి చేసే అన్ని వస్తువుల ఉత్పత్తిని సమిష్టి సప్లయ్ అంటారు. ఉద్యోగితా పెరిగే కొద్దీ ఉత్పత్తి కూడా పెరుగుతుంది. సమిష్టి ఉత్పత్తి పెరిగినప్పుడు, సమిష్టి సప్లయ్ పెరుగుతుంది. అందువల్ల, సమిష్టి సప్లయ్ ఉద్యోగితా స్థాయిపై ఆధారపడి ఉంటుంది. ఉత్పత్తిదారులు ఉత్పత్తిని కొనసాగించాలంటే కనీసం ఉత్పత్తి వ్యయాన్ని తిరిగి పొందాలిబీ దీనిని సప్లయ్ ధర అంటారు. కాబట్టి సమిష్టి సప్లయ్ ధర అనేది ఒక నిర్దిష్ట స్థాయి ఉద్యోగితాలో ఉత్పత్తి చేయబడిన ఉత్పత్తిని విక్రయించినట్లయితే, ఒక ఆర్థిక వ్యవస్థలోని ఉత్పత్తిదారులు పొందవలసిన కనీస మొత్తం (ఇది ఖర్చుతో సమానం).

సమిష్టి సప్లయ్ ధర అనేది ఉత్పత్తిదారులు వారిచే పని చేస్తున్న శ్రామికుల ద్వారా ఉత్పత్తి చేయబడిన మొత్తం వస్తు ఉత్పత్తుల అమ్మకం నుండి పొందవలసిన మొత్తం ద్రవ్యం. ఉత్పత్తిదారులు కనీసం పొందాలని ఆశించే మొత్తం ఆదాయాన్ని 'సమిష్టి సప్లయ్ ధర' అని అంటారు. దినినే "సమిష్టి సప్లయ్" అని కూడా అంటారు. వివిధ ఉద్యోగితా స్థాయిల వద్ద సమిష్టి సప్లయ్ ధరను చూపించే పట్టికను సమిష్టి ఫలం అంటాం. దీనిని ఈ క్రింది పట్టిక ద్వారా వివరించడం జరిగింది.

పట్టిక–1 : సమిష్టి సరఫరా ఫలం

లక్షల్లో ఉద్యోగితా స్థాయి (N)	మొత్తం సరఫరా ధర (రూ. కోట్లలో) (N)
10	250
12	300
14	350
16	400
18	450
20	500

పై పట్టికలో, సమిష్టి సప్లయ్ ధరలు వివిధ ఉద్యోగితా స్థాయితో మారతాయని గమనించవచ్చు. 10 లక్షల ఉద్యోగితా స్థాయి వద్ద సమిష్టి సప్లయ్ ధర 250 కోట్లు. అనగా ఉత్పత్తిదారుడు ఉత్పత్తిని కొనసాగించాలంటే వస్తూత్పత్తి అమ్మకం ద్వారా కనీసం రూ 250 పొందాలి. లేదంటే ఉత్పత్తిని తగ్గించాల్సి వస్తుంది. 12 లక్షల మంది శ్రామికులు పనిచేస్తున్నప్పుడు ఉత్పత్తిదారు తప్పనిసరిగా 300 కోట్లు అమ్మకం ద్వారా రాబట్టాలి. ఈ విధంగా వివిధ ఉద్యోగితా స్థాయిల వద్ద అమ్మకాల ద్వారా కనీస మొత్తాన్ని అనగా సమిష్టి సప్లయ్ ధరను పెంచుకోవాలి. ఇంతకంటే ఎక్కువ రాబడి పొందితే ఉత్పత్తిని పెంచుతారు లేనిచో తగ్గించాల్సి వస్తుంది.



పై గ్రాఫులో సమిష్టి సప్లయ్ ధర OY- అక్షం మరియు OX- అక్షంపై ఉద్యోగితా స్థాయి లేదా శ్రామికుల సంఖ్య తీసుకోబడింది. ఉద్యోగితా స్థాయి O నుండి N కి పెరిగేకొద్దీ, సమిష్టి సప్లయ్ ధర కూడా పెరుగుతుంది, అంటే శ్రామికుల సంఖ్య పెరిగేకొద్దీ, సమిష్టి సప్లయ్ ధర కూడా పెరుగుతుంది.

10.3.2 సమిష్టి డిమాండ్

సమిష్టి డిమాండ్ ఉత్పత్తి మరియు ఉద్యోగితాని నిర్ణయిస్తుంది: వినియోగం (C), పెట్టుబడి (I), ప్రభుత్వ వ్యయం (G) మరియు నికర ఎగుమతులతో కూడిన మొత్తం డిమాండ్, ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి మరియు ఉద్యోగితా స్థాయిని నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుందని కీన్స్ వాదించారు. మొత్తం డిమాండ్‌లో హెచ్చుతగ్గులు ఆర్థిక కార్యకలాపాల్లో మార్పులకు దారితీస్తాయి, ఇది అధిక నిరుద్యోగం లేదా ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది.

AD= C+I

పట్టిక -2: సమిష్టి డిమాండ్ ఫలం

లక్షల్లో ఉద్యోగితా స్థాయి (N)	సమిష్టి డిమాండ్ ధర (రూ. కోట్లలో)
10	325
12	350
14	375
16	400
18	425
20	**450**

పై పట్టిక ఉద్యోగితా స్థాయి మరియు సమిష్టి డిమాండ్ మధ్య సంబంధాన్ని వివరిస్తుంది. ఉద్యోగితా స్థాయి పెరుగుతున్న కొద్దీ సమిష్టి డిమాండు ధర పెరగడాన్ని చూడవచ్చు. 10 లక్షల ఉద్యోగితా స్థాయి వద్ద సమిష్టి డిమాండ్ ధర 325 కోట్లు. 20 లక్షల ఉద్యోగితా స్థాయి వద్ద సమిష్టి డిమాండ్ ధర 450 కోట్లుకు పెరుగుతుంది.



పై గ్రాఫ్‌లో AD రేఖ సమిష్టి డిమాండు రేఖ. ఇది ఎడమ నుంచి కుడికి పైకి వాలుతుంది. అంటే ఉద్యోగితా స్థాయి పెరిగిన కొలది AD కూడా క్రమంగా పెరుగుతుంది. ఈ రేఖ మూల బిందువు నుంచి కాకుండా బిందువు A నుంచి గీయబడింది. ఎందుకంటే ఉద్యోగిత, ఆదాయం శూన్యమైనప్పటికీ వినియోగం శూన్యంగా ఉండదు. వారి దైనందిన జీవనాన్ని గడపడానికి గతంలో చేసిన పొదుపును వారు వస్తుసేవలకు ఖర్చు చేసి వినియోగంగా మార్చుకుంటారు.

10.3.3 సార్థక డిమాండ్

సార్థక డిమాండ్ భావన ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ యొక్క పనితో దగ్గరి సంబంధం కలిగి ఉంది. ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి మరియు ఉద్యోగితా స్థాయిని నిర్ణయించడానికి సమర్థవంతమైన డిమాండ్ కీలకమని కీన్స్ వాదించారు. సార్థక డిమాండ్ అనేది సమిష్టి డిమాండ్ మరియు సమిష్టి సప్లయ్ ద్వారా నిర్ణయించబడుతుంది, ఇక్కడ సమిష్టి డిమాండ్ మరియు సమిష్టి సప్లయ్ సార్థక డిమాండ్ వద్ద సమానంగా ఉంటాయి. సార్థక డిమాండ్ ఉద్యోగితా స్థాయిని నిర్ణయిస్తుంది. ఈ సమయంలో, ఆశించిన మొత్తం మరియు ఉత్పత్తిదారుడు అందుకోవాల్సిన మొత్తాలు సమానంగా ఉంటాయి. ఈ సమయంలో ఉత్పత్తిదారులు సాధారణ లాభాలను పొందుతారు.

పట్టిక-3 సార్థక డిమాండ్

లక్షల్లో ఉద్యోగితా స్థాయి (N)	సమిష్టి సరఫరా ధర (రూ. కోట్లలో)	సమిష్టి డిమాండ్ ధర (రూ. కోట్లలో)
10	250	325
12	300	350
14	350	375
16	400	400
18	450	425
20	500	450

పై పట్టికలో వివిధ స్థాయిలో ఉద్యోగితా, సమిష్టి సప్లయ్ ధరలు మరియు సమిష్టి డిమాండ్ ధరలను చూపుతుంది. ఉద్యోగితా స్థాయి 16 లక్షలు ఉన్నప్పుడు ఆశించిన మొత్తం (సమిష్టి డిమాండ్ ధర) రూ.400 కోట్లు మరియు అందుకోవాల్సిన మొత్తం (సమిష్టి సరఫరా ధర) రూ. 400 కోట్లు సమానంగా ఉన్న స్థాయిని సార్థక డిమాండ్ స్థాయిని సూచిస్తుంది.



పై గ్రాఫ్‌లో, సమిష్టి డిమాండ్ ధర వక్రరేఖ (ADP) మరియు సమిష్టి సప్లయ్ ధర వక్రరేఖ (ASP), E వద్ద ఒకదానికొకటి కలుస్తాయి. ఇది సమతౌల్య బిందువును చూపుతుంది. ON1 ఉద్యోగితా స్థాయి వద్ద సమతౌల్యం సాధించబడింది. ఆర్థిక వ్యవస్థ నిరుపయోగంగా ఉత్పత్తి కారకాలను కలిగి ఉన్నందున పై రేఖాచిత్రంలో సంపూర్ణ ఉద్యోగిత కాదు. కీన్స్ విశ్లేషణలో ఇది అల్ప ఉద్యోగిత సమతౌల్యంగా పరిగణించబడుతుంది.

కీన్స్ థియరీ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ప్రకారం, సంపూర్ణ ఉద్యోగితా సాధించడానికి, సమిష్టి డిమాండ్ వక్రరేఖలో పైకి మార్పు అవసరం. ప్రైవేట్ పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపనప్పుడల్లా ఆర్థిక వ్యవస్థలో సప్లయ్ చేయబడిన వస్తువులు మరియు సేవలపై ప్రభుత్వ వ్యయంతో ఇది చేయవచ్చు. దీనితో, AD1 వక్రరేఖ (C+I) సార్థక డిమాండ్ E2 యొక్క బిందువు వద్ద AD2 (C+I+G)గా మారుతుంది, ఇక్కడ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ ఉద్యోగితా స్థాయికి చేరుకుంటుంది. E2 తదుపరి సమిష్టి డిమాండ్ నందు పెరుగుదల ద్రవ్యోల్బణానికి (సాధారణ ధరలస్థాయిలో పెరుగుదల) దారి తీస్తుంది. ఎందుకంటే వనరులన్నీ సమర్ధవంతంగా ఉపయోగింపబడ్డాయి. కాబట్టి సమిష్టి సప్లయ్ పెరుగుదలకు అవకాశం లేదు. అందుచేత E2 మరియు E1 మధ్య అంతరం (gap), ద్రవ్యోల్బణ విరామంగా వ్యవహరింపబడుతుంది.

10.3.4 ఆదాయం మరియు ఉద్యోగితా స్థాయికి సంబంధించిన కీన్స్ సిద్ధాంతం యొక్క ప్రధాన అంశాలు

1. ఆర్థిక వ్యవస్థలోని మొత్తం ఆదాయం ఉద్యోగితా పరిమాణంపై ఆధారపడి ఉంటుంది.
2. ఆదాయం మరియు ఉద్యోగితా సార్థక డిమాండ్‌పై ఆధారపడి ఉంటాయి.
3. సార్థక డిమాండ్, సమిష్టి సప్లయ్ మరియు సమిష్టి డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది.
4. స్వల్పకాలంలో సమిష్టి సప్లయ్ స్థిరంగా ఉంటుంది కాబట్టి, ఈ సందర్భంలో కీన్స్ సిద్ధాంతం సమిష్టి డిమాండ్‌పై కేంద్రీకరించడం జరిగింది.
5. ఆర్థిక వ్యవస్థలో రెండు రంగాల (అంటే గృహాలు మరియు ఉత్పత్తి సంస్థలు) సమిష్టి డిమాండ్, వినియోగ వ్యయం మరియు పెట్టుబడి వ్యయం ద్వారా నిర్ణయించబడుతుంది.

10.4. సారాంశం

ఆడమ్ స్మిత్, రికార్డో, జె.బి.సే, జె.ఎస్.మిల్ వంటి సాంప్రదాయ ఆర్థికవేత్తలు లైసెజ్ ఫెయిర్ పాలసీని (స్వేచ్ఛా వ్యాపార భావనను) నమ్ముతారు (ఏ ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వ జోక్యం లేదు) ఉపాధికి సంబంధించిన సాంప్రదాయ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశారు. సంపూర్ణ ఉద్యోగితా అనేది పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ యొక్క సాధారణ లక్షణం అని ఈ సిద్ధాంతం పేర్కొంది. ఉపాధి యొక్క సాంప్రదాయ సిద్ధాంతం స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగం యొక్క అవకాశాన్ని నిర్ధారిస్తుంది. ఆర్థిక వ్యవస్థ ఎల్లప్పుడూ సంపూర్ణ ఉద్యోగితా సమతుల్యతలో ఉంటుంది. జాన్ మేనార్డ్ కీన్స్ "The General Theory of Employment,

Interest and Money"లో తన ఉద్యోగితా సిద్ధాంతాన్ని తెలిపాడు. ఇదే కీన్స్ ఉద్యోగితా సిద్ధాంతంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. తన సిద్ధాంతం అన్నీ స్థాయిల ఉద్యోగితలను వివరిస్తున్నందున దీన్ని సమగ్ర సిద్ధాంతం అని అన్నాడు. సంప్రదాయ వాదులు నిరుద్యోగితను దీర్ఘ కాలానికి సంబంధించిందని తెలపగా, కీన్స్ అది స్వల్పకాలానికి సంబంధించిందని పేర్కొన్నాడు.

10.5 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4–5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. సాంప్రదాయ ఆర్థిక వ్యవస్థ అంటే ఏమిటి ?
2. మార్కెట్ సమతౌల్యం అంటే ఏమిటి?
3. ద్రవ్య మార్కెట్ సమతౌల్యం అంటే ఏమిటి?
4. శ్రామిక మార్కెట్ సమతౌల్యం అంటే ఏమిటి?
5. వేతన కోత విధానం అంటే ఏమిటి?
6. సంపూర్ణ ఉద్యోగితా అంటే ఏమిటి?
7. సమిష్టి సప్లయ్ అంటే ఏమిటి?
8. సమిష్టి డిమాండ్ అంటే ఏమిటి?
9. సార్థక డిమాండ్ అంటే ఏమిటి?

II. క్రింది ప్రశ్నలకు 8–10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. "సప్లయ్ దాని స్వంత డిమాండ్‌ని సృష్టిస్తుంది" వివరించండి.
2. ఆదాయం మరియు ఉద్యోగితాకి సంబంధించిన సంప్రదాయ సిద్ధాంతం యొక్క ప్రమేయాలను వివరించండి.
3. సార్థక డిమాండ్ భావనను వివరించండి.

III. క్రింది ప్రశ్నలకు 16–20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ఆదాయం మరియు ఉద్యోగితా సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించండి.
2. ఆదాయం మరియు ఉద్యోగితా స్థాయికి సంబంధించిన కీన్స్ సిద్ధాంతం క్లుప్తంగా వివరించండి.

10.6. పదకోశం

1. వేతన కోత విధానం: AC పిగౌ వేతన కోత రేటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తుంది, తద్వారా తక్కువ ధరలకు దారి తీస్తుంది, ఫలితంగా వస్తువులకు ఎక్కువ డిమాండ్ ఏర్పడుతుంది.
2. సంపూర్ణ ఉద్యోగితా: పని చేయగల మరియు పని చేయడానికి ఇష్టపడే శ్రామికులందరికీ ఉపాధి లభించే పరిస్థితి.
3. సమిష్టి సరఫరా ధర: సమిష్టి సప్లయ్ ధర అనేది ఉత్పత్తిదారులు వారిచే పని చేస్తున్న శ్రామికుల ద్వారా ఉత్పత్తి చేయబడిన మొత్తం వస్తు ఉత్పత్తుల అమ్మకం నుండి పొందవలసిన మొత్తం ద్రవ్యం.
4. సమిష్టి డిమాండ్ ధర: ఒక ఆర్థిక వ్యవస్థలో ఒక నిర్దేశిత ఉద్యోగితా స్థాయి వద్ద మొత్తం వస్తువులకు ఉన్న మొత్తం డిమాండ్ ను తెలిపేది సమిష్టి డిమాండ్
5. సార్థక డిమాండ్: సార్థక డిమాండ్ అనేది సమిష్టి డిమాండ్ మరియు సమిష్టి సప్లయ్ ద్వారా నిర్ణయించబడుతుంది. ఇక్కడ సమిష్టి డిమాండ్ మరియు సమిష్టి సప్లయ్, సార్థక డిమాండ్ అని పిలువబడే బిందువు వద్ద సమానంగా ఉంటాయి.

10.7 ఉపయుక్త గ్రంథాలు

1. తెలుగు అకాడమీ నుండి ఇంటర్మీడియట్ ఫిస్ట్ ఇయర్ ఎకనామిక్స్ టెక్స్ట్ బుక్.
2. సీనియర్ సెకండరీ కోర్సు ఎకనామిక్స్ (318), నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్.
3. తెలుగు అకాడమీ నుండి బి.ఏ. రెండవ సంవత్సరం మాక్రో ఎకనామిక్స్
4. Macro Economics M.L. Seth, Published by Lakshmi Narain Agarwal

అధ్యాయం

11

ప్రభుత్వ విత్తం మరియు బడ్జెట్

11.0. లక్ష్యాలు

11.1. పరిచయం

11.1.1. ప్రభుత్వ విత్తం యొక్క భావన

11.1.2. ప్రభుత్వ విత్తం యొక్క భాగాలు

11.1.3. తిరిగి చెల్లించే పద్ధతులు

11.2. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలు

11.3. సమాఖ్య విత్తం

11.4. ఫైనాన్స్ కమీషన్

11.5. బడ్జెట్

11.5.1. బడ్జెట్యొక్క భాగాలు

11.5.2. బడ్జెట్ రకాలు

11.5.3. బడ్జెట్ లోటు

11.6. సారాంశం

11.7. మాదిరి పరీక్ష ప్రశ్నలు

11.8. పదకోశం

11.9. ఉపయుక్త గ్రంథాలు

11.0. లక్ష్యాలు

- ప్రభుత్వ విత్తం నిర్వచనం
- ప్రభుత్వ విత్త శాఖల జాబితా
- ప్రభుత్వ రాబడి
- ప్రభుత్వ వ్యయం
- ప్రభుత్వ ఋణం
- కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలు
- సమాఖ్య విత్తం - ఆర్థిక సంఘం
- బడ్జెట్

11.1. పరిచయం

ప్రభుత్వ విత్తం అనేది ఆర్థికశాస్త్ర శాఖలలో ఒకటి. ప్రభుత్వ విత్తశాస్త్రం యొక్క అర్థాన్ని అర్థం చేసుకోవడానికి, 'ప్రభుత్వ మరియు విత్తం' అనే పదాల గురించి కొంత జ్ఞానం కలిగి ఉండడం ముందుగా అవసరం. పబ్లిక్ అనే పదం సామూహిక పదం. ఇది వ్యక్తుల సేకరణను సూచిస్తుంది మరియు సంఘంలోని సభ్యులందరిని సూచిస్తుంది. విత్తం అనేది డబ్బు ఆదాయాలు లేదా ఆదాయాలు పబ్లిక్ ఫైనాన్స్ అంటే ప్రజల అథారిటీ వనరులు అని అర్థం. ప్రభుత్వ విత్తం అనే పదం మొదటిసారిగా ఇంగ్లాండ్ దేశంలో ఉపయోగించారు.

11.1.1. ప్రభుత్వ విత్తం యొక్క భావన

ప్రభుత్వ విత్తం అనేది ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు సంబంధించినది. ప్రభుత్వ అనే పదాన్ని, కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలను సూచించడానికి ఉపయోగిస్తారు. ప్రభుత్వ విత్తం అనేది పోలీస్ రాజ్యం నుండి సంక్షేమ రాజ్యంగా మార్చడంతో మరియు సమాజం పట్ల ప్రభుత్వ బాధ్యతను నెరవేర్చడానికి, ప్రభుత్వం అనేది ద్రవ్యాన్ని సేకరించడం మరియు ఖర్చు చేయడం అనేది ప్రధాన లక్ష్యం అదేవిధంగా ప్రభుత్వ ఆదాయ, వ్యయాలు మరియు వాటి ప్రభావాలను అధ్యయనం చేస్తుంది.

హ్యూ డాల్టన్ ప్రకారం ప్రభుత్వ విత్తం అనేది ప్రభుత్వ, ఆదాయ, వ్యయాలకు సంబంధించినది మరియు ఒకదానికొకటి సర్దుబాటు చేయడంతో సంబంధం కలిగి ఉంటుంది. ఆడమ్ స్మిత్ ప్రకారం ప్రభుత్వ విత్తం అనేది ప్రభుత్వ రాబడి మరియు వ్యయం యొక్క స్వభావం మరియు సూత్రాలపై పరిశోధన.

ఆధునిక ప్రభుత్వాలు అనేవి ఆర్థిక మరియు సామాజిక మౌలిక సదుపాయాలను సృష్టించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వ విత్తం అనేది మౌలిక సదుపాయాల కోసం చాలా డబ్బు ఖర్చు చేస్తారు. గత ప్రభుత్వాలు జనాభాలోని పేద మరియు అణగారిన వర్గాల కష్టాలను తీర్చడానికి వివిధ సంక్షేమ కార్యక్రమాలపై భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి.

ప్రభుత్వం చేపట్టే కార్యకలాపాల, ఆర్థిక వ్యవస్థ యొక్క ఆదాయం, ఉత్పత్తి, ఉపాధి మరియు సాధారణ ధరల స్థాయిపై ప్రభావం చూపుతాయి. ప్రభుత్వం తన విధులను నిర్వర్తించాలంటే ఆదాయం కావాలి. ఇది వివిధ రకాల పన్నులు విధిస్తుంది. అవసరమైతే ద్రవ్యాన్ని అప్పుగా తీసుకుంటుంది. కొన్నిసార్లు ద్రవ్య లోటు ఉంటుంది. అప్పుడు వివిధ విత్త సంస్థల ఆశ్రయిస్తుంది. అందువల్ల స్థూల ఆర్థికశాస్త్రంలో ప్రధానమైన అంశాలలో ఒకటైన ప్రభుత్వ విత్తంతో కూడిన ప్రభుత్వ రాబడి మరియు వ్యయాల గురించి తెలుసకోవాల్సిన అవసరం ఉంది.

11.1.2. ప్రభుత్వ విత్తం యొక్క భాగాలు

ఎ) ప్రభుత్వ ఆదాయం

ప్రభుత్వ ఆదాయం అంటే పన్నులు విధించడం ద్వారా ఆదాయాన్ని సేకరించడం మరియు అనేక ఇతర రూపాల్లో ప్రజల నుండి ద్రవ్యాన్ని స్వీకరించడం, వివిధ వనరుల నుండి ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ ఆదాయం అంటారు. ప్రభుత్వ ఆదాయం స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించబడినది. 1. పన్ను రాబడి 2.పన్నేతర రాబడి

1. పన్ను రాబడి

ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని పన్ను రాబడి అంటారు. ప్రత్యక్ష మరియు పరోక్ష పన్ను అనే రెండు రకాల పన్నులు ప్రజల నుండి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే పన్నులు.

- **ప్రత్యక్ష పన్ను:** ఆదాయం మరియు వ్యయం ఆధారంగా వ్యక్తులపై, కంపెనీలపై విధించే పన్నులు. ఉదా: వ్యక్తిగత ఆదాయ పన్ను, వడ్డీ పన్ను, వ్యయంపై పన్ను, వ్యక్తులు మరియు కంపెనీ ఆస్తి మరియు మూలధన ఆస్తులపై విధించే పన్నులు. ఉదా: సంపద పన్ను, బహుమతి పన్ను, ఎస్టేట్ సుంకం.

- **పరోక్ష పన్నులు:** పన్నుల భారం అనేది పరోక్షంగా నిర్ణయించబడుతుంది. వస్తువులు మరియు సేవలపై విధించే పన్నులు. ఉదా: ఎక్సైజ్ పన్ను, కస్టమ్స్ పన్ను, సేవా పన్ను, అమ్మకపు పన్ను.

- **వస్తువు మరియు సేవల పన్ను (GST):** GST అనేది భారతదేశంలో అనేక వ్యక్తిగత పన్నుల స్థానంలో విధించిన పరోక్ష పన్ను. 1954 సంవత్సరంలో ఫ్రాన్స్ దేశంలో GSTని మొదటిసారిగా ప్రవేశపెట్టారు. వస్తు సేవా పన్ను చట్టం 29 మార్చి 2017లో 122 వివరణ చట్టం ద్వారా పార్లమెంట్ ద్వారా ఆమోదం పొందినది. ఇది 1 జులై 2017 నుండి అమలులోకి వచ్చింది. GST అనేది ప్రతి వస్తువు విలువ జోడింపుపై విధించబడే సమగ్ర, బహుళ దశ, గమ్య, ఆధారిత పన్ను సరళంగా చెప్పాలంటే GST అనేది వస్తువులు మరియు సేవల సరఫరాపై విధించే పరోక్ష పన్ను GST రేట్లకు నాలుగు (4) స్లాబ్ రేట్లు నిర్ణయించబడ్డాయి. అంటే 5%, 12%, 18%, 28%.

GST వ్యవస్థ కింద వర్తించే 3 రకాల పన్నులు

1. CGST (సెంట్రల్ GST) కేంద్ర ప్రభుత్వం విధించే GST
2. SGST (రాష్ట్ర GST) రాష్ట్ర ప్రభుత్వం విధించే GST
3. IGST (ఇంటిగ్రేటెడ్ GST) ఇంటిగ్రేటెడ్ GSTని కేంద్రం మరియు రాష్ట్రాలు ఏక కాలంలో విధిస్తాయి.

గతంలో పరోక్ష పన్నును, కేంద్రం మరియు రాష్ట్రం రెండూ విధించిన అనేక పరోక్ష పన్నులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాల ప్రధానంగా వాల్యూ యాడెడ్ ట్యాక్స్ (VAT) రూపంలో పన్నులు వసూలు చేస్తున్నాయి. ప్రతి రాష్ట్రం వేర్వేరు నియమాలు మరియు నిబంధనలను కలిగి ఉంది. అంతరాష్ట్ర వస్తువుల అమ్మకంపై కేంద్రం పన్ను విధించింది.

2. పన్నుయేతర ఆదాయం

ప్రభుత్వం పన్నులు కాకుండా ఇతర వనరుల నుండి కూడా పొందుతుంది. అటువంటి ఆదాయాన్ని పన్నుయేతర ఆదాయం అంటారు. పన్నుయేతర ఆదాయ వనరులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

ఎ) పరిపాలన రాబడి: నిర్దిష్ట పరిపాలన కోసం ప్రభుత్వానికి కొంత ఆదాయం సమకూరుతుంది. ఉదా: లైసెన్స్ రుసుము, ట్యూషన్ ఫీజు, పెనాల్టీ, ప్రత్యేక అంచనా ఫీజులు

బి) వాణిజ్య ఆదాయం: ఆధునిక ప్రభుత్వాలు అనేక ప్రభుత్వ రంగ విభాగాలను ఏర్పాటు చేసి, వస్తువులను తయారు చేయడంతో పాటు కొన్ని సేవలను అందిస్తాయి. దాని ద్వారా వస్తు యూనిట్లను, తమ ఉత్పత్తులను విక్రయించడం ద్వారా ఆదాయాన్ని పొందుతాయి. ఉదా: IOL, BSNL, BHEL, TSRTC, ఇండియన్ రైల్వేస్, ఎయిరిండియా మొదలైనవి.

సి) రుణాలు మరియు అడ్వాన్సులు: ప్రభుత్వానికి, పన్నులు మరియు పన్నేతర వనరుల నుండి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం, ప్రభుత్వ వ్యయానికి సరిపోనప్పుడు దేశంలో పని చేస్తున్న ఆర్థిక సంస్థల నుండి మరియు ప్రజల నుండి కూడా రుణాలను పొందవచ్చు. ఆధునిక ప్రభుత్వాలు, విదేశీ ప్రభుత్వాల నుండి మరియు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుండి కూడా రుణాలు పొందవచ్చు. ఉదా: IBRD, IMF, ADB మొదలైనవి.

డి) గ్రాంట్స్ ఇన్ ఎయిడ్: గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ అంటే ఏవిధమైన రీపేమెంట్ లేకుండా స్వీకరించడం, అవి తిరిగి చెల్లించబడవు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం నుండి అటువంటి గ్రాంట్లను పొందుతాయి. అలాగే కేంద్ర ప్రభుత్వం, విదేశీ ప్రభుత్వాలు లేదా ఏదైనా అంతర్జాతీయ నిధుల ఏజెన్సీ నుండి అటువంటి గ్రాంట్లను పొందవచ్చు.

i) సాధారణ గ్రాంట్లు: ఒక ప్రయోజనాన్ని పేర్కొనకుండా సాధారణంగా నిధుల కొరతను తీర్చడానికి గ్రాంట్ ఇచ్చినపుడు దానిని సాధారణ గ్రాంట్ అంటారు.

ii) నిర్ధిష్ట గ్రాంట్లు: నిర్ధిష్ట ప్రయోజనం కోసం మంజూరు చేయబడినప్పుడు, దానిని నిర్ధిష్ట గ్రాంట్ అంటారు. దీనిని మరే ఇతర ప్రయోజనాల కోసం ఖర్చు చేయలేము. ఉదా: విద్యా గ్రాంటు, ఆరోగ్య గ్రాంటు, వరదల గ్రాంటు.

బి) ప్రజా వ్యయం: ప్రజా వ్యయం అనేది పౌరుల కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సామూహిక అవసరాలకు లేదా వారి ఆర్థిక, సామాజిక సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వ అధికారులు చేసే ఖర్చు. ఉత్పాదక సామర్థ్యంలో వృద్ధి రేటును నియంత్రించే మూలధనం చేరడంలో ప్రభుత్వ వ్యయం పాత్ర ముఖ్యమైనది.

ప్రభుత్వ వ్యయం అనేది వివిధ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించడానికి, ప్రభుత్వం చేసే ఖర్చు, ప్రజా వ్యయం అనేది సమాజానికి డబ్బును చేస్తుంది. ప్రభుత్వ వ్యయం పెరిగితే సమాజ ఆదాయం కూడా పెరుగుతుంది. తద్వారా దేశంలో అభివృద్ధి జరుగుతుంది. ప్రభుత్వ వ్యయం తగ్గితే, ఆదాయ స్థాయి కూడా తగ్గుతుంది. దాని ఫలితంగా దేశంలో అభివృద్ధి ఉండదు.

సి) ప్రభుత్వ రుణం: ప్రభుత్వ ఖర్చు తన ఆదాయాన్ని మించిపోయినప్పుడు ప్రభుత్వం పబ్లిక్ రుణాన్ని ఎంచుకోవచ్చు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం దేశంలోని వివిధ వనరుల నుండి లేదా విదేశాల నుండి నిధులను తీసుకుంటుంది. ఇది ప్రజా రుణాన్ని సృష్టిస్తుంది. మూలాధారాల ఆధారంగా ప్రజా రుణాన్ని 2 రకాలుగా వర్గీకరించారు.

i) అంతర్గత రుణం: అంతర్గత ప్రభుత్వ రుణం అంటే, ప్రభుత్వం దేశంలోని పౌరులు, ఆర్థిక సంస్థలు మరియు ఇతర ఏజెన్సీల నుండి ప్రభుత్వం తీసుకున్న రుణాన్ని తెలియజేస్తుంది.

ii) బాహ్య రుణాలు: విదేశీ పెట్టుబడిదారుల, ఏజెన్సీలు, ఆర్థిక సంస్థలు, బహుళ జాతీయాలు మరియు తన నియంత్రణలో ఉన్న భౌగోళిక ప్రాంతం వెలుపల విదేశీ బ్యాంకుల నుండి ప్రభుత్వం తీసుకున్న రుణాలను విదేశీ రుణాలు సూచిస్తాయి.

ఉదా: IMF, IBRD, IFC మొదలైన ప్రభుత్వ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు.

ప్రభుత్వ రుణ విముక్తి: విముక్తి అంటే రుణాన్ని తిరిగి చెల్లించడం, వ్యక్తులు లేదా సంస్థలు, తన రుణాన్ని తిరిగి చెల్లించినట్లే, ప్రభుత్వం కూడా రుణంపై వడ్డీని మాత్రమే కాకుండా గడువు తేదీలో అసలు తిరిగి చెల్లించాలి.

తిరిగి చెల్లింపు వల్ల క్రింది ప్రయోజనాలను కలిగి ఉంది.

i) ముందుగా ఇది ప్రభుత్వాన్ని దివాలా తీయకుండా కాపాడుతుంది.

ii) రెండవది ప్రభుత్వం యొక్క దుబారా ఖర్చులను నిరుత్సాహపరుస్తుంది.

iii) మూడవది ఇది రుణదాతల విశ్వాసాన్ని కాపాడుతుంది.

iv) ఇది భవిష్యత్తు తరాల అప్పుల భారం నుండి కాపాడుతుంది.

11.1.3. తిరిగి చెల్లించే పద్ధతులు

1) **తిరస్కరణ:** ప్రభుత్వ రుణం చెల్లించడానికి నిరాకరించడం. 1917లో సోవియట్ మాత్రమే ఈ పద్ధతిని అనుసరించింది. కానీ ఆధునిక ప్రజాస్వామ్య దేశాల్లో ఒప్పందాలను అంగీకరించాలి మరియు గౌరవించాలి. అంతేగాని తిరస్కరణ పద్ధతి సాధ్యం కాదు.

2) **రీఫండింగ్:** ప్రభుత్వ తన బాండ్లను చెల్లించడానికి విక్రయిస్తే, అది రుణాలను తిరిగి చెల్లించడం అంటారు. రీఫండింగ్ అనేది కాలం తీరిన బాండ్లను కొత్త బాండ్ల ద్వారా భర్తీ చేసే ప్రక్రియ.

3) **మార్పిడి:** ప్రభుత్వ రుణాన్ని మార్చడం అంటే పాత వాటిని కొత్త రుణ మార్పిడి. మార్పిడి ప్రక్రియ అనేది పబ్లిక్ రుణాన్ని ఎక్కువ నుండి తక్కువ వడ్డీకి చేర్చడం లేదా మార్చడం.

4) వాస్తవ తిరిగి చెల్లింపు: వాస్తవంగా తిరిగి చెల్లింపు పద్ధతి అనేది ఈ క్రింది విధంగా చేస్తారు.

ఎ) సంచిత నిధి: ఈ పద్ధతిలో బకాయి ఉన్న రుణాన్ని తిరిగి చెల్లించడం కోసం ప్రతి సంవత్సరం కొంత మొత్తంతో ఆదాయాన్ని జమ చేసే ఫండ్‌ను సృష్టిస్తున్నారు. డాల్టన్ ప్రకారం సంచిత నిధిని ట్రెజరీ యొక్క ప్రస్తుత ఆదాయం నుండి తయారు చేయడానికి కాని రుణాల నుండి కాదు.

బి) మిగులు రాబడి: ప్రభుత్వ రుణాన్ని చెల్లించడానికి ప్రతి సంవత్సరం మిగులు బడ్జెట్ విధానాన్ని అనుసరించవచ్చు. మెచ్యూరిటీపై తిరిగి చెల్లింపు కోసం నిధిని సృష్టించే బదులు క్రమంగా ప్రభుత్వ రుణం తగ్గించుకోవచ్చు. కానీ ఇటీవలి కాలంలో సంవత్సరాలుగా, ప్రభుత్వ వ్యయం పెరుగుదల కారణంగా మిగులు బడ్జెట్ అనేది అరుదైన దృగ్విషయం.

సి) టెర్మినల్ యాన్యుటీలు: ప్రభుత్వం ప్రతి సంవత్సరం విభజింపబడిన క్రమపద్ధతి ప్రకారం ప్రతి సంవత్సరం మెచ్యూర్‌లలో కొంత భాగాన్ని టెర్మినల్ యాన్యుటీని జారీ చేయవచ్చు. ఈ పద్ధతిలో ప్రతి సంవత్సరం రుణం తిరిగి చెల్లించబడుతుంది. అందువల్ల రాష్ట్ర భారం కూడా చాలా తగ్గుతుంది.

డి) క్యాపిటల్ లెవీ: ఆస్తి మరియు సంపదపై విధించే పన్నును క్యాపిటల్ లెవీ అంటారు. ఇది నిర్ణీత విలువ కంటే ఎక్కువ మూలధన ఆస్తులపై విధించబడిన పన్ను. యుద్ధంపై చేసే రుణం అనుత్పాదక రుణంగా పిలువబడుతుంది. కావున క్యాపిటల్ లెవీ అనేది యుద్ధం తరువాత మారుతుంది.

11.2. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలు

భారతదేశం అనేది సమాఖ్య మరియు నిర్మాణాత్మకమైన, కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబందాలను కలిగి ఉన్న దేశం. దాదాపు అన్ని సమాఖ్యలలో చాలా ముఖ్యమైనదిగా గుర్తించబడింది. ఆధునిక రాజ్యాంగంలోని ఆర్టికల్ 263 నుండి 281 వరకు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీకి సంబంధించిన విషయాలను తెలుపుతుంది. కేంద్ర ప్రభుత్వానికి విస్తృతమైన ఆర్థిక అధికారాలు ఉన్నవి.

ఆధునిక కాలంలో సమాఖ్య నిర్మాణం ఉన్న దేశాల్లో ఆర్థికాభివృద్ధిని సాధించడంలో కేంద్ర ప్రభుత్వం ముఖ్యమైన మరియు కీల పాత్ర పోషిస్తుందని గమనించవచ్చు. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం సమాఖ్య విధానంగా ఏర్పడింది. ఆ విధంగా అవసరమైన అంశాలను భారత రాజ్యాంగంలో పొందుపర్చబడ్డాయి. సమాఖ్య అనే ఉనికికి అవసరమైన కేంద్ర, రాష్ట్ర సంబంధాలు అనేవి నిర్వహించబడతాయి. కాబట్టి కేంద్రం మరియు రాష్ట్రాల మధ్య ఆర్థిక సర్దుబాటు చేసి ఆర్థిక బదిలీలను వివరంగా తెలుసుకోవడం అవసరం.

కేంద్ర జాబితా ప్రకారం, నిర్దిష్ట వస్తువులపై కేంద్రం పన్ను విధిస్తుంది. రాష్ట్ర జాబితా ప్రకారం నిర్దిష్ట వస్తువులపై రాష్ట్ర శాసనసభ పన్ను విధిస్తుంది.

I) కేంద్ర ప్రభుత్వం క్రింద ఇవ్వబడిన విధించే ప్రత్యేక అధికారాలు కలిగి ఉంది.

1. కార్పొరేషన్ పన్ను
2. కస్టమ్స్ పన్ను
3. మూలధన లాభాల పన్ను
4. ఆదాయపు పన్నుపై సర్‌చార్జ్
5. రైల్వే చార్జీలు
6. పొగాకుపై ఎక్సైజ్ సుంకాలు
7. వస్తువులపై టెర్మినల్ పన్నులు మొదలైనవి.

II) రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉంది.

1. భూ ఆదాయం
2. స్టాంప్ డ్యూటీ
3. ఎస్టేట్ డ్యూటీ
4. ప్రవేశ పన్ను
5. అమ్మకపు పన్ను
6. వాహనాలు మరియు విలాస వస్తువులపై పన్నులు మొదలైనవి
7. ఆస్తి మరియు భవనాలపై పన్నులు
8. వ్యవసాయ భూములపై ఎస్టేట్ సుంకం

కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా స్వతంత్రంగా ఉంటుంది. ఎందుకంటే కేంద్రానికి విస్తృతమైన ఆర్థిక వనరులు ఉన్నవి. దీనిని విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం వద్ద అవసరమైన దానికంటే ఎక్కువ వనరులు లేనందున ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వాలు అనేవి కేంద్రంపై ఆధారపడతాయి. శాంతి భద్రతలు, విద్య, ఆరోగ్యం మొదలైన వాటి నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వాలదే ప్రత్యక్ష బాధ్యత.

భారత రాజ్యాంగం 275 ప్రకారం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థికంగా, స్వతంత్రంగా ఉండేందుకు గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ అందిస్తుంది. కొన్ని రాష్ట్రాలతో, గిరిజన సంక్షేమ అభివృద్ధికి గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ అందిస్తుంది. వరదలు లేదా కరువు వంటి ఏదైనా సహజ వాతావరణ సమస్యలు ఏర్పడితే, ఆ సందర్భంలో కూడా రాష్ట్రాలకు గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ అందించబడుతుంది.

వివిధ అధికారాలు:

1) 73వ మరియు 74వ రాజ్యాంగ సవరణ చట్టంతో గ్రామాలు పంచాయతీలకు మరియు పురపాలక సంఘాలకు ఏకీకృత నిధి నుండి నిధులు అందజేయాలని పేర్కొనడం జరిగింది.

2) ఆర్టికల్ 36 ప్రకారం, ఆర్థిక అత్యవసర పరిస్థితిని ప్రకటించే సమయంలో రాష్ట్రపతి, రాష్ట్రానికి ఆర్థిక అధికారాలు ఇవ్వవచ్చు. పన్ను రాబడి పంపిణీతో పాటు కేంద్ర ప్రభుత్వం రెండు ఇతర రాబడి మార్గాలను అనుసరిస్తుంది.

   i) కేంద్ర రుణాలు

   ii) రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్స్-ఇన్-ఎయిడ్

11.3. సమాఖ్య విత్తం

సమాఖ్య విత్తం అనేది, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన విత్త విషయాలను సూచిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ ఆదాయం మరియు వ్యయాల గురించి మరియు కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల మధ్య ఎలా పంపిణీ చేయవచ్చో తెలుపును.

"సమాఖ్య విత్తం అనేది కేంద్ర, రాష్ట్రాల మధ్య విత్త వనరుల గూర్చి తెలుపుతుంది. అలాగే ప్రభుత్వాలు మరియు రెండింటి మధ్య గల సంబంధమును తెలుపును."

- ఆర్.ఎన్. భార్గవ

సమాఖ్య విత్తం యొక్క లక్షణాలు:

1) రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ఆదాయ మరియు వ్యవయాల వనరుల గురించి హెడ్స్ ఇవ్వబడ్డాయి.

2) సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుంది.

3) రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి ఉన్నప్పటికీ, వారు కేంద్రం ఆధీనంలో ఉంటారు.

4) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏదైనా వివాదం ఉంటే అవి రాజ్యాంగబద్ధమైన నిబంధనల ప్రకారం పరిష్కరించబడతాయి.

సమాఖ్య ప్రభుత్వం విజయవంతం కావడానికి గల షరతులు:

1) అన్ని ప్రభుత్వాలు స్వతంత్ర ఆదాయ వనరులను కలిగి ఉండాలి. అలాగే వనరుల సమీకరణను చేపట్టాలి.

2) అన్ని ప్రభుత్వాలు వాటి వనరులపై పూర్తి అధికారాన్ని కలిగి ఉంటాయి.

సమాఖ్య విత్తం విధాన ఆవిర్భావం - నిబంధనలు:

1935 భారత చట్టం ఆధారంగా, సమాఖ్య విత్త విధానాన్ని భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఈ చట్టంలో ఆర్థిక స్వాతంత్ర్యం మరియు ప్రాథమిక సూత్రాలను వివరిస్తుంది.

1) కేంద్రం ఆర్థికంగా ఉన్నత స్థాయి సాధించాలి....

i) కేంద్రం మరింత అధిక ఆదాయ వనరులు కలిగి ఉండాలి.

ii) కేంద్రానికి ద్రవ్య ముద్రణ మరియు బ్యాంకింగ్‌తో పాటు లోటు విత్తంను తీసుకునే వెసులుబాటు ఉంది.

iii) కేంద్ర ప్రభుత్వానికి కొన్ని ప్రత్యేక ఆదాయ వనరులను కేటాయించింది.

iv) కేంద్రానికి అవశేష అధికారాలు ఉన్నాయి.

2) సమర్థవంతమైన విధులు ఆర్థిక అధికారాలు కలిగి ఉండడం: రాజ్యాంగంలో మూడు రకాల జాబితాలు వర్గీకరించారు. అవి: కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా.

3) వనరుల బదిలీని సమకూర్చాలి: రాజ్యాంగంలో వనరులను బదిలీ చేసే అధికారం రాజ్యాంగం మూడు రకాలుగా నిర్ణయించింది. అవి: పన్నులో వాటా గ్రాంట్లు మరియు రుణాలు.

4) వనరుల బదిలీల సౌలభ్యత: ప్రతి సంవత్సరం ఆర్థిక సంఘం కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల బదిలీల గురించి సిఫార్సు చేస్తుంది.

11.4. ఆర్థిక సంఘం

ఆర్థిక సంఘం అనేక ఒక పాక్షిక న్యాయ సంస్థ. ఇది 1951తో ఏర్పాటు చేయబడింది. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 280 ప్రకారం భారత రాష్ట్రపతిచే స్థాపించబడింది. ఆర్థిక సంఘం ప్రతి 5 సంవత్సరాలకు నియమించబడుతుంది. దీనిని 1 ఛైర్మన్, 1 కార్యదర్శి మరియు నలుగురు సభ్యులను కలిగి ఉంటుంది. ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా డాక్టర్ ఎన్.కె.సింగ్ వ్యవహరించుచున్నారు.

ఆర్థిక సంఘం విధులు:

i) కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల విభజన కేటాయింపు శాతం నిర్ణయించడం.

ii) కేంద్రానికి వచ్చే పన్నుల ద్వారా వచ్చే ఆదాయానికి వాటా కేటాయించడం.

iii) రాష్ట్రాలకు, భారత ప్రభుత్వ ఏకీకృత నిధి నుండి గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ వనరులు కల్పించాలి.

iv) గిరిజన ప్రాంతాలకు ప్రత్యేకంగా గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ వనరులు కల్పించాలి.

v) కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక గ్రాంట్లు.

11.4. ఫైనాన్స్ కమీషన్

భారత ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా ఎన్.కె.సింగ్‌ను 27 నవంబర్ 2017 సంవత్సరంలో నియమించింది. దీని కాల పరిమితి 2020-25 సంవత్సరం 30 అక్టోబర్ 2019 నాటికి సంమాచారాన్ని తీసుకుంటారు. అలాగే 2011 సంవత్సరం జనాభా లెక్కల సేకరణ ఆధారంగా వివిధ రాష్ట్రాలకు నిధులు కేటాయింపు ఉంటుంది. జి.ఎస్.టి.ని ప్రవేశపెట్టిన తర్వాత సిఫార్సులను సమర్పించాల్సిన మొదటి కమీషన్ ఇదే.

11.5. బడ్జెట్

బడ్జెట్ భావన: బడ్జెట్ అనే పదం 'బోగెట్' అనే ఫ్రెంచ్ పదం నుండి ఉద్భవించింది. దీని అర్థం తోలు సంచి అని అర్థం. బడ్జెట్ అనేది ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుండి మార్చి 31 వరకు ఉంటుంది. ప్రభుత్వ ఆదాయ మరు వ్యయాలను చూపే వార్షిక ప్రకటన. బడ్జెట్ అనేది ఆర్థిక వ్యవహారాల విభాగం ద్వారా తయారు

చేయబడుతుంది. బడ్జెట్ అనే పదం రాజ్యాంగంలో 112వ అధికరణం తెలుపుతుంది. ప్రభుత్వం యొక్క ఆదాయ మరియు ఖర్చుల యొక్క వార్షిక ప్రకటనను పార్లమెంట్ ముందు సమర్పించాలి. బడ్జెట్‌ను ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో తయారు చేస్తారు. భారత ఆర్థిక మంత్రి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారు.

బడ్జెట్ అంచనాలు 3 రకాలు:

1) గత సంవత్సరానికి సంబంధించిన వాస్తవ గణాంకాలు.

2) ప్రస్తుత సంవత్సరానికి బడ్జెట్ మరియు సవరించిన గణాంకాలు.

3) ముందు సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలు.

పార్లమెంటులోని చట్టసభల ఆమోదం కోసం ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం వార్షిక బడ్జెట్‌ను సమర్పిస్తాయి. పూర్తి బడ్జెట్‌ను సమర్పించడం సాధ్యం కానప్పుడు కొన్నిసార్లు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 266 ప్రకారం దేశం యొక్క ఏకీకృత నిధుల నుండి ఏవైనా నిధులను సేకరించే ముందు ప్రభుత్వం పార్లమెంటు నుండి ఆమోదం పొందడం తప్పనిసరి. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కాల పరిమితి 2 నెలలు. అయితే ఎన్నికల సంవత్సరం అయినట్లయితే 6 నెలలు పొడిగించవచ్చు.

లక్ష్యాలు:

బడ్జెట్ యొక్క ముఖ్య ఉద్దేశం పన్ను ప్రతిపాదనలకు శాసనసభ ఆమోదం పొందడం మరియు వివిధ ప్రభుత్వ కార్యకలాపాలకు వనరులను కేటాయించడం ప్రధాన విధి.

i) కేటాయింపు పద్ధతి

ii) పంపిణీ పద్ధతి

iii) స్థిరీకరణ పద్ధతి

iv) ఆదాయం మరియు సంపద పునఃపంపిణీ

v) వనరుల పునఃకేటాయింపు

vi) స్థిరత్వ ఆర్థిక వృద్ధి

vii) పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వహణ

11.5.1. బడ్జెట్ యొక్క భాగాలు

బడ్జెట్‌లో మూడు ముఖ్యమైన భాగాలు ఉన్నాయి.

ఎ) రాబడి

బి) వ్యయం

సి) లోటు.

i) రాబడి: ప్రభుత్వానికి వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని రాబడి అంటారు. అవి 2 రకాలు.

1. రెవెన్యూ రాబడి

2. మూలధన రాబడి

రెవెన్యూ రాబడి: రెవెన్యూ రాబడి అంటే ప్రభుత్వం యొక్క ఆదాయాన్ని సృష్టించడం. ఉదా: ఆదాయపు పన్ను, కార్పొరేషన్ పన్ను, కస్టమ్స్ డ్యూటీ మొదలైనవి.

మూలధన రాబడి: ప్రభుత్వ రాబడి సృష్టించడానికి, ఎలాంటి తగ్గింపు లేకుండా మూలధన ఆస్తి కలిగి ఉండడం. ఉదా: రుణాల రికవరీ, రుణాలు మరియు డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్.

బి) బడ్జెట్ వ్యయం: బడ్జెట్ వ్యయం ఉంటే అంచనా వ్యయాల అని సూచిస్తుంది. మూలధన వ్యయం మరియు రాబడి వ్యయం క్రింద ప్రభుత్వం కేటాయించిన వ్యయం.

మూలధన వ్యయం: ఈ వ్యయంలో భవిష్యత్తులో రాబడిని సమకూర్చే వాటిపై చేసే వ్యయం. ఉదా: రోడ్లు, భవనాలు, వంతెనలు మొదలైనవి.

రాబడి వ్యయం: ఈ వ్యయంలో జీతాలు, వడ్డీ చెల్లింపులు, పెన్షన్లు, సబ్సిడీలు మొదలైనవి.

సి) లోటు: ప్రభుత్వం యొక్క రాబడి కంటే వ్యయం వ్యత్యాసం ఉన్నచో దానిని బడ్జెట్ లోటు అంటారు.

11.5.2. బడ్జెట్ రకాలు

ఆదాయం మరియు వ్యత్యాసంపై 3 రకాల బడ్జెట్‌లు ఉన్నాయి.

1) **సమతుల్య బడ్జెట్:** దీని అంచనా ఆదాయం మరియు అంచనా వ్యయం సమానంగా ఉంటుంది. (R=E)

2) **మిగులు బడ్జెట్:** ప్రభుత్వ ఆదాయం అంచనా వేసిన దానికంటే ఎక్కువగా ఉన్నప్పుడు... అంటే వ్యయం కంటే రాబడి (ఆదాయం) ఎక్కువగా ఉండును. (R > E)

3) **లోటు బడ్జెట్:** మొత్తం, మొత్తం రాబడి కంటే ఎక్కువ ఉంటే లోటు బడ్జెట్ అని అంటారు. (R < E)

11.5.3. బడ్జెట్ లోటు

బడ్జెట్ లోటు అనేది ప్రభుత్వ బడ్జెట్ వ్యయం దాని బడ్జెట్ రాబడి కంటే మించిపోయే పరిస్థితిని సూచిస్తుంది. బడ్జెట్ లోటు నాలుగు రకాలు.

1. రెవెన్యూ లోటు: రెవెన్యూ వ్యయం రెవెన్యూ ఆదాయం కంటే ఎక్కువగా ఉంటుంది.
2. బడ్జెట్ లోటు: మొత్తం రాబడి మొత్తం వ్యయం మధ్య గల వ్యత్యాసాన్ని బడ్జెట్ లోటు అంటారు.
3. ద్రవ్య లోటు: బడ్జెట్ లోటు మరియు మార్కెట్ రుణాల మొత్తాన్ని ద్రవ్య లోటు అంటారు.
4. ప్రాథమిక లోటు: ద్రవ్య లోటు మరియు వడ్డీ చెల్లింపు మధ్య వ్యత్యాసాన్ని ప్రాథమిక లోటు అంటారు.

   ప్రాథమిక లోటు = ద్రవ్య లోటు – వడ్డీ చెల్లింపులు

11.6. సారాంశం

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రభుత్వ విత్తం అనేది ప్రభుత్వ రాబడి మరియు వ్యయాలను సూచిస్తుంది. ఆదాయ మరియు వ్యయాల లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రభుత్వం ప్రతి సంవత్సరం పార్లమెంటు/అసెంబ్లీలో బడ్జెట్‌ను సమర్పిస్తుంది. రాబడి మరియు వ్యయానికి సంబంధించిన అంచనా వేసేది బడ్జెట్.

11.7. మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ప్రభుత్వ విత్తాన్ని నిర్వచించండి.

2. ప్రజా వ్యయం అంటే ఏమిటి?

3. ప్రభుత్వ రుణం అంటే ఏమిటి?

4. క్యాపిటల్ లెవీ అంటే ఏమిటి?

5. సమాఖ్య విత్తం అంటే ఏమిటి?

6. బడ్జెట్ అంటే ఏమిటి?

7. కోశ లోటు అంటే ఏమిటి?

8. వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.) అంటే ఏమిటి?

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ప్రభుత్వ విత్తం యొక్క మూలాలు ఏమిటి?

2. ప్రభుత్వ రుణ విమోచన పద్ధతులను వివరించండి.

3. ఆర్థిక సంఘంను వివరించండి.

4. బడ్జెట్ లోటులను వివరించండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలను విశ్లేషించండి.

2. ప్రభుత్వ విత్తంపై ఒక వ్యాసం రాయండి.

3. బడ్జెట్ యొక్క భావన మరియు భాగాలను వివరించండి.

4. ప్రభుత్వ రుణ రకాలను వివరించండి.

11.8. పదకోశం

1. ప్రభుత్వ విత్తం: ఇది ప్రభుత్వ ఆదాయ, వ్యయాలను గురించి వివరిస్తుంది. (కేంద్ర, రాష్ట్ర మరియు స్థానిక ప్రభుత్వాలు)

2. క్యాపిటల్ లెవీ: మూలధన ఆస్తులు మరియు ఎస్టేట్‌లపై విధించబడే పన్ను.

3. ప్రజా వ్యయం: ప్రభుత్వ అధికారాలు చేసే ఖర్చు.

4. ప్రభుత్వ రుణం: అంతర్గతంగా మరియు బహిర్గతంగా ప్రభుత్వం తీసుకున్న రుణాలు.

5. రుణ విముక్తి: ప్రభుత్వం వడ్డీతో పాటు అసలు మొత్తాన్ని తిరిగి చెల్లించడం.

6. ఆర్థిక విధానం: ఇది ప్రభుత్వ ఆదాయ, వ్యయ మరియు పన్నుల విధానం సూచిస్తుది.

7. బడ్జెట్: నిర్ణీత కాలానికి ఆదాయ మరియు ఖర్చుల అంచనా.

8. సమాఖ్య విత్తం: కేంద్ర, రాష్ట్ర మరియు స్థానిక ప్రభుత్వాల మధ్య ఆదాయ మరియు వ్యయానికి సంబంధించిన వివిధ విభాగాలకు కేటాయింపు మరియు సమన్వయం చేయడం.

9. సమతుల్య బడ్జెట్: మొత్తం ఆదాయం మరియు వ్యయం సమానంగా ఉంటుంది.

11.9. ఉపయుక్త గ్రంథాలు

1. బి.పి. త్యాగి, పబ్లిక్ ఫైనాన్స్

2. ఆర్. సుదర్శనరావు, భారతదేశంలో సమాఖ్య, కోశ బదిలీలు

3. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పబ్లిక్ ఫైనాన్స్ 420 %జూ-జు4

4. తెలుగు అకాడమీ, ఇంటర్మీడియట్ పుస్తకాలు

5. ఇండియా బడ్జెట్ 2022

అధ్యాయం 12

ద్రవ్యం

12.0 లక్ష్యాలు

12.1 పరిచయం

12.2 ద్రవ్యం భావన

12.3 ద్రవ్య పరిణామక్రమం

12.4 వస్తు మార్పిడి వ్యవస్థ

12.5 ద్రవ్యం నిర్వచనాలు

12.6 ద్రవ్య సంబంధిత భావనలు

12.7 ద్రవ్య రకాలు

12.8 ద్రవ్యం విధులు

12.8.1. ద్రవ్యం ప్రాథమిక విధులు

12.8.2 ద్రవ్యం ద్వితీయ విధులు

12.8.3 ద్రవ్యం యొక్క ఆనుషంగిక విధులు

12.8.4 ద్రవ్యం నిశ్చల మరియు చలన విధులు

12.9 ద్రవ్యం సరఫరా అంతర్భాగాలు

12.10 సారాంశం

12.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

12.12 పదకోశం

12.13 ఉపయుక్త గ్రంథాలు

12.0 లక్ష్యాలు

- ద్రవ్య పరిణామాన్ని వివరిస్తారు.
- వస్తు మార్పిడి పద్ధతిలోని ఇబ్బందులను విశ్లేషిస్తారు.
- ద్రవ్య భావనను వివరిస్తారు.
- ద్రవ్యంలోని రకాలను వర్గీకరిస్తారు.
- ద్రవ్యం విధులను వివరిస్తారు.
- ద్రవ్యంలోని ముఖ్యమైన అంతర్భాగాలను పేర్కొంటారు.

12.1 పరిచయం

ద్రవ్యం సాధారణంగా వినిమయ మాధ్యమంగా అంగీకరించబడుతుంది. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. మనిషి తన మనుగడ సాగించడం అంటే ద్రవ్యాన్ని ఆర్జించడం మరియు ఆర్జించిన ద్రవ్యమును వస్తు సేవలపై ఖర్చు చేయడం అనేది అనుభవంలో ప్రతివ్యక్తి గ్రహించిన సత్యమే. ద్రవం కొనుగోలు శక్తిపై ఒక వ్యక్తి యొక్క జీవన ప్రమాణం ఆధారపడి ఉంటుంది . కొనుగోలు శక్తి అనేది 'నిర్ధిష్ట మొత్తంలోని ద్రవ్యం ఒక నిర్ణీత సమయంలో కొనుగోలు చేయగల వస్తువుల సంఖ్య లేదా సేవలను'తెలియచేస్తుంది. ధరలలో మార్పులు ద్రవ్య కొనుగోలు శక్తిలో మార్పులు తీసుకువస్తాయి. ద్రవ్యం కొనుగోలు శక్తి మారినప్పుడు, కొన్ని వర్గాల వారికి లాభం చేకూరటం, కొన్ని వర్గాలకు నష్టం వాటిల్లటం జరుగుతుంది. కాల యాపన లేకుండా తక్కువ శ్రమతో వస్తు సేవలు వ్యక్తుల మధ్య మార్పిడి చెందటానికి అవకాశాన్ని ద్రవ్యం కల్పిస్తుంది.

ఈ యూనిట్‌లో మీరు ద్రవ్యం భావన మరియు విధుల గురించి నేర్చుకుంటారు.

12.2 ద్రవ్య భావన

నేడు మనం ద్రవ్యం లేని జీవితాన్ని ఊహించలేము. ఒక వ్యక్తికి చాలా డబ్బు ఉందని మనం చెప్పినప్పుడు, అతను లేదా ఆమె ధనవంతుడు అని మనం అర్థం చేసుకుంటాము. దీనికి విరుద్ధంగా ఆర్థికవేత్తలు ద్రవ్యం అనే పదాన్ని మరింత ప్రత్యేక పద్ధతిలో ఉపయోగిస్తారు. ఆర్థికవేత్తకు ద్రవ్యం అనేది అన్ని సంపదలను సూచించదు కాని దానిలోని ఒక రకాన్ని మాత్రమే సూచిస్తుంది. ఆధునిక సమాజాలలో ద్రవ్యం అనేది దైనందిన లావాదేవీలు నిర్వహించటానికి తక్షణమే ఉపయోగించబడే ఆస్తులలోని ఒక నిల్వ మాత్రమే.

12.3 ద్రవ్య పరిణామక్రమం

'ద్రవ్యం'అనే పదం రోమ్ దేవత జునో మోనెటా పేరు నుండి ఉద్భవించింది. పురాతన సమాజంలో ప్రజలు వస్తువులను వస్తువులకు మార్పిడి చేస్తుండేవారు. ఇలాంటి ప్రత్యక్ష మార్పిడి విధానమును వస్తు మార్పిడి పద్ధతి అంటారు. ఆచరణలో వస్తు మార్పిడి విధానం చాలా అసౌకర్యంగా వుండుటచే, పరస్పర మార్పిడి కోసం ద్రవ్యం అనే ఉమ్మడి కొలమానము ప్రవేశపెట్టబడింది. నాణేలను ప్రవేశపెట్టడానికి ముందు, వివిధ రకాల వస్తువులను ద్రవ్యంగా ఉపయోగించారు. ఉదాహరణకు, ఆదిమ కాలం నుండి ధాన్యాలు, 'గవ్వలు 'మరియు పశువులు ద్రవ్యంగా ఉపయోగించబడ్డాయి. ఆ తర్వాత లోహపు నాణేలు – బంగారం, వెండి, రాగి నాణేలు వాడుకలోకి వచ్చాయి. రోమన్ల కాలంలో 'బిసాంత్ 'అను బంగారు నాణెము, మౌర్యుల కాలంలో 'పానా' అనబడే వెండి నాణెము ప్రామాణిక ద్రవ్యంగా ఉపయోగించబడ్డాయి. ప్రస్తుతము మనకు కాగితపు ద్రవ్యము కలదు. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఇటీవల డ్రాఫ్టు, చెక్కులు, ప్లాస్టిక్ మనీ – క్రెడిట్ మరియు డెబిట్ కార్డ్ల రూపంలో పరపతి ద్రవ్యం, మరియు డిజిటల్ మనీ – ఆన్‌లైన్ లావాదేవీలు మొదలగునవి ఆచరణలో ఉన్నాయి.

12.4 వస్తు మార్పిడి పద్ధతి

ద్రవ్యం లేనట్లయితే వినిమయం అసంభవమని భావించరాదు. ద్రవ్యం ఉద్భవించటానికి ముందు వస్తుమార్పిడి పద్ధతి అమలులో ఉండేది. మన దేశంలో గ్రామాల్లో ఈ వస్తు మార్పిడి పద్ధతి కొంత వరకు ఇంకా అమలులో ఉంది. వస్తువులకు బదులుగా వస్తువులను ప్రత్యక్ష్యంగా మార్పిడి చేసుకునే పద్ధతిని వస్తుమార్పిడి పద్ధతి అంటారు. ఉదాహరణకు ధాన్యం పండించే రైతు ధాన్యమిచ్చి తనకు కావలసిన ఇతర వస్తువులను వాటి ఉత్పత్తి దారులనుండి తీసుకుంటాడు. వస్తూత్పత్తి భారీఎత్తున సాగుతున్న ఈ రోజుల్లో ఈ పద్ధతి సరిగా పని చేయలేదు. అలాంటి వ్యక్తులను కనుగొనడానికి చాలా రోజులు పట్టవచ్చు. ఈ పద్ధతి వల్ల కాలయాపనే కాకుండా పెక్కు సమస్యలు, చిక్కులు తలెత్తుతాయి.

వస్తుమార్పిడి యొక్క అసౌకర్యాలు

వస్తుమార్పిడి పద్ధతిలోని సమస్యలు

(i) వ్యక్తుల కోరికలలో పరస్పరం సమన్వయం లేకపోవుట: వస్తువులను నేరుగా వస్తువుల కోసం మార్పిడి చేయవలసి వచ్చినప్పుడు, కొనుగోలుదారు మరియు అమ్మకందారుల కోరికలలో సమన్వయం ఉండాలి. ఉదాహరణకు, మేకలను కలిగి ఉన్న వ్యక్తి, బంగాళాదుంపలకు వాటిని మార్చుకోవాలనుకునేవాడు, బంగాళాదుంపలను కలిగి వుండి వాటిని మేకలతో వినిమయం చేయుటకు సిద్ధంగా వున్న వ్యక్తిని వెతుక్కోవలసి ఉంటుంది.

(ii) విలువ నిల్వ లేకపోవడం: వస్తువులను ఎక్కువ కాలం నిల్వ ఉంచలేము. వాటి విలువ తగ్గిపోతుంది. వాటిలో కొన్ని కొంతకాలం తర్వాత పూర్తిగా నశిస్తాయి. ప్రజలు పశువులు, ధాన్యం మరియు ఇతర వ్యాపారాలు చేసినప్పుడు, అటువంటి పాడైపోయే వస్తువుల విలువను ఎక్కువ కాలం నిల్వ చేయడం చాలా కష్టం.

(iii) వస్తువుల విభజనలో ఇబ్బంది: మరొక ఇబ్బంది ఏమిటంటే కొన్ని వస్తువులను చిన్న భాగాలుగా విభజించలేము ధాన్యం వంటి వస్తువులను అనేక భాగాలుగా విభజించి మనకు కావలసిన వస్తువులకు మార్పిడి చేయటానికి వీలుంది. కానీ అన్ని వస్తువులు విభజించబడవు. ఒకవేళ ఆవు, మేక వంటి జంతువులను మరియు ఇల్లు, కోటు వంటి వస్తువులను చిన్న చిన్న ముక్కలుగా విభజించినట్లయితే వాటి విలువ నశిస్తుంది.

(iv) విలువను నిర్ణయించే సాధారణ కొలమానం లేకపోవడం: వస్తు మార్పిడి విధానంలో విలువను నిర్ణయించే సాధారణ కొలమానం లేదు. అన్ని వస్తువులు సమాన విలువలను కలిగి ఉండవు. మార్పిడి నిబంధనలను నిర్ణయించడం కష్టం. ఒక మేకను బియ్యానికి మార్చుకోవాలనుకున్నప్పుడు, మేక విలువకు సమానమైన బియ్యం విలువను నిర్ణయించడం కష్టమౌతుంది.

(v) వాయిదా చెల్లింపులు చేయడంలో ఇబ్బంది: వస్తు మార్పిడి పద్ధతిలో వస్తువులను అప్పుగా తీసుకోవలెను. అప్పు చెల్లించడం కూడా వస్తురూపంలోనే జరగవలెను. అప్పు తీసుకున్న నాటికి, అప్పు తిరిగి చెల్లించిన నాటికి మధ్య వస్తువుల విలువ మారినట్లయితే ఋణ దాత గాని, ఋణ గ్రహీత గానీ నష్టం పొందవచ్చు. వస్తువు విలువ తగ్గినట్లయితే ఋణదాత పెరిగినట్లయితే ఋణ గ్రహీత నష్టానికి గురి అవుతారు.

ఈ విధంగా వస్తు మార్పిడి విధానంలో ఎదుర్కొన్న వివిధ ఇబ్బందులు ద్రవ్య ఆవిర్భావానికి దారితీశాయి.

12.5. ద్రవ్యం నిర్వచనాలు

ద్రవ్యం భావన అనేక మంది ఆర్థికవేత్తల చేత నిర్వచించబడింది. ద్రవ్యం గురించి కొన్ని ముఖ్యమైన అభిప్రాయాలు క్రింది విధంగా ఉన్నాయి.

i) రాబర్ట్సన్ 'వస్తు క్రయ విక్రయ చెల్లింపులలో, ఇతర వ్యాపార వ్యవహారాల పరిష్కారాలలో అధికంగా జనామోదం పొందేదే' ద్రవ్యం అని నిర్వచించారు.

ii) క్రౌథర్, 'వినిమయ సాధనంగా సర్వాంగీకారమును పొంది, విలువల కొలమానంగా, విలువ నిధిగా ఉపయోగపడేది ఏదైనా'ద్రవ్యం అని నిర్వచించారు.

iii) వాకర్ ప్రకారం 'ద్రవ్యం ఏ పనులను నిర్వహిస్తుందో అదియే ద్రవ్యం'.

iv) సెలిగ్ మెన్ ద్రవ్యమును "సర్వజన ఆమోదయోగ్యతను కలిగి ఉన్న ఒక వస్తువు"గా నిర్వచించారు.

ద్రవ్యం యొక్క ముఖ్య లక్షణం ఏమనగా దానిని ఉపయోగించే సమాజంలోని సభ్యులందరిచే అది అంగీకరింపబడాలి. ద్రవ్యం ఒక యూనిట్ రూపంలో వ్యక్తపరచబడుతుంది. ప్రతి దేశం దాని స్వంత ద్రవ్య యూనిట్ అకౌంట్‌ను, కరెన్సీని కలిగి ఉంటుంది. ఉదాహరణకు భారతదేశంలో రూపాయి, అమెరికాలో డాలర్ మొదలగునవి. మన దేశంలో అన్ని ఆస్తుల విలువ రుపాయిలలో వ్యక్తపరచబడుతుంది.

12.6 ద్రవ్య సంబంధిత భావనలు

ద్రవ్యానికి సంబంధించి రకరకాల భావనలు ఉన్నాయి. అవి కరెన్సీ, ద్రవ్యత్వం మరియు సమీప ద్రవ్యం.

i) **కరెన్సీ:** కరెన్సీ అనేది వస్తువులు మరియు సేవలకు వినిమయ మాధ్యమం. సంక్షిప్తంగా ఇది ప్రభుత్వం మరియు కేంద్ర బ్యాంక్ జారీ చేసిన నాణేలు మరియు కాగితపు నోట్ల రూపంలో ఉన్న ద్రవ్యం. ద్రవ్యంలో కరెన్సీ మాత్రమే కాకుండా బ్యాంకుల డిమాండ్ మరియు టైమ్ డిపాజిట్లు కూడా ఉంటాయి.

ii) ద్రవ్యత్వం: ఇది ఒక ఆస్తిని ద్రవ్యంగా మార్చగల సామర్థ్యాన్ని సూచిస్తుంది. అన్నింటికంటే అత్యంత ద్రవ్యత్వం కలిగిన ఆస్తి ద్రవ్యమే.

iii) సమీప ద్రవ్యం: ద్రవ్యంగా గుర్తింపబడని ఆస్తులను సులభంగా ద్రవ్యంలోకి మార్చుకొనుటకు వీలుండే అత్యధిక ద్రవ్యత్వం గల ఆస్తులను సమీప ద్రవ్యం అంటారు. కింది ఆస్తులు ద్రవ్యానికి సమీప ప్రత్యామ్నాయాలు. అందువల్ల వాటిని సమీప లేదా పాక్షిక ద్రవ్యం అంటారు. (ఎ) వాణిజ్య బ్యాంకులలోని పొదుపు మరియు టైం డిపాజిట్లు (బి) పోస్టాఫీసులలోని పొదుపు డిపాజిట్లు మరియు పోస్టాఫీసు బాండ్లు. (సి) ద్రవ్య మార్కెట్ నిధులు (డి) ప్రభుత్వ ట్రెజరీ బిల్లులు (ఇ) యుటిఐ యూనిట్లు (ఎఫ్) ప్రభుత్వ సెక్యూరిటీలు (జి) జాయింట్ స్టాక్ కంపెనీల షేర్లు.

12.7 ద్రవ్య రకాలు

స్థూలంగా చెప్పాలంటే ద్రవ్యం రెండు రకాలుగా ఉంటుంది. అవి (ఎ) లోహ ద్రవ్యం లేదా నాణేలు మరియు (బి) కాగితం ద్రవ్యం. ఇవి ఇంకా వివిధ రకాలుగా వర్గీకరించబడ్డాయి.

i) వస్తు ద్రవ్యం మరియు ప్రాతినిధ్య ద్రవ్యం: ముఖ విలువ అంతర్గత విలువకు సమానంగా ఉండే ద్రవ్య రూపాన్ని వస్తు ద్రవ్యం అంటారు. దీనినే పూర్తి ప్రమాణ ద్రవ్యం అని కూడా అంటారు. ఉదా: లోహ నాణేలు. అంతర్గత విలువ కంటే ఎక్కువ ముఖ విలువ కలిగిన ద్రవ్యమును ప్రాతినిధ్య ద్రవ్యం అని అంటారు. ఉదా: కాగితం ద్రవ్యం.

ii) చట్టబద్ధమైన మరియు ఐచ్ఛిక ద్రవ్యం: చట్టపరమైన అనుమతిని కలిగి ఉన్న ద్రవ్యమును చట్టబద్ధమైన ద్రవ్యం అంటారు. అనగా చెల్లింపుల మాధ్యమంగా ఎవరూ దానిని తిరస్కరించరు. దేశంలోని ప్రతి ఒక్కరూ దానిని అంగీకరించాలి. ఉదా: భారతీయ రిజర్వ్ బ్యాంక్ జారీ చేసిన కరెన్సీ. ఐచ్ఛిక ద్రవ్యమునకు చట్ట సమ్మతి ఉండదు. అది నమ్మకము మరియు విశ్వాసములపై అంగీకరించబడును. అన్ని రకాల చెక్కులు, డ్రాఫ్టు, డిబెంచర్లు, షేర్లు, క్రెడిట్ కార్డులు మరియు ఇతరాలు ఐచ్ఛిక ద్రవ్యముగా పరిగణించబడతాయి.

iii) లోహ ద్రవ్యంమరియు కాగితపు ద్రవ్యం: లోహ ద్రవ్యం అనేది బంగారం, వెండి, రాగి మొదలైన లోహాలతో తయారు చేయబడిన ద్రవ్యమును సూచిస్తుంది. కాగితపు ద్రవ్యం అనేది కాగితపు కరెన్సీ నోట్ల రూపంలో ఉన్న డబ్బును సూచిస్తుంది. ఉదా: రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లు.

iv) ప్రామాణిక ద్రవ్యం మరియు చిల్లర ద్రవ్యం: ముఖ విలువ మరియు అంతర్గత విలువ సమానంగా ఉన్న ద్రవ్యమును ప్రామాణిక ద్రవ్యం అని అంటారు. ద్రవ్యం యొక్క అంతర్గత విలువ దాని ముఖ విలువ కంటే తక్కువగా ఉన్న ద్రవ్యమును చిల్లర ద్రవ్యం అని వ్యవహరిస్తారు. ఉదా: 1, 2 మరియు 5 రూపాయల నాణేలు.

v) పరపతి ద్రవ్యం: పరపతి ద్రవ్యమును బ్యాంకు ద్రవ్యం అని కూడా వ్యవహరిస్తారు. ఇది బ్యాంకులలో ప్రజలు దాచుకున్న డిపాజిట్లను సూచిస్తుంది. డిమాండ్ ఆధారంగా తిరిగి చెల్లించవలసి ఉంటుంది. చెక్కుల ద్వారా ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి బ్యాంకు డిపాజిట్లను బదిలీ చేయవచ్చు. చెక్కు అనేది బ్యాంక్ డిపాజిట్లను బదిలీ చేయడానికి ఉపయోగించే సాధనం మరియు ఇది ద్రవ్యంగా కొన్ని సౌకర్యాలను అందిస్తుంది.

12.8 ద్రవ్యం విధులు

ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యం ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది. వీటిని డేవిడ్ కిన్లీ ఈ క్రింది విధంగా వర్గీకరించారు:

అవి i) ప్రాథమిక విధులు ii) ద్వితీయ విధులు iii) ఆనుషంగిక విధులు మరియు iv) నిశ్చల, చలన విధులుగా వర్గీకరించవచ్చు.

12.8.1. ద్రవ్యం యొక్క ప్రాథమిక విధులు

ద్రవ్యం యొక్క ప్రాథమిక విధులు రెండు రకాలు

i) వినిమయ మాధ్యమం: వస్తు, సేవల అమ్మకం మరియు కొనుగోలులో ద్రవ్యము వినిమయ మాధ్యమంగా ఉపయోగించబడుతుంది. అందుబాటులో ఉన్న ద్రవ్య మార్పిడితో ఎవరైనా వస్తువులు మరియు సేవలను పొందవచ్చు. ఈ విధంగా ద్రవ్యం వస్తు మార్పిడి పద్ధతిలో ఎదురైన కోరికల పరస్పర సమన్వయ సమస్యను తొలగించడంతో పాటు లావాదేవీలలోని సమయాన్ని మరియు శ్రమను తగ్గించింది.

ii) విలువల కొలమానం: వస్తు, సేవల అమ్మకాలు మరియు కొనుగోళ్లను సులభతరం చేయడానికి ద్రవ్యం వస్తువులు మరియు సేవల విలువను కొలుస్తుంది. విలువల సాధారణ కొలమానంగా పనిచేయడం ద్వారా ద్రవ్యం వస్తు మార్పిడి పద్ధతిలోని సమస్యను కూడా తొలగించింది. వివిధ వస్తువుల విలువలు ద్రవ్య రూపంలో వ్యక్తీకరించబడతాయి. దానిని ధర అంటారు. కిలో రూ. 40, డజను రూ. 20 మొదలగునవి విలువల కొలమానాన్ని సూచిస్తాయి. విలువ కొలమానంగా ద్రవ్యం లావాదేవీలను సులభతరం చేసింది.

12.8.2. ద్రవ్యం యొక్క ద్వితీయ విధులు

ద్రవ్యానికి ప్రాథమిక విధులే కాకుండా, కొన్ని ఇతర విధులు ఉన్నాయి, వీటిని ద్వితీయ విధులు అంటారు. ఈ ద్వితీయ విధులు క్రింద ఇవ్వబడిన విధంగా వ్యక్తీకరించబడ్డాయి.

iii) విలువ నిధి: ద్రవ్యం విలువ నిధిగా పనిచేస్తుంది. ద్రవ్యం విలువను కలిగి ఉన్నందున, ప్రజలు తమ సంపాదనలో కొంత భాగాన్ని ద్రవ్య రూపంలో ఆదా చేసి, దానిని ఏదైనా కొనుగోలు కోసం ఎప్పుడైనా ఉపయోగించుకుంటారు.

iv) వాయిదాల చెల్లింపుల ప్రమాణం: వాయిదాల చెల్లింపు అంటే భవిష్యత్ చెల్లింపు. గడువు తీరిన తర్వాత కూడా వస్తువులు మరియు సేవల చెల్లింపులో ద్రవ్యం సహాయపడుతుంది. అనగా ద్రవ్యం సహాయంతో ప్రజలు నిబద్ధతతో మాత్రమే వస్తు, సేవల క్రయ విక్రయాలు చేయగలరు. భవిష్యత్తులో వాయిదాల రూపంలో చెల్లింపు చేయవచ్చు. జీతాలు, వాయిదాలు, రుణాలు మొదలైన చెల్లింపులు వాయిదాల చెల్లింపులకు ఉదాహరణలు.

v) విలువ బదిలీ : ద్రవ్యం విలువను ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి మరియు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి ఎప్పుడైనా బదిలీ చేయవచ్చు. స్థిర, చరాస్థుల క్రయ విక్రయాలు కూడా ద్రవ్యం సహాయంతో చేపట్టవచ్చు.

12.8.3.ద్రవ్యం యొక్క అనుషంగిక విధులు

ద్రవ్యం ప్రాథమిక మరియు ద్వితీయ విధులతో పాటు సాధారణంగా ఆధునిక ఆర్థిక వ్యవస్థలకు సంబంధించిన కొన్ని అనుషంగిక విధులను కూడా నిర్వహిస్తుంది. ఈ విధులు:

i) జాతీయ ఆదాయం పంపిణీ: దేశంలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన జాతీయ ఆదాయాన్ని మదింపు చేయటానికి ద్రవ్యం సహాయపడుతుంది. ఉత్పత్తికి సహకరించే భూమి, శ్రమ, మూలధనం మరియు వ్యవస్థాపన వంటి ఉత్పత్తి కారకాల మధ్య జాతీయ ఆదాయ పంపిణీని ద్రవ్యం సులభతరం చేస్తుంది.

ii) ఉపాంత ప్రయోజనాలు / ఉత్పాదకతల సమానీకరణ: ప్రయోజనం లేదా ఉత్పాదకత వంటి భావనలు ద్రవ్య రూపంలోనే కొలవబడతాయి. వినియోగదారుడు అలాగే ఉత్పత్తిదారుడు ద్రవ్య సహాయంతోనే వివిధ వస్తువుల మరియు ఉత్పత్తి కారకాల ప్రయోజనాలను కొలిచి గరిష్ట సంతృప్తిని లేదా గరిష్ట రాబడిని పొందడానికి ప్రయత్నిస్తారు.

iii) పరపతికి మూలం: వ్యాపార కార్యకలాపాల పురోగతి దేశ పరపతి వ్యవస్థతో ముడిపడి ఉంటుంది. పరపతి వ్యవస్థ యొక్క మొత్తం బలం ద్రవ్యంపై ఆధారపడి ఉంటుంది. బ్యాంకులు పరపతి ద్రవ్యమును సృష్టిస్తాయి. ద్రవ్య సరఫరా దేశ పరపతి వ్యవస్థను ప్రభావితం చేస్తుంది.

iv) ద్రవ్యత్వము: వినిమయ మాధ్యమంగా పని చేయగల ఏదైనా ఒక ఆస్తికి గల సామర్థ్యాన్ని ద్రవ్యత్వం అంటారు. ద్రవ్యం అనేది అత్యంత ద్రవ్యత్వం కలిగిన ఆస్తి అంటే ద్రవ్యమును ఎలాంటి ఇబ్బంది లేకుండా వస్తువులు మరియు సేవల కోసం సులభంగా మార్పిడి చేసుకోవచ్చు.

12.8.4 ద్రవ్యం యొక్క నిశ్చల మరియు చలన విధులు

పాల్ ఐన్జిగ్ ద్రవ్యం నిర్వహించే విధులను స్థూలంగా నిశ్చల మరియు చలన విధులు అనే రెండు వర్గాలుగా వర్గీకరించాడు.

i) నిశ్చల విధులు: వినిమయ మాధ్యమం, విలువల కొలమానం, విలువ నిధి మరియు వాయిదా చెల్లింపుల ప్రమాణం అనే ద్రవ్యం యొక్క ప్రాథమిక మరియు ద్వితీయ విధులను నిశ్చల విధులు అంటారు. ఒక దేశం యొక్క ఆర్థిక అభివృద్ధి నిశ్చల విధుల చేత ప్రభావితం కాదు.

ii) చలన విధులు: ధరల స్థాయి, ఉత్పత్తి స్థాయి, వినియోగం, పంపిణీ, సాధారణ ధరల స్థాయి మరియు ఉపాధి మొదలైన ఆర్థిక పరిస్థితులలో మార్పులను తీసుకువచ్చే వాటిని చలన విధులు అంటారు.

12.9 ద్రవ్య సరఫరా అంతర్భాగాలు

ద్రవ్య సరఫరా అనేది ఆర్థిక వ్యవస్థలో ఒక నిర్దిష్ట సమయంలో ప్రజల వద్ద ఉన్న మొత్తం ద్రవ్యమును సూచిస్తుంది. ఇది ఒక నిధి భావన. వివిధ దేశాలలో ద్రవ్య సరఫరాలో ఉండే అంతర్భాగాలు వివిధ రకాలుగా ఉండవచ్చు. ద్రవ్య సరఫరాలో కింద పేర్కొన్నవి ఉంటాయి.

1. **కేంద్ర బ్యాంక్ జారీ చేసిన కరెన్సీ:** కరెన్సీలో నాణేలు మరియు కాగితపు ద్రవ్యం ఉంటాయి. సాధారణంగా ఏ దేశంలోనైనా కేంద్ర బ్యాంక్ కరెన్సీని జారీ చేస్తుంది. భారతదేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర బ్యాంకుగా వ్యవహరిస్తుంది. ఇది 2000, 500, 200, 100, 50, 20 మరియు 10 రూపాయల విలువైన అన్ని నోట్లను జారీ చేస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక రూపాయి నోటు మరియు నాణేలను జారీ చేస్తుంది.

2. **వాణిజ్య బాంకులచే సృష్టించబడిన డిమాండ్ డిపాజిట్లు:** ద్రవ్య సరఫరాలో బాంక్ డిపాజిట్లు ముఖ్యమైన భాగం. వాణిజ్య బ్యాంకులు ప్రజల నుండి ఆమోదించబడిన డిపాజిట్ల ద్వారా పరపతిని సృష్టిస్తాయి. ప్రాథమిక డిపాజిట్ల సహాయంతో బ్యాంకులు సృష్టించే డిపాజిట్లను ఉత్పన్నమైన డిపాజిట్లు అంటారు.

   ద్రవ్య సమిష్టి అంశాలు: రిజర్వ్ బాంక్ ఆఫ్ ఇండియా M_0, M_1, M_2 మరియు M_3 అనే నాలుగు ప్రత్యామ్నాయ ద్రవ్య సరఫరా కొలమానాల గణాంకాలను ప్రచురిస్తుంది. అవి ఈ క్రింది విధంగా నిర్వచించబడ్డాయి.

M_0=చెలామణిలో ఉన్న కరెన్సీ + ఆర్.బి.ఐ. వద్ద గల బ్యాంకర్ల డిపాజిట్లు + ఆర్.బి.ఐ. వద్ద గల ఇతర డిపాజిట్లు

M_1=ప్రజల వద్ద ఉన్న కరెన్సీ + బ్యాంకుల వద్ద గల డిమాండ్ డిపాజిట్లు + ఆర్.బి.ఐ. వద్ద గల ఇతర డిపాజిట్లు

M_2=M_1 + బ్యాంకుల వద్ద ఉన్న కాల పరిమితి గల పొదుపు డిపాజిట్లు + బ్యాంకులు జారీ చేసే డిపాజిట్ల సర్టిఫికెట్లు

ఒక సంవత్సరంలో చెల్లింపదగిన టర్మ్ డిపాజిట్లు. (CDలు మినహాయించబడినవి)

M_3=M_2 + ఒక సంవత్సరం తరువాత చెల్లింపు చేసే టర్మ్ డిపాజిట్లు + బ్యాంకుల టర్మ్ అప్పులు

మూలం: ఆర్.బి.ఐ.నివేదికలు, www.rbi.org.in/scripts

12.10. సారాంశం

- ద్రవ్యం అనేది వినిమయ మాధ్యమంగా సాధారణంగా అందరిచేత ఆమోదించబడిన వస్తువుగా నిర్వచించబడింది.
- స్థూల ఆర్థికశాస్త్రంలో ద్రవ్యం ఒక ముఖ్యమైన భావన.
- ఒక వ్యక్తి యొక్క జీవన ప్రమాణం ద్రవ్యం కొనుగోలు శక్తిపై ఆధారపడి ఉంటుంది.
- కొనుగోలు శక్తి అనేది 'నిర్దిష్ట మొత్తంలోని ద్రవ్యం ఒక నిర్ణీత సమయంలో కొనుగోలు చేయగల వస్తువుల సంఖ్య లేదా సేవలను' తెలియచేస్తుంది.
- కరెన్సీ మరియు నాణేలు ప్రవేశ పెట్టడానికి ముందు వివిధ రకాల వస్తువులు ద్రవ్యంగా ఉపయోగించబడినవి. ఉదాహరణకు ధాన్యం, పశువులు మొదలైనవి.
- వస్తువులకు బదులుగా వస్తువులను మార్పిడి చేసుకునే పద్ధతిని వస్తు మార్పిడి పద్ధతి అని అంటారు.
- వస్తు మార్పిడి విధానంలో ఎదురైన ఇబ్బందులు ద్రవ్యం ఆవిర్భావానికి దారి తీశాయి.
- కరెన్సీ, ద్రవ్యత్వం మరియు సమీప ద్రవ్యం అనేవి ద్రవ్యానికి సంబంధించిన భావనలు.
- స్థూలంగా చెప్పాలంటే ద్రవ్యం లోహ ద్రవ్యం లేదా నాణేలు మరియు కాగితం ద్రవ్యం అని రెండు రకాలుగా ఉంటుంది.
- ఇవి ఇంకా వస్తు ద్రవ్యం, చట్టబద్ధమైన ద్రవ్యం, ఐచ్ఛిక ద్రవ్యం, చిల్లర ద్రవ్యం మరియు పరపతి ద్రవ్యం అని వివిధ రకాలుగా వర్గీకరించబడ్డాయి.
- ద్రవ్యం యొక్క విధులు ప్రాథమిక విధులు, ద్వితీయ విధులు, అనుషంగిక విధులు, నిశ్చల మరియు చలన విధులుగా వర్గీకరించబడ్డాయి.

- ద్రవ్యంయొక్క ముఖ్యమైన విధులు వినిమయ మాధ్యమం, విలువల కొలమానం, విలువ నిధి, వాయిదా చెల్లింపుల ప్రమాణం మరియు విలువల బదిలీ.
- ద్రవ్య సరఫరాలో కేంద్ర బాంక్ జారీచేసిన కరెన్సీ మరియు వాణిజ్య బాంకులు సృష్టించిన డిమాండ్ డిపాజిట్లు ఉంటాయి.

12.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. వస్తు మార్పిడి పద్ధతి అంటే ఏమిటి?
2. చిల్లర ద్రవ్యం అంటే ఏమిటి?
3. ద్రవ్యం యొక్క వాయిదా చెల్లింపుల ప్రమాణం గురించి మీకు ఏమి తెలుసు?
4. ద్రవ్యం యొక్క నిశ్చల మరియు చలన విధుల మధ్య తేడాలను రాయండి.
5. ద్రవ్య సరఫరాలోని అంతర్భాగాలు ఏవి?

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. వస్తు మార్పిడి పద్ధతి వల్ల కలిగే ఇబ్బందులు ఏమిటి?
2. ద్రవ్యం యొక్క నిర్వచనాలను క్లుప్తంగా వివరించండి.
3. ద్రవ్య సంబంధిత భావనలను వివరించండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. వివిధ రకాల ద్రవ్యాల మధ్య భేదాలను రాయండి.
2. ద్రవ్యం యొక్క ముఖ్యమైన విధులను వివరించండి.

12.12 పదకోశం

- **ద్రవ్యం:** చెల్లింపు సాధనంగా సర్వాంగీకారమును పొందే ఏదైనా వస్తువును ద్రవ్యం అని అంటారు.
- **వస్తుమార్పిడి పద్ధతి:** వస్తువులకు బదులుగా వస్తువులను ప్రత్యక్షంగా మార్పిడి చేసుకొనే పద్ధతిని వస్తు మార్పిడి పద్ధతి అని అంటారు.

- కరెన్సీ: కరెన్సీ అనేది వస్తు,సేవలకు వినిమయ మాధ్యమం. సంక్షిప్తంగా అది నాణేలు మరియు కాగితం నోట్ల రూపంలో ఉండే ద్రవ్యం.
- ద్రవ్యత్వం: వినిమయ మాధ్యమంగా పనిచేయగల ఏదైనా ఒక ఆస్తికి గల సామర్థ్యాన్ని ద్రవ్యత్వం అంటారు.
- చట్టబద్ధమైన ద్రవ్యం: చెల్లింపుల మాధ్యమంగా చట్టపరమైన అనుమతిని కలిగి ఉన్న ద్రవ్యమును చట్టబద్ధమైన ద్రవ్యం అని అంటారు.
- పరపతి ద్రవ్యం: డిమాండ్ ఆధారంగా తిరిగి చెల్లించవలసి ఉన్న బ్యాంక్ డిపాజిట్లను పరపతి ద్రవ్యం సూచిస్తుంది. వీటిని ఎప్పుడైనా ఒక వ్యక్తి నుండి మరొకరికి బదిలీ చేయవచ్చు.

12.13 సంప్రదింపు గ్రంథాలు

- ఇంటర్మీడియట్ తెలుగు అకాడమీ పాఠ్య పుస్తకం
- B.A. సూక్ష్మ అర్థశాస్త్రము

అధ్యాయం

13

బాంకింగ్

13.0 లక్ష్యాలు

13.1 పరిచయం

13.2 బాంకింగ్ భావన

13.3 వాణిజ్య బాంకుల నిర్వచనాలు

13.4 వాణిజ్య బాంకుల విధులు

13.4.1 డిపాజిట్ల స్వీకరణ

13.4.2 రుణాలు, అడ్వాన్సులు

13.4.3 పరపతిని సృష్టించడం

13.4.4 ఏజెన్సీ విధులు

13.4.5 సాధారణ ఉపయోగ సేవలు

13.5 నెట్ బాంకింగ్

13.6 కేంద్ర బాంకు/ భారత రిజర్వ్ బాంక్

13.6.1 భారత రిజర్వ్ బాంక్ లక్ష్యాలు

13.6.2 భారత రిజర్వ్ బాంక్ విధులు

13.7 సారాంశం

13.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

13.9 పదకోశం

13.10 ఉపయుక్త గ్రంథాలు

13.0 లక్ష్యాలు

- బాంకింగ్ భావనను వివరిస్తారు.
- వాణిజ్య బాంకుల విధులను వర్గీకరిస్తారు.
- నెట్ బాంకింగ్ ప్రయోజనాలను వివరిస్తారు.
- పొదుపు మరియు కాలపరిమితి డిపాజిట్ల మధ్య భేదాలను వివరిస్తారు.
- భారత రిజర్వ్ బాంక్ విధులను వివరిస్తారు.

13.1 పరిచయం

బాంకింగ్ అనేది ఒక వ్యాపార కార్యకలాపం. బాంకులు ప్రజల నుండి డిపాజిట్లను స్వీకరించి వాటిని అవసరమైన వారికి రుణాలు ఇస్తాయి. ఆధునిక కాలంలో ఒక దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో బాంకింగ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన అంశం.

13.2 బాంకింగ్ భావన

'బాంకింగ్' అనే పదం బాంక్యూ అను అర్ధం గల గ్రీకు పదం 'బాంక్' నుండి వచ్చింది. పురాతన గ్రీసులో, ఎఫెసస్, డెల్ఫీ మరియు ఒలింపిస్ అనే ప్రసిద్ధ దేవాలయాలు డిపాజిట్లు స్వీకరించే సంస్థలుగా ఉపయోగించబడ్డాయి. ఈ ఆలయాలు ఆర్థిక లావాదేవి కేంద్రాలుగా ఉండేవి. భారతదేశంలో బెంగాల్ కు చెందిన జగత్ సేఠ్‌లు, పాట్నాకు చెందిన షాలు, మద్రాసుకి చెందిన చెట్టియార్లు జారీ చేసిన హుండీలు అని పిలువబడే కాగితపు డబ్బు దేశవ్యాప్తంగా మరియు విదేశాలలో కూడా ఆమోదించబడింది. 1606లో ఆమ్‌స్టర్‌డామ్ వ్యాపారులు నగర యాజమాన్యంలో ఉండే ఒక బాంకును సృష్టించారు. ఈ బాంక్ రెండు శతాబ్దాల పాటు బ్యాంకింగ్ లావాదేవీలను విజయవంతంగా నిర్వహించింది. 17వ శతాబ్దంలో లండన్‌లోని స్వర్ణకారులు బ్యాంకర్లుగా వ్యవహరించారు. 19వ శతాబ్దంలోనే ప్రపంచంలో ఆధునిక వాణిజ్య బాంకింగ్ వ్యవస్థ అభివృద్ధి చెందింది.

13.3 వాణిజ్య బాంకుల నిర్వచనాలు

ప్రజల నుండి ద్రవ్య డిపాజిట్లను స్వీకరిస్తూ, రుణగ్రహీతలకు రుణాలను అడ్వాన్స్‌గా ఇచ్చే ఆర్థిక సంస్థయే బాంక్. బాంకులు సేకరించిన ద్రవ్యమును గృహాలు, సంస్థలు మరియు ప్రభుత్వానికి రుణాలు ఇవ్వడానికి ఉపయోగించుకుంటాయి. ప్రజలు తమ వద్ద ఉండే మిగులు ద్రవ్యమును రెండు కారణాల వల్ల బాంకుల్లో డిపాజిట్ చేస్తారు అవి భద్రత మరియు కొంత వడ్డీ మొత్తాన్ని సంపాదించడం.

ఇతర ప్రజల రుణాల పరిష్కారం కోసం విస్తృతంగా ఆమోదించబడే రుణాలు కలిగి ఉన్న సంస్థ'ను బాంక్‌ను నిర్వచించవచ్చని R.S. సేయర్స్ పేర్కొన్నారు.

" ద్రవ్యం కలిగి ఉండి, ఇచ్చేవారి నుండి లేదా తమ ఆదాయం నుండి పొదుపు చేసే వారి నుండి ద్రవ్యాన్ని సేకరించి, ఆ ద్రవ్యాన్ని అవసరమైన వారికి అప్పుగా ఇచ్చే సంస్థ బాంక్" అని క్రౌథర్ నిర్వచించారు.

"సాధారణ వ్యాపార సరళిలో, వ్యక్తులు జమకట్టే సొమ్మును వారి పేర కరెంట్ ఖాతాలో జమకడుతూ, ఆయా వ్యక్తులు తన మీద జారీ చేసిన చెక్కులను ఆదరిస్తూ చెల్లించే వారినే బాంకర్" అనవచ్చు అని హెర్బర్ట్ నిర్వచించారు.

బాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, 1949 ప్రకారం "కోరిన వెంటనే కాని, ఇంకో సమయంలో కాని, చెక్కు, డ్రాఫ్ట్, ఆర్డర్ల ద్వారా కాని, ఇంకో విధంగా కాని, తిరిగి చెల్లించే షరతులమీద డిపాజిట్‌లు స్వీకరించి, ఆ సొమ్మును రుణాలు ఇవ్వడానికి కాని, పెట్టుబడి కోసం గాని ఉపయోగించడమే బాంకు వ్యాపారము".

13.4 వాణిజ్య బాంకుల విధులు

ప్రజల నుండి డిపాజిట్లను స్వీకరిస్తూ, పరిశ్రమలకు, వర్తకానికి , వ్యవసాయానికి, వినియోగదారులకు ద్రవ్యాన్ని అప్పుగా ఇచ్చి వారికి అనేక విధములైన సేవలు చేసే ఒక వ్యవస్థీకృతమైన ఆర్థిక సంస్థయే వాణిజ్య బాంకు. ఆర్థిక రంగంలో బ్యాంకులకు విశిష్టమైన పాత్ర ఉంది. చలామణిలో ఉన్న ద్రవ్యంలో ఎక్కువ భాగం బ్యాంకుల ఆధీనంలోనూ, అజమాయిషీలోనూ ఉండటం వల్ల దేశంలోని ఉత్పత్తి పరిమాణాన్ని, స్వభావాన్ని నిర్ణయించే శక్తి బ్యాంకులకు ఉంది. వాణిజ్య బాంకు యొక్క ప్రధాన లక్ష్యాలు ఏమనగా (ఎ) వ్యక్తులు మరియు సంస్థల నుండి డిపాజిట్లను సమీకరించడం మరియు (బి) పరపతిని విస్తృతపరుచుట అంటే లాభాన్ని సంపాదించాలనే ఉద్దేశ్యంతో అవసరమైన వారికి రుణాలను అందించడం. దాని లక్ష్యాలను సాధించడానికి వాణిజ్య బాంకులు ముఖ్యంగా డిపాజిట్లను స్వీకరించి, ముందస్తు రుణాలను ఇస్తాయి. అందువల్ల వాణిజ్య బాంకు రెండు ముఖ్యమైన విధులు ఏవనగా (1) డిపాజిట్ల స్వీకరణ (2) రుణాలు మరియు అడ్వాన్సులను ఇచ్చుట.

13.4.1. డిపాజిట్ల స్వీకరణ

డిపాజిట్లు అంటే ప్రజలు బాంకుల్లో ఉంచే ద్రవ్యం. బాంకు ప్రజల నుండి నాలుగు రకాల డిపాజిట్లను స్వీకరించి, ఈ క్రింది ఖాతాలలో పొందుపరుస్తుంది.

i) కరెంట్/ డిమాండ్ డిపాజిట్లు: ఈ డిపాజిట్లు ప్రత్యేకంగా పెద్ద మొత్తాలను తరచుగా లావాదేవీలు చేసే వ్యాపారస్తుల కోసం ఉద్దేశించబడ్డాయి. అడిగిన తక్షణమే వీటిని తిరిగి చెల్లిస్తాయి. సాధారణంగా వాటిపై ఎలాంటి వడ్డీ చెల్లించరు. కానీ వివిధ సేవలను అందించడానికి వినియోగదారుల నుండి నిర్వహణ రుసుమును వసూలు చేస్తాయి. ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది.

ii) పొదుపు డిపాజిట్లు: ఈ డిపాజిట్లు చిన్న వ్యాపారస్థులు, ఉద్యోగులు , అల్ప మరియు మధ్య తరగతి ఆదాయ వర్గాలకు అనువుగా ఉంటాయి. ప్రజలు ద్రవ్యమును ఎప్పుడైనా జమ చేయవచ్చు మరియు ఉపసంహరించుకోవచ్చు. బాంకులు నిర్దిష్ట వ్యవధిలో తిరిగి తీసుకొనే మొత్తం మరియు సంఖ్యపై పరిమితిని విధిస్తాయి. నిర్ణీత స్థిర డిపాజిట్లతో పోలిస్తే వీటిపై చెల్లించే వడ్డీ రేటు తక్కువగా ఉంటుంది.

iii) కాల పరిమితి డిపాజిట్లు: ఈ డిపాజిట్లు 7 రోజులు, 46 రోజులు, 90 రోజులు, 1 సంవత్సరం, 2 సంవత్సరాలు మొదలైన నిర్ణీత కాలానికి జమచేయబడతాయి. వడ్డీ రేటు కాలవ్యవధి మరియు జమచేసిన మొత్తాన్ని బట్టి మారుతుంది. గడువు ముగిసిన తర్వాత మాత్రమే ఈ సొమ్మును ఉపసంహరించుకోవాలి. కాని ఆ సొమ్ముపై అప్పు తీసుకొనవచ్చును. లేదా పూర్తిగా కాని, పాక్షికముగా గాని వడ్డీ పోగొట్టుకొని ఈ ఖాతాను రద్దు చేసుకొనవచ్చును.

iv) రికరింగ్ డిపాజిట్లు: ఈ డిపాజిట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఒక రకమైనవి. ప్రజలు నిర్ణీత వ్యవధి వరకు నిర్ణీత మొత్తాన్ని క్రమానుగతంగా జమ చేస్తారు. జమ చేయబడే మొత్తం పెరుగుతుంది. ఈ డిపాజిట్లపై చెల్లించబడే వడ్డీ పొదుపు డిపాజిట్ల కంటే ఎక్కువ, ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే తక్కువగా ఉంటుంది.

13.4.2 రుణాలను, అడ్వాన్సులను మంజూరు చేయడం

డిపాజిట్లను బాంక్ జాగ్రత్తగా ఉపయోగించుకుంటుంది. సాధారణంగా అందరు డిపాజిటర్లు ఒకేసారి సొమ్ములను ఉపసంహరించరు కనుక వారి సొమ్ముతో బాంక్, వ్యాపారం చేసే సాహసం చేస్తుంది. ఇది కేంద్ర బాంక్ మార్గదర్శకాల ప్రకారం కొంత సొమ్మును ఎప్పుడూ నిల్వలో ఉంచి డిపాజిటర్ల అవసరాలను తీర్చేటట్లుగా ప్రణాళికలు చేస్తుంది.

ఎ. డిమాండ్ రుణాలు: బాంకులు అడిగిన వెంటనే తిరిగి చెల్లించే రుణాలను డిమాండ్ రుణాలు అంటారు. వీటికి నిర్దిష్ట పరిపక్వ కాలపరిమితి లేదు. రుణంగా తీసుకున్న మొత్తం రుణగ్రహీత ఖాతాలో జమ చేయబడుతుంది. సెక్యూరిటీ బ్రోకర్ల వంటి వారి రుణ అవసరాలు సాధారణంగా మారుతూ ఉంటాయి. వ్యక్తిగత పూచి మరియు ఆర్థికపరమైన ఆస్తులపై రుణాలను తీసుకుంటారు.

బి. స్వల్పకాలిక రుణాలు: తగిన సెక్యూరిటీల ఆధారంతో, వ్యక్తిగత రుణాల రూపంలో నిర్వహణ మూలధనంగా ఈ రుణాలు ఇస్తారు. రుణం మొత్తాన్ని ఒక వాయిదాలో కాని లేదా అనేక వాయిదాలలో తిరిగి చెల్లించబడుతుంది.

సి. ద్రవ్య పరపతి: వ్యాపారవేత్తలకు రుణాలు ఇవ్వడానికి ఇది మరొక మార్గం. ఈ విధానంలో మంజూరైన మొత్తం రుణం ఒకేసారి ఇవ్వబడదు, కానీ రుణగ్రహీత పేరు మీద ఖాతా తెరవబడి, రుణగ్రహీత తనకు కావలసివచ్చినప్పుడు డబ్బును ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తుంది. మంజూరు చేసిన రుణానికంతకూ వడ్డీ వసూలు చేయరు. కాని అప్పు తీసుకొనిన వ్యక్తి ఉపయోగించుకొనిన సొమ్ముకు మాత్రమే వడ్డీ వసూలు చేస్తుంది.

డి. ఓవర్‌డ్రాఫ్ట్: ఎంపిక చేసుకున్న ఖాతాదారులకు బ్యాంకులు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని కలుగచేస్తాయి. ఖాతాదారులు వారు డిపాజిట్ చేసిన దానికంటే ఎక్కువ పొందవచ్చు, అయితే వారు స్వల్ప కాలంలో తిరిగి చెల్లించాల్సిన అదనపు మొత్తానికి వడ్డీని చెల్లించాలి. డ్రాఫ్ట్‌పై అనుమతించదగిన మొత్తం రుణగ్రహీత యొక్క ఆర్థిక స్థితిని బట్టి మారుతుంది. కరెంట్ ఖాతాలకు సంబంధించి మాత్రమే ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం కల్పించబడుతుంది.

ఇ. వినిమయ బిల్లులో డిస్కౌంట్లనిచ్చుట: వినిమయ బిల్లు కలిగిన వ్యక్తిని తన బిల్లును హామీ చూపితే బాంకు నుండి కొంత సొమ్మును ఉపసంహరించుటకు బాంకు అనుమతిస్తుంది. కాని బిల్లులో ఉన్న పూర్తి సొమ్మును ఇవ్వకుండా కొంత తగ్గించుకుంటుంది. బిల్లు కాల పరిపక్వమైన తరువాత పార్టీకి వసూలుకై పంపి డిపాజిటరుకు మిగిలిన సొమ్మును తన కమీషన్ తగ్గించుకొని చెల్లిస్తుంది. వినిమయ బిల్లులు 90 రోజుల కాల వ్యవధికి జారీ చేయబడతాయి.

ఎఫ్. క్రెడిట్ కార్డులు: క్రెడిట్ కార్డ్ అనేది ప్రాథమికంగా క్రెడిట్ కార్డుదారులు కొనుగోళ్లు చేయడానికి అనుమతించే చెల్లింపు యంత్రాంగం. బ్యాంకులు ఖాతాదారులకు క్రెడిట్ కార్డులను జారీ చేస్తాయి. కార్డుదారుడు ఈ కార్డ్‌తో ఏదైనా దుకాణంలో క్రెడిట్‌పై వస్తువులను కొనుగోలు చేయవచ్చు. కొన్ని నిబంధనలకు లోబడి దుకాణాల నుండి వస్తువులను కొనుగోలు చేయడానికి క్రెడిట్ కార్డ్ ఉపయోగించబడుతుంది. బిల్లు మొత్తం క్రెడిట్ కార్డును జారీ చేసిన బ్యాంకుల నుండి వసూలు చేయబడుతుంది. ఉదా: SBI, కార్డ్ ఎలైట్, HDFC రెగల్లా క్రెడిట్ కార్డ్ మొదలైనవి,

13.4.3 పరపతిని సృష్టించడం

బాంకులు ప్రజల నుండి డిపాజిట్ల రూపంలో స్వీకరించిన మొత్తం నుండి తమ ఖాతాదారులకు రుణాలను ఇవ్వడం ద్వారా పరపతిని ను సృష్టిస్తాయి. వాణిజ్య బాంకులన్నీ కేంద్ర బాంకు వద్ద వారి నగదు నిల్వలలో నిర్దిష్ట శాతాన్ని ఉంచుకోవాలి. ప్రాథమిక డిపాజిట్ల మొత్తం నుండి కొంత భాగాన్ని బాంకులు రుణాలు మరియు అడ్వాన్సులు ఇస్తాయి. ఒక బాంకు ఖాతాదారునికి రుణం మంజూరు చేసినప్పుడు, నగదు చెల్లించడానికి బదులుగా డిపాజిట్ ఖాతాలో అది రుణాన్ని జమ చేస్తుంది. ఆ విధంగా ఉత్పన్నమైన డిపాజిట్లు సృష్టించబడతాయి.

13.4.4 ఏజెన్సీ విధులు

వాణిజ్య బాంకులు వాటి ఖాతాదారులకు ఏజెంట్‌గా పనిచేస్తాయి మరియు కింద పేర్కొన్న విధంగా ఏజెన్సీ విధులను నిర్వహించడానికి కమీషన్‌ను పొందుతాయి.

ఎ) ఒక వాణిజ్య బాంకు తన ఖాతాదారుల సూచనల ప్రకారం చందాలు, ప్రీమియంలు, అద్దె మొదలైన వాటి చెల్లింపును చేపడుతుంది.

బి) ఖాతాదారులకు చెందిన నిధులను చెక్కులు, వినిమయ బిల్లులు, డిమాండ్ డ్రాఫ్టులు, ప్రామిసరీ నోట్లు మొదలైన వాటిని ద్వారా ఇతర బాంకుల నుండి వసూలుచేస్తుంది.

సి) ఖాతాదారుల సలహా మేరకు వారి ఆస్తికి 'ట్రస్టీ' గా మరియు 'ఎగ్జిక్యూటివ్'గా వ్యవహరిస్తుంది.

డి) ఖాతాదారుల తరపున బంగారం, వెండి, సెక్యూరిటీలను, మరియు షేర్ల క్రయ, విక్రయాలను చేస్తుంది.

ఇ) ఖాతాదారుల తరుపున డివిడెండ్లను, షేర్లు మరియు డిబెంచర్లపై వడ్డీని వసూలు చేస్తుంది.

13.4.5 సాధారణ ఉపయోగ సేవలు

ఎ) నిధుల బదిలీ: ఇది డిమాండ్ డ్రాఫ్టులు, మెయిల్ బదిలీలు, టెలిగ్రాఫిక్ బదిలీలు మొదలైన వాటి ద్వారా నిధులను చౌకగా మరియు సులువుగా ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి బదిలీచేసే సౌకర్యాన్ని అందిస్తుంది.

బి) బాంకులు పరపతి లేఖలను, ప్రయాణీకుల చెక్కులను మరియు గిఫ్ట్ చెక్కులను జారీ చేస్తాయి.

సి) వ్యాపారులకు తన ఖాతాదారుల ఆర్థిక స్థితి గురించి సమాచారాన్ని అందిస్తుంది మరియు ఇతర ప్రాంతాలలో ఉన్న వ్యాపారుల గురించిన సమాచారాన్ని సేకరించి తమ ఖాతాదారులకు అందచేస్తుంది.

డి) ఖాతాదారులు తమ విలువైన ఆభరణాలు మరియు ముఖ్యమైన డాక్యుమెంట్లను సురక్షితంగా ఉంచుకోవడానికి లాకర్ సదుపాయాన్ని అందిస్తాయి. ఈ సేవలు చేసినందుకు కొద్దిపాటు రుసుమును వసూలు చేస్తాయి.

ఇ) ప్రభుత్వం, పబ్లిక్ మరియు ప్రైవేట్ సంస్థలచే జారీ చేయబడిన సెక్యూరిటీలకు పూచీకత్తునిస్తుంది .

ఎఫ్) విదేశీ మారకపు లావాదేవీలను నిర్వహిస్తుంది.

జి) ఖాతాదారులు నిర్దిష్ట పరిమితులకు లోబడి నగదును జమచేయడానికి మరియు ఉపసంహరించుకోవడానికి వీలుగా ATMలను (ఆటోమేటిక్ టెల్లర్ మెషీన్‌లు) ఏర్పాటు చేసాయి. ఖాతాదారులు క్రెడిట్ మరియు డెబిట్ కార్డులను ఉపయోగించి ATM సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు.

అభివృద్ధి చెందుతున్న దేశంలో వాణిజ్య బాంకులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అవి మూలధన సమీకరణ కోసం పొదుపును సేకరిస్తాయి. గ్రామీణ మరియు వెనుకబడిన ప్రాంతాల్లో శాఖలను తెరవడం ద్వారా ఆర్థిక వ్యవస్థను ద్రవ్యీకృతం చేసే విధంగా బాంకులు ప్రోత్సహిస్తాయి. ఇవి పరిశ్రమలకు ఆర్థిక సాయం అందించడమే కాకుండా మూలధన మార్కెట్‌ను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. కేంద్ర బ్యాంక్ ద్రవ్య విధానాన్ని అనుసరించడం ద్వారా అవి దేశ ఆర్థిక అభివృద్ధికి సహాయపడతాయి.

13.5 నెట్ బాంకింగ్

ప్రస్తుతం చాలా బాంకుల్లో, ఉద్యోగులు, యంత్రాలు నిర్వహించే టెల్లర్ కౌటర్ల స్థానాలు ఆటోమేటెడ్ టెల్లర్ మెషిన్ (ATM) ద్వారా భర్తీ చేయబడుతున్నాయి. బాంకింగ్ కార్యకలాపాలను ఇంటర్నెట్ ఉన్న కంప్యూటర్లతోనూ, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలతోనూ నిర్వహిస్తున్నారు. దీనినే నెట్ బాంకింగ్ అంటారు. నెట్ బ్యాంకింగ్‌ను ఇంటర్నెట్ బ్యాంకింగ్ లేదా ఆన్‌లైన్ బాంకింగ్ లేదా వెబ్ బాంకింగ్ అని కూడా అంటారు.

ఇంటర్నెట్ బాంకింగ్ ఖాతాదారులకు డిపాజిట్లు, బదిలీలు మరియు ఆన్‌లైన్ బిల్లు చెల్లింపులతో సహా స్థానిక శాఖ ద్వారా సాంప్రదాయకంగా లభించే దాదాపు ప్రతి సేవను అందిస్తుంది. వాస్తవంగా ప్రతి బాంకింగ్ సంస్థ డెస్క్‌టాప్ మరియు మొబైల్ యాప్‌ల ద్వారా అందుబాటులో ఉండే ఆన్‌లైన్ బాంకింగ్ యొక్క కొన్ని రూపాలను కలిగి ఉంటుంది. ఆన్‌లైన్ బ్యాంకింగ్‌తో, వినియోగదారులు తమ ప్రాథమిక బాంకింగ్ లావాదేవీలను పూర్తి చేయడానికి బాంకు శాఖను సందర్శించాల్సిన అవసరం లేదు. ఎక్కడైనా అనగా ఇంట్లో, కార్యాలయంలో లేదా కార్యాలయానికి వెళ్లే మార్గంలో, వీటన్నింటిని వారు తమ స్వంత సౌలభ్యం మేరకు చేయగలరు. అయితే ఈ సౌకర్యాన్ని ఉపయోగించడానికి ఖాతాదారునికి ఇంటర్నెట్ సదుపాయం ఉన్న కంప్యూటర్ అవసరం అవుతుంది. నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ (NEFT), రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ (RTGS), ఎలక్ట్రానిక్ క్లియరింగ్ సిస్టమ్ (ECS) మొదలైనవి నెట్ బాంకింగ్‌కి ఉదాహరణలు. సేవలను పొందటానికి, క్లయింట్లు తమ బాంకుకు చెందిన ఆన్‌లైన్ బాంకింగ్ సేవ కోసం రిజిస్టర్ చేసుకోవాలి.

మొబైల్ బాంకింగ్ (M–బాంకింగ్) అనేది మొబైల్ ఫోన్ వంటి మొబైల్ సమాచార సాధనం ద్వారా బాంకింగ్ సేవలను అందించే తాజా బాంకింగ్ సేవ. మొబైల్ బాంకింగ్‌లో ఖాతాదారులు అతను/ఆమె రోమింగ్‌లో ఉన్నప్పుడు ఒక ప్రదేశంలో స్థిరంగా ఉండకపోయినా బాంక్ సేవలను పొందవచ్చు. భారతదేశంలో ఇది 2002 సంవత్సరంలో ప్రారంభించబడింది. SBI, HDFC, AXIS మరియు ICICI వంటి అనేక బాంకులు వాటి ఆర్థిక వ్యవహారాలను అంతర్జాలం ద్వారా నిర్వహిస్తున్నాయి.

ఇంటర్నెట్ బాంకింగ్ ప్రయోజనాలు:

ఖాతాదారుడు ఈ సదుపాయాన్ని ఉపయోగించి క్రింద పేర్కొన్నవాటితో పాటు లావాదేవీ మరియు లావాదేవీయేతర పనులను నిర్వహించవచ్చు:

ఎ) ఆన్‌లైన్ ఖాతాను సులభంగా తెరిచి, నిర్వహించుకోవచ్చు.

బి) ఖాతాదారుడు తన అకౌంట్ స్టేట్‌మెంట్‌లను స్వయంగా చూసుకోవచ్చు .

సి) ఇది 24 గంటలు, 7 రోజులు బాంకింగ్ సేవలను అందిస్తుంది.

డి) ఖాతాదారుడు సంబంధిత బాంకు లావాదేవీల చరిత్రను తనిఖీ చేయవచ్చు.

ఇ) బాంకు స్టేట్‌మెంట్‌లు, వివిధ రకాల ఫారమ్ లు మరియు దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఎఫ్) ఖాతాదారులు నిధుల బదిలీ, వివిధ రకాల బిల్లుల చెల్లింపు , మొబైల్ రీఛార్జ్ మరియు %ఖుం% కనెక్షన్‌లు మొదలైనవి చేయవచ్చు. ఫలితంగా సమయం, పోస్టేజి వ్యయం ఆదా అవుతాయి.

జి) ఖాతాదారుడు ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో క్రయ, విక్రయాలు చేయవచ్చు.

హెచ్) ఖాతాదారుడు పెట్టుబడి పెట్టి, వాణిజ్యం నిర్వహించవచ్చు.

ఐ) ఖాతాదారుడు రవాణా, ప్రయాణ ప్యాకేజీలు మరియు మెడికల్ ప్యాకేజీలు బుక్ చేసుకోవచ్చు.

జె) సురక్షితమైన మరియు భద్రతతో కూడిన ఆర్థిక లావాదేవీలను నిర్వహించుకోవచ్చు.

కె) అంతర్జాల బాంకింగ్ ఖాతాదారులను ప్రయాణంలో ఇబ్బందులను, కాగితాల ఉపయోగాన్ని తగ్గిస్తుంది.

ఎల్) ప్రస్తుతం బాంకింగ్ వ్యవస్థలో అంతర్జాల బాంకింగ్ కీలక పాత్ర పోషిస్తోంది. ఖాతాదారులు మొబైల్ ఫోన్లలో వైఫై (Wi-fi) లేదా 3G, 4G లేదా 5G కనెక్షన్లను ఉపయోగించి ఈ సౌక్యర్యాన్ని పొందవచ్చు.

13.6 కేంద్ర బాంక్ / భారత రిజర్వ్ బాంకు

కేంద్ర బాంకు ఒక దేశంలోని బాంకింగ్ మరియు ఆర్థిక సంస్థలలో అత్యున్నత సంస్థగా ఉంటుంది. ఇది దేశంలోని బాంకింగ్ వ్యవస్థను నిర్వహించడం, నియంత్రించడం, పర్యవేక్షించడం మరియు అభివృద్ధి చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ప్రతి దేశం వేర్వేరు పేర్లతో పిలువబడే కేంద్ర బాంకును కలిగి ఉంటుంది. ఉదాహరణకు మన దేశంలోని కేంద్ర బాంకు పేరు భారత రిజర్వ్ బాంక్. భారత రిజర్వ్ బాంకు 1935 ఏప్రిల్ 1న 5 కోట్ల వాటా మూలధనంతో స్థాపించబడింది. ప్రారంభంలో ఇది ప్రైవేట్ వాటాదారుల యాజమాన్యంలో ఉంది కానీ 1949లో భారత ప్రభుత్వంచే జాతీయం చేయబడింది. ఇది భారత ప్రభుత్వ యాజమాన్యానికి చెందినది. భారత రిజర్వ్ బాంక్ చట్టం, 1934 ప్రకారం ఇది కేంద్ర బాంకుకు చెందిన అన్ని విధులను నిర్వర్తిస్తుంది.

13.6.1. భారత రిజర్వ్ బాంకు లక్ష్యాలు

ఎ) భారతదేశంలో ద్రవ్య స్థిరత్వాన్ని సాధించడం.

బి) బాంకు నోట్ల జారీని క్రమబద్ధంచేయడం.

సి) కరెన్సీ మరియు పరపతి వ్యవస్థను నిర్వహించడం.

డి) ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న సంక్లిష్టమైన సవాళ్ళను ఎదుర్కొనేందుకు ఆధునిక ద్రవ్య విధాన చట్రమును కలిగి ఉండటం.

ఇ) వృద్ధి లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ధరల స్థిరత్వాన్ని కొనసాగించడం.

ఎఫ్) జాతీయ లక్ష్యాలకు మద్దతుగా ఆర్థిక రంగాన్ని పర్యవేక్షణ చేయడం.

13.6.2 భారత రిజర్వ్ బాంకు విధులు

భారత రిజర్వ్ బాంక్ క్రింద చర్చించబడిన అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది.

ఎ) సాధారణ విధులు

1. కరెన్సీ నోట్ల జారీ: భారత రిజర్వ్ బాంకుకు మాత్రమే దేశంలో కరెన్సీ నోట్లను జారీచేసే గుత్తాధిపత్యపు అధికారం కలదు. . రిజర్వ్ బాంక్ జారీ చేసిన కరెన్సీ నోట్లు చట్టబద్ధమైనవి. భారత రిజర్వ్ బాంక్ లోని 'జారీ శాఖ' ద్వారా నోట్లను మరియు నాణేలను జారీ చేయడం జరుగుతుంది. కేవలం ఒక రూపాయి నాణాలు, నోట్లు అంతకంటె తక్కువ విలువ గల నాణాలను మాత్రం భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేస్తుంది. నోట్ల జారీకి భారతీయ రిజర్వ్ బాంకు కనీసం రూ.200 కోట్ల నిల్వను ఉంచుకోవాలి, అందులో రూ.115 కోట్లకు తక్కువ కాకుండా బంగారం రూపంలో ఉండాలి.

2. ప్రభుత్వానికి బాంకర్: భారత రిజర్వ్ బాంకు ప్రభుత్వానికి ప్రతినిధిగానూ, సలహాదారుగానూ మరియు బాంకర్‌గానూ వ్యవహరిస్తుంది. బాంకర్‌గా, భారత రిజర్వ్ బాంకు ప్రభుత్వం తరపున నగదు, చెక్కులు మరియు డ్రాఫ్ట్‌లు మొదలైన వాటిని స్వీకరిస్తుంది. ఇది ప్రభుత్వానికి స్వల్పకాలిక రుణాలను అందిస్తుంది మరియు ప్రభుత్వం తరపున విదేశీ కరెన్సీ క్రయ విక్రయాలు చేస్తుంది. ఇది ప్రభుత్వ రుణాన్ని కూడా నిర్వహిస్తుంది, కొత్త రుణాలను జారీ చేయుట, ఈ రుణాలకు చందాలను స్వీకరించుట , వాటిపై వడ్డీని చెల్లించుట చివరకు ఈ రుణాలను తిరిగి చెల్లిస్తుంది. కేంద్ర బాంకు ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా వ్యవహరిస్తుంది. సలహాదారుగా అన్ని బాంకింగ్ లావాదేవీలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సలహా ఇస్తుంది.

3. బాంకులకు బాంకు: భారత రిజర్వ్ బాంకు వాణిజ్య బాంకులకు అవి ఎల్లప్పుడూ తమ బాంకులలో ఎంత నగదును ఉంచుకోవాలి వంటి విషయాలపై నియమ నిబంధనలను నిర్ణయిస్తుంది. బాంకులు ఉంచుకోవలసిన ఈ నగదును నగదు నిల్వల నిష్పత్తి అని అంటారు. వాణిజ్య బాంకుల బిల్లులకు డిస్కౌంట్ చేస్తుంది. బాంకులకు మార్గదర్శకత్వం చేస్తూ వాటి కార్యకలాపాలను క్రమబద్ధం చేస్తుంది. వాణిజ్య బ్యాంకులను తనిఖీ చేసి వాటి అభివృద్ధికి సూచనలు చేస్తుంది.

4. అంతిమ రుణదాత: భారత రిజర్వ్ బాంకు అంతిమ రుణదాతగా వ్యవహరిస్తుంది. ఆమోదింపబడిన సెక్యూరిటీలను డిస్కౌట్ చేయడం ద్వారా మరియు అనుషంగిక రుణాలను, అడ్వాన్సులను జారీ చేయడం ద్వారా బాంకుల అంతిమ ఆర్థిక అవసరాన్ని తీరుస్తుంది.

5. క్లియరింగ్ హౌస్: భారత రిజర్వ్ బాంక్ వాణిజ్య బ్యాంకుల పరస్పర నగదు బదిలీల పరిష్కారానికి క్లియరింగ్ హౌస్‌గా పనిచేస్తుంది. వాణిజ్య బాంకులు తమ నగదు నిల్వలను రిజర్వ్ బాంక్ వద్ద ఉంచుతాయి కాబట్టి, వాటి ఖాతాలలో చెల్లింపులకు సంబంధించిన బదిలీ ఎంట్రీలను నమోదుచేయడం ద్వారా వాణిజ్యబాంకుల మధ్య గల చెల్లింపులను క్లియర్ చేయడం సులభంగా, సౌకర్యవంతంగా ఉంటుంది.

6. విదేశీ మారక నిల్వల పరిరక్షణ: భారత రిజర్వ్ బాంకు విదేశీమారకపు నిల్వలకు సంరక్షకునిగా వ్యవహరించును. రూపాయి మారకపు నిల్వను నిర్వహించును. విదేశీ మారక ద్రవ్య వసూళ్ళను, చెల్లింపులను నియంత్రిస్తుంది. ఇది మార్కెట్లో విదేశీ కరెన్సీలను కొనుగోలు చేయడం మరియు విక్రయించడం ద్వారా మారకం రేటు యొక్క స్థిరత్వాన్ని కొనసాగించడంలో సహాయపడుతుంది.

7. పరపతి నియంత్రణ: వాణిజ్య బాంకులిచ్చు పరపతిని నియత్రించుటయే రిజర్వ్ బాంకు ముఖ్య విధి. ఇది వివిధ రంగాలకు ఇవ్వవలసిన అప్పు ప్రవాహము, అప్పు పరిమాణము, వడ్డీరేట్లు మొదలగు వాటిని నిర్ణయించును. భారత రిజర్వ్ బాంక్ పరిమాణాత్మక, గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలను ఉపయోగించి పరపతిని నియంత్రిస్తుంది. పరిమాణాత్మక పరపతి నియంత్రణ పద్ధతుల లక్ష్యం పరపతి లభ్యత మరియు వ్యయ నియంత్రణ అయితే, గుణాత్మక పరపతి నియంత్రణ పద్ధతులు పరపతి ఉపయోగాన్ని, దిశను ప్రభావితం చేస్తాయి.

బి) పర్యవేక్షక విధులు

భారత రిజర్వ్ బాంకు మన దేశంలో బాంకింగ్ మరియు ఆర్థిక వ్యవస్థలను క్రమబద్దీకరించి, నిర్వహించే అధికారాలను కలిగి ఉంది.

1. భారత రిజర్వ్ బాంక్ బాంకులకు లైసెన్స్ మంజూరు చేస్తుంది.
2. ఆస్తులు మరియు అప్పుల వివిధ భాగాలపై కాలానుగుణ సమాచారాన్ని అడగడం ద్వారా బాంకులను తనిఖీ చేస్తుంది.
3. బాంకింగేతర ఆర్థిక సంస్థలకు ఆదేశాలను జారీ చేస్తూ, నియంత్రించే అధికారం కలిగి ఉంటుంది.

సి) ప్రోత్సాహక మరియు అభివృద్ధి విధులు

భారత రిజర్వ్ బాంక్ జాతీయ లక్ష్యాలకు మద్దతుగా విస్తృతమైన ప్రోత్సాహక మరియు అభివృద్ధి విధులను నిర్వహిస్తుంది. ఇది ద్రవ్య మరియు మూలధన మార్కెట్ అభివృద్ధికి సహాయపడుతుంది.

1. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వాణిజ్య బాంకు శాఖల సదుపాయాల పెంపుదలకై ఈ బాంకు ప్రణాళికలను చేస్తుంది.

2. కొన్ని నిర్దిష్ట వర్గాల అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఏజెన్సీలను నియమిస్తుంది. అవి i) వ్యవసాయ రంగ అవసరాలను తీర్చే జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి (NABARD) బాంకు, ii) పారిశ్రామిక రంగ అవసరాలను తీర్చే భారతదేశ పారిశ్రామిభివృద్ధి బాంకు (IDBI), iii) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే ప్రారంభింపబడిన పరిశ్రమలకు దీర్ఘకాలిక రుణాలనిచ్చే ఆర్థిక కార్పోరేషన్లు (FCI, SFC) మొదలైనవి ప్రత్యేక ఏజన్సీలకు ఉదాహరణలు

13.7 సారాంశం

స్థూల ఆర్థిక శాస్త్రంలో బాంకింగ్ ఒక ముఖ్యమైన అంశం. బాంకింగ్ అనేది ప్రజల వద్ద నుండి డిపాజిట్లను స్వీకరించి, ఈ డిపాజిట్లను ఒక వ్యక్తి నుండి మరొకరికి బదిలీ చేసే వ్యాపార కార్యకలాపం. వాణిజ్య బ్యాంకు అనునది ఒక ఆర్థికపరమైన సంస్థ. వాణిజ్య బాంకుల ప్రధాన విధులు (A) డిపాజిట్ల స్వీకరణ (B) రుణాలను జారీచేయుట. వాణిజ్య బాంకులు కరెంట్, పొదుపు, ఫిక్స్‌డ్ మరియు రికరింగ్ డిపాజిట్లు అనే నాలుగు రకాల డిపాజిట్లను స్వీకరిస్తాయి. వాణిజ్య బాంకులు డిమాండ్ రుణాలు, స్వల్పకాలిక రుణాలు, ద్రవ్య పరపతి, ఓవర్‌డ్రాఫ్టలు మరియు వినిమయ బిల్లుల డిస్కౌంట్ మొదలగు వివిధ రకాలైన రుణాలను వివిధ వర్గాల ప్రజలకు ఇస్తాయి. బాంకులు ప్రాథమిక డిపాజిట్లనుండి పరపతిని సృష్టిస్తాయి. నెట్ బ్యాంకింగ్ లో బాంకింగ్ లావాదేవీలన్నీ అంతర్జాలం ద్వారా నిర్వహించబడతాయి. భారతదేశంలో కేంద్ర బాంకును భారతీయ రిజర్వ్ బాంకు అంటారు. ఇది ఆర్దిక పరమైన సంస్థలన్నింటిలో అత్యున్నత సంస్థగా ఉంటుంది.

ఒక దేశంలో ద్రవ్య స్థిరత్వాన్ని సాధించడమే భారత రిజర్వ్ బాంక్ ప్రధాన లక్ష్యం. భారత రిజర్వ్ బ్యాంక్ మన దేశంలో కరెన్సీ నోట్లను జారీ చేసే గుత్తాధిపత్యాన్ని కలిగి ఉంది. భారతీయ రిజర్వ్ బాంక్ వాణిజ్య బాంకులకు మార్గదర్శకాలను అందిస్తూ, జాతీయ లక్ష్యాలకు మద్దతుగా వాటిని పర్యవేక్షిస్తుంది.

13.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

II. ఈ క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలను వ్రాయండి.

1. ఓవర్‌డ్రాఫ్టల ప్రయోజనాలు ఏమిటి?
2. క్రెడిట్ కార్డులు ఖాతాదారులకు ఎలా సహాయపడతాయి?
3. భారత రిజర్వ్ బాంక్ లక్ష్యాలు ఏమిటి?
4. క్లియరింగ్ హౌస్ గురించి మీకు ఏమి తెలుసు?
5. భారత రిజర్వ్ బాంకు ప్రోత్సాహక విధులను వివరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలను వ్రాయండి.

1. వాణిజ్య బాంకులు స్వీకరించే వివిధ రకాల డిపాజిట్లను వ్రాయండి.
2. వాణిజ్య బాంకుల ఏజెన్సీ విధులు ఏవి?
3. ద్రవ్య పరపతి మరియు ఓవర్ డ్రాఫ్టల మధ్య తేడాలను వ్రాయండి.
4. నెట్ బాంకింగ్ ప్రయోజనాలను తెలపండి.

III. ఈ క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలను వ్రాయండి.

1. వాణిజ్య బాంకుల ప్రధాన విధులను వివరించండి.
2. భారత రిజర్వ్ బాంకు విధులను వివరించండి.

13.9 పదకోశం

బాంకింగ్: బాంకింగ్ అనేది ప్రజల నుండి డిపాజిట్ల రూపంలో ద్రవ్యాన్ని స్వీకరించి, వ్యాపారస్తులు, రైతులు, పారిశ్రామికవేత్తలు మొదలగు అవసరమైన ప్రజలకు రుణాలు అందించే వ్యాపార కార్యకలాపం.

డిపాజిట్లు: డిపాజిట్లు బాంకుల్లో ప్రజలు ఉంచే నగదును సూచిస్తాయి.

రికరింగ్ డిపాజిట్: రికరింగ్ డిపాజిట్ ఖాతా ఫిక్స్డ్ డిపాజిట్ ఖాతాలోని ఒక రకం. ఒక వ్యక్తి సమాన కాల వ్యవధిలో నిర్దిష్ట మైన కాలానికి చెల్లింపు చేస్తాడు. ఉదాహరణకు ఒక వ్యక్తి ఐదేళ్ల కాల వ్యవధిని పరిపక్వత కాలంగా ఎంచుకొని 5 సంవత్సరాల వరకు ప్రతి నెలా కొంత మొత్తాన్ని చెల్లిస్తాడు. ఈ డిపాజిట్లపై అధిక వడ్డీ రేటు ఉంటుంది.

చెక్కు: చెక్కు అనేది ఒక వ్యక్తి ఖాతా నుండి నిర్దిష్ట మొత్తాన్ని ఆ చెక్కు ఎవరి పేరు మీద వ్రాయబడిందో ఆ వ్యక్తికి చెల్లించమని బాంకును సూచించే కాగితం.

ఓవర్ డ్రాఫ్ట్: ఎంపిక చేసుకున్న ఖాతాదారులకు బ్యాంకులు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని కలుగచేస్తాయి. బాంకులు అలాంటి ఖాతాదారులకు వారి ఖాతా నుండి డిపాజిట్ చేసిన దానికంటే ఎక్కువ సొమ్మును తీసుకొనుటకు అనుమతినిస్తాయి. అయితే ఖాతాదారులు అదనంగా తీసుకున్న మొత్తానికి వడ్డీ చెల్లించవలసి ఉంటుంది.

13.10. ఉపయుక్త గ్రంధాలు

- ఇంటర్మీడియట్ తెలుగు అకాడమీ అర్థశాస్త్ర పాఠ్య పుస్తకం
- B.A. స్థూల అర్థశాస్త్రం

అధ్యాయం 14

ద్రవ్యోల్బణం మరియు వ్యాపార చక్రాలు

14.0 లక్ష్యాలు

14.1 పరిచయం

14.2 ద్రవ్యోల్బణ నిర్వచనాలు

14.3 ద్రవ్యోల్బణంలో రకాలు

14.4 ద్రవ్యోల్బణానికి కారణాలు

14.5 ద్రవ్యోల్బణ ప్రభావాలు

14.6 ద్రవ్యోల్బణం నివారణ చర్యలు

14.7 వ్యాపార చక్రాలు

14.8 వ్యాపార చక్రాల లక్షణాలు

14.9 వ్యాపార చక్రాల దశలు

14.10 సారాంశం

14.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

14.12 పదకోశం

14.13 ఉపయుక్త గ్రంథాలు

14.0 లక్ష్యాలు

- ద్రవ్యోల్బణం మరియు దాని రకాలను నిర్వచిస్తారు.
- ద్రవ్యోల్బణం కారణాలను వివరిస్తారు.
- ద్రవ్యోల్బణం ప్రభావాలను వివరిస్తారు.
- ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి నివారణ చర్యలను సూచిస్తారు.
- ధరల స్థిరీకరణ ఆవశ్యకతను అవగాహన చేసుకుంటారు.
- వ్యాపార చక్రాల దశలను అవగాహన చేసుకుంటారు.
- వ్యాపార చక్రాల ప్రభావాన్ని విశ్లేషిస్తారు.

14.1 పరిచయం

ఆర్థశాస్త్రంలో, ద్రవ్యోల్బణం అనగా ఆర్థిక వ్యవస్థలో వస్తువులు మరియు సేవల సాధారణ ధరలలో ఒక నిర్దిష్ట కాల వ్యవధిలో నిరంతర పెరుగుదల ఏర్పడే పరిస్థితి.

ఉదా: ఒకానొక కాలంలో వస్తువు ధర పెరుగుతూనే ఉంటుంది కాని పరిమాణం అలాగే ఉంటుంది.

పట్టిక

వస్తువు పేరు	6 నెలల సమయంలో వస్తువు ధరలోని వైవిధ్యం					
	జనవరి	ఫిబ్రవరి	మార్చ్	ఏప్రిల్	మే	జూన్
పెట్రోల్ (1 లీటర్)	90	95	98	100	102	105

వస్తువుల ధరలలో పెరుగుదల ఫలితంగా సాధారణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. ఇది అనేక విధాలుగా ప్రజల ఆర్థిక జీవనాన్ని మరియు సంక్షేమాన్ని ప్రభావితం చేస్తుంది.

ద్రవ్యోల్బణ నివారణకు, ఆర్థిక వ్యవస్థ యొక్క వృద్ధి మరియు అభివృద్ధికి సాధికారత కల్పించడానికి వస్తువుల ధరలను చాలా కాలం పాటు స్థిరీకరించాలి.

అధిక ద్రవ్యోల్బణం అనేక అంశాలలో దేశాల ఆర్థిక పనితీరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. అందువల్ల ద్రవ్యోల్బణ నిర్ణాయకాలను గుర్తించడం చాలా ముఖ్యం.

ద్రవ్యోల్బణం ధరల యంత్రాంగానికి అంతరాయం కలిగిస్తుంది, పెట్టుబడి మరియు పొదుపులను నిరుత్సాహపరుస్తుంది, స్థిర ఆదాయ వర్గాలవారు మరియు రుణదాతలపై ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది మరియు చివరికి నైతిక పతనానికి దారితీస్తుంది.

14.2 ద్రవ్యోల్బణం నిర్వచనాలు

"ద్రవ్యోల్బణం"అనే పదం, నిర్దిష్ట కాల వ్యవధిలో సాధారణ ధరల స్థాయిలో నిరంతర పెరుగుదలను సూచిస్తుంది.

పిగూ ప్రకారం "సంపాదన కార్యకలాపంలో పెరుగుదల కంటే ఎక్కువ అనుపాతంలో ద్రవ్య ఆదాయం విస్తరించినప్పుడు ద్రవోల్బణం ఏర్పడుతుంది".

సామ్యూల్ సన్ ప్రకారం "సాధారణ ధరల స్థాయిలో పెరుగుదలను ద్రవ్యోల్బణం సూచిస్తుంది."

14.3 ద్రవ్యోల్బణంలో రకాలు

విలువ ఆధారంగా ద్రవ్యోల్బణం వివిధ రకాలుగా విభజించబడినవి. అవి:

1. పాకే ద్రవ్యోల్బణం: ధరలలో పెరుగుదల చాలా నిదానంగా మరియు స్వల్పంగా ఉన్నప్పుడు దానిని పాకే ద్రవ్యోల్బణం అంటారు. ద్రవ్యోల్బణ రేటు సంవత్సరానికి 3% మించదు.
2. నడిచే ద్రవ్యోల్బణం: ఇది ద్రవ్యోల్బణంలోని రెండవ దశ. ధరల స్థాయిలో పెరుగుదల సంవత్సరానికి 3% నుండి 10% మధ్య ఉంటే దానిని నడిచే ద్రవ్యోల్బణం అంటారు.
3. పరుగెత్తే ద్రవ్యోల్బణం: ధరల స్థాయిలో పెరుగుదల సంవత్సరానికి 10% నుండి 20% మధ్య ఉంటే దానిని పరుగెత్తే ద్రవ్యోల్బణం అంటారు. ఇది ఆర్థిక వ్యవస్థకు హానికరం.
4. దుమికే ద్రవ్యోల్బణం: ద్రవ్యోల్బణం రేటు సంవత్సరానికి 20% మించి ఉంటే దానిని దుమికే ద్రవ్యోల్బణం అని అంటారు. ఇది అత్యంత ప్రమాదకరం.
5. అతి తీవ్ర ద్రవ్యోల్బణం: ధరలు రెండు లేదా మూడు అంకెల రేట్లతో చాలా వేగంగా పెరిగినప్పుడు ఇది సంభవిస్తుంది. భారతదేశంలో ద్రవ్యోల్బణాన్ని కొలవడానికి WPI (టోకు ధరల సూచిక) ఉపయోగించబడుతుంది.

డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం మరియు వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం:

వస్తువుల సమిష్టి సప్లై కంటే సమిష్టి డిమాండ్ పెరగడం వల్ల ఏర్పడే ద్రవ్యోల్బణాన్ని డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్ల ఏర్పడే ద్రవ్యోల్బణాన్ని వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు.

14.4 ద్రవ్యోల్బణానికి కారణాలు

ద్రవ్యోల్బణం క్రింది ప్రధాన కారణాల వలన ఏర్పడవచ్చు.

- ప్రభుత్వ ప్రణాళిక మరియు ప్రణాళికేతర వ్యయంలో పెరుగుదల.
- ప్రభుత్వం లోటు బడ్జెట్ విధానమును అనుసరించడం.
- దీర్ఘకాల అభివృద్ధి ప్రాజెక్టులపై భారీగా పెట్టుబడి పెట్టడం.
- అనుత్పాదక ఆర్థిక కార్యకలాపాలకు సరళంగా పరపతి లభించడం.
- అధిక జనాభా పెరుగుదల రేటు.
- ప్రత్యక్ష పన్నుల తగ్గింపు, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సప్లై పెరుగుదల.

14.5 ద్రవ్యోల్బణం ప్రభావాలు

ఎ) ఉత్పత్తిపై ద్రవ్యోల్బణ ప్రభావం: ఉత్పత్తిపై ద్రవ్యోల్బణం సానుకూల మరియు ప్రతికూల ప్రభావం ఉండవచ్చు. ఇది ద్రవ్యోల్బణం రకాలపై ఆధారపడి ఉంటుంది.

- పరిమిత ద్రవ్యోల్బణం ఉత్పత్తిదారుల లాభాలను పెంచుతుంది. తద్వారా ఉత్పత్తిని పెంపొదిస్తుంది.
- అధిక లేదా అతి తీవ్ర ద్రవ్యోల్బణం ఉత్పత్తిని ఆటంకపరుస్తుంది.

బి) పంపిణీపై ద్రవ్యోల్బణ ప్రభావం:

- అన్ని వర్గాల ప్రజల మీద ద్రవ్యోల్బణ ప్రభావం ఒకే విధంగా ఉండదు. కొన్ని వర్గాల ప్రజలపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుంది.
- ద్రవ్యోల్బణ కాలంలో ఋణదాతలు నష్టపోతారు. ఒక ఋణగ్రహీతలు ప్రయోజనం పొందుతారు.
- ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తుల అమ్మకాలపై అధిక ధరలను పొందడం వలన లాభం పొందుతారు. కానీ కార్మికులు ద్రవ్యోల్బణ కాలంలో కొనుగోలు శక్తి తగ్గడం వల్ల నష్టపోతారు.
- అధిక ద్రవ్యోల్బణం కారణంగా ఋణదాతలు, ఉద్యోగులు, పెన్షనర్లు, వినియోగదారులు మరియు ప్రభుత్వం నష్టపోతారు. కాని ఋణగ్రస్తులు, పెట్టుబడిదారులు, వ్యాపారులు మరియు వ్యవసాయదారులు ప్రయోజనం పొందుతారు.

14.6 ద్రవ్యోల్బణ నివారణ చర్యలు

- ద్రవ్యపరమైన చర్యలు: ఒక దేశ కేంద్ర బాంక్ ద్రవ్య సప్లై మరియు పరపతిని పరిమితం చేయడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని నివారించగలదు.
- కోశపరమైన చర్యలు: పన్నులు, ప్రభుత్వ వ్యయం మరియు పబ్లిక్ రుణాలు కోశపరమైన చర్యలు సూచిస్తాయి. సరైన కోశవిధానాన్ని అమలు పరచడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించవచ్చు.
- ప్రత్యక్ష చర్యలు: వీటిలో ధరల నియంత్రణ మరియు నిత్యావసర వస్తువుల రేషనింగ్ ఉంటాయి.

14.7 వ్యాపార చక్రాలు

సమిష్టి ఆర్థిక కార్యకలాపాలలో కాల ప్రవాహంలో హెచ్చు తగ్గులు వస్తుంటాయి. సౌభాగ్యం మరియు తిరోగమన కాలాలు పరస్పరం ప్రత్యామ్నాయంగా వచ్చే పరిస్థితిని వ్యాపార చక్రాలు అంటారు. ఒకదాని వెనుక ఒకటిగా చక్రం మాదిరి భ్రమణం చెందే ఆర్థిక కార్యకలాపాల స్థాయిలోని వృద్ధి, క్షయాలను వ్యాపార చక్రాలు అంటారు. ఈ వ్యాపార చక్ర భ్రమణకాలం సాధారణంగా 5 నుండి 8 సంవత్సరాల వరకు ఉంటుంది. ఈ వృద్ధి, క్షయాలు రెండు భిన్న దశలుగా ఒకదాని వెనుక ఒకటిగా భ్రమణం చెందుతూ తరచుగానూ చాలా వరకు ఒక పద్ధతిలోనూ ఏర్పడుతూ ఉంటాయి. వ్యాపారం మంచిగా ఉన్నప్పుడు వ్యాపార చక్రాలు పెరుగుతున్న ధరలు మరియు తక్కువ నిరుద్యోగ స్థాయిలను కలిగి ఉంటాయి. దానికి విరుద్ధంగా వ్యాపారం క్షీణతలో ఉన్నప్పుడు వ్యాపార చక్రాలు తగ్గుతున్న ధరలు మరియు అధిక నిరుద్యోగితను కలిగి ఉంటాయి. ఉత్పత్తి, ఉద్యోగిత, ధరల స్థాయిలలో ఒకేసారి సంభవించే హెచ్చు తగ్గులనే వ్యాపార చక్రాలు అంటాము. వీటితో పాటు వేతనాల రేట్లు, వడ్డీ రేట్లు, పన్నులు, ఎగుమతులు, దిగుమతులు, పొదుపు, బాంకు డిపాజిట్లు ద్రవ్య చలన వేగము మొదలయినవన్నీ మార్పుచెందుతూ ఉంటాయి.

14.8 వ్యాపార చక్రాల లక్షణాలు

ఎ) వ్యాపార చక్రాలు ఒకే విధమైన క్రమబద్ధతను ప్రదర్శించనప్పటికీ క్రమానుగతంగా జరుగుతాయి.

బి) ఈ చక్రాల భ్రమణ కాలం మారుతూ ఉంటుంది.

సి) వ్యాపారచక్రాలు విస్తరణ, సౌభాగ్యము, తిరోగమనం మరియు ఆర్థిక పునరుజ్జీవనం అనే విభిన్న దశలను కలిగి ఉంటాయి.

డి) వ్యాపార చక్రాలు సాధారణంగా స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలలో ఏర్పడతాయి.

ఇ) అవి కూడా విస్తృతంగా ఉంటాయి. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రంగాలలోని అవాంతరాలు ఇతర రంగాలకు సులభంగా వ్యాపిస్తాయి.

ఎఫ్) వ్యవసాయ రంగంతో పోలిస్తే, పారిశ్రామిక రంగం వ్యాపార చక్రాల ప్రతికూల ప్రభావాలకు ఎక్కువగా గురవుతుంది.

జి) వ్యాపార చక్రాలు సంభవించే ముందు వాటి గురించి ఖచ్చితమైన అంచనా వేయడం కష్టం.

హెచ్) వ్యాపార చక్రాలు సమాజ శ్రేయస్సుపై తీవ్రమైన పరిణామాలను కలిగి ఉంటాయి.

14.9 వ్యాపార చక్రాల దశలు



ఎ) విస్తరణ: విస్తరణ దశలో జాతీయ ఉత్పత్తి, ఉపాధి, సమిష్టి డిమాండ్, మూలధనం మరియు వినియోగదారుల వ్యయం, అమ్మకాలు, లాభాలు, పెరుగుతున్న స్టాక్ ధరలు మరియు బాంకు పరపతిలో పెరుగుదల ద్వారా చూపించబడుతుంది. ఈ దశలో, ధరలు మరియు ఖర్చులు కూడా వేగంగా పెరుగుతాయి. అన్ని రకాల వస్తువులు మరియు సేవలకు డిమాండ్ పెరుగుతుంది. మొత్తం మీద సౌభాగ్యం పెరుగుతూ, ప్రజలు ఉన్నతమైన జీవన ప్రమాణాలను అనుభవిస్తారు.

కొంత కాలం తరువాత వ్యాపార కార్యకలాపాలు చివరికి గరిష్ట స్థాయికి చేరుకుంటాయి.

బి) శిఖరం: శిఖరం అనే పదం వ్యాపార చక్రం లోని అత్యున్నత స్థానాన్ని సూచిస్తుంది. ఉత్పత్తి ధరలు కూడా వేగంగా పెరిగి జీవన వ్యయం పెరగడానికి మరియు స్థిర ఆదాయాన్ని సంపాదించేవారిపై ఎక్కువ ఒత్తిడికి దారితీస్తుంది. వాస్తవ డిమాండ్ నిలిచిపోతుంది.

సి) సంకోచం: ఆర్థిక వ్యవస్థ అంతులేని వృద్ధిని కొనసాగించలేదు. సంకోచం సమయంలో, పెట్టుబడి మరియు ఉపాధి స్థాయిలు తగ్గుతాయి. ఉత్పత్తిదారులు తమ ఇన్వెంటరీలను తీసివేయుటకు మరియు వారి ఆర్థిక అవసరాలను తీర్చుకొనుటకు ధరలను తగ్గిస్తారు. వినియోగదారులు వారి కొనుగోళ్లను వాయిదా వేస్తారు. పెట్టుబడులు తగ్గడం ప్రారంభిస్తాయి.

డి) డిప్రెషన్: డిప్రెషన్ అనేది మాంద్యం యొక్క తీవ్రమైన రూపం మరియు చాలా మందగించిన ఆర్థిక కార్యకలాపాల ద్వారా సూచించబడుతుంది. వ్యాపార చక్రం యొక్క ఈ దశలో వృద్ధి రేటు ప్రతికూలంగా మారుతుంది. జాతీయ ఆదాయం, వ్యయం స్థాయిలు వేగంగా క్షీణిస్తాయి. ఉత్పత్తులు మరియు సేవలకు డిమాండ్ తగ్గుతుంది. ధరలు అత్యల్పంగా వుండి, వేగంగా తగ్గుతాయి. వడ్డీ రేట్లలో తగ్గుదల ఉంటుంది. పరిశ్రమలు అధిక సామర్థ్యంతో దెబ్బతింటాయి. మాంద్యం యొక్క తీవ్ర స్థాయిలో అన్ని ఆర్థిక కార్యకలాపాలు మందగించి, పతన దశకు చేరుకుంటాయి.

ఇ) పునరుజ్జీవనం: ఆర్థిక వ్యవస్థ తుదిదాకా సంకోచాన్ని కొనసాగించదు. ఇది పతనము అని పిలువబడే ఆర్థిక కార్యకలాపాల యొక్క అత్యల్ప స్థాయికి చేరుకుని తర్వాత కోలుకోవడం ప్రారంభమవుతుంది. విస్తృతమైన నిరుద్యోగం కార్మికులను ప్రస్తుతం ఉన్న రేట్ల కంటే తక్కువ వేతనాలను అంగీకరించేలా చేస్తుంది. ఉత్పతిదారులు తక్కువ ఖర్చులు మరియు మెరుగైన వ్యాపార వాతావరణాలను ఆశిస్తారు.

వ్యాపారంపై విశ్వాసం నెమ్మదిగా పెరుగుతుంది. సాంకేతిక పురోగతికి కొత్త రకాల యంత్రాలు మరియు మూలధన వస్తువులలో తాజా పెట్టుబడులు అవసరం. బ్యాంకింగ్ వ్యవస్థ వ్యాపార విశ్వాసంతో నెమ్మదిగా పరపతిని విస్తరించడం ప్రారంభిస్తుంది. పెట్టుబడి పెరిగేకొద్దీ, ఉత్పత్తి, ఉపాధి, కారకాల చెల్లింపులు, వ్యయార్హ ఆదాయాలు, వినియోగదారుల వ్యయం, సమిష్టి డిమాండ్ మొదలైనవి పెరుగుతాయి. సమిష్టి డిమాండ్ను తీర్చడానికి, మరిన్ని వస్తువులు, సేవలు ఉత్పత్తి చేయబడతాయి.

14.10 సారాంశం

ప్రపంచంలోని అనేక దేశాలు నేడు ద్రవ్యోల్బణం సమస్యను ఎదుర్కొంటున్నాయి. ద్రవ్యోల్బణం ప్రజల ఆర్థిక జీవనాన్ని మరియు సంక్షేమాన్ని ప్రభావితం చేయడమే కాకుండా కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ స్థిరత్వాన్ని సవాలు చేస్తుంది. ద్రవ్యోల్బణ పరిస్థితులను నియంత్రించేందుకు ఆధునిక ప్రభుత్వాలు విధానపరమైన చర్యలు తీసుకుంటున్నాయి. ఒక మోస్తరు ద్రవ్యోల్బణంతో కూడిన ఆర్థిక వ్యవస్థ కావాల్సినది. ఉత్పత్తిలో గుణాత్మక మార్పు కారణంగా ధరలు పెరగడం ద్రవ్యోల్బణం కాదు. ఆర్థిక వ్యవస్థ యొక్క సాధారణ స్థాయిలో ధరలు నిరంతరం పెరగడం మరియు ద్రవ్యం విలువ నిరంతరం తగ్గడాన్ని ద్రవ్యోల్బణం అంటారు. భారతదేశంలో ద్రవ్యోల్బణాన్ని కొలవడానికి WPI (టోకు ధరల సూచిక) ఉపయోగించబడుతుంది.

ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరగడం వల్ల ధరలు పెరిగినప్పుడు డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి తద్వారా ధరలు పెరిగినప్పుడు వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం పెరుగుతుంది.

ప్రతి ద్రవ్యోల్బణం ద్రవ్యోల్బణానికి వ్యతిరేకం, ఇక్కడ వినియోగ వస్తువుల ధరలు నిరంతరం తగ్గుతూ ఉంటాయి.

జాతీయ ఆదాయం మరియు ఉత్పత్తిలో స్థిరమైన పెరుగుదల లేదా వృద్ధిని రిఫ్లేషన్ అంటారు. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం మరియు నిరుద్యోగం రెండూ పెరుగుతున్న పరిస్థితిని స్టాగ్ ఫ్లేషన్ అంటారు. పెరుగుతున్న ప్రజా వ్యయం, లోటు బడ్జెట్ లో పెరుగుదల, పెరుగుతున్న జనాభా, ద్రవ్యత్వంలో పెరుగుదల మరియు బాంకుల పరపతిలో పెరుగుదల మొదలగునవి ద్రవ్యోల్బణానికి ప్రధాన డిమాండ్ ప్రేరేపిత కారణాలు.

“మార్పు మాత్రమే స్థిరమైనది”. ఇది జాతీయ ఆర్థిక శాస్త్రానికి ఖచ్చితంగా వర్తిస్తుంది. ప్రతి దేశం యొక్క ఆర్థిక వ్యవస్థ విస్తరణ మరియు సంకోచం కాలాల మధ్య ఒడి దుడుకులకు లోనౌతుంది. ఉపాధి స్థాయి, ఉత్పాదకత మరియు దేశంలోని వస్తు, సేవల మొత్తం డిమాండ్ మరియు సరఫరా కారణంగా ఆ మార్పులు సంభవిస్తాయి. స్వల్ప కాలంలో ఈ మార్పులు విస్తరణ మరియు తిరోగమనమునకు దారితీస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక వృద్ధి సంభవించవచ్చు. ఇది ఒక దేశంలో ఉత్పత్తి సంభావ్య స్థాయిని పెంచడానికి అనుమతిస్తుంది. వ్యాపార చక్రాలు కాలక్రమేణా దేశంలోని వాస్తవ దేశీయోత్పత్తి ఎలా ఒడిదుడుకులకు గురవుతుందో చూపిస్తాయి. వివిధ దశలలో మొత్తం ఉత్పత్తిలో హెచ్చు తగ్గులు ఉంటాయి. దీర్ఘ కాలంలో వ్యాపార చక్రాలు వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి సంభావ్యతలో స్థిరమైన పెరుగుదలను చూపుతాయి.

14.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ప్రాకే ద్రవ్యోల్బణం
2. నడిచే ద్రవ్యోల్బణం
3. పరుగెత్తే ద్రవ్యోల్బణం
4. అతి తీవ్ర ద్రవ్యోల్బణం

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ద్రవ్యోల్బణం అంటే ఏమిటి?
2. ద్రవ్యోల్బణం రకాలు ఏమిటి?
3. ద్రవ్యోల్బణానికి ప్రధాన కారణాలు ఏమిటి?

4. ద్రవ్యోల్బణం వల్ల ఎవరు ప్రయోజనం పొందుతారు?

5. ద్రవ్యోల్బణాన్ని ఎలా నివారించగలం?

6. వాణిజ్య చక్రాల లక్షణాలు ఏమిటి?

7. ఆర్థిక మాంద్యం అంటే ఏమిటి?

8. పునరుజ్జీవనం తదుపరి దశ విస్తరణకు ఎలా దారి తీస్తుంది?

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. వ్యాపార చక్రాలను నిర్వచించండి. రేఖాచిత్రం సహాయంతో వ్యాపార చక్రాల దశలను వివరించండి.

2. ప్రజల జీవన వ్యయంపై ద్రవ్యోల్బణం ప్రభావాలను విశ్లేషించండి మరియు ద్రవ్యోల్బణాన్ని నియంత్రణకు నివారణ చర్యలను సూచించండి.

14.12 పదకోశం

- ద్రవ్యోల్బణం: అధిక ద్రవ్యరాశి తక్కువ వస్తురాశిని వెంబడిస్తుంది.
- వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం: ఉత్పత్తి వ్యయం పెరగడంవల్ల సాధారణ ధరల స్థాయిలో పెరుగుదలను సూచిస్తుంది.
- స్టాగ్ ఫ్లేషన్: ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం పెరుగుతూఉండే పరిస్థితి.

14.13 ఉపయుక్త గ్రంథాలు

- Macro Economic Analysis : Edward Shapiro
- Macro Economic Theory : Jhingan, M.L.
- Advanced Economics : Ahuja, H.L.

అధ్యాయం

15

భారతదేశంలో ఆర్థికాభివృద్ధి

15.0 లక్ష్యాలు

15.1 పరిచయం

15.2 భారతదేశంలో ఆర్థికాభివృద్ధి

15.3 అభివృద్ధి చెందిన/అభివృద్ధి చెందుతున్న దేశాల వర్గీకరణ

15.3.1. 2019 ప్రపంచ బ్యాంకు వర్గీకరణ ప్రకారం

15.4 అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల లక్షణాలు

15.4.1. అధిక స్థూల దేశీయోత్పత్తి మరియు తలసరి ఆదాయం (PCI)

15.4.2 మానవ అభివృద్ధి సూచిక (HDI)

15.4.3 పారిశ్రామిక మరియు సేవా రంగాల ప్రాముఖ్యత

15.4.4 మెరుగైన జీవన ప్రమాణాలు

15.4.5 సాంకేతిక అభివృద్ధి మరియు ఆధునికీకరణ

15.4.6. తక్కువ జనాభా పెరుగుదల

15.5 అభివృద్ధి చెందుతున్న దేశాల లక్షణాలు

15.5.1. తలసరి ఆదాయం తక్కువ

15.5.2 అధిక జనాభా వృద్ధి రేటు

15.5.3 అల్పస్థాయిలో పెట్టుబడులు

15.5.4. అధిక స్థాయి నిరుద్యోగం

15.5.5 అల్పస్థాయిలో ఉత్పాదకత

15.5.6. మౌలిక సదుపాయాలకొరత

15.5.7. నిరక్షరాస్యత

15.5.8 అల్ప స్థాయి జీవన ప్రమాణాలు

15.5.9 ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ

15.6 సారాంశం

15.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

15.8 పదకోశం

15.9 ఉపయుక్త గ్రంథాలు

15.0 లక్ష్యాలు

- అభివృద్ధి చెందిన/అభివృద్ధి చెందుతున్న దేశాల లక్షణాలను అర్థం చేసుకుంటారు.
- భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందకపోవడానికి మరియు స్తబ్దతకు దారితీసే అంశాలను విశ్లేషిస్తారు
- తలసరి ఆదాయం ఆధారంగా దేశాలను వర్గీకరిస్తారు
- భారత ఆర్థిక వ్యవస్థ సమస్యలను వివరిస్తారు
- అభివృద్ధి చెందుతున్న దేశాల వెనుకబాటుకు గల కారణాలను వివరిస్తారు

15.1 పరిచయం

ఈ అధ్యాయం భారత ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రాథమిక లక్షణాలతో అభివృద్ధి చెందుతున్న మరియు అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల లక్షణాలను వివరించడానికి రూపొందించబడింది. మునుపటి అధ్యాయాలలో, మనం ఆర్థిక వృద్ధి మరియు ఆర్థిక అభివృద్ధినిగురించి అధ్యయనం చేసాము. ఇటీవలి సంవత్సరాలలో భారత ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులను చర్చిద్దాం. భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాలు తమ దేశ ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ మరియు ప్రోత్సాహానికి సంబంధించినవి. ఇటువంటి విధానాలు భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయి. బ్రిటిష్ పాలనకు ముందు భారతదేశం స్వతంత్ర ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. చాలా మందికి వ్యవసాయం ప్రధాన వృత్తి అయినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ వివిధ రకాల ఉత్పత్తి కార్యకలాపాల ద్వారా వర్గీకరించబడింది. భారతదేశం తన సంస్కరణ ప్రయత్నాల ద్వారా గత కొన్ని దశాబ్దాలుగా దాని వృద్ధి రేటులో ఒక మెట్టును నమోదు చేసింది.

15.2 భారతదేశంలో ఆర్థికాభివృద్ధి

బ్రిటిష్ పాలనలో, భారతదేశం వెనుకబడిన వ్యవసాయ రంగం అలాగే అభివృద్ధి చెందని పారిశ్రామిక రంగాన్ని కలిగి ఉంది. 1950-51లో, తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉంది మరియు సమాజంలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. మరణాల రేటు మరియు జనన రేటు రెండూ చాలా ఎక్కువగా ఉన్నాయి. పేదరికం కారణంగా వైద్య సదుపాయాలు లేకపోవడం మరియు పౌష్టికాహారం తక్కువగా ఉండటం దీనికి కారణం. స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారత ఆర్థిక వ్యవస్థ పేద వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఉండేది. పారిశ్రామిక కార్యకలాపాల స్థాయి చాలా తక్కువ ఉండి, పారిశ్రామిక అభివృద్ధిలో అసమానతలు కూడా ఉన్నాయి. దేశ ఆర్థికాభివృద్ధికి బ్యాంకింగ్, బీమా, రవాణా, కమ్యూనికేషన్లు, విద్యుత్ శక్తి మొదలైన బలమైన మౌలిక సదుపాయాలు అవసరం ఎంతైనా ఉంది.

యాభై ఏళ్ల ప్రణాళికలో భారత ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో గణనీయమైన మార్పులు వచ్చాయి.జాతీయ ఆదాయం యొక్క మార్పులో ఆర్థిక అభివృద్ధి నిర్మాణాత్మక ప్రక్రియ ముఖ్యం.అయితే, నిర్మాణాత్మక మార్పులు నెమ్మదిగా జరుగుతున్నాయి. భారతదేశంలో కొన్ని ముఖ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి, ఇవి ఆర్థిక వ్యవస్థ యొక్క మూలాధారాలు బలంగా ఉన్నాయని సూచిస్తున్నాయి. ప్రస్తుత పొదుపు మరియు పెట్టుబడుల రేటు పదేళ్ల క్రితం కూడా భారతదేశానికి ఒక తప్పుడు ఆశగా కొట్టివేయబడే స్థాయికి చేరుకుంది.ఈ ముఖ్యమైన కోణంలో, భారతదేశం ఇప్పుడు ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భాగం అయ్యింది. భారతదేశం వివిధ ఉత్పత్తులకు పెద్ద మార్కెట్గా చలామణి అవుతుంది. భారతదేశంలో ప్రణాళికల వల్లే ఇవన్నీ సాధ్యమయ్యాయి. మొదటి ఎనిమిది ప్రణాళికలు ప్రాథమిక మరియు భారీ పరిశ్రమలలో భారీ పెట్టుబడులతో ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడంతో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మారింది. 1997 తర్వాత ప్రణాళికలలో ప్రభుత్వ రంగ ప్రాధాన్యత తగ్గించడం జరిగింది. పదో ప్రణాళిక ముగిసేసరికి భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందింది.

భారతదేశ నూతన ఆర్థిక విధానం 1991లో ఆనాటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు నేతృత్వంలో ప్రారంభించబడింది.నూతన ఆర్థిక సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను మరియు కోణాన్ని అందించాయి.ఈ విధానం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు తొలిసారిగా ప్రపంచవ్యాప్త ప్రవేశానికి ద్వారాలు తెరిచింది. ఈ నూతన ఆర్థిక విధానంలో, పి.వి.నరసింహారావు ప్రభుత్వం దిగుమతి సుంకాలను తగ్గించి, రిజర్వ్ సెక్టారను ప్రైవేట్ ప్లేయర్లకు తెరిచి, ఎగుమతులను పెంచడానికి భారత కరెన్సీని తగ్గించింది. దీనిని సరళీకరణ, ప్రైవేటీకరణ మరియు ప్రపంచీకరణ విధానం (LPG Model) అని కూడా అంటారు. నూతన ఆర్థిక విధానం ఆర్థిక సరళీకరణ లేదా దిగుమతి సుంకాల సడలింపును సూచిస్తుంది. మార్కెట్ సడలింపు లేదా ప్రైవేట్ మరియు విదేశీ పెట్టుబడులకు మార్కెట్లను సరళీకరించడం,మరియు దేశం యొక్క ఆర్థిక అభివృద్ధి విస్తరణకు పన్నులను తగ్గించడం జరుగుతుంది.

భారతదేశ ఆర్థికాభివృద్ధికి పంచవర్ష ప్రణాళికను ప్రణాళికా సంఘం పర్యవేక్షిస్తుంది. అయితే 2014లో, 65 ఏళ్ల ప్రణాళికా సంఘం రద్దు చేయబడింది మరియు దాని స్థానంలో నీతి ఆయోగ్ (నేషనల్ ఇన్స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్ఫార్మింగ్ ఇండియా)ను ఏర్పాటు చేసింది. ఇది ప్రధానమంత్రి అధ్యక్షతన పని చేస్తుంది. ఇది ప్రభుత్వం యొక్క ఆలోచనల నిధి లేదా దిశాత్మక మరియు విధాన నిర్ణయకారిగా పనిచేస్తుంది కాబట్టి, ఇది కేంద్రం మరియు రాష్ట్రాలలోని ప్రభుత్వాలకు వ్యూహాత్మక విధాన విషయాలపై సలహాలను అందిస్తుంది. ఇంకా, ఇది దేశీయ మరియు అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఆర్థిక సమస్యలను కలిగి ఉంటుంది.

15.3 అభివృద్ధి చెందిన/అభివృద్ధి చెందుతున్న దేశాల వర్గీకరణ

అభివృద్ధి చెందుతున్న దేశం సాధారణంగా దాని ఆర్థిక ఉత్పత్తి స్థాయి బట్టి కొంతవరకు నిర్వచించవచ్చు. అయితే అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న దేశానికి మధ్య వ్యత్యాసం ఎలా గుర్తించాలి అనే దానిపై చాలా చర్చ జరిగింది. అందువల్ల, అభివృద్ధి స్థాయికి అనుగుణంగా వాటిని వర్గీకరించడానికి హేతుబద్ధతను వివరించే ప్రమాణాలు ఏవీ లేవు.

ఐక్యరాజ్యసమితి కార్యక్రమం, మానవాభివృద్ధి సూచిక నివేదిక ఆధారంగా దేశాల ఆర్థిక వ్యవస్థను వర్గీకరించింది. ఇది అభివృద్ధి యొక్క బహుళ కారకాలను పరిగణనలోకి తీసుకోవడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ బ్యాంకు యొక్క ప్రపంచ ఆర్థిక వ్యవస్థల వర్గీకరణ తలసరి స్థూల జాతీయ ఆదాయం (GNI) అంచనాపై ఆధారపడి వర్గీకరణ చేపట్టింది. ప్రపంచ బ్యాంకు రూపొందించిన ప్రపంచ అభివృద్ధి నివేదికలో, దేశాలను వర్గీకరించడంలో ఈ క్రింది ప్రమాణం ఉపయోగించబడింది:

15.3.1 2019 ప్రపంచ బ్యాంకు ప్రకారం వర్గీకరణ

i) అధిక ఆదాయ సమూహం: తలసరి ఆదాయం (PCI) సంవత్సరానికి US$ 12695 మరియు అంతకంటే ఎక్కువకలిగిన దేశాలు. ఉదాహరణ: USA, UK, ఫ్రాన్స్, సింగపూర్ మొదలైనవి.

ii) ఎగువ మధ్య ఆదాయ సమూహం: US$ 4096 మరియు $ 12694 మధ్య తలసరి ఆదాయం కలిగిన దేశాలు. ఉదాహరణ: అర్జెంటీనా, క్యూబా, దక్షిణాఫ్రికా మాల్దీవులు మొదలైనవి.

iii) తక్కువ మధ్య ఆదాయ సమూహం: US$ 1046 మరియు $4095 మధ్య తలసరి ఆదాయం కలిగిన దేశాలు. ఉదాహరణ: భారతదేశం, ఫిలిప్పీన్స్, అంగోలా, పాకిస్తాన్, భూటాన్ మొదలైనవి.

iv) తక్కువ ఆదాయ సమూహం: US డాలర్ల తలసరి ఆదాయం $1045 లేదా దాని కంటే తక్కువకలిగిన దేశాలు. ఉదాహరణ: ఆఫ్ఘనిస్తాన్, సూడాన్, నైజర్, ఉగాండా, ఇథియోపియా మొదలైనవి.

అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామికీకరణ మరియు ఆర్థిక పరంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు. అభివృద్ధి చెందిన దేశాలు స్వయం సమృద్ధి కలిగిన దేశాలు కాబట్టి వాటిని అభివృద్ధి చెందిన దేశాలు అని కూడా పిలుస్తారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు పరిశ్రమలను స్థాపించడంలో అభివృద్ధి చెందిన దేశాలపై ఆధారపడతాయి.

15.4 అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ యొక్క లక్షణాలు

సమృద్ధిగా సంపద మరియు ఆ దేశ పౌరులకు వనరులు అందుబాటులోఉంచే దేశాన్ని అభివృద్ధి చెందిన దేశం అంటారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ ఆ దేశ ఆర్థిక మరియు ఆర్థికేతర అంశాల మెరుగైన ఫలితాలను చూపుతుంది.

అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల లక్షణాలు క్రింది విధంగా ఉన్నాయి:

- అధిక స్థూల దేశీయోత్పత్తి మరియు తలసరి ఆదాయం (PCI)
- పారిశ్రామిక మరియు సేవా రంగాల ప్రాముఖ్యత.
- అధిక స్థాయి జీవన ప్రమాణాలు.
- అధిక సాంకేతిక అభివృద్ధి మరియు ఆధునికీకరణ
- తక్కువ జనాభా వృద్ధి రేటు
- ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ

15.4.1. అధిక స్థూల దేశీయోత్పత్తి మరియు తలసరి ఆదాయం (PCI)

తలసరి స్థూల దేశీయోత్పత్తి (GDP) అనేది ఒక దేశం యొక్క ఆర్థిక ఉత్పత్తికి కొలమానం, ఇది ఆ దేశం యొక్క స్థూల దేశీ ఉత్పత్తిని జనాభాతో విభజించడం ద్వారా వస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలు అధిక దేశీయోత్పత్తిని కలిగి ఉన్నాయి దేశీయోత్పత్తి పెరుగుతున్న కొద్దీ, అందుబాటులో ఉన్న వస్తువులు మరియు సేవలు కూడా పెరుగుతాయి. అందువల్ల, అధిక ఉత్పత్తి అధిక ఆదాయాలతో ముడిపడి ఉంటుంది. ప్రతి సంవత్సరం, అభివృద్ధి చెందిన దేశాలు అధిక తలసరి ఆదాయాన్ని కలిగి ఉంటాయి. దీని అర్థం ప్రజలు తగినంత ఆదాయాన్ని సంపాదిస్తున్నారు, తద్వారా వారు వ్యాపారంలో పెట్టుబడి పెట్టవచ్చు లేదా భవిష్యత్తు కోసం ఆదా చేయవచ్చు. ఈ పొదుపులు లేదా పెట్టుబడులు దేశాల ఆర్థిక వ్యవస్థల అభివృద్ధికి దోహదం చేస్తాయి. అభివృద్ధి చెందిన దేశాలు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు, మరిన్ని విద్యా సౌకర్యాలు, అనేక రంగాలలో మౌలిక సదుపాయాలు మొదలైనవి కలిగి ఉంటాయి.

కొనుగోలు శక్తి సామర్థ్యం (PPP) ఆధారంగా తలసరి ఆదాయం-2020

దేశం	కొనుగోలు శక్తి (US$)
అమెరికా సంయుక్త రాష్ట్రాలు	70480
యునైటెడ్ కింగ్‌డమ్	49420
స్విట్జర్లాండ్	75860
జర్మనీ	59680
భారతదేశం	7270
చైనా	19170

Source: ttps://data.worldbank.org/indicator/NY.GNP.PCAP.PP.CD

15.4.2 మానవాభివృద్ధి సూచిక (Human Development Index)

మానవ అభివృద్ధి సూచిక విద్య, ఆయుర్దాయం మరియు వాస్తవ దేశీయోత్పత్తి, తలసరి ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశంలో విద్య ముఖ్యం. అక్షరాస్యత ఎక్కువగా ఉంది, విద్య అందుబాటులో ఉంది మరియు ప్రజలు పాఠశాలల్లో చాలా సంవత్సరాలు విద్యను అభ్యసిస్తారు. ఆరోగ్య సంరక్షణకు ప్రాప్యత మరియు శిశు మరణాలు తక్కువగా ఉన్నాయి. స్థూల (GDP) తలసరి ఆదాయం కూడా ఎక్కువగానే ఉంది. ఈ అంశాలన్నీ మానవాభివృద్ధి సూచికను నిర్ణయించడంలో ఉపయోగపడతాయి. అందువల్ల, ఈ దేశాలు మంచి మానవాభివృద్ధి సూచిక సంఖ్య కలిగి ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు HDIలో అత్యధిక సూచి సంఖ్యలను కలిగి ఉన్నాయి, ఇదిసాధారణంగా 0.8 కంటే ఎక్కువ కలిగి ఉన్నాయి.

పట్టిక-2: 2020 సంవత్సరం ప్రకారం దేశాల మానవాభివృద్ధి ర్యాంకులు

దేశం	మానవాభివృద్ధి సూచిక సంఖ్య	ర్యాంకు
నార్వే	0.957	1
ఇంగ్లాండు	0.932	13
అమెరికా	0.926	17
దక్షిణ ఆఫ్రికా	0.709	114
బ్రెజిల్	0.765	84
భారతదేశం	0.645	131
పాకిస్తాన్	0.557	154

Source: https://hdr.undp.org/data-center/country-insights#/ranks

పై పట్టిక సమాచారం నుండి అభివృద్ధి చెందిన దేశాలు అధిక మానవాభివృద్ధి సూచిక సంఖ్య (HDI) విలువ మరియు మంచి ర్యాంకుతో ఉన్నాయని స్పష్టమవుతుంది. నార్వే 0.957తో అగ్రస్థానంలో ఉంది, అభివృద్ధి చెందుతున్న దేశం భారతదేశం 0.645 HDI విలువతో 131వ స్థానంలో ఉంది.

15.4.3 పారిశ్రామిక మరియు సేవా రంగాల ప్రాముఖ్యత

అభివృద్ధి చెందిన దేశాల జిడిపిలో సేవా రంగం వాటా ఎక్కువగా ఉంది. ఈ ఆర్థిక వ్యవస్థల్లో జిడిపిలో ప్రాథమిక రంగం చాలా తక్కువ వాటాను కలిగి ఉండటం మనం గమనించవచ్చు. ఆ దేశాలు ఆర్థిక వృద్ధికి సేవా మరియు పారిశ్రామిక రంగాలకు ప్రాముఖ్యత ఇస్తాయి. ఈ రంగాల విస్తరణ మరియు వృద్ధి నిరుద్యోగులకు ఉపాధిని కల్పిస్తోంది. దీంతో ప్రజల ఆదాయాలు కూడా పెరిగాయి.

ఉదాహరణకు, 2020లో, ఫ్రాన్స్ పరిశ్రమల నుండి జాతీయాదాయంలో 71.16% మరియు సేవల నుండి 16.45% పొందింది. వ్యవసాయ రంగం వాటా 1.6% మాత్రమే. ఉపాధి విషయానికొస్తే, వ్యవసాయ రంగంలో 2.53 శాతం, పరిశ్రమలో 20.43 మరియు సేవా రంగంలో 77.04 శాతం నమోదయ్యాయి.

భారతదేశంలో, జాతీయాదాయంలో సేవా రంగం 53.89 % మరియు పరిశ్రమ 25.92 %, వ్యవసాయం వాటా 20.19%. భారతదేశంలోని ఆర్థిక వ్యవస్థలోని రంగాలలో ఉపాధి వాటా ఈ విధంగా ఉంది: సేవలు 32.28%, పరిశ్రమలు 25.12% మరియు వ్యవసాయ 42.6%. పై ఉదాహరణ నుండి, అభివృద్ధి చెందిన దేశం యొక్క ప్రాథమిక రంగంలో ఆదాయం మరియు ఉపాధి చాలా తక్కువగా ఉందని మనం అర్థం చేసుకోవచ్చు.ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి స్థితిని సాధించినందున, సేవా రంగంలో ఉత్పత్తి మరియు ఉపాధి ప్రధాన భాగం అవుతాయి.

15.4.4 మెరుగైన జీవన ప్రమాణాలు

జీవన ప్రమాణం అనేది సాధారణంగా ప్రజల ఆదాయం, అందుబాటులో ఉండే అవసరాలు, విలాసాల వస్తువులు మరియు ఇతర సేవల స్థాయిని వివరించడానికి ఉపయోగించే పదం.అభివృద్ధి చెందిన దేశాల్లో జీవన ప్రమాణాలు ఎక్కువగా ఉన్నాయి. ఒక దేశం యొక్క జీవన ప్రమాణం సాధారణంగా ఆ దేశ ప్రజల సంపద, సౌకర్యాలు, భౌతిక వస్తువుల కొనుగోలు శక్తి స్థాయిని సూచిస్తుంది. ఈ దేశాలు తమ ప్రజలకు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నాయి. మంచి జీవన ప్రమాణం జీవిత కాలాన్ని పెంచే జీవన ప్రమాణంతో దగ్గరి సంబంధం కలిగి ఉంటుంది.ఈ ఆర్థిక వ్యవస్థల్లో ప్రజల కొనుగోలు శక్తి ఎక్కువ.

అత్యున్నత జీవన ప్రమాణాలు కలిగిన దేశాలు పౌరులకు మంచి జీవితాన్ని అందిస్తాయి.ఈ దేశాలు మెరుగైన ఆరోగ్య సంరక్షణ అవస్థాపన సౌకర్యాలు, ఉచిత విద్య మరియు ఆ దేశపౌరులందరూ ఉపయోగించగల అభివృద్ధి చెందిన సౌకర్యాలను కలిగి ఉన్నాయి.

15.4.5 సాంకేతిక అభివృద్ధి మరియు ఆధునికీకరణ

సాంకేతికత అనేది శాస్త్రీయ నైపుణ్యాల పద్ధతులు ఉపయోగించి నాణ్యమైన వస్తువులు మరియు సేవల ఉత్పత్తి మరియు పునర్వినియోగం సమర్థవంతంగా చేయడం

అభివృద్ధి చెందిన దేశాలు అన్ని రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో ముందున్నాయి. వారు తయారీ, విద్య, ఆరోగ్య సేవలు, రవాణా మొదలైన వాటిలో సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. కొత్త సాంకేతికత సహాయంతో పరిశ్రమలలో ఉత్పత్తి నాణ్యతలో మెరుగుదల జరిగింది.సాంకేతిక పురోగతి సహజ వనరులను గరిష్టంగా ఉపయోగించుకునే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.ఈ దేశాలు మరింత సాంకేతిక అభివృద్ధి కోసం పరిశోధన మరియు అభివృద్ధిపై ఖర్చు చేయగలవు. పరిమిత సహజ వనరులతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా, జర్మనీ మరియు జపాన్ వేగంగా అభివృద్ధి చెందాయి.ఈ రెండు దేశాలు రెండో ప్రపంచ యుద్ధంలో నాశనమయ్యాయి. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జపాన్ మరియు ఇతర అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా తమ పారిశ్రామిక అభివృద్ధి సాధించాయి. వాస్తవానికి, ఉత్పత్తి యొక్క కొత్త పద్ధతులను అవలంబించడంతో ఆర్థికాభివృద్ధి సులభతరం అవుతుంది.

అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలునూతన ఆవిష్కరణ మరియు భవిష్యత్ అవసరాల ఉత్పత్తుల అభివృద్ధి పై దృష్టి పెడతాయి. ఈ దేశాల్లోని ప్రజలు వివిధ రంగాలలో అధునాతన సాంకేతికతను కనుగొనడంలో నిమగ్నమై ఉంటారు.

15.4.6. తక్కువ జనాభా పెరుగుదల

అభివృద్ధి చెందిన దేశాలలో చిన్న కుటుంబ ప్రోత్సాహం అనే భావన జనాభాలో తక్కువ వృద్ధి రేటుకు దారి తీస్తోంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు తక్కువ జనాభా పరిమాణం కారణంగా తమ వనరులను సమర్ధవంతంగా ఉపయోగించగలవు. వనరుల కొరత ఉండదు. మంచి ఆరోగ్య వసతి సౌకర్యాలు, ఉన్నత స్థాయి విద్య మరియు ఉన్నత స్థాయి జీవన ప్రమాణాలు తక్కువ జనాభా వృద్ధి రేటుకు దారితీశాయి. ఈ దేశాల అధిక తలసరి ఆదాయం, తక్కువ జనాభా పెరుగుదల రేటు,అధిక పొదుపు రేటు లేదా మూలధన సమకూర్పు కారణంగా అభివృద్ధిలోఉన్నాయి. జనాభా పెరుగుదల తక్కువ కారణంగా ఈ దేశాలలో సగటు ఆయుర్దాయం ఎక్కువగా ఉంది.

15.5 అభివృద్ధి చెందుతున్న దేశాల లక్షణాలు

15.5.1. తక్కువ తలసరి ఆదాయం:

తక్కువ వాస్తవ తలసరి ఆదాయం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల యొక్క అత్యంత నిర్వచించే లక్షణాలలో ఒకటి. సగటు ఆదాయం గల వ్యక్తి వద్ద పెట్టుబడి పెట్టడానికి లేదా పొదుపు చేయడానికి తగినంత డబ్బు ఉండదు. వారు సంపాదించిన మొత్తాన్ని వినియోగానికి ఖర్చు చేస్తారు. అందువల్ల, వారు పొదుపు చేయలేరు లేదా పెట్టుబడి పెట్టలేరు. అందువలన, ఇది పేదరికం యొక్క విష వలయాన్ని సృష్టిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికంలో ఉన్న వ్యక్తుల శాతం (తక్కువ ఆదాయం కలిగిన వ్యక్తులు) ఎక్కువగా ఉన్నారు.

భారతదేశంలో 2017-18 ప్రకారం జాతీయాదాయం రూ. 115224 మరియు తలసరి ఆదాయం రూ. 87586. 2018-19లో రూ. 134186 మరియు రూ. 94566. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థతో పోలిస్తే ఈ విలువలు చాలా తక్కువ.

15.5.2 అధిక జనాభా వృద్ధి రేటు

చాలా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, జనాభా సంవత్సరానికి 2% మరియు 4% మధ్య మారుతూ ఉంటుంది. పెరిగిన వైద్య సౌకర్యాల కారణంగా, మరణాల రేటు అకస్మాత్తుగా క్షీణించింది, కానీ జననాల రేటులో తగ్గుదల లేదు. కాబట్టి, జనాభా వేగంగా పెరుగుతోంది. ఎక్కువ జనాభా అంటే తక్కువ స్థూల జాతీయాదాయం (GNP) తలసరి ఆదాయం, అధిక స్థాయి పేదరికం, నిరుద్యోగం మొదలైనవి.

భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం, జనాభా పెరుగుదల రేటు చాలా ఎక్కువగా ఉంది. భారతదేశ జనాభా 1951లో 361 మిలియన్ల నుండి 1981లో 683 మిలియన్లకు పెరిగింది, వార్షిక వృద్ధి రేటు 2.14%. 1981 నుండి 2011 వరకు, ఈ వృద్ధి రేటు 1.8%కి క్షీణించింది. జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉన్నప్పటికీ, అధిక జనాభాతో, భారతదేశం ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉంది.

15.5.3 అల్ప స్థాయిలో మూలధన పెట్టుబడి

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో, తక్కువ స్థాయి ఆదాయం మరియు అధిక వినియోగం కారణంగా, మూలధన నిర్మాణం లేదా పొదుపు స్థాయిలు తక్కువగా ఉంటాయి. ఈ దేశాలను తరచుగా అల్పస్థాయి మూలధన పెట్టుబడి ఆర్థిక వ్యవస్థలుగా వ్యవహరించబడతాయి. ఈ దేశాలలో, మూలధన నిల్వ తక్కువగా ఉండటమే కాకుండా, ప్రస్తుత మూలధన వృద్ధి రేటు కూడా చాలా ఉంటుంది. మూలధన పెట్టుబడి తక్కువగా ఉన్నప్పుడు పరిశ్రమలు, సేవల విస్తరణకు అవకాశం ఉండదు. ఈ పరిస్థితి అల్ప స్థాయి ఉత్పత్తి మరియు ఉపాధికి దారి తీస్తుంది. అందువల్ల, ఇది ఒక విషవలయం.

రిసర్వ్ బ్యాంకు 2021 నివేదిక ప్రకారం, ప్రస్తుత ధరల ప్రకారం స్థూల దేశీయ పొదుపు (GDS) రేటు 29.4% మరియు స్థూల దేశీయ పెట్టుబడి (GDI) రేటు 32.5%. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే ఇది చాలా తక్కువ.

15.5.4. అధిక స్థాయి నిరుద్యోగం

అభివృద్ధి చెందుతున్న దేశాలలో, నిరుద్యోగ సమస్యలు ఎక్కువగా మరియు సాధారణమైనవి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు రెండూ నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నాయి. జనాభా పెరుగుదల కారణంగా, కొత్త పరిశ్రమలు స్థాపన లేదా సేవల విస్తరణ లేకపోతే, ఆ పరిస్థితి నిరుద్యోగం పెరుగుదలకు దారి తీస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో, వ్యవసాయంపై ఆధారపడిన వారి సంఖ్య పెరుగుతుంది. కాబట్టి వీరిలో ఎక్కువ మంది ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వలసపోతారు, అక్కడ వారికి పెద్దగా ఉపాధి అవకాశాలు లేవు.

భారతదేశంలో, పట్టణీకరణ మరియు విద్య వ్యాప్తితో నిరుద్యోగం విస్తరిస్తోంది. శ్రామిక శక్తి పెరుగుదలతో పాటు పారిశ్రామిక రంగం విస్తరించడంలో విఫలమైంది. భారతదేశంలో, నిరుద్యోగం మూలధన లోపం ఫలితంగా ఏర్పడింది.

15.5.5 అల్ప స్థాయి ఉత్పాదకత

తక్కువ స్థాయి సాంకేతికత, విస్తారమైన శ్రామిక శక్తి, మౌలిక సదుపాయాల కొరత మరియు సాంప్రదాయ ఉత్పత్తి పద్ధతులు అభివృద్ధి చెందుతున్న దేశాలలో అల్ప స్థాయి ఉత్పత్తికి దారితీస్తాయి. విద్య మరియు శిక్షణలో పెట్టుబడి లేకపోవడం వల్ల, తయారీలో సాంప్రదాయ పద్ధతులను ఇప్పటికీ అవలంబిస్తున్నారు. దీని ఫలితంగా సహజ వనరుల తక్కువ ఉత్పత్తి మరియు దుర్వినియోగం జరుగుతున్నది.

భారతదేశంలో, మార్కెట్ యొక్క చిన్న పరిమాణం, మూలధన కొరత, మౌలిక సదుపాయాల కొరత మరియు సాంకేతిక వెనుకబాటుతనం అల్పా స్థాయి ఉత్పాదకతకు కారకాలు.

15.5.6. మౌలిక సదుపాయాలు కొరత

మౌలిక సదుపాయాలలో భవనాలు, రోడ్లు, వంతెనలు, రవాణా సౌకర్యాలు, విద్యుత్ సరఫరా, టెలికమ్యూనికేషన్లు మొదలైనవి ఉంటాయి. పరిశ్రమలు మరియు సేవల అభివృద్ధికి ఈ సౌకర్యాలు అవసరం. అభివృద్ధి చెందుతున్న దేశాలలో, ఈ సౌకర్యాలన్నీ సరిపోవు.

భారతదేశంలో, మూలధనం కొరత మరియు సాంకేతిక వెనుకబాటుతనం మౌలిక సదుపాయాల కొరతకు దారి తీస్తుంది.

15.5.7. నిరక్షరాస్యత

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అధిక సంఖ్యలో నిరక్షరాస్యులు ఉన్నారు.నిరక్షరాస్యత అనేక సామాజిక మరియు ఆర్థిక సమస్యలను కలిగిస్తుంది.సాంకేతికత అంశాలలో నైపుణ్యాలను సంపాదించడానికి, కనీస స్థాయి విద్య అవసరం. మానవాభివృద్ధి సూచిక యొక్క ముఖ్యమైన లక్షణాలలో విద్య ఒకటి.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశంలో నిరక్షరాస్యత రేటు తగ్గింది. 2011 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశంలో అక్షరాస్యత రేటు 74%. భారతదేశంలో నాణ్యత లేని విద్య మరియు శిక్షణ ఉండటాన్ని గమనించవచ్చు.భారతదేశంలో అత్యధిక నిరుద్యోగిత రేటుపై అక్షరాస్యత ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. నిరక్షరాస్యత కారణంగా చాలా మంది యువత ఉద్యోగాలు పొందలేకపోతున్నారు.

15.5.8 అల్ప స్థాయి జీవన ప్రమాణాలు

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జీవన ప్రమాణాలు తక్కువగా ఉన్నాయి. ఈ అల్ప స్థాయి జీవనం గుణాత్మకంగా మరియు పరిమాణాత్మకంగా తక్కువ ఆదాయాలు, నాణ్యత లేని వైద్య సదుపాయాలు, పరిమిత విద్యా సౌకర్యాలు, సరిపోని గృహ సౌకర్యాలు మరియు అనేక సందర్భాల్లో, నిరాశ మరియు నిస్సహాయత రూపంలో సాధారణ భయం వ్యక్తమవుతుంది.

భారతదేశంలో, గ్రామీణ మరియు పట్టణ జీవన ప్రమాణాల మధ్య అధిక వ్యత్యాసం ఉంది. పట్టణ ప్రాంతాల్లో, పుట్టగొడుగుల్లా మురికివాడల పెరుగుదల కూడా తక్కువ జీవన ప్రమాణాన్ని సూచిస్తుంది.

15.5.9 ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ

ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ సాంప్రదాయ మరియు వెనుకబడిన రంగాలతో పాటు అధునాతన మరియు ఆధునిక రంగాల ఉనికిని సూచిస్తుంది. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలో ఉత్పత్తి యొక్క లక్ష్యం ఆధునిక మరియు సాంప్రదాయ పద్ధతుల రెండింటి సహజీవనం. అధిక సంపన్న, ఉన్నతి విద్యావంతులు, అధిక జీవన ప్రమాణాలు కలవారు మరియు అధిక సంఖ్యలో నిరక్షరాస్యులు మరియు అతి తక్కువ జీవన ప్రమాణాలు కలవారు సహజీవనం చేస్తున్నారు.

భారత ఆర్థిక వ్యవస్థ ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ కలిగి ఉన్నది. ఎందుకంటే ఇది రెండు రకాల ఆర్థిక వ్యవస్థల లక్షణాలను కలిగి ఉంటుంది-అభివృద్ధి చెందని వ్యవస్థ మరియు ప్రగతిశీల వ్యవస్థ. ఆర్థిక వ్యవస్థలో చాలా పెద్ద భాగం అభివృద్ధి చెందని మరియు వెనుకబడిన తరగతికి చెందిన వ్యక్తులను కలిగి ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలోని గ్రామీణ మరియు వ్యవసాయ రంగాలకు చెందిన వ్యక్తులు ఇందులో ఉన్నారు. మరోవైపు, ఆర్థిక వ్యవస్థలో చాలా తక్కువ మంది ప్రజలు ధనవంతులు మరియు అభివృద్ధి చెందినవారు ఉన్నారు. ఇందులో పట్టణ పారిశ్రామిక రంగానికి చెందిన వారు కూడా ఉన్నారు.భారత ఆర్థిక వ్యవస్థలో ఒక వర్గం కొత్త అంతర్జాతీయ ఆర్థిక క్రమాన్ని అవలంబించడానికి సిద్ధంగా ఉంటుంది, మరో వర్గం చాలా వెనుకబడి ఉంది.

15.6 సారాంశం

ప్రపంచంలోని ఆర్థిక వ్యవస్థలు అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలుగా వర్గీకరించబడ్డాయి. భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం. భారత ఆర్థిక వ్యవస్థ స్వాతంత్ర్యం పొందే సమయంలో స్తబ్దత మరియు ఇతర దేశాలపై ఆధారపడే ఆర్థిక వ్యవస్థ. తలసరి ఆదాయం తక్కువగా ఉంది. ఇంగ్లాండులో పరిశ్రమల అవసరాలను తీర్చడానికి విదేశీ వాణిజ్యం ప్రేరేపించబడింది. వ్యవసాయంపై ప్రజలు ఎక్కువగా ఆధారపడి అనేకమంది నిరుద్యోగులుగా ఉన్నారు. అక్షరాస్యత రేటు తక్కువగా ఉంది. అధిక జనన రేటు మరియు అధిక మరణాల రేటు, ఆరోగ్య వసతులు చాలా తక్కువగా ఉన్నాయి మరియు అంటువ్యాధులు తరచుగా విజృంభిస్తున్నాయి. ప్రణాళికాబద్ధమైన కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ నిజంగానే పురోగతిసాధించింది. స్వాతంత్ర్య పూర్వ పరిస్థితులతో పోలిస్తే మన పరిశ్రమలు చాలా వైవిధ్యంగా మారాయి.

15.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. మానవ అభివృద్ధి సూచిక యొక్క ముఖ్యమైన అంశాలు ఏమిటి?
2. అభివృద్ధి చెందిన దేశాల లక్షణాలను జాబితా రాయండి.

3. అధిక ఆదాయ దేశాలను నిర్వచించండి.

4. ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ అంటే ఏమిటి?

5. మౌలిక సదుపాయాలు అంటే ఏమిటి?

6. భారతదేశంలో ఉత్పాదకత తక్కువగా ఉండటానికి కారణాలు ఏమిటి?

7. పెట్టుబడి కొరత గల ఆర్థిక వ్యవస్థలను వివరించండి.

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో సేవా రంగం యొక్క ప్రాముఖ్యతను వివరించండి.

2. అభివృద్ధి చెందిన దేశాలలో సాంకేతిక పురోగతి మరియు ఆధునికీకరణపై లఘుటీక వ్రాయండి.

3. భారతదేశంలో జనాభా పెరుగుదలను వివరించండి.

4. నీతి (NITI) ఆయోగ్‌ను వివరించండి.

5. నిరుద్యోగ సమస్యను వివరించండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత ఆర్థిక వ్యవస్థ యొక్క లక్షణాలను వివరించండి

2. తలసరి ఆదాయం ఆధారంగా దేశాల వర్గీకరణను వివరించండి.

3. అభివృద్ధి చెందిన దేశాల లక్షణాలను వివరించండి.

15.8 పదకోశం

1. తలసరి ఆదాయం: జాతీయాదాయాన్ని జనాభాతో భాగించగా వచ్చేదే తలసరి ఆదాయం. అంతర్జాతీయ స్థాయిలో దీనిని డాలర్ విలువతో సూచిస్తారు.

2. మానవాభివృద్ధి సూచిక: మానవాభివృద్ధి సూచిక దేశాభివృద్ధిని తెలియజేస్తుంది. ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాల ఆధారంగా దీనిని తయారు చేస్తారు.

3. జీవన ప్రమాణం: దేశంలోని వ్యక్తుల ఆదాయం, ఆరోగ్య స్థాయి సౌకర్యాలు, విలాసాలు ప్రజలకు అందుబాటులో ఉండే స్థాయిని సూచించేది జీవన ప్రమాణం.

4. మూలధన కూర్పు: మూలధన వస్తూత్పత్తి అయిన యంత్రాలు, రవాణా సౌకర్యాలు, విద్యుచ్ఛక్తి లాంటివి సమకూర్చడానికి అవసరమైన మూలధనం.

5. నిరుద్యోగం: పని చేయగల స్థితిలో ఉండి, పని దొరకని పరిస్థితిని నిరుద్యోగం అంటారు.

6. మౌలిక సదుపాయాలు: రవాణా, విద్యుచ్ఛక్తి, సమాచార వ్యవస్థ లాంటి సౌకర్యాల అభివృద్ధి.

7. నిరక్షరాస్యత: అక్షరాలు చదవడం లేదా రాయలేనటువంటి స్థితి.

15.9 ఉపయుక్త గ్రంథాలు

1. Text book for Intermediate Second Year Economics. TSBIE Telangana.
2. Text book of Social Studies, Class X. TOSS
3. Text book of Social Studies, Class X. SCERT Telangana
4. NCERT Class 11, 12 Economics
5. BRAOU, BA III year Economics
6. IGNOU BA Economics
7. NIOS Economics
8. https://hdr.undp.org/data-center/country-insights#/ranks
9. Source: https://data.worldbank.org/indicator/NY.GNP.PCAP.PP.CD
10. Economic Survey Published by Govt. of India.

అధ్యాయం 16

జనాభా

16.0 లక్ష్యాలు

16.1 పరిచయం

16.2 భారతీయ జనాభా యొక్క లక్షణాలు

16.2.1 భారతదేశంలో జనాభా పరిమాణం మరియు వృద్ధి రేటు

16.2.2 జనన మరణాలు మరియు శిశు మరణాల రేట్లు

16.2.3 లింగ నిష్పత్తి

16.2.4 వయస్సు కూర్పు

16.3 జనాభా విస్ఫోటనం: భావన మరియు కారణాలు

16.3.1 భారతదేశంలో జనాభా విస్ఫోటనం యొక్క భావన

16.3.2 భారతదేశంలో జనాభా విస్ఫోటనానికి కారణాలు

16.3.3 జనాభా విస్ఫోటనానికి నియంత్రణ చర్యలు

16.4 భారతదేశంలో వృత్తుల వారి మరియు రంగాల వారీగా జనాభా విభజన

16.4.1 వృత్తుల వారీ జనాభా విభజన

16.4.2 భారతదేశంలో వృత్తుల వారీగా పని చేస్తున్న జనాభా విభజన

16.4.3 రంగాల వారీగా ఉపాధి మరియు ఉత్పత్తి విభజన

16.5 భారతదేశంలో జనాభా విధానం

16.5.1 జాతీయ జనాభా విధానం 2000 లక్ష్యాలు

16.6 సారాంశం

16.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

16.8 పారిభాషిక పదకోశం

16.9 ఉపయుక్త గ్రంథాలు

16.0 లక్ష్యాలు

- జనాభా యొక్క వివిధ అంశాలను వివరించగలరు.
- భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం ప్రస్తుత జనాభా పెరుగుదల ధోరణుల యొక్క సమస్యలను అర్థం చేసుకుంటారు.
- గత కొన్ని దశాబ్దాలలో భారతదేశ జనాభా పరిమాణం మరియు దాని వృద్ధిని వివరిస్తారు.
- జనన, మరణ రేట్ల సమాచారాన్ని పోల్చగలరు.
- 'జనాభా విస్ఫోటనానికి', కారణాలు, నివారణలు, వివరించగలరు.
- రంగాల వారీగా ఉపాధి మరియు ఉత్పత్తి విభజనవివరిస్తారు.
- భారతదేశ జనాభా విధానాన్ని వివరిస్తారు.
- జనన నియంత్రణలో కుటుంబ నియంత్రణ ప్రాముఖ్యతను తెలుపుతారు.

16.1 పరిచయం

డెమోగ్రఫీ అనేది 'డెమోస్' (పీపుల్) మరియు 'గ్రాఫీ' (అధ్యయనం) అనే రెండు గ్రీకు పదాల కూర్పు, ప్రజల గురించిన వివరణ.డెమోగ్రఫీ అనేది జనాభా యొక్క క్రమబద్ధమైన అధ్యయనం. ఇది జనాభా పరిమాణం, కూర్పు, పంపిణీ మొదలైనవాటిలో మార్పులను అధ్యయనం చేస్తుంది. జననాలు, మరణాలు మరియు వలసల ఫలితంగా జనాభా పరిమాణం, కూర్పు మరియు పంపిణీలో మార్పులను పరిశీలిస్తుంది. అన్ని జనాభా అధ్యయనాలు 'జనాభా గణన' (Census) అనే లెక్కింపు ప్రక్రియపై ఆధారపడి ఉంటాయి. దేశంలో నివసించే వ్యక్తుల సమాచారాన్ని క్రమబద్ధమైన పద్దతిలో సేకరించి జనాభా లెక్కలను తయారుచేస్తారు. ఒక దేశ ప్రజల ఆర్థికాభివృద్ధి మరియు సంక్షేమానికి సంబంధించిన విధానాల ప్రణాళిక మరియు అమలుకు జనాభా సంబంధమైన సమాచారం చాలా అవసరం. ఈ పాఠంలో, భారతదేశ జనాభా పెరుగుదల, లక్షణాలు మరియు పంపిణీ మొదలగు వాటిని గురించి తెలుసుకుందాము.

16.2 భారతీయ జనాభా యొక్క లక్షణాలు

16.2.1 భారతదేశంలో జనాభా పరిమాణం మరియు వృద్ధి రేటు

జనాభా పరంగా పరిమాణం మరియు పెరుగుదల అనేవి అభివృద్ధి చెందుతున్న దేశంలో ముఖ్యమైన అంశాలు. ఏదైనా దేశ జనాభా పరిమాణంలో మార్పునునిర్ణయించేవి జననాలు, మరణాలు మరియు వలసలు జనాభా అంటే ఒక దేశంలో లేదా నిర్దిష్ట ప్రాంతంలో ఒక నిర్దిష్ట సమయంలో నివసిస్తున్న ప్రజల సంఖ్య. జనాభాను లెక్కించడానికి, భారతదేశంలో ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనాభా గణనను (Census) నిర్వహిస్తారు.

2011 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశం 1210 మిలియన్ల జనాభాతో ప్రపంచంలో చైనా తర్వాత రెండవ అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశం ప్రపంచంలోని మొత్తం భూభాగంలో 2.4% మరియు జనాభాలో 17.7% వాటాను కలిగి ఉంది. ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (UNFPA) ప్రకారం నవంబర్ 2021లో మొత్తం ప్రపంచ జనాభా 7874 మిలియన్లు. జూలై 11వ తేదీని 'ప్రపంచ జనాభా దినం'గా పరిగణిస్తారు, ఎందుకంటే ఈ రోజున 5వ బిలియన్‌లలో చివరి బిడ్డ 1987లో జన్మించాడు.

పట్టిక-1: 1901 నుండి భారతదేశంలో జనాభా పెరుగుదల

సంవత్సరం	మొత్తం జనాభా (మిలియన్లలో)	సగటు వార్షిక వృద్ధి రేటు (%)	దశాబ్ద వృద్ధి రేటు (%)
1901	238	-	-
1911	252	0.56	5.8
1921	251	-0.03	-0.3
1931	279	1.04	11.0
1941	319	1.33	14.2
1951	361	1.25	13.3
1961	439	1.96	21.6
1971	548	2.22	24.8
1981	683	2.20	24.7
1991	846	2.14	23.9
2001	1028	1.95	21.5
2011	1210	1.63	17.7

పట్టిక 16.1 పరిశీలించినట్లైతే, భారతదేశంలో జనాభా పెరుగుదల రేటు 1881 మరియు 1921 మధ్య తక్కువగా ఉంది. జనాభాలో 15 మిలియన్ల పెరుగుదల ఉంది. ఈ దశలో అధిక మరణాలు మరియు జననాల రేటు గమనించవచ్చు. ఈదశాబ్దాలలో కరువులు మరియు అంటువ్యాధులు అధిక మరణాల రేటుకు గల ప్రధాన కారణాలు. ఈ సంవత్సరం వరకు జనాభా పెరుగుదల స్థిరంగా లేనందున1921 సంవత్సరం భారతదేశ జనాభా గణనలో విభజన సంవత్సరంగా పరిగణించబడుతుంది.

1921-1951 కాలంలో జనాభా కాలంలో స్థిరమైన పెరుగుదలను మనం గమనించవచ్చు. ఈ కాలంలో 110 మిలియన్ల జనాభా పెరుగుదల నమోదైంది. 1951లో13.3% దశాబ్ద వృద్ధి రేటు నమోదు అయ్యింది. మరణాల రేటు తగ్గుదల, జనన రేటు తగ్గుదల రేటు కంటే ఎక్కువగా ఉంది. 1921 తర్వాత మరణాల రేటు క్షీణించడానికి ప్రధాన కారణం కరువులు మరియుఅంటువ్యాధులపైనియంత్రణ సాధించడం జరిగినది.

భారతదేశం 1951–1981 కాలంలో 'జనాభా విస్ఫోటనం' చవిచూసింది. ఈ 30 సంవత్సరాల కాలంలో 322 మిలియన్ల జనాభా పెరుగుదల నమోదైంది. 1971–81 దశాబ్ద కాలంలో 24.7% జనాభా పెరుగుదల రేటు నమోదుకావడం జరిగింది. ఈ కాలంలో జనన, మరణాల రేట్ల మధ్య భారీ వ్యత్యాసం ఉంది, ఆర్థిక అభివృద్ధి కార్యకలాపాలు వేగవంతం కావడం, ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాల కల్పన మరియు జీవనప్రమాణ మెరుగుదల మొదలైనవి దీనికి ప్రధాన కారణాలు.

1981 నుండి 2011 వరకు భారతదేశం యొక్క మొత్తం జనాభా 683 మిలియన్ల నుండి 1210 మిలియన్లకు పెరిగింది. 2001 నుండి 2011 మధ్య కాలంలో దశాబ్ద వృద్ధి రేటులో 17.7% నమోదైంది. ఆర్థికాభివృద్ధి, కుటుంబ నియంత్రణ కార్యక్రమం సఫలీకృతం కావడం వలన ఈ 30 ఏళ్లలో జనాభా వృద్ధి రేటు తగ్గడం జరిగింది.

16.2.2 జనన మరణాలు మరియు శిశు మరణాల రేట్లు

ఒక దేశం యొక్క జనాభా పెరుగుదల రేటు దాని జనన రేటు, మరణాల రేటు మరియు వలసలపై ఆధారపడి ఉంటుంది. భారతదేశంలో వలసలు చాలా తక్కువ. అందువల్ల, జనాభా పెరుగుదలను నిర్ణయించడంలో వలసలు ముఖ్యమైన అంశం కాదు.

పట్టిక–2ను పరిశీలించినట్లైతే, ఇన్ఫ్లుయెంజా మరియు ఇతర ఇన్ఫెక్షన్ల కారణంగా 1921కి ముందు అధిక మరణాల రేటు నమోదు కావడం జరిగినది. 1918లోనే 15 మిలియన్ల మంది ఇన్ఫ్లుయెంజాతో మరణించారు. ఈ కాలంలో జనన రేటు ప్రతి వెయ్యికి 46 మరియు 49 మధ్య, మరణాల రేటు 44 మరియు 49 మధ్య ఉంది. కాబట్టి, జనాభా పెరుగుదల రేటు చాలా తక్కువగా ఉంది. అధిక మరణాల రేటు మరియు అధిక జనన రేటు కారణంగా 1921 వరకు జనాభా పెరుగుదల రేటు ఎక్కువగా లేదు.

Table-2 Birth and Death Rates in India

Decade	Births (per 1000)	Deaths (per 1000)
1891-1900	45.8	44.4
1901-1911	48.1	42.6
1911-1920	49.2	48.6
1921-1930	46.4	36.3
1931-1940	45.2	31.6
1941-1950	39.9	27.4
1951-1960	40.0	18.0
1961-1970	41.2	19.2
1971-1980	37.2	15.0
1981-1990	29.5	9.3
1991-2000	25.4	8.4
2001-2011	21.8	7.1

పట్టిక–2ని విశ్లేషిస్తే, 1911–20 సమయంలో నమోదైన మరణాల శాతం 2010–11 నాటికి వెయ్యికి 48.6 నుండి 7.1కి తగ్గింది. 1920 తర్వాత మరణాల రేటు వేగంగా క్షీణించడాన్ని గమనించవచ్చు, కరువు కారకాలను సమర్థవంతముగా ఎదుర్కోవడం, వివిధ రకాలైన అంటువ్యాధులను అరికట్టడం, మెరుగైన వైద్య సదుపాయాలు మరియు తగినంత ఆహార ధాన్యాల లభ్యత మొదలగునవి మరణాల రేటు తగ్గడానికి కారణం. మరోవైపు 1911–20 మధ్యకాలంలో జననాల రేటు 1000కి 49.2. ఈ వృద్ధి రేటు 2001–11లో ప్రతి వెయ్యికి 21.8కి తగ్గింది.

2001-11 మధ్య కాలంలో, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో జనన మరియు మరణాల రేట్లు రెండింటిలోనూ చాలా వైవిధ్యాలు ఉన్నాయి. కేరళ, తమిళనాడు, పూర్వ ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్ర మరియు పంజాబ్‌లలో జననాల రేటు తక్కువగా నమోదైంది. మరోవైపు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్ మరియు మధ్యప్రదేశ్‌లలో జననాల రేటు చాలా ఎక్కువగా ఉంది. జనన రేటులో గణనీయమైన తగ్గుదల సాధించాలంటే, వివాహం, ఉమ్మడి కుటుంబం, కుటుంబ నియంత్రణ పట్ల ప్రజల దృక్పథం మారాలి.

శిశు మరణాల రేటు (IMR): ఇది జనాభా పెరుగుదల రేటును కూడా ప్రభావితం చేస్తుంది. శిశు మరణాల రేటు (IMR) అనేది ప్రతి 1000 సజీవ జననాలకు ఒక సంవత్సరం కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణాల సంఖ్య. 20వ శతాబ్దం రెండవ భాగంలో, శిశు మరణాల రేటు 218గా ఉంది మరియు 2010-11 నాటికి అది 47కి పడిపోయింది. వైద్య, ఆరోగ్య సదుపాయాల మెరుగుదల, పోషకాహార పథకాల అమలు తదితర కారణాల వల్ల శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. దేశ ఆర్థికాభివృద్ధి శిశు మరణాల రేటుపై ఆధారపడి ఉంటుంది. అధిక శిశు మరణాల రేటు దేశంలోని శ్రామిక జనాభాలో క్షీణతకు దారితీస్తుంది.

16.2.3 లింగ నిష్పత్తి

మానవ వనరుగా దేశ జనాభా నాణ్యతను నిర్ణయించే ప్రధాన సూచిక లింగ నిష్పత్తి. ప్రతి 1000 మంది పురుషులకు ఎంత మంది స్త్రీలు ఉంటారో ఆ సంఖ్యను లింగ నిష్పత్తిగా భావించవచ్చు. మన దేశంలో ఈ నిష్పత్తి స్త్రీలకు ఎప్పుడూ ప్రతికూలంగా ఉంటూ క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఇది కలవరపెట్టే అంశం. స్త్రీ పురుషుల సమానత్వాన్ని కొలిచే ప్రధాన సూచిక లింగ నిష్పత్తి. 1901 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు 972 మంది స్త్రీలు ఉన్నారు. ఈ సంఖ్య 1951లో 946 నుండి 2001లో 933కి తగ్గి 2011లో 940కి పెరిగింది.

భారతదేశంలోని వివిధ రాష్ట్రాల లింగ నిష్పత్తిలో వైవిధ్యాలు ఉన్నాయని గమనించవచ్చు. కేరళలో లింగ నిష్పత్తి 1084, పుదుచ్చేరి 1038 మెరుగైన స్థితిలో ఉన్నాయి. హర్యానా మరియు పంజాబ్ వరుసగా 877 మరియు 893 వద్ద ఉన్నాయి. తక్కువ అక్షరాస్యత, పేదరికం మరియు సామాజిక వైఖరి లింగ వివక్షకు కారణం. స్త్రీల పట్ల వివక్ష పుట్టినప్పటి నుండి మొదలవుతుంది కాబట్టి లింగ నిష్పత్తి ప్రతికూలంగా ఉంటుంది. మగ బిడ్డ కొరకు ప్రాధాన్యత ఎక్కువ ఉండటం వలన ఆడ శిశు మరణాలు ఎక్కువగా ఉన్నాయి. పౌష్టికాహారం అందించడంలో, ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడంలో ఆడ పిల్లలకు తక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఆడ శిశువుల భ్రూణహత్యలు ఇప్పటికీ జరుగుతున్నాయి. చాలా కుటుంబాలు ఆడపిల్లలను భారంగా భావిస్తాయి. అందువల్ల ఆడ పిల్లల్లో అక్షరాస్యత శాతం కూడా తక్కువే. లింగ వివక్ష ఇలాగే కొనసాగితే ఆర్థికాభివృద్ధి సాధించడం కష్టమవుతుంది. సమాజంలో ఆడ పిల్లల వివక్ష పట్ల ఉన్న వైఖరిలో ఖచ్చితంగా మార్పు రావాలి.

16.2.4 వయస్సు కూర్పు

వయస్సు కూర్పు అనగా జనాభా లో వివిధ వయసుల వ్యక్తుల విభజన.వైద్య ఆరోగ్య సౌకర్యాలు, సంక్షేమ పథకాలు మరియు ఉపాధి కల్పన (శ్రామికశక్తి) అందించడానికి ఇది ఉపయోగకరమైన సాధనం. జనాభాలో 15 నుండి 60 సంవత్సరాల వయసు వారిని 'పని చేసే వయసు' వారిగా, 0 - 14 సంవత్సరాల వయస్సు గల వారిని పిల్లలుగా, 60 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు గలవారిని వృద్ధాప్య సమూహంగా పరిగణిస్తారు.

15 ఏళ్ల లోపు జనాభా 1971లో 42% నుండి 2011లో 31%కి తగ్గింది. 15 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్నవారిలో తగ్గుదల జాతీయ జనాభా విధానం సక్రమంగా అమలు చేయబడుతుందని వెల్లడిస్తోంది. ఇదే కాలంలో 15 - 60 ఏళ్ల మధ్య వయస్సు వారు 53% నుంచి 63.7%కి పెరిగారు. ఈ సమూహంలో పెరుగుదల శ్రామిక జనాభా పెరుగుదలకు దారితీసింది.ఇది ఆర్థిక వృద్ధికి సానుకూల అంశం. జనాభాలో శ్రామిక వయస్సులో ప్రజల వాటా పెరగడం వల్ల ఆర్థిక వృద్ధి రేటు పెరుగుదలను 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' అంటారు.ఇది వైద్య ఆరోగ్య సంరక్షణ స్థాయిలను మెరుగుపరచడంతోపాటు మానవ వనరులను పెంచడంపై ఆధారపడి ఉంటుంది. వైద్య సదుపాయాలు, ప్రజారోగ్య చర్యలు మరియు పోషకాహారం అందించడంలో పురోగతి కారణంగా భారతదేశంలో ఆయుర్దాయం పెరుగుతోంది.

16.3 జనాభా విస్ఫోటనం: భావన మరియు కారణాలు

16.3.2 భారతదేశంలో జనాభా విస్ఫోటనం యొక్క భావన

మాల్థస్ జనాభా సిద్ధాంతం ప్రకారం జనాభా గుణ శ్రేణి (జ్యామితీయ రీతి)లో పెరుగుతుంటే (1, 2, 4, 8, 16....), వాటి ఆహార అవసరాలు అంకశ్రేఢిలో పెరుగుతాయి (1, 2, 3, 4, ...). జనాభా పెరుగుదలను కట్టడి చేయనిచో, ఇది జ్యామితీయ సగటుతో పెరుగుతుంది. జనాభా పెరుగుదలను కట్టడి చేయనిచో, ప్రతి 25 సంవత్సరాలకు జనాభా రెట్టింపు అవుతుంది. అందువల్ల, జనాభా పెరుగుదలను నియంత్రించడం పేదరిక నిర్మూలనకు ఏకైక పరిష్కారం. వివిధ కారణాలతో మరణాల రేటు తగ్గుతుంది కానీ అదే స్థాయిలో జననాల పెరుగుదల రేటులో తగ్గుదల కనిపించని కారణంగా జనాభా విపరీతంగా పెరిగిపోయి జనాభా విస్ఫోటనం ఏర్పడుతుంది. 1951 మరియు 1991 మధ్యకాలంలో భారతదేశం ఈ పరిస్థితిని ఎదుర్కొంది.జనాభా పెరుగుదలను నియంత్రణ చేయకపోతే అది ఆహార కొరత, పేదరికం, నిరుద్యోగం, వనరుల కొరత, పర్యావరణ సమస్యలు, నీటి కొరత, అధిక జీవన వ్యయం మొదలైన తీవ్రమైన సమస్యలకు దారి తీయవచ్చు.

16.3.2 భారతదేశంలో జనాభా విస్ఫోటనానికి కారణాలు

భారతదేశంలో జనాభా విస్ఫోటనానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. అవి: 1) అల్ప మరణాల రేటు 2) అధిక జనన రేటు మరియు 3) వలసలు. ఇందులో వలసల ప్రభావం అత్యల్పం. భారతదేశంలో జనాభా విస్ఫోటనానికి గల ఈ కారణాలను ఇప్పుడు విశ్లేషిద్దాం.

I) మరణాల రేటు తక్కువగా ఉండడానికి గల కారణాలు

1. వైద్య మరియు ఆరోగ్య సౌకర్యాలలో మెరుగుదల: వ్యాధుల నియంత్రణ: స్వాతంత్ర్య అనంతరం ఆరోగ్య రంగంలో జరిగిన అభివృద్ధి కారణంగా కలరా, మలేరియా, మసూచి వంటి అంటువ్యాధుల మరణాలను అరికట్టడం జరిగింది. దీని వలన మరణాల రేటు తగ్గింది. ముఖ్యంగా శిశు మరణాల రేటును చాలా నియంత్రించగలిగాం.
2. కరువుకాటకాల నియంత్రణ: బ్రిటిష్ పాలన అనంతరం భారతదేశంలో పంట విధానాల్లో మార్పు తేవడం మరియు పంటలకు సాగునీటి సౌకర్యం కల్పించడం, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడం వలన మరణాల రేటు తగ్గింది.
3. ఇతర అంశాలు: త్రాగునీటి వసతి, శుభ్రత, విద్యా సదుపాయాల కల్పన, వైద్య సదుపాయాల మెరుగుదల, రోగ నిరోధక టీకాలు ఇవ్వడం, పేదరిక నిర్మూలన పథకాల అమలు వలన మరణాల రేటు చాలా తగ్గడం జరిగింది.

II) అధిక జననాల రేటుకు కారణం

ఎ. ఆర్థిక కారణాలు

1. వ్యవసాయ రంగ ఆధిపత్యం: వ్యవసాయ కుటుంబంలో పిల్లలను ఆర్థిక భారంగా చూడడం జరగదు. పైగా వ్యవసాయానికి కూలీల సంఖ్య అధికంగా అవసరం ఉండటంమూలంగా జనాభా నియంత్రణ గురించి ఆలోచించరు. అందువల్ల వ్యవసాయ కుటుంబాలు ఉమ్మడి కుటుంబాలుగా పెద్దవిగా ఉండేవి.
2. పట్టణీకరణ: పారిశ్రామికీకరణ మందకొడిగా ఉండడం వలన పట్టణీకరణ వేగవంతంగా జరగలేదు. వృత్తులలో పెద్దగా మార్పులు లేకపోవడం వలన జననాల రేటు అధికంగా ఉండేది.
3. పేదరికం: జనాభా పెరుగుదలకు పేదరికం ఒక ప్రధాన కారణం. పేదవారు తమ సంతానాన్ని భారంగా చూడకుండా ఒక ఆర్థిక వనరుగా చూడటం వలన జనన రేటు అధికంగా ఉంటుంది.

బి. సామాజిక కారణాలు

1. వివాహ వ్యవస్థ: భారతదేశ సమాజంలో వివాహ వ్యవస్థ ఒక సర్వజన అంగీకారంగా ఉండటం వలన అది తప్పనిసరిగా జనాభా పెరుగుదలకు కారణం అవుతున్నది. చిన్న వయస్సులో అనగా15 - 20 సంవత్సరాల వయసులో మహిళకు వివాహం జరగడం వలన ఫెర్టిలిటీ రేటు (ఒక మహిళకు పుట్టే మొత్తం పిల్లలు) ఎక్కువగా ఉండటం వలన జననాల రేటు అధికంగా ఉంది.

2. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ: భారతదేశం ప్రధానంగా వ్యవసాయ దేశం. సామాజికంగా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఆధిపత్యంలో ఉంది ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో సంతానాన్ని ఆర్థిక భారంగా చూడకపోవడం వల్ల ఎక్కువ మంది సంతానాన్ని కలిగి ఉండటం జరిగింది. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వేగంగా కనుమరుగు కావడం గమనిస్తున్నాం.

3. మతపరమైన కారణాలు: మతాచారాలు, మూఢనమ్మకాలు, వెనుకబాటుతనం వంటి కారణాలు కూడా జనన రేటు అధికంగా ఉండడానికి దోహదపడుతున్నాయి.

4. సామాజిక అవగాహన లేకపోవడం: కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించకపోవడం వలన జనాభా వృద్ధి రేటు తగ్గడం లేదు. మతం, ఆచారాల వలన కుటుంబ నియంత్రణ ప్రచారం సఫలం కావడం లేదు.

5. మగ బిడ్డకు ప్రాధాన్యత: చాలా మంది తల్లిదండ్రులు తమకు కొడుకు లేదా కావలసిన సంఖ్యలో కొడుకులు పుట్టే వరకు కుటుంబ నియంత్రణను అంగీకరించరు. అందువల్ల, జనన రేటు ఎక్కువగా ఉంటుంది.

16.3.3 జనాభా విస్ఫోటనానికి నియంత్రణ చర్యలు

అధిక జనాభా పెరుగుదల రేటు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలిగించింది.ఇది ఉపాధి సమస్యలకు కారణమైంది. జీవన ప్రమాణాలు మరియు విద్యా స్థాయిలను ప్రభావితం చేసింది. సమర్థవంతమైన సామాజిక మరియు ఆర్థిక చర్యలను చేపట్టడం ద్వారా జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు.

ఎ. సామాజిక చర్యలు

1. విద్యా వ్యాప్తి: అక్షరాస్యత మానవుల నడవడికను మార్చుతుంది. జీవితం పట్ల చక్కటి అవగాహన కలుగజేస్తుంది. కాబట్టి విద్యాధికులైన యువతీ యువకులు కుటుంబ శ్రేయస్సుపై అవగాహన కలిగి ఉండి మూఢనమ్మకాలను విడిచి చిన్న కుటుంబం లేదా తక్కువ సంతానం కలిగి ఉంటారు. విద్య ఉద్యోగం వల్ల వివాహ వయస్సు వాయిదా అనేది కూడా ఉంటుంది. దీని ద్వారా జనాభా పెరుగుదల నియంత్రణ కనబడుతుంది.

2. వివాహ వయస్సు: చిన్న తనంలో వివాహం కావడం వలన పిల్లలు పుట్టే సంఖ్య అధికంగా ఉండవచ్చు. భారతదేశంలో పురుషుల కనీస వివాహ వయస్సు 21 సంవత్సరాలు అయితే మహిళలకు 18 సంవత్సరాలు అని నిర్ణయించారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళల కనీస వివాహ వయస్సును 18 నుండి 21 సంవత్సరాలకు పెంచాలని నిర్ణయించింది. వివాహ వయస్సు ఎక్కువగా ఉంటే ఫెర్టిలిటీ సంఖ్య తగ్గి జనాభా నియంత్రణ జరుగుతుంది.

3. మహిళల స్థాయిని పెంచడం: ఇప్పటికీ మహిళల పట్ల వివక్ష కొనసాగుతోంది. వారు తరచుగా వంటగదికి పరిమితమవుతారు. కాబట్టి మహిళలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు కల్పించాలి. వారికి ఉచిత విద్య అందించాలి.

బి. ఆర్థిక చర్యలు

1. పారిశ్రామిక రంగ విస్తరణ: కార్మికులు ఆర్థిక పరమైన అవగాహనను కొంత కలిగి ఉంటారు. ఉద్యోగంను సంపాదించడంలో ఉన్న కష్టనష్టాలు తెలుసు. కావున వారి కుటుంబ సంఖ్యను నియంత్రణలో ఉంచడానికి ఇష్టపడతారు. వారి సంతానానికి నాణ్యమైన జీవితాన్ని కల్పించేందుకు ఇష్టపడతారు. కావున తక్కువ మంది పిల్లలు ఉండడానికి ఇష్టపడతారు. దీని వలన జనాభా పెరుగుదలలో నియంత్రణ ఉంటుంది.

2. ఉద్యోగ కల్పన మరియు పట్టణీకరణ: పారిశ్రామికీకరణ వలన ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా కల్పించవచ్చు. పట్టణీకరణ కూడా జరుగుతుంది. పట్టణీకరణ మరియు ఉద్యోగ కల్పన వలన ప్రజల్లో ఆర్థిక పరమైన అవగాహన కలిగి చిన్న కుటుంబం పట్ల మొగ్గుచూపుతారు. ఈ రకంగా జనాభా పెరుగుదలలో నియంత్రణ కలుగుతుంది.

3. పేదరిక నిర్మూలన: పేదరికంలో ఉన్నవారు సంతానాన్ని ఆర్థిక వనరుగా భావిస్తారు కాబట్టి పేదరిక నిర్మూలన జరిగితే కొంత వరకు జనాభా నియంత్రణసాధించవచ్చు.

సి. కుటుంబ నియంత్రణ

భారత ప్రభుత్వం 1952లో సమగ్ర కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కుటుంబ సంక్షేమ కార్యక్రమం స్వచ్ఛంద ప్రాతిపదికన బాధ్యతాయుతమైన మరియు ప్రణాళికాబద్ధమైన తల్లిదండ్రులను ప్రోత్సహించడానికి ప్రయత్నించింది. కుటుంబ నియంత్రణ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఈ పథకం అమలు చేయడం జరిగినది. కుటుంబ నియంత్రణ పద్ధతుల ద్వార జనన పెరుగుదల రేటును అరికట్టవచ్చు. కానీ ఈ పద్ధతి యొక్క విజయం జనన నియంత్రణ కోసం చౌకైన గర్భనిరోధక పరికరాల లభ్యతపై ఆధారపడి ఉంటుంది.

16.4 భారతదేశంలో వృత్తుల వారి మరియు రంగాల వారీగా జనాభా విభజన

16.4.1 వృత్తుల వారీ జనాభా విభజన

ఈ దేశమైనా వృద్ధి చెందాలి అంటే శ్రామిక శక్తి అవసరం. ఉత్పత్తి కారకాలలో శ్రామికులు ముఖ్య కారకాలు. వృత్తులను మనం మూడు రకాలుగా విభజించడం జరిగింది. ఒక ఆర్థిక వ్యవస్థలోని పని చేసే వయస్సులో ఉన్న జనాభాను వివిధ రకాల వృత్తుల మధ్య విభజించడాన్ని వృత్తుల వారి జనాభా విభజన అనవచ్చు. మూడు రకాలైన ప్రధాన వృత్తులను మనం గమనించవచ్చు. అవి: 1. ప్రాథమిక వృత్తులు: వ్యవసాయం, పశుపోషణ, అడవులు, చేపల పెంపకం మొదలగు వాటిని ప్రాథమిక వృత్తులు అంటారు. 2. ద్వితీయ వృత్తులు: చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలలోని వృత్తులను ద్వితీయ వృత్తులు అని అంటారు. 3. తృతీయ వృత్తులు: రవాణా, కమ్యూనికేషన్లు, బ్యాంకింగ్, పాలన, విత్తం మొదలగు వృత్తులను లేదా సేవలను తృతీయ వృత్తులు అని అంటారు.

16.4.2 భారతదేశంలో వృత్తుల వారీగా పని చేస్తున్న జనాభా విభజన

వివిధ రంగాలలో పనిచేసే వ్యక్తుల నిష్పత్తి అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలలో మారుతూ ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాలు ద్వితీయ మరియు తృతీయ రంగాలలో అధిక సంఖ్యలో ప్రజలు పని చేస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల శ్రామిక శక్తిలో అధిక భాగం శ్రామికులు ప్రాథమిక రంగంలో పని చేస్తున్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం 121 కోట్ల జనాభాలో 40 కోట్ల మంది పని చేస్తున్నవారు, అంటే ఉత్పాదక కార్యకలాపాలలో భాగస్వాములైన ప్రజలు ఉన్నారు. భారతదేశ ఉపాధి రంగంలో ఎక్కువ మార్పులు రాలేదని చెప్పవచ్చు. ఇప్పటికీ వ్యవసాయమే ప్రధాన ఉపాధి రంగంగా ఉంది. పారిశ్రామిక, సేవా రంగాలలో ఉపాధిని ఎక్కువ కల్పించక పోవడం కారణంగా వ్యవసాయ రంగంలోనే ఎక్కువ మంది కొనసాగుతున్నారు. దేశంలోని కార్మికులలో సుమారు సగం మంది వ్యవసాయంలో ఉన్నప్పటికీ స్థూల దేశీయ (Gross Domestic Product) ఉత్పత్తిలో చాలా తక్కువ వాటా కలిగి ఉంది.

వ్యవసాయ రంగంలో దాదాపు 50 శాతం ఉన్న శ్రామిక శక్తి మొత్తం దేశీయ ఉత్పత్తిలో మాత్రం కేవలం 19 శాతం మాత్రమే నమోదు అవుతుంది. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా గణనీయంగా క్షీణించింది. కానీ వ్యవసాయ రంగంలో కార్మికుల శాతం మాత్రం అంతగా క్షీణించకుండా ఉంది. దీంతో వ్యవసాయ రంగంలో అవసరమైన దాని కంటే ఎక్కువ మంది ఉన్నారని అర్థమవుతోంది. వ్యవసాయం నుండి కొంత మందిని తొలగించినప్పటికీ వ్యవసాయ ఉత్పత్తిపై ప్రభావం ఉండదు. ఇలా వ్యవసాయ రంగంలో అవసరమైనదాని కంటే ఎక్కువ మంది పని చేయడాన్ని 'ప్రచ్ఛన్న నిరుద్యోగం' అంటారు. సహజంగానే మనం గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో ఈ పరిస్థితిని చూస్తాం. కుటుంబమంతా తమకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిపైనే ఆధారపడి ఉంది. ఇతర రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరిగితే ఇంత మంది వ్యవసాయం చేయాల్సిన అవసరం ఉండదు.

16.4.3 రంగాల వారీగా ఉపాధి మరియు ఉత్పత్తి విభజన

పట్టిక-3: స్థూల దేశీయోత్పత్తిలో మరియు ఉపాధిలో ప్రాథమిక, ద్వితీయ మరియు తృతీయ రంగాల వాటాలు.

ఆర్థిక రంగం	ఉపాధి వాటా (శాతంలో)		స్థూల దేశీయోత్పత్తిలో వాటా (శాతంలో)	
	1951	**2015**	**1951**	**2015**
ప్రాథమిక రంగం	72	47	59	19
ద్వితీయ రంగం	11	22	13	28
తృతీయ రంగం	17	31	28	53

పట్టిక-3ని విశ్లేషిస్తే, 2015లో భారతదేశంలో రంగాల వారీగా ఉపాధి వాటా వ్యవసాయంలో 47 %, పరిశ్రమలో 22 % మరియు సేవా రంగంలో 31 %. అదేవిధంగా, మూడు రంగాలలో స్థూల దేశీయోత్పత్తిని పరిశీలిస్తే, వ్యవసాయం వాటా 19%, పరిశ్రమల వాటా 28 % మరియు సేవల వాటా 53 % ఉంది. ప్రాథమిక రంగంలో ఉపాధివాటా 1950లో ఉన్న 72% నుండి 2015 నాటికి 47%కి తగ్గింది, అదే సమయంలో ద్వితీయ మరియు తృతీయ రంగాల వాటాలు వరుసగా 11 నుండి 22% మరియు 17 నుండి 31% వరకు పెరిగాయి.

స్థూల జాతీయాదాయంలో ప్రాథమిక రంగం వాటా 1951లో 59% నుండి 1915 నాటికి 19%కి తగ్గింది, అయితే ఈ కాలంలో ద్వితీయ మరియు తృతీయ రంగాల శాతం వాటాలు గణనీయంగా పెరిగాయి. పట్టిక-3 ఉపాధి రంగం మరియు తయారీ రంగం మధ్య వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపుతుంది. వ్యవసాయ రంగం 47% ఉద్యోగులన ుకలిగి ఉంది, ఉత్పత్తిలో కేవలం 19% మాత్రమే ఉంటుంది, అయితే 31% ఉద్యోగులను కలిగి ఉన్న సేవారంగం మొత్తం ఉత్పత్తిలో 53% వాటాను కలిగిఉంది. అంటే వ్యవసాయ రంగం అధిక శ్రామిక శక్తిని కలిగిఉంది మరియు వీరిని పారిశ్రామిక మరియు సేవారంగాలకు మార్చాల్సిన అవసరం ఉంది.

16.5 భారతదేశంలో జనాభా విధానం

జనాభా పెరుగుదల ఒక ముఖ్యమైన అంశం మరియు ఇది ఒక దేశం యొక్క అభివృద్ధి అవకాశాలను అలాగే దాని ప్రజల ఆరోగ్యం మరియు శ్రేయస్సును కీలకంగా ప్రభావితం చేస్తుంది. ఈ విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రత్యేక సవాళ్లను ఎదుర్కోవాల్సిన ఉంటుంది. జనాభా అదుపు లేకుండా పెరుగుతూ ఉంటే, భారతదేశం అనేక సామాజిక-ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిరుద్యోగం తారాస్థాయికి చేరుకుంటుంది. గాలి తీవ్రంగా కలుషితమవుతుంది మరియు ప్రతి నీటిబొట్టు విషపూరిత పదార్థాలతో కలుషితం అవుతుంది. ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం అసాధ్యం అవుతుంది.

భారతదేశం ఒక అర్ధ శతాబ్దానికి పైగా అధికారిక జాతీయ జనాభా విధానాన్ని కలిగి ఉండటం ఆశ్చర్యకరం కాదు. వాస్తవానికి, 1952లో అటువంటివి ధానాన్ని స్పష్టంగా ప్రకటించిన మొదటి దేశం భారతదేశం కావచ్చు. 1952 తర్వాత, మరణాల రేటు గణనీయంగా తగ్గింది, అయినప్పటికీ, జననాల రేటులో ఇదే విధమైన తగ్గుదల లేదు. మొదటిసారిగా, జాతీయ జనాభా విధానాన్ని 1976లో ప్రకటించారు. జాతీయ అత్యవసర పరిస్థితి (1975-76) సంవత్సరాల్లో కుటుంబ నియంత్రణ కార్యక్రమం వెనుకబడిపోయింది. జాతీయ కుటుంబ నియంత్రణ కార్యక్రమం అత్యవసర పరిస్థితి తర్వాత జాతీయ కుటుంబ సంక్షేమ కార్యక్రమంగా పేరు మార్చబడింది. 2000 సంవత్సరపు జాతీయ జనాభా విధానంలో భాగంగా కొత్త మార్గదర్శకాల రూపొందించడం జరిగింది.

జాతీయ జనాభా విధానం 2000: పునరుత్పత్తి మరియు పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం సమగ్ర సేవలను అందించడం తన తక్షణ లక్ష్యాన్ని పేర్కొంది. జాతీయ జనాభా విధానం, భారతదేశ ప్రజల పునరుత్పత్తి మరియు శిశు ఆరోగ్య అవసరాలను తీర్చడానికి మరియు 2010 నాటికి మొత్తం సంతానోత్పత్తి రేటు (TFR) నికర స్థాయిలను సాధించడానికి, రాబోయే దశాబ్దంలో లక్ష్యాలను మరియు ప్రాధాన్యతా వ్యూహాలను అభివృద్ధి చేయడానికి విధాన ప్రణాళికలను అందిస్తుంది. ప్రభుత్వం, మరియు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో పునరుత్పత్తి మరియు శిశు ఆరోగ్య సేవల యొక్క సమగ్ర సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం కల్పించాలని ప్రణాళికలు రచించింది. పిల్లల మనుగడ, తల్లి ఆరోగ్యం మరియు గర్భనిరోధక సమస్యలను ఏక కాలంలో పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

16.5.1 జాతీయ జనాభా విధానం 2000 లక్ష్యాలు

1. 14 సంవత్సరాల వరకు పాఠశాల విద్యను ఉచితంగా మరియు నిర్బంధంగా చేయడం మరియు ప్రాథమిక మరియు మాధ్యమిక పాఠశాల స్థాయిలలో బాలబాలికలకు 20 శాతం కంటే తక్కువకు డ్రాపౌట్లను తగ్గించడం.
2. ప్రతి 1,000 సజీవ జననాలకు శిశు మరణాల రేటును 30 కంటే తక్కువకు తగ్గించడం.
3. 100,000 సజీవ జననాలకు మాతృ మరణాల రేటును 100 కంటే తక్కువకు తగ్గించడం.
4. పిల్లల రోగ నిరోధకతను సాధించడానికి అన్ని వ్యాధులు నివారించగల టీకాలు వేయించడం.
5. ఆడపిల్లల వివాహ వయస్సును పెంచడానికి ప్రోత్సహించడం, వివాహం 18 ఏళ్ల కంటే 20 ఏళ్ల తర్వాత ఉత్తమం అనే అభిప్రాయాన్ని కల్పించడం.
6. సంతానోత్పత్తి నియంత్రణ మరియు గర్భ నిరోధక సేవలకు విస్తృతమైన ప్రచారం కల్పించడానికి సార్వత్రిక ప్రణాళికలను రూపొందించి లక్ష్యాలను సాధించడం
7. 80 శాతం కాన్పులను ఆసుపత్రులలో మరియు శిక్షణ పొందిన వ్యక్తుల ద్వారా 100 శాతం కాన్పులను సాధించడం.
8. చిన్న కుటుంబాలను ప్రోత్సహించడం.
9. జాతీయ AIDS నియంత్రణ సంస్థ (NACO) సహకారముతో వివిధ రకాల వ్యాధులను నియంత్రించడం.
10. 2045 నాటికి జనాభా పెరుగుదలను స్థిరీకరించడం.

16.6 సారాంశం

జనాభా శాస్త్రం, జనాభా యొక్క క్రమబద్ధమైన అధ్యయనం. జనాభా సమాచారం ప్రభుత్వ విధానాలలు, ప్రణాళిక మరియు అమలు కోసం, ఆర్థికాభివృద్ధి మరియు ప్రజా సంక్షేమం అవసరం. భారతదేశం ప్రపంచంలోని అత్యంతయువ జనాభా కలిగిన దేశాలలో ఒకటి, ఎక్కువ మంది భారతీయులు యువకులే. రాబోయే సంవత్సరాల్లో దేశ ఆర్థిక వృద్ధికి ఇది చాలా ముఖ్యం. 'జనాభా విస్ఫోటనం' గురించి యువతరం అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. వివిధ రంగాలలో ఉపాధి కల్పన ఒక ముఖ్యమైన ఆర్థిక అంశం. భారతదేశంలో ఆర్థికాభివృద్ధికి ఉపాధిని ఒక రంగం నుండి మరొక రంగానికి మార్చడం చాలా అవసరం. మన సహజ వనరులను కాపాడు కోవడానికి జననియంత్రణ చాలా అవసరం. కుటుంబ నియంత్రణను సక్రమంగా అమలు చేయడం వల్ల ఆర్థికాభివృద్ధికి పరోక్షంగా ప్రోత్సాహం లభిస్తుంది.

16.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. జనాభా అంటే ఏమిటి?
2. జనాభా విస్ఫోటనాన్ని వివరించండి.
3. జనాభా విభజన అంటే ఏమిటి?
4. శిశు మరణాలను నిర్వచించండి.
5. మాల్థస్ జనాభా సిద్ధాంతాన్ని వివరించండి.
6. కుటుంబ నియంత్రణ అంటే ఏమిటి?
7. భారతదేశంలో వృత్తులను వివరించండి.

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. "లింగ నిష్పత్తి" అంటే ఏమిటి? భారతదేశంలో ఇది ఎందుకు ప్రతికూలంగా ఉంది?
2. భారతదేశంలో జనాభా విస్ఫోటనం నివారణ మార్గాలను వివరించండి.
3. భారతదేశంలో వృత్తిపరంగా పని చేస్తున్న జనాభాను వివరించండి.
4. భారతదేశంలో మరణాల రేటు తగ్గడానికి కారణాలు ఏమిటి?
5. భారతదేశంలో జనాభా వయస్సు కూర్పును వివరించండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. భారతీయ జనాభా యొక్క లక్షణాల గురించి క్లుప్తంగా వివరించండి.
2. భారతదేశంలో జనాభా పెరుగుదల ధోరణులను విశ్లేషించండి.

3. భారతదేశంలో జనాభా విస్ఫోటనానికి కారణాలు ఏమిటి?

4. గత దశాబ్దంలో భారతదేశంలో జనన మరణాల రేటులో వచ్చిన మార్పులను విశ్లేషించండి.

5. జాతీయ జనాభా విధానం-2000 యొక్క లక్ష్యాలు ఏమిటి?

16.8 పారిభాషిక పదకోశం

1. జనన రేటు: ఒక నిర్దిష్ట సమయంలో ఒక ప్రాంతంలో ప్రతి 1000 జనాభాకు అదనంగా వచ్చిన జననాల సంఖ్య.
2. మరణాల రేటు: ఒక నిర్దిష్ట సమయంలో ఇచ్చిన ప్రాంతంలో ప్రతి 1000 మంది జనాభాలో మరణాల సంఖ్య.
3. సంతానోత్పత్తి రేటు: 15-49 సంవత్సరాల వయస్సు గల 1000 మంది మహిళలకు పిల్లలను కనే జననాల సంఖ్య.
4. శిశు మరణాల రేటు: ప్రతి 1000 సజీవ జననాలకు ఒక సంవత్సరం కంటే తక్కువ వయస్సు ఉన్న శిశువుల మరణాల సంఖ్య.
5. ప్రసూతి మరణాలు: ప్రతి 1000 మందిలో ప్రసూతి సమయంలో చనిపోతున్న స్త్రీలసంఖ్య.
6. లింగ నిష్పత్తి: ఒక నిర్దిష్ట కాల వ్యవధిలో ఓకే ప్రాంతంలో ప్రతి 1000 మంది పురుషులకు స్త్రీలన ంఖ్య.
7. వయస్సుల వారీ జనాభా - మొత్తం జనాభాకు సంబంధించి వివిధ వయస్సుల సమూహాలలో వ్యక్తుల నిష్పత్తి.
8. డిపెండెన్సీ రేషియో: పని చేసే వయస్సు సమూహంపై (అంటే 15 - 64 సంవత్సరాలు) ఆధారపడిన వారి (వృద్ధులు మరియు పిల్లలు) నిష్పత్తి
9. ఆయుర్దాయం: ఇది సగటు వ్యక్తి జీవించి ఉంటారని అంచనా వేయబడిన సంవత్సర సంఖ్యను సూచిస్తుంది.

16.9 ఉపయుక్త గ్రంథాలు

1. Text book for Intermediate Second Year Economics. TSBIE, Telangana.
2. Text book of Social Studies, Class X. TOSS
3. Text book of Social Studies, Class X. SCERT Telangana
4. NCERT Class 11, 12 Economics
6. https://nhm.gov.in/New_Updates_2018/Report_Population_Projection.
7. BA III year Economics, BRAOU
8. BA Economics, IGNOU

అధ్యాయం

17

మానవ వనరుల అభివృద్ధి

17.0 లక్ష్యాలు

17.1 పరిచయం

17.2 మానవ మూలధనం మరియు మానవ వనరుల అభివృద్ధి

17.3 మానవ వనరుల అభివృద్ధి భావన

17.4 మానవ వనరుల అభివృద్ధి యొక్క ప్రాముఖ్యత

17.5 దేశఆర్థికాభివృద్ధిలో విద్య మరియు ఆరోగ్యం యొక్క పాత్ర

17.5.1 భారత దేశంలో విద్య మరియు మానవ వనరుల అభివృద్ధి

17.5.2 మానవ వనరుల అభివృద్ధిని ప్రోత్సహించడం కొరకు భారత ప్రభుత్వం చేసిన కొన్ని ముఖ్యమైన విద్యా విధానాలు

17.5.3 భారతదేశంలో ఆరోగ్యం మరియు మానవ అభివృద్ధి

17.5.4 భారత ప్రభుత్వం ద్వారా ప్రారంభించబడ్డ కొన్ని ముఖ్యమైన ఆరోగ్య పథకాలు మరియు విధానాలు

17.6 మానవాభివృద్ధి సూచిక (HDI)

17.6.1 మానవాభివృద్ధి సూచికలోని భాగాలు

17.6.2 మానవాభివృద్ధి సూచిక నిర్మాణం

17.6.3 HDI మరియు దేశాల వర్గీకరణ

17.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

17.8 పదకోశం

17.9 ఉపయుక్త గ్రంథాలు

17.0 లక్ష్యాలు

- మానవ అభివృద్ధి యొక్క భావనను అర్థం చేసుకుంటారు.
- మానవ మూలధనం మరియు మానవ అభివృద్ధి యొక్క భావనలను తెలుసుకుంటారు.
- భారతదేశంలో మానవాభివృద్ధిలో విద్య యొక్క ప్రాముఖ్యతను తెలుసుకుంటారు.
- భారతదేశంలో మానవాభివృద్ధిలో ఆరోగ్యం యొక్క పాత్రను తెలుసుకుంటారు.
- మానవ అభివృద్ధి మరియు ఆర్థికాభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటారు.
- మానవ అభివృద్ధి సూచికను ఎలా నిర్మిస్తారో తెలుసుకుంటారు.
- ఒక దేశం యొక్క మానవ అభివృద్ధి గణన మరియు ఆర్థికాభివృద్ధి మధ్య సంబంధాన్ని మీరు అర్థం చేసుకుంటారు.

17.1 పరిచయం

దేశ ఆర్థికాభివృద్ధి అనేది సంక్లిష్టమైన మరియు దీర్ఘకాలిక ప్రక్రియ. సహజ వనరులు, జనాభా పరిమాణం, మూలధన సంచయనం, మానవ వనరులు, సామాజిక వాతావరణం, విదేశీ వాణిజ్యం మొదలైన వివిధ కారకాలచే ఇది ప్రభావితమవుతుంది. ఒక దేశం యొక్క ఆర్థిక అభివృద్ధిని నిర్ణయించే కారకాలలో మానవ వనరులు ఒకటి. ఇది ఆర్థికాభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ప్రజలను ఆస్తులు లేదా వనరులుగా పరిగణించడం గురించి ఒక ప్రధాన ఆందోళన ఏమిటంటే, వారు వస్తువుగా/కమోడిటైజ్ చేయబడతారు మరియు దుర్వినియోగం చేయబడతారు. మానవులు "సరుకులు" లేదా "వనరులు" కాదు, కానీ ఉత్పాదక సంస్థలో సృజనాత్మకతను జోడిస్తారు. ఆర్థికవేత్తలు తరచుగా జనాభాను అభివృద్ధి కార్యకలాపాలకు సహాయపడే అంశంగా కాకుండా పెరుగుదలకు అడ్డంకిగా చూస్తారు. అయితే, మానవుడు ఉత్పత్తికి శ్రామిక శక్తిని అందిస్తాడు. ఒక దేశంలో శ్రమ సమర్థవంతంగా, యోగ్యంగా, నైపుణ్యంతో ఉంటే, ఎదుగుదలకు దోహదపడే దాని సామర్థ్యం నిర్ణయాత్మకంగా ఎక్కువగా ఉంటుంది.

17.2. మానవ మూలధనం మరియు మానవ వనరుల అభివృద్ధి

సాధారణంగా, మానవ మూలధనం మరియు మానవ అభివృద్ధి మానవ వనరులను వివరించడానికి ఉపయోగించబడతాయి. కాని వాటి మధ్య స్వల్ప వ్యత్యాసం ఉంది. మానవ మూలధనం అనేది సాపేక్షంగా సంకుచిత భావన, ఇది మానవులు ఆర్థిక వ్యవస్థకు తీసుకువచ్చే నైపుణ్యాలు, విద్య, జ్ఞానం, శిక్షణ, అనుభవం

మరియు సామర్థ్యాలను సూచిస్తుంది, అయితే ఆర్థిక వ్యవస్థలో మానవ అభివృద్ధి అనేది సాపేక్షంగా విస్తృతమైన భావన, ఇది ఆయుర్దాయం, విద్య మరియు తలసరి ఆదాయంతో సహా ఒక మిశ్రమ గణాంకం ద్వారా నిర్ణయించబడుతుంది.

ఆర్థికాభివృద్ధిలో మానవ మూలధనం యొక్క ప్రాముఖ్యతను భారతదేశం చాలా కాలం క్రితం గుర్తించింది. ఏడవ పంచవర్ష ప్రణాళిక ఇలా చెబుతుంది, "మానవ వనరుల అభివృద్ధి (మానవ మూలధనం చదవండి) ఏ అభివృద్ధి వ్యూహంలోనైనా, ప్రత్యేకించి అధిక జనాభా ఉన్న దేశంలో తప్పనిసరిగా ఒక కీలక పాత్రను వహిస్తుంది. మంచి మార్గాల్లో శిక్షణ పొంది, విద్యావంతులైన ఒక పెద్ద జనాభా, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడంలో మరియు సామాజిక మార్పును ఆశించిన దిశలలో నిర్ధారించడంలో ఒక ఆస్తిగా మారగలదు."

17.3. మానవ వనరుల అభివృద్ధి భావన

యు.ఎన్.డి.పి. యొక్క మానవాభివృద్ధి నివేదిక-1995 ప్రకారం, మానవ అభివృద్ధి అనేది ప్రజల ఎంపికలను విస్తృతం చేసే ప్రక్రియ మరియు సాధించిన శ్రేయస్సు స్థాయిని పెంచే ప్రక్రియ. పనితీరును మెరుగుపరచడం కొరకు సంస్థ అభివృద్ధి మరియు శిక్షణ మరియు అభివృద్ధి ద్వారా మానవ నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడం మరియు వెలికితీసే ప్రక్రియ.

ఇది భౌతిక పరిస్థితుల వైవిధ్యం ద్వారా వర్గీకరించబడే ప్రక్రియ. ఈ పరిస్థితులు అవసరాలు మరియు కోరికలను తీర్చే అవకాశాలను ప్రభావితం చేస్తాయి. వారు ప్రతి వ్యక్తి యొక్క భౌతిక మరియు మానసిక, జీవ మరియు సాంస్కృతిక, వ్యక్తిగత మరియు సామాజిక సామర్థ్యాలను కూడా అన్వేషిస్తారు మరియు గ్రహిస్తారు. మానవ అభివృద్ధి విధానం మానవ జీవితం యొక్క గొప్పదనాన్ని విస్తరించడం గురించి, మానవులు నివసించే ఆర్థిక వ్యవస్థ యొక్క గొప్పతనాన్ని మాత్రమే కాకుండా. ఇది వ్యక్తులు మరియు వారి అవకాశాలు మరియు ఎంపికలపై దృష్టి సారించే విధానం.

మహబూబ్-ఉల్-హక్ ప్రకారం, "ఆర్థిక వృద్ధి మరియు మానవ అభివృద్ధి మధ్యవ్యత్యాసం ఏమిటంటే, మొదటిది కేవలం ఒక ఎంపిక-ఆదాయం యొక్క విస్తరణపై మాత్రమే దృష్టి పెడుతుంది- రెండవది ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక లేదా రాజకీయ - అన్ని మానవ ఎంపికల విస్తరణను స్వీకరిస్తుంది."

17.4. మానవ వనరుల అభివృద్ధి యొక్క ప్రాముఖ్యత

ఆర్థిక వృద్ధి స్వయంచాలకంగా అందరికీ గొప్ప శ్రేయస్సుకు దారితీస్తుందని భావించడం కంటే మానవ అభివృద్ధి ప్రజల జీవితాలను మెరుగుపరచడంపై దృష్టి పెడుతుంది. ఆదాయ పెరుగుదలను ఒక గమ్యంగా కాకుండా, అభివృద్ధి సాధనంగా చూస్తారు. మానవ అభివృద్ధి అంటే ప్రజలు తాము విలువైన జీవితాలను గడపడానికి

మరింత స్వేచ్ఛను ఇవ్వడం. వాస్తవానికి దీని అర్థం ప్రజల సామర్థ్యాలను అభివృద్ధి చేయడం మరియు వాటిని ఉపయోగించడానికి వారికి అవకాశం ఇవ్వడం. ఉదాహరణకు, ఒక అమ్మాయికి విద్యాబుద్ధులు నేర్పించడం ఆమె నైపుణ్యాలను పెంపొందిస్తుంది, కానీ ఆమెకు ఉద్యోగాలకు ప్రాప్యత నిరాకరించబడినా, లేదా స్థానిక కార్మిక మార్కెట్ కు సరైన నైపుణ్యాలు లేకపోతే అది పెద్దగా ఉపయోగం లేదు.

మానవాభివృద్ధి అంతిమమైనది కాగా, ఆర్థికాభివృద్ధి ఈ లక్ష్యసాధనకు ఒక సాధనం మాత్రమే. అభివృద్ధి యొక్క మొత్తం అభ్యాసం యొక్క అంతిమ ఉద్దేశ్యం పురుషులు, మహిళలు మరియు పిల్లలు మరియు ప్రస్తుత మరియు భవిష్యత్తు తరాలను లక్ష్యాలుగా చూడటం, మానవ పరిస్థితిని మెరుగుపరచడం, ప్రజల ఎంపికలను విస్తరించడం. బాగా పోషణ, ఆరోగ్యకరమైన, విద్యావంతులు, నైపుణ్యం కలిగిన, అప్రమత్తమైన శ్రామిక శక్తి అత్యంత ముఖ్యమైన ఉత్పాదక ఆస్తి. అందువలన, పోషకాహారం, ఆరోగ్య సేవలు మరియు విద్యలో పెట్టుబడులు ఉత్పాదకత ఆధారంగా సమర్థించబడతాయి. మానవ అభివృద్ధి సమాజంలో పౌర అంతరాయాలను తగ్గించడానికి మరియు రాజకీయ సామాజిక స్థిరత్వాన్ని పెంచడానికి సహాయపడుతుంది. మానవ అభివృద్ధి ప్రాథమికంగా, మరింత ఎంపిక గురించి. ఇది ప్రజలకు అవకాశాలను అందించడం గురించి, వారు వాటిని ఉపయోగించుకోవాలని పట్టుబట్టడం కాదు. మానవ స0తోషానికి ఎవరూ హామీ ఇవ్వలేరు, ప్రజలు తీసుకునే నిర్ణయాలు వారి సొ0త స0బ0ధమైనవి. అభివృద్ధి ప్రక్రియ – మానవ అభివృద్ధి – కనీసం వ్యక్తిగతంగా మరియు సమిష్టిగా, వారి పూర్తి సామర్థ్యానికి అభివృద్ధి చెందడానికి మరియు వారు విలువైన ఉత్పాదక మరియు సృజనాత్మక జీవితాలను గడపడానికి సహేతుకమైన అవకాశాన్ని కలిగి ఉండటానికి ప్రజలకు ఒక వాతావరణాన్ని సృష్టించాలి.

17.5. ఒక దేశ ఆర్థికాభివృద్ధి లో విద్య మరియు ఆరోగ్యం పాత్ర

ఒక వ్యక్తి యొక్క అభివృద్ధికి ఎంత ముఖ్యమో, విద్య మరియు ఆరోగ్యం యొక్క పాత్ర ఒక దేశాభివృద్ధికి ఒక ముఖ్యమైన ఇన్‌పుట్‌గా పరిగణించబడుతుంది. ఆర్థికాభివృద్ధి అంటే ఒక దేశం యొక్క నిజమైన జాతీయ ఆదాయంలో పెరుగుదలబీ సహజంగానే, ఆర్థికాభివృద్ధికి విద్యావంతుడైన వ్యక్తి యొక్క సహకారం నిరక్షరాస్యుడైన వ్యక్తి కంటే ఎక్కువగా ఉంటుంది. ఒక ఆరోగ్యవంతమైన వ్యక్తి ఎక్కువ కాలం పాటు నిరంతరాయంగా శ్రమ సరఫరా చేయగలిగితే, అప్పుడు ఆర్థిక వృద్ధికి ఆరోగ్యం కూడా ఒక ముఖ్యమైన కారకం. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో, జనాభాలో అధిక భాగం దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్నారు, చాలా మంది ప్రజలు ప్రాథమిక విద్య మరియు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను పొందలేరు. అంతేకాక, భారతదేశ జనాభాలో గణనీయమైన విభాగం సూపర్ స్పెషాలిటీ ఆరోగ్య సంరక్షణ మరియు ఉన్నత విద్యను చేరుకోలేకపోయింది. ఇంకా, ప్రాథమిక విద్య మరియు ఆరోగ్య సంరక్షణ పౌరుల హక్కుగా భావించినప్పుడు, ప్రభుత్వం అర్హులైన పౌరులకు మరియు సామాజికంగా అణచివేతకు గురైన వర్గాలకు చెందిన వారికి విద్య మరియు ఆరోగ్య సేవలను ఉచితంగా అందించడం చాలా అవసరం.

17.5.1 భారతదేశంలో విద్య మరియు మానవ వనరుల అభివృద్ధి

ఒక దేశం యొక్క ఆర్థిక వృద్ధి మరియు అభివృద్ధిలో విద్య ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. విద్యలో పెట్టుబడులు ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తాయి. ఇది మరింత ఉత్పాదక శ్రామిక శక్తిని సృష్టించడానికి మరియు దానికి పెరిగిన జ్ఞానం మరియు నైపుణ్యాలను అందించడానికి మరియు ఉపాధ్యాయులు, పాఠశాల మరియు భవన నిర్మాణ కార్మికులు, పాఠ్యపుస్తకం మరియు పేపర్ ప్రింటర్లు, పాఠశాల యూనిఫాం తయారీదారులు మొదలైన వారికి విస్తృతమైన ఉపాధి మరియు ఆదాయ సంపాదన అవకాశాలను అందించడానికి సహాయపడుతుంది. ఇది ప్రాథమిక నైపుణ్యాలను అందిస్తుంది మరియు జనాభాలోని విభిన్న విభాగాలలో ఆధునిక దృక్పథాలను ప్రోత్సహిస్తుంది. విద్యను ఒక గొప్ప సమానత్వ చర్యగా చూస్తారు, ఇది ఒక వైపు మానవ వనరులను మెరుగుపరచడంలో సహాయపడుతుంది మరియు మరోవైపు అణగారిన మరియు పేద వర్గాల ప్రజలు తమ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవడానికి వీలు కల్పిస్తుంది.

ప్రజల ఆలోచనా విధానాలను ఆధునీకరించడానికి మరియు విప్లవాత్మకంగా మార్చడానికి విద్య సహాయపడుతుంది. ఇది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాల్సిన అవసరాన్ని మరియు ఈ ప్రయోజనం కోసం, వారి కుటుంబాల పరిమాణాన్ని పరిమితం చేయాల్సిన అవసరాన్ని వారికి తెలియజేస్తుంది. అందువల్ల, ఇది దీర్ఘకాలంలో కుటుంబ నియంత్రణకు ఉత్తమ పద్ధతిగా పనిచేస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో చాలా వరకు పేద ప్రజల మానవ సామర్థ్యాలను మెరుగుపరుస్తాయని మరియు వారి కుటుంబ సంపాదనను పెంచడానికి వీలు కల్పిస్తాయనే ఆశతో సార్వత్రిక విద్య యొక్క వివిధ కార్యక్రమాలను ప్రారంభించాయి.

2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ సగటు అక్షరాస్యత రేటు 73.04%. పురుషులలో అక్షరాస్యత రేటు 82.14%, స్త్రీలలో 65.46%. కేరళలో అత్యధిక అక్షరాస్యత రేటు 93.91 శాతం ఉండగా, లక్షద్వీప్ (92.28 శాతం), మిజోరాం (91.58 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్ (66.95 శాతం), రాజస్థాన్ (67.06 శాతం) తర్వాత 63.82 శాతం అక్షరాస్యత రేటుతో బీహార్ దేశంలో చివరి స్థానంలో ఉంది.

17.5.2. మానవ వనరుల అభివృద్ధి కోసం భారత ప్రభుత్వం ప్రారంభించిన కొన్ని ముఖ్యమైన విద్యా కార్యక్రమాలు మరియు విధానాలు

కొఠారీ కమీషన్ చేసిన సిఫార్సుల ఆధారంగా భారత ప్రభుత్వం1968లో మొదటి జాతీయ విద్యా విధానాన్ని ప్రకటించింది. జాతీయ సమైక్యతను సాధించడానికి మరియు గొప్ప సాంస్కృతిక మరియు ఆర్థిక అభివృద్ధిని సాధించడానికి మరియు14 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలందరికీ నిర్బంధ విద్యను నెరవేర్చడానికి ఇది సమాన విద్యావకాశాలను ప్రతిపాదించింది.

భారత ప్రభుత్వం 1986లో విద్యపై ఒక నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది ప్రాథమిక విద్య మరియు వయోజన విద్య యొక్క సార్వజనీకరణకు ప్రాధాన్యతను ఇచ్చింది. విద్య యొక్క గుణాత్మక మెరుగుదలకు ఇది అధిక ప్రాధాన్యత ఇచ్చింది. తరువాత ఈ విధానాన్ని 1992లో సవరించారు. విద్యలో ఏకరూపతను తీసుకురావడానికి, వయోజన విద్యా కార్యక్రమాలను ఒక ప్రజా ఉద్యమంగా మార్చడానికి, ప్రాథమిక విద్యలో నాణ్యతను అందించడానికి సవరించిన విధానం తెలుపుతుంది. తరువాత, విద్యా మంత్రిత్వ శాఖ 29.07.2020న జాతీయ విద్యా విధానం 2020 (ఎన్.ఇ.పి. 2020) ను ప్రకటించింది, ఇది 21వ శతాబ్దంలో మొదటి విద్యా విధానం మరియు మన దేశంలో పెరుగుతున్న అనేక అభివృద్ధి ఆవశ్యకతలను పరిష్కరించడానికి లక్ష్యంగా పెట్టుకుంది. 21వ శతాబ్దపు విద్య యొక్క ఆకాంక్షాత్మక లక్ష్యాలకు అనుగుణంగా ఒక కొత్త వ్యవస్థను రూపొందించడానికి, దాని నియంత్రణ మరియు పాలనతో సహా విద్యా నిర్మాణం యొక్క అన్ని అంశాలను పునఃసమీక్షించడం మరియు పునరుద్ధరించడం ఈ విధానం ప్రతిపాదిస్తుంది.

ఉచిత మరియు నిర్బంధ విద్యకు పిల్లల హక్కు - 2009 చట్టం, ఇది 2009 ఆగస్టు 4న పార్లమెంటుచే ఆమోదించబడింది. ఈ చట్టం ప్రకారం, 6-14 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ప్రతి బిడ్డకు ప్రాథమిక విద్య మొదలైనవి పూర్తయ్యే వరకు పొరుగున ఉన్న పాఠశాలలో ఉచిత మరియు నిర్బంధ విద్యను పొందే హక్కు ఉంటుంది.

భారత ప్రభుత్వం 1995లో పాఠశాలల్లో ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత మరియు సాంకేతిక విద్యా పథకాలు వంటి అనేక పథకాలు మరియు కార్యక్రమాలను ప్రారంభించింది. అవి జాతీయ మధ్యాహ్న భోజన కార్యక్రమం, 2001లో సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)-2004లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పథకం, 2014లో 'పడే భారత్ - బడే భారత్' కార్యక్రమం-2015లో 'బేటీ బచావో-బేటీ పడావో' (బీబీబీపీ) పథకం మొదలైనవి.

17.5.3. భారతదేశంలోఆరోగ్యం మరియు మానవాభివృద్ధి

మానవ పెట్టుబడి నాణ్యతను మెరుగుపరచడంలో ఆరోగ్యం యొక్క పాత్ర కూడా ఎక్కువ మరియు ఇది కార్మిక ఉత్పాదకతను పెంచుతుంది. ఆరోగ్యవంతమైన వ్యక్తి తన పనిని సరైన మరియు సమర్థవంతమైన రీతిలో చేయగలుగుతాడు. అనారోగ్యకరమైన వ్యక్తితో పోలిస్తే ఆరోగ్యకరమైన వ్యక్తి సమాజానికి ఎక్కువ సహకారం అందిస్తాడు. కార్మికుల ఆరోగ్యంమెరుగ్గా ఉంటే జాతీయ ఉత్పత్తి కూడా పెరుగుతుంది. అందువల్ల, ఉత్పాదక శ్రామిక శక్తిని నిర్మించడానికి మరియు నిర్వహించడానికి మరియు ప్రజల జీవితాలను మరియు సమాజం యొక్క నాణ్యతను మెరుగుపరచడంలో ఆరోగ్యంపై వ్యయం ముఖ్యమైనవి.

భారతదేశంలో సాధారణ ఆరోగ్య ప్రమాణం చాలా తక్కువగా ఉంది. దేశంలో అనారోగ్యాల యొక్క అధిక సంభవంలో ఇది స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. పోషకాహార లోపం, తగినంత వైద్య సంరక్షణ లేకపోవడం మరియు అపరిశుభ్రమైన పరిస్థితుల్లో జీవించడం దీనికి ప్రధాన కారణాలు. రోజుకు రెండు పూటలా భోజనాలు కూడా పొందని వ్యక్తులు, సమతుల మరియు పోషకమైన ఆహారం గురించి కలలు కనలేరు.దేశంలో ఆరోగ్య ప్రమాణాలను పెంచడానికి భారత ప్రభుత్వం తన కార్యక్రమాన్ని సిద్ధం చేసింది. గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న వారితో సహా పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ మరియు వైద్య సంరక్షణ సేవలను అందించడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రారంభించింది.

17.5.4. భారత ప్రభుత్వంచే ప్రారంభించబడిన కొన్ని ఆరోగ్య పథకాలు మరియు విధానాలు

చవకైన, విశ్వసనీయమైన తృతీయ ఆరోగ్య సంరక్షణ సేవల లభ్యతలో ప్రాంతీయ అసమతుల్యతలను సరిదిద్దడం మరియు దేశంలో నాణ్యమైన వైద్య విద్య కోసం సౌకర్యాలను పెంపొందించడం వంటి లక్ష్యాలతో ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన (పి.ఎం.ఎస్.ఎస్.వై)ని 2003లో ప్రకటించారు.

జననీ సురక్షా యోజన (జెఎస్‌వై) 12 ఏప్రిల్ 2005న కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రారంభించింది. పేద గర్భిణీ స్త్రీలలో సంస్థాగత కాన్పులను (డెలివరీ) ప్రోత్సహించడం ద్వారా ప్రసూతి మరియు నవజాత శిశువుల మరణాలను తగ్గించే లక్ష్యంతో ఇది అమలు చేయబడుతోంది.

2013లో నేషనల్ హెల్త్ మిషన్ ప్రారంభించబడింది. ప్రత్యేకించి జనాభాలోని పేదలు మరియు బలహీన వర్గాలకు సమానమైన, చౌకైన మరియు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందరికీ అందేటట్లు వీలు కల్పిస్తుంది.

స్వచ్ఛ భారత్ మిషన్- గ్రామీణ్: సార్వజనీన పారిశుధ్యను సాధించే ప్రయత్నాల ను వేగవంతం చేయడానికి మరియు పారిశుధ్యంపై దృష్టి సారించడం కోసం భారత ప్రధాన మంత్రి దీనిని 2014 అక్టోబర్ 2న ప్రారంభించారు. మహాత్మాగాంధీ 150వ జయంతి అయిన అక్టోబర్ 2, 2019 నాటికి భారతదేశంలోని అన్ని గ్రామాలు, గ్రామ పంచాయితీలు, జిల్లాలు, రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు, గ్రామీణ భారతదేశంలో 100 మిలియన్లకు పైగా మరుగుదొడ్లను నిర్మించడం ద్వారా తమను తాము "బహిరంగ మలవిసర్జన రహితం" (ODF) గా ప్రకటించుకున్నాయి.

జాతీయ ఆరోగ్య విధానం 2017, దీనికి 2017 మార్చి 15న ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అన్ని అభివృద్ధి విధానాల్లో నివారణ మరియు ప్రోత్సాహక ఆరోగ్య సంరక్షణ దృక్పథం ద్వారా అన్ని వయస్సుల వారికి సాధ్యమైనంత ఎక్కువ స్థాయి ఆరోగ్యం మరియు శ్రేయస్సును సాధించడం మరియు పర్యవసానంగా ఎవరూ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోకుండా, మంచి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందరికీ లభించేలా చేయడం ఈ పథక ఉద్దేశ్యం.

ఆయుష్మాన్ భారత్ – జాతీయ ఆరోగ్య రక్షణ మిషన్, దీనిని భారత ప్రధాన మంత్రి 23 సెప్టెంబర్ 2018న ప్రారంభించారు. ద్వితీయ మరియు తృతీయ కేర్ హాస్పిటలైజేషన్ కొరకు ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 5 లక్షల రూపాయల వరకు కవరేజీని అందించే 10 కోట్లకు పైగా పేద మరియు నిస్సహాయ కుటుంబాలకు (సుమారు 50 కోట్ల మంది లబ్ధిదారులు) ఇది వర్తిస్తుంది. ఆయుష్మాన్ భారత్ – జాతీయ ఆరోగ్య సంరక్షణ మిషన్ ఇందులో ప్రస్తుతం కొనసాగుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాలైన రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్ ఎస్ బివై) మరియు సీనియర్ సిటిజెన్ హెల్త్ ఇన్స్యూరెన్స్ స్కీమ్ (ఎస్.సి.ఐ.ఎస్)లను విలీనం చేశారు.

17.6. మానవాభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)

తలసరి ఆదాయం, ఆరోగ్యం మరియు విద్య అనే మూడు విస్తృత రంగాలలో ఆర్థికాభివృద్ధిని కొలవడానికి ఒక మార్గాన్ని అందించడానికి ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్డిపి) లో భాగంగా మానవ అభివృద్ధి సూచిక (హెచ్.డి.ఐ.) అనే భావనను 1990 లో ప్రవేశపెట్టారు. హెచ్.డి.ఐ.ని పాకిస్తాన్ ఆర్థికవేత్త మహబుబ్–ఉల్–హక్ రూపొందించి ప్రారంభించారు, తరువాత 1990 లో భారత ఆర్థికవేత్త అమర్త్య కుమార్ సేన్ తరువాత ప్రారంభించారు. హెచ్.డి.ఐ. కాలక్రమేణా దేశాల అభివృద్ధి స్థాయిలో మార్పులను ట్రాక్ చేస్తుంది. ప్రతి సంవత్సరం, యు.ఎన్.డి.పి ఒక అభివృద్ధి నివేదికను తయారు చేస్తుంది. ఇది సంవత్సరంలో మార్పుల నవీకరణను అందిస్తుంది, గ్లోబల్ వార్మింగ్ మరియు అభివృద్ధి, మరియు వలసలు మరియు అభివృద్ధి వంటి ఒక ప్రత్యేక ఇతివృత్తంపై ఒక నివేదికను అందిస్తుంది. మానవాభివృద్ధి సూచికఅనేక విషయాల్లో సమాజం యొక్క వాస్తవ స్థితిపై గణనీయమైన అవగాహనను జోడిస్తుంది. ఈ సూచిక జాతీయ వృద్ధి కంటే గణనీయమైన, విస్తృత భావన మరియు సామాజిక మరియు ఆర్థిక కారకాల శ్రేణిని కలిగి ఉంటుంది. హెచ్.డి.ఐ. విలువ 0 నుండి 1 వరకు ఉంటుంది. (0 అంటే అభివృద్ధి లేమి లేదా చెత్త పనితీరు మరియు 1 అంటే సంపూర్ణ అభివృద్ధి లేదా ఉత్తమ పనితీరు).

17.6.1. మానవాభివృద్ధి సూచికలోని భాగాలు

మానవ అభివృద్ధి సూచిక, ఇది మూడు భాగాలపై ఆధారపడి ఉంటుంది. ఇవి

(ఎ) సుదీర్ఘమైన మరియు ఆరోగ్యకరమైన జీవితం (పుట్టుకతోనే ఆయుర్దాయం ద్వారా కొలుస్తారు)

(బి) విద్య అనేది దీని యొక్క సగటు భారత్వం ద్వారా లెక్కించబడుతుంది

i) వయోజన అక్షరాస్యత రేట్లు (ఈ ప్రమాణాలకు 2/3 వంతు ఇవ్వబడుతుంది)

ii) పాఠశాల విద్య యొక్క సంవత్సరాలు (ఈ ప్రమాణాలకు 1/3 వంతు ఇవ్వబడుతుంది)

iii) జీవన ప్రమాణం (GDP తలసరి ఆదాయం ద్వారా కొలుస్తారు (PPP US$ లో)

పట్టిక–1: మానవాభివృద్ధి సూచికను లెక్కించుటకు కొలతలు

కొలతలు	సూచికలు	డైమెన్షన్ ఇండెక్స్	కనీస విలువ	గరిష్ఠ విలువ
దీర్ఘ మరియు ఆరోగ్యకరమైన జీవితం	ఆయుర్దాయం	ఆయుర్దాయం సూచిక	20	85
జ్ఞానం	–ఆశించబడుతున్న సంవత్సరాల పాఠశాల విద్య	విద్యా సూచిక	0	18
	– పాఠశాల విద్య యొక్క సగటు సంవత్సరాలు		0	15
జీవన ప్రమాణం	జి.ఎన్.ఐ తలసరి (PPP US$)	GNI సూచిక	100 US $	75,000 US $

మూలం: యు.ఎన్.డి.పి యొక్క మానవ అభివృద్ధి నివేదిక 2020

గమనిక: పిపిపి అంటే కొనుగోలు శక్తి సమానత్వం, ఇది వివిధ దేశాలలోని ధరల యొక్క కొలత, ఇది దేశాల కరెన్సీల యొక్క సంపూర్ణ కొనుగోలు శక్తిని పోల్చడానికి నిర్దిష్ట వస్తువుల ధరలను ఉపయోగిస్తుంది.

17.6.2. మానవాభివృద్ధి సూచిక నిర్మాణం

HDI అనేది మానవ అభివృద్ధి యొక్క సారాంశం కొలత, ఇది మానవ అభివృద్ధి యొక్క మూడు ప్రాథమిక కోణాల్లో ఒక దేశంలో సాధించిన సగటు విజయాలను కొలుస్తుంది. ఆయుర్దాయం ద్వారా ఆరోగ్య పరిమాణం మదింపు చేయబడుతుందని పట్టిక–1 తెలియజేస్తుంది. 25 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పెద్దలకు పాఠశాల విద్య యొక్క సంవత్సరాల సగటు మరియు వయస్సులోనికి ప్రవేశించే స్కూలు పిల్లల కొరకు ఆశించబడే సంవత్సరాల స్కూలు విద్య యొక్క సగటు ద్వారా లెక్కించబడుతుంది. జీవన ప్రమాణ కొలత తలసరి స్థూల జాతీయ ఆదాయంతో కొలవబడుతుంది. మొదటి దశ ప్రతి డైమెన్షన్‌కు సబ్–ఇండెక్స్‌లను సృష్టించడం. సూచికలను 0 నుండి 1 (సున్నా నుండి ఒకటి వరకు) మధ్య సూచికలుగా మార్చడానికి కనీస మరియు గరిష్ఠ విలువలను లెక్కించాలి. ప్రతి డైమెన్షన్ ఇండెక్స్ దిగువ పేర్కొన్నవిధంగా లెక్కించబడుతుంది.

డైమెన్షన్ ఇండెక్స్ = (వాస్తవ విలువ – కనిష్ఠ విలువ)/(గరిష్ఠ విలువ – కనిష్ఠ విలువ)

17.6.3. హెచ్.డి.ఐ మరియు దేశాల వర్గీకరణ

దేశం అభివృద్ధి చెందిందా, అభివృద్ధి చెందుతోందా మరియు వెనకబడిందా అనే విషయాన్ని గుర్తించడానికి ఈ సూచిక ఉపయోగించబడుతుంది. హెచ్.డి.ఐ విలువల ఆధారంగా, దేశాలు మూడు గ్రూపులుగా వర్గీకరించబడ్డాయి. అవి,

ఎ) హెచ్.డి.ఐ విలువ 0.80 మరియు ఆపైన ఉంటే ఆ దేశాలు అధిక మానవ అభివృద్ధి దేశాలు,

బి) హెచ్.డి.ఐ విలువ 0.50 నుంచి 0.79 వరకు ఉంటే మధ్యస్థ మానవ అభివృద్ధి దేశాలు, మరియు

సి) హెచ్.డి.ఐ విలువ 0.50 కంటే తక్కువ ఉంటే తక్కువ మానవ అభివృద్ధి దేశాలు.

17.7. మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. మానవ అభివృద్ధిని నిర్వచించండి.
2. హెచ్.డి.ఐ. యొక్క భాగాలు ఏవి?
3. పి.పి.పి.ని విస్తరించండి.
4. జె.ఎస్.వై అంటే ఏమిటి?

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. మానవాభివృద్ధిలో విద్య పాత్రను వివరించండి.
2. మానవాభివృద్ధిలో ఆరోగ్యం పాత్రను వివరించండి.
3. మానవాభివృద్ధి యొక్క ప్రాముఖ్యత గురించి రాయండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. భారతదేశంలో ఆర్థికాభివృద్ధిలో విద్య, ఆరోగ్యాల పాత్ర ఏమిటి?
2. మానవాభివృద్ధి సూచికను నిర్వచించండి మరియు దానిని ఎలా లెక్కించాలి?

17.8. పదకోశం

- మానవ మూలధనం: ఇది సాపేక్షంగా సంకుచిత భావన. ఇది మానవులు ఒక కంపెనీకి తీసుకువచ్చే నైపుణ్యాలు, విద్య, జ్ఞానం, శిక్షణ, అనుభవం మరియు సామర్థ్యాలను సూచిస్తుంది.

- మానవ అభివృద్ధి: ఇది సాపేక్షంగా విస్తృత భావన, ఇది ఆయుర్దాయం, విద్య మరియు తలసరి ఆదాయంతో కూడిన సమ్మిళిత గణాంకం ద్వారా నిర్ణయించబడుతుంది.
- కొనుగోలు శక్తి సమానత్వం (పిపిపి): దీని ఇది వివిధ దేశాలలో ధరల యొక్క కొలత, ఇది దేశాల కరెన్సీల యొక్క సంపూర్ణ కొనుగోలు శక్తిని పోల్చడానికి నిర్దిష్ట వస్తువుల ధరలను ఉపయోగిస్తుంది.
- మానవ వనరుల అభివృద్ధి (హెచ్ ఆర్ డి): మానవ వనరుల అభివృద్ధిలో ఒక వ్యక్తి మొదట నియమించబడిన తరువాత శిక్షణ ఇవ్వడం, కొత్త నైపుణ్యాలను నేర్చుకునే అవకాశాలను కల్పించడం, ఉద్యోగి యొక్క పనులకు ప్రయోజనకరమైన వనరులను పంపిణీ చేయడం మరియు ఏదైనా ఇతర అభివృద్ధి కార్యకలాపాలు ఉంటాయి. హెచ్.ఆర్.డి (హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్) ప్రజలను మరింత నైపుణ్యం కలిగినదిగా చేస్తుంది.

17.9.ఉపయుక్త గ్రంథాలు

1. వి.కె.మిశ్రా, ఎస్.కె.పూరి రచించిన ఇండియా ఎకానమీ
2. ఆంధ్రప్రదేశ్ ఎకానమీ అండ్ డెవలప్ మెంట్ – తెలుగు అకాడమీ
3. తెలంగాణ సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్ –2022
4. హ్యూమన్ డెవలప్మెంట్ రిపోర్ట్ 2020 – యు.ఎన్.డి.పి.

అధ్యాయం 18

జాతీయాదాయ పోకడలు, వివిధ రంగాల వాటా

18.0. లక్ష్యాలు

18.1. పరిచయం

18.2. భారతదేశంలో జాతీయాదాయ అంచనాల చరిత్ర

18.3. జాతీయాదాయ మరియు తలసరి ఆదాయ పోకడలు

18.4. జాతీయాదాయానికి వివిధ రంగాల వాటా

18.5. ప్రాథమిక, ద్వితీయ మరియు తృతీయ రంగాల వాటా

18.6. సారాంశం

18.7. మాదిరి పరీక్ష ప్రశ్నలు

18.8. పారిభాషిక పదజాలం

18.9. ఉపయుక్త గ్రంథాలు

18.0. లక్ష్యాలు

- జాతీయాదాయం యొక్క అర్థాన్ని తెలుపుతారు.
- జాతీయాదాయ ధోరణులు తెలుసుకుంటారు.
- భారతదేశంలో జాతీయాదాయా అంచనాలను వివరిస్తారు.
- స్థూలాదేశీయోత్పత్తిలో తలసరి ఆదాయంలో వృద్ధిని గురించి తెలుసుకుంటారు.
- జాతీయాదాయంలో వివిధరంగాల వాటాల గురించి తెలుసుకుంటారు.
- భారత ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల ప్రాధాన్యతను వివరిస్తారు.

18.1. పరిచయం

స్థూల అర్థశాస్త్రంలో జాతీయాదాయ విశ్లేషణ అతిముఖ్యమైన భావన. ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవల విలువలను ఆ దేశపు జాతీయదాయం అంటారు. ఈ పాఠం భారతదేశంలో జాతీయ ఆదాయ అంచనాల చరిత్రను తెలియచేస్తుంది. జాతీయాదాయం, పోకడలు, తలసరి ఆదాయంలో, మార్పులు, స్థూలదేశీయోత్పత్తిలో వృద్ధి, వివిధ సంవత్సరాలలో తలసరి ఆదాయంలో వృద్ధి జాతీయాదాయానికి వివిధ రంగాల వాటా గురించి చర్చిస్తాము.

వివిధ కాలాలలో జాతీయాదాయ పోకడలు దేశ ఆర్థికాభివృద్ధిని ప్రతిబింబిస్తాయి. జాతీయాదాయ వాటాలో వివిధ రంగాలలో వచ్చిన మార్పులు, భారతదేశ జాతీయాదాయంలో సేవా రంగాల యొక్క ప్రభావం, జాతీయాదాయంలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల వాటా ప్రణాళిక రచనకు ముందు ప్రభుత్వ రంగ వాటా జాతీయాదాయంలో చాలా తక్కువ కాని ప్రణాళికల ప్రారంభం నుండి ప్రభుత్వ రంగం వాటా క్రమంగా పెరిగింది. అనే అంశాలను ఈ పాఠ్యంలో చర్చిద్దాం.

18.2. భారతదేశంలో జాతీయాదాయ అంచన:-

స్వాతంత్ర్యానికి పూర్వమే భారతదేశంలో మొట్టమొదటిసారిగా దాదాబాయి నౌరోజి 1867-68 తన గ్రంథం అయిన ''The Poverty in British Rule in India'' లో జాతీయాదాయాన్ని అంచన వేశారు. ఈయన ప్రకారం 1867-68లో భారతదేశ తలసరి ఆదాయం 20/- రూపాయలు. ఈయన తరువాత అనేక మంది ఆర్థికవేత్తలు జాతీయాదాయాన్ని అంచనా వేశారు. వారిలో పేరొందిన వారు విలియం దిగ్బి 1899, ఫెండ్లె షిరాస్. 1911-92, షో మరియు కంబ్బట్ట 1921, ఆర్.సి. దేశాయ్ 1931-40 తన గ్రంథం అయిన "భారతదేశంలో వినియోగదారుని వ్యయం"లో అంచన వేశారు. మొట్టమొదటిసారిగా జాతీయాదాయాన్ని శాస్త్రీయంగా లెక్కించిన ఆర్థికవేత్త ఆచార్య డా॥ వి.ఆర్.కె.వి. రావు. (విజయేంద్ర కస్తూరి రంగ వరద రాజరావు) 1931-32లో ఈయన ఆర్థిక వ్యవస్థను వివిధ రంగాలుగా విభజన చేసి జాతీయాదాయాన్ని అంచనా వేశారు. డా॥ వి.కె.ఆర్.వి. రావు ప్రకారం 1932లో భారతదేశ జాతీయాదాయం 1689 కోట్లు మరియు తలసరి ఆదాయం 62 రూపాయలు.

స్వాతంత్ర్యానంతరము భారత ప్రభుత్వం 1949 ఆగస్టు 4న ముగ్గురు సభ్యులు గల జాతీయాదాయ అంచనాల సంఘం "National Income Estimation Committee" వేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా ఆచార్య పి.సి. మహలనోబిస్ సభ్యులుగా, ఆచార్య డా॥ వి.కె.ఆర్.వి. రావు, ఆచార్య డి.ఆర్. గాడ్గిల్ ఉన్నారు. వీరు 1948-49, 1949-50, 1950-51 సంవత్సరాల జాతీయాదాయాన్ని అంచనా వేసి వారి మొదటి రిపోర్ట్‌ను 1954లో సమర్పించారు. వారి సూచనాల మేరకు 1954లో భారత ప్రభుత్వం CSO (Central Statistical Organisation) కేంద్ర గణాంక సంస్థను స్థాపించినారు. 1948-49లో భారతదేశ జాతీయాదాయం 8710 కోట్లు మరియు తలసరి ఆదాయం 225 రూపాయలు. జాతీయాదాయ అంచనాలకు ఏదైన సాధారణ సంవత్సరాన్ని ఆధార సంవత్సరంగా రాసుకొని అంచనాలు వేస్తారు. ప్రతి కొన్ని సంవత్సరాలకు ఈ ఆధార సంవత్సరాన్ని మారుస్తూ ఉంటారు. ప్రస్తుతం NSO నవ్యశ్రేణుల ద్వార జాతీయాదాయాన్ని అంచనా వేస్తుంది. ప్రస్తుత నవ్యశ్రేణుల ఆధార సంవత్సరం 2011-12.

18.3. భారతదేశంలో జాతీయాదాయ, తలసరి ఆదాయ పోకడలు:-

భారతదేశంలో ప్రణాళీకీకరణ ప్రభావాన్ని అర్థం చేసుకోవాలి అంటే జాతీయాదాయంలోని పోకడలను అధ్యయనం చేయవలసిన అవశ్యకత ఎంతయిన ఉంది. గడిచిన 70 సంవత్సరాల ప్రణాళీకీకరణ కాలంలో జాతీయోత్పత్తిలో మార్పును, తలసరి ఆదాయ ధోరణీలో వచ్చిన మార్పులను అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. మొదట ప్రస్తుత ధరలలో జాతీయాదాయాన్ని మరియు తలసరి ఆదాయాన్ని గణించి తరువాత స్థిర ధరలలోకి మార్చడం వల్ల వాస్తవిక జాతీయాదాయం వస్తుంది. స్థిర ధరల వద్ద తలసరి ఆదాయంలో పెరుగుదల ప్రజల జీవన ప్రమాణస్థాయిని తెలియజేస్తుంది. ఏది ఏమైనప్పటికీ, ఉత్పత్తి కారకాల దృష్ట్యా తలసరి నికర జాతీయోత్పత్తి లాగానే తలసరి జాతీయాదాయంలోని ధోరణులు పరిశీలించడం వల్ల ఆర్థిక వ్యవస్థ పని తీరును కచ్చితంగా చెప్పగలం.

పట్టిక 18.1: నికర జాతీయాదాయం మరియు తలసరి ఆదాయం

సంవత్సరము	జాతీయాదాయము (కోట్లలో)		తలసరి ఆదాయం (రూపాయిలలో)	
	ప్రస్తుత ధరల వద్ద	స్థిరధరల వద్ద	ప్రస్తుత ధరలవద్ద	స్థిరధరల వద్ద
2011-12 శ్రేణులు				
1950-51	9531	448483	265	12493
1980-81	135470	1352931	1995	19925
1999-2000	1779304	3800560	17775	37968
2010-11	6756720	7373384	56971	62170
2015-16	12162398	9963681	94797	77659
2016-17	13623936	10782092	104880	83003
2017-18	15140418	11508774	115224	87586
2018-19[3rd RE]	16713054	12226019	125946	92133
2019-20[2nd RE]	17716597	12641633	132115	94270
2020-21 [1st RE]	17194158	11536004	126855	85110
2021-22 [PE]	20529727	12519976	150007	91481
2022-23 [AE]	23594934	13347932	170620	96522

RE: Revised Estimates; PE: Provisional Estimates; AE: Advanced Estimates

Source: i) National Statistical Office 2022

ii) Economic Survey 2022-23 Statistical Appendix

Notes: RE : Revised Estimates

AE : Advanced Estimates.

PE : Provisional Estimates.

పట్టిక 18.1లో 71 సంవత్సరాలకు సంబంధించిన (1950-51 నుండి 2021-22) దత్తాంశం ఆధారంగా నికర జాతీయాదాయంలో మరియు తలసరి ఆదాయంలో పెరుగుదల సంభవించింది. నికర జాతీయాదాయం స్థిర ధరలలో 1950-51లో రూ॥ 4,48,483 కోట్ల నుండి 2021-22 వరకు రూ॥ 1,25,19,976 కోట్లకు పెరిగింది. అదే సమయంలో ప్రస్తుత ధరలలో నికర జాతీయాదాయం 1950-51లో రూ॥ 9531 కోట్ల నుండి 2021-22 వరకు 2,05,29,727 కోట్లకు పెరిగింది. తలసరి ఆదాయంలో కూడ గణనీయమైన పెరుగుదల వచ్చింది. స్థిర ధరలలో 1950-51లో రూ॥ 12493 ఉన్న తలసరి ఆదాయం సంవత్సరం 2021-22 వచ్చే సరికి రూపాయలు 91481కి పెరిగింది. ప్రస్తుత ధరలలో కూడ తలసరి ఆదాయం, గణనీయంగా పెరిగింది. రూపాయిలు 265 నుండి రూపాయిలు 1,50,007కి పెరగడం జరిగింది. పట్టిక 18.1 ప్రకారం ప్రణాళికల ప్రారంభం నుండి నికర జాతీయాదాయంలో మరియు తలసరి ఆదాయం గణనీయమైన పెరుగుదల సంభవించింది.

పట్టిక 18.2: నికర జాతీయాదాయం, తలసరి ఆదాయ వృద్ధిరేటు (శాతాలలో)

సంవత్సరము	నికర జాతీయాదాయం		తలసరి ఆదాయం	
	ప్రస్తుత ధరలలో	స్థిర ధరలలో	ప్రస్తుత ధరలలలో	స్థిర ధరలలో
2011-12 శ్రేణులు				
1951-52	6.3	3.8	4.6	2.1
1961-62	5.6	3.6	3.2	1.3
1971-72	6.9	4.8	3.7	2.5
1981-82	16.8	6.0	14.6	4.0
1991-92	13.8	0.5	11.6	-1.5
2001-02	8.1	4.8	6.0	2.7
2011-12	14.6	5.0	11.4	2.1
2017-18	11.6	6.7	9.9	5.5
2011-22 (PE)	19.4	8.5	18.3	7.5

Source: i) National Statistical Office 2022

ii) Economic Survey 2022-23 Statistical Appendix

Note : PE-Provisional Estimates

స్థిర ప్రస్తుత ధరల దృష్ట్యా నికర జాతీయాదాయం, తలసరి ఆదాయం వృద్ధిరేట్లకు సంబంధించిన సమాచార పట్టిక-18.2 తెలియజేస్తుంది. గత 20 సంవత్సరాల కాలవ్యవధిని గమనించినట్లయితే నికర జాతీయాదాయ సాలుసరి వృద్ధి క్రమంగా పెరుగుతుంది. 2021-22 ముందస్తు అంచనాల ప్రకారం నికర జాతీయాదాయ వృద్ధిరేటు స్థిర ధరలలో 8.5% శాతంగా ఉంది. అదే సమయంలో ప్రస్తుత ధరల వద్ద నికర జాతీయాదాయాల వృద్ధి వృద్ధి రేటు 19.4% శాతంగా ఉంది. తలసరి ఆదాయ వృద్ధి రేటు 7.5% శాతం స్థిర ధరలలో ఉండగా 18.3 గా ప్రస్తుత ధరలలో ఉంది.

18.4. జాతీయాదాయంలో వివిధ రంగాల మాట

ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తు సేవల విలువలను ఆ దేశాల జాతీయాదాయం అంటారు. రంగాల వాటాల వారిగా జాతీయోత్పత్తి అధ్యయనం అనేది ఆర్థిక నిర్మతి స్వరూపాన్ని తెలియజేస్తుంది. జాతీయాదాయానికి వివిధ రంగాలయిన, ప్రాథమిక, ద్వితీయ మరియు సేవా రంగాలు వాటాలను అందిస్తాయి.

పట్టిక 18.3: జాతీయాదాయంలో వివిధ రంగాల వాట శాతాలలో

సంవత్సరం	ప్రాథమిక రంగం	ద్వితీయ రంగం	సేవా రంగం
1950-51	57.2	14.8	25.0
2000-01	25.1	22.1	52.4
2010-11	17.7	27.0	55.3
2018-19	16.1	29.6	54.3
2020-21	20.19	25.92	53.89

Source: i) Ministry of Statistics
ii) Economic Survey 2021-22

పట్టిక-18.3 జాతీయాదాయంలో వివిధ రంగాల వాటాను గురించి తెలియజేస్తుంది. పై పట్టికను పరిశీలిస్తే, మొదట జాతీయాదాయంలో ప్రాథమిక రంగం వాటా గణనీయంగా ఉంది. కాని గత 30 సంవత్సరాల అంకెలను పరిశీలిస్తే సేవారంగం వాటా గణనీయంగా పెరిగింది. 2020-21 సంవత్సరాల్లో సేవా రంగం వాటా 53.89% శాతంగా ఉంది. అదే సమయంలో ప్రాథమిక రంగం యొక్క వాటా గత 70 సంవత్సరాల నుండి పరిశీలిస్తే గణనీయంగా తగ్గుతు వచ్చింది. 2020-21లో అది కేవలం 20.19%గా ఉంది. జాతీయాదాయంలో వివిధ రంగాల వాటాలతో మార్పులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

18.5. ప్రాథమిక రంగం వాటా

వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, అడవులు, అడవి ఆధారిత పరిశ్రమ, గణులు అనేవి ప్రాథమిక రంగంలో భాగాలు: పంచవర్ష ప్రణాళికల ప్రారంభం కాలంలో జాతీయాదాయంలో ప్రాథమిక రంగం వాటా క్రమంగా తగ్గుతుంది. వ్యవసాయ రంగపు ప్రతికూల వాతావరణ స్థితిగతులు, నిర్మితి పరమైన మార్పుల ఫలితమే వ్యవసాయ రంగపు వాటాలో త్వరితగతిన సంభవించే తగ్గుదలకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఇటీవల కాలంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (IT) సమాచార, రవాణ, వ్యాపార, బ్యాంకింగ్, బీమా ఇతర సేవా రంగాల వ్యవసాయ రంగం కంటే చాలా వేగంగా అభివృద్ధి చెందడం వల్ల జాతీయాదాయంలో వ్యవసాయ రంగం వాటా క్రమంగా తగ్గింది.

18.5.1 ద్వితీయ రంగం వాటా

ద్వితీయ రంగంలో వస్తు తయారీ నిర్మాణం, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా మొదలయినవి ఉంటాయి. జాతీయాదాయంలో ఈ రంగం వాటా క్రమంగా వృద్ధి చెందుతుంది. 1950-51లో 14.8 శాతంగా ఉన్న ఈ రంగం వాటా 2020-21లో 25.92 శాతంగా ఉంది.

18.5.2 తృతీయ రంగం వాటా

తృతీయ రంగంనే సేవా రంగం అని కూడా అంటారు. సేవా రంగంలో వ్యాపారం, రవాణ, స్టోరేజి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (IT), సమాచారం, బ్యాకింగ్, రియల్ ఎస్టేట్, బీమా, సామాజిక, వైయక్తిక సేవలు భాగంగా ఉంటాయి. జాతీయాదాయంలో సేవా రంగం వాటా 1950-51లో ఒక శాతంగా ఉంది. 2020-21లో 53.89 శాతంగా ఉంది. గత 70 సంవత్సరాల్లో సేవా రంగం వాటా గణనీయంగా పెరిగింది. ఈ పెరుగుదలలో ప్రత్యేకించి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (IT), బ్యాంకింగ్, బీమా, వ్యాపారం, రవాణ మరియు సమాచార రంగాలలో గణనీయమైన పెరుగుదల రావడం వల్ల జాతీయాదాయంలో సేవారంగం వాటా పెరిగింది.

18.6 సారాంశం

భారతదేశ ఆర్థిక వ్యవస్థ పారిశ్రామీకీకరణ పూర్తి కాకుండానే, పారిశ్రామిక అనంతర సేవా రంగ ఆర్థిక వ్యవస్థగా ముందడుగు వేసింది. జాతీయాదాయంలో మూడు రంగాలు కూడా ముఖ్యమైనవి. సేవా రంగాల వాటాలో గణనీయమైన వృద్ధిని చూడడం జరిగింది. పారిశ్రామిక రంగం వాటా జాతీయాదాయంలో ఇక పెరగవలసి ఉంది.

18.7. మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 4-5 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశ జాతీయాదాయాన్ని ఎవరు లెక్కించారు?
2. జాతీయాదాయ అంచనాల కమిటీలో ఉన్న సభ్యులు ఎవరు?
3. సేవా రంగం యొక్క త్వరితగత వృద్ధికి కారణాలు ఏమిటి?

II. ఈ క్రింది ప్రశ్నలకు 8-10 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. తలసరి ఆదాయ ధోరణులను వివరించండి.
2. జాతీయాదాయంలో ప్రాథమిక, ద్వితీయ రంగాల పాత్రను తెలియజేయండి.
3. ఆర్థిక వ్యవస్థ యొక్క వివిధ రంగాల కూర్పు ఏమిటి?

III. ఈ క్రింది ప్రశ్నలకు 16-20 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. భారతదేశ జాతీయాదాయ ధోరణులను వివరించండి.

2. క్రింద ఇచ్చిన దత్తాంశంపై 'పై చార్ట్' తయారు చేసి వివిధరంగాల వాటాలను చర్చించండి.

రంగం	2000-01	2018-19
ప్రాథమిక	25.1%	16.1%
ద్వితీయ	22.1%	29.6%
తృతీయ	52.4%	54.3%

18.8. పారిభాషిక పదజాలం

1. జాతీయాదాయం: ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవల ద్రవ్యవిలువ

2. వృద్ధిరేటు = $\dfrac{\text{ప్రస్తుత విలువ} - \text{గత సంవత్సరం విలువ}}{\text{గత సంవత్సర విలువ}} \times 100$

3. తలసరి ఆదాయం: ఒక దేశంలో నివసిస్తున్న ప్రజల సగటు ఆదాయం. జాతీయాదాయాన్ని ఆ దేశ ప్రజలలో భాగిస్తే తులసరి ఆదాయం వస్తుంది.

$$\text{తలసరి ఆదాయం} = \frac{\text{జాతీయాదాయం}}{\text{జనాభా}}$$

4. ప్రాథమిక రంగం: వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, అడవులు, అడవి ఆధారిత పరిశ్రమలు, గనులు మరియు క్వారీంగ్‌ను కలిపి ప్రాథమిక రంగం అంటారు.

5. ద్వితీయ రంగం: వస్తు తయారీ, నిర్మాణం, విద్యుత్, గ్యాస్ మరియు నీటి సరఫరా కలిపి ద్వితీయ రంగం అంటారు.

6. తృతీయ రంగం: వ్యాపారం, రవాణ, స్టోరేజి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (IT), సమాచారం, బ్యాకింగ్, రియల్ ఎస్టేట్ బీమా సామాజిక మరియు వైయక్తిక సేవలను కలిపి తృతీయ రంగం అంటారు.

18.9. ఉపయుక్త గ్రంథాలు

1. Principles of Macro Economics – C. Rangarajan, BH Dholakia.

2. Economic Survey 2022-23

3. Telugu Academy, Intermediate First Year Textbook.

అధ్యాయం 19

పేదరికం మరియు నిరుద్యోగం

19.0 లక్ష్యాలు

19.1 పరిచయం

19.2 పేదరికం నిర్వచనం

19.3 పేదరికం రకాలు

19.4 దారిద్ర్యరేఖ

19.5 పేదరికానికి గల కారణాలు

19.6 పేదరికపు పరిణామాలు

19.7 నిరుద్యోగం

19.8 నిరుద్యోగం రకాలు

19.9 నిరుద్యోగాన్ని ఎలా లెక్కిస్తారు?

19.10 నిరుద్యోగం కారణాలు

19.11 నిరుద్యోగం పరిణామాలు

19.12 ప్రభుత్వం – పేదరికం మరియు నిరుద్యోగ నివరణాచర్యలు

19.13 ముగింపు

19.14 మాదిరి పరీక్ష ప్రశ్నలు

19.14 పదకోశం

19.16 ఉపయుక్త గ్రంథాలు

19.0 లక్ష్యాలు

- వివిధ రకాల పేదరిక భావనలను అర్థం చేసుకుంటారు.
- పేదరికానికి గల కారణాలను, దాని పరిణామాలను వివరిస్తారు.
- వివిధ రకాల నిరుద్యోగాలను విశ్లేషిస్తారు.
- పేదరికానికి నిరుద్యోగానికి గల సంబంధాన్ని వివరిస్తారు.
- నిరుద్యోగానికి గల కారణాలను విశ్లేషిస్తారు.
- పేదరికం, నిరుద్యోగం రూపుమాపటానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను పేర్కొంటారు.

19.1 పరిచయం

ప్రపంచంలోని చాలా దేశాలను వేధిస్తున్న సమస్యలలో పేదరికం చాలా ప్రధానమైనది. ఇది ఒక తీవ్రమైన ఆర్థిక సమస్య. అభివృద్ధి చెందిన దేశాలలో కూడా పేదరికం ఉన్నప్పటికీ బలహీనమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన అభివృద్ధి చెందుతున్న దేశాలు (మూడో ప్రపంచ దేశాలు) సామూహిక పేదరికాన్ని కలిగివున్నాయి. పేదరికాన్ని ఒక సామాజిక, ఆర్థిక దృగ్విషయంగా నిర్వచించవచ్చు, ఒక దేశం తక్కువ తలసరి ఆదాయంతోను ఎక్కువ ఆదాయ అసమానతలతో వుంటే ఆ దేశంలో పేదరికం వున్నదని చెప్పవచ్చు. భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో పేదరికం కూడా ఒకటి.

19.2 పేదరికం నిర్వచనం

మానవ జీవితాలకు అవసరమైన డబ్బు మరియు ఆహారం, దుస్తులు వంటి కనీస వస్తువుల కొరతను ఎదుర్కొనే లేదా పొందలేని స్థితి. పేదరికం నిర్వచనాలు తరచూ మారుతున్నాయి. కనీస జీవన ప్రమాణాలు లోపించడం, పౌష్టికాహారలోపం, నిరక్షరాస్యత, మనవాభివృద్ధిలో వెనకబాటుతనం మొదలైనవి పేదరిక లక్షణాలుగా చెప్పవచ్చు. అందువల్ల, పేదరికం అనేది సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ అంశాలతో కూడిన బహుముఖ భావన.

19.3 పేదరికం రకాలు

భారతదేశంలో పేదరికాన్ని రెండు రకాలుగా నిర్వచిస్తారు. సంపూర్ణ పేదరికం మరియు సాపేక్ష పేదరికం.

1. **నిరపేక్ష పేదరికం లేదా సంపూర్ణ పేదరికం (Absolute (poverty):** ఆహారం, దుస్తులు మరియు నివాసం వంటి ప్రాథమిక వ్యక్తిగత అవసరాలను తీర్చడానికి అవసరమైన సాధనాలు పూర్తిగా లేకపోవడం. కనీస జీవనాధార వినియోగ వ్యయాన్ని కూడా చేయలేని స్థితిని నిరపేక్ష పేదరికం అంటారు. కనీస అవసరాల పరిమాణాన్ని మార్కెట్ ధరల ఆధారంగా లెక్కించి కనీస జీవన వినియోగ వ్యయాన్ని నిర్ధారిస్తారు. ప్రజలు తీసుకునే కాలరీల ఆధారంగా కూడా పేదరికాన్ని పేర్కొనవచ్చు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం, ఈ భౌతిక పరిమాణాలు గ్రామీణ ప్రాంతాలకు తలసరి 2,400 కేలరీలు మరియు పట్టణ ప్రాంతాల్లో తలసరి 2,100 కేలరీలు. ఈ పరిమాణాల కంటే తక్కువ తీసుకునే వారిని పేదలుగా పరిగణించవచ్చు. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కనిపించే పేదరికం నిరపేక్ష పేదరికం.

2. **సాపేక్ష పేదరికం:** సాపేక్ష పేదరికం అనేది ఆర్థిక అసమానతలను సూచిస్తుంది. ఈ భావన ప్రకారం ఆర్థిక వ్యవస్థలోని ఆదాయ స్థాయి, జీవన ప్రమాణం తక్కువగా ఉన్న5 నుండి 10 శాతం ప్రజలను ఆదాయ స్థాయి, జీవన ప్రమాణం ఎక్కువగా ఉన్న ఉన్న5 నుండి 10 శాతం ప్రజలతో పోల్చి తక్కువ ఆదాయం పొందుతున్న ప్రజలను సాపేక్షంగా పేదవారుగా పరిగణిస్తారు. ఈ భావనను సంపన్న దేశాల్లో అధికంగా ఉపయోగిస్తారు.

భారతదేశంలో పేదరికాన్ని అంచనా వేయడానికి కొలమానంగా 'దారిద్ర్యరేఖ'ను ఉపయోగిస్తారు. 'దారిద్ర్యరేఖ' అనేది ఒక వ్యక్తి ఆదాయం మరియు వినియోగ స్థాయి ఆధారంగా అతని పేదరికాన్ని కనుగొనే పద్ధతి.

19.4 దారిద్ర్యరేఖ

క్లుప్తంగా దారిద్ర్య రేఖ అనేది జీవితంలోని ప్రాథమిక అవసరాలను తీర్చుకోవటానికి కావలసిన కనీస ద్రవ్య ఆదాయం. ఇటీవలే 2020 లో ప్రపంచ బ్యాంకు సవరించిన నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా, దారిద్ర్యరేఖను రోజుకు $2.15గా నిర్ణయించారు.

భారతదేశంలో పేదరికాన్ని అంచనా వేయడానికి ఉపయోగించే ఒక సాధారణ పద్ధతి వినియోగ స్థాయిలపై ఆధారపడి ఉంటుంది. ఇవ్వబడిన కనిష్ట స్థాయి కంటే వినియోగం తక్కువగా ఉంటే, అప్పుడు ఆ కుటుంబం (5 మంది సభ్యులున్న కుటుంబం) దారిద్ర్య రేఖకు దిగువన (BPL) ఉన్నట్లుగా చెప్పబడుతుంది. వినియోగ ఆధారిత

దారిద్ర్య రేఖలో, నమూనా ఆధారిత సర్వేలలో నిర్ణీత వ్యవధిని ఉపయోగిస్తాయి (30 రోజులు). దీనిలో కుటుంబాలు అంటే 5 మంది 5 మంది సభ్యులున్న కుటుంబం గత 30 రోజుల వినియోగం గురించి అడిగి సాధారణ వినియోగంగా నిర్ణయించబడుతుంది.

సి. రంగరాజన్ కమిటీ సమర్పించిన నివేదిక ప్రకారం: దేశంలో పేదరికం మరియు పేద జనాభాను అంచనా వేయడానికి ప్రభుత్వం RBI మాజీ గవర్నర్ సి.రంగరాజన్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. 2011-12లో భారతదేశంలో పేదల సంఖ్య 29.5% కంటే ఎక్కువగా ఉందని కమిటీ పేర్కొంది. అంటే ప్రతి 10 మందిలో ముగ్గురు పేదలు.

పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.1,407 (రోజుకు రూ.47) కంటే తక్కువ ఖర్చు చేసే వ్యక్తిపేదవాడిగా పరిగణించాలి మరియు గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.972 (రోజుకు రూ.32) కంటే తక్కువ ఖర్చు చేసే వ్యక్తిని పేదలుగా పరిగణించాలి.

2011 టెండూల్కర్ కమిటీ ప్రకారం నెలకు రూ.1,000 (రోజుకు రూ. 33). కంటే తక్కువ ఖర్చు చేసే వ్యక్తిని నగరాల్లో పేదగా పరిగణించాలి మరియు నెలకు 816 రూపాయలు (రోజుకు రూ.27) కంటే తక్కువ ఖర్చు చేసే వ్యక్తి గ్రామాల్లో పేదలుగా పరిగణించాలి.

దారిద్ర్య రేఖ గణన: గణాంకాలు మరియు కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ (MOSPI) కింద నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ సంగ్రహించిన డేటా ఆధారంగా ఇప్పుడు భారతదేశంలో పేదరికం అంచనా NITI ఆయోగ్ యొక్క టాస్క్ ఫోర్స్ ద్వారా పేదరిక రేఖను లెక్కించడం జరుగుతుంది నిర్వహించబడుతుంది. జాతీయ నమూనా సర్వే (NSSO) భారతదేశంలో దారిద్ర్య రేఖను అంచనా వేయడానికి ప్రతి 5 సంవత్సరాలకు ఒక నమూనా సర్వేను నిర్వహిస్తుంది.

వివిధ కమిటీల పేదరికపు అంచనా

Year	Lakdavala Committee			Tendulkar Committee			Rangarajan Committee		
	Rural	Urban	Total	Rural	Urban	Total	Rural	Urban	Total
1993-94	37.3	32.4	36.0	50.1	31.8	45.3	-	-	-
2004-05	28.3	25.7	27.5	41.8	25.7	37.2	-	-	-
2009-10	-	-	-	33.8	20.9	29.8	39.6	35.1	38.2
2011-12	-	-	-	25.7	13.7	21.9	30.9	26.4	29.5

19.5 పేదరికానికి గల కారణాలు

భారతదేశంలో పేదరికానికి అనేక కారణాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి.

వలస పాలన

భారతదేశంలో పేదరికానికి మూల కారణం బ్రిటిష్ వారి దోపిడితో కూడిన వలస పాలన. భారతదేశాన్ని వలస రాజ్యంగా మార్చే ప్రక్రియలో, బ్రిటీష్ వారు భారతదేశ సంపదను దోచుకున్నారు, తక్కువ ధరకు ముడి పదార్థాలను తీసుకువెళ్లి, చాలా ఎక్కువ ధరలకు తిరిగి భారతదేశానికి విక్రయించారు. ఇది భారతదేశంలోని స్వదేశీ కర్మాగారాలు మరియు మిల్లులు మూతపడటానికి దారితీసింది మరియు భారతదేశం ఆర్థికంగా ఎక్కువగా బ్రిటిష్ వారిపై ఆధారపడింది. క్రమంగా ఉపాధి లేక ప్రజలు పేదరికం లోకి నెట్టి వేయబడ్డారు.

జనాభా పెరుగుదల – అధిక జనాభా ఒత్తిడి

భారతదేశంలో మరణాల రేటు కంటే జనన రేటు అధికంగా వుండటం వేగవంతమైన జనాభా పెరుగుదలకు దారితీసింది. ఇది అధిక భూ కమతాల విచ్ఛిన్నానికి కారణమవుతుంది. తత్ఫలితంగా, ప్రతి వ్యక్తికి అందుబాటులో ఉన్న భూమి బాగా తగ్గిపోయింది. తద్వారా కుటుంబాలు వారికి ఆదాయాన్ని మరియు ఉత్పత్తి చేయడానికి తగిన భూమిని కలిగి ఉండవు. అధిక జనాభా పెరుగుదల తలసరి ఆదాయం క్షీణతకు దారితీస్తుంది. సంపాదించే వారిపై ఆధారపడే సభ్యులు పెరగడంవల్ల తక్కువ వినియోగ స్థాయి కలిగి వారి కనీస అవసరాలు కూడా తీర్చుకోలేక పోతారు.

తక్కువ ఆర్థిక వృద్ధి మరియు అభివృద్ధి

పేదరికం స్తబ్దత లేదా నెమ్మదిగా కదులుతున్న ఆర్థిక పురోగతి వల్ల కూడా వస్తుంది. జనాభా పెరిగే రేటుతో సమానంగా ఆర్థికవృద్ధి రేటు లేకపోవడం ఒక సమస్య. భారతదేశంలో, కావలసిన స్థాయికి అవసరమైన ఆర్థికాభివృద్ధి రేటు చాలా తక్కువగా ఉంది. అందువల్ల, వస్తువులు మరియు సేవల లభ్యత స్థాయి మరియు అవసరాల మధ్య అంతరం నిరంతరం కొనసాగుతుంది. దాని ఫలితం పేదరికం.

నిరుద్యోగం మరియు అల్ప ఉపాధి

శ్రామిక శక్తిలో ఎక్కువ భాగంగా ఉన్న సాధారణ కార్మికులలో నిరుద్యోగం ఎక్కువగా ఉంది. వారి విషయంలో నిరుద్యోగం మరియు పేదరికం ఒకదానితో ఒకటి మిళితమై వుంది. ఒకవైపు జనాభా మరియు శ్రామిక శక్తి వేగంగా పెరగడం మరియు మరోవైపు సాపేక్షంగా తక్కువ మూలధన నిర్మాణం మరియు ఆర్థిక వృద్ధి రేటు కారణంగా నిరుద్యోగం ఏర్పడింది. అంతేకాకుండా, సంఘటిత రంగం ద్వారా ఉపాధి అవకాశాల కల్పన చాలా తక్కువగా ఉండటంతో నిరుద్యోగం పెరిగి పేదరికానికి దారితీసింది.

ద్రవ్యోల్బణం మరియు ఆహార ధరల పెరుగుదల

ద్రవ్యోల్బణం రేటు మరియు ఆహార ధరల స్థాయి పేదరికానికి కారణమయ్యే ముఖ్యమైన అంశం. ద్రవ్యోల్బణం, ముఖ్యంగా ఆహార ధరల పెరుగుదల, ప్రాథమిక అవసరాలను తీర్చడానికి అవసరమైన కనీస వినియోగ వ్యయాన్ని పెంచుతుంది. అందువల్ల, ముఖ్యంగా ఆహార ధరలలో ద్రవ్యోల్బణం పెరగడం చాలా కుటుంబాలను దారిద్ర్య రేఖకు దిగువన నెట్టివేస్తుంది.

సంపద మరియు వనరుల అసమాన పంపిణీ

సంపద మరియు వనరుల అసమాన పంపిణీ దేశంలో ఆదాయ అసమానతలకు కారణమవుతుంది. ఈ అసమతుల్యత వల్ల దేశం మొత్తం ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి దెబ్బతింటున్నాయి. ఫలితంగా పేదరికం పెరుగుతుంది

అసమతుల్య పారిశ్రామికీకరణ

పరిశ్రమలు ఆ ప్రాంతంలో నివసించే ప్రజలకు ఉద్యోగాలు కల్పిస్తాయి. ఒకే రాష్ట్రం లేదా ప్రదేశంలో పరిశ్రమల కేంద్రీకరణ ఆ ప్రాంతంలో ఉపాధిని పెంచుతుంది. కానీ పారిశ్రామికీకరణ లేని ప్రదేశంలో పని అవకాశాలు పరిమితంచేయబడుతాయి. ఈ ప్రాంతాలు తీవ్రమైన పేదరికంతో బాధపడుతున్నాయి.

వనరుల దుర్వినియోగం

దేశంలోని ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలంటే జాతీయాదాయం పెరుగదల రేటు అధికంగా పెంచవలసిన ఆవశ్యకత వుంది. జాతీయాదాయం పెరగాలంటే దేశంలోని సహజవనరుల సక్రమ వినియోగం అధికంగా వుండాలి. కానీ మనదేశంలో సహజ వనరులైన నదులు, అడవులు, ఖనిజ సంపదను పూర్తి స్థాయిలో వినియోగించుకోకపోవడం పేదరికానికి కారణంగా మారింది.

తక్కువ స్థాయి సాంకేతికత

అల్ప సాంకేతికత కూడా పేదరికానికి కారణమవుతుంది. ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే తయారీ రంగం మరియు వ్యవసాయ ఉత్పత్తి ప్రక్రియ లలోనే కాకుండా మార్కెటింగ్ నైపుణ్యాలు, ఫైనాన్సింగ్, ఉత్పత్తి యూనిట్ల స్థాపన వంటి వాటిలో కూడా మన దేశంలో సాంకేతికత వినియోగం చాలా తక్కువ. దీని వల్ల సగటు ఉత్పత్తి తక్కువగా వుంటుంది. ఇది పెట్టుబడులను, ఆదాయయాలను నిరాశపరుస్తుంది. ఆర్థిక వ్యవస్థను పేదరికంలోకి నెట్టివేస్తుంది.

తక్కువ స్థాయి విద్య

ఒక వ్యక్తి ఆర్థికంగా నిలదొక్కుకోవడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుంది. విద్య, సంపాదన మధ్య ప్రత్యక్ష సంబంధం వుంటుంది. కానీ పేదలు, వనరుల కొరత కారణంగా, వారి పిల్లలను పాఠశాలలకు పంపలేరు. వారు తమ పిల్లలను పాఠశాలలకు వెళ్లడం కంటే పనికి పంపడం మరియు కుటుంబ ఆదాయానికి సహకరించడం కోసం ఇష్టపడతారు. కానీ విద్య లేకపోవడం లేదా తక్కువ విద్య అనేది పేదవారిని ఆర్థికంగా ఎదగనీయకుండా చేస్తుంది.

సరళీకరణ ప్రైవేటీకరణ మరియు ప్రపంచీకరణ నమూనా

ఈ నమూనా ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలను కల్పించే ప్రధాన వనరు అయిన వ్యవసాయం మరియు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను దాటవేసింది. మూలధన ఆధారిత అభివృద్ధిని నొక్కి చెప్పింది. శ్రామికులకు గల ఉపాధి అవకాశాలపై భయాన్ని నెలకొల్పింది. ఈ నమూనా నిరుద్యోగాన్ని పెంచి పేదరికానికి కారణమవుతుందని భావిస్తున్నారు.

సాంఘిక కారకాలు

భారతదేశంలో పేదరికానికి ఆర్థిక మరియు వాణిజ్యపరమైన అంశాలే కాకుండా సామాజిక అంశాలు కూడా అడ్డుగా ఉన్నాయి. వారసత్వ చట్టాలు, కుల వ్యవస్థ, మతపరమైన ఆచారాలు మరియు కొన్ని సంప్రదాయాలు ప్రజలను మరింత పేదరికంలోకి లాగుతున్నాయి.

19.6 పేదరికపు పరిణామాలు

ఒక దేశం యొక్క సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ అంశాలపై పేదరికం తీవ్రమైన ప్రభావం చూపుతుంది. మన దేశంలో దాదాపు 800 మిలియన్ల మంది ప్రజలు పేదలుగా గుర్తించబడ్డారు. వారిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ, సరైన ఉద్యోగాలు లేక జీవిస్తున్నారు. చాలా గ్రామీణ ప్రాంతాల్లో కనీస జీవనానికి సరిపడే వేతనాన్ని అందించే ఉపాధి లేకపోవడం, మెట్రోపాలిటన్ ప్రాంతాలకు వలస వెళ్ళడం వల్ల నగరాలు విస్తరిస్తున్నాయి. అక్కడ కూడా, చాలా మంది మురికివాడలలో, తగినంత త్రాగునీటి సరఫరా లేకుండా, చెత్త పారవేయడం, విద్యుత్ మరియు అనేక ఇతర అవసరాలు లేకుండా పేదరికం మరియు నిరాశతో కూడిన జీవితాన్ని గడుపుతున్నారు. పేదరికం మొత్తం సమాజాన్ని ఉన్నవారు మరియు లేనివారు అని రెండు తరగతులుగా విభజిస్తున్నది. ఉన్నవారు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతుండగా, లేనివారు కనీస వసతులు కూడా పొందలేకపోతున్నారు. పేదరిక సమస్య యొక్క పరిణామాలు మరికొన్ని కింద ఇవ్వబడ్డాయి.

1. **అల్ప జీవన స్థాయి మరియు గృహ సమస్య:** పేదలకు సరైన జీవన పరిస్థితులు వుండవు. ఆహారం, దుస్తులు మరియు నివాసం కొరకు సంఘర్షణ పడుతుంటారు. చాలా మంది పేదల నివాసం కేవలం ఒక గది మాత్రమే.
2. **పరిశుభ్రత మరియు పారిశుధ్యం:** ఈ వ్యక్తులకు పరిశుభ్రత మరియు సరైన పారిశుద్ధ్య వ్యవస్థ గురించి తక్కువ అవగాహనఉంటుంది. సరైన పరిశుభ్రత పాటించకపోవడం వల్ల కలిగే హానికరమైన రోగాల బారిన పడుతున్నారు.
3. **పోషకాహార లోపం:** పేద ప్రజల ఆదాయస్థాయి తక్కువగా వుండడం వల్ల కొనుగోలు శక్తి తక్కువగా వుంటుంది. మంచి ఆహారం కోసం ఖర్చు పెట్టలేరు. తద్వారా పోషకాహార లోపం ఏర్పడి వ్యాధుల బారిన పడుతున్నారు.

4. **అధిక శిశుమరణాలు:** భారతదేశంలో ఆరోగ్య మరియు కుటుంబ మంత్రిత్వ శాఖ 2019 లెక్కల ప్రకారం శిశు మరణాలు ప్రతి 1000 మంది జీవంతో పుట్టిన పిల్లలలో 30 మంది ఒక సంవత్సరంలోపు మరణిస్తున్నారు. ప్రతి సంవత్సరం 1.4 మిలియన్ల మంది పిల్లలు వారి ఐదవ పుట్టిన రోజుకు ముందే మరణిస్తున్నారు. న్యుమోనియా, మలేరియా, అతిసార వ్యాధులు మరియు దీర్ఘకాలిక పోషకాహార లోపం మరణాలకు ప్రధాన కారణాలు.

5. **విద్య అందకపోవడం:** యూనిసెఫ్ ప్రకారం భారతదేశంలో సుమారు 25% కంటే ఎక్కువ మంది పిల్లలు విద్యను పొందడం లేదు. బాలుర కంటే బాలికలే ఎక్కువగా పాఠశాలకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితి ముఖ్యంగా పేదరికంలో వున్న ప్రజలలో కనిపిస్తుంది. భారతీయ చట్టాలు పురుషులు మరియు స్త్రీలను సమానంగా చూడాలని కోరుతున్నప్పటికీ, స్త్రీలు, ముఖ్యంగా అట్టడుగు సామాజిక కులాలకు చెందిన వారు విద్యను పొందలేకపోతున్నారు. వారికి విద్య లేకపోవడం వల్ల భారతదేశంలో సరైన ఉపాధి మరియు వేతనం పొందే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి.

6. **బాలకార్మిక వ్యవస్థ:** పేద తల్లిదండ్రులు కుటుంబాలు గడపడానికి ఆదాయం కోసం తమ పిల్లలను పనికి పంపటం వల్ల బడిలో వుండాల్సిన పిల్లలు పనిలో వుంటున్నారు. ఇది భవిష్యత్తులో వారిని మరింత పేదరికంలోకి నెట్టివేయబడుతుందనే విషయం వారు గ్రహించ లేకపోతున్నారు.

7. **బాల్యవివాహాలు:** బాల్య వివాహాలు చట్టవిరుద్ధం అయినప్పటికీ, అనేక భారతీయ సమాజాలలో ఇది ఇప్పటికీ జరుగుతుంది. చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే బాలికలు తల్లులవుతారు. చాలా మంది యుక్తవయస్సు రాకముందే చనిపోతారు. వారి పేదరికం కారణంగా, చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయస్సులోనే వివాహం చేస్తున్నారు.

8. **నిరుద్యోగం:** పేదరికం నిరుద్యోగ సమస్యకు దారితీస్తుంది. ఒక దేశం బలమైన ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందకుండా నిరుద్యోగం అడ్డుకుంటుంది. అధిక నిరుద్యోగిత రేటు దేశం అన్నీ కోణాల్లో పురోగమించకుండా చేస్తుంది.

9. **సామాజిక ఉద్రిక్తలు:** పేదరికం సమాజంలో ఆదాయ అసమానతలను పెంచుతుంది. ధనిక, పేద ప్రజల మధ్య జాతీయ సంపద అసమాన పంపిణీ జరుగుతుంది. సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకరించబడుతుంది. ఇది సమాజంలో అశాంతిని, అభద్రతా భావాన్ని కలిగిస్తుంది.

10. **వ్యసనం మరియు నేర కార్యకలాపాలు:** పేద ప్రజలు తమ కడుపు నింపుకోవడం కోసం, నేరం, హింస మరియుఉగ్రవాదం వంటి సామాజికంగా ఆమోదయోగ్యం కాని పనులకు పాల్పడుతుంటారు. మాదకద్రవ్యం వంటి చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు.

19.7.నిరుద్యోగం

ప్రస్తుత కాలంలో ప్రతి దేశంలో ప్రజలను వేధిస్తున్న ప్రధాన సమస్యలలో నిరుద్యోగం ఒకటి. ప్రజలందరికీ ఉపాధి కల్పించడం ప్రభుత్వాలకు కూడా చాలా కష్టసాధ్యమైన పని. ఒక దేశంలో ఉపాధి పరిమాణం చాలా వరకు అభివృద్ధి స్థాయిపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల, ఒక దేశం పురోగతి సాధించినప్పుడు మరియు దాని ఉత్పాదకత విస్తరిస్తే, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. స్వాతంత్ర్యానంతరం మొదటి మూడు దశాబ్దాలలో అనుసరించిన ఆర్థిక ప్రణాళిక యొక్క వృద్ధి రేటు లక్ష్య రేటు కంటే చాలా తక్కువగా ఉండడం వలన ఆశించిన సంఖ్యలో ఉపాధి, ఉద్యోగాలు సృష్టించబడలేదు. పెరుగుతున్న జనాభా నిరుద్యోగ సమస్యను మరింత పెంచింది.

వాస్తవంగా, ఒక వ్యక్తి కి పనిచేయగల శక్తి, ఆసక్తి, అర్హత ఉండి పని లభించని స్థితిని 'నిరుద్యోగం' అంటారు. ఇంకా చెప్పాలంటే– ప్రస్తుతం మార్కెట్‌లో/ఆర్థిక వ్యవస్థలో అమల్లో ఉన్న వేతనం దగ్గర పనిచేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, పని లభించని స్థితిని 'నిరుద్యోగం' అంటారు. భారతదేశ నిరుద్యోగం అభివృద్ధి చెందిన దేశాల కంటే పూర్తిగా భిన్నంగా వుంటుంది. లార్డ్ కె.ఎం.కీన్స్ అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో నిరుద్యోగం ప్రభావంమొత్తం డిమాండ్ లోపం ఫలితంగా ఏర్పడింది.

19.8 నిరుద్యోగం రకాలు

వివిధ రకాలైన నిరుద్యోగం క్రింది విధంగా వుంటాయి:

నిర్మాణాత్మక నిరుద్యోగిత

ఈ రకమైన నిరుద్యోగం దేశ ఆర్థిక నిర్మాణంతో ముడిపడి ఉంటుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన నిర్మాణాత్మక మార్పుల కారణంగా, డిమాండ్–సరఫరాల మధ్య అంతరాయం కలగవచ్చు. కార్మికులకు నైపుణ్యాలు లేని ఉద్యోగాలు అందుబాటులో ఉన్నప్పుడు లేదా కార్మికులు అందుబాటులో ఉన్నప్పటికీ పూరించడానికి ఉద్యోగాలు లేనప్పుడు, కార్మికుల జనాభా మరియు అందుబాటులో ఉన్న ఉద్యోగాల రకాల్లో అసమతుల్యత కారణంగా నిర్మాణాత్మక నిరుద్యోగం ఏర్పడుతుంది. సాంకేతిక అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలలో నిర్మాణాత్మక నిరుద్యోగం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఇది అభివృద్ధి మరియు సాంకేతిక పురోగతి యొక్క సహజ ఫలితం. అందుబాటులో ఉన్న ఉద్యోగాలు మరియు శ్రామిక శక్తి యొక్క నైపుణ్యాల మధ్య అసమతుల్యత కారణంగా ఇది సంభవించవచ్చు. కార్మిక గమనశీలత నిర్మాణాత్మక నిరుద్యోగాన్ని పెంచే అవకాశం ఉంది.

అల్ప ఉద్యోగిత (Under Employment)

అందుబాటులో ఉన్న ఉత్పాదక వనరులను గరిష్టంగా ఉపయోగించుకోలేని స్థితిని లేదా కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని వేతనం గల పని కలిగి ఉండటాన్ని లేదా తమ శక్తి సామర్థ్యాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోలేని స్థితిని లేదా ఒక వ్యక్తికి అర్హతకు తగిన దానికంటే తక్కువ ఉపాధి లభించడాన్ని 'అల్ప ఉద్యోగిత' అంటారు. ఈ రకమైన నిరుద్యోగం ఉన్న దేశం వారి శ్రామికుల సామర్థ్యాన్ని దోపిడీ చేస్తుంది.

ప్రచ్ఛన్న నిరుద్యోగిత (Disguised Employment)

ఏదైనా ఉత్పత్తి ప్రక్రియలో వాస్తవంగా కావాల్సిన శ్రామికుల కంటే ఎక్కువ మంది ఉంటే వారిని 'ప్రచ్ఛన్న నిరుద్యోగిత' అంటారు. ఈ అదనపు శ్రామికులను కొనసాగిస్తే ఉత్పత్తి పెరుగదు. తొలగిస్తే ఉత్పత్తి తగ్గదు. వీరి ఉపాంత ఉత్పాదకత శూన్యం (0) అని రాగ్నార్ నర్క్స్, రుణాత్మకం అని జోన్ రాబిన్‌సన్ పేర్కొన్నారు. ఈ ప్రచ్ఛన్న నిరుద్యోగిత అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఎక్కువగా ఉంటుంది.

స్వచ్ఛంద నిరుద్యోగం (Voluntary Unemployment)

అమల్లో ఉన్న వేతనం వద్ద పని దొరికినప్పటికి అధిక వేతనాన్ని ఆశించి పనికి వెళ్లని వారిని 'స్వచ్ఛంద నిరుద్యోగిత' అంటారు.ఆశించిన వేతనం కంటే తక్కువ వేతనం లభించినప్పుడు లేదా విశ్రాంతి ఆశించి పనికి వెళ్లకుండా నిరుద్యోగిగా ఉండటం. తన సామర్థ్యం కంటే తక్కువ సామర్థ్యం గల పని లభించినప్పుడు వదిలేసి నిరుద్యోగిగా ఉండటం కూడా స్వచ్ఛంధ నిరుద్యోగమే.

అనిచ్ఛాపూర్వక నిరుద్యోగం (In voluntary Unemployment)

అమలులో ఉన్న వేతనం వద్ద పని చేయడానికి ఆసక్తి వున్న పని లభించక నిరుద్యోగిగా వుండడం ఒక ఆర్థిక వ్యవస్థలో లేదా ఒక వస్తువు ఉత్పత్తి సంస్థలో సార్థక డిమాండ్ కొరత వల్ల ఏర్పడే నిరుద్యోగాన్ని నిస్వచ్ఛంద నిరుద్యోగిత అంటారు.

రుతు సంబంధ/ కాలిక నిరుద్యోగిత (Seasonal Unemployment)

సంవత్సరంలో కొంతకాలం మాత్రమే పనివుంటుంది మరికొంత కాలం పనిలేకపోవడం కొన్ని రుతువుల్లో ఉండి, మరికొన్ని రుతువుల్లో ఏ పని లేకపోవడాన్ని 'కాలిక నిరుద్యోగిత' లేదా రుతు సంబంధ నిరుద్యోగిత అంటారు.సాధారణంగా వ్యవసాయ రంగంలో పంట సాగు సమయంలో, పంటకోత సమయంలో మాత్రమే శ్రామికులకు పని ఉంటుంది. మిగతా సమయంలో ఏ పని ఉండదు. అంటే సంవత్సరంలో 7, 8 నెలలు మాత్రమే పని ఉంటుంది. మిగిలిన నెలలు పని ఉండదు.

సాంకేతిక నిరుద్యోగిత (Technical Unemployment)

ఆర్థిక వ్యవస్థలో నూతన సాంకేతిక పద్ధతులను ప్రవేశపెట్టడం వల్ల ఏర్పడిన నిరుద్యోగితను 'సాంకేతిక నిరుద్యోగిత' అంటారు.

చక్రీయ నిరుద్యోగిత (Cyclical Unemployment)

అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యాపార చక్రాల వల్ల లేదా సమష్టి డిమాండ్ కొరత వల్ల అనగా ఉత్పత్తికి తగిన డిమాండ్ లేకపోవడం వల్లచక్రీయ నిరుద్యోగిత' ఏర్పడుతుంది. ఆర్థిక మాంద్యం కాలంలో 'చక్రీయ నిరుద్యోగిత' ఏర్పడుతుంది. ఈ నిరుద్యోగిత తాత్కాలికమైనది.

విద్యావంతుల్లోని నిరుద్యోగిత (Educated Unemployment)

చదువుకున్న, శిక్షణ పొందిన, ఏదో ఒక రంగంలో నైపుణ్యంగల వ్యక్తులకు పని లభించకపోతే వారిని విద్యావంతులైన నిరుద్యోగులు అంటారు. భారతదేశంలో ముఖ్యంగా పట్టణాల్లో, నగరాల్లో నిరుద్యోగ విద్యావంతులు అధికం.

సంఘృష్ఠ లేదా ఘర్షణ నిరుద్యోగం (Frictional Unemployment)

శ్రామికులు ఒక వృత్తి నుంచి మరొక వృత్తిలోకి, ఒక రంగం నుంచి మరొక రంగంలోకి, ఒక పరిశ్రమ నుంచి మరొక పరిశ్రమలోకి, ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతంలోకి మార్పు చెందినప్పుడు ఏర్పడే తాత్కాలిక నిరుద్యోగాన్ని'సంఘృష్ఠి నిరుద్యోగిత' అంటారు.

19.9. నిరుద్యోగాన్ని ఎలా లెక్కిస్తారు?

ఒక ప్రామాణిక సంవత్సరం ప్రాతిపదికన 273 రోజులలో, రోజుకు 8 గంటలు పనిచేసే వ్యక్తిని ఉద్యోగిగా పరిగణిస్తారు. ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన నిరుద్యోగ అంచనాలపై నిపుణుల కమిటీ సిఫార్సుల ఆధారంగా, NSS (National Sample Survey Organisation) యొక్క 27వ రౌండ్‌లో నిరుద్యోగంపై మూడు అంచనాలు రూపొందించబడ్డాయి.

i) దీర్ఘకాలిక నిరుద్యోగం లేదా సాధారణ ప్రిన్సిపల్ స్టేటస్ ఎంప్లాయ్‌మెంట్' అనేది సంవత్సరంలో ఎక్కువ భాగంసాధారణ ఉపాధిని వెతుక్కుంటూ నిరుద్యోగంగా ఉన్న వ్యక్తుల సంఖ్యతో కొలుస్తారు. క్రమమైన ఉపాధి లేదా పనికోసం వెతకుతున్న వారికి ఈ కొలత మరింత సముచితమైనది. ఉదా: బాగా చదువుకున్న, నైపుణ్యం కలిగిన వారు సాదారణ ఉద్యోగాన్ని అంగీకరించరు. దీన్నే 'ఓపెన్ ఎంప్లాయిమెంట్' అని కూడా అంటారు.

ii) వారం స్థితి నిరుద్యోగం (Weekly status unemployment)

వ్యక్తుల సంఖ్యలో కొలుస్తారు. అనగా సర్వే చేసిన వారంలో కనీసం ఒక గంట కూడా పని దొరకని స్థితి.

iii) రోజువారీ స్థితి నిరుద్యోగం (Dailystatusunemployment)

వ్యక్తి గత రోజులు లేదా వ్యక్తి గత సంవత్సరాలలో కొలుస్తారు. అంటే సర్వే వారంలో ఒక రోజు లేదా కొన్ని రోజులలో పని దొరకని వ్యక్తులు.

19.10. నిరుద్యోగం కారణాలు

పైన చేసిన నిరుద్యోగ రకాల విశ్లేషణ వల్ల భారతదేశంలోని నిరుద్యోగం నిర్మాణాత్మకమైనది అని స్పష్టంగా తెలుస్తున్నది. దానికి గల ప్రధాన కారణాలు క్రింద పేర్కొనబడ్డాయి.

1. నిరుద్యోగ వృద్ధి: భారతదేశంలో, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి, ఉపాధి వృద్ధి రేటు ఆర్థిక వృద్ధి రేటు కంటే చాలా తక్కువగా ఉంది. అంతేకాకుండా, భారతదేశంలో పెరుగుతున్న శ్రామిక శక్తిని సరిపోయే ఆర్థిక వృద్ధి రేటు తగినంతగా లేదు. ఫలితంగా, నిరుద్యోగం విస్తృతంగా ఉంది.
2. శ్రామిక శక్తిలో పెరుగుదల: భారతదేశంలో, జనన రేటులో తగ్గుదల లేకుండా మరణాల రేటు వేగంగా తగ్గింది. దాని ప్రభావంతో భారతదేశంలో జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. ఇది నిరుద్యోగానికి దారితీసికార్మిక శక్తిలో పెద్ద విస్తరణకు దారితీసింది.
3. యంత్రాల మితిమీరిన వినియోగం: భారతదేశంలో, మానవశక్తి పెద్ద పరిమాణంలో అందుబాటులో ఉంది. ఈ పరిస్థితులలో, దేశం శ్రమతో కూడిన ఉత్పత్తి సాంకేతికతను కలిగి ఉంటుంది. అయితే, భారతదేశంలో, పరిశ్రమల్లోనే కాకుండా వ్యవసాయంలో కూడా మూలధనఆధారిత సాంకేతికత ఉపయోగించబడుత వల్ల పెద్ద ఎత్తున నిరుద్యోగం ఏర్పడుతుంది.
4. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ల కొరత: భారతదేశంలో, భారతీయ పరిశ్రమకు అనుకూలంగా ఉండే వృత్తి నైపుణ్యాభివృద్ధి కోర్సులు సంఖ్యాపరంగా చాలా తక్కువగా ఉన్నాయి. కాబట్టి, అవసరమైన నైపుణ్యం కలిగిన మానవశక్తి కొరత పరిశ్రమలలో ఉంది.
5. ఉపాధి పట్ల అంచనాలు: భారతదేశంలోని విద్యావంతులైన యువత వైట్ కాలర్ ఉద్యోగం కోసం ఆశపడుతున్నారు. వారు స్వయం ఉపాధి పొందగలిగే ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించడానికి వినూత్న మరియు వ్యవస్థాపక స్ఫూర్తి కలిగి లేరు. భారతదేశంలో, చాలా మంది గ్రాడ్యుయేట్లు తమ అంచనాలకు తగ్గట్టుగా ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులుగా ఉండటానికి ఇష్టపడతారు.
6. ఆర్థికాభివృద్ధి మందగమనం: భారతదేశ మొత్తం ఆర్థికాభివృద్ధి చాలా నెమ్మదిగా ఉంది. నీటిపారుదల సౌకర్యాలు,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అసంతృప్త వృద్ధి, పారిశ్రామిక విస్తరణ సరిగా లేకపోవడం ఫలితంగా గ్రామీణ రంగంలో పెరుగుతున్న శ్రమకు సరిపడు ఉపాధి అవకాశాలు పెరగలేదు.

7. కార్మికుల గమనశీలత లేకపోవడం: కార్మికుల గమనశీలత తక్కువగా ఉంది. కుటుంబంతో అనుబంధం వల్ల ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం లేదు. దీనికి భాష, మతం మరియు వాతావరణం వంటి అంశాలు కూడా కారణమవుతాయి.

8. విద్యా వ్యవస్థలో లోపాలు: పెట్టుబడిదారీ ప్రపంచంలో ఉద్యోగాలు అత్యంత ప్రత్యేకత సంతరించుకున్నాయి. కానీ భారతదేశ విద్యా వ్యవస్థ ఈ ఉద్యోగాలకు అవసరమైన సరైన శిక్షణ మరియు ప్రత్యేకతను అందించడం లేదు. ఇలా పని చేయడానికి ఇష్టపడే చాలా మంది నైపుణ్యాలు లేకపోవడంతో నిరుద్యోగులుగా మారుతున్నారు.

19.11. నిరుద్యోగ పరిణామాలు

1. పేదరికం – నిరుద్యోగం పేదరికానికి దారి తీస్తుంది. చాలా కాలం నిరుద్యోగం తర్వాత యువకులు డబ్బు సంపాదన కోసం చట్టవిరుద్ధమైన మరియు తప్పుడు కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో దేశంలో నేరాలు కూడా పెరిగాయి.

2. సామాజిక సమస్యలు – నిరుద్యోగులు సంఘ విద్రోహ శక్తులచే సులభంగా ప్రలోభానికి గురవుతారు. దీంతో దేశంలోని ప్రజాస్వామ్య విలువలపై వారికి నమ్మకం పోతుంది.

3. మాదకద్రవ్యాలకు బానిసలుగా మారటం – నిరుద్యోగులు మాదకద్రవ్యాలు మరియు మద్యానికి బానిసలుగా మారడం లేదా ఆత్మహత్యకు ప్రయత్నించడం, దేశంలోని మానవ వనరులకు నష్టం కలిగించడం తరచుగా కనిపిస్తుంది.

4. మానవ వనరుల నష్టం – నిరుద్యోగ సమస్య మానవ వనరులకు నష్టం కలిగిస్తుంది. శ్రామికులు వారి గరిష్ట సమయాన్ని ఉపాధిని వెతుక్కోవడానికి కేటాయించడం వల్ల, పని దొరకక పోవడం వల్ల ఎంతో విలువైన శ్రామిక పని గంటలు కోల్పోవలసి వస్తుంది

5. అల్ప జీవన ప్రమాణం – నిరుద్యోగ కాలంలో ప్రజలు ఉపాధి కోసం పోటీ పడటం, బేరమాడే శక్తి లేకపోవడం, అల్ప వేతనాలు, ఆదాయాల వల్ల వారి జీవన ప్రమాణం తగ్గిపోతుంది.

6. ఆర్థిక వ్యవస్థపై ప్రభావం – ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. ఎందుకంటే వనరులను ఉత్పత్తి చేయడానికి కావలసిన శ్రామిక శక్తి నిరుద్యోగులుగా వుంటే వీరు వాస్తవానికి మిగిలిన శ్రామిక జనాభాపై ఆధారపడి ఉంటారు. తద్వారా రాష్ట్రానికి సామాజిక, ఆర్థిక వ్యయాలు పెరుగుతాయి. ఉదాహరణకు, నిరుద్యోగంలో 1 శాతం పెరుగుదల GDPని 2 శాతం తగ్గిస్తుంది.

7. శ్రామిక దోపిడి – నిరుద్యోగ స్థితిలో కార్మికులు గరిష్టంగా దోపిడీకి గురవుతారు. శ్రామికులు వివిధ పరిస్థితులలో తక్కువ వేతనాలకే పని చేయాల్సివస్తుంది. ఇది శ్రామికుల సామర్థ్యాన్ని తెలియచేస్తుంది.

8. నైపుణ్యాల వినియోగం కోల్పోవడం – నిరుద్యోగులు తమ నైపుణ్యాలను వినియోగించుకోలేరు. ఇది ఇలాగే చాలాకాలం పాటు కొనసాగితే వ్యక్తులు తమకు గల నైపుణ్యాలను కూడా కోల్పోగల పరిస్థితి వస్తుంది.

19.12 ప్రభుత్వం - పేదరికం మరియు నిరుద్యోగ నివరణాచర్యలు

నిరుద్యోగాన్ని నివారించే చర్యలన్నీ పేదరికాన్ని తగ్గించేవే. ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందితే పేదరికం క్రమంగా తగ్గుతుంది. కాబట్టి ఆర్థిక వృద్ధి రేటును పెంచడంపై ఆర్థికవేత్తలు దృష్టి పెట్టారు. ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలను అమలుపరిచారు. దీనిలో భాగంగా చిన్నతరహా పరిశ్రమల వంటి వాటిలో ఉపాధి ఉద్దేశ్యంగా ప్రత్యేక దృష్టితో వేగవంతమైన వృద్ధిని సాధించాలని భావించారు. పేదరికాన్ని తగ్గించడానికి దశలవారీగా అనుసరించిన కార్యక్రమాలను నాలుగు విస్తృతమైన వర్గాలుగా విభజించారు. వీటి గురించి పరిశీలిద్దాం.

1. గ్రామీణ పేదలకోసం ఆదాయ వనరులు మరియు అభివృద్ధి కార్యక్రమాలు: ఈ కార్యక్రమాల ఉద్దేశ్యం ప్రధానంగా గ్రామీణ పేదల ఆదాయం పెంచి వారి ఆర్థిక స్థితి గతులను మెరుగుపరచడం ఈ కోవలోకి వచ్చే ప్రధాన కార్యక్రమాలు – చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ (SFDA), ఉపాంత రైతులు మరియు వ్యవసాయకూలీల ఏజెన్సీ (MFAL), సమీకృత గ్రామీణ అభివృద్ధి కార్యక్రమం (IRDP), మొదలైనవి గ్రామీణ పేదల ఆదాయాన్ని పెంచడానికి ప్రారంభించినవి.

2. ప్రత్యేక ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలు: ఈ కేటగిరీలో వున్న కార్యక్రమాలు – కరువు పీడిత ప్రాంత కార్యక్రమం (DPAP) ఎడారి అభివృద్ధి కార్యక్రమం (DDP), కొండ ప్రాంత అబివృద్ధి కార్యక్రమం లాంటివి కొన్ని ప్రత్యేక ప్రయోజనాల కోసం ఉద్దేశించబడినవి. అడవులు పాడి పరిశ్రమ అభివృద్ధి వంటివి ఆ ప్రాంతం లోని బలహీన వర్గాల ప్రజల ఆదాయాన్ని పెంచే కొన్ని కార్యక్రమాలు.

3. అనుబంధ ఉపాధి అవకాశాల కల్పన కోసం పని కార్యక్రమాలు: ఈ కేటగిరీలో ఉపాధి కల్పనలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం (NREP), గ్రామీణ భూమిలేని వారికి ఉపాధి హామీ కార్యక్రమం మరియు పనికి ఆహార పథకం (FWP), ప్రధానమంత్రి సమీకృత పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమం (PMIUPEP) అనేవి పేదలకు అనుబంధ ఉపాధిని కల్పిస్తాయి. జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం ఇప్పుడు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కల్పనా కార్యక్రమం (MGNREGP)గా మారింది.

4. కనీస అవసరాల కార్యక్రమం: ఈ నాలుగవ రకంలో కనీస అవసరాల కార్యక్రమం, 20 పాయింట్స్ కార్యక్రమం అనేవి పేద ప్రజల వినియోగ స్థాయిని పెంచడం ద్వారా వారి ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా ప్రవేశపెట్టారు. దీనిలో ప్రాథమిక విద్య, ఆరోగ్యం, త్రాగు నీటి సరఫరా, రోడ్లు, విద్యుదీకరణ, గృహవసతి, పౌష్టికాహారం చేర్చడమైనది.

ఇటీవలి సంవత్సరాలలో, భారతదేశంలోని పేదరికం సమస్యకు పరిష్కారం కోసం ప్రభుత్వం ద్వికోణవ్యూహాన్ని ప్రవేశపెట్టింది.

1. అధిక శ్రమ సాంద్రతకు హామీ ఇచ్చే రంగాల విస్తరణ, మరియు
2. పేదలకు విద్య, నైపుణ్యం మరియు ఆరోగ్యంతో సాధికారత కల్పించడం ద్వారా వారు దారిద్ర్య రేఖను దాటేందుకు వీలు కల్పించే అధిక యోగ్యత మరియు మెరుగైన వేతనాన్ని అందించే రంగాల ప్రవేశించగలరు.

స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ప్రభత్వాలు పేదరికాన్ని మరియు నిరుద్యోగాన్ని తగ్గించడానికి ఎన్నో కార్యక్రమాలు, పథకాలు ప్రవేశపెట్టాయి. గత 2 దశాబ్దాలుగా ప్రభుత్వాలు అమలు చేసిన కొన్నిపేదరిక నిరుద్యోగ పథకాలుక్రింద పట్టికలో ఇవ్వబడ్డాయి.

1 జనశ్రీ భీమా యోజన 2000 దారిద్ర్య రేఖకు దిగువన వున్నవారికి భీమా కలపించడం

2 ప్రధానమంత్రి గ్రామోదయ యోజన 2000 గ్రామాలలో కనీస వసతులు కల్పించుట

3. అంత్యోదయ అన్న యోజన 2000 పేదలకు ఆహార భద్రత

4. ఆశ్రయ భీమా యోజన 2000 ఉపాధి కోల్పోయిన కార్మికులకు పరిహారం

5 ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (PMGSY) 2001 అన్ని గ్రామాలకు పక్కా రోడ్లు వేయాలి

6 కేతిహార్ మజ్దూర్ బీమా యోజన (KMBJ)2001 కేతిహార్ మజ్దూర్ బీమా యోజన (KMBJ)

7. శిక్షా సయోగ్ యోజన (SSY) 2001 దారిద్ర్య రేఖకు దిగువన వున్న పిల్లల విద్య

8. సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (SGRY) 2001 ఉపాధి మరియు ఆహార భద్రత

9. ఉపాధి జయ ప్రకాష్ నారాయణ్ రోజ్గర్ గ్యారెంటీ యోజన (JPNRGY) 2001 పేదరిక జిల్లాల్లో ఉపాధి కల్పన

10. వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన (VAMBAY) 2001 పట్టణ మురిక వాడ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణం

11. జాతీయ పనికి ఆహార పథకం (NFFWP) 2004 అనుబంధ వేతనం ఉపాధి కలపించడం.

12. జననీ సురక్ష యోజన 2005 రక్షణ ఆశించే తల్లులకు సంరక్షణ అందించడం.

13. భారత్ నిర్మాణ్ ప్రోగ్రామ్ (BNP) 2005 గ్రామీణ మౌలిక సదుపాయాలను అందించడం (నీటిపారుదల, నీటి సరఫరా, రోడ్లు, టెలిఫోన్ మరియు విద్యుత్)

14. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA): 2006 సంవత్సరంలో కనీసం 100 రోజుల వేతన ఉపాధిని కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి భద్రతను పెంచడం.

15. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్: 2011 స్వయం ఉపాధి మరియు నైపుణ్యం కలిగిన వేతన ఉపాధి అవకాశాలను పొందడం.

16. జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్: 2013 పట్టణ పేదలను స్వయం సహాయక బృందాలుగా ఏర్పాటు చేయడం, నైపుణ్యాభివృద్ధికి అవకాశాలను సృష్టించడం.

17. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (PMAY): 2016 దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (BPL) కుటుంబాల మహిళలకు 50 మిలియన్ల LPG కనెక్షన్లను పంపిణీ చేయడానికి.

18. ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్-ధన్ (PM-SYM): 2019 వృద్ధాప్య రక్షణ మరియు అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత (UW)

19. ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర నిధి: 2020 కోవిడ్-19 కారణంగా ప్రభావితమైన వీధి వ్యాపారులకు మైక్రో-క్రెడిట్ సౌకర్యాలు.

19.13 ముగింపు

భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధానమైన సవాళ్ళలో పేదరికం నిరుద్యోగం ముఖ్యమైనవి. మానవులు జీవించటానికి అవసరమైన కనీస అవసరాలను కూడా తీర్చుకోలేకపోవడమే పేదరికంగా చెప్పవచ్చు. మన దేశంలో సంపూర్ణ పేదరికం, సాపేక్ష పేదరికం రెండు కలవు. దారిద్ర్యరేఖ స్థాయి కంటే తక్కువ ఖర్చు పెట్టే వారిని పేదలుగా గుర్తిస్తారు. పేదరికానికి అనేక కారణాలు వున్నాయి. పేదరికంలో వున్నవారు అల్ప జీవన ప్రమాణాలను కలిగి వుంటారు. పిల్లలు పోషకాహారలోపంతో బాధ పడుతుంటారు. నిరుద్యోగం పేదరికానికి ప్రధాన సమస్య. మనదేశంలో ఎక్కువగా అనిచ్ఛాపుర్వక, అల్ప ఉద్యోగిత మరియు ప్రచ్ఛన్న నిరుద్యోగం వున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక, నిరుద్యోగ నిర్మూలనకై ఎన్నో పథకాలు,కార్యక్రమాలు ప్రవేశ పెడుతూనే వున్నారు వాటిలో ఒకటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమం.

19.14 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. నిరపేక్ష పేదరికంను నిర్వచించుము.
2. పేదలు అని ఎవరిని పేర్కొంటారు?
3. అల్ప ఉపాధి అనగానేమి?
4. సాంకేతిక నిరుద్యోగం ఎప్పుడు ఏర్పడుతుంది

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. పేదరికపు పరిణామాలను రెండింటి గురించి వివరించండి.
2. నిర్మాణాత్మక నిరుద్యోగం గురించి వ్రాయండి.
3. పేదరికానికి గల ప్రధాన కారణాలను విశ్లేషించండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. నిరుద్యోగానికి పేదరికానికి సంబంధం ఉన్నదని ఎలా చెప్పగలవు?
2. పేదరికం, నిరుద్యోగం రూపుమాపటానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న కార్యక్రమాలలో ఏవేని రెండింటి గురించి తెలపండి.

19.15 పదకోశం

దారిద్ర్యరేఖ-ప్రాథమిక అవసరాలను తీర్చుకోవటానికి కావలసిన కనీస ద్రవ్య ఆదాయం.

సరళీకరణ- విదేశీ వాణిజ్యంపై ప్రభుత్వాలు విధించిన అవరోధాలను అన్ని అడ్డంకులను తొలగించడం.

ప్రైవేటీకరణ -ప్రభుత్వ అధీనంలో వున్న సంస్థలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేయడం.

ప్రపంచీకరణ - విదేశీ వాణిజ్యం మరియు విదేశీ పెట్టుబడుల ద్వారా వివిధ దేశాలను అనుసంధానించడం.

19.16 ఉపయుక్త గ్రంథాలు

1. తెలుగు అకాడమీ ఇంటర్మీడియెట్ అర్థశాస్త్రం
2. భారతదేశ ఆర్థిక సర్వే

అధ్యాయం 20

ప్రణాళికలు, నీతి ఆయోగ్

20.0 లక్ష్యాలు

20.1 పరిచయం

20.2 ప్రణాళికల భావన

20.3 ప్రణాళికల ప్రాముఖ్యత

20.4 ప్రణాళికల రకాలు

20.5 భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలు

20.5.1 పంచవర్ష ప్రణాళికల ప్రధాన ఉద్దేశాలు

20.6 పంచవర్ష ప్రణాళికలు– విజయాలు, అపజయాలు

20.6.1 విజయాలు

20.6.2 అపజయాలు

20.7 నీతి ఆయోగ్

20.8 నీతి ఆయోగ్ వ్యవస్థాపక నిర్మాణం

20.9 నీతి ఆయోగ్ ఆశయాలు

20.10 నీతి ఆయోగ్ – అధికారాలు, విధులు

20.11 సారాంశం

20.12 మాదిరి పరీక్ష ప్రశ్నలు

20.13 పదకోశం

20.14 ఉపయుక్త గ్రంథాలు

20.0 లక్ష్యాలు

- ప్రణాళికల ప్రాముఖ్యతను గుర్తిస్తారు.
- పంచవర్ష ప్రణాళికల ప్రధాన లక్ష్యాలను వివరిస్తారు.
- ప్రణాళికల వల్ల సాధించిన ప్రగతిని అంచనా వేస్తారు.
- ప్రణాళికల స్థానంలో నీతి ఆయోగ్ తీసుకురావలసిన అవసరాన్ని విశ్లేషిస్తారు.
- నీతి ఆయోగ్ నిర్మాణం, అభివృద్ధిలో దాని పాత్రను వివరిస్తారు.

20.1 పరిచయం

ప్రణాళిక అంటే ఒక ఉద్దేశ్యంతో పనిచేయడం. వ్యక్తిగత స్థాయిలో లేదా జాతీయ స్థాయిలో ప్రణాళికాబద్ధంగా సిద్ధపడడం అనేది ఒక కీలకమైన మైలురాయి. ఒక వ్యక్తి యొక్క సామాజిక జీవితం ఎల్లప్పుడూ వివిధ ప్రణాళికల పథకాలపై ఆధారపడి ఉంటుంది. సామాజిక, ఆర్థిక ప్రణాళిక, సమాజంలో ప్రబలంగా ఉన్న పరిస్థితులను మెరుగుపరచడానికి విధాన రూపకర్తలకు ఒక మార్గాన్ని అందిస్తుంది. సానుకూల ఫలితాలు లేనట్లయితే ఈ ప్రక్రియ అసంపూర్ణంగా ఉంటుంది. స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి చెందుతున్న దేశంగా, భారతదేశం ఉపాధి, ఆదాయాలను మెరుగుపరచాలి, పెట్టుబడులు, వృద్ధిని పునరుద్ధరించాలి, ఆర్థిక రంగానికి పరిపుష్టిని అందచేయాలి. అందరికీ విద్య మరియు ఆరోగ్యం అందించాలన్నా, దేశం సత్వర అభివృద్ధి సాధించాలన్నా ప్రణాళికలు అమలు పరచటమే సరైన విధానమని అప్పటి మన నాయకులు భావించారు. మన దేశ అభివృద్ధిలో పంచవర్ష ప్రణాళికలు ప్రధానమైన పాత్ర పోషించాయి.

20.2 ప్రణాళికల భావన

కొద్ది మొత్తంలో వనరులు వుండి, పెద్ద మొత్తంలో సంక్షేమం అందించబడాలంటే, ప్రణాళిక అమలు తప్పనిసరి అవుతుంది. ప్రముఖ ఆర్థికవేత్త 'తోడారో' ప్రకారం "ఒక నిర్ధిష్ట దేశం లేదా ప్రాంతం ప్రధాన ఆర్థిక చరరాశులలో (GDP, వినియోగం, పెట్టుబడి, పొదుపులు మొదలైనవి) ప్రత్యక్షంగా మరియు కొన్ని సందర్భాల్లో నియంత్రించడానికి, మార్పులను ప్రభావితం చేయడానికి, కేంద్ర సంస్థ యొక్క ప్రయత్నమే అభివృద్ధి ప్రణాళిక". ఆర్థిక ప్రణాళిక యొక్క విజయం ప్రభుత్వం యొక్క ప్రభావం, తోడ్పాటు, నియంత్రణలపై ఆధారపడి వుంటుంది. ఆర్థిక ప్రణాళికలు అనే భావనను తొలిసారిగా ఉపయోగించినవారు. గున్నార్ మిర్డాల్ (స్వీడన్-ఆర్థికవేత్త).

నిర్ణీత కాలంలో ముందుగా నిర్ణయించిన లక్ష్యాలు, వాటి సాధన మార్గాల ద్వారా దేశం ఆర్థికాభివృద్ధిని పెంపొందించడానికి ప్రభుత్వం చేసే కృషిని ప్రణాళిక ప్రక్రియ అంటారు. ప్రణాళిక మరియు ప్రణాళికా అమలు అనేవి రెండు వేర్వేరు అంశాలు. ప్రణాళిక అనేది ఒక ముద్రిత పత్రం, ఒక బ్లూ ప్రింట్, ఒక కృత్యాధార నమూనా. ప్రణాళిక అమలు అనేది బ్లూ ప్రింట్‌తో పాటు లక్ష్యాలను సాధించడానికి చేయవలసిన కృషిని కూడా తెలుపుతుంది.

20.3 ప్రణాళికల ప్రాముఖ్యత

ప్రణాళికలు అన్ని రకాల ఆర్థిక రుగ్మతలకు ఔషధం లాంటిది. వీటి వల్ల కలిగే ప్రయోజనాలు:

I. దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రణాళిక ఎప్పుడు కీలక పాత్ర పోషిస్తుంది.

II. ఆర్థిక ప్రణాళిక అనేది ప్రణాళికబద్ధమైన ఆర్థిక వ్యవస్థ యొక్క విధానాన్ని అనుసరించడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించడానికి ఒక వ్యూహం.

III. దేశ సామజిక ఆర్థిక అవసరాలకు అనుగుణంగా దేశ వనరులు, సంపద వినియోగించబడుతాయి.

IV. ప్రణాళిక ప్రజల అభివృద్ధికి కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు వీలు కల్పిస్తుంది మరియు జీవన ప్రమాణాలను పెంచుతుంది.

V. ప్రణాళికలు అధిక సంఖ్యాక ప్రజలకు ఆర్థిక భద్రతను కలగజేస్తుంది.

VI. దేశం స్వయం సమృద్ధి సాధించడానికి తోడ్పడుతుంది.

VII. వనరుల సక్రమ కేటాయింపుల ద్వారా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధ్యపడుతుంది.

VIII. వివిధ రంగాలలో పెరుగదల రేటు అధికంగా వుంటుంది.

IX. ఆర్థిక వ్యవస్థలో అనూహ్యంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికా ఆర్థిక వ్యవస్థ సర్దుబాటు చేసుకొంటుంది. పొదుపు, పెట్టుబడుల మధ్య సమతుల్యతను కొనసాగించడం ద్వారా వ్యాపార రంగంలో వచ్చే ఒడిదొడుకుల నుండి ఆర్థిక వ్యవస్థను రక్షిస్తుంది.

X. ప్రజలకు సమాన అవకాశాలు కలిపించడం ద్వారా సాంఘిక సమానత్వం, సామాజిక భద్రత మరియు సామాజిక న్యాయం ప్రజలందరికీ కల్పించబడుతుంది.

XI. ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థలో వనరుల వృథా అరికట్టబడుతుంది. పొదుపుగా వినియోగించబడుతాయి.

XII. అధిక ఉత్పత్తి లేదా అల్ప ఉత్పత్తి నివారించడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలు మెరుగ్గా నిర్వహించబడుతాయి.

20.4. ప్రణాళికల రకాలు

ఆర్థిక వ్యవస్థలో వివిధ రకాల ప్రణాళికలు అమలు చేయబడుతున్నాయి. వాటిలో ముఖ్యమైన కొన్నింటి గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

1. **ప్రజాస్వామ్య ప్రణాళిక-నిరంకుశ ప్రణాళిక:** ప్రజాస్వామ్య ప్రణాళికలో ఉత్పత్తి కారకాలపై రాజ్యం యొక్క జోక్యం ఉండదు. ప్రజాభిప్రాయనికి విలువనిస్తూ, ప్రజా సమూహానికి దోహదపడేదిగా వుంటుంది. ప్రణాళికల ఉద్దేశ్యాలు, ప్రణాళికా లక్ష్యం అన్నీ ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా నిర్దేశిస్తారు. ప్రజాస్వామ్య ప్రణాళికలో ఆర్థిక కార్యకలాపాలకు స్వేచ్ఛ ఉంటుంది. నిరంకుశ లేదా అధికార ప్రణాళికలో ఒక ప్రణాళికకు అనుగుణంగా అన్ని ఆర్థిక కార్యకలాపాలపై కేంద్ర నియంత్రణ, దిశానిర్దేశం ఉంటుంది. వినియోగం, ఉత్పత్తి, పంపిణీ అన్నీ ప్రణాళికా యంత్రాంగంచే నియంత్రించబడతాయి.

2. **కేంద్రీకృత, వికేంద్రీకృత ప్రణాళిక:** ప్రణాళికను రూపొందించడం, స్వీకరించడం, అమలు చేయడం పర్యవేక్షణ, నియంత్రణ కేంద్ర ప్రణాళిక అధికారం ద్వారా జరుగుతుంది. ప్రణాళిక అధికార యంత్రాంగమే లక్ష్యాలు మరియు ప్రాధాన్యతలను నిర్ణయిస్తుంది. ఈ రకమైన ప్రణాళికా పై స్థాయి నుండి క్రింది స్థాయి వరకు విస్తరిస్తుంది. వికేంద్రీకృత ప్రణాళిక దిగువ నుండి పైకి ఉంటుంది. దీని కింద, దేశంలోని వివిధ అడ్మినిస్ట్రేటివ్ యూనిట్లను సంప్రదించడం ద్వారా సెంట్రల్ ప్లానింగ్ అథారిటీ ద్వారా ప్రణాళిక రూపొందించబడింది. మరో మాటలో చెప్పాలంటే, ఈ రకమైన ప్రణాళిక దిగువ నుండి పైకి ఉంటుంది, అట్టడుగు స్థాయి నుండి ప్రారంభమవుతుంది. ఈ ప్రణాళిక ప్రకారం, ప్రణాళిక గురించి ఆర్థిక నిర్ణయాలు తీసుకునే స్థానిక, ప్రాంతీయ అధికారులపై బాధ్యత ఉంటుంది. ఇది బహుళ-స్థాయి ప్రణాళిక, దీనిలో ఒకటి కంటే ఎక్కువ సంస్థలు ప్రణాళిక అమలు కోసం పని చేస్తాయి.

3. **దృక్కోణ ప్రణాళికా (Perspective planning), వార్షిక ప్రణాళిక:** ఇది 15-20-25 సంవత్సరాల దీర్ఘకాలిక ప్రణాళికను సూచిస్తుంది. ప్రణాళిక కాలాన్ని 5 సంవత్సరాల ప్రణాళికల వంటి స్వల్పకాల ప్రణాళికలుగా విభజించడం ద్వారా నిర్ణీత వ్యవధిలో విస్తృత లక్ష్యాలను సాధించడం కోసం అమలు చేయబడుతుంది. ఇది నిరంతర ప్రణాళికగా కొనసాగుతుంది. సమర్థవంతంగా అమలుపరచటం కోసం ప్రతి స్వల్పకాల ప్రణాళికా తిరిగి వార్షిక ప్రణాళికలుగా విభజించబడుతుంది. వార్షిక ప్రణాళికలు వాటి లక్ష్యాలు, కేటాయింపుల ప్రకారం అమలవుతాయి. నిజం చెప్పాలంటే వార్షిక ప్రణాళికలు ఆర్థిక ప్రణాళిక యొక్క నిజమైన కృత్య పత్రాలు.

20.5 భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలు

స్వాతంత్ర్యానంతరం మార్చి 1950లో, దేశంలోని వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, ఉత్పత్తిని పెంచడం, అందరికీ ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను వేగంగా పెంచడానికి ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యాల ప్రకారం, భారత ప్రభుత్వం యొక్క తీర్మానం ద్వారా ప్రణాళికా సంఘం ఒక సలహా మరియు ప్రత్యేక సంస్థగా ఏర్పాటు చేయబడింది. ప్రణాళికా సంఘం భారతదేశానికి పంచవర్ష ప్రణాళికలను సూచించింది.

1951 నుండి 2017 వరకు మొత్తం 12 ప్రణాళికలను అమలు చేయడం జరిగినది. మొదటి ప్రణాళిక 1951-56 కాలానికి ప్రారంభమై వరుసగా రెండవ ప్రణాళిక 1956-61, మూడవ ప్రణాళిక 1961-67 కాలానికి అమలుపరచడం జరిగినది. కానీ పాకిస్థాన్ యుద్ధం, కరువు పరిస్థితి వంటి వివిధ కారణాలతో 1966-67 సంవత్సరంలో ప్రణాళికా విరామం ప్రకటించారు. తిరిగి 1966-67, 1967-68, 1968-69 సంవత్సరాలలో వార్షిక ప్రణాళికలు అమలు చేయడం జరిగినది. నాల్గవ ప్రణాళిక 1969-74 కాలానికి ప్రణాళిక పునరుద్ధరించబడింది. ఆ తర్వాత ఐదవ ప్రణాళిక (1974-79) వచ్చింది. అది అధికారంలో ఉన్న పార్టీ మార్పుల కారణంగా దాని పూర్తి కాలాన్ని పూర్తి చేయలేదు. జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1978-83 కాలానికి సంబంధించిన ఆరవ ప్రణాళికను ప్రారంభించింది. మళ్లీ 1980లో ప్రభుత్వం మారడంతో కొత్త ఆరవ ప్రణాళిక 1980-85 కాలానికి, 7వ ప్రణాళిక1985-90 కాలానికి ప్రారంభమైనవి. 1990లో 8వ ప్రణాళిక ప్రారంభమైనప్పటికి అనివార్య కారణాల వల్ల మళ్ళీ 2 వార్షిక ప్రణాళికలే అమలు చేశారు. తిరిగి 8వ ప్రణాళిక 1992-97 కాలానికి ప్రారంభమైంది. తరువాత వరుసగా 1997-2002 మధ్య 9వది, 2002-2007 మధ్య 10వది, 2007-2012 మధ్య 11వ, 2012-17 మధ్య 12వ ప్రణాళికలు అమలు చేయడం జరిగినది.

20.5.1 పంచవర్ష ప్రణాళికల ప్రధాన ఉద్దేశ్యాలు

ప్రతి ప్రణాళికా కొన్ని ప్రధాన ఉద్దేశ్యాలతో ఏర్పాటు చేయడం జరిగినది. ఒక ప్రణాళికకు ఇంకొక ప్రణాళిక మధ్య లక్ష్యాలు, ఆశయాలలో తేడాలున్నప్పటికి అన్నింటిలోనూ కొన్ని దీర్ఘకాలిక లక్ష్యాలున్నాయి. అవి 1. ఆర్థిక వృద్ధి 2 స్వావలంభన, 3. సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి 4. ఉపాధి అవకాశాల కల్పన 5. ఆదాయ అసమానతలను తగ్గించడం 6. పేదరిక నిర్మూలన 7. ఆధునికీకరణ 8. సమగ్ర వృద్ధి మరియు సుస్థిరత.

పట్టిక-1: వివిధ ప్రణాళికలలోని ప్రధాన ఉద్దేశ్యాలు 1951-2017

ప్రణాళిక	ప్రణాళికా కాలం	ప్రధాన ఉద్దేశ్యం
I	1951-56	వ్యవసాయం, నీటి పారుదల సౌకర్యాల అభివృద్ధి
II	1956-61	భారీ పరిశ్రమల అభివృద్ధి
III	1961-66	ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి
IV	1969-74	నిలకడతో కూడిన వృద్ధి, స్వావలంబన, పేదరికాన్ని తొలగించుట
V	1974-79	పేదరిక నిర్మూలన, స్వావలంబన
VI	1980-85	లాభదాయకమైన ఉపాధి కల్పించడం ద్వారా పేదరిక నిర్మూలన
VII	1985-90	ఆహార ధాన్యాల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచుట
VIII	1992-97	మానవ వనరుల అభివృద్ధి
IX	1997-2002	సమానత్వం, సామాజిక న్యాయంతో కూడిన ఆర్థిక వృద్ధి
X	2002-07	సమానత్వం, సామాజిక న్యాయం, మానవ వనరుల నాణ్యతను పెంచుట
XI	2007-12	సమగ్ర వృద్ధి
XII	2012-17	సుస్థిరతతో కూడిన సమగ్ర వృద్ధి

20.6 పంచవర్ష ప్రణాళికలు - విజయాలు, అపజయాలు

20.6.1 విజయాలు

భారతదేశం 12 పంచవర్ష ప్రణాళికలను పూర్తి చేసింది. ప్రణాళికా కాలంలో మిశ్రమ ఫలితాలను సాధించింది. ఇది కొన్ని రంగాలలో అద్భుత విజయాలను సాధించింది. మరికొన్నింటిలో అనుకున్న మేర విజయాలను అందుకోలేక పోయింది.

20.6.1 ప్రణాళిక కాలంలో మన దేశం సాధించిన కొన్ని విజయాలను పరిశీలిద్దాము.

I. జాతీయాదాయం, తలసరి ఆదాయంలో పెరుగుదల: భారతదేశంలో ఆర్థిక ప్రణాళిక యొక్క ప్రాథమిక లక్ష్యాలలో ఒకటి జాతీయ, తలసరి ఆదాయాలను పెంచడం. ఆర్థిక ప్రణాళిక యొక్క ప్రత్యక్ష పర్యవసానంగా, ప్రణాళికలు అంచనా వేసినంత వేగంగా కాకపోయినా భారతదేశ జాతీయ, తలసరి ఆదాయం పెరిగింది. 2011-12 ధరల వద్ద జాతీయ ఆదాయం 1950-51లో రూ. 224,786 కోట్లు నుండి 2017-18లో రూ. 139.52 లక్షలకు పెరిగింది. ఇదే కాలంలో తలసరి ఆదాయం రూ. 5,752 నుండి రూ. 1,12,835 పెరిగింది.

II. వ్యవసాయ రంగం లో ప్రగతి: ప్రభుత్వం వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు మరియు నీటిపారుదల అభివృద్ధికి ప్రతి పంచవర్ష ప్రణాళికలో సగటున 23 నుండి 24 శాతం ప్రణాళిక వ్యయం చేసింది. ఈ ప్రణాళిక వ్యయం యొక్క ప్రత్యక్ష ఫలితంగా, వ్యవసాయోత్పత్తి క్రమంగా పెరిగింది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి, ఎంచుకున్న ప్రాంతాలలో నీరు, ఎరువులు, పురుగుమందులు, సంకర జాతి (HYV) విత్తనాలు మొదలైన వాటి సరఫరాను విస్తరించడానికి ప్రయత్నాలు జరిగాయి. ఈ కొత్త వ్యవసాయ వ్యూహం హరిత విప్లవానికి దారితీసింది. బియ్యం, గోధుమలు, బంగాళదుంపల ఉత్పత్తిలో ఇది నిజంగా అద్భుతమైనది.

III. పారిశ్రామిక ప్రగతి: బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఎరువులు, ఉక్కు, అల్యూమినియం, పెట్రోలియం (ముడి) మరియు విద్యుత్ వంటి కొన్ని మౌలిక పరిశ్రమలలో పురోగతి నిజంగా ఆకట్టుకుంది. మెటలర్జికల్ పరిశ్రమలు, రసాయన మరియు అనుబంధ పరిశ్రమలలో కూడా పురోగతి కనిపించింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచిక 1993-94 ధరలలో 1950-51లో 12.3 నుండి 2005-06లో 221.5కి పెరిగింది. ఇది 4.6% వార్షిక వృద్ధిరేటుని చూపుతుంది.

IV. మూలధన వస్తువుల స్వయంసమృద్ధి: భారతదేశం ఇప్పుడు చాలా వరకు పరిశ్రమల వృద్ధిని కొనసాగించగలుగుతుంది అంటే వస్త్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంట్, కెమికల్స్, మెటలర్జికల్, ట్రాన్స్‌పోర్టు వంటి పరిశ్రమలకు దేశీయంగా మూలధన వస్తువుల ఉత్పత్తి చేయగలుగుతుంది. ఈ రంగంలో దిగుమతులు అతి స్వల్పం.

V. తలసరి వినియోగ వస్తువుల లభ్యత: ఆర్థిక వ్యవస్థలోని మూడు రంగాలలో ప్రణాళికాబద్ధమైన ఉత్పత్తి పెరుగుదల పర్యవసానంగా, అవసరమైన వినియోగ వస్తువుల తలసరి లభ్యత, వినియోగం క్రమంగా పెరిగింది. సంవత్సరానికి 2.1% చొప్పున జనాభా పెరగకపోతే లేదా జనాభా పెరుగుదలను సమర్థవంతంగా నియంత్రించి ఉంటే ఈ పెరుగుదల చాలా ఎక్కువగా ఉండేది.

VI. పొదుపు, పెట్టుబడులలో వృద్ధి: ఈ సమయంలో వినియోగ వస్తువుల తలసరి వినియోగం పెరిగినప్పటికీ, స్థూల దేశీయోత్పత్తి (GDP)లో స్థూల దేశీయ పొదుపు 1950-51లో 8.9% నుండి 2005-06లో 32.4%కి పెరిగింది. స్థూల దేశీయ మూలధన నిర్మాణం 8.7% నుండి 33.8%కి పెరిగింది.

VII. ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి: పారిశ్రామికీకరణకు పునాది వేసే ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన గొప్ప ప్రాముఖ్యత కలిగిన మరొక విజయం. రోడ్డు రవాణా విస్తరణ మార్కెట్ విస్తరణకు దారితీసింది. నీటిపారుదల, గ్రామీణ విద్యుదీకరణ వ్యవసాయానికి ఊతమిచ్చాయి. జల విద్యుత్ ప్రాజెక్టులు పారిశ్రామిక విస్తరణకు అవకాశం కల్పించాయి.

VIII. దిగుమతి ప్రత్యామ్నాయం, ఎగుమతుల వైవిధ్యం: వేగవంతమైన పారిశ్రామికీకరణను సాధించే విధానాన్ని అనుసరించడం వల్ల, మూలధన వస్తువుల కోసం భారతదేశం విదేశాలపై ఆధారపడటం తగ్గింది. అదేవిధంగా,

ఇంతకుముందు పెద్ద సంఖ్యలో దిగుమతి చేసుకున్న వినియోగ వస్తువులు ఇప్పుడు దేశీయంగా ఉత్పత్తి చేయబడుతున్నాయి. ఇది దిగుమతి ప్రత్యామ్నాయానికి దారితీసింది. పర్యవసానంగా, భారతదేశ ఎగుమతుల యొక్క వస్తువుల కూర్పు తయారీదారీ, ఖనిజ నూనెలు, ఇంజనీరింగ్ వస్తువులకు అనుకూలంగా మారింది.

IX. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి: ఆధునిక పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను నడపడానికి శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి, మేనేజర్ కేడర్ల అభివృద్ధి ప్రణాళిక యొక్క మరొక విజయం. ఇది విదేశీ నిపుణులపై భారతదేశం ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించింది

X. విస్తృత విద్యావకాశాల లభ్యత: భారతీయ ప్రణాళిక యొక్క గొప్ప విజయాలలో ఒకటి భారీ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడం-ప్రపంచంలో మన దేశం మూడవ అతి పెద్ద విద్యా వ్యవస్థ కలది. 1950-51లో ప్రాథమిక మరియు మాధ్యమిక పాఠశాలల్లో నమోదు 223 లక్షల నుండి 2005-06 నాటికి 1283 కు చేరింది. 2011 నాటికి అక్షరాశ్యత 74.04%గా పెరిగింది.

పట్టిక-2: పంచవర్ష ప్రణాళికలలో సాధించిన వృద్ధి రేటు (1993-94 ధరలలో)
కారకాల ధరలలో నికర జాతీయోత్పత్తి

క్ర. సం.	ప్రణాళిక	వృద్ధి రేటు లక్ష్యం	సాధించినది
1	ఒకటవ ప్రణాళిక	2.1	3.6
2	రెండవ ప్రణాళిక	4.5	4.1
3	మూడవ ప్రణాళిక	5.6	2.8
4	నాలుగవ ప్రణాళిక	5.7	3.3
5	ఐదవ ప్రణాళిక	4.4	4.8
6	ఆరవ ప్రణాళిక	5.2	5.7
7	ఏడవ ప్రణాళిక	5.0	6.0
8	ఎనమిదవప్రణాళిక	5.6	6.8
9	తొమ్మిదవ ప్రణాళిక	6.5	5.4
10	పదవ ప్రణాళిక	8.0	7.5
11	పదకొండవ ప్రణాళిక	9.0	8.3
12	పన్నెండవ ప్రణాళిక	8.0	-

20.6.2 అపజయాలు

పంచవర్ష ప్రణాళికలు మన దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాయని చెప్పడంలో అతిశయోక్తి లేకపోయినప్పటికీ కొన్ని అపజయాలు కూడా ఉన్నాయి. నిర్ణయించుకున్న లక్ష్య రేటును అన్ని ప్రణాళికలలో సాధించలేదు.

ముఖ్యమైన కొన్ని అపజయాలు:

1. గ్రామీణ ప్రాంతాలలో పేదరికం సాపేక్షంగా ఇంకా ఎక్కువగానే ఉంది.
2. నిరుద్యోగత పెరిగింది. పట్టణ, గ్రామీణ పేదరికానికి ప్రధాన కారణం నిరుద్యోగిత.
3. ఆదాయ అసమానతలు తగ్గలేదు.
4. భూసంస్కరణలు సరిగా అమలుకు నోచుకోక పోవడం వల్ల భూపంపిణీ అసమానంగా ఉంది.
5. ప్రాంతీయాభివృద్ధిలో కూడా అసమానతలు ఉన్నాయి.

20.7 నీతి ఆయోగ్

నీతి ఆయోగ్ [NITI (National Institution for Transforming India) Aayog] ను 64 ఏళ్లపాటు సేవలో ఉన్న ప్రణాళికా సంఘానికి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేశారు. నీతి ఆయోగ్ అనేది భారత ప్రభుత్వం యొక్క ప్రధాన విధానపరమైన ఆలోచన. దేశ ఆర్థిక వృద్ధిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత సంస్థలు, నిపుణులు మరియు ప్రజలతో విస్తృతమైన సంప్రదింపుల తరువాత కేంద్ర మంత్రివర్గ సమావేశంలో దీని ఏర్పాటు గురించి తీర్మానించారు. జనవరి 1, 2015న దీనిని ఏర్పాటు చేశారు. ఇక్కడ, సంస్కృతంలో, “నీతి” అనే పదం నైతికత, ప్రవర్తన మరియు మార్గదర్శకత్వాన్ని సూచిస్తుంది. అభివృద్ధి ప్రక్రియకు కీలకమైన, దిశాత్మకమైన, వ్యూహాత్మక ఆలోచనలను అందించడానికి నీతి ఆయోగ్ స్థాపించబడింది. నీతి ఆయోగ్ సహకార సమాఖ్య విధానం వైపు దృష్టి సారించింది. దేశం యొక్క పురోగతిలో కీలక పాత్ర పోషిస్తూ, ఇది ప్రతి విధానాన్ని జాతీయ ప్రయోజనాలతో, ముఖ్యంగా భద్రతాపరమైన సమస్యలతో జాగ్రత్తగా పరిగణిస్తుంది. భారత ప్రభుత్వం కోసం వ్యూహాత్మక మరియు దీర్ఘకాలిక విధానాలు మరియు కార్యక్రమాల రూపకల్పనతో పాటు, నీతి ఆయోగ్, కేంద్రం, రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధిత సాంకేతిక సలహాలను కూడా అందిస్తుంది. వాటి అమలు ప్రభుత్వాలపైనే ఉంటుంది. రాష్ట్రాలకు నిధులను కేటాయించే అధికారం ప్రణాళికా సంఘానికి ఉన్నట్లు ఇప్పుడు నీతి ఆయోగ్‌కు లేదు. అది ఇప్పుడు ఆర్థిక మంత్రిత్వ శాఖ ద్వారా చేయబడుతుంది.

ఇది దేశ ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుందని భావిస్తున్న ప్రధాన విధాన రూపకల్పన సంస్థ. ఇది బలమైన దేశాన్ని సృష్టించడానికి సహాయపడే, క్రియాశీలమైన, బలమైన రాష్ట్రాలు నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తుంది.

భారతదేశం ప్రపంచంలోనే ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. నీతి ఆయోగ్ ప్రధానంగా రెండు విభాగాలను సృష్టించింది. “టీమ్ ఇండియా హబ్” మరియు “నాలెడ్జ్ అండ్ ఇన్నోవేషన్ హబ్” అని పిలువబడే కేంద్రాలు.

1. టీమ్ ఇండియా: ఇది కేంద్ర ప్రభుత్వంతో భారత రాష్ట్రాల భాగస్వామ్యానికి దారి తీస్తుంది.
2. నాలెడ్జ్ అండ్ ఇన్నోవేషన్ హబ్: ఇది సంస్థ యొక్క థింక్ ట్యాంక్ సామర్థ్యాలను నిర్మిస్తుంది.

20.8 నీతి ఆయోగ్ వ్యవస్థాపక నిర్మాణం

నీతి ఆయోగ్ నిర్మాణం వివిధ వ్యక్తులతో కూడి ఉంటుంది.

a. చైర్‌పర్సన్‌గా ప్రధానమంత్రి.

b. వైస్-ఛైర్‌పర్సన్: ప్రధానమంత్రి నియామిస్తాడు.

c. సభ్యులు: నలుగురు ఫుల్‌టైమ్ సభ్యులు, ఇద్దరు పార్ట్ టైమ్ సభ్యులు (ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశోధనల నుండి)

d. ఎక్స్-అఫీషియో సభ్యులు: కేంద్ర మంత్రి మండలిలోని నలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు

e. చీఫ్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ (భారత ప్రభుత్వ కార్యదర్శి హోదా): ప్రధానమంత్రి ఒక నిర్ణీత కాలానికి నియమిస్తాడు.

f. గవర్నింగ్ కౌన్సిల్: అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్‌లతో కూడిన మండలి.

g. ప్రాంతీయ మండలి: రాష్ట్రాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లతో కూడిన ప్రాంతీయ మండలి ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలు లేదా ప్రాంతాలను ప్రభావితం చేసే నిర్దిష్ట సమస్యలు మరియు ఆకస్మిక పరిస్థితులను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తాయి. ఈ మండలిలోని ముఖ్యమంత్రులలో ఒకరు అధ్యక్షునిగా వ్యవహరిస్తారు.

h. సచివాలయం: కేంద్ర మంత్రులు, వివిధ రంగాలలో నిష్ణాతులు, ప్రముఖ విద్యావేత్తలు సభ్యులుగా వుంటారు. నీతి ఆయోగ్‌కు కావలసిన సహాయ సహకారాలు అందజేస్తూ ఉంటారు. నీతి ఆయోగ్ కార్యనిర్వహణ చీఫ్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ నిర్వహిస్తాడు.

20.9 నీతి ఆయోగ్ యొక్క ఆశయాలు

I. జాతీయ లక్ష్యాల సాధన కోసం రాష్ట్రాలతో సహకార సమాఖ్యవాదాన్ని పెంపొందించడం.

II. ఇది ఆర్థికాంశాలతో పాటు ప్రాధాన్యం ఉన్న జాతీయ, అంతర్జాతీయ విషయాలపై సూచనలిస్తుంది.

III. గ్రామ స్థాయిలో విశ్వసనీయమైన వ్యూహాలు రూపొందించే యంత్రాంగాన్ని తీర్చిదిద్ది, వాటి అమలు తీరును పర్యవేక్షించడం, క్రమంగా వివిధ ప్రభుత్వ స్థాయిలలో వీటిని సమగ్రపరచడం.

IV. ఆర్థిక విజయాల నుండి ఆర్థికంగా ప్రయోజనం పొందని సమాజంలోని వివిధ వర్గాలపై దృష్టి పెట్టడం.

V. వ్యూహాత్మక మరియు దీర్ఘకాలిక విధానం కోసం ప్రణాళికలు రూపొందించడం, వాటి అభివృద్ధి, ప్రభావాన్ని అంచనా వేయడం.

VI. ఆర్థిక వ్యూహాలు, విధానాలల్లో జాతీయ భద్రత ప్రయోజనాలకు ప్రాముఖ్యత కల్పించడం.

VII. రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు వ్యవసాయోత్పత్తికి, ఆహారభద్రతతో ముడిపెట్టడం.

VIII. ప్రగతిశీల ఎజెండాను వేగవంతం చేయడానికి ఇంటర్-సెక్టోరల్, ఇంటర్-డిపార్ట్‌మెంటల్ సమస్యల పరిష్కారానికిఅవకాశం కలపించడం.

IX. విజయావకాశాలను పెంపొందించడానికి అవసరమైన వనరులను కలిగి ఉన్న కార్యక్రమాల అమలును సమర్థవంతంగా పరీక్షించడం, మూల్యాంకనం చేయడం.

X. అభివృద్ధి ప్రక్రియలో ప్రవాస భారతీయ పౌరులను భాగస్వామ్యం చేయడం.

XI. వివిధ కార్యక్రమాలు అమలు చేయడంలో సాంకేతికతను మెరుగుపరచడం, సాంకేతిక విజ్ఞానం ఉపయోగించి సుపరిపాలనను అందించడం.

XII. అభివృద్ధి ప్రక్రియలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడం, అందరికీ అవకాశాలు కల్పించడం

20.10 నీతి ఆయోగ్ అధికారాలు, విధులు

I. సహకార సమాఖ్య భావనను పెంపొందించడం నీతి ఆయోగ్ ప్రధాన విధి.

II. జాతీయ విధానాలను రూపొందించే క్రమంలో రాష్ట్రాలను భాగస్వామ్యులను చేయడం. పరిమాణాత్మక, గుణాత్మక లక్ష్యాలను నిర్ణీత కాల వ్యవధిలో సాధించేందుకు వ్యూహాలను సిద్ధం చేయడంతో పాటు వాటి అమలుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పరచుకోవడం.

III. జాతీయ అభివృద్ధి ప్రాధాన్యత, వ్యూహాలను రూపొందించి వాటిని ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు అమలు చేసేందుకు 'జాతీయ అజెండా' రూపకల్పనకు తగిన చేయూత ఇస్తుంది.

IV. సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్రాలకు సహాయపడడం. విధాన ప్రణాళికను కిందిస్థాయి నుంచి పైస్థాయి నమూనాలో రూపకల్పన చేస్తుంది.

V. స్థానిక సంస్థలను పటిష్ట పరచి గ్రామ స్థాయిలో ఉత్తమ ప్రణాళికలు రూపొందించేలా చేయడం. దేశ భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వివిధ పథకాలు, వివిధ రంగాలకు సంబంధించి దీర్ఘ, మధ్య కాలిక వ్యూహాలను సిద్ధం చేస్తుంది.

VI. విధానాలు, కార్యక్రమాల రూపకల్పన విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అంతర్గత కన్సల్టెన్సీ విధులు నిర్వర్తిస్తుంది.

VII. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఇది కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖలకు సహాయం చేయడానికి నిపుణులతో వివిధ రంగాలకు సంబంధించిన వ్యూహాలను సిద్ధం చేస్తుంది. యాజమాన్య, సాంకేతిక పరమైన పరిజ్ఞానాన్ని వివిధ రంగాల్లో పెంపొందించడం. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాల అమలును సమీక్షించి, ఆయా విధానాల ప్రభావాన్ని అంచనా వేస్తుంది.

VIII. ఇది ప్రపంచ నైపుణ్యం మరియు వనరులను వినియోగించుకోవడానికి నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది.

IX నీతి ఆయోగ్ సామర్థ్యాలను పెపొందించి సాంకేతికతను ఉన్నతీకరిస్తుంది.

X. ఇది కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖలకు సహాయం చేయడానికి నిపుణులతో వ్యూహాలను సిద్ధం చేస్తుంది.

20.11 సారాంశం

సామాజిక, ఆర్థిక ప్రణాళిక, సమాజంలో ప్రబలంగా ఉన్న పరిస్థితులను మెరుగుపరచడానికి విధాన రూపకర్తలకు ఒక మార్గాన్ని అందిస్తుంది. నిర్ణీత కాలంలో ముందుగా నిర్ణయించిన లక్ష్యాలు, వాటి సాధన మార్గాల ద్వారా దేశం ఆర్థికాభివృద్ధిని పెంపొందించడానికి ప్రభుత్వం చేసే కృషిని ప్రణాళిక ప్రక్రియ అంటారు. ప్రణాళికలు వివిధ రకాలు. మన దేశంలో 1951 నుండి 2017 వరకు మొత్తం 12 ప్రణాళికలను అమలు చేయడం జరిగినది.

మన దేశం ప్రణాళికా కాలంలో మిశ్రమ ఫలితాలను సాధించింది. ఇది కొన్ని రంగాలలో అద్భుత విజయాలను సాధించింది. మరికొన్నింటిలో అనుకున్న మేర విజయాలను అందుకోలేక పోయింది.

నీతి ఆయోగ్ [NITI (National Institution for Transforming India) Aayog]ను 64 ఏళ్లపాటు సేవలో ఉన్న ప్రణాళికా సంఘానికి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేశారు. దీనికి ప్రధాన మంత్రి చైర్ పర్సన్‌గా వ్యవహరిస్తారు, రాష్ట్ర ముఖ్యమంత్రులతో కూడిన ప్రాంతీయ మండలి కూడా ఉంటుంది. సహకార సమాఖ్య భావనను పెంపొందించడం నీతి ఆయోగ్ ప్రధాన విధి. జాతీయ విధానాలను రూపొందించే క్రమంలో రాష్ట్రాలను భాగస్వాములను చేయడం. పరిమాణాత్మక, గుణాత్మక లక్ష్యాలను నిర్ణీత కాలవ్యవధిలో సాధించేందుకు వ్యూహాలను సిద్ధం చేయడంతో పాటు వాటి అమలుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పరచుకొంటుంది.

20.12 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ప్రణాళిక అనగానేమి?
2. మొదటి ప్రణాళిక ఏ రంగానికి ప్రాధాన్యతను ఇచ్చింది?
3. రెండు సార్లు ప్రవేశ పెట్టబడిన పంచవర్ష ప్రణాళిక ఏది?
4. నీతి ఆయోగ్ ప్రధాన లక్ష్యం ఏమిటి?

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ప్రణాళికల ప్రాముఖ్యతను వివరించండి.
2. నీతి ఆయోగ్ సంస్థాగత నిర్మాణాన్ని తెలపండి.
3. ప్రణాళికల దీర్ఘకాలిక లక్ష్యాలను రాయండి.
4. ప్రణాళికా సంఘం స్థానంలో నీతి అయోగ్‌ను ఎందుకు ప్రవేశ పెట్టబడింది?

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. వివిధ రకాల ప్రణాళికలలో ఏ రకమైన ప్రణాళికలను నీవు సమర్థిస్తావు?
2. నీతి ఆయోగ్ యొక్క ప్రధాన ఆశయాలను రాయండి.
3. ప్రణాళికల విజయాలు, అపజయాలను క్లుప్తంగా వివరించండి.

20.13 పదకోశం

- NITI (National Institution for Transforming India) Aayog]
- ప్రణాళిక: నిర్ణీత కాలంలో ముందుగా నిర్ణయించిన లక్ష్యాలు, వాటి సాధన మార్గాల ద్వారా దేశం ఆర్థికాభివృద్ధిని పెంపొందించడానికి ప్రభుత్వం చేసే కృషిని ప్రణాళిక ప్రక్రియ.

20.14 ఉపయుక్త గ్రంథాలు

- భారతదేశ అర్థశాస్త్రం 2022, మిశ్రా & పూరి.
- ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, తెలుగు అకాడమీ.

అధ్యాయం

21

వ్యవసాయ రంగం

21.0 లక్ష్యాలు

21.1 పరిచయం

21.1 భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ప్రాముఖ్యత మరియు వృద్ధి

21.2 వ్యవసాయ అల్ప ఉత్పాదకత

21.2.1 భారతదేశంలో వ్యవసాయ ఉత్పాదకతను పెంచే చర్యలు

21.3 భారతదేశంలో భూ సంస్కరణలు

21.3.1 భూసంస్కరణల అమలుకు ప్రభుత్వ చర్యలు

21.4 భారతదేశంలో హరిత విప్లవం మరియు ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం

21.4.1 హరిత విప్లవం ప్రభావం

21.5 వ్యవసాయ పరపతి మరియు గ్రామీణ రుణభారం

21.6 భారతదేశంలో వ్యవసాయ మార్కెటింగ్

21.6.1 వ్యవసాయ మార్కెటింగ్‌లోని లోపాల నివారణ చర్యలు

21.7 భారతదేశంలో వ్యవసాయ ధరల విధానం

21.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

21.9. పదకోశం

21.10. ఉపయుక్త గ్రంథాలు

21.0 లక్ష్యాలు

- వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం.
- వ్యవసాయంలో ఉత్పాదకత తక్కువగా ఉండటానికి గల కారణాలను వివరించడం.
- భూసంస్కరణలను చర్చించడం.
- హరిత విప్లవ ప్రభావాన్ని చర్చించడం.
- భారతీయ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను విశ్లేషించండం.

21.1 పరిచయం

భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక. ఇది ప్రజల జీవన విధానంలో ఒక భాగం మరియు సంస్కృతి మరియు సంప్రదాయాలను ప్రభావితం చేయడం ద్వారా భారతదేశంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ ఆహారం, పశుగ్రాసం అందిస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా మూడు రంగాలుగా విభజించబడింది, అవి 1. వ్యవసాయ రంగం 2. పారిశ్రామిక రంగం 3. సేవారంగం.

ఈ యూనిట్‌లో వ్యవసాయ రంగానికి సంబంధించిన వివిధ రంగాలు అంటే వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత, భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం వృద్ధి, తక్కువ ఉత్పాదకతకు కారణాలు, వ్యవసాయ ఉత్పాదకతను పెంచే చర్యలు, భూసంస్కరణలు, హరిత విప్లవం, దాని ప్రభావం, వ్యవసాయ విత్తం, గ్రామీణ రుణభారం, వ్యవసాయ మార్కెటింగ్, ధరల విధానం, భారత ఆహార భద్రత మొదలైన వాటి గురించి తెలుసుకుందాం.

21.1.1 భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత మరియు పెరుగుదల

అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యవసాయ రంగం పారిశ్రామిక అభివృద్ధికి ముడిసరుకులుగా, ఆహారం మరియు ఆహారేతర ఉత్పత్తులు వంటి ప్రాథమిక అవసరాలను అందిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తులను పారిశ్రామిక రంగానికి సరఫరా చేసి సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుంది. ప్రపంచంలోని మొత్తం వ్యవసాయ యోగ్యమైన భూమిలో భారతదేశం 3% వాటాను కలిగి ఉంది మరియు ప్రపంచంలో గోధుమ, పండ్లు మరియు కూరగాయల ఉత్పత్తిలో భారతదేశం రెండవ అతి పెద్ద ఉత్పత్తిదారు మరియు చేపల ఉత్పత్తిలో మూడవ అతి పెద్ద ఉత్పత్తిదారు. భారత వ్యవసాయ రంగం ప్రపంచ జనాభాలో 17% ప్రజలకు మద్దతు ఇస్తుంది. పై గణాంకాలన్నీ భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తాయి. జాతీయ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను ఈ క్రింది అంశాల ద్వారా వివరించవచ్చు.

1. జాతీయాదాయంలో వ్యవసాయ రంగం వాటా

మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో జాతీయాదాయంలో మూడింట రెండు వంతులు వ్యవసాయ రంగం నుంచే వచ్చేవి. భారతదేశంలో ప్రణాళికలు ప్రారంభమైన తరువాత ద్వితీయ మరియు తృతీయ రంగాల అభివృద్ధితో, జాతీయ ఆదాయంలో వ్యవసాయ రంగం వాటా తగ్గింది. 1950-51లో జాతీయాదాయంలో వ్యవసాయ రంగం వాటా 56.5%, 2015-16లో 19% ఉండగా, 2017-18 నాటికి 17.4%కి తగ్గింది. ఒక దేశం అభివృద్ధి చెందుతున్న కొద్దీ జాతీయాదాయంలో ప్రాథమిక రంగం వాటా క్షీణించడం నిర్మాణాత్మక మార్పులకు సూచిక అని ఆర్థికవేత్త కొలిన్ క్లార్క్ అభిప్రాయపడ్డారు. అమెరికా, ఇంగ్లాండ్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలో, స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో 2% మాత్రమే వ్యవసాయ రంగం నుండి వస్తుంది.

2. ఉపాధి కల్పనలో వ్యవసాయం వాటా

గాంధీజీ చెప్పినట్లు భారతదేశం గ్రామాల సముదాయం. 1951 లో జనాభాలో 83% గ్రామాలలో నివసిస్తుండగా, 17% పట్టణాలలో నివసిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 68% ప్రజలు గ్రామాల్లో, 32% పట్టణాల్లో నివసిస్తున్నారు. వ్యవసాయ రంగం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి కల్పిస్తుంది. 1951లో వ్యవసాయ రంగంపై ఆధారపడటం 72%, 2010, 2020లో వరుసగా 52%, 42%గా ఉంది. అయితే వ్యవసాయ రంగం నేటికీ ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోంది. ద్వితీయ మరియు తృతీయ రంగాలు స్థిరమైన వృద్ధి లేకపోవడం వల్ల ఎక్కువ ఉపాధిని సృష్టించలేకపోతున్నాయి, అందువల్ల వ్యవసాయం మరియు అనుబంధ రంగాలపై జనాభా ఒత్తిడి ఎక్కువగా ఉంది, ఫలితంగా తక్కువ ఉపాధి మరియు తక్కువ నిరుద్యోగం ఏర్పడుతుంది.

3. పరిశ్రమలకు ముడిసరుకు అందించడం

పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకును వ్యవసాయం అందిస్తుంది. చక్కెర, జనపనార, వస్త్ర పరిశ్రమ, సిగరెట్ పరిశ్రమ, పిండి మిల్లులు, పండ్ల తోటలు మరియు ఆహార తయారీ పరిశ్రమలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. చిన్నతరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు తమకు అవసరమైన ముడిసరుకుల కోసం వ్యవసాయ రంగంపై ఆధారపడుతున్నాయి.

4. అంతర్జాతీయ వాణిజ్యానికి సహకారం

భారతదేశ విదేశీ వాణిజ్యంలో వ్యవసాయం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది పురాతన కాలం నుండి భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. సుగంధ ద్రవ్యాలు, టీ, కాఫీ, చక్కెర, కోక్, పొగాకు, కాటన్ వస్త్రాలు, వస్త్రాలు, ముడి ఉన్ని, మినరల్ ఆయిల్స్ వంటి వస్తువులు మొదలైనవి. విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వ్యవసాయ ఎగుమతుల ద్వారా భారతదేశం పెద్ద మొత్తంలో విదేశీ మారకద్రవ్యాన్ని అందిస్తుంది.

5. పారిశ్రామిక వస్తువులకు మార్కెట్ల విస్తరణ

ప్రజలు తమ ఆదాయాన్ని ఆహారం కోసం ఉపయోగిస్తుండగా, మిగులు ఆదాయం దుస్తులు, ఫర్నీచర్, కుట్టు మిషన్లు, గ్యాస్ స్టవ్‌లు, టీవీలు, ఫ్రిజ్‌లు వంటి వివిధ పారిశ్రామిక ఉత్పత్తులను కొనుగోలు చేయడం కోసం ఖర్చు చేస్తారు. తద్వారా పారిశ్రామిక వస్తువులకు మార్కెట్ సృష్టించబడుతుంది.

6. ఆహారం మరియు పశుగ్రాసం సరఫరా

మానవుల ప్రాథమిక అవసరాలు ఆహారం, దుస్తులు, ఆశ్రయం మొదలైనవి. వీటిలో ఆహారం చాలా ముఖ్యమైనది. ఇది వ్యవసాయ రంగం నుండి లభిస్తుంది. ఆహారం తీసుకోకపోతే మనం బతకడం అసాధ్యం అవుతుంది. ఇది పశువులకు పశుగ్రాసాన్ని కూడా అందిస్తుంది. అందుకే వ్యవసాయం జీవనాధార రంగంగా పరిగణించబడుతుంది.

7. ఆర్థిక ప్రణాళిక, ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగం పాత్ర

వ్యవసాయ రంగం భారతదేశంలో బ్యాంకింగ్ వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. అంతర్గత వాణిజ్యం ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తుల కారణంగా జరుగుతుంది. ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించడంలో వ్యవసాయ రంగం పోషిస్తున్న పాత్ర గురించి 10వ పంచవర్ష ప్రణాళికలో "దేశంలో వేగవంతమైన ఆర్థికాభివృద్ధికి వ్యవసాయమే మూలం" అని స్పష్టంగా పేర్కొంది.

21.2 వ్యవసాయంలో అల్ప ఉత్పాదకత

1950-51 నుంచి 2012-13 మధ్య కాలంలో అనేక పంటల దిగుబడి నెమ్మదిగా, క్రమంగా పెరిగింది. వ్యవసాయ రంగంలో వాస్తవ ఉత్పాదకత స్థాయిలు ఇతర దేశాలతో పోలిస్తే లేదా సంభావ్య దిగుబడితో పోలిస్తే చాలా తక్కువ. భారతదేశంలో గోధుమ ఉత్పాదకత యుకె ఉత్పాదకతలో 48%, చైనా ఉత్పాదకతలో 64% ఉంది. భారతదేశంలో వరి ఉత్పాదకత చైనా ఉత్పాదకతలో 53%, అమెరికా ఉత్పాదకతలో 43% ఉంది. ఫలితంగా భారతదేశ ఉత్పాదకత తక్కువగా ఉంది.

వ్యవసాయంలో అల్ప ఉత్పాదకతకు కారణాలు

భారతదేశంలో వ్యవసాయ రంగంలో ఉత్పాదకత తక్కువగా ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయి. అవి 1. సాధారణ కారణాలు 2. సంస్థాగత కారణాలు 3. సాంకేతిక కారణాలు..

1. సాధారణ కారణాలు

i) **సామాజిక వాతావరణం:** గ్రామీణ ప్రాంతంలోని సామాజిక వాతావరణం వ్యవసాయాభివృద్ధికి అవరోధంగా ఉంది. భారతీయ రైతులు నిరక్షరాస్యులు, వారు మూఢనమ్మకాలు, పాత సంప్రదాయాలను అనుసరిస్తారు. వారు కొత్త వ్యవసాయ పద్ధతులను త్వరగా గమనించి అనుసరించరు.

ii) **భూమిపై జనాభా ఒత్తిడి:** భారతీయ వ్యవసాయంలో ఉత్పాదకత తక్కువగా ఉండటానికి జనాభా అధిక పీడనం ప్రధాన కారణం. భూకమతాల విభజన, విచ్ఛిన్నానికి క్షేత్ర స్థాయిలో పెరుగుతున్న జనాభా ఒత్తిడి కొంతవరకు కారణం కావచ్చు. ఇది స్వల్ప లాభదాయకమే కానీ భూ కమతాల ఉత్పాదకత తక్కువగా ఉంటుంది.

iii) **భూసార క్షీణత:** దేశంలోని 329 మిలియన్ హెక్టార్ల భూమిలో సగానికి పైగా భూసారం క్షీణించింది, తద్వారా వ్యవసాయంలో ఉత్పాదకత తగ్గింది.

2. సంస్థాగత కారణాలు

i) **కౌలుదారు వ్యవస్థ:** ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచడానికి రైతుల సామర్థ్యాన్ని, ఇష్టాన్ని వినియోగించుకునే వ్యవస్థ దోపిడీ వ్యవస్థ ద్వారా తగ్గిపోయింది. కౌలు చట్టం, కౌలుదారుల రక్షణ, కౌలుదారులకు భూమిపై హక్కులు కౌలుదారుల స్థితిగతుల్లో ఎలాంటి మెరుగుదల తీసుకురాలేదని, ఇలాంటి పరిస్థితుల్లో ఉత్పాదకతను పెంచలేమన్నారు.

ii) **భూ కమతాల పరిమాణం:** భారతదేశంలో భూ కమతాల సగటు పరిమాణం చాలా చిన్నది. 2010-11లో 85 శాతం భూమి 2 ఎకరాల లోపు ఉంది. మెరుగైన పనిముట్లు, విత్తనాలు మొదలైన వాటి పరంగా శాస్త్రీయ సాగు విధానం ఈ కమతాలలో సాధ్యం కాదు. లాభసాటిగా లేని భూముల కారణంగా వ్యవసాయ దిగుబడి కూడా తక్కువగా ఉంటుంది.

iii) **మూలధనం లేకపోవడం:** వ్యవసాయ రంగంలో ఇది మరో సమస్య. రైతులకు తగినంత రుణ సదుపాయం లేకపోవడం కూడా తక్కువ ఉత్పాదకతకు కారణమవుతుంది. కౌలుదారులకు అప్పు చేయడానికి మరియు తాకట్టు పెట్టడానికి భూమి లేదు, అందువల్ల కౌలుదారుడు రుణం పొందలేడు.

3. సాంకేతిక కారణాలు

i) **సంప్రదాయ వ్యవసాయ పనిముట్లు:** భారతదేశంలో రైతులు సాగులో సంప్రదాయ పద్ధతులు మరియు పనిముట్లను ఉపయోగిస్తున్నారు మరియు అధిక దిగుబడినిచ్చే విత్తనాల రకాలను ఉపయోగించడంలో అవగాహన లేదు. ఆధునిక ఉత్పత్తుల లభ్యత పరిమితంగానే కాకుండా వాటి ఖరీదు కూడా ఎక్కువగా ఉంటుంది. వాటిని కొనుగోలు చేసే శక్తి రైతులకు లేకపోవడంతో ఉత్పాదకత తక్కువగా ఉంటుంది.

ii) **నీటి పారుదల సౌకర్యాల కొరత:** ఉత్పత్తిలో ముఖ్యమైనది నీటిపారుదల సౌకర్యం. 2010-11లో భారతదేశంలో మొత్తం పంట విస్తీర్ణం 199 మిలియన్ హెక్టార్లు కాగా, కేవలం 89 మిలియన్ హెక్టార్ల భూమికి మాత్రమే సాగునీరు అందింది. అంటే 45% విస్తీర్ణంలో పంటలకు నీటి పారుదల సౌకర్యం ఉంది. అందుకే వర్షపాతం లేదా నీటి పారుదల సౌకర్యంపై పూర్తిగా ఆధారపడిన అన్ని ప్రాంతాల్లో ఉత్పాదకత తక్కువగా ఉంటుంది.

iii) పర్యావరణ సమస్యలు: వరదలు, అడవుల క్షీణత, భూగర్భ జలాల క్షీణత, కరువు, గ్లోబల్ వార్మింగ్, మోతాదుకు మించి ఎరువుల వాడకం, భూమి, నీరు మరియు వాయు కాలుష్యం కూడా వ్యవసాయంలో తక్కువ ఉత్పాదకతకు దోహదం చేస్తున్నాయి.

21.2.1 భారతదేశంలో వ్యవసాయ ఉత్పాదకతను పెంచే చర్యలు

తక్కువ ఉత్పాదకత సమస్యను సంస్థాగతంగా, సాంకేతికంగా, సామాజికంగా, ఆర్థికంగా పరిష్కరించాలి.

1) **సంస్థాగత చర్యలు:** భూసంస్కరణల అమలు, పరిమిత సౌకర్యాలు కల్పించడం, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్, నిల్వ గోదాములు, కమ్యూనికేషన్లు మొదలైనవి చేపట్టాలి.

2) **మెరుగైన ఉపకరణాలు:** విత్తనాలు, ఎరువులు, చీడపీడల నియంత్రణ మందులు, నీటిపారుదల, నిరంతర విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలను కల్పించడం ఉత్పాదకతకు దోహదం చేస్తుంది.

3) **రైతులకు రాబడులను మెరుగుపరచడం:** మద్దతు ధరలను పెంచడం, అవసరమైన సబ్సిడీలు అందించడం, పంటలకు బీమా సౌకర్యాలు కల్పించడం, వ్యవసాయేతర ఆర్థిక కార్యకలాపాలను పెంచడం ద్వారా భూమిపై జనాభా ఒత్తిడిని తగ్గించడం. దిగుబడులు పెంచడానికి వ్యవసాయంలో యాజమాన్య భావనలను ప్రవేశపెట్టడం వంటి చర్యలు కూడా అవసరం.

4) **సమర్థవంతమైన నిర్వహణ:** భూసారం క్షీణించకుండా నిరోధించడానికి మరియు భూమికి జరిగే నష్టాన్ని తగ్గించడానికి భూమి మరియు నీటి వనరుల సమగ్ర మరియు సమర్థవంతమైన నిర్వహణ అవసరం. రైతులు తమ వనరులను సమర్థంగా వినియోగించుకోవడానికి అవసరమైన విద్యను అందించాలి. భూసార పరీక్షలు, భూసార పరిరక్షణ, వ్యవసాయ వ్యర్థాల తొలగింపునకు మంచి వ్యవసాయ పరిశోధనలు అవసరం. ప్రాంతాల వారీగా వ్యవసాయ వాతావరణ ప్రణాళికలు తగిన రీతిలో ఉండాలి.

21.3 భారతదేశంలో భూ సంస్కరణలు

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఈ భూమి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉండేది. భూస్వాములు భూమి యొక్క ఉత్పాదకతను పెంచడానికి ఆసక్తి చూపలేదు. వ్యవసాయ ఉత్పాదకత ఉత్పత్తులను పండించే సామర్థ్యం కంటే తక్కువగా ఉంది మరియు సామాజిక న్యాయాన్ని కూడా అనుమతించలేదు. వ్యవసాయరంగంలో ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుని వ్యవసాయ వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చే ప్రక్రియే 'భూసంస్కరణలు'. ఐక్యరాజ్యసమితి నిర్వచనం ప్రకారం, "భూసంస్కరణ అనేది చిన్న సన్నకారు రైతులు మరియు వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను రక్షించే ఉద్దేశ్యంతో భూ పునఃపంపిణీ కార్యక్రమం.

భూ సంస్కరణల లక్ష్యాలు: 1951లో ప్రణాళికా సంఘం భూసంస్కరణల లక్ష్యాలను ఈ క్రింది విధంగా నిర్దేశించింది.

1. భూస్వాముల దోపిడీ నుంచి కౌలుదారులను రక్షించడం.
3. వ్యవసాయాభివృద్ధికి ఆటంకంగా ఉన్న అన్ని రకాల అడ్డంకులను తొలగించాలి.
4. దున్నుకునేవాడికి భూమి హక్కులు కల్పించడం.
5. భూ పునరుద్ధరణ కార్యక్రమాలను చేపట్టడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం.
6. పరిమిత భూ వనరులను హేతుబద్ధంగా ఉపయోగించడం.
7. ప్రభుత్వానికి, వాస్తవంగా భూమిని సాగు చేసే రైతులకు మధ్య ప్రత్యక్ష సంబంధాలను ఏర్పాటు చేయడం.
8. వ్యవసాయ రంగంలో అన్ని రకాల దోపిడీ, సామాజిక అన్యాయాలను తొలగించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించడం.

21.3.1 భూసంస్కరణల అమలుకు ప్రభుత్వ చర్యలు

స్వాతంత్ర్యానంతరం నూతన సమాజ స్థాపనకు, వ్యవసాయోత్పత్తుల వృద్ధికి భారత ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. భూసంస్కరణల ప్రధాన అంశాలు 1. మధ్యవర్తుల తొలగింపు 2. కౌలు సంస్కరణలు 3. భూ కమతాలపై గరిష్ట పరిమితి విధించడం.

1. మధ్యవర్తుల తొలగింపు

బ్రిటీష్ కాలంలో జమీందార్లు, జాగీర్దార్లు, ఇనాందార్లు మొదలైన మధ్యవర్తుల ఆధీనంలో పెద్ద మొత్తంలో భూములు ఉండేవి, వీరు సాగుదారుల నుండి కౌలు వసూలు చేసేవారు. స్వాతంత్ర్యానంతరం దళారులను చట్టప్రకారం తొలగించి రైతులకు భూములను అప్పగించారు. తద్వారా రైతులను దోపిడీ నుంచి కాపాడారు. ఇనాందార్ వ్యవస్థను కూడా రద్దు చేశారు. దళారులను తొలగించడం వల్ల తమ ఆధీనంలో ఉన్న భూమిని సాగుదారులకు బదలాయించడానికి దోహదపడింది.

2. కౌలు సంస్కరణలు

కౌలుదారుడు కౌలు చెల్లించాలనే షరతుపై భూమి యజమాని నుంచి నిర్ణీత కాలానికి భూమిని కౌలుకు తీసుకుంటారు. భూస్వాముల నుండి కౌలుదారులను రక్షించడానికి ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకుంది.

ఎ) **కౌలు పరిమాణాన్ని నియంత్రించడం:** కౌలుదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి, ప్రభుత్వం కౌలు పరిమాణాన్ని నియంత్రించింది. మొదటి పంచవర్ష ప్రణాళికలో, గరిష్ట అద్దె పరిమాణం మొత్తం ఉత్పత్తిలో 1/4 వ వంతు లేదా 1/5 వ వంతు మాత్రమే. హైదరాబాద్ సంస్థానంలో అమలులో ఉన్న "కౌలుదారుల రక్షణ చట్టం" కౌలుదారులను ఖాళీ చేయించే అవకాశాన్ని రద్దు చేసి, యజమాని నుండి భూమిని కొనుగోలు చేసే హక్కును వారికి ఇచ్చింది.

బి) కౌలుదారులకు భద్రత కల్పించడం: వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు కౌలుదారులను తరుచుగా తొలగించకుండా చట్టం ద్వారా రక్షణ కల్పించాయి.

1) భూస్వాములు తమ ఇష్టానుసారం కౌలుదారులను తొలగించలేరు.

2) భూస్వాములు స్వంత వ్యవసాయం కోసం మాత్రమే కౌలుదారు నుంచి భూమిని తీసుకోవచ్చు.

3) భూస్వామి తన సొంత వ్యవసాయం కోసం భూమిని తీసుకునే సమయంలో భూమిలో కొంత భాగాన్ని కౌలుదారుడి ఆధీనంలో ఉంచుకోవాలి.

సి) యాజమాన్య హక్కులు: కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కౌలుదారులకు హక్కులు కల్పించడానికి చట్టాలు చేశాయి. ఈ చర్య ప్రశంసనీయమే కానీ సాధించిన ఫలితాలు అంత సంతృప్తికరంగా లేవు.

3. భూ కమతాలపై గరిష్ట పరిమితి

"భూమి యొక్క గరిష్ట పరిమితి" అనేది ఒక కుటుంబం దాని యాజమాన్యం లేదా స్వాధీనంలో ఎంత భూమిని కలిగి ఉండాలో చట్టం ప్రకారం నిర్ణయించే ప్రక్రియ. ప్రభుత్వం పరిమితికి మించి భూమిని సేకరించి భూమిలేని రైతు కుటుంబాలకు, సన్నకారు రైతులకు పంపిణీ చేస్తుంది. 1960 నుంచి వివిధ రాష్ట్రాల్లో భూ పరిమితి చట్టాలు అమలవుతున్నాయి. బంధువులు (బినామీలు), ఇతరుల పేరిట భూముల బదలాయింపును నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైంది.

4. కమతాల సమీకరణ

భారతదేశంలో చిన్న కమతాలు విచ్ఛిన్నం కావడం సర్వసాధారణం. లాభదాయకంగా లేని ఈ కమతాలు మెరుగైన వ్యవసాయ పద్ధతులకు అనుకూలంగా లేవు. చిన్న కమతాలు, కమతాల విభజన సమస్యను పరిష్కరించడానికి పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర ప్రభుత్వాలు కమతాల సమీకరణకు కొంత ఉపశమనం కలిగించాయి. చాలా రాష్ట్రాల్లో రైతులు ఈ కార్యక్రమానికి సహకరించకపోవడంతో సమీకరణ మందకొడిగా సాగింది.

5. సహకార వ్యవసాయం

ఒక ప్రాంతంలోని వ్యవసాయదారులు తమ చిన్న చిన్న కమతాలను ఏకం చేసి సహకార వ్యవసాయ క్షేత్రంగా రూపొందిస్తారు. పెద్ద తరహా క్షేత్ర నిర్వహణలోని ఆదాలు ప్రభుత్వ మద్దతుతో లభిస్తాయి. పెద్ద రైతుల పాత్ర,అసమర్థపాలనా యంత్రాంగం, ఉత్పత్తి పంపిణీ సంతులిత పద్ధతిలో లేకపోవడం వల్ల ఇది ఎక్కువగా విజయవంతం కాలేదు. ఎందుకంటే "అందరి పని ఏ ఒక్కరి పనికాదు."

భారతదేశంలో భూసంస్కరణ కార్యక్రమాలు చాలా ఆశాజనకంగా ప్రారంభమయ్యాయి. అయితే, ప్రస్తుత నిరాశా నిస్పృహల కారణంగా సాధించిన పురోగతి సంతృప్తికరంగా లేదు.

అమలులో వైఫల్యాలకు ప్రధాన కారణాలు ఈ క్రిందివి.

1. రాజకీయ సంకల్పం లేకపోవడం.
2. కోర్టుల జోక్యం.
3. ఖచ్చితమైన, సవరించిన భూ రికార్డులు లేకపోవడం.
4. పాలనా యంత్రాంగ లోపం, భూసంస్కరణల అమలులో ఉదాసీనత.
5. అణగారిన వర్గాలకు పంపిణీ చేసిన భూములను అన్యాక్రాంతం చేయడం.
6. భూస్వాముల వ్యతిరేకత, చట్టాల అమలులో జాప్యం కారణంగా భూస్వాములు తమ భూములను బినామీ పేర్లతో కాపాడుకుంటున్నారు.
7. భూసంస్కరణల అమలులో భూముల పంపిణీలో ఆర్థిక సాయం కొరవడింది.
8. కింది స్థాయి (కిందిస్థాయి) వర్గాల నుంచి ఒత్తిడి లేకపోవడం.

పై కారణాల వల్ల భారతదేశంలో భూసంస్కరణలు ఆశించినంతగా విజయవంతం కాలేదు.

21.4 భారతదేశంలో హరిత విప్లవం

1960వ దశకం మధ్యలో ప్రపంచ వ్యవసాయ రంగం గొప్ప ముద్ర వేసింది. మెక్సికోకు చెందిన ప్రొఫెసర్ నార్మన్ బోర్లాగ్ మరియు అతని అనుచరులు అభివృద్ధి చేసిన అధిక దిగుబడినిచ్చే వరి మరియు గోధుమ పంటలను ప్రపంచ వ్యాప్తంగా ఉపయోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమయ్యాయి. నార్మన్ బోర్లాగ్‌ను ప్రపంచ హరిత విప్లవ పితామహుడిగా అభివర్ణించారు. 1966 ఖరీఫ్ సీజన్ నుంచి మన దేశంలో తొలిసారిగా హరిత విప్లవం అమల్లోకి వచ్చింది. రసాయన ఎరువులు, పురుగుమందులు, అధిక దిగుబడినిచ్చే వంగడాలు (HYV) ఉపయోగించి ఆహార ధాన్యాలలో అధిక దిగుబడులు సాధించే ప్రక్రియను "హరిత విప్లవం" అంటారు. హరిత విప్లవం అనే పదాన్ని మొదట విలియం ఎస్.గాండ్ ఉపయోగించారు. భారత హరిత విప్లవ పితామహుడిగా ఎం.ఎస్.స్వామినాథన్ ను పిలుస్తారు.

భారత ఆర్థిక వ్యవస్థపై హరిత విప్లవం ప్రభావం: భారత వ్యవసాయ రంగంపై హరిత విప్లవం గణనీయంగా ప్రభావం చూపింది. ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం పెరిగింది. మన దేశ వ్యవసాయ రంగంపై హరిత విప్లవం ప్రభావాన్ని ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

1. **ఆహార ధాన్యాల ఉత్పత్తుల్లో పెరుగుదల:** HYV టెక్నాలజీని అవలంబించడం ద్వారా వరి, గోధుమ, మొక్కజొన్న, జొన్న ఉత్పత్తుల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది. వరి ఉత్పత్తి 1960-61లో 35 మిలియన్ టన్నుల నుంచి 2013-14 నాటికి 106.29 మిలియన్ టన్నులకు చేరుకుంది. గోధుమల ఉత్పత్తి కూడా 1960-61లో 11.1 మిలియన్ టన్నులు ఉండగా 2013-14లో మిలియన్ టన్నులు 95.85 టన్నులకు చేరుకుంది.

2. **ఉపాధి:** వ్యవసాయ రంగంలో బహుళ పంటలను ప్రోత్సహించడం ద్వారా హరిత విప్లవం ఉపాధి అవకాశాలను విస్తరించింది. ఫుడ్ ప్రాసెసింగ్, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు (HYVs), రసాయన ఎరువుల ప్యాకేజీల వల్ల ఉపాధి అవకాశాలు పెరిగాయి.

3. **ఆదాయంలో పెరుగుదల:** పంజాబ్, హర్యానా, తమిళనాడు, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో హరిత విప్లవం ప్రభావం రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచింది. వ్యవసాయ అనుబంధ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల విస్తరణతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజల ఆదాయం పెరిగింది.

4. **ఎగుమతుల్లో పెరుగుదల:** 1960-61లో వ్యవసాయం, దాని అనుబంధ ఉత్పత్తులు రూ. 284 కోట్ల మేర ఎగుమతి అయ్యాయి. 2013-14 నాటికి ఈ ఎగుమతుల విలువ రూ. 2,57,590 కోట్లకు చేరడంతో విదేశీ మారకద్రవ్యం సమకూరింది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా ఎగుమతి, దిగుమతి విధానం (ఎగ్జిమ్ పాలసీ)లో వచ్చిన మార్పులు మన దేశ వ్యవసాయ రంగ ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరగడానికి దోహదపడ్డాయి.

5. **వాణిజ్య పంటల పెరుగుదల:** ఆహార పంటల ఉత్పత్తితో పాటు, హరిత విప్లవం ప్రభావం చెరకు, పత్తి వంటి పంటల దిగుబడిని పెంచింది, తద్వారా పంటల సరళి లో మార్పు వచ్చింది.

21.4.1 ఆర్థిక వ్యవస్థపైహరిత విప్లవ ప్రభావం

1. ఆదాయ అసమానతలు పెరిగాయి.
2. ప్రాంతీయ విభేదాలు పెరిగాయి.
3. హరిత విప్లవం ఆహార పంటలకే పరిమితమైంది. నూనెగింజల ఉత్పత్తిలో ఎలాంటి మార్పు లేదు.
4. కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది.
5. ఆధునిక పద్ధతుల వాడకం పెరిగి కార్మికులు ఉపాధి కోల్పోయారు.
6. రసాయన, పురుగుమందుల వాడకం పెరగడం వల్ల మానవ ఆరోగ్యమే కాదు పర్యావరణం కూడా దెబ్బతింటోంది.
7. హరిత విప్లవం వల్ల చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయారు.
8. వ్యవసాయం కార్పొరేట్ కంపెనీలతో కుదేలైంది.

21.5 వ్యవసాయ పరపతి మరియు గ్రామీణ రుణభారం

వ్యవసాయ అవసరాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, భూమి అభివృద్ధి పనులు, విత్తనాలు, పశుగ్రాసం, పశువుల కొనుగోలు కోసం రైతులు రుణాలు తీసుకుంటారు. వ్యవసాయ రుణాలు ప్రధానంగా మూడు రకాలు.

స్వల్పకాలిక రుణాలు: విత్తనాలు, పశువులు, పశుగ్రాసం కొనుగోలు చేయడానికి ఈ రుణాలు ఇస్తారు మరియు వాటి కాలపరిమితి 15 నెలల కంటే తక్కువ.

మధ్యకాలిక రుణాలు: వ్యవసాయ భూములను చదును చేయడం, పశువుల కొనుగోలు, వ్యవసాయ పనిముట్ల కొనుగోలుకు రుణాలు. వీటి కాలపరిమితి 5 సంవత్సరాల వరకు ఉంటుంది.

దీర్ఘకాలిక రుణాలు: అదనంగా వ్యవసాయ భూముల కొనుగోలు, ఖరీదైన యంత్రాల కొనుగోలు, పాత బకాయిల చెల్లింపు కోసం చేసిన రుణాలు. దీని కాలపరిమితి 5 సంవత్సరాల నుండి 20 సంవత్సరాల వరకు ఉంటుంది.

వ్యవసాయ పరపతి వనరులు: భారతదేశంలో రైతులకు అందుబాటులో ఉన్న వ్యవసాయ పరపతి వనరులను రెండు రకాలుగా విభజించవచ్చు. 1. సంస్థాగత పరపతి వనరులు 2. సంస్థాగతంకాని పరపతి వనరులు.

1. సంస్థాగత పరపతి వనరులు

ఎ) **ప్రభుత్వం:** కరువులు, వరదలు వచ్చినప్పుడు ప్రభుత్వం నామమాత్రపు వడ్డీకే రుణాలు ఇస్తుంది. వీటినే "తక్కావీ" రుణాలు అంటారు.

బి) **సహకార పరపతి సంఘాలు:** రైతులకు అవసరమైన రుణాలను సకాలంలో తక్కువ వడ్డీకి అందించేందుకు మన దేశంలో 1904లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. గ్రామస్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, జిల్లా స్థాయిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డీసీఈబీ), రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర సహకార బ్యాంకులు (ఎస్సీబీ) ఏర్పాటయ్యాయి. ఇవి స్వల్పకాలిక, మధ్య కాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇస్తాయి.

సి) **వాణిజ్య బ్యాంకులు:** ఇవి రైతులకు రుణాలు అందించడంలో శిఖరాగ్రంలో ఉన్నాయి. 2013 నాటికి ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు కలిసి 71.2% సంస్థాగత రుణాలను అందించాయి.

డి) **ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు:** శ్రీ ఎం. నరసింహ కమిటీ సిఫార్సుల మేరకు 1975 అక్టోబర్ 2న ఐదు (5) ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఏర్పాటయ్యాయి. ఇవి 2012-13 నాటికి మొత్తం రుణాల్లో 10.5% అందించాయి.

ఇ) **నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ (నాబార్డ్):** గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వాలు, పంచాయతీరాజ్ సంస్థలకు ఋణాలు అందించడానికి 1982 జూలైలో ప్రత్యేక హోదా కలిగిన బ్యాంకుగా స్థాపించబడింది.

2. సంస్థాగతంకాని పరపతి వనరులు

గ్యారంటీ డాక్యుమెంట్లు లేకుండా రుణాల కోసం రైతులు సమీప రుణ వనరులపై ఆధారపడుతున్నారు. 1. వడ్డీ వ్యాపారులు 2. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు 3. భూస్వాములు 4. బంధుమిత్రులు ముఖ్యపాత్ర వహిస్తారు. ఈ రుణాలపై వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుంది. ఈ పరపతి వ్యవస్థలో మోసాలు, దోపిడీల వల్ల రైతులు నష్టపోతారు.

గ్రామీణ రుణభారానికి కారణాలు: గ్రామీణ ప్రాంతాల్లో రుణాలు పెరగడానికి ఈ క్రింది అంశాలు కారణమవుతాయి. అవి ఇలా ఉన్నాయి.

1. సాగు వ్యయం విపరీతంగా పెరిగింది.
2. పంటలకు మద్దతు ధరలు సరిపోవడం లేదు.
3. తల్లిదండ్రుల నుంచి అప్పులను వారసత్వంగా పొందుతారు.
4. అనుత్పాదక పనులకు ఖర్చు చేస్తారు.
5. రుణాలు తీసుకుని భూ అభివృద్ధి పనులు చేయాలనే తపన.
6. పేదరికం, తక్కువ స్థాయిలో పొదుపు, పంట నష్టం.

గ్రామీణ రుణభారం తగ్గించే చర్యలు: అసంఘటిత రుణాలపై ఎక్కువగా ఆధారపడటం, పంటలకు మద్దతు ధరలు పెంచడం, సంస్థాగత రుణాలను విస్తరించడం, వడ్డీ వ్యాపారుల బెడదను అరికట్టడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, కుటీర, చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా దీన్ని కొంతవరకు నివారించవచ్చు.

21.6 భారతదేశంలో వ్యవసాయ మార్కెటింగ్

వ్యవసాయ మార్కెటింగ్ అనేది దేశవ్యాప్తంగా వివిధ వ్యవసాయ వస్తువుల అసెంబ్లింగ్, నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, ప్యాకేజింగ్, గ్రేడింగ్ మరియు పంపిణీని కలిగి ఉన్న ఒక ప్రక్రియ.

భారతదేశంలో వ్యవసాయ మార్కెటింగ్ లోపాలు: గోదాము సౌకర్యాలు లేకపోవడం వల్ల, వ్యవసాయ ఉత్పత్తిలో 10% నుండి 20% వ్యవసాయ ఉత్పత్తి ఎలుకలు మరియు కీటకాల పాలవుతుంది. సరైన రవాణా

సౌకర్యాలు లేకపోవడంతో రైతులు పండించిన పంటను స్థానిక మార్కెట్లు, కమీషన్ ఏజెంట్లు, వడ్డీ వ్యాపారులకు విక్రయిస్తుండటంతో గిట్టుబాటు ధర లభించడం లేదు. మధ్య దళారులు వల్ల రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడం వలన తక్కువ ఆదాయం పొందుతున్నారు. సరైన కొలతలు, తూనికలు లేకపోవడంతో రైతులు మోసపోతున్నారు. తూకం ఛార్జీలు, సరుకుల అన్ లోడింగ్ ఛార్జీలు, ఉత్పత్తులను శుద్ధి చేయడానికి ఛార్జీలు, రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో కోతలు తదితరాలను రైతులకు చెల్లించాల్సిన మొత్తాన్ని మినహాయించి మోసం చేస్తున్నారు. సంస్కరణ వల్ల మార్కెట్ లో రైతులందరికీ ధరల సమాచారం అందుబాటులో లేకపోవడంతో వారు పండించిన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకోలేకపోతున్నారు.

2.1.6.1 భారతదేశంలో వ్యవసాయ మార్కెటింగ్ లోపాల నివారణ చర్యలు

నియంత్రిత మార్కెట్లు: వ్యవసాయ మార్కెటింగ్ లో ఉన్న అనారోగ్యకర పరిస్థితులను తొలగించి రైతులకు ప్రయోజనం చేకూర్చేలా నియంత్రిత మార్కెట్లను ఏర్పాటు చేశారు. రైతు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, ఉత్పత్తిదారు నుంచి వినియోగదారుడికి వస్తువుల ధరల్లో వ్యత్యాసాన్ని తగ్గించడం, వ్యాపారులు, దళారుల మోసపూరిత కార్యకలాపాలను అరికట్టడం వీటి విధులు.

వర్గీకరణ, ప్రామాణికీకరణ: వ్యవసాయోత్పత్తుల గ్రేడింగ్, ప్రామాణీకరణ కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. 1937 వ్యవసాయ ఉత్పత్తుల గ్రేడింగ్ మార్కెటింగ్ చట్టం ప్రకారం పలు గ్రేడింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. సరుకుల మార్కెట్‌ను మరింత విస్తరించేందుకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ గ్రేడింగ్ చేసిన వస్తువులపై అగ్మార్క్ ను ముద్రిస్తున్నారు.

గిడ్డంగుల సౌకర్యాలు: రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకుని గిట్టుబాటు ధర పొందేందుకు వీలుగా గ్రామాలు, పట్టణాల్లో గిడ్డంగుల సౌకర్యాలను విస్తరించారు. ఇందులో భాగంగా 1957లో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. జాతీయ స్థాయిలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) 1965లో ఏర్పాటైంది. వివిధ రాష్ట్రాల్లో గిడ్డంగుల కార్పొరేషన్లను కూడా ఏర్పాటు చేశారు.

మార్కెట్ సమాచారం: వివిధ మార్కెట్లలో వ్యవసాయ ఉత్పత్తుల ధరల సమాచారాన్ని రైతులకు చేరవేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఈ ధరలకు సంబంధించిన సమాచారాన్ని ఆకాశవాణి రేడియోలు, టీవీలద్వారా ప్రతిరోజూ రైతులకుచేరవేస్తున్నారు. మార్కెట్ ధరలపై ఆకాశవాణి, దూరదర్శన్ వారానికోసారి సమీక్షలు నిర్వహిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 26.05.2015న కిసాన్ ఛానల్‌ను ప్రారంభించింది.

మద్దతు ధరలు: వ్యవసాయ మార్కెటింగ్ లో రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం వివిధ వస్తువులకు కనీస మద్దతు ధరను ప్రకటిస్తుంది. వ్యవసాయోత్పత్తుల వ్యయాలు, ధరల కమిషన్ సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ ధరలను ప్రకటిస్తుంది.

ఇతర చర్యలు: బ్యాంకులు, విత్తన కంపెనీలతో అనుసంధానం చేయడం, రైతు బజార్లను ప్రోత్సహించడం, తూనికలు, కొలతలను నియంత్రిత మార్కెట్లలో ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గిడ్డంగుల సౌకర్యాలను పెంచడం.

21.7. భారతదేశంలో వ్యవసాయ ధరల విధానం

ఒకవైపు డిమాండ్ శక్తులు, మరోవైపు సరఫరా శక్తుల పనితీరును బట్టి ధరలు నిర్ణయిస్తారు. స్వాతంత్ర్యానికి పూర్వమే భారతదేశంలో వ్యవసాయ ధరల విధానాలు మరియు అనుబంధ విధానాలు రూపొందించబడ్డాయి మరియు ప్రధాన ఆహార ధాన్యాల పంపిణీ మరియు సేకరణ ప్రారంభించబడ్డాయి మరియు చట్టబద్ధమైన గరిష్ట ధరలను కూడా నిర్ణయించారు. 1960 ల మధ్యకాలంలో, కరువు కారణంగా ధరల కొరత కారణంగా ఆహార కొరతను దృష్టిలో ఉంచుకుని భారతదేశంలో వ్యవసాయ ధరల విధానాన్ని ప్రవేశపెట్టారు మరియు మూడు అంశాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ ధరల విధానాన్ని రూపొందించారు.

1. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఆహార ధాన్యాలను అందించడం.
2. నూతన సాంకేతిక పరిజ్ఞానం అమలును ఉత్తేజపరచడం.
3. వ్యవసాయోత్పత్తులకు ఆమోదయోగ్యమైన ధరలు కల్పించడం.

పై అంశాలను దృష్టిలో ఉంచుకుని 1965లో వ్యవసాయ ధరల కమిషన్ ను ఏర్పాటు చేయగా, 1985 మార్చి నుంచి ఈ సంఘాన్ని 'వ్యవసాయ వ్యయాలు, ధరల కమిటీ'గా పిలుస్తున్నారు. ధరల విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం రెండు సంస్థలను ఏర్పాటు చేసింది.

1. వ్యవసాయ ధరల సంఘం (1965), 2. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (1965) (ఎఫ్.సి.ఐ.)

కనీస మద్దతు ధరలు: గోధుమలు, వరి, మొక్కజొన్న వంటి ప్రధాన వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలను వ్యవసాయ ఖర్చులు, ధరల కమిటీ చేసే సూచనల ఆధారంగా ప్రభుత్వం ఏటా నిర్ణయిస్తుంది, తద్వారా రైతులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుంది.

కొనుగోలు ధర: కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు ప్రభుత్వం అధిక ధరలను నిర్ణయిస్తుంది. ప్రజాపంపిణీ వ్యవస్థ కింద ధాన్యాలు, పంచదార, బియ్యం వంటి వివిధ వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వాలు సరసమైన ధరలకు తీసుకుంటున్నాయి. ధరల వ్యవస్థ యొక్క మరొక ముఖ్యమైన లక్ష్యం ప్రజా పంపిణీ వ్యవస్థ.

బఫర్ నిల్వలు (బఫర్ స్టాక్స్): బఫర్ నిల్వలు అనేది ధరల హెచ్చుతగ్గులను తొలగించే ఏకైక ఉద్దేశ్యంతో ఏర్పాటుచేస్తారు. భారత ప్రభుత్వయొక్క భారత ఆహార సంస్థ నిల్వ చేసే కొన్ని ఆహార ధాన్యాలను "బఫర్ స్టాక్స్" అంటారు.

వ్యవసాయ ధరల విధానాన్ని మెరుగుపరిచేందుకు సూచనలు:

1. వ్యవసాయ ధరల విధానం రైతులకు ప్రయోజనకరంగా ఉండాలి.
2. దళారులు, దళారుల కార్యకలాపాలను నియంత్రించడం ద్వారా వ్యవసాయ మార్కెటింగ్ పద్ధతుల్లో మెరుగుదల సాధించవచ్చు.
3. ప్రజాపంపిణీ వ్యవస్థలో అధిక సామర్థ్యం, పారదర్శకత ఉండాలి.
4. కాటన్ కార్పొరేషన్, జూట్ కార్పొరేషన్ వంటి ఉన్నత సంస్థలు. ఏర్పాటు చేయాలి.
5. ధరల విధానాన్ని అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు వర్తింపజేయాలి.

ఆహార భద్రత: బ్రిటిష్ కాలం నాటి కరువుల కారణంగా చాలా మంది ఆకలితో చనిపోయారు. స్వాతంత్ర్యానంతరం రేషన్ షాపుల ద్వారా పేదలకు ఆహార ధాన్యాలు అందించాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం 1965లో ఎఫ్‌సీఐని ఏర్పాటు చేసింది. దీనివల్ల ప్రజలకు ఆహార భద్రత లభిస్తుంది. బఫర్ నిల్వలతో కరువులను అధిగమించి ఆకలి చావులను నివారించింది.

21.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 4-5 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. హరిత విప్లవం
2. మొత్తం ఎగుమతుల్లో వ్యవసాయం వాటా
3. కనీస మద్దతు ధర
4. ఆహార భద్రత

II. కింది ప్రశ్నలకు 8-10 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. భారతదేశంలో వ్యవసాయ రుణ వనరుల గురించి రాయండి.
2. వ్యవసాయ ధరల విధానం గురించి రాయండి.
3. వ్యవసాయంలో ఉత్పాదకత తక్కువగా ఉండటానికి గల కారణాలను వివరించండి.

III. కింది ప్రశ్నలకు 16-20 వాక్యాల్లో సమాధానం రాయండి.

1. భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం యొక్క ప్రాముఖ్యతను వివరించండి.
2. వ్యవసాయంలో ఉత్పాదకత తక్కువగా ఉండటానికి కారణాలు మరియు ఉత్పాదకతను పెంచే చర్యలు ఏమిటి?
3. హరిత విప్లవం, భారత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావాన్ని వివరించండి.
4. వ్యవసాయ మార్కెటింగ్‌లో లోపాలు, లోపాలను తగ్గించే నివారణ చర్యలు ఏమిటి?

21.9. పదకోశం

భూసంస్కరణలు: వ్యవసాయరంగంలో ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుని వ్యవసాయ వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చే ప్రక్రియను భూసంస్కరణలు అంటారు.

హరిత విప్లవం: రసాయన ఎరువులు, పురుగుమందులు, అధిక దిగుబడినిచ్చే వంగడాలు, నీటి సంరక్షణ సౌకర్యాలను కల్పించడం ద్వారా ఆహార ధాన్యాలలో అధిక దిగుబడులు సాధించే ప్రక్రియను “హరిత విప్లవం” అంటారు.

నియంత్రిత మార్కెట్లు: వ్యవసాయ మార్కెటింగ్ లో ఉన్న అనారోగ్యకర పరిస్థితులను తొలగించి రైతులకు ప్రయోజనం చేకూర్చేలా నియంత్రిత మార్కెట్లను ఏర్పాటు చేశారు.

కనీస మద్దతు ధర: ఇది కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర, బహిరంగ మార్కెట్ ధరలు ఖర్చు కంటే తక్కువగా ఉంటే ఉత్పత్తులను నేరుగా రైతుల నుండి కొనుగోలు చేస్తారు. రైతులు పండించిన పంటలకు ముందుగా ప్రకటించిన ధరను చెల్లిస్తారు.

బఫర్ స్టాక్స్: బఫర్ స్టాక్స్ అనేది ధరల హెచ్చుతగ్గులను తొలగించే ఏకైక ఉద్దేశ్యంతో స్టాక్స్, సేల్స్ మరియు కొనుగోళ్లను సూచిస్తుంది. భారత ఆహార సంస్థ నిల్వ చేసే కొన్ని ఆహార ధాన్యాలను “బఫర్ స్టాక్స్” అంటారు.

21.10 ఉపయుక్త గ్రంథాలు

1. భారత ఆర్థిక వ్యవస్థ: వి.కె.మిశ్రా, ఎస్.కె.పూరీ
2. ఇండియన్ ఎకానమీ: దత్, సుందరం
3. భారత ఆర్థిక వ్యవస్థ సమస్యలు మరియు సవాళ్ళు: తెలుగు అకాడమి పుస్తకం
4. భారత ప్రభుత్వ ఆర్థిక సర్వేలు

అధ్యాయం

22

భారతదేశంలో పారిశ్రామిక రంగం

22.0 పరిచయం

22.1 పారిశ్రామిక రంగం

22.2 పరిశ్రమల నిర్మాణం లేదా పరిశ్రమల రకాలు

22.3 భారతదేశంలో పారిశ్రామిక వృద్ధి

22.4 పారిశ్రామిక రంగంలో సవాళ్లు

22.5 భారతదేశంలో పారిశ్రామిక విధాన తీర్మానాలు

22.5.1 పారిశ్రామిక విధాన తీర్మానం 1948

22.5.2 పారిశ్రామిక విధాన తీర్మానం 1956

22.5.3 పారిశ్రామిక విధాన తీర్మానం 1977

22.5.4 పారిశ్రామిక విధాన తీర్మానం 1980

22.5.5 పారిశ్రామిక విధాన ప్రకటన 1991

22.6 చిన్న తరహా పరిశ్రమ

22.6.1 భారతదేశంలో చిన్న తరహా పరిశ్రమల పాత్ర మరియు ప్రాముఖ్యత

22.6.2 చిన్న తరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు

22.6.3 చిన్న తరహా పరిశ్రమల సమస్యల పరిష్కారానికి చర్యలు

22.7 పారిశ్రామిక విత్తం

22.7.1 భారతదేశంలోని ముఖ్యమైన పారిశ్రామిక ఆర్థిక సంస్థలు

22.8 సారాంశం

22.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు

22.10 పదకోశం

22.11 ఉపయుక్త గ్రంథాలు

22.0 పరిచయం

భారతదేశం యొక్క పారిశ్రామిక రంగం దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించింది ఇది దేశం యొక్క ఆర్థిక వృద్ధి మరియు అభివృద్ధికి గణనీయంగా దోహదపడింది. భారతదేశంలో పారిశ్రామిక రంగం వైవిధ్యమైనది. తయారీ, గనులు, నిర్మాణం, శక్తి మరియు మౌలిక సదుపాయాలతో సహా వివిధ పరిశ్రమలను కలిగి ఉంది. ఈ అధ్యాయంలో, భారతీయ పారిశ్రామిక రంగ లక్షణాలు, వృద్ధి మరియు అభివృద్ధి గురించి వివరంగా చర్చిద్దాం.

22.1 పారిశ్రామిక రంగం

పారిశ్రామిక రంగాన్ని ద్వితీయ రంగం అని కూడా అంటారు. పారిశ్రామిక రంగంలో ఇతర వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే మూలధన వస్తువులు మరియు యంత్రాల తయారీలో పనిచేస్తున్న సంస్థలు, కంపెనీలు ఉంటాయి. పరిశ్రమ అనేది వస్తువుల ఉత్పత్తి, సంబంధించిన ఆర్థిక కార్యకలాపాలను సూచిస్తుంది. భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. అందువల్ల, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మన ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయి.

22.2 పరిశ్రమల రకాలు

1) భారీ పరిశ్రమలు: ఈ పరిశ్రమల్లో పెట్టుబడి రూ. 10 కోట్ల నుండి రూ. 100 కోట్ల వరకు ఉంటుంది.
2) మెగా పరిశ్రమలు: రూ. 100 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పరిమితి కలవి.
3) కుటీర పరిశ్రమలు: ఇవి చిన్న తరహా పరిశ్రమల వర్గంలోకి వచ్చే అసంఘటిత గృహ ఆధారిత పరిశ్రమలు.
4) అనుబంధ పరిశ్రమలు: ఈ పరిశ్రమలు పెద్ద పరిశ్రమలు ఉపయోగించే వస్తువులను తయారు చేస్తాయి. వీరి పెట్టుబడి రూ. కోటికి మించదు.
5) చిన్న పరిశ్రమలు: యంత్రాలు మరియు కర్మాగారం మొత్తం పెట్టుబడి పరిమితి రూ. 25 లక్షలు ఉండేవి.
6) గృహ పరిశ్రమలు: కార్మికులు, నైపుణ్యం కలిగిన కార్మికులు మరియు సాంకేతిక నిపుణులచే నిర్వహించబడే ఈ పరిశ్రమలకు 3000 చదరపు అడుగుల కంటే తక్కువ స్థలం, 1KW కంటే తక్కువ విద్యుత్ శక్తి మరియు కార్మికులు 5 కంటే ఎక్కువ కాకుండా ఉండేవి. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని కలిగించవు.

జూన్, 2020లో భారత ప్రభుత్వం పెట్టుబడి మరియు టర్నోవర్ ఆధారంగా సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (MSME) నిర్వచనాలను సవరించింది.

1) సూక్ష్మ సంస్థలు: ఈ పరిశ్రమల్లో పెట్టుబడి రూ.1 కోటికి మించదు మరియు టర్నోవర్ రూ.5 కోట్లకు మించదు.

2) చిన్న పరిశ్రమలు: కర్మాగారం మరియు యంత్రాల పరికరాలలో పెట్టుబడి రూ.10 కోట్లకు మించదు మరియు టర్నోవర్ రూ.50 కోట్లకు మించదు.

3) మధ్యతరహా పరిశ్రమలు: కర్మాగారం మరియు యంత్రాలు లేదా పరికరాలపై పెట్టుబడి రూ.50 కోట్లకు మించదు మరియు టర్నోవర్ రూ.250 కోట్లకు మించకుండా ఉండాలి.

ఉపయోగించిన ముడి పదార్థాల మూలం ఆధారంగా పరిశ్రమలను వర్గీకరించవచ్చు:

- వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు : పత్తి, ఉన్ని, జనపనార, పట్టు వస్త్రాలు, రబ్బరు మరియు చక్కెర, టీ, కాఫీ, వంట నూనె మొదలైనవి.
- ఖనిజ ఆధారిత పరిశ్రమలు: ఇనుము మరియు ఉక్కు, సిమెంట్, అల్యూమినియం, యంత్ర పరికరాలు, పెట్రోకెమికల్స్.

వస్తువులను ఉపయోగించే ప్రకారం పరిశ్రమలు క్రింది విధంగా వర్గీకరించబడ్డాయి:

- ప్రాథమిక లేదా కీలక పరిశ్రమలు అంటే తమ ఉత్పత్తులను ఇతర వస్తువులను తయారు చేయడానికి ముడి పదార్థాలుగా సరఫరా చేసేవి ఉదా. ఇనుము మరియు ఉక్కు, రాగి, అల్యూమినియం కరిగించడం మొదలైనవి.
- వినియోగం కోసం వస్తువులను ఉత్పత్తి చేసే వినియోగదారు పరిశ్రమలు – చక్కెర, టూత్‌పేస్ట్, కాగితం, సౌందర్య సాధనాలు మొదలైనవి.
- మాధ్యమిక వస్తువులు: ఇతర వస్తువులు లేదా సేవల ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగించే ఉత్పత్తులను మాధ్యమిక వస్తువులు అంటారు. అవి వినియోగదారు నేరుగా ఉపయోగించే ఉత్పత్తులు కావు. కానీ ఇతర వస్తువు ఉత్పత్తిలో వాడతారు. ఉదా. రసాయనాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ప్లాస్టిక్ మొదలైనవి.

22.3 భారతదేశంలో పారిశ్రామిక వృద్ధి

భారతదేశంలో మొట్టమొదటి ఆధునిక పరిశ్రమలు పత్తి, జనపనార, బొగ్గు గనులు మరియు రైల్వేలు. 1947లో బ్రిటిష్ వలస పాలన నుండి స్వాతంత్ర్యం పొందినప్పటి నుండి, భారతదేశం గణనీయమైన పారిశ్రామిక వృద్ధిని సాధించింది.

స్వాతంత్ర్య సమయంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయాధారితంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం పారిశ్రామికీకరణ మరియు ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో విధానాలను రూపొందించింది. ఇందులో రక్షణ, రవాణా మరియు కమ్యూనికేషన్, పవర్, మైనింగ్ మరియు ఇతర ప్రాజెక్టులు ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రైవేట్ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి కూడా ప్రోత్సహించింది. భారతదేశ మిశ్రమ ఆర్థిక విధానంలో, కొన్ని రంగాలు ప్రభుత్వానికి రిజర్వ్ చేయబడ్డాయి, మరికొన్ని ప్రైవేట్ రంగానికి ఇవ్వబడ్డాయి. కానీ ప్రభుత్వం తన లైసెన్సింగ్ విధానం ద్వారా, పరిశ్రమలు వివిధ ప్రాంతాలలో విస్తరించి ఉండేలా చూసుకోవడానికి ప్రయత్నించింది. కొన్ని ఆర్థిక సవాళ్లు మరియు వృద్ధిలో హెచ్చు తగ్గులు ఉన్నప్పటికీ, భారతదేశం సంవత్సరాలుగా గణనీయమైన పారిశ్రామిక వృద్ధిని సాధించింది. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో పారిశ్రామిక వృద్ధి కీలకమైన అంశం మరియు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా దేశం రూపాంతరం చెందడానికి దోహదపడింది.

అయితే 1990ల నుంచి ప్రభుత్వం సరళీకరణ విధానాన్ని అనుసరిస్తోంది. ప్రైవేట్ కంపెనీలు, ప్రత్యేకించి విదేశీ సంస్థలు, టెలికాం, పౌర విమానయానం, విద్యుత్ మొదలైన వాటితో సహా ముందుగా ప్రభుత్వం కోసం రిజర్వు చేయబడిన రంగాలలో పెట్టుబడి పెట్టడానికి ప్రోత్సహించబడ్డాయి. పరిశ్రమలను ప్రారంభించడానికి ఇకపై లైసెన్సు అవసరం లేదు.

భారతదేశ తయారీ రంగం ప్రపంచంలోనే అత్యంత ప్రముఖమైనది. ఇది టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్టీల్, కెమికల్స్ మరియు మెషినరీ వంటి అనేక రకాల పరిశ్రమలను కలిగి ఉంది. వ్యాపారం చేసే ప్రక్రియను సులభతరం చేయడానికి మరియు వివిధ రంగాలలో విదేశీ పెట్టుబడులను పెంచడానికి ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేసింది.

భారత ప్రభుత్వం రోడ్లు, రైల్వేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు మరియు విద్యుత్ ఉత్పత్తితో సహా మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా పెట్టుబడి పెడుతోంది. ఇది దేశవ్యాప్తంగా రవాణా మరియు సమాచార రంగాలను మెరుగుపరచడం ద్వారా పారిశ్రామిక వృద్ధిని సాధించింది. పన్ను మినహాయింపు ప్రోత్సాహకాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు మరియు వ్యాపారాలకు సరళీకృత నిబంధనలను అందించడం ద్వారా పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడానికి భారతదేశం ప్రత్యేక ఆర్థిక మండళ్లను (SEZ) ఏర్పాటు చేసింది. ఈ చర్యలు, పారిశ్రామిక వృద్ధి, పెట్టుబడులు మరియు నియంత్రణ చర్యలకు మార్గనిర్దేశం చేస్తాయి.

మేక్ ఇన్ ఇండియా ఇనిషియేటివ్ 2014లో ప్రారంభించబడింది, ఈ ప్రచారం దేశంలోని తయారీ కార్యకలాపాలలో పెట్టుబడులు పెట్టడానికి దేశీయ మరియు విదేశీ కంపెనీలను ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ తయారీరంగ హబ్గా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. స్టార్ట్-అప్ ఇండియా ఇనిషియేటివ్ 2016, స్వంత పరిశ్రమల వ్యవస్థాపకతను ప్రోత్సహించడం మరియు వివిధ ప్రోత్సాహకాలతో స్టార్టప్లకు మద్దతు ఇవ్వడం, నిబంధనలను సరళీకృతం చేయడం పై దృష్టి సారించింది.

22.4 పారిశ్రామిక రంగంలో సవాళ్లు

- మౌలిక సదుపాయాల లోటు: భారతదేశ పారిశ్రామిక వృద్ధికి కావలసిన మౌలిక సదుపాయాలు కొరతగా ఉన్నాయి.
- నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత: అధిక జనాభా ఉన్నప్పటికీ, భారతదేశ శ్రామిక శక్తిలో గణనీయమైన నైపుణ్యం గల శ్రామికుల కొరత ఉంది. అనేక పరిశ్రమలు నైపుణ్యం కలిగిన కార్మికులు లేకుండానే పని చేస్తున్నాయి.
- మూలధన సమస్య: పారిశ్రామిక రంగంలోని చిన్న మరియు మధ్య తరహా సంస్థలు (SME) తగిన మరియు అవసరమయిన మూలధనం సమకూర్చుకోవడంలో సమస్యలను ఎదుర్కొంటున్నాయి
- అసమర్థమైన పన్నుల వ్యవస్థ: భారతదేశం యొక్క పన్ను నిర్మాణం సంక్లిష్టంగా ఉంటుంది మరియు పన్ను విధానాలలో తరచుగా మార్పులు వ్యాపారాలకు అనిశ్చితిని సృష్టించవచ్చు.
- ప్రపంచ మార్కెట్ల నుండి పోటీ: పెరుగుతున్న ప్రపంచీకరణతో, భారతీయ పరిశ్రమలు దేశీయ మార్కెట్ల నుండి మాత్రమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్ల నుండి కూడా పోటీని ఎదుర్కొంటున్నాయి.
- సాంకేతిక పరివర్తన: అనేక భారతీయ పరిశ్రమలు ఇప్పటికీ డిజిటల్ టెక్నాలజీలను పూర్తిగా స్వీకరించడంలో వెనుకబడి ఉన్నాయి.

22.5 భారతదేశంలో పారిశ్రామిక విధాన తీర్మానాలు

పారిశ్రామిక విధాన తీర్మానాలు అనేది ఒక దేశం లేదా ప్రాంతంలోని నిర్దిష్ట పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు లేదా సంబంధిత అధికారులు జారీ చేసిన నిభందనలు మరియు లక్ష్యాలను వివరించే అధికారిక పత్రాలు లేదా ప్రకటనలు

22.5.1 పారిశ్రామిక విధాన తీర్మానం 1948

స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం యొక్క మొదటి సమగ్ర పారిశ్రామిక విధానం ఇది. ఇది పారిశ్రామిక అభివృద్ధిలో ప్రభుత్వ రంగం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది మరియు ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి పునాది వేసింది.

1948 పారిశ్రామిక విధానం యొక్క ముఖ్య లక్షణాలు:

- ఈ విధానం మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు పునాది వేసింది, ఇది ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలకు అవకాశం కల్పించింది.

- పారిశ్రామికీకరణ మరియు ఆర్థిక స్వావలంభనను ప్రోత్సహించడానికి ప్రభుత్వ రంగ అభివృద్ధిని ఈ విధానం నొక్కి చెప్పింది. ఇనుము మరియు ఉక్కు, భారీ యంత్రాలు, విద్యుత్ ఉత్పత్తి మరియు రవాణా వంటి కీలక పరిశ్రమలు ప్రభుత్వ యాజమాన్యానికి కేటాయించబడ్డాయి.
- ప్రైవేట్ పరిశ్రమలను నియంత్రించేందుకు ప్రభుత్వం లైసెన్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది.
- గ్రామీణ ఉపాధి మరియు ఆర్థికాభివృద్ధికి కుటీర మరియు చిన్న తరహా పరిశ్రమల ప్రాముఖ్యతను ఈ విధానం గుర్తించింది.
- ఈ విధానంలో కార్మిక సంక్షేమం మరియు కార్మికుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి.

22.5.2 పారిశ్రామిక విధాన తీర్మానం 1956

ఈ తీర్మానం సామ్యవాదాన్ని ప్రోత్సహించడం మరియు ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధిపై దృష్టి సారించడం ద్వారా ఆర్థిక అసమానతలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది.ప్రభుత్వ రంగానికి ప్రత్యేకంగా కేటాయించబడే కీలకమైన పరిశ్రమలను ప్రభుత్వం గుర్తించింది.

ఈ తీర్మానం క్రింది వాటిపై దృష్టి పెట్టింది:

- భారీ మరియు యంత్ర నిర్మాణ పరిశ్రమల అభివృద్ధి
- ప్రభుత్వ రంగ పరిశ్రమల విస్తరణ
- సహకార రంగం స్థాపన, మరియు
- ప్రైవేట్ రంగంలో యాజమాన్యం మరియు నిర్వహణ యొక్క విస్తరణను ప్రోత్సహించడం.

22.5.3 పారిశ్రామిక విధాన తీర్మానం 1977

ఈ విధానం ప్రభుత్వ రంగానికి రిజర్వ్ చేయబడిన పరిశ్రమల సంఖ్యను తగ్గించడం మరియు ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా మరింత మిశ్రమ ఆర్థిక విధానం వైపు మళ్లింది.

22.5.4 పారిశ్రామిక విధాన తీర్మానం 1980

1980 తీర్మానం చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధిపై దృష్టి సారించింది. ముఖ్యంగా గ్రామీణ మరియు వెనుకబడిన ప్రాంతాలలో, మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టించడానికి మరియు ప్రాంతీయ అసమానతలను తగ్గించడానికి దృష్టి సారించింది.

22.5.5 పారిశ్రామిక విధాన ప్రకటన 1991

ఈ విధానం భారతదేశ ఆర్థిక చరిత్రలో అత్యంత ముఖ్యమైన మైలురాళ్లలో ఒకటి. భారతదేశంలో LPG సంస్కరణలు 1991లో అమలు చేయబడిన ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ మరియు ప్రైవేటీకరణను సూచిస్తాయి. ఈ సంస్కరణలను అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు మరియు ఆర్థిక మంత్రి డా॥ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని భారత ప్రభుత్వం చేపట్టింది. తీవ్రమైన చెల్లింపుల బ్యాలెన్స్ సంక్షోభాన్ని పరిష్కరించడానికి, స్తబ్దత మరియు అధిక ద్రవ్య లోటును ఎదుర్కొంటున్న భారత ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి ఈ సంస్కరణలను తీసుకువచ్చారు. ఇది ఆర్థిక వ్యవస్థను సరళీకరించడానికి, వాణిజ్య అడ్డంకులను తొలగించడానికి, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి మరియు ప్రైవేట్ రంగాలను అనుమతికి సంస్కరణల శ్రేణిని ప్రవేశపెట్టింది.

1991 నూతన పారిశ్రామిక విధానం యొక్క ముఖ్య లక్షణాలు:

- సరళీకరణ: మరింత మార్కెట్–ఆధారిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ నియంత్రణ మరియు జోక్యాన్ని తగ్గించడం ఈ విధానం లక్ష్యం.
- లైసెన్సింగ్ విధానం : భద్రత మరియు ప్రభుత్వ ప్రాధాన్యత గల కొన్ని రంగాలు మినహా, చాలా పరిశ్రమలకు పారిశ్రామిక లైసెన్సుల అవసరాన్ని తొలగించడానికి పారిశ్రామిక లైసెన్సింగ్ వ్యవస్థ గణనీయంగా సడలించబడింది.
- MRTP చట్టం రద్దు: వివిధ వ్యాపారాలపై ఆంక్షలు విధించిన వ్యాపార నియంత్రణా (MRTP) చట్టం రద్దు చేయబడింది.
- విదేశీ సాంకేతికత ప్రోత్సాహం: విదేశీ సాంకేతిక ఒప్పందాలను అనుమతించడం ద్వారా అధునాతన సాంకేతికతను వినియోగించడం మరియు దేశీయ పరిశ్రమలలో సాంకేతికత ఆధునీకరించడం ఈ విధానం లక్ష్యం.
- చిన్న తరహా పరిశ్రమలపై దృష్టి: ఉపాధిని కల్పించడంలో మరియు సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిలో చిన్న తరహా పరిశ్రమల ప్రాముఖ్యతను పాలసీ గుర్తించింది.
- FDI: ఈ విధానం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (FDI) ప్రోత్సహించింది మరియు కొన్ని ప్రాంతాల్లో నిర్దిష్ట నిబంధనలు మరియు పరిమితులకు లోబడి బహుళజాతి సంస్థలను వివిధ రంగాలలో పెట్టుబడి పెట్టడానికి అనుమతించింది.
- 1991 కొత్త పారిశ్రామిక విధానం లేదా "నూతన ఆర్థిక విధానం" లేదా "సరళీకరణ, ప్రైవేటీకరణ మరియు ప్రపంచీకరణ" (LPG) సంస్కరణలు భారతదేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపాయి మరియు పారిశ్రామిక రంగంలో గణనీయమైన మార్పులకు దారితీశాయి.

కొత్త ఆర్థిక విధానం యొక్క కొన్ని సానుకూల ప్రభావాలు:

- ఇది వేగవంతమైన ఆర్థిక వృద్ధికి వేదికగా నిలిచింది.
- విదేశీ పెట్టుబడులు పెరిగాయి.
- కొత్త పరిశ్రమల ఆవిర్భావం మరియు ఇప్పటికే ఉన్నవాటిని విస్తరించడం, ఉద్యోగ అవకాశాలను సృష్టించడం మరియు నిరుద్యోగిత రేటును తగ్గించడం జరిగింది.
- ఎగుమతి ఆధారిత పరిశ్రమలు అద్భుతమైన వృద్ధిని సాధించాయి
- పెరిగిన ఆర్థిక వృద్ధి మరియు ఉద్యోగావకాశాలు పేదరికాన్ని తగ్గించడంలో సహాయపడ్డాయి.
- జీవన ప్రమాణం పెరిగింది

కొన్ని ప్రతికూల ప్రభావాలు:

- మారుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా పనిచేయలేని రంగాలలో నిరుద్యోగం పెరిగింది.
- ఆదాయ అసమానతలు పెరిగిగాయి
- ప్రాంతీయ అసమానతలు విస్తృతమయ్యాయి.
- పర్యావరణ క్షీణత ఎక్కువ కావడం జరిగింది

22.6 చిన్న తరహా పరిశ్రమ

భారతదేశంలోని చిన్న తరహా పరిశ్రమల లక్షణాలు

- **యాజమాన్యం:** సాధారణంగా, ఇటువంటి వ్యాపారాలు ఒకే యాజమాని లేదా కొన్ని సందర్భాల్లో భాగస్వామ్యాలు ఉంటాయి.
- **నిర్వహణ:** సాధారణంగా, నిర్వహణ మరియు నియంత్రణ రెండూ యజమాని/ యజమానుల వద్ద ఉంటాయి. అందువల్ల యజమాని వ్యాపారం యొక్క రోజువారీ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటాడు.
- **శ్రామికుల ఆధారిత పరిశ్రమ:** టెక్నాలజీపై ఆధారపడటం పరిమితం. అందువల్ల వారు తమ ఉత్పత్తి కార్యకలాపాలకు ఎక్కువ కార్మిక శ్రమను మరియు మానవవనరులను ఉపయోగించుకుంటారు.
- **అనుకూలత:** పెద్ద-స్థాయి పరిశ్రమలతో పోలిస్తే, చిన్న తరహా పరిశ్రమలు సాధారణంగా మరింత సరళంగా ఉంటాయి మరియు మారుతున్న మార్కెట్ పరిస్థితులు మరియు వినియోగదారుని డిమాండ్లకు అనుగుణంగా ఉంటాయి.
- **స్థానిక కార్యకలాపాలు:** ఈ పరిశ్రమలు సాధారణంగా స్థానికంగా మరియు నిర్దిష్ట ప్రాంతం లేదా సంఘంలో పనిచేస్తాయి.
- **తక్కువ మూలధన పెట్టుబడి:** పెద్ద పరిశ్రమలతో పోలిస్తే వారు సాధారణంగా తక్కువ మూలధన అవసరాలు కలిగి ఉంటారు.

22.6.1 భారతదేశంలో చిన్న తరహా పరిశ్రమల పాత్ర మరియు ప్రాముఖ్యత

భారతదేశం శక్తివంతమైన మరియు విభిన్నమైన చిన్న తరహా పరిశ్రమల రంగానికి నిలయం. ఈ పరిశ్రమలు ఉపాధి కల్పన, ప్రాంతీయ అభివృద్ధి మరియు ఎగుమతి ఆదాయాలకు దోహదం చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయి. భారతదేశంలో చిన్న తరహా పరిశ్రమల ముఖ్య పాత్ర ఈ క్రింది విధంగా ఉన్నాయి:

- **ఉపాధి కల్పన:** చిన్న తరహా పరిశ్రమలు శ్రమతో కూడుకున్నవి మరియు ఉపాధి అవకాశాలను కల్పిస్తాయి, ముఖ్యంగా గ్రామీణ మరియు చిన్న పట్టణ ప్రాంతాల్లో ఇవి ఉంటాయి .
- **ప్రాంతీయ అభివృద్ధి:** చిన్న తరహా పరిశ్రమలు ఎక్కువగా గ్రామీణ మరియు వెనుకబడిన ప్రాంతాలలో ఉన్నాయి, ఇవి సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహిస్తాయి.
- **స్థూల దేశీయోత్పత్తిలో వాటా:** భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (GDP)కి చిన్న తరహా పరిశ్రమలు గణనీయమైన వాటాను అందిస్తాయి.
- **నూతన ఆవిష్కరణలు:** చిన్న తరహా పరిశ్రమలు ఆవిష్కరణ మరియు వ్యవస్థాపక స్ఫూర్తిని ప్రోత్సహిస్తాయి.
- **పేదరిక నిర్మూలన:** అట్టడుగు స్థాయి ప్రజలకు ఆదాయాన్ని కలిగించే కార్యకలాపాలను సృష్టించడం ద్వారా పేదరిక నిర్మూలనలో చిన్న తరహా పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తాయి.
- **ఎగుమతి:** భారతదేశంలోని కొన్ని చిన్న-స్థాయి పరిశ్రమలు, ముఖ్యంగా హస్తకళలు, వస్త్రాలు మరియు ఇతర సాంప్రదాయ చేతివృత్తులలో నిమగ్నమై ఉన్నాయి. ఇవి ఎగుమతి సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.
- **స్థానిక వనరుల వినియోగం:** చిన్న తరహా పరిశ్రమలు స్థానికంగా లభించే వనరులు మరియు ముడి పదార్థాలను ఉపయోగించుకుంటాయి, ఇవి సుస్థిరమైన అభివృద్ధికి దోహదపడతాయి.
- **పెద్ద పరిశ్రమలకు సహకారం:** చిన్న-స్థాయి పరిశ్రమలు తరచుగా అనుబంధ యూనిట్లుగా పనిచేస్తాయి, పెద్ద పరిశ్రమలకు ముడి పదార్థాలు, భాగాలు మరియు సేవలను సరఫరా చేస్తాయి.

22.6.2 చిన్న తరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు

- **నిధులు లేకపోవడం:** చిన్న తరహా పరిశ్రమలు తరచుగా బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల నుండి తగిన నిధులు మరియు అప్పు పొందడం కష్టంగా ఉంది.
- **అవస్థాపన అడ్డంకులు:** పేలవమైన రవాణా, నమ్మదగని విద్యుత్ సరఫరా మరియు సాంకేతిక పరిజ్ఞానానికి ఉపయోగంలో అడ్డంకులు వంటి సరిపోని మౌలిక సదుపాయాలు చిన్న తరహా పరిశ్రమల పెరుగుదల మరియు ఉత్పాదకతను అడ్డంకిగా ఉన్నాయి.

- **మార్కెట్ పోటీ:** పెద్ద కంపెనీలతో పోటీ పడలేక పోవడంవల్ల చిన్న తరహా పరిశ్రమలు మార్కెట్ వాటాను పొందడం కష్టతరం అవుతుంది.
- **ముడి పదార్థం:** ఈ పరిశ్రమలు తగినంత పరిమాణంలో ముడిసరుకు సరఫరా క్రమ పద్ధతిలో లేకపోవడం వంటి అనేక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది.
- **మొత్తం నిర్వహణ**: సరిపోని నిర్వహణ నైపుణ్యాలు వ్యాపార విస్తరణకు ఆటంకంగా ఉంటున్నాయి. దీని వల్ల మార్కెట్లో పోటీ తట్టుకోవడం లేదు.

22.6.3 చిన్న తరహా పరిశ్రమల సమస్యల పరిష్కారానికి చర్యలు

- **ఆర్థిక సహాయం:** చిన్న తరహా మరియు కుటీర పరిశ్రమలకు సహేతుకమైన వడ్డీ రేటుకు రుణం ఇవ్వడానికి ప్రభుత్వం అనేక ఆర్థిక సంస్థలు ఏర్పాటు చేయాలి.
- **ముడి పదార్థాల లభ్యత:** సరసమైన ధరలకు ముడి పదార్థాల లభ్యత, నిరంతర సరఫరా ఉండాలి.
- **నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ:** శ్రామిక శక్తి యొక్క సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు మరియు వృత్తిపరమైన శిక్షణను అందించాలి.
- **ముడి పదార్థాల సమాన కేటాయింపు:** చిన్న, ప్రాథమిక పారిశ్రామిక యూనిట్లకు అవసరమైన ముడి పదార్థాలు, దిగుమతి చేసుకున్న భాగాలు మరియు పరికరాల కేటాయింపులో తగిన స్థాయి ప్రాధాన్యతను కలిగి ఉండాలి.
- **మౌలిక సదుపాయాలు:** రవాణా, విద్యుత్, నీటి సరఫరా, ఫైనాన్స్ మొదలైన సరైన మౌలిక సదుపాయాలతో చిన్న తరహా పరిశ్రమల వృద్ధిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం పారిశ్రామిక ఎస్టేట్లను అభివృద్ధి చేయాలి.
- **ఎగుమతి ప్రోత్సాహకాలు:** ఎగుమతి ప్రోత్సాహకాలను అందించడం, అంతర్జాతీయ వాణిజ్యంపై శిక్షణ మరియు ప్రపంచ మార్కెట్లలో ఎగుమతులను సులభతరం చేయడం ద్వారా ఎగుమతి కార్యకలాపాలలో పాల్గొనేలా చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి.

ఈ చర్యలను అమలు చేయడం ద్వారా, భారత ప్రభుత్వం మరియు వివిధ వాటాదారులు చిన్న తరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం ద్వారా, వారి వృద్ధిని ప్రోత్సహించి ,దేశం యొక్క మొత్తం ఆర్థిక అభివృద్ధికి దోహదపడే విధంగా కృషి చేయాలి.

22.7 పారిశ్రామిక విత్తం

భారతదేశంలో పారిశ్రామిక విత్తం అనేది దేశంలో పారిశ్రామిక రంగం యొక్క వృద్ధి మరియు అభివృద్ధికి అండగా ఉన్నటువంటి ఆర్థిక సేవలు మరియు యంత్రాంగాలను సూచిస్తుంది. పెట్టుబడులను, వ్యవస్థాపకతను ప్రోత్సహించడంలో మరియు పారిశ్రామిక ఉత్పత్తిని పెంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

భారతదేశంలో పారిశ్రామిక ఋణానికి సంబంధించిన కొన్ని ముఖ్య అంశాలు ఇక్కడ ఉన్నాయి:

- **బ్యాంక్ ఋణాలు:** భారతదేశంలో పారిశ్రామిక రుణాలకు బ్యాంకులు ప్రాథమిక ఆధారం. బ్యాంకులు పరిశ్రమలకు రుణాలు, నిర్వహణ పెట్టుబడి మరియు స్వల్ప కాల ఋణాలు అందిస్తారు. పారిశ్రామిక రుణగ్రహీతలు భారతదేశంలో పనిచేస్తున్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు మరియు విదేశీ బ్యాంకుల నుండి రుణాలను పొందవచ్చు.

- **అనియత ఋణాలు:** మిత్రులు, వ్యాపారులు, గృహ సంబంధ వ్యక్తులు పరిశ్రమలకు, ముఖ్యంగా చిన్న పరిశ్రమలకు ఋణాలు అందజేస్తుంటారు.

- **స్టాక్ మార్కెట్లు:** భారతదేశంలో పరిశ్రమలకు ఆర్థిక సహాయం చేయడంలో ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది.

- **సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు (MSME) ఫైనాన్సింగ్:** భారతదేశం యొక్క పారిశ్రామిక రంగంకు MSME గణనీయమైన సహకారాన్ని అందిస్తుంది. ప్రభుత్వం మరియు ఆర్థిక సంస్థలు MSME వృద్ధి మరియు అభివృద్ధికి సహకారంతో ప్రత్యేక ఫైనాన్సింగ్ పథకాలు మరియు క్రెడిట్ సౌకర్యాలను అందిస్తాయి.

- **విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (FDI):** భారతదేశం తన పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించడానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను చురుకుగా ప్రోత్సహిస్తుంది. నిర్దిష్ట నిబంధనలకు లోబడి విదేశీ కంపెనీలు ఆటోమేటిక్ లేదా ప్రభుత్వ మార్గం ద్వారా భారతదేశంలో పెట్టుబడి పెట్టవచ్చు.

- **పబ్లిక్ డిపాజిట్లు:** ఈ విధానంలో, ప్రజలు తమ డబ్బును ఆరు నెలలు, ఒక సంవత్సరం, రెండు సంవత్సరాలు, మూడు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు ఈ కంపెనీలు లేదా మేనేజింగ్ అధికారుల వద్ద డిపాజిట్‌గా ఉంచుతారు.

22.7.1 భారతదేశంలోని ముఖ్యమైన పారిశ్రామిక ఆర్థిక సంస్థలు

- భారత పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకు (IDBI)
- భారత్ పారిశ్రామిక విత్త సంస్థ (IFCI)
- భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (SIDBI)
- ఎగుమతి–దిగుమతి బ్యాంక్ ఆఫ్ ఇండియా (EXIM బ్యాంక్)
- జాతీయ వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (NABARD)

22.8 సారాంశం

భారతదేశంలోని ద్వితీయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థ యొక్క పారిశ్రామిక మరియు ఉత్పాదక కార్యకలాపాలను సూచిస్తుంది. ఇది మొత్తం ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. స్థూల దేశీయోత్పత్తి , ఉపాధి కల్పన మరియు ఎగుమతి ఆదాయాలకు గణనీయంగా దోహదం చేస్తుంది. పారిశ్రామిక రంగం కాలం చెల్లిన సాంకేతికత, మౌలిక సదుపాయాల అడ్డంకి, ప్రభుత్వ నిబంధనల అడ్డంకులు మరియు కార్మిక సంబంధిత సమస్యల వంటి సవాళ్లను ఎదుర్కొంటుంది.

22.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 4-5 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1) ముడిసరుకు ఆధారంగా పరిశ్రమలను వర్గీకరించండి.
2) పారిశ్రామిక విధాన తీర్మానం 1948:
3) LPG మోడల్‌ను నిర్వచించండి.
4) MRTP చట్టాన్ని వివరించండి.
5) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

II. ఈ క్రింది ప్రశ్నలకు 8-10 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1) పారిశ్రామిక ఋణం అంటే ఏమిటి?
2) MSMEని వివరించండి.
3) ప్రస్తుతం పారిశ్రామిక రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు ఏమిటి?
4) భారత ఆర్థిక వ్యవస్థపై నూతన ఆర్థిక విధానం 1991 యొక్క ప్రభావాన్ని వివరించండి.
5) భారతదేశంలోని చిన్న తరహా పరిశ్రమల లక్షణాలను వివరించండి.
6) చిన్న తరహా పరిశ్రమల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించండి.

III. ఈ క్రింది ప్రశ్నలకు 16-20 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1) భారతీయ పరిశ్రమల నిర్మాణాన్ని వివరించండి.
2) కొత్త పారిశ్రామిక విధాన తీర్మానం, 1991ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.
3) భారత ఆర్థిక వ్యవస్థలో చిన్న తరహా పరిశ్రమల పాత్రను వివరించండి.
4) భారతదేశంలో ఇండస్ట్రియల్ ఫైనాన్స్ గురించి వివరించండి.

22.10 పదకోశం

- పారిశ్రామిక రంగం: పరిశ్రమలు ద్వితీయ రంగంలో భాగం.
- MSME: సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా సంస్థలు
- సరళీకరణ: సరళీకరణ అనేది ఒక ప్రక్రియ, దీని ద్వారా ఒక ఆర్థిక వ్యవస్థ కొన్ని వ్యాపార పరిమితులను ఎత్తివేస్తుంది
- ప్రైవేటీకరణ: యాజమాన్యం, ఆస్తి లేదా వ్యాపారం ప్రభుత్వం నుండి ప్రైవేట్ రంగానికి బదిలీ చేయడాన్ని ప్రైవేటీకరణ అంటారు
- ప్రపంచీకరణ: భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేయడం.
- MRTP చట్టం: ఏకస్వామ్య వ్యాణిజ్య నిరోధక చట్టం

22.11 ఉపయుక్త గ్రంథాలు

1. Text book of intermediate fist year Economics from Telugu Academy.
2. Text book of intermediate Second year Economics from Telugu Academy.
3. Senior Secondary course Economics (318), National Institute of Open Schooling.
4. B.A. Indian Economy from Telugu Academy
5. https://commerce.gov.in/

అధ్యాయం
23

తృతీయ రంగం (సేవా రంగం)

23.0 లక్ష్యాలు

23.1 పరిచయం

23.2 భారత ఆర్థిక వ్యవస్థలో తృతీయ రంగం పాత్ర

23.3 మన దేశంలో తృతీయ రంగానికి ప్రాధాన్యత

23.4 భారతదేశంలో మౌలిక సదుపాయాల రంగం అభివృద్ధి

23.5 భారతదేశంలో రవాణా రంగం

23.6 ఇంధన రంగం

23.7 సమాచార రంగం

23.8 సమాచార సాంకేతికత

23.9 శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం

23.10 బ్యాంకింగ్ రంగం

23.11 పర్యాటకం

23.12 సారాంశం

23.13 మాదిరి పరీక్ష ప్రశ్నలు

23.14 పదకోశం

23.15 ఉపయుక్త గ్రంథాలు

23.0 లక్ష్యాలు

- ఆర్థికాభివృద్ధిలో సేవారంగం ప్రాముఖ్యతను తెలుసుకోవడం.
- స్థూల దేశీయోత్పత్తిలో సేవారంగం వాటాను విశ్లేషించడం.
- భారతదేశంలోని వివిధ రవాణా సాధనాలను తెలుసుకోవడం.
- ఆర్థికాభివృద్ధిలో సమాచార సాంకేతిక పాత్రను తెలుసుకోవడం.
- ఆర్థికాభివృద్ధిలో సేవారంగంలోని వివిధ ఉప రంగాలను అంచనా వేయడం.

23.1 పరిచయం

ఆర్థిక వ్యవస్థలలో మూడవ అతి ముఖ్యమైన రంగం మూడవ రంగం లేదా సేవా రంగం. ఈ రంగం శరవేగంగా వృద్ధి చెందుతూ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో గరిష్ట వాటా కలిగిన శ్రామిక శక్తిలో అధిక శాతం మందికి ఉపాధి కల్పిస్తోంది. తృతీయ రంగం ప్రాథమిక మరియు ద్వితీయ రంగాల ఉత్పత్తికి అవసరమైన మౌలిక సదుపాయాలు మరియు సేవలను అందిస్తుంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, మైనింగ్, రవాణా, సమాచార, గిడ్డంగుల మార్కెటింగ్, క్రెడిట్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సదుపాయాలు అవసరం. ఈ సౌకర్యాలు, సేవలన్నీ తృతీయ రంగం ద్వారా అందించబడతాయి. అందువల్ల తృతీయ రంగాన్ని "సేవా రంగం" అని కూడా పిలుస్తారు.

ప్రాథమిక, ద్వితీయ రంగాల అభివృద్ధి సేవారంగం అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. సేవారంగం వ్యవసాయం మరియు పారిశ్రామిక రంగాల అభివృద్ధికి అనేక సౌకర్యాలు మరియు సేవలను అందిస్తుంది: 1.వ్యాపారం 2. ఆతిథ్య సేవలు 3. రవాణా (రైలు, రోడ్డు, వాయు, జల రవాణా) 4. సమాచారం, గిడ్డంగులు, స్థిరాస్తి వ్యాపారం 5. బ్యాంకింగ్ మరియు బీమా సేవలు 6. కమర్షియల్ సర్వీసెస్, ఐటీ సర్వీసెస్, కన్సల్టెన్సీ సర్వీసెస్ 7. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పోలీస్, డిఫెన్స్, జ్యుడీషియరీ 8. ఆరోగ్యం, విద్య, పరిశుభ్రత 9. ఎన్ఎస్ఎస్ఓ 63వ రౌండ్ 2006-07 సర్వేలో వ్యక్తిగత, గృహ సేవలు, ఆర్థిక సంస్థలు, స్వయం సహాయక బృందాలు (SHGs), మైక్రోఫైనాన్స్ సంస్థలు, వాణిజ్య వాహనాలను సేవా రంగంలో వస్తువులుగా ఉపయోగించడాన్ని ప్రస్తావించారు.

23.2 భారత ఆర్థిక వ్యవస్థలో తృతీయ రంగం పాత్ర

అభివృద్ధి చెందిన తృతీయ రంగం వేగవంతమైన ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుంది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాల సరఫరా మూలధన ఉత్పత్తి రేటును పెంచడం ద్వారా అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థల్లో తలసరి ఉత్పత్తి పెరిగితే జీడీపీలో సేవల రంగం వాటా పెరుగుతుంది.

2020-21 నాటికి అమెరికాలో సేవల రంగం వాటా 53.89%, యూకేలో 72%, జర్మనీలో 71%, జపాన్లో 72%. 2020-21లో భారత జీడీపీలో సేవల రంగం వాటా 80.1 శాతంగా ఉంది. 2020-21లో అభివృద్ధి చెందిన దేశాల కంటే భారత్లో సేవారంగం ఎక్కువగా ఉంది. అయితేదేశ స్థూల దేశీయోత్పత్తిలో సేవల రంగం వాటా సింహభాగం. మన దేశంలో తృతీయ రంగం అభివృద్ధి హరిత విప్లవం, పారిశ్రామికీకరణ, పట్టణీకరణకు దోహదం చేసింది.

23.3 భారతదేశంలో తృతీయ రంగ ప్రాధాన్యత

ఆర్థికాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను అందించే సేవల రంగం యొక్క ప్రాముఖ్యతను ఈ క్రింది ఆర్థిక గణాంకాలు వివరిస్తాయి. అవి: 1. సేవల రంగంలో పనిచేసే కార్మికుల శాతం, 2. జాతీయాదాయంలో సేవల రంగం వాటా 3. సేవా రంగంలో పెట్టుబడులు 4. సేవారంగ ఎగుమతులు.

1. సేవా రంగంలో పనిచేసే కార్మికుల శాతం: 1991లో 179 లక్షలుగా ఉన్న సేవా రంగంలో పనిచేసే కార్మికుల సంఖ్య 2020 నాటికి 193 లక్షలకు పెరిగింది. మొత్తం శ్రామిక శక్తిలో సేవా రంగ కార్మికుల వాటా 1950-51లో 17.3% నుండి 2020 నాటికి 32.3%కి పెరిగింది.

2. జాతీయాదాయంలో సేవారంగం వాటా: జాతీయాదాయంలో సేవారంగం వాటా 1950-51లో 29 శాతం ఉండగా, 2020-21 నాటికి 61 శాతానికి పెరిగింది. 1950-51 నుంచి 1990-91 వరకు నాలుగు దశాబ్దాల్లో సేవల రంగం సగటు వృద్ధి రేటు 4.9 శాతం నుంచి 2004-05 నుంచి 2020-21 వరకు 10.6 శాతానికి పెరిగింది.

3. సేవారంగ పెట్టుబడులు: పంచవర్ష ప్రణాళికలు సేవారంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాయి. మొత్తం ప్రణాళిక కేటాయింపుల్లో ఇంధనం, రవాణా, సమాచార రంగాలకు 55 శాతం నుంచి 65 శాతం కేటాయించారు. పదవ పంచవర్ష ప్రణాళిక కంటే సేవారంగం ప్రభుత్వ, ప్రైవేటు మరియు పెట్టుబడులు 9% పెరిగాయి.

4. సేవల రంగం ఎగుమతులు: ఆర్థికాభివృద్ధిలో మన ఎగుమతుల వల్ల ఏర్పడే నిర్మాణాత్మక మార్పులు. ఎగుమతుల్లో వ్యవసాయ ఉత్పత్తులు, ఖనిజాల వాటా తగ్గి సేవారంగానికి ప్రాధాన్యం పెరిగింది. టెక్నికల్ కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇంజినీరింగ్ డిజైన్, ప్రాజెక్ట్ ఎవాల్యుయేషన్ (అబ్జర్వేషన్), సైన్స్ రీసెర్చ్ ఎగుమతులు పెరుగుతున్నాయి. ఈ సేవలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఈ రంగం అభివృద్ధి చెందింది. దేశానికి విదేశీ మారక ద్రవ్యం లభిస్తుంది. మూడో రంగ ఎగుమతి ఆదాయం 2004-05లో 40 బిలియన్ డాలర్ల నుంచి 2020-2021లో 497.9 బిలియన్ డాలర్లకు పెరిగింది.

23.4 భారతదేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి

ప్రాథమిక, మాధ్యమిక రంగాల అభివృద్ధి మౌలిక సదుపాయాల లభ్యతపై ఆధారపడి ఉంటుంది. మౌలిక సదుపాయాల రంగాల అనుసంధానం, విస్తరణ గరిష్ట ఆర్థిక వృద్ధి రేటుకు దోహదపడుతుంది మరియు వేగవంతమైన ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుంది.మౌలిక సదుపాయాలలో రెండు రకాలు ఉన్నాయి: 1. ఆర్థిక మౌలిక సదుపాయాలు 2. సామాజిక మౌలిక సదుపాయాలు.

1. ఆర్థిక మౌలిక సదుపాయాలు: వీటిలో (ఎ) నీటిపారుదల మరియు వరద నివారణ, (బి) ఇంధన రంగం, బొగ్గు, చమురు, విద్యుత్, (సి) రవాణా రంగం – రోడ్లు, రైలు, వాయు, జల రవాణా, (డి) కమ్యూనికేషన్లు – ఫోన్లు, టెలిగ్రామ్, టెలికమ్యూనికేషన్లు, (ఇ) ఆర్థిక సేవలు – బ్యాంకింగ్, బీమా, (ఎఫ్) సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలు.
2. సామాజిక మౌలిక సదుపాయాలు: వీటిలో విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం మొదలైనవి ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. మౌలిక సదుపాయాల అభివృద్ధి అనేది భారీ పెట్టుబడులు మరియు కార్మికులతో కూడిన నిరంతర ప్రక్రియ. మన దేశంలో మౌలిక సదుపాయాల లభ్యత, విస్తరణ పట్టణ ప్రాంతాలకే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు అభివృద్ధి చెందడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మందకొడిగా సాగుతోంది. ఈ ప్రాంతాల్లో ఉపాధి కల్పన అవకాశాలు చాలా నెమ్మదిగా, తక్కువగా ఉన్నాయి.

పట్టిక–1: మౌలిక సదుపాయాల లభ్యత (మిలియన్ టన్నులలో)

అవస్థాపన సౌకర్యాలు	1950-51	1999-2000	2020-21
1. బొగ్గు	32	322	598
2. విద్యుత్#	5	481	886
3. పెట్రోల్, ఆయిల్	0.4	32	20
4. ఉక్కు	1.0	27	78
5. సిమెంట్	3	100	235
6. రైల్వే కార్గో	73	456	1021
7. సముద్ర తీర రవాణా	19	272	576
8. టెలిఫోన్ కనెక్షన్లు	NA	5	1036

మూలం: ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా: 2021 # అంటే బిలియన్ టన్నులు

పట్టిక-1 ప్రకారం, 1950-51లో బొగ్గు ఉత్పత్తి 32 మిలియన్ టన్నుల నుంచి 598 మిలియన్ టన్నులకు పెరిగింది. 1999-2000లో 100 మిలియన్ టన్నులుగా ఉన్న సిమెంట్ ఉత్పత్తి 2020-21 నాటికి 235 మిలియన్ టన్నులకు పెరిగింది. అదేవిధంగా, రైల్వేల కార్గో 1950-51లో 73 మిలియన్ టన్నుల నుండి 2020-21లో 1021 మిలియన్ టన్నులకు పెరిగింది. భారత్ లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని చెప్పవచ్చు.

23.5 భారతదేశంలో రవాణా రంగం

రవాణా రంగం అనేది ఆర్థిక కార్యకలాపాల ఉపయోగం మరియు ఉత్పత్తి పంపిణీని సులభతరం చేసే మౌలిక సదుపాయాల సౌకర్యం. రవాణా సౌకర్యాలు ప్రజలను మరియు వస్తువులను ఒక ప్రాంతం నుండి మరొక ప్రదేశానికి తరలిస్తాయి. రవాణా వ్యవస్థ వ్యవసాయ క్షేత్రాలు మరియు పరిశ్రమలు ఇన్‌పుట్‌ను అందిస్తాయి మరియు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెట్ లకు రవాణా చేస్తాయి. రవాణా రంగం దేశంలోని కొండ ప్రాంతాలు, అడవులు మరియు వెనుకబడిన ప్రాంతాలు. ఇది ప్రాంతాలు, నదీ తీరాలు మరియు మారుమూల ప్రాంతాల మధ్య ప్రజల రాకపోకలను సులభతరం చేస్తుంది. ప్రపంచంలోని అన్ని దేశాల మధ్య జల మరియు వాయు రవాణా ప్రజల వలసలు, వస్తువుల ఎగుమతి మరియు దిగుమతి, వాణిజ్యం, జ్ఞాన మార్పిడి, మంచి సంబంధాలు మరియు సహకారాన్ని ప్రోత్సహిస్తుంది.

వివిధ రవాణా మార్గాలు

నాలుగు రకాల రవాణా సౌకర్యాలు ఉన్నాయి, అవి 1. రోడ్డు రవాణా 2. రైలు రవాణా 3. వాయు రవాణా 4. జల రవాణా

1. **రోడ్డు రవాణా:** ఇది మన దేశంలో ఎక్కువగా ఉపయోగించే రవాణా సాధనం. రోడ్లు మారుమూల ప్రాంతాలు, కుగ్రామాలను కూడా కలుపుతాయి. నేడు ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులను గోల్డెన్ కారిడార్లుగా అభివృద్ధి చేసి వాటి వినియోగదారుల నుంచి టోల్ వసూలు చేస్తున్నారు. డ్యూటీగా వసూలు చేసిన మొత్తాన్ని రోడ్ల మరమ్మతులకు వినియోగిస్తున్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎన్.హెచ్.డి.పి.), ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (పి.ఎం.జి.ఎస్.వై.) పథకాలను జాతీయ, రాష్ట్ర రహదారుల అభివృద్ధికి ప్రవేశపెట్టారు.

2. **రైలు రవాణా:** బ్రిటీష్ కాలంలో 1853లో లార్డ్ డల్హౌసీ భారతదేశంలో రైల్వేలను ప్రవేశపెట్టాడు. 1950లో దేశంలో రైల్వేలు జాతీయం చేయబడ్డాయి. దేశంలోని మారుమూల ప్రాంతాలను కలిపే ప్రపంచంలోనే అతిపెద్ద రవాణా వ్యవస్థ భారతీయ రైల్వే. భారతదేశం 19 రైల్వే డివిజన్లతో రూపొందించబడింది. రైల్వే ఇంజిన్లు, బోగీలు, వ్యాగన్ల స్థానంలో కొత్తవాటిని ప్రవేశపెట్టడం, పంచవర్ష ప్రణాళికలు రైల్వేల క్రమబద్ధీకరణ, ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చాయి. రైళ్లలో ఫోన్, వై-ఫై వంటి ఆధునిక సాధనాలను ప్రవేశపెట్టడం వంటి చర్చలు జరిగాయి. చెన్నై, ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లలో మెట్రో రైళ్లను ప్రవేశపెట్టారు.

3. **జలరవాణా:** జలరవాణాలో రెండు రకాలు ఉన్నాయి. అవి: 1. అంతర్గత జలరవాణా 2. సముద్ర జల రవాణా. అంతర్గత జల రవాణా వనరులు: నదులు, జలాశయాలు, కాలువలు, సముద్రాలు, వెనుక జలాలు) చిన్న పడవలు, మోటారు బోట్లు – ప్రజలను మరియు వస్తువులను రవాణా చేస్తాయి.

   సముద్ర జల రవాణాలో చిన్న నౌకలు, భారీ నౌకలు మరియు దేశీయ ఓడరేవులు మరియు విదేశీ ఓడరేవులకు రవాణా చేయబడే భారీ వస్తువులు (బొగ్గు, చమురు) ఉంటాయి. ఇది తక్కువ రవాణా ఖర్చు మరియు స్థిరమైన రవాణా విధానం. ఈ రవాణా వ్యవస్థ అభివృద్ధి తీరప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది మరియు ఆదాయం మరియు వాణిజ్యాన్ని పెంచుతుంది. మన దేశ సముద్రతీరం 7,156 కి.మీ. మన దేశంలో 12 పెద్ద, 187 చిన్న ఓడరేవులు ఉన్నాయి. మొత్తం రవాణా రంగంలో జలరవాణా వాటా 29%.

4. **వాయు రవాణా:** భారతదేశంలో 1950లో విమానయాన రంగాన్ని జాతీయం చేసి, ఇండియన్ ఎయిర్లైన్స్ మరియు ఎయిర్ ఇండియా స్థాపించబడ్డాయి. ఇండియన్ ఎయిర్లైన్స్ దేశీయ విమాన సేవలను, ఎయిరిండియా అంతర్జాతీయ విమాన సేవలను అందిస్తున్నాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా విమానయాన రంగంలో ప్రైవేటు రంగానికి ప్రవేశం కల్పించారు. విమానయాన రంగంలోకి ప్రైవేటు విమానయాన సంస్థలకు ప్రవేశం కల్పించారు. ప్రస్తుతం భారత్ లో 103 దేశీయ, 24 అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్నాయి. ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో విమాన రవాణా పని చేస్తుంది.

మన దేశంలో రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలు:

1. నిర్వహణ వ్యయం పెరుగుతుంది.
2. సరైన ప్రణాళికలు లేకపోవడం.
3. ప్రయాణీకుల రద్దీ మరియు జనాభా పెరుగుదల.
4. కాలం చెల్లిన ఇంజిన్లు, వ్యాగన్లు, సిగ్నలింగ్.
5. సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల కొరత.
6. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయ లోపం.
7. రాజకీయ సంకల్పం లేకపోవడం.

23.6 ఇంధన రంగం

ఆర్థిక వృద్ధి రేటు ఇంధన వనరుల లభ్యతపై ఆధారపడి ఉంటుంది. తలసరి ఆదాయం ఎంత ఎక్కువగా ఉంటే ఇంధన వినియోగం అంత తక్కువగా ఉంటుంది. యునైటెడ్ స్టేట్స్, ఇంగ్లాండ్, జర్మనీ మరియు జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయం మరియు తలసరి శక్తి వినియోగం చాలా ఎక్కువగా ఉంది. మన ప్రత్యర్థి అయిన చైనాలో మన తలసరి ఇంధన వినియోగం కంటే రెట్టింపు ఉంది.

శక్తి వనరుల రకాలు:

శక్తి వనరులలో ప్రధానంగా రెండు రకాలు ఉన్నాయి. 1. సంప్రదాయ ఇంధన వనరులు 2. సంప్రదాయేతర ఇంధన వనరులు.

1. **సంప్రదాయ శక్తి వనరులు:** సంప్రదాయ శక్తి వనరులలో బొగ్గు, చమురు, సహజ వాయువు, థోరియం, యురేనియం మొదలైనవి ఉన్నాయి, వీటిని ఒకసారి వినియోగిస్తే, తిరిగి పునరుత్పత్తి చేయలేము.

   i) బొగ్గు: బొగ్గు, లిగ్నైట్ పాడైపోయే ఖనిజాలు. ప్రపంచంలోని బొగ్గు నిల్వలలో భారతదేశం 7% కలిగి ఉంది మరియు ఇంధన అవసరాలలో 50% బొగ్గు ద్వారా తీర్చబడుతుంది. 2018–19లో బొగ్గు, లిగ్నైట్ ఉత్పత్తి 583 మెట్రిక్ టన్నులు. ఇదే స్థాయిలో వాడితే వచ్చే 13 ఏళ్లలో ఈ ఖనిజాలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోతాయి. తమిళనాడు రాష్ట్రంలోని మైనింగ్ నైవేలి, ఆర్కాట్ ప్రాంతాల్లో మాత్రమే లిగ్నైట్ లభిస్తుంది.

   ii) ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్: మన దేశంలో లభ్యమయ్యే చమురు పరిమాణం 550 బిలియన్ టన్నులు. సహజ వాయువు 550 బిలియన్ మీటర్లు. ఇదే స్థాయిలో ఉత్పత్తి జరిగితే 20 నుంచి 25 ఏళ్లలో ఈ ఖనిజాలు అంతరించిపోతాయి.

   iii) అణుశక్తి: అణువిద్యుత్‌కు ఆధారం యురేనియం, థోరియం, ధాతువులు, ఇవి మొత్తం విద్యుదుత్పత్తిలో 4% వాటాను కలిగి ఉంటాయి.

2. **సంప్రదాయేతర శక్తి వనరులు:** సంప్రదాయ శక్తి వనరులలో సౌరశక్తి, సముద్ర తరంగాల శక్తి, పవన శక్తి, బయోగ్యాస్ మొదలైనవి పునరుత్పత్తి చేయగలవు. ఇవి కాలుష్యాన్ని కలిగించవు. అభివృద్ధి చెందిన దేశాలలో వీటి వినియోగం అధికంగా ఉంది. ఇవి కాకుండా చెరకు నుంచి జట్రోఫా ప్లాంట్ నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేస్తారు. ఈ క్రింది పట్టిక ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఈ క్రింది పట్టికను పరిశీలిస్తే పరిశ్రమలు, వాణిజ్య రంగాల వినియోగం పెరుగుతుండగా, గృహ రంగం కూడా వినియోగ రేటులో ముందంజలో ఉంది. 1950 నుంచి 2019 వరకు దాదాపు అన్ని రంగాల వినియోగం పెరిగింది.

పట్టిక–2: భారతదేశంలో విద్యుత్ ఉత్పత్తి, రంగాల విద్యుత్ వినియోగం శాతం (1950–2019)

సంవత్సరం	విద్యుత్ ఉత్పత్తి (గిగా వాట్స్)	దేశీయ రంగం	వాణిజ్యం	పరిశ్రమలు	వ్యవసాయం	ఇతర ఉపయోగాలు
1950	510	9	6	72	10	3
1979	84005	9	5	65	14	4
1997	315294	18	6	44	27	4
2007	525672	21	18	46	19	4
2013	85292	22	8	45	18	4
2019	87145	21	9	47	17	6

మూలం: మినిస్ట్రీ ఆఫ్ కమర్షియల్ ఎనర్జీ, భారత ప్రభుత్వం–2019

23.7 సమాచార రంగం

సమాచార రంగం వ్యక్తులు మరియు ప్రాంతాలకు మార్కెట్ల అభివృద్ధికి అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది. సమర్థవంతమైన కమ్యూనికేషన్ వాణిజ్యం మరియు ఆర్థిక వృద్ధి రేటు పెరుగుదలకు సహాయపడుతుంది. సమాచార రంగం 1) పోస్టల్ (పోస్ట్) 2) టెలిగ్రాఫ్ (టెలిగ్రాఫ్) టెలికమ్యూనికేషన్ సేవలను అందిస్తుంది.

1) **పోస్టల్ సేవలు:** మన దేశంలో 1776 నుంచి పోస్టల్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం మన దేశంలో 1.5 లక్షల పోస్టాఫీసులు ఉన్నాయి. ఒక్కో పోస్టాఫీస్ సగటున 7000 వరకు సేవలు అందిస్తోంది. 500 కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి గ్రామానికి ఒక పోస్టాఫీసు ఉంది. మన పోస్టల్ డిపార్ట్ మెంట్ ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా ఉంది. పోస్ట్ కార్డులు, కవర్లు, స్టాంపులు, లెటర్లు, పార్సిళ్ల విక్రయం వంటి సంప్రదాయ సేవలతో పాటు కొత్త సేవలను కూడా అందిస్తున్నారు. 21వ శతాబ్దపు 'స్పీడ్ ఏజ్'తో పాటు స్పీడ్ పోస్ట్, మెట్రో పోస్ట్, రాజధాని సర్వీసులు, ఇంటర్నేషనల్ పార్శిల్ హబ్స్, ఇండియా పోస్ట్ గ్లోబల్ పోర్టల్, ఈజ్ ఆఫ్ క్విక్ మనీ ఆర్డర్స్, వెస్టన్ మనీ ట్రాన్స్ఫర్ను ప్రవేశపెట్టారు.

   పోస్టల్ శాఖ ఉద్యోగుల కొరత, భారీ ఆర్థిక లోటు, ప్రైవేట్ కొరియర్ పోటీ వంటి సమస్యలను ఎదుర్కొంటోంది.

2) **ఇండియన్ టెలిగ్రాఫ్ సర్వీసెస్:** ప్రపంచంలోనే మొట్టమొదటి టెలీగ్రాఫ్ సేవలు మనదేశంలో ప్రారంభమయ్యాయి. టెలిగ్రామ్‌లు, ఫ్యాక్స్ సందేశాలు మొదలైనవి త్వరితగతిన డెలివరీ చేయడానికి వీలు కల్పించబడ్డాయి. టెలిఫోన్ లైన్ల విస్తరణతో టెలిగ్రాఫ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయి.

3) **టెలీ కమ్యూనికేషన్స్:** ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల అభివృద్ధికి టెలీకమ్యూనికేషన్ రంగం దోహదం చేస్తుంది. ఇది అంతర్జాతీయ మార్కెట్లో పోటీతత్వాన్ని పెంచుతుంది. మన ప్రభుత్వ రంగ సంస్థలు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) మరియు మహానగర్ టెలిఫోన్స్ లిమిటెడ్ (ఎంటిఎన్ఎల్) ఆసియాలో అతిపెద్ద టెలికమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్లు. ఉద్యోగుల కొరత, టవర్ల కొరత వంటి సమస్యలు ఉన్నాయి. 1999లో, టెలికాం విధానం యొక్క లక్ష్యం టెలిఫోన్ కనెక్షన్లను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం మరియు టెలిఫోన్ టారిఫ్‌ను (ఛార్జీలు) నిర్ణయించడానికి మరియు నియంత్రించడానికి టెలిఫోన్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్)ను ఏర్పాటు చేయడం. టెలికాం రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచారు. 2010 నాటి జాతీయ టెలికాం విధానంతో అన్ని వర్గాల ప్రజలకు టెలికాం సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి టారిఫ్ లను క్రమబద్ధీకరించడం, సమర్థవంతమైన సేవలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. టెలికాం రంగంలో అదనపు పెట్టుబడులను ఆకర్షించడానికి స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడం కూడా లక్ష్యం.

23.8 సమాచార సాంకేతికరంగం

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) 21వ శతాబ్దపు సృజనాత్మకత, విజ్ఞాన ఆధారిత సమాజంలో విప్లవాత్మక మార్పులు తెస్తోంది. ఆధునిక పరికరాలను ఉపయోగించి సమాచార సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచంలోని అన్ని దేశాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. ఐటీ అభివృద్ధితో గ్లోబల్ విలేజ్ కాన్సెప్ట్ వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో ఐటీ ఆధారిత సేవలను వినియోగిస్తోంది. ఐటీ రంగం సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్, ఇంజినీరింగ్ డిజైన్, రీసెర్చ్, డెవలప్‌మెంట్ జూమ్ సేవలను అందిస్తోంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ సర్వీసెస్ ఇన్ఫర్మేషన్ బేస్డ్ సర్వీస్, బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్, టెలికాం సెక్టార్ ఈ సేవలను ఉపయోగించుకుంటున్నాయి. మన దేశంలో ఐటీ సేవలు అందిస్తున్న 5 పెద్ద కంపెనీలు టాటా కన్సల్టెన్సీ సర్వీస్ (టీసీఎస్), కాగ్నిజెంట్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్.సి.ఎల్.

ఐటి రంగం అభివృద్ధి మన దేశాన్ని “మందకొడి దేశం” నుండి “ఆవిష్కరణల దేశం”గా గుర్తించింది. ఐటీ సేవలను అందించడంలో ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద దేశం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రాంతీయ ప్రభుత్వాలు ఈ టెక్నాలజీని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, విధులు, ప్రభుత్వం నిర్వహించే సేవలకు ఉపయోగిస్తారు. అన్ని ప్రభుత్వ సేవలను కంప్యూటరీకరించిన తర్వాత ఈ–సేవ, మీ–సేవ, మున్సిపాలిటీలు, ఆన్‌లైన్ చెల్లింపులు, పన్ను చెల్లింపులు, రశీదులు, సర్టిఫికెట్లను అందరూ వినియోగిస్తున్నారు. ప్రభుత్వ సేవల కంప్యూటరీకరణ. ఇది పాలనా వ్యవస్థలో పారదర్శకత, సమర్థత మరియు కమ్యూనిటీ యాజమాన్యాన్ని సాధ్యం చేస్తుంది మరియు విధుల నిర్వహణలో జాప్యం మరియు అవినీతిని తగ్గిస్తుంది.

ఐటీ ఎగుమతి ఆధారిత పరిశ్రమగా గుర్తింపు పొందింది. సేవల రంగంలో ఐటి ఎగుమతులు 77%. 2020–21 సంవత్సరంలో ఐటీ రంగం మిలియన్ జనాభాలో 4.4% మందికి ప్రత్యక్షంగా, 12 మిలియన్ల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. మన ఎగుమతులతో అభివృద్ధి మన దేశాన్ని విజ్ఞాన ఆర్థిక వ్యవస్థల్లో అగ్రస్థానంలో నిలిపింది.

సోషల్ మీడియా నెట్‌వర్కింగ్ (గూగుల్, ఫేస్‌బుక్, ట్విట్టర్) ఆన్‌లైన్ షాపింగ్, ప్రభుత్వ రంగ ఆర్థిక సేవలు, కంప్యూటర్ క్యూరేటివ్ ఐటీ రంగం అభివృద్ధికి దోహదం చేస్తోంది. కామన్ సర్వీసెస్ వల్ల ఇంటర్నెట్, అత్యాధునిక టెలికాం పరికరాల వాడకం పెరిగింది.

23.9 శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం

శాస్త్రసాంకేతిక రంగాల అభివృద్ధిలో భారత్ ప్రపంచంలోనే ముందంజలో ఉందన్నారు. ఈ రంగాల అభివృద్ధి అంతర్జాతీయ మార్కెట్లలో మన పోటీతత్వాన్ని పెంచింది. అభివృద్ధి చెందిన దేశాలన్నీ మన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నాయి. పరిశోధన, అభివృద్ధి అవకాశాలు పుష్కలంగా ఉన్న దేశంగా దేశం గుర్తింపు పొందింది. ఆర్థిక పురోగతికి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చాలా అవసరం. ఆర్థిక వృద్ధి రేటును అత్యల్ప స్థాయి నుంచి పైస్థాయికి తీసుకెళ్లే శక్తి ఈ రంగాలకు ఉంది. శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు దోహదం చేస్తాయి. శాస్త్ర సాంకేతిక పురోగతి పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదం చేస్తుంది.

శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ప్రయోజనాలు:

1. ఉత్పత్తి కారకాల ఉత్పాదకతను పెంచుతుంది.
2. క్యాపిటల్ గూడ్స్‌ను సమర్థవంతంగా వినియోగించడం సాధ్యమవుతుంది.
3. కొత్త యంత్రాలు, మెరుగైన పరికరాల వాడకం వల్ల శ్రామిక శక్తి సామర్థ్యం పెరుగుతుంది.
4. వృథాను, ఉత్పత్తి ఖర్చులను తగ్గిస్తుంది.
5. ఉత్పత్తి, పంపిణీ ప్రక్రియలను వేగవంతం చేస్తుంది.
6. ఇది వ్యవసాయం, పారిశ్రామిక రంగాల మధ్య కనెక్టివిటీని బలోపేతం చేస్తుంది.
7. అంతర్గత మరియు బాహ్య పొదుపు పెద్ద ఎత్తున ఉత్పత్తిని పెంచుతుంది మరియు పరిశ్రమల లాభాలను పెంచుతుంది.
8. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి వల్ల కావలసిన వనరుల వినియోగం సాధ్యమవుతుంది మరియు గరిష్ట ఉత్పత్తిని అందిస్తుంది. శాస్త్ర, వైజ్ఞానిక రంగాల్లో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఏదేమైనా, మన దేశ జనాభాలో కేవలం 6% మంది మాత్రమే పరిశోధనా రంగంలో ఉండటం భారతదేశం అభివృద్ధి చెందడానికి ప్రధాన బలహీనత. అదేవిధంగా, యునైటెడ్ స్టేట్స్‌లో జనాభాలో 32% మంది పరిశోధనా రంగంలో పనిచేస్తున్నారు. ప్రతి 10,000 జనాభాకు ఇంజనీర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే, భారతదేశంలో 22 మంది మాత్రమే ఉన్నారు. యునైటెడ్ స్టేట్స్లో 456 మంది ఉన్నారు. ఏదేమైనా శాస్త్ర సాంకేతిక రంగంలో నిర్మాణాత్మక మార్పులు సేవా రంగంలో ఉపాధి అవకాశాలను పెంచాయి మరియు జాతీయ ఆదాయంలో వాటా పెరుగుతోంది.

23.10 బ్యాంకింగ్ రంగం

బ్యాంకింగ్ వ్యవస్థ ఫైనాన్షియల్ మార్కెట్లో అంతర్భాగం. భారతదేశ ఔత్సాహిక బ్యాంకింగ్ వ్యవస్థలో అంతర్భాగాలు. 1) రిజర్వ్ బ్యాంక్ 2) షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు 3) షెడ్యూల్డ్ కో-ఆపరేటివ్ బ్యాంకులు. బ్యాంకింగ్ వ్యవస్థ లేదా అపెక్స్ బ్యాంక్ యొక్క అధిపతి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదా సెంట్రల్ బ్యాంక్. షెడ్యూల్డ్ బ్యాంకులు ఆర్.బి.ఐ. చట్టం 1934 యొక్క రెండవ షెడ్యూల్ లో చేర్చబడిన మరియు డిపాజిట్లను స్వీకరించడం, రుణాలు ఇవ్వడం మరియు ఇతర బ్యాంకింగ్ సేవలను అందించడం వంటి బ్యాంకింగ్ యొక్క సాధారణ వ్యాపారాన్ని నిర్వహించే బ్యాంకులను షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు అంటారు. వాణిజ్య బ్యాంకులు లాభాలు ఆర్జించడమే లక్ష్యంగా వ్యాపారం చేస్తుంటాయి. డిపాజిట్ల శ్రేయస్సుకు భంగం కలగకుండా పెట్టుబడులు పెడతారు. కో-ఆపరేటివ్ బ్యాంకులు సభ్యుల సహాయంతో లాభాపేక్ష లేకుండా సేవలు అందిస్తాయి. ప్రజలు, సంస్థల పొదుపును వాణిజ్య బ్యాంకు డిపాజిట్లుగా సేకరించి, సేకరించిన సొమ్మును స్వల్పకాలిక రుణాల ద్వారా మంజూరు చేస్తారు. 1969లో భారతదేశం మొదటిసారిగా, 14 ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేశారు మరియు 1980 లో సాంఘిక సంక్షేమం కోసం మరో 6 బ్యాంకులను కూడా జాతీయం చేశారు.



రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ.): ఇది 1935 లో స్థాపించబడింది మరియు 1949లో జాతీయం చేయబడింది మరియు ఇది ముంబైలో ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మన కేంద్ర బ్యాంకు. దీన్నే అపెక్స్ బ్యాంక్ మానిటరీ సిస్టమ్ అంటారు. కరెన్సీ నోట్ల జారీ, బ్యాంకర్‌గా, ఏజెంట్‌గా, ప్రభుత్వానికి సలహాదారుగా వ్యవహరించడం, విదేశీ మారక ద్రవ్య నిధులు, బంగారం నిల్వలను పరిరక్షించడం, బ్యాంకులకు బ్యాంకర్ గా బ్యాంకుల నగదు నిల్వ కార్యకలాపాలను పరిశీలించడం, చెక్ క్లియరింగ్ సేవలను అందించడం, క్రెడిట్ కంట్రోల్, మారకం రేటు నియంత్రణ మొదలైనవి రిజర్వ్ బ్యాంకుల విధులు. కేంద్ర బ్యాంకు ఆర్థికాభివృద్ధి మరియు సాంఘిక సంక్షేమాన్ని ప్రోత్సహించే అనేక ఇతర విధులను కూడా నిర్వహిస్తుంది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలు తీసుకుంటుంది.

వాణిజ్య బ్యాంకులు

వాణిజ్య బ్యాంకుల ప్రాథమిక విధులు ప్రజలు మరియు సంస్థల నుండి అటువంటి పొదుపును డిపాజిట్లుగా స్వీకరించడం మరియు పొందిన డిపాజిట్లలో ఎక్కువ భాగాన్ని రుణాలుగా మంజూరు చేయడం. బ్యాంకు రుణాలు మంజూరు చేసే ప్రక్రియను 'క్రెడిట్ క్రియేషన్' అంటారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగంలో 27 బ్యాంకులు ఉండగా, ప్రస్తుతం 12 బ్యాంకులు మాత్రమే ఉన్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ). అతి పెద్ద బ్యాంకింగ్ వ్యవస్థగా పరిగణించవచ్చు.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు 1975 అక్టోబరు 2న స్థాపించబడ్డాయి. వాణిజ్య బ్యాంకులు నిర్వహించే అన్ని విధులను ఈ బ్యాంకులు నిర్వహిస్తాయి. అయితే ఈ బ్యాంకుల కార్యకలాపాల పరిధి కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైంది. ఈ బ్యాంకులు గ్రామీణ ప్రాంతాల్లో పొదుపును పెంచి వివిధ, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ కుటీర పరిశ్రమలకు రుణాలు అందిస్తాయి.

సహకార బ్యాంకులు

సహకార బ్యాంకుల నిర్మాణం ఈ క్రింది విధంగా మూడు స్థాయిలలో ఉంటుంది.

1) ఆర్.బి.ఐ. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నియంత్రించబడే స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంకులు (ఎస్.సి.ఒ.బి. ఈ బ్యాంకులు దేశ వ్యాప్తంగా గ్రామీణ, అల్పాదాయ ప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. వ్యవసాయ మరియు అనుబంధ కార్యకలాపాలు, చిన్న తరహా పరిశ్రమలు మరియు ఇతర చిన్న వ్యాపారాలకు ఇవి తరచుగా ప్రధాన రుణ వనరుగా ఉంటాయి. సహకార పరపతి వ్యవస్థకు రాష్ట్ర స్థాయిలో అపెక్స్ బ్యాంకు ఇది.

2) సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంకులు (సీసీబీ), ఇవి రాష్ట్రంలో జిల్లా స్థాయిలో ఉన్నాయి. సీసీబీలను రాష్ట్ర సహకార శాఖ పర్యవేక్షిస్తుంది మరియు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియంత్రిస్తుంది. సీసీబీలు తమ సభ్యులకు రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవలను అందించడంతో పాటు వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే సాధారణ ప్రజల నుంచి కూడా డిపాజిట్లు తీసుకుంటున్నాయి.

3) ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్), సహకార వ్యవస్థలో మూడో అంచె ఉన్నాయి. సాధారణంగా, పిఎసిఎస్ లు గ్రామ స్థాయిలో నిర్వహించబడతాయి మరియు అవి వాటి సభ్యులచే నిర్వహించబడతాయి మరియు నిర్వహించబడతాయి, వారు సహకార ప్రయోజనం కోసం పెట్టుబడి మరియు శ్రమ రెండింటినీ అందిస్తారు. 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా బ్యాంకింగ్ సేవలు అభివృద్ధి చెందుతున్నాయి. బ్యాంకులు అందించే కొత్త సేవలు: 1) మర్చంట్ బ్యాంకింగ్, షేర్లు, వాణిజ్య

అభివృద్ధి కోసం డిబెంచర్లు 2) మ్యూచువల్ ఫండ్స్ 3) వినియోగదారుల సౌలభ్యం కోసం రిటైల్ బ్యాంకింగ్ 4) ఆటోమేటిక్ టెల్లర్ మిషన్ (ఏటిఎం) 5) ఏదైనా శాఖ నుండి బ్యాంకింగ్ సౌకర్యం, 6) ఇంటర్నెట్ బ్యాంకింగ్, 7) తక్షణ నగదు బదిలీ సౌకర్యం 8) యోనో, ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం మొదలైనవి.

23.11 పర్యాటక రంగం

గత రెండు శతాబ్దాలుగా పర్యాటక రంగం సేవల రంగంలో అతిపెద్ద పరిశ్రమగా అభివృద్ధి చెందుతోంది. మన దేశంలో అత్యధిక వృద్ధిరేటు కలిగిన రెండో ప్రధాన రంగంగా భారత ప్రణాళికా సంఘం పర్యాటక రంగాన్ని గుర్తించింది. అత్యధిక వృద్ధి, ఆదాయం, ఉపాధి అవకాశాలు ఉన్న ఈ రంగాన్ని ఆర్థిక వ్యవస్థలో నాల్గవ రంగంగా పరిగణిస్తారు. వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ ప్రకారం "పర్యాటకం అనేది ఒక సామాజిక, సాంస్కృతిక మరియు ఆర్థిక దృగ్విషయం, ఇది వ్యక్తిగత లేదా వ్యాపార / వృత్తిపరమైన ప్రయోజనాల కోసం ప్రజలు వారి సాధారణ వాతావరణానికి వెలుపల దేశాలకు లేదా ప్రదేశాలకు తరలించడం". వీరిని సందర్శకులు అంటారు. ఏడాది కంటే తక్కువ రోజులు మన దేశంలో పర్యటించడాన్ని 'టూర్' అంటారు. ఆగ్రా, ఢిల్లీ, జైపూర్, కాశ్మీర్, హైదరాబాద్, గోవా, బెంగళూరు, చెన్నై, ముంబై మొదలైనవి మన దేశంలోని కొన్ని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలు.

భారతదేశంలో పర్యాటకం యొక్క ప్రాముఖ్యత: ఆర్థిక అభివృద్ధిలో పర్యాటకానికి ప్రాముఖ్యత పెరుగుతుంది. పర్యాటకం అంతర్జాతీయ సహకారం, సుహృద్భావం, శాస్త్ర సాంకేతిక మార్పిడికి దోహదం చేస్తుంది. పర్యాటక రంగం వృద్ధి రేటు వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది విస్తృత శ్రేణి అనుబంధ రంగాలలో కనెక్టివిటీని బలోపేతం చేస్తుంది. రవాణా, సమాచారం, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, హోటళ్లు, రెస్టారెంట్లు వంటి మౌలిక సదుపాయాలతో పాటు హార్టికల్చర్, ల్యాండ్ స్కేపింగ్, హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. ఇది ఫెసిలిటీ రంగాల ఆదాయాలను పెంచుతుంది. పర్యాటకుల వినియోగం పెరిగితే పర్యాటక రంగానికి ఆదాయం పెరుగుతుంది.

పర్యాటక అభివృద్ధి వల్ల ఆర్థిక వ్యవస్థకు కలిగే ప్రయోజనాలు:

1. ఇది ఆర్థిక వ్యవస్థకు ఆదాయం మరియు ఉపాధిని పెంచుతుంది మరియు విదేశీ మారకద్రవ్యాన్ని అందిస్తుంది.
2. పర్యాటక రంగంలో పెట్టుబడుల గుణకం చక్రీయ ఆదాయ ప్రవాహానికి ఉపాధి విస్తరణకు దోహదం చేస్తుంది.
3. హార్టికల్చర్, ల్యాండ్‌స్కేపింగ్, హస్తకళల పరిశ్రమలు, ఫాస్ట్ ఫుడ్, పర్యాటకులను ఆకర్షించే ప్రత్యేక స్వదేశీ వంటకాలను అందించే హోటళ్లు అభివృద్ధి చెందుతాయి.
4. టికెట్ బుకింగ్, నగదు మార్పిడి, పర్యాటక సౌకర్యాలు, భోజన సౌకర్యాలు, సౌకర్యాలు, పార్కింగ్, విహారయాత్రలు వంటి కొత్త సేవలను అభివృద్ధి చేయనున్నారు.
5. కేంద్ర, రాష్ట్ర, ప్రాంతీయ ప్రభుత్వాల ఆదాయం పెరుగుతుంది.
6. పరిశుభ్రత, రక్షిత తాగునీరు, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, సమతుల్యత, సుస్థిర ఆర్థికాభివృద్ధి వంటి చర్యలు సాధ్యమవుతాయి.

7. పర్యాటక రంగం వివిధ స్థాయిల నైపుణ్యం కలిగిన కార్మికులతో పాటు నైపుణ్యం లేని కార్మికులకు ఉపాధి కల్పిస్తుంది. పర్యాటక రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం 1966లో ఇండియా టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎస్టీడీసీ)ను ఏర్పాటు చేసింది. సంస్థ విధులు: 1) రవాణా, వినోదం, షాపింగ్, సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, కాన్ఫరెన్స్‌లు నిర్వహించడానికి కన్వెన్షన్ క్యాంటర్లను నిర్మించింది 2) కన్సల్టెన్సీ మరియు మేనేజ్‌మెంట్ సేవలను అందించడం 3) పర్యాటకులు ఖర్చు చేసే డబ్బుకు సంతృప్తికరమైన కొత్త సేవలను అందించడం 4) ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో కొత్త సేవలను చేపట్టడం. 2020 సంవత్సరానికి 2.74 మిలియన్ల జనాభా ఉన్న భారతదేశంలోని ప్రదేశాలను మొత్తం విదేశీ పర్యాటకులు సందర్శించారు. వీటి ఫలితంగా 6.958 బిలియన్ల అమెరికన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యం 80 మిలియన్ల మందికి ఉపాధి కల్పించింది.

23.12 సారాంశం

అభివృద్ధి చెందిన తృతీయ రంగం వేగవంతమైన ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుంది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాల సరఫరా మూలధన ఉత్పత్తి రేటును పెంచడం ద్వారా అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేస్తుంది. రవాణా రంగం అనేది ఆర్థిక కార్యకలాపాలు మరియు ఉత్పత్తి యొక్క పంపిణీని సులభతరం చేసే ఒక మౌలిక సదుపాయాలు మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) 21వ శతాబ్దపు ఆవిష్కరణ మరియు జ్ఞాన ఆధారిత సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుంది. ఆధునిక పరికరాలను ఉపయోగించి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రపంచంలోని అన్ని దేశాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. ఇది ఎగుమతి ఆధారిత పరిశ్రమగా గుర్తింపు పొందింది. సేవల రంగంలో ఐటీ ఎగుమతులు 77 శాతంగా ఉన్నాయి. 2020-21 సంవత్సరంలో ఐటీ రంగం మిలియన్ జనాభాలో 4.4% మందికి ప్రత్యక్షంగా, 12 మిలియన్ల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. బ్యాంకింగ్ వ్యవస్థ ఫైనాన్స్ మార్కెట్లో అంతర్భాగం. భారతదేశ ఔత్సాహిక బ్యాంకింగ్ వ్యవస్థలో అంతర్భాగాలు. ఆర్బీఐ మన కేంద్ర బ్యాంకు. అంతర్జాతీయ సహకారం, మంచి సంకల్పం, శాస్త్ర సాంకేతిక మార్పిడికి పర్యాటకం దోహదం చేస్తుంది. పర్యాటక రంగం వృద్ధి రేటు వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది విస్తృత శ్రేణి అనుబంధ రంగాలలో కనెక్టివిటీని బలోపేతం చేస్తుంది.

23.13 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలను వ్రాయండి.

1. తృతీయ రంగాన్ని నిర్వచించండి
2. మౌలిక సదుపాయాల రకాలు
3. విమానయాన రంగం

II. ఈ క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలను వ్రాయండి.

1. మన దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను పేర్కొనండి.
2. సహకార బ్యాంకుల ప్రాముఖ్యతను తెలపండి.
3. సంప్రదాయ మరియు సంప్రదాయేతర శక్తి వనరుల మధ్య తేడా ఏమిటి?
4. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి యొక్క ప్రయోజనాలను పేర్కొనండి.

III. ఈ క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలను వ్రాయండి.

1. రిజర్వ్ బ్యాంక్ యొక్క విధులను వివరించండి.
2. సేవా రంగం యొక్క ప్రాముఖ్యతను పేర్కొనండి.
3. మన దేశంలో రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుందాం.
4. మన దేశ అభివృద్ధిలో సమాచార రంగం యొక్క ప్రాముఖ్యతను వివరించండి.
5. టూరిజం అభివృద్ధి వల్ల ఆర్థిక వ్యవస్థకు కలిగే ప్రయోజనాలను పేర్కొనండి.

23.14 పదకోశం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: ఇది భారతదేశంలో ఒక అత్యున్నత బ్యాంకు. దీనిని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని కూడా పిలుస్తారు. బ్యాంకింగ్ మరియు ఆర్థిక సంస్థలను నియంత్రించడానికి, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి, ప్రభుత్వానికి మరియు బ్యాంకులకు సహాయం చేయడానికి గుత్తాధిపత్యం కలిగి ఉంది. ఇది 1935లో స్థాపించబడింది, కాని భారత ప్రభుత్వం దీనిని 1969లో జాతీయం చేసింది.

షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్.బి.ఐ) చట్టం, 1934 యొక్క 2వ షెడ్యూల్‌లో జాబితా చేయబడిన బ్యాంకులు షెడ్యూల్డ్ బ్యాంకులు. వాణిజ్య బ్యాంకు అనేది ఒక ఆర్థిక సంస్థ, ఇది సాధారణ ప్రజల నుండి డిపాజిట్లను స్వీకరించడం మరియు లాభాన్ని సంపాదించే లక్ష్యంతో పెట్టుబడి కోసం అడ్వాన్స్ మరియు రుణాలను ఇవ్వడం వంటి విధులను నిర్వహిస్తుంది. ఏటీఎం, డిమాండ్ డ్రాఫ్ట్, సర్టిఫికేట్ ఆఫ్ డిపాజిట్స్ వంటి ఇతర ఆర్థిక సేవలను కూడా ఈ బ్యాంకులు అందిస్తున్నాయి.

23.15 ఉపయుక్త గ్రంథాలు

1. ఆర్థిక సర్వే 2021-22
2. తెలుగు అకాడమీ బి.ఎ. ఫైనల్ ఇయర్ పుస్తకం
3. దత్, సుందరం రచించిన భారత ఆర్థిక వ్యవస్థ
4. రిజర్వ్ బ్యాంక్ ఇండియా అధికారిక వెబ్‌సైట్

అధ్యాయం

24

విదేశీ రంగం

24.0 లక్ష్యాలు

24.1 పరిచయం

24.2 వ్యాపార సంతులనం

24.3 వ్యాపార చెల్లింపుల శేషం

24.4 అంతర్జాతీయ వాణిజ్యం

24.5 విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి

24.6 GATT సుంకం మరియు వర్తకంపై సాధారణ ఒప్పందం

24.7 WTO ప్రపంచ వర్తక సంస్థ

24.8 సారాంశం

24.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు

24.10 పదకోశం

24.11 ఉపయుక్త గ్రంథాలు

24.0 లక్ష్యాలు

- వ్యాపార సంతులనం (BOT) మరియు వ్యాపార చెల్లింపుల శేషం (BOP) భావనలను తెలుసుకుంటారు.
- భారతదేశం యొక్క వ్యాపార చెల్లింపుల శేషం ధోరణులను విశ్లేషించగలుగుతారు.
- అంతర్జాతీయ వాణిజ్యం యొక్క భావనను వివరించగలుగుతారు.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి యొక్క సుగుణాలను మరియు లోపాలను వివరిస్తారు.
- GATT మరియు WTO మధ్య గల తారతమ్యాలను తెలుసుకుంటారు.

24.1 పరిచయం

ప్రతి దేశం తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయగల కొన్ని వస్తువుల ఉత్పత్తిలో ప్రత్యేకత కలిగి ఉంటుంది. ప్రతి దేశం ఎక్కువ ఖర్చుతో మాత్రమే ఉత్పత్తి చేయగల వస్తువులను దిగుమతి చేసుకుంటుంది. ప్రతి దేశానికి కొన్ని వస్తువుల ఉత్పత్తిలో ప్రయోజనం ఉంటుంది. ఇది ప్రత్యేకత వల్ల కావచ్చు ఉత్పత్తికారకాల లభ్యత వల్ల కావచ్చు. అంతర్జాతీయ వాణిజ్యం అనేది జాతీయ సరిహద్దుల ద్వారా దేశాల మధ్య వస్తువులు మరియు సేవల మార్పిడి. దేశాలు తాము ఉత్పత్తి చేయలేని లేదా తక్కువ ధరకు వేరే చోట కొనుగోలు చేయగల వస్తువులను పొందేందుకు వాణిజ్యం చేయాలి.

అంతర్జాతీయ వాణిజ్యాన్ని చేపట్టడం ప్రాంతీయ ప్రత్యేకత, అధిక స్థాయి ఉత్పత్తి, మెరుగైన జీవన ప్రమాణం, ప్రపంచవ్యాప్తంగా వస్తువులు మరియు సేవల లభ్యత, ధరలు మరియు వేతనాల సమానత్వం మరియు జ్ఞానం మరియు సంస్కృతి వ్యాప్తికి దారితీస్తే దేశాలకు పరస్పరం ప్రయోజనకరంగా ఉంటుంది.

విదేశీ రంగం అనేది విదేశీ దేశాలతో లావాదేవీలకు సంబంధించిన ఆర్థిక వ్యవస్థలో భాగం. విదేశీ రంగంలో వస్తువులు మరియు సేవల దిగుమతులు మరియు ఎగుమతులు అలాగే పెట్టుబడి మరియు బ్యాంకింగ్ లావాదేవీలకు సంబంధించి మూలధన కదలికలు ఉంటాయి మరియు దేశీయ ఆర్థిక కార్యకలాపాల స్థాయి మరియు కూర్పు మరియు దేశం యొక్క వ్యాపార సంతులనం మరియు చెల్లింపుల శేషం స్థితిని ప్రభావితం చేస్తుంది.

24.2 వ్యాపార సంతులనం (BOT)

వ్యాపార సంతులనం అనేది ఒక దేశం దిగుమతి చేసుకున్న మరియు ఇతర దేశాలకు ఎగుమతి చేయబడిన వస్తువులు మరియు సేవల పరిమాణాన్ని నమోదు చేస్తుంది. వ్యాపార సంతులనం అనేది ఒక దేశం యొక్క వస్తువుల ఎగుమతుల మొత్తం విలువ మరియు వస్తువుల దిగుమతుల మొత్తం విలువను సూచిస్తుంది. ఒక దేశం యొక్క వ్యాపార సంతులనం లో వస్తువుల ఎగుమతి మరియు దిగుమతి మాత్రమే చేర్చబడ్డాయి. వస్తువుల కదలికలను (వస్తువుల ఎగుమతి మరియు దిగుమతులు) 'దృశ్య వాణిజ్యం' అని కూడా పిలుస్తారు, ఎందుకంటే దేశాల మధ్య వస్తువుల కదలిక కళ్ళ ద్వారా చూడవచ్చు మరియు చేతులతో అనుభూతి చెందుతుంది మరియు ఒక దేశం యొక్క అనుకూల అధికారులచే భౌతికంగా ధృవీకరించబడుతుంది.

ప్రతికూలమైన వ్యాపార సంతులనం: ఒక దేశం యొక్క ఎగుమతుల వస్తువుల మొత్తం విలువ ఆ దేశం యొక్క దిగుమతుల వస్తువుల మొత్తం విలువను మించిపోయినప్పుడు, ఆ దేశానికి 'ప్రతికూలమైన' వ్యాపార సంతులనం ఉందని చెప్పవచ్చు..

అననుకూలమైన వ్యాపార సంతులనం: ఒక దేశం యొక్క ఎగుమతుల వస్తువుల మొత్తం విలువ ఆ దేశం యొక్క దిగుమతుల వస్తువుల మొత్తం విలువ కంటే తక్కువగా ఉంటే, ఆ దేశం 'అనుకూలమైన' వ్యాపార సంతులనం కలిగి ఉంటుంది.

వ్యాపార సంతులనం యొక్క సమతౌల్యత: ఒక దేశం ఎగుమతి చేసిన వస్తువుల మొత్తం విలువ అది దిగుమతి చేసుకున్న వస్తువుల మొత్తం విలువకు సమానమైనప్పుడు వ్యాపార సంతులనం సమతౌల్యత కలిగి ఉండవచ్చు.

24.3 వ్యాపార చెల్లింపుల శేషం (BOP)

వ్యాపార చెల్లింపుల శేషం (BOP) అనేది ఒక సంవత్సరం వ్యవధిలో అన్ని ఆర్థిక లావాదేవీల నుండి ఉత్పన్నమయ్యే ఇతర దేశాల నుండి మరియు ఇతర దేశాలకు రసీదులు మరియు చెల్లింపుల యొక్క క్రమబద్ధమైన రికార్డు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం "ఒక దేశం యొక్క వ్యాపార చెల్లింపుల శేషం అనేది ఒక దేశం మరియు ప్రపంచంలోని ఇతర దేశాల నివాసితుల మధ్య జరిగే అన్ని ఆర్థిక లావాదేవీల యొక్క క్రమబద్ధమైన పట్టిక. ఇది ఎగుమతి చేయబడిన వస్తువులు, చేయబడిన సేవలు మరియు నివాసితులు స్వీకరించిన మూలధనం మరియు దిగుమతి చేసుకున్న వస్తువులు మరియు మూలధనం నుండి పొందబడిన సేవల కారణంగా వారు చేసిన చెల్లింపుల యొక్క అన్ని రసీదుల యొక్క వర్గీకృత రికార్డును అందిస్తుంది.

వ్యాపార చెల్లింపుల శేషం అనేది కాల వ్యవధికి సంబంధించిన పట్టిక సాధారణంగా వార్షిక పట్టిక. చెల్లింపుల సంతులనంలోకి ప్రవేశించే అన్ని లావాదేవీలను మూడు విస్తృత ఖాతాల క్రింద సమూహం చేయవచ్చు. (1) కరెంట్ ఖాతా (2) మూలధన ఖాతా మరియు (3) అధికారిక రిజర్వ్ ఆస్తుల ఖాతా (4) తప్పులు మరియు మినహాయింపులు.

24.3.1 వ్యాపార చెల్లింపుల శేషం యొక్క ప్రాముఖ్యత

- కరెన్సీకి డిమాండ్ మరియు సరఫరాను సృష్టించే అన్ని లావాదేవీలను వ్యాపార చెల్లింపుల శేషంలో నమోదు చేస్తుంది.
- స్వల్ప కాలంలో దేశం యొక్క ఆర్థిక మరియు ఆర్థిక స్థితిని వ్యాపార చెల్లింపుల శేషం నిర్ణయిస్తుంది.
- ఆర్థిక వ్యవస్థ యొక్క అంతర్జాతీయ వాణిజ్యం మరియు కరెన్సీ మార్పిడి రేటులో వ్యాపార చెల్లింపుల శేషం ధోరణిని నిర్ధారించవచ్చు. వ్యాపార చెల్లింపుల శేషం ధోరణులలో మార్పు లేదా తిరోగమనాన్ని కూడా సూచిస్తుంది.
- వ్యాపార చెల్లింపుల శేషం దేశంలోని ద్రవ్య అధికారం రిజర్వు బాంక్ యొక్క విధాన మార్పును సూచిస్తుంది.

24.3.2. వ్యాపార సంతులనం మరియు వ్యాపార చెల్లింపుల శేషం మధ్య గల వ్యత్యాసం

వ్యాపార సంతులనం	వ్యాపార చెల్లింపుల శేషం
1. ఇది సంకుచిత భావన.	1. ఇది విస్తృతమైన భావన
2. దృశ్య అంశాలను మరియు మూలధన బదిలీలు మాత్రమే ఉంటాయి మాత్రమే కలిగి ఉంటుంది.	2. దృశ్య, అదృశ్య మరియు మూలధన బదిలీలు సంబంధించిన అన్ని లావాదేవీలను కలిగి ఉంటుంది.
3. ఇది అనుకూల, ప్రతికూల రూపంలో ఉండవచ్చు.	3. ఇది ఎల్లప్పుడూ తనకు తాను (స్వయంగా) సంతులనం చేసుకుంటుంది.
4. వ్యాపార సంతులనం (BOT) = ఎగుమతులపై నికర ఆదాయాలు – దిగుమతుల కోసం నికర చెల్లింపులు.	4. వ్యాపార చెల్లింపుల శేషం = వర్తమాన ఖాతా + మూలధన ఖాతా + లేదా – సమతౌల్యం చేసే అంశం – (దోషాలు మరియు తొలగింపులు)
5. వ్యాపార సంతులనాన్ని ప్రభావితం చేసే అంశాలు ఎ) ఉత్పత్తి వ్యయం బి) ముడి పదార్థాల లభ్యత సి) మారక రేటు డి) ఇంట్లో తయారు చేయబడిన వస్తువుల ధరలు	5. వ్యాపార చెల్లింపుల శేషం ని ప్రభావితం చేసే అంశాలు ఎ) విదేశీ రుణదాతల పరిస్థితులు బి) ప్రభుత్వ ఆర్థిక విధానం సి) వ్యాపార సంతులనాన్ని ప్రభావితం చేసే అన్ని కారకాలు.

24.3.3 భారతదేశం యొక్క వ్యాపార చెల్లింపుల శేషం

ఒక దేశం యొక్క చెల్లింపుల శేషం (BoP) అనేది ఒక నిర్దిష్ట వ్యవధిలో సాధారణంగా ఒక సంవత్సరంలో ప్రపంచంలోని ఇతర దేశాలతో దేశం యొక్క అన్ని ఆర్థిక లావాదేవీల యొక్క క్రమబద్ధమైన ప్రకటనగా నిర్వచించబడుతుంది. దేశం వాణిజ్యంలో మిగులు లేదా లోటు ఉందా అని ఇది సూచిస్తుంది. ఎగుమతులు దిగుమతుల కంటే ఎక్కువగా ఉన్నప్పుడు, వాణిజ్య మిగులు మరియు దిగుమతులు ఎగుమతుల కంటే ఎక్కువగా ఉన్నప్పుడు వాణిజ్య లోటు ఏర్పడుతుంది.

వ్యాపార చెల్లింపుల శేషం (Balance of Payments) యొక్క గణన యొక్క ఉద్దేశ్యాలు

- ఒక దేశం యొక్క ఆర్థిక మరియు ఆర్థిక స్థితిని వెల్లడిస్తుంది.
- దేశం యొక్క కరెన్సీ విలువ పెరుగుతోందా లేదా తగ్గుతోందా అని నిర్ణయించడానికి సూచికగా ఉపయోగించవచ్చు.
- కోశ మరియు వాణిజ్య విధానాలపై నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి సహాయం చేస్తుంది.
- ఇతర దేశాలతో దేశం యొక్క ఆర్థిక వ్యవహారాలను విశ్లేషించడానికి మరియు అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన సమాచారాన్ని వ్యాపార చెల్లింపుల శేషం అందిస్తుంది.

వ్యాపార చెల్లింపుల శేషం యొక్క భాగాలు

వ్యాపార చెల్లింపుల శేషం (BoP) ఖాతాలను సిద్ధం చేయడం కోసం, ఒక దేశం మరియు ప్రపంచంలోని ఇతర దేశాల మధ్య ఆర్థిక లావాదేవీలు ఈవిధంగా వర్గీకరించబడతాయి (1) కరెంట్ ఖాతా (2) మూలధన ఖాతా మరియు (3) అధికారిక రిజర్వ్ ఆస్తుల ఖాతా (4) తప్పులు మరియు మినహాయింపులు. ఇది విదేశీ మారక నిల్వలలో మార్పులను కూడా చూపుతుంది.

- **కరెంట్ ఖాతా:** ఈ ఖాతాలో దృశ్యంశాలు (వస్తువులు లేదా వస్తువులు) మరియు అదృశ్యంశాలు (వాణిజ్యం కానివి) నికర సేవల ఎగుమతి మరియు దిగుమతులను చూపుతుంది. అదృశ్యమైన వాటిలో సేవలు, బదిలీలు మరియు ఆదాయం ఉంటాయి.
- **మూలధన ఖాతా:** ఇది ఒక దేశానికి మూలధన వ్యయం మరియు ఆదాయాన్ని చూపుతుంది. ఇది ఆర్థిక వ్యవస్థలోకి ప్రైవేట్ మరియు ప్రభుత్వ పెట్టుబడి యొక్క నికర ప్రవాహం యొక్క సారాంశాన్ని అందిస్తుంది.

బాహ్య వాణిజ్య రుణాలు (ECB), ఎఫ్‌డిఐ, ఎఫ్‌పిఐ మొదలైనవి మూలధన ఖాతాలో భాగం.

24.4 అంతర్జాతీయ వాణిజ్యం

అంతర్జాతీయ వాణిజ్యాన్ని వివిధ దేశాల మధ్య వస్తువులు మరియు సేవల మార్పిడి లేదా వాణిజ్యం అంటారు.

ఆర్థికాభివృద్ధిలో అంతర్జాతీయ వ్యాపారం పాత్ర

అంతర్జాతీయ వ్యాపారం ప్రాంతీయ ప్రత్యేకత, అధిక స్థాయి ఉత్పత్తి, మెరుగైన జీవన ప్రమాణం, ప్రపంచవ్యాప్తంగా వస్తువులు మరియు సేవల లభ్యత, ధరలు మరియు వేతనాల సమానత్వం మరియు జ్ఞానం మరియు సంస్కృతి యొక్క వ్యాప్తికి దారితీస్తే దేశాలకు పరస్పరం ప్రయోజనకరంగా ఉంటుంది.

1. **శ్రమ విభజన మరియు ప్రత్యేకీకరణ:** అంతర్జాతీయ వ్యాపార ప్రపంచ స్థాయిలో శ్రమ విభజన మరియు ప్రత్యేకీకరణకు దారితీస్తుంది. కొన్ని దేశాలు పుష్కలంగా సహజ సంపదను కలిగి ఉన్నాయి. ఆ దేశాలు ముడి పదార్థాలను పంపిణీ చేసి మరియు నైపుణ్యం కలిగిన మానవశక్తిలో ప్రగతిశీలమైన రిపబ్లిక్‌ల నుండి పూర్తయిన వస్తువులను దిగుమతి చేసుకోవాలి. ఇది అన్ని రాష్ట్రాలకు లాభాలను ఇస్తుంది మరియు తద్వారా శ్రమ విభజన మరియు ప్రత్యేకీకరణకు దారితీస్తుంది.

2. **సహజవనరుల అభిలషణీయ ఉపయోగిత:** సహజ వనరుల ప్రత్యేకత కారణంగా, సృజనాత్మకత లేని వనరుల తీసివేయబడతాయి మరియు వనరుల వ్యర్థం పక్కదారి పట్టవచ్చు. సహజ వనరుల లభ్యత ప్రపంచ దేశాలన్నింటిలో సమానంగా విస్తరించి ఉండదు. అందువల్ల కొన్ని దేశాలు కొన్ని రకాల వస్తువులను తక్కువ వ్యయంతో ఉత్పత్తి చేసే ప్రత్యేకతను కలిగి ఉంటాయి. అంతర్జాతీయ వ్యాపారం సహజ వనరుల అభిలషణీయ ఉపయోగితకు దోహదపడుతుంది. విదేశీ వాణిజ్యం కారణంగా అంతర్జాతీయ స్థాయిలో వనరుల సమతుల్య పంపిణీ మరియు వినియోగం అవసరం ఎంతైనా ఉంది.

3. **ధరల సమానత్వం:** అంతర్జాతీయ వ్యాపారం ద్వారా ధరలను స్థిరీకరించవచ్చు. ఇది అభ్యర్థన మరియు సరఫరా స్థానాన్ని స్థిరంగా ఉంచడానికి మద్దతు ఇస్తుంది, ఇది ధరలను స్థిరీకరిస్తుంది, రవాణా మరియు ఇతర మార్కెటింగ్ ఖర్చులకు చెల్లింపులు చేస్తుంది.

4. **బహుళ ఎంపికల లభ్యత:** వినియోగదారులకు మెరుగైన ఎంపికను అందించడంలో అంతర్జాతీయ వ్యాపారం ప్రయోజనకారిగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు పొందగలిగే కొత్త మార్పులను చేయడంలో ఇది మద్దతు ఇస్తుంది.

5. **నాణ్యత మరియు ప్రామాణిక వస్తువులను నిర్ధారిస్తుంది:** అంతర్జాతీయ వ్యాపారం అత్యంత నిరాడంబరంగా ఉంటుంది. వస్తువుల కోసం అభ్యర్థనను సంరక్షించడానికి మరియు పెంచడానికి, ఎగుమతి చేసే దేశాలు వస్తువుల నాణ్యత తగ్గకుండా ఎగుమతులు చేస్తే అప్పుడు, నాణ్యత మరియు ప్రామాణిక వస్తువులు ఉత్పత్తి చేయబడతాయి.

6. **ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతుంది:** దిగుమతులు ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచుటకు దోహదపడతాయి. దిగుమతులు కారణంగా అనేక రకాల వస్తు సేవలు సరసమైన ధరలకు వినియోగదారులకు అందుబాటులో ఉండి వారికి వస్తు ఎంపికలో అనేక ప్రత్యామ్నాయాలు అందుబాటులోకి వస్తాయి. ఈ కారణంగా వారి జీవన ప్రమాణ స్థాయి పెరిగే అవకాశముంటుంది.

7. **ఉద్యోగావకాశాల కల్పన:** ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో అంతర్జాతీయ వ్యాపారం ఉపకరిస్తుంది. కార్మిక మరియు వనరుల చైతన్యాన్ని పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించడంలో విదేశీ వాణిజ్యం మద్దతు ఇస్తుంది. ఇది దిగుమతి రంగంలో ప్రత్యక్ష సేవలను మరియు ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలలో పరోక్ష ఉపాధిని కల్పిస్తుంది. పరిశ్రమ, సేవా రంగం (బీమా, బ్యాంకింగ్, రవాణా, కమ్యూనికేషన్) మొదలైనవి.

8. **ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం:** దిగుమతులు దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయి. ఎందుకంటే, మూలధన వస్తువులు మరియు విజ్ఞానం దిగుమతితో, ఒక దేశం ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలో, అంటే వ్యవసాయం, పరిశ్రమ మరియు సేవా రంగాలలో గణనీయమైన వృద్ధిని సాధించగలదు.

9. **ప్రకృతి వైపరీత్యాల నివారణకు సహాయం:** ఉదాహరణకు భూకంపాలు, వరదలు, కరువులు మొదలైన ప్రకృతి వైపరీత్యాల సమయంలో, వీటి బారిన పడిన దేశాలు నిత్యావసర వస్తువుల కొరత సమస్యను ఎదుర్కొంటాయి. ఇలాంటి స్థితిలో అంతర్జాతీయ వ్యాపారం ఒక దేశం బాధిత ప్రజలను ఆదుకోవడానికి ఇతర దేశాల నుండి ఆహార ధాన్యాలు మరియు మందులను దిగుమతి చేసుకోవడానికి అనుమతిస్తుంది.

10. **వ్యాపార చెల్లింపుల శేషం నిర్వహణ:** ప్రతి దేశం తన విదేశ వ్యాపార చెల్లింపుల శేషం అనుకూలంగా కొనసాగించాలి. అంతర్జాతీయ వ్యాపారం వల్ల విదేశీ మారకం చేకూరుతుంది. ఒక దేశం వస్తు సేవలను ఎగుమతి చేసినప్పుడే ఇది సాధ్యపడుతుంది. ప్రతి దేశం నుండి దిగుమతి చేసుకోవాలి, ఇది విదేశీ మారకద్రవ్యం విడుదలలో గుర్తుగా ఉంటుంది, ఇది విదేశీ మారకద్రవ్యం యొక్క ప్రవాహం కోసం వాణిజ్యంలో కూడా వ్యవహరిస్తుంది. విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం లో అసమతౌల్యాన్ని నివారించుకోవాలి.

11. **అంతర్జాతీయ వ్యాపారం కీర్తిని తెస్తుంది మరియు సద్భావనను సంపాదించడంలో సహాయపడుతుంది:** ప్రపంచ మార్కెట్‌లో వ్యాపించడంలో సంక్లిష్టంగా ఉన్న దేశం దయను సంపాదిస్తుంది. ఉదాహరణ: ప్రదాన ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతుల కారణంగా జపాన్ ప్రపంచ మార్కెట్‌లో చాలా మంచి పేరు పొందింది.

12. **ప్రపంచ శాంతిని ప్రోత్సహిస్తుంది:** అంతర్జాతీయ వ్యాపారం దేశాలను దగ్గరకు తీసుకువెళుతుందని మీరు అర్థం చేసుకోవాలి. అంతర్జాతీయ వ్యాపారం వల్ల అభివృద్ధి చెందిన దేశాల నుండి అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతికతను మరియు ఇతర సహాయాన్ని అందజేస్తుంది. వాణిజ్య ఒప్పందాల వల్ల ఉత్పన్నమయ్యే ఆర్థిక సంబంధాల కారణంగా ఇది వివిధ దేశాల మధ్య సంబంధాలు మెరుగవుతాయి. అందువలన, విదేశీ వాణిజ్యం యుద్ధాలు మరియు సంఘర్షణలను నివారించి స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టిస్తుంది. అటువంటి దేశాలు తమ మధ్య స్నేహపూర్వక సంబంధాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నందున ఇది ప్రపంచ శాంతిని ఆమోదిస్తుంది.

24.5 విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (FDI)

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అనేది మరొక దేశంలో ఉన్న కంపెనీ ద్వారా ఒక దేశంలో ఉత్పత్తిలో నేరుగా పెట్టుబడి పెట్టడం, లక్ష్యం దేశంలోని కంపెనీని కొనుగోలు చేయడం ద్వారా లేదా ఆ దేశంలో ఇప్పటికే ఉన్న వ్యాపారం యొక్క కార్యకలాపాలను విస్తరించడం ద్వారా. దేశంలో చౌకైన వేతనాల ప్రయోజనాన్ని పొందడం, దేశం లేదా ప్రాంతం యొక్క మార్కెట్‌లకు సుంకం రహిత ప్రాప్యతను పొందేందుకు ప్రోత్సాహకంగా దేశం అందించే పన్ను మినహాయింపులు వంటి ప్రత్యేక పెట్టుబడి హక్కులు వంటి అనేక కారణాల వల్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి జరుగుతుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అనేది పోర్ట్‌ఫోలియో పెట్టుబడికి భిన్నంగా ఉంటుంది, ఇది స్టాక్‌లు మరియు బాండ్‌ల వంటి మరొక దేశం యొక్క సెక్యూరిటీలలో నిష్క్రియ పెట్టుబడి.

24.5.1 విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రయోజనాలు

1. **దేశంలో పోటీ వాతావరణం:** విదేశీ సంస్థల ప్రవేశం సాధారణంగా పోటీని ప్రోత్సహిస్తుంది మరియు ఆతిథ్య దేశంలో పోటీ వాతావరణాన్ని సృష్టిస్తుంది. దేశీయ సంస్థలు దేశీయ మార్కెట్‌లో తెరుచుకునే విదేశీ సంస్థలతో పోటీ పడవలసి వస్తుంది. దేశీయ సంస్థలు సేవలందించాలంటే సమర్థంగా ఉండాలి. (ఉదా: ఆటోమొబైల్స్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రారంభించిన తర్వాత భారతదేశంలో ఆటోమొబైల్స్ పరిశ్రమ అతివేగంగా అభివృద్ధి చెందింది)

2. **ఉత్పత్తిలో పెరుగుదల:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి భారీ మూలధనాన్ని అందిస్తుంది. ఈ పెరిగిన మూలధనం ఉత్పత్తిని పెంపొందించడానికి శ్రమ మరియు ఇతర వనరులను ఉపయోగించుకోవడానికి ఉపయోగించవచ్చు.

3. **ఆర్థిక వృద్ధి మరియు అభివృద్ధి:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఉత్పత్తిని పెంచడానికి దోహదపడుతుంది కాబట్టి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి కి అవసరమైన మూలధనం, సాంకేతికత, నైపుణ్యాలు మొదలైనవాటిని అందించడం ద్వారా ఆర్థిక వృద్ధి మరియు ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయవచ్చు.

4. **ఉపాధి:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అనేది ఫ్యాక్టరీలు, భవనాల ప్లాంట్లు మొదలైన వాస్తవ ఆస్తులలో పెట్టుబడిని కలిగి ఉంటుంది కాబట్టి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రత్యక్ష ఉపాధిని సృష్టిస్తుంది. ఒక నిర్దిష్ట రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఉంటే, అది పెట్టుబడి రంగానికి అనుసంధానించబడిన రంగాలలో దేశీయ పెట్టుబడులను పెంచుతుంది.

5. **విదేశీ సంబంధాలలో మెరుగుదల:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అనేది వ్యక్తులతో ప్రజల సంబంధాలను కలిగి ఉంటుంది మరియు సాధారణంగా ద్వైపాక్షిక మరియు అంతర్జాతీయ సంబంధాలనూ ప్రోత్సహిస్తుంది. విదేశీ పెట్టుబడికి ఎక్కువ బహిరంగత అంతర్జాతీయ పెట్టుబడిదారులపై అధికంగా ఆధారపడటానికి దారితీస్తుంది. దేశాల మధ్య ఆధారపడటం ఎల్లప్పుడూ స్నేహం మరియు సద్భావనను సృష్టిస్తుంది.

6. **దేశీయ గుత్తాధిపత్యాన్ని తగ్గించడం:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి దేశీయ మార్కెట్‌లో పోటీని పెంచుతుంది మరియు దేశీయ గుత్తాధిపత్యాన్ని బలహీనపరుస్తుంది.

7. **జీవన ప్రమాణాల పెరుగుదల:** దేశీయ మార్కెట్‌లో అంతర్జాతీయ ప్రమాణాల వస్తువుల లభ్యతకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి దారి తీస్తుంది, వీటిని ఆతిథ్య దేశంలో తయారు చేస్తారు. ఇది వినియోగదారులకు మరింత ఎంపిక మరియు దేశ ప్రజలకు ఉన్నత జీవన ప్రమాణాలకు దారి తీస్తుంది.

8. **వ్యాపార చెల్లింపుల శేషం:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విదేశీ మారకపు ప్రవాహానికి దారి తీస్తుంది కాబట్టి, ఇది ఆతిథ్య దేశం యొక్క చెల్లింపు శేషం పై అనుకూలమైన ప్రభావాన్ని చూపుతుంది. బాహ్య రుణాల కంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ద్వారా వచ్చే పెట్టుబడుల ప్రవాహం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

24.5.2 విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సమస్యలు

1. **మూలధన సాంద్రిత పరిశ్రమలపై మరింత దృష్టి:** సాపేక్షంగా తక్కువ సంఖ్యలో కార్మికుల ఉపాధికి దారితీసే మూలధన సాంద్రిత పరిశ్రమలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. పేదరికం మరియు నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి కీలకమైన ఉద్యోగాల కల్పనకు మద్దతు ఇవ్వనందున ఇటువంటి సాంకేతికత కార్మికులు సమృద్ధిగా ఉన్న దేశానికి సరిపోదు.

2. **ప్రాంతీయ అసమానత:** సహజ వనరులు మరియు అవస్థాపన లభ్యత పరంగా మరియు ప్రాంతీయ అసమానతను పెంచే అవకాశం ఉన్న ప్రాంతాలు లేదా రాష్ట్రాల వైపు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రవహించే అవకాశం ఉంది.

3. **విదేశీ మారకపు ప్రవాహం:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి మరింత విదేశీ మారక ద్రవ్యాన్ని తెస్తుంది, ప్రారంభ దశలో చెల్లింపుల శేషంను మెరుగుపరుస్తుంది. అయితే పెట్టుబడి పెట్టిన తర్వాత, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో తీసుకువచ్చిన సాంకేతికతకు దిగుమతి చేసుకున్న ముడిసరుకు అవసరం కూడా వడ్డీ మరియు డివిడెండ్ చెల్లింపుల ఖాతాలో విదేశీ మారకంలో చాలా డబ్బు చెల్లించాలి. విదేశీ మారకద్రవ్యం యొక్క అటువంటి ప్రవాహాలు చెల్లింపుల శేషంపై ఒత్తిడిని కలిగిస్తాయి.

4. **దేశీయ ఉత్పత్తిదారులను తగ్గించడం:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి సంస్థలు భారీ డబ్బు శక్తిని కలిగి ఉంటాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిదారులు దేశీయ సరఫరాదారులను తుడిచిపెట్టడానికి పోటీ–వ్యతిరేక పద్ధతులను అవలంబిస్తారు. కొన్ని రంగాలలో దేశీయ ఉత్పత్తిదారులు విదేశీ ఉత్పత్తిదారులతో పోటీ పడలేరు.

5. **సహజ వనరుల దోపిడీ:** సహజ వనరులపై క్రూరమైన దోపిడీకి మరియు సాధ్యమయ్యే పర్యావరణ నష్టానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి చాలా బాధ్యత వహిస్తుంది.

6. **ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి కొన్ని ఇష్టమైన రంగాలను కలిగి ఉంది. కొన్ని రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో అభివృద్ధి చెందిన విదేశీ రంగం మరియు అభివృద్ధి చెందని దేశీయ రంగంతో ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ ఆవిర్భవించే బలమైన అవకాశం ఉంది.

7. **పర్యావరణ ప్రమాణాల క్షీణత:** ఆతిథ్య దేశాలలో తక్కువ కార్మిక లేదా పర్యావరణ ప్రమాణాల కొనసాగింపు లాభదాయకమైన విదేశీ సంస్థలచే ప్రశంసించబడింది. ఇది చాలా ఆందోళన కలిగిస్తుంది ఎందుకంటే అటువంటి ప్రమాణాలను పరిరక్షించే ప్రయత్నాలు తరచుగా ఆసక్తి గల పార్టీల నుండి మద్దతు పొందడంలో విఫలమవుతాయి.

24.6 సుంకం మరియు వర్తకంపై సాధారణ ఒప్పందం (GATT)

సుంకం మరియు వర్తకంపై సాధారణ ఒప్పందం (GATT) అనేది రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ఏర్పడిన ఒప్పందం. సుంకం మరియు వర్తకంపై సాధారణ ఒప్పందం (GATT) యుద్ధం తరువాత ఆర్థిక పునరుద్ధరణలో సహాయపడటానికి ప్రపంచ వర్తకాన్ని నియంత్రించడానికి అమలు చేయబడింది. GATT యొక్క ముఖ్య ఉద్దేశ్యం సుంకాలు, కోటాలు మరియు సబ్సిడీల తగ్గింపుపై ప్రపంచ వాణిజ్యం యొక్క అడ్డంకులను తగ్గించడం.

GATT యొక్క లక్ష్యాలు

సుంకాలు దిగ్బంధనాలను తగ్గించడం ద్వారా మరియు ప్రపంచ వాణిజ్యంలో వివక్షను తొలగించడం ద్వారా, GATT లక్ష్యాలు:

1. అంతర్జాతీయ వాణిజ్యం విస్తరించడం
2. సహకారం అందించే దేశాలలో పూర్తి ఉపాధిని ధృవీకరించడం ద్వారా ప్రపంచ ఉత్పత్తిని తీవ్రతరం చేయడం
3. ప్రపంచ వనరుల అభివృద్ధి మరియు పూర్తి దోపిడీ మరియు
4. ప్రపంచం మొత్తం మీద సాధారణ జీవనం పెరుగుతోంది. మరో వైపు, GATT యొక్క కథనాలు ఈ ప్రయోజనాలను సాధించడానికి దిశలను అందించవు. ఉచిత (అంతరాయం లేని) మరియు బహుమితీయ ప్రపంచ వాణిజ్యం యొక్క పురోగతి ద్వారా వీటిని GATT పరోక్షంగా గ్రహించాలి.

అలాగే, GATT ఆమోదించిన నియమాలు తదుపరి ప్రాథమిక సూత్రాలపై సృష్టించబడ్డాయి:

1. వాణిజ్యం వివక్షత లేని విధంగా నిర్దేశించబడాలి
2. పరిమాణాత్మక పరిమితుల ఉపయోగం ముందుగా నిర్ణయించబడాలి
3. భిన్నాభిప్రాయాలను చర్చల ద్వారా నిర్ణయించుకోవాలి

సంక్షిప్తంగా, GATT సభ్యులు వాణిజ్య సంస్థలను తగ్గించడానికి మరియు నియమాలకు ప్రపంచ వాణిజ్యంలో వివక్షను నిర్మూలించడానికి అంగీకరిస్తారని గమనించడం ముఖ్యం, తద్వారా బహుమితీయ మరియు స్వేచ్ఛా వాణిజ్యం ప్రోత్సహించబడవచ్చు, ఇది ప్రపంచ వాణిజ్యం మరియు శ్రేయస్సు యొక్క విస్తృత విస్తరణలకు దారి తీసింది.

24.7 ప్రపంచ వర్తక సంస్థ (WTO)

ప్రపంచ వర్తక సంస్థ 1 జనవరి 1995 నుండి పనిచేయడం ప్రారంభించింది, అయితే దాని వ్యాపార వ్యవస్థ అర్ధ శతాబ్దం పాతది. 1948 నుండి, సుంకం మరియు వర్తకంపై సాధారణ ఒప్పందం (GATT) వ్యవస్థకు సంబంధించిన నియమాలను అందించింది. మే 1998లో జెనీవాలో జరిగిన రెండవ ప్రపంచ వర్తక సంస్థ మంత్రివర్గ సమావేశం వ్యవస్థ యొక్క 50వ వార్షికోత్సవ వేడుకను కలిగి ఉంది. దీనిని ఉరుగ్వే రౌండ్ అని

పిలుస్తారు మరియు ఇది ప్రపంచ వర్తక సంస్థ (WTO) స్థాపనకు దారితీసింది. GATT ఎక్కువగా వస్తువుల వ్యాపారంతో వ్యవహరించింది, WTO మరియు దాని ఒప్పందాలు వస్తువులను మాత్రమే కాకుండా సేవలు మరియు ఇతర మేధో సంపత్తిలో కూడా వర్తకం చేయగలిగింది. వాణిజ్య సృష్టిలు, డిజైన్‌లు మరియు ఆవిష్కరణలు వంటివి.

ప్రపంచ వర్తక సంస్థలో 164 మంది సభ్యులు మరియు 23 పరిశీలకుల ప్రభుత్వాలు ఉన్నాయి. జూలై 2016లో ఆఫ్ఘనిస్తాన్ 164వ సభ్యదేశంగా మారింది. దేశాలతో పాటు, యూరోపియన్ యూనియన్ మరియు ప్రతి యూరోపియన్ యూనియన్ దేశం దాని స్వంత హక్కుగా సభ్యదేశంగా ఉన్నాయి.

ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది దేశాల మధ్య వాణిజ్య నిబంధనలతో వ్యవహరించే ఏకైక అంతర్జాతీయ అంతర్జాతీయ సంస్థ. ప్రపంచ వాణిజ్య సంస్థలో (WTO) ఒప్పందాలు ఉన్నాయి, ప్రపంచంలోని అత్యధిక వాణిజ్య దేశాలచే చర్చలు మరియు సంతకాలు చేయబడ్డాయి మరియు వారి పార్లమెంటులలో ఆమోదించబడ్డాయి. వాణిజ్యం సాధ్యమైనంత సజావుగా, ఊహాజనితంగా మరియు స్వేచ్ఛగా సాగేలా చూడడమే ప్రపంచ వాణిజ్య సంస్థ లక్ష్యం. WTO ప్రపంచ వాణిజ్య నియమాల వ్యవస్థను నిర్వహిస్తుంది, ఇది వాణిజ్య ఒప్పందాల చర్చలకు వేదికగా పనిచేస్తుంది, దాని సభ్యుల మధ్య వాణిజ్య వివాదాలను పరిష్కరిస్తుంది మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలకు మద్దతు ఇస్తుంది.

అన్ని ప్రధాన నిర్ణయాలు WTO సభ్య ప్రభుత్వాలచే తీసుకోబడతాయి: మంత్రులు (సాధారణంగా కనీసం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి సమావేశాలు ఉంటాయి) లేదా వారి రాయబారులు లేదా ప్రతినిధులు (జెనీవాలో క్రమం తప్పకుండా సమావేశాలలో చర్చలు) ద్వారా. అనేక సాధారణ, ప్రాథమిక సూత్రాలు బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థకు పునాదిగా ఉన్నాయి. WTO యొక్క ప్రాథమిక ఉద్దేశ్యం అందరి ప్రయోజనాల కోసం వాణిజ్యాన్ని తెరవడం. WTO యొక్క అత్యున్నత నిర్ణయాధికార సంస్థ మంత్రుల సమావేశం. దీని క్రింద జనరల్ కౌన్సిల్ మరియు అనేక ఇతర కౌన్సిల్‌లు మరియు కమిటీలు ఉన్నాయి.

- మంత్రివర్గ సమావేశాలు సాధారణంగా రెండేళ్లకోసారి జరుగుతాయి.
- జనరల్ కౌన్సిల్ అనేది రోజువారీ నిర్ణయాధికార సంస్థ. ఇది జెనీవాలో సంవత్సరానికి అనేక సార్లు కలుస్తుంది.
- WTOలో చేరడానికి, ప్రభుత్వం తన ఆర్థిక మరియు వాణిజ్య విధానాలను WTO నిబంధనలకు అనుగుణంగా తీసుకురావాలి మరియు WTO సభ్యత్వంతో దాని ప్రవేశ నిబంధనలను చర్చించాలి.
- WTO తన వార్షిక బడ్జెట్‌కు ఎక్కువ ఆదాయాన్ని దాని సభ్యుల సహకారం నుండి పొందుతుంది. ఈ సహకారాలు అంతర్జాతీయ వర్తకంలో ప్రతి సభ్యుని వాటాను పరిగణనలోకి తీసుకునే ఫార్ములాపై ఆధారపడి ఉంటాయి.
- Ngozi Okonjo-Iweala WTO యొక్క ఏడవ డైరెక్టర్ జనరల్. ఆమె 1 మార్చి 2021న పదవీ బాధ్యతలు స్వీకరించారు, డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన మొదటి మహిళ మరియు మొదటి ఆఫ్రికన్. ఆమె పదవీ కాలం 31 ఆగస్టు 2025తో ముగుస్తుంది.

ప్రపంచ వర్తక సంస్థ (WTO) లక్ష్యాలు

- ఒప్పందంలో దృశ్యమానం చేయబడిన కొత్త ప్రపంచ వాణిజ్య వ్యవస్థను అమలు చేయడం.
- ప్రతి దేశానికి ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రపంచ వాణిజ్యాన్ని ప్రోత్సహించడం.
- అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ వాణిజ్య విస్తరణ ఫలితంగా ప్రయోజనాలను పంచుకోవడంలో మెరుగైన సమతుల్యతను పొందేలా చూసుకోవడం.
- ప్రపంచ వాణిజ్యం ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి ప్రభావవంతమైన సాధనం కాబట్టి బహిరంగ ప్రపంచ వాణిజ్య వ్యవస్థకు అన్ని అడ్డంకులను పడగొట్టడం మరియు అంతర్జాతీయ ఆర్థిక పునరుజ్జీవనానికి నాంది పలకడం.
- వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు మరియు ప్రపంచ ఏకీకరణలో సహాయపడేందుకు అన్ని వ్యాపార భాగస్వాముల మధ్య పోటీతత్వాన్ని పెంపొందించడం.
- ప్రపంచంలో ఉపాధి స్థాయిని నిర్ధారించే ఉద్దేశ్యంతో ఉత్పత్తి మరియు ఉత్పాదకత స్థాయిని పెంచడం.
- ప్రపంచ వనరులను ఉత్తమంగా విస్తరించడం మరియు ఉపయోగించడం.
- ప్రపంచ జనాభా కోసం జీవన స్థాయిని మెరుగుపరచడం మరియు సభ్య దేశాల ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడం.

WTO యొక్క విధులు

1. **ఒప్పందం యొక్క నిర్వహణ:** ఇది ఉరుగ్వే రౌండ్ తర్వాత కుదుర్చుకున్న 29 ఒప్పందాల (1994లో ఉరుగ్వే రౌండ్ ముగింపులో సంతకం చేయబడింది), ఇంకా అనేక ఇతర ఒప్పందాల నిర్వహణను చూసుకుంటుంది.

   ఉరుగ్వే రౌండ్‌లో చర్చించి ఆమోదించిన ఒప్పందాలు మరియు బహుళ పక్ష వ్యాపార ఒప్పందాలను అమలు చేయుట,తదనుగుణంగా పాలన నిర్వహించటం.
2. **వాణిజ్య అడ్డంకుల తగ్గింపు అమలు:** ఇది ఉరుగ్వే రౌండ్ ముగింపులో సభ్య దేశాలు అంగీకరించిన సుంకాలు కోతలు మరియు సుంకేతర సుంకాలు చర్యల తగ్గింపు అమలును తనిఖీ చేస్తుంది.
3. **సభ్యదేశాల వాణిజ్య విధానాల పరిశీలన:** ఇది సభ్య దేశాల విదేశీ వాణిజ్య విధానాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తుంది, అటువంటి విధానాలు WTO మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో చూస్తుంది.
4. **విదేశీ వాణిజ్య సమాచార సేకరణ:** ప్రపంచ వర్తక సంస్థ ఎగుమతి-దిగుమతి వాణిజ్యం, వివిధ వాణిజ్య చర్యలు మరియు సభ్య దేశాల ఇతర వాణిజ్య గణాంకాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తుంది.
5. **వివాదాల పరిష్కారం:** ప్రపంచ వర్తక సంస్థ సభ్య దేశాల మధ్య వాణిజ్య వైరుధ్యాలకు సామరస్యపూర్వక పరిష్కారం కోసం రాజీ యంత్రాంగాన్ని అందిస్తుంది. సభ్య దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించలేని వాణిజ్య వివాదాలను WTO వివాద పరిష్కార సంస్థ నిర్ణయిస్తుంది.

6. **కన్సల్టెన్సీ సేవలు:** ప్రపంచ వర్తక సంస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధిపై నిఘా ఉంచుతుంది మరియు దాని సభ్య దేశాలకు కన్సల్టెన్సీ సేవలను అందిస్తుంది.

7. **చర్చల వేదిక:** ప్రపంచ వర్తక సంస్థ సభ్య దేశాలు వాణిజ్య రాయితీల మార్పిడిపై నిరంతరం చర్చలు జరిపే వేదిక. సభ్య దేశాలు వస్తువులు, సేవలు, మేధోసంపత్తి మొదలైన రంగాలలో వాణిజ్య పరిమితులను కూడా చర్చిస్తాయి.

8. **IMF మరియు IBRD సహాయం:** ప్రపంచ వర్తక సంస్థ సార్వత్రిక ఆర్థిక విధాన పరిపాలనలో పొందికను నెలకొల్పడానికి IMF మరియు IBRDలకు సహాయం చేస్తుంది.

భారతదేశం మరియు ప్రపంచ వర్తక సంస్థ

భారతదేశం జనవరి 1995 నుండి WTOలో సభ్యదేశంగా ఉంది. జూలై 1948 నుండి WTO సుంకం మరియు వర్తకంపై సాధారణ ఒప్పందం (GATT)లో కూడా సభ్యదేశంగా ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశంగా, భారతదేశం యొక్క కార్యకలాపాలలో ప్రపంచ వర్తక సంస్థ గణనీయమైన పాత్ర పోషించింది. ప్రత్యేకించి అంతర్జాతీయ వర్తకంలో మొత్తం అభివృద్ధి చెందుతున్న ప్రపంచాన్ని కూడా వినిపించడంలో భారతదేశం నిలిచింది.

2001లో జరిగిన దోహా WTO సదస్సులో, అభివృద్ధి చెందుతున్న కూటమికి వాదించేవారిలో భారతదేశం అత్యంత బహిరంగంగా నిలిచింది. పర్యావరణం, పోటీ మరియు పెట్టుబడి వంటి అంశాలతో సహా కొత్త రౌండ్ వాణిజ్య చర్చలకు 142 దేశాల ప్రతినిధులు అంగీకరించినందున సమావేశం విజయవంతమైంది.

ప్రపంచ వర్తకసంస్థతో భాగంగా కుదుర్చుకున్న అనేక ఒప్పందాల ఫలితంగా భారత ఆర్థిక వ్యవస్థకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

హానికరమైన ఫిషరీస్ సబ్సిడీల కోసం వివాద పరిష్కారం

హానికరమైన మత్స్య రాయితీలను నిలిపివేయడానికి ప్రపంచ ఒప్పందంలో స్పష్టమైన వివాద పరిష్కార యంత్రాంగాన్ని భారతదేశం కోరింది.

WTO సభ్యులు చట్టవిరుద్ధమైన, నివేదించబడని మరియు నియంత్రణ లేని (IUU) ఫిషింగ్ కోసం సబ్సిడీలను తొలగించడానికి మరియు అధిక సామర్థ్యం మరియు అధిక చేపలు పట్టడానికి దోహదపడే కొన్ని రకాల మత్స్య రాయితీలను నిషేధించడానికి విభాగాలను ఖరారు చేయడానికి చర్చలు జరుపుతున్నారు.

భారత్ అనవసరమైన తొందరపాటు మానుకోవాలని మరియు జూన్ 2021లో జరిగే తదుపరి మంత్రివర్గ సమావేశం నాటికి చర్చలను ముగించాలని కోరుకుంటోంది.

GATT మరియు WTO మధ్య వ్యత్యాసం

క్ర.సం.	సుంకం మరియు వర్తకంపై సాధారణ ఒప్పందం (GATT)	ప్రపంచ వర్తక సంస్థ (WTO)
1	GATT తాత్కాలిక, ప్రాతిపదికమైనది.	ప్రపంచ వర్తక సంస్థ (WTO) మరియు దాని ఒప్పందాలు శాశ్వతమైనవి.
2	GATT ఒప్పంద సభ్యదేశాలను కలిగి ఉంది.	WTO సభ్య దేశాలు శాశ్వత ఒప్పంద నియమ నిబంధనలు కలిగి ఉంది.
3	GATT ఇప్పటికే ఉన్న దేశీయ చట్టాన్ని కొనసాగించడానికి అనుమతించింది. GATT ఒప్పందాన్ని ఉల్లంఘించింది	WTO సభ్య దేశాలు ఒప్పంద నియమ నిబంధనలు తప్పకుండా ఆచరించాలి.
4	GATT తక్కువ శక్తివంతమైనది, వివాద పరిష్కార వ్యవస్థ నెమ్మదిగా మరియు తక్కువ సామర్థ్యంతో ఉంది, దాని తీర్పును సులభంగా నిరోధించవచ్చు.	WTO, GATT కంటే శక్తివంతమైనది, వివాద పరిష్కార విధానం వేగవంతమైనది మరియు సమర్ధవంతమైనది, తీర్పును నిరోధించడం చాలా కష్టం.

24.8 సారాంశం

విదేశీ రంగం అనేది విదేశీ దేశాలతో లావాదేవీలకు సంబంధించిన ఆర్థిక వ్యవస్థలో భాగం. విదేశీ రంగం వస్తువులు మరియు సేవల దిగుమతులు మరియు ఎగుమతులు అలాగే పెట్టుబడి మరియు బ్యాంకింగ్ లావాదేవీలకు సంబంధించి మూలధన కదలికలను కలిగి ఉంటుంది మరియు దేశీయ ఆర్థిక కార్యకలాపాల స్థాయి మరియు కూర్పును ప్రభావితం చేస్తుంది మరియు దేశం యొక్క వాణిజ్య బ్యాలెన్స్ మరియు చెల్లింపుల బ్యాలెన్స్ యొక్క స్థితి. బ్యాలెన్స్ ఆఫ్ ట్రేడ్ (BOT) అనేది ఒక దేశం యొక్క వస్తువుల ఎగుమతుల మొత్తం విలువ మరియు దాని దిగుమతుల మొత్తం విలువను సూచిస్తుంది. బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ (BOP) అనేది ఒక సంవత్సరం వ్యవధిలో అన్ని ఆర్థిక లావాదేవీల నుండి ఉత్పన్నమయ్యే ఇతర దేశాల నుండి మరియు ఇతర దేశాలకు రసీదులు మరియు చెల్లింపుల యొక్క క్రమబద్ధమైన రికార్డు. అంతర్జాతీయ వాణిజ్యం ప్రాంతీయ ప్రత్యేకత, అధిక స్థాయి ఉత్పత్తి, మెరుగైన జీవన ప్రమాణం, ప్రపంచవ్యాప్తంగా వస్తువులు మరియు సేవల లభ్యత, ధరలు మరియు వేతనాల సమానత్వం మరియు జ్ఞానం మరియు సంస్కృతి యొక్క వ్యాప్తికి దారితీస్తే దేశాలకు పరస్పరం ప్రయోజనకరంగా ఉంటుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అనేది ఒక దేశంలో ఉత్పత్తిలో మరొక దేశంలో ఉన్న కంపెనీ ద్వారా ప్రత్యక్ష పెట్టుబడి, లక్ష్య దేశంలో కంపెనీని కొనుగోలు చేయడం ద్వారా

లేదా ఆ దేశంలో ఇప్పటికే ఉన్న వ్యాపారం యొక్క కార్యకలాపాలను విస్తరించడం ద్వారా. ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది దేశాల మధ్య వాణిజ్య నిబంధనలతో వ్యవహరించే ఏకైక అంతర్జాతీయ అంతర్జాతీయ సంస్థ. WTO ప్రపంచ వాణిజ్య నియమాల వ్యవస్థను నిర్వహిస్తుంది, వాణిజ్య ఒప్పందాలను చర్చించడానికి ఒక వేదికగా పనిచేస్తుంది, దాని సభ్యుల మధ్య వాణిజ్య వివాదాలను పరిష్కరిస్తుంది మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలకు మద్దతు ఇస్తుంది.

24.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 4-5 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. GATT అనగానేమి?
2. వ్యాపార సంతులనంను నిర్వచించండి.
3. WTO లక్ష్యాలను నిర్వచించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 8-10 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. వ్యాపార సంతులనం మరియు వ్యాపార చెల్లింపుల శేషం మధ్య గల వ్యత్యాసంను వివరించండి.
2. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రయోజనాలను చర్చించండి.
2. WTO యొక్క విధులను వివరించండి.

III. ఈ క్రింది ప్రశ్నలకు 16-20 పంక్తులలో సమాధానాలను వ్రాయండి.

1. ఆర్థికాభివృద్ధిలో అంతర్జాతీయ వాణిజ్యం పాత్రను వివరించండి.
2. GATT మరియు WTO మధ్య భేదంను వివరించండి.
3. భారతదేశం మరియు ప్రపంచ వాణిజ్య సంస్థలో తాజా పరిమాణాలను వివరించండి.

24.10 పదకోశం

- వర్తక సంతులనం (BOT): వర్తక సంతులనం అనేది ఒక దేశం యొక్క వస్తువుల ఎగుమతుల మొత్తం విలువ మరియు వస్తువుల దిగుమతుల మొత్తం విలువను సూచిస్తుంది.
- వ్యాపార చెల్లింపుల శేషం (BOP): వ్యాపార చెల్లింపుల శేషం అనేది ఇతర దేశాల నుండి మరియు వాటికి సంబంధించిన రసీదులు మరియు చెల్లింపుల యొక్క క్రమబద్ధమైన రికార్డు.

- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (FDI): విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అనేది ఒక దేశంలో ఉత్పత్తిలో మరొక దేశంలో ఉన్న కంపెనీ ద్వారా నేరుగా పెట్టుబడి పెట్టడం,
- అంతర్జాతీయ వాణిజ్యం: అంతర్జాతీయ వాణిజ్యాన్ని వివిధ దేశాల మధ్య వస్తువులు మరియు సేవల మార్పిడి లేదా వాణిజ్యం అంటారు.
- విదేశీ మారక నిల్వలు: ఇది సాధారణంగా రిజర్వ్ కరెన్సీలలో సాధారణంగా US డాలర్ మరియు తక్కువ స్థాయిలో యూరో, జపనీస్ యెన్ మరియు పౌండ్ స్టెర్లింగ్‌లో ఉంచబడుతుంది. జారీ చేయబడిన స్థానిక కరెన్సీ మరియు ఆర్.బి.ఐ. డిపాజిట్ చేసిన నిల్వల వంటి దాని బాధ్యతలను బ్యాకప్ చేయడానికి ఇది ఉపయోగించబడుతుంది.
- ప్రపంచ వర్తక సంస్థ (WTO): ప్రపంచ వర్తక సంస్థ అనేది దేశాల మధ్య వాణిజ్య నిబంధనలతో వ్యవహరించే ఏకైక అంతర్జాతీయ అంతర్జాతీయ సంస్థ.

2.4.11 ఉపయుక్త గ్రంథాలు

1. Textbook for Intermediate Second Year Economics. TSBIE Telangana.
2. NCERT Class 11, 12 Economics
3. BRAOU, BA III year Economics
4. IGNOU BA Economics
5. NIOS Economics

అధ్యాయం 25

పర్యావరణం - ఆర్థికాభివృద్ధి

25.0. లక్ష్యాలు

25.1 పరిచయం

25.2 సజీవ, భౌతిక పర్యావరణం

25.3 పర్యావరణం - ముఖ్యమైన భావనలు

25.4 పర్యావరణం విభాగాలు

25.5 పర్యావరణం విధులు

25.6 పర్యావరణం - ఆర్థిక వ్యవస్థ మధ్య సంబంధాలు

25.7 పర్యావరణం - కొన్ని భావనలు

25.7.1 ఆవరణ వ్యవస్థ

25.7.2 ఆవరణ వ్యవస్థ - రకాలు

25.8. పర్యావరణ కాలుష్యం

25.8.1 కాలుష్యాలు - విభజన

25.8.2 వివిధ రకాల కాలుష్యాలు

25.9 పర్యావరణ విచ్ఛేదనం

25.9.1 భూమి విచ్ఛేదనం

25.9.2 అడవులు

25.9.3 నేల క్రమక్షయం

25.10 పర్యావరణ పరిరక్షణ

25.11. సుస్థిర అభివృద్ధి

25.11.1 సుస్థిర అభివృద్ధి - భావనలు

25.11.2 సుస్థిర అభివృద్ధి కోసం

25.12 సారాంశం

25.13 మాదిరి పరీక్ష ప్రశ్నలు

25.14 పదకోశం

25.15 ఉపయుక్త గ్రంథాలు

25.0 లక్ష్యాలు

- పర్యావరణానికి, ఆర్థిక వ్యవస్థకు మధ్య సంబంధాన్ని వివరిస్తారు.
- ఆవరణ వ్యవస్థల్లోని రకాలను వర్గీకరిస్తారు.
- కాలుష్యం వల్ల ఏర్పడే దుష్పరిణామాలను విశ్లేషిస్తారు.
- కాలుష్య నివారణకు పరిష్కార మార్గాలు సూచిస్తారు.
- పర్యావరణ సంక్షోభాన్ని ఎలా నివారించవచ్చో వివరిస్తారు.
- సుస్థిరాభివృద్ధి ఆవశ్యకతను వివరిస్తారు.

25.1 పరిచయం

పర్యావరణం (Environment) అనే ఆంగ్ల పదాన్ని ఎన్విరానర్ అనే ఫ్రెంచ్ పదం నుంచి గ్రహించారు. ఎన్విరాన్ అంటే చుట్టూ ఉన్నవి అని అర్థం. మన చుట్టూ ఉన్న వాటన్నింటినీ కలిపి పర్యావరణం అంటారు.

(మన చుట్టూ ఏమేమి ఉంటాయి? ఒకసారి ఊహించండి.)

మన చుట్టూ జీవులతో పాటు నిర్జీవులు కూడా ఉంటాయి. ప్రాణం ఉన్న వాటికి జీవులు అని, ప్రాణం లేని వాటిని నిర్జీవులు అంటారు. దీన్ని బట్టి పర్యావరణం రెండు భాగాలు. ప్రాణం ఉన్న వాటిని సజీవ పర్యావరణం అని, ప్రాణం లేని వాటిని నిర్జీవ పర్యావరణం అని పిలుస్తారు.

25.2 సజీవ, భౌతిక పర్యావరణం

ప్రాణం ఉన్న వాటినన్నింటినీ కలిపి జీవ కారకాలు అంటారు. మొక్కలు, చెట్లు, జంతువులు, మానవులనన్నింటినీ కలిపి జీవసంబంధమైన అంశాలు అంటారు. రాళ్లు, కొండలు, గుట్టలు, పర్వతాలు, ఎడారులు, గడ్డి మైదానాలు, నీరు, వాయువులు, ధూళి కణాలు మొదలైన వాటన్నింటినీ నిర్జీవ అంశాలు అంటారు.

ఈ నిర్జీవ, సజీవ నిర్మాణాలన్నీ ఒకదానిపై మరొకని ఆధారపడి ఉంటాయి. పర్యావరణంలో ఒకదానిని మరొకటి ప్రభావితం చేసుకుంటాయి. కాబట్టి ఈ అంశాల మధ్య రెండు రకాల సంబంధాలు ఉన్నాయి.

అవి...

1. ఏ శక్తిని లేదా పదార్థాన్ని సృష్టించలేం. నాశనం చేయలేం.
2. పదార్థాలు, శక్తి ఒక అంశం నుంచి మరో అంశానికి ప్రవహిస్తూ ఉంటాయి.

నిర్జీవ, సజీవ అంశాల మధ్య పరస్పర, విడదీయ రాని సంబంధం ఉంటుంది. ఒక కారకంలో మార్పులు జరిగితే దాని ప్రభావానికి మరో కారకం ప్రతిస్పందిస్తుంది. ఈ విధంగా పరస్పరం ప్రభావితం అవుతున్న సజీవ, నిర్జీవ అంశాల మధ్య, ఆవరించి ఉన్న నిర్మాణాల మధ్య మానవుడు ఒక కేంద్రకంగా జీవిస్తూ ఉన్నాడు. ఈ కారకాలపై ఆధారపడతూ, ప్రభావితం చేస్తూ, ప్రభావితమవుతూ తన పురోగతికి మానవుడు కృషి చేస్తున్నాడు.

25.3 పర్యావరణం - ముఖ్యమైన భావనలు

మన చుట్టూ ఉన్న వాటిని సాధారణంగా పర్యావరణంగా పేర్కొంటాం. ఆధునిక కాలంలో పర్యావరణానికి కింది విధంగా నిర్వచించవచ్చు.

- ఒక నిర్ణీత ప్రదేశంలో, ఒక నిర్ణీత కాలంలో మానవుల చుట్టూ ఉన్న పరిస్థితుల మొత్తాన్ని పర్యావరణం అని చెప్పవచ్చు.
- ఎ) నీరు, గాలి, భూమి, బి) మానవులు, ఇతర సజీవ ప్రాణులు, మొక్కలు, సూక్ష్మజీవులు ఈ రెండింటికీ ఒక్కొక్క దానికి మధ్య ఉండే సంబంధాన్ని పర్యావరణం అని నిర్వచించవచ్చు.
- చుట్టూ ఉన్న పరిస్థితులను, వస్తువులను, నియమాలను కలిపి పర్యావరణంగా పిలవవచ్చు.
- మనషులతో పాటు అన్ని రకాల ప్రాణుల అభివృద్ధిని ప్రభావితం చేస్తూ మార్పులకు గురి చేసేఅన్ని రకాల నియమాలను, ప్రభావాలను అన్నింటినీ కలిపి పర్యావరణం అని నిర్వచించవచ్చు. మానవుడి జోక్యంతోను, ఆస్తులను సృష్టించుకోవడంతోనూ కలిగే, ఉత్పన్నమయ్యే మంచి, చెడు ప్రభావాలన్నీ కూడా ఇందులో కలిసే ఉంటాయి.

పైన చెప్పిన నిర్వచనాలు పరిశీలిస్తే ఒక జీవసమూహాన్ని లేదా రాశిని దాని జీవిత కాలంలో మార్పులకు లోను చేసే ప్రతి చర్యను, వస్తువులను సమిష్టిగా కలిపి పర్యావరణంగా నిర్వచించవచ్చు. ఇంకా విస్తృతంగా చెప్పాలంటే పై వాటితో పాటు మానవుడు తయారు చేసిన సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, మేధోపరమైన మానవుడి చర్యలను పర్యావరణంగా పిలవచ్చు. మానవుడి ఈ పనుల వల్ల భౌతికమైన పర్యావరణం కూడా మార్పులకు గురిచేస్తూ ఉంటుంది.

ఈ నిర్వచనాలు పరిశీలిస్తే మనకు మరో విషయం అర్థమవుతోంది. జంతువుల్లో(జీవుల్లో) మనిషి ఒక్కడే తన పరిసరాలను తనకు తగిన విధంగా, వాటికి అనుగుణంగా మార్చుకున్నాడని అర్థం అవుతోంది. అలాగే మనిషి తన అవసరాలకు తగ్గట్టు పర్యావరణాన్ని మార్చుకొంటున్నాడు.

పర్యావరణంలోని కారకాలు ప్రధానంగా కింది విధంగా వర్గీకరించవచ్చు.

1. జీవ కారకాలు: జంతువులు, మొక్కలు, వృక్షాలు
2. భౌతిక కారకాలు: నీరు, అడవులు, పర్వతాలు, భూమి, వాయువు.
3. శక్తి కారకాలు: వాయుశక్తి, సూర్యశక్తి, విద్యుదయాస్కాంతశక్తి

4. సాంఘిక కారకాలు: పట్టణీకరణ, మానవ సంబంధాలు, ఆచారాలు

5. మానసిక కారకాలు: మానసిక పరిపక్వత, విజ్ఞానం, తెలివి తేటలు

6. సాంస్కృతిక కారకాలు: రాజకీయ, ఆర్థిక, నైతిక, మత అంశాలు.

ఈ కారకాలు ఒకదానిపై మరొకటి ఆధారపడి, ఒకదానిని మరొకటి ప్రభావితం చేస్తూ ఉంటాయి. ఇవన్నీ కూడా వైవిధ్యమైనవి.

25.4 పర్యావరణం విభాగాలు

పర్యావరణం ప్రధానంగా నాలుగు విభాగాలుగా విభజించవచ్చు.

1. శిలావరణం.. భూగోళంపై ఘనీభవించిన మందపాటి పొరనే శిలావరణం. దీనిలో మైదానాలు, పీఠభూములు, కొండలు, లోయలు, నీరు ఉండే ప్రాంతాలు ఉంటాయి. ఈ పొరలోని రాళ్లు, మట్టి, ఇతర వస్తువులు జీవుల నివాసానికి ఉపయోగపడుతున్నాయి.

2. జలావరణం.. భూమిపై ఉండే మొత్తం నీటి భాగాన్ని జలావరణం అంటారు. కుంటలు, చెరువులు, సరస్సులు, నదులు, సముద్రాలన్నీ జలావరణంలోని భాగాలు. భూమి పొరల్లో నిలువ ఉండే భూగర్భ జలం కూడా దీనిలోని భాగమే.

3. వాతావరణం.. భూమి చుట్టూ ఆవరించి ఉన్న వాయువుల పొరను వాతావరణం అంటారు. ఈ వాతావరణంలో ధూళితో పాటు నైట్రోజన్, ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్ వంటి వాయువులు ఈ వాతావరణంలో ఉంటాయి.

4. జీవావరణం.. భూమిపై ఉండే జీవులన్నింటినీ కలిపి జీవావరణం అంటారు. సూక్ష్మజీవులతో పాటు భూమిపై జీవించే జంతువులు, పక్షులు, వృక్షాలు, సముద్ర జలాలు ఈ జీవావరణంలో ఉంటాయి. శిలావరణం, వాతావరణం, జలావరణం ఉన్నప్పుడే జీవావరణం కొనసాగుతుంది. ఈ ఆవరణాలన్నింటి కలయికే పర్యావరణం. నిర్జీవ, సజీవ రాసులన్నీ దీనిపై ఆధారపడి ఉంటాయి. అంటే పర్యావరణం విశ్వానికి అంతటికి సంబంధించింది. దీనికి ఎలాంటి సరిహద్దులు లేవు. ఈ పర్యావరణం మనిషి కేంద్రకంగా ఉంటూ, ఆ నిర్మాణాలను మార్చుతూ మార్చబడతూ, ప్రభావితం చేస్తూ, తాను ప్రభావితం అవుతూ సజీవ, నిర్జీమైన అంశాలతో సహజీవనం చేస్తూ ఉంటాడు.

25.5 పర్యావరణం విధులు

పర్యావరణం నాలుగు రకాల విధులు నిర్వహిస్తుంది.

1. పునరావృతం అయ్యే వనరులను, పునరావృతం కాని వనరులను సరఫరా చేస్తుంది.
2. ఘన, ద్రవ, వాయు రూపాలైన వ్యర్థాలను పర్యావరణం తనలో విలీనం చేసుకుంటుంది. అంటే పర్యావరణం శోషణాగారంగా పని చేస్తుంది.

3. జీవవైవిధ్యాన్ని, జన్యు వైవిధ్యాన్ని, జీవావరణ సమతూకం కాపాడే విధంగా ప్రాణాధారమైన సేవలు పర్యావరణం అందిస్తుంది. ఇది వరకు వాడని పదర్థాలను, శక్తిని, వాడుకలోకి తీసుకువచ్చి, ఉపయోగపడే విధంగా మార్చడానికి వీలుగా ఈ ప్రాణాధారసేవలు సహాయం చేస్తాయి.

4. మానసిక ఉల్లాసాన్ని కలిగించడానికి, ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించడానికి తగిన ప్రాకృతిక సేవలను పర్యావరణం ప్రసాదిస్తుంది.

పర్యవరణం నిర్వహించే పై నాలుగు రకాల విధులు పరస్పర పూరకాలు. ఒకదాని మీద మరొకటి ఆధారపడి ఉంటాయి. ఒక్కో విధి మరో విధిని ప్రభావితం చేస్తుంది. ఒక విధి తన పనిలో విఫలమైతే, మరో విధి కూడా అచేతనమై సక్రమంగా పని చేయలేదు. ఈ విధులు ఆర్థిక వ్యవస్థ నడకను నిర్దేశిస్తాయి.

25.6 పర్యావరణం - ఆర్థిక వ్యవస్థ మధ్య సంబంధం

పర్యావరణం ఆర్థిక వ్యవస్థకు అవసరమైన ముడి సరుకులను సరఫరా చేస్తుంది. అంతేకాకుండా ఆర్థిక వ్యవస్థ నుంచి వచ్చే వ్యర్థాలను తనలో విలీనం చేసుకుంటుంది. ఆర్థిక పరిభాషలో పర్యావరణం సరఫరా చేసే వనరులన్నీ పర్యావరణ వనరులే. పర్యావరణ వస్తువులను అన్ని జీవులు వాడుకుంటాయి. నిర్జీవులు వీటి ప్రభావానికి లోనవుతుంటాయి.

మానవుడి ఆర్థిక కార్యకలాపాలు, దోపిడి, నిర్లక్ష్యం పర్యావరణ వనరుల సరఫరాకు పరిమితులు విధిస్తున్నాయి. దీంతో శుద్ధి చేసే సామర్థ్యం కూడా పర్యావరణంలో తగ్గిపోతోంది. విచ్చలవిడిగా పర్యావవరణాన్ని ఉపయోగించకోవడం వల్ల వచ్చే పరిణామాలను బ్రిటిష్ ఆర్థికవేత్త కెన్నెత్ బౌలింగ్ 1966లో హెచ్చరించారు. మానవజాతి తన వినియోగాన్ని వీలైనంత తగ్గించుకోవాలని సూచించారు. ఉత్పాదితాలు ఉత్పత్తుల మధ్య సమతూకం ఉన్నప్పుడే పర్యావరణం సమతౌల్యంలో ఉంటుందని పేర్కొన్నారు.

25.7 పర్యావరణం కొన్ని భావనలు

మన చుట్టూ పర్యావరణం ఆవరించి ఉంది. గాలి, నీరు, భూమి, మనకు మధ్య ఉన్న పరస్పర సంబంధాలు అనుభవిస్తున్నాం. నిర్జీవ పదార్థాలు కూడా ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి. ఒకదానినొకటి ప్రభావితం చేసుకుంటూ, వాటి స్థిరత్వాన్ని క్రమబద్ధం చేసుకుంటాయి. ఇలాంటి విషయాలను ఆవరణ శాస్త్రం అధ్యయనం చేస్తుంది. జీవులు, నిర్జీవుల మధ్య బంధాన్ని ఇది వివరిస్తుంది. పర్యావరణం గురించి పూర్తిగా అర్థంచేసుకోవడానికి ఆవరణ శాస్త్రం గురించి తెలుసుకోవాలి.

25.7.1 ఆవరణ వ్యవస్థ

ఆవరణ వ్యవస్థలో జీవులు, నిర్జీవులు వుంటాయి. ఇవి ఉష్ణోగ్రత, సూర్యరశ్మి, గాలి, వర్షపాతం వంటి పరిస్థితులకు లోనవుతూంటాయి. జంతు, వృక్ష వంటివి కూడా తమ పరిసరాలను లోనవుతూ, వాటిని ప్రభావితం చేస్తూ ఉంటాయి. వీటన్నింటి సమ్మిళితమే ఆవరణ వ్యవస్థ. ఆవరణ వ్యవస్థలో జల వలయాలు, కర్బన వలయాలు, ప్రాణవాయువు వలయాలు, నత్రజని వలయాలు, శక్తి ప్రవాహాలు, ఆహారపు గొలుసులు ఉంటాయి. వీటి ద్వారా ఆవరణ వ్యవస్థ తన విధులను నిర్వహిస్తుంది. ఈ ఆవరణ వ్యవస్థలో ఒకదానిని మరొకటి ప్రభావితం చేసుకుంటాయి. ఈ ఆవరణ వ్యవస్థలో మార్పులు వస్తే భూమిపై మానవ మనుగడ కష్టం అవుతుంది.

25.7.2 ఆవరణ వ్యవస్థ - రకాలు

ఆవరణ వ్యవస్థలో సహజ, కృత్రిమ ఆవరణ వ్యవస్థలు అని రెండు రకాలు.

1. సహజ ఆవరణ వ్యవస్థ: ప్రకృతి సిద్ధంగా ఏర్పడి సొంతంగా విధులు నిర్వహించుకునేది సహజ ఆవరణ వ్యవస్థ. దీనికి మానవుడి జోక్యం అవసరం లేదు. మావవుని జోక్యం లేకుండా సహజ పరిస్థితుల్లో ఇవిపని చేస్తూ ఉంటాయి. దీనిలో భౌమ ఆవరణ వ్యవస్థ, జల ఆవరణ వ్యవస్థ అని రెండు రకాలు. ఉదాహరణ అరణ్యాలు, గడ్డి మైదనాలు, సరస్సులు, నదులు.

2. కృత్రిమ ఆవరణ వ్యవస్థ: ఈ వ్యవస్థలో మానవుడి జోక్యం ఉంటుంది. మానవుడు సహజ ఆవరణ వ్యవస్థలో జోక్యం చేసుకోని మార్పులు తేస్తారు. జీవ సముదాయాల లక్షణాలను మార్చి ఆధునీకరించి నియంత్రించడానికి మానవుడు ప్రయత్నిస్తూ ఉంటాడు. సాంకేతిక విజ్ఞానం, మానవ దృక్పథం ఆధారంగా మార్పులు చోటు చేసుకుంటాయి. పట్టణాల నిర్మాణం, భూగర్భ లేదా జలాంతర నిర్మాణాలు, విత్తనాలు, పంటలు క్లోనింగ్, మానవుడు, జంతువుల్లో జన్యుపరమైన మార్పులు కృత్రిమ ఆవరణ వ్యవస్థకు ఉదాహరణలు. అంతేగాక మానవుడి ఆలోచనలకు ఆచరణ రూపాన్ని కలిగి ఫలితాలనిస్తూ ఉంటాయి. అందువల్ల ఈ వ్యవస్థలు అతి సున్నితంగా ఉంటాయి. వైవిధ్యం లేని కారణంగా తరచూ వైఫల్యం చెందుతూ ఉంటాయి. ఎందుకంటే సహజ ఆవరణ వ్యవస్థలకు ఉండే విధంగా వీటికి స్వయంగా క్రమబద్ధీకరించుకొనే యంత్రాంగం ఉండదు. అవి విజ్ఞానానికి ఉండే పరిమితులకు లోబడి ఉంటాయి. ఉదా: హైడ్రోపోనిక్స్. ఆహార కొరతను పరిష్కరించడానికి నేల, సూర్యరశ్మి అవసరం లేకుండా మొక్కలను సాగు చేయడానికి హైడ్రోపోనిక్స్ అంటారు. మానవ నిర్మిత ఆవరణ వ్యవస్థకు ఉన్న లక్షణాలను ఇందులో ఉంటాయి.

25.8. పర్యావరణ కాలుష్యం

కాలుష్యం అంటే ఏమిటి?

పర్యావరణంలో ఉండాల్సిన దాని కంటే ఒక పదార్థం ఎక్కువ లేదా తక్కువగా ఉండటానికి కాలుష్యం అంటారు. ఉదాహరణకు వాతావరణంలో ఆక్సిజన్ లేదా కార్బన్ డై ఆక్సైడ్ ఉండాల్సిన నిష్పత్తిలో ఉండకపోతే కాలుష్యమే. మంచి పంట దిగుబడి కోసం, నేల సారవంతంగా ఉండటానికి ఫాస్పేట్, నైట్రేట్ వంటి వాటిని ఉపయోగిస్తాం. వీటి మోతాదు మించితే కాలుష్యమే. ఈ కాలుష్యం ద్వారా పర్యావరణం ప్రభావితం అవుతుంది. ఈ హానికరమైన కారకాల ద్వారా పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటుంది.

కాలుష్యం ఎలా ఏర్పడుతుంది..?

కాలుష్యం కొన్నిసార్లు ప్రకృతిసిద్ధంగా ఏర్పడుతుంది. మరి కొన్ని సార్లు మానవుడి కారణంగా కూడా ఏర్పడుతుంది. నేల క్రమక్షయానికి గురికావడం, అగ్ని పర్వతాలు ఏర్పడిప్పుడు విస్ఫోటనం వంటివి ప్రకృతి సిద్దంగా ఏర్పడే కాలుష్యాలు. అయితే వీటని ప్రకృతి సహసిద్ధంగానే సరిచేస్తుంది.

మనిషి చేసే కాలుష్యాలు ఎక్కవగా ఉన్నాయి. అనేక పరిశ్రమలు నెలకొల్పడం వల్ల వాయు కాలుష్యం, జనాభా పెరగడం వల్ల వారికి అవసరాలు తీర్చడానికి అడవుల నిర్మూలన, కాంక్రీట్ నిర్మాణాలతో కాలుష్యాలు ఏర్పడుతున్నాయి. మానవుడి కారణంగా ఏర్పడిని కాలుష్యలు నేడు పెనుభూతాలై ప్రపంచాన్ని భయపెడుతున్నాయి.

25.8.1 కాలుష్యాలు – విభజన

కాలుష్యాలను ముఖ్యంగా మూడు రకాలుగా విభజించవచ్చు. అవి..

ఎ) విచ్ఛిన్నం కాని కాలుష్యాలు: పర్యావరణంలోకి ప్రవేశించిన తర్వాత విచ్ఛిన్నం చెందని కాలుష్యాలను విచ్ఛిన్నం కాని కాలుష్యాలు అంటారు. వీటిని నిర్మూలించలేము. ఉదా: న్యూక్లియర్ వ్యర్థాలు.

బి) విచ్ఛిన్నమయ్యే కాలుష్యాలు: పర్యావరణంలో తేలికగా కలిసిపోయే వాటిని విచ్ఛిన్నమయ్యే కాలుష్యాలు అంటారు. ఉదా: గృహంలోని వ్యర్థాలు, కూరగాయలు ఇవి పర్యావరణంలో సులువుగా కలిసిపోతాయి.

సి) నెమ్మదిగా విచ్ఛిన్నమయ్యే కాలుష్యాలు: ఇవి కొన్నేళ్ల పాటు తమ స్థితిలో మార్పులు లేకుండా ఉండి అనంతరం పర్యావరణంలో కరిగిపోతాయి. ఉదా: డీడీటి, ప్లాస్టిక్ వస్తువులు. అయితే పర్యావరణం శుద్ధి చేసే పరిమాణానికి మించి ఉంటే పర్యావరణం కాలుష్యమవుతుంది.

25.8.2 కాలుష్యంలోని రకాలు

పర్యావరణంలో ఘన, ద్రవ, వాయు పదార్థాలు తమ స్వచ్ఛతను కోల్పోయినప్పుడు కాలుష్యానికి గురవుతాయి.

1. జల కాలుష్యం ...

ప్రపంచంలోని జీవరాసులకు అత్యవశ్యకమైన వస్తువు నీరు. నీటిలో కొన్ని పదార్థాలు అధికంగా చేరి స్వచ్ఛతను కోల్పోతుంది. నీరు ఉపయోగించడానికి వీలు లేనప్పుడు నీటి కాలుష్యం అంటారు.

నీటి కాలుష్యం ఏవిధంగా జరుగుతుంది...?

- పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ పదార్థాల వల్ల
- గనుల తవ్వకం ద్వారా వెలువడే వ్యర్థ పదార్థాలు
- క్రిమి సంహారకాలు, రసాయనిక ఎరువులు
- చెత్తా చెదారం
- గృహాల్లో వినియోగించే వ్యర్థ పదార్థాలు
- మానవ వ్యర్థాలు

నీటి కాలుష్యం - నష్టాలు

1. స్వచ్ఛమైన నీరు లభించదు.
2. కలుషిత నీరు తాగడం వల్ల అనేక రోగాలు వ్యాపిస్తాయి.
3. జలాశయాలు కలుషితం కావడం వల్ల చేపలు విషతుల్యం అవుతున్నాయి.
4. నీరు దుర్గంధంగా మారుతుంది.

నీటి కాలుష్యం నివారణ

1. వ్యవసాయానికి సేంద్రియ ఎరువులను మాత్రమే వాడాలి.
2. నీటి పునర్వినియోగానికి ఆధునిక పద్ధతులు ఉపయోగించాలి.
3. క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరువులు వీలైనంత తగ్గించాలి.
4. వర్షపు నీటిని నిలువ చేసి ఉపయోగించుకోవాలి.

2. గాలి కాలుష్యం ...

జీవులకు అవసరమైన వాయువులు ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డైయాక్సైడ్ వంటి ఎన్నో వాయువులు వాతావరణంలో వ్యాపించి ఉంటాయి. ఈ వాయువుల మిశ్రమాన్ని గాలి అంటారు. గాలి లేకుండా మానవుడితో పాటు ఇతర జీవులు కొద్ది సమయం కూడా జీవించలేవు.

గాలిలో అవసరానికి మించి ఇతర పదార్థాలు ఎక్కువైనప్పుడు వాయు కాలుష్యం ఏర్పడుతుంది.

వాయు కాలుష్యం - కారణాలు..

పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, వంట చెరుకు కాల్చడం, వాహనాల నుంచి వచ్చే పొగ, అడవులు అంతరిస్తుండటం, శిలాజ ఇంధనాలు వాడటం, నూక్లియర్ పరీక్షలు, విద్యుత్ ఉత్పత్తి, రిఫ్రిజిరేటర్ల వాడకం వల్ల వాయుకాలుష్యం జరుగుతుంది.

వాయు కాలుష్యం - ఫలితాలు

1. మానవుడు, జంతువుల ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది.
2. వృక్షాల కిరణజన్యసంయోగ క్రియను అడ్డుకుంటుంది.
3. ప్రకృతి సహజ సౌందర్యాలను నాశనం చేస్తుంది.
4. శీతోష్ణస్థితిని ప్రభవితం చేసి తీవ్ర ఉష్ణోగ్రతలు పెరగడం, ఆమ్ల వర్షాలు, కరువు కాటకాలకు ప్రభావితం చేస్తుంది.

వాయు కాలుష్యాన్ని ఎలా నియంత్రించడం

1. వాయు కాలుష్య కారణాలు గుర్తించాలి.
2. ప్రత్యామ్నాయ ఇంధన వనరులను కనుగొనడం.
3. పరిశ్రమల్లో కాలుష్యాన్ని తగ్గించే పరికరాలు అమర్చాలి.
4. వాయు చట్టాలను సమర్థంగా అమలు చేయాలి.
5. పునరావృతం అయ్యే వనరులను ఉపయోగించాలి.

3. శబ్ద కాలుష్యం ...

వివిధ రకాల వాహనాలు, పరిశ్రమలు, లౌడ్ స్పీకర్ల వల్ల ధ్వని కాలుష్యం ఏర్పడుతుంది. నేలను విపరీతంగా ఉపయోగించుకోవడం, క్రిమి సంహారక మందులు వాడటం వల్ల నేలలు కాలుష్యానికి గురి అవుతున్నాయి.

25.9. పర్యావరణ విచ్ఛేదనం (Environmetal Degradation)

మానవుడి కారణంగా పర్యావరణం విచ్ఛేదనానికి మరియు కాలుష్యానికి గురి అవుతుంది. నేల, నీరు, గాలి, అడవులు వంటి సహజ వనరులన్నీ సంక్షోభానికి గురవుతున్నాయి.

25.9.1 భూమి విచ్ఛేదనం

అతి ప్రధానమైన వనరు భూమి. నివాసానికి, ఆహారానికి, ప్రతి అవసరానికి భూమిపై ఆధారపడి జీవిస్తున్నాం. మానవుడి స్వార్థం వల్ల అడవుల నరికివేత, పారిశ్రామికీకరణ, రసాయనిక పదార్థాల వినియోగం వల్ల భూమి తన సహజ శక్తిని కోల్పోతోంది.

25.9.2 అడవులు

అడవులు మానవవుడికి ఎన్నో రకాలుగా ఉపయోగ పడతాయి. ఆక్సిజన్, కలప, వన్య ప్రాణులకు ఆవాసం, ఔషధాలు వంటి అనేక ప్రయోజనాలు అడవుల వల్ల ఉన్నాయి. జీవ వైవిధ్యం, పర్యావరణ సమతౌల్యంలో అడవుల పాత్ర ఎనలేనిది. కానీ మానవుడు వ్యవసాయం, పరిశ్రమలు, కలప, వంట చెరుకు వంటి అవసరాల కోసం ప్రతి ఏటా లక్షల చదరపు కిలో మీటర్ల అడవులు నరికి వేస్తున్నాడు.

అడవులు నాశనం కావడానికి కారణాలు

1. వంట చెరకు, బొగ్గు కోసం అడవులుపై ఆధారపడడం
2. కాగితం కోసం కలపను వాడడం
3. పెరిగిన జనాభాకు అనుగుణంగా నివాస సౌకర్యాల ఏర్పాటు
4. జనాభాకు అనుగుణంగా పరిశ్రమలు, రవాణా మార్గాలు ఏర్పాటు చేయడం
5. ఆహారోత్పతికి వ్యవసాయ భూములుగా మార్చడం
6. పశువులను ఇష్టారీతిన మేపడం

అడవుల సంరక్షణా చర్యలు

1. పరిశ్రమల కోసం అటవీ భూములు కేటాయించవద్దు.
2. వృథాగా ఉన్న భూములను మాత్రమే వ్యవసాయ భూములుగా మార్చాలి.
3. పెరిగిన జనాభాకు ఇళ్ల నిర్మాణానికి అటవీ భూములు కేటాయించకూడదు.
4. అటవీ ఉత్పత్తులపై ఆధారపడే వ్యాపారాలను, పరిశ్రమలను ప్రోత్సహించాలి.
5. చట్ట విరుద్ధంగా అడవులు నరికి వేయడం, పశువుల మేత పట్ల కఠిన చర్యలు తీసుకోవాలి.

25.9.3 నేల క్రమక్షయం

గులకరాళ్లు, ఇసుక, మట్టి ఖనిజ రేణువులతో కలసి ఏర్పడింది నేల. ఇలాంటి నేల మానవుడి చర్యల కారణంగా క్రమక్షయానికి గురవుతోంది.

నేల క్రమక్షయం - కారణాలు

క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరువులు అధికంగా వాడడం, ఇష్టారీతిన పశువులు మేపడం, వరదలు తుఫానుల సమయంలో నీరు, గాలి నేలను వికోషీకరణానికి గురి చేస్తాయి. పంటల సాగు, గనుల తవ్వకం, నిర్మాణ కార్యక్రమాలు.

నేల క్రమక్షయం ఎలా అరికట్టవచ్చు?

1. అడవులు పెంచడం
2. చెక్ డ్యాములు నిర్మించడం
3. క్రిమి సంహారక, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువులు వాడడం.
4. పశువులను క్రమబద్ధంగా మేపాలి.
5. నేలపై గట్లను, కట్టలను నిర్మించి నీటి ప్రవాహ వేగాన్ని తగ్గించాలి.

25.10. పర్యావరణ పరిరక్షణ

ఈ భూమిపై నివసించే ప్రాణులందరిదీ పర్యావరణం. ఇది ఏ ఒక్కరి సొత్తూ కాదు. జలచరాలు, పక్షులు, జంతువులు, మానవుడు ఇలా ప్రతి ఒక్కరికి ఉపయోగపడుతోంది. అయితే మానవుడు ఒక్కడే తన దురాశతో పర్యావరణాన్ని అధికంగా ఉపయోగిస్తూ దుర్వినియోగం చేస్తున్నాడు. దీంతో పర్యావరణం పూర్తి స్థాయిలో తన విధులను నిర్వహించలేకపోతోంది.

పర్యావరణ సంక్షోభం గురించి మాల్థస్ వంటి ఆర్థిక వేత్తలు హెచ్చరించినప్పటికీ, మానవాళి పట్టించుకోలేదు. మిషాన్ రాసిన 'ది కాస్ట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్', రాచెల్ కార్సన్ రాసిన 'ది సైలెంట్ స్ప్రింగ్', మెడోస్ రాసిన 'లిమిట్స్ టు గ్రోత్'ల ద్వారా పర్యావరణ సంక్షోభం గురించి ప్రపంచాన్ని హెచ్చరించారు.

ఈ సంక్షోభానికి మూడు కారణాలు గుర్తించారు. అవి.

1. జనాభా
2. తలసరి ఉత్పత్తి (వినియోగం)
3. ఒక ఆర్థిక వస్తువు ద్వారా ఉత్పత్తి అవుతున్న సరాసరి కాలుష్యం

ఈ కారణాల వల్ల ఈ భూగోళంపై భూసారం తగ్గి, వ్యవసాయ ఉత్పత్తి తగ్గిపోతోంది. ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతోంది. భూతాపం పెరిగి, హరిత గృహ వాయువుల ప్రభావం ఏర్పడుతోంది. ధృవ ప్రాంతాల్లో మంచు కరిగి సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. ఈవిధంగా వృక్షాలు, జంతువులు, పక్షులు, జలచరాలు, మొక్కలు ప్రభావితం అవుతున్నాయి.

కాలుష్య నివారణకు అంతర్జాతీయంగా దేశాలు సంస్థలు, సభలు, చట్టాల ద్వారా కృషి చేస్తున్నాయి. ఆశించిన ఫలితాలు రావడం లేదు. వీటన్నిటికీ కారణం మానవుడే. భవిష్యత్ పరిణామాలను ఎదుర్కోవాల్సింది కూడా మానవుడే.

25.11 సుస్థిర అభివృద్ధి

ఆర్థికంగా వృద్ధి చెందడమే అభివృద్ధి అని ధనిక దేశాలు భావించాయి. మానవుడిలో పరిమాణాత్మక, గుణాత్మక మార్పులు రావడమే వృద్ధిగా భావించారు. అయితే మానవుడి సంక్షేమానికి కారణమయ్యే పర్యావరణం, దాని స్వచ్ఛతను మరిచారు. వనరుల ఉపయోగం, వాటి పునరుత్పత్తి మధ్య సమతూకం ఉంటేనే అది సుస్థిర అభివృద్ధి అవుతుంది. సుస్థిర అభివృద్ధి అనే పదానికి ఇటీవల ప్రాధాన్యం పెరిగింది.

సుస్థిర అభివృద్ధి అంటే..?

ప్రస్తుత అవసరాలు తీర్చుకుంటునే భవిష్యత్ తరాల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడటమే సుస్థిర అభివృద్ధి. భవిష్యత్‌లో మానవుడి సంక్షేమం తరగకుండా ఉండే పరిస్థితిని సుస్థిరత్వం అంటారని 1992లో నిర్వహించిన ధరిత్రీ సదస్సు నిర్వచించింది.

25.11.1 సుస్థిర అభివృద్ధి - భావనలు

సుస్థిరత్వంలో మూడు ముఖ్యమైన భావనలు ఉంటాయి. అవి పర్యావరణ, సామాజిక, ఆర్థిక భావనలు. ఈ మూడింటి మధ్య సమతూకం సాధించినప్పుడే సుస్థిరమైన అభివృద్ధి సాధ్యం అవుతుంది.



పై మూడు భావనలు సమతౌల్యంగా ఉండాలంటే.. మనం పొందుతున్న వనరుల కంటే భావి తరాల వనరులు తగ్గకూడదు. పర్యావరణ, మానవ నిర్మిత ఆస్తులు భావి తరాల వారు కూడా వారసత్వంగా పొందగలగాలి. భావి తరాల్లో కూడా మానవ సంక్షేమం సుస్థిరంగా ఉండే విధంగా సామాజిక, ఆర్థిక, పర్యావరణ వనరులు ఉపయోగించుకోవాలి.

25.11.2 సుస్థిర అభివృద్ధి కోసం..

1. మనం భూమికి సంబంధించిన వారిగా భావించాలి. అంతేగానీ ఈ భూమి మనకు సంబంధించిందిగా భావించకూడదు.
2. మానవుడి చర్యల వల్ల ఏ ఒక్క జాతి నశించకూడదు.

3. ప్రకృతిని ప్రేమించాలి, ఆరాధించాలి, సంరక్షించాలి.

4. ఈ భూమిపై మానవుడి లాగానే ప్రతిజీవికి జీవించే హక్కు ఉందని గుర్తించాలి.

5. భౌతిక, రసాయనిక. జీవపరమైన వనరులు తరగిపోయేలా చూడకూడదు.

25.12 సారాంశం

జీవరాసుల మనుగడకు అతిముఖ్యమైంది పర్యావరణం. పర్యావరణాన్ని ప్రాధాన్యన్ని గుర్తించి దాన్ని దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది. ప్రస్తుత అవసరలు తీర్చుకుంటూనే భవిష్యత్ తరాలకు లోటు రాని సుస్థిరమైన అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి.

25.13. మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. గాలి కాలుష్యం వల్ల నష్టాలు రాయండి.
2. అడవుల సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
3. పర్యావరణ అంశాలను వివరించండి.
4. కృత్రిమ ఆవరణ వ్యవస్థ అంటే ఏమిటి?
5. నీటి కాలుష్యాన్ని ఎలా నివారించవచ్చు?

III. కింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. పర్యావరణ కాలుష్యం వల్ల నష్టాలు తెలియజేయండి.
2. పర్యావరణ విధులను వివరించండి.

III. కింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. అడవుల అంతరిస్తుండటానికి కారణాలు రాయండి.
2. కాలుష్యం అంటే ఏమిటి వివరించండి.
3. ఆవరణ వ్యవస్థ అంటే ఏమిటి? దానిలోని భాగాలను పేర్కొనండి.
4. వాయు కాలుష్యంను వివరించండి.
5. సుస్థిర అభివృద్ధి అంటే ఏమిటి?

25.14 పదకోశం

పర్యావరణం: పర్యావరణం అనేది మానవుడి చుట్టూ ఉన్న మొత్తం పరిసరాలు

కాలుష్యం: ఒక పదార్థం దానిలో ఉండవలసిన దానికంటే ఎక్కువ లేదా తక్కువ ఉంటే కాలుష్యం అంటారు.

సుస్థిరాభివృద్ధి: భవిష్యత్ తరాల ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా ప్రస్తుత అవసరాలు తీర్చుకోవడం.

25.15 ఉపయుక్త గ్రంథాలు

1. డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, డిగ్రీ అర్థ శాస్త్రం
2. తెలుగు అకాడమీ ఇంటర్మీడియెట్ అర్థ శాస్త్రం, రెండో సంవత్సరం
3. Anil Markandya et.al(2004): Environmental Economics for Sustainable Growth, Edgar Elen, Newyork.
4. Chandrasekher M, Shankar Rao E.(2004) Environmental Scince, The Hitech Publishers, Hyderabad.

అధ్యాయం
26

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆర్థిక వృద్ధి మరియు నిర్మాణం

26.0. లక్ష్యాలు

26.1. పరిచయం

26.2. ప్రత్యేక తెలంగాణ కోసం ఆరు దశాబ్దాల పోరాటం

26.3. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి

26.4. GSDP, GSVA తలసరి ఆదాయం అంచనా

26.5. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పయనం

26.6. తలసరి ఆదాయం

26.7. వివిధ రంగాల కూర్పు

26.8. సారాంశం

26.9. పదకోశం

26.10. ఉపయుక్త గ్రంథాలు

26.0. లక్ష్యాలు

ఈ పాఠం యొక్క ప్రాథమిక లక్ష్యం తెలంగాణ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, వృద్ధి మరియు ధోరణులపై సంబంధిత జ్ఞానాన్ని అందించడం. అలాగే స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (GSDP), స్థూల రాష్ట్ర విలువ జోడింపు (GSVA), తలసరి ఆదాయం (PCI) మరియు తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో ప్రాథమిక, ద్వితీయ మరియు తృతీయ రంగాల గురించి వివరిస్తుంది.

ఈ పాఠంలో విద్యార్థి క్రింది విషయాలు అర్థం చేసుకోగలరు.

- తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆర్థిక వ్యవస్థ నిర్మాణం
- స్థిర ధరలలో, GSDP అంచనా GSVA మరియు తలసరి ఆదాయం
- తెలంగాణలో GSDP మరియు GSVA యొక్క నిర్మిత విభాగం
- జిల్లా దేశీయ ఉత్పత్తి మరియు జిల్లాల వారీగా తలసరి ఆదాయ ధోరణి

26.1. పరిచయం

ఆంధ్ర రాష్ట్రం 1953, అక్టోబర్ 16 తేదీన ఏర్పాటైనది. అంతకు ముందు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో భాగంగా ఉన్నది. తెలుగు మాట్లాడే తెలుగు ప్రజలు తమ ఆధిపత్యంలో వివక్షకు గురవుతున్నారని భావించి, ప్రత్యేక రాష్ట్రం కోసం దశాబ్దం పాటు పోరాడారు. తమిళులచే పోరాటం కొనసాగింది. గాంధేయవాది అయిన శ్రీ పొట్టి శ్రీరాములు ఝుమరణ నిరాహార దీక్ష ఫలితంగా 1952లో డిసెంబర్‌లో మరణించిన తర్వాత, భారత ప్రభుత్వం 1953లో అక్టోబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంను ఏర్పాటు చేసింది.

26.2. ప్రత్యేక తెలంగాణ కోసం ఆరు దశాబ్దాల పోరాటం

- 1956 నాటి పెద్ద మనషుల ఒప్పందం
- 1969 సం॥లో జై తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది.
- 1969లో 8వ అంశాల ఫార్ములా, 1970లో 5 అంశాల ఫార్ములా
- 1972లో భారత సర్వోన్నత న్యాయస్థానం తీర్పు
- 1973 6-సూత్రాల పథకం
- 1985 జి.ఓ.నెం. 610 మరియు గిర్‌గ్లాని కమీషన్ నివేదిక

తెలంగాణ రాష్ట్రం, భారత దేశంలో 29వ రాష్ట్రంగా, జూన్ 2, 2014న ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం దక్కన్ పీఠభూమిలో ఉష్ణమండల ప్రాంతంలో ఏర్పాటైంది. ఈ ప్రాంతం 15.50 N నుండి 19.51 N అక్షాంశం మరియు 77' 15 E నుండి 89'16 రేఖాంశం మధ్య ఉంటుంది. భౌగోళికంగా తెలంగాణ రాష్ట్రానికి ఉత్తరాన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, పశ్చిమాన కర్ణాటక, తూర్పు-దక్షిణాన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా ఉంది.

భారతదేశంలో తెలంగాణ రాష్ట్రం వైశాల్యంలో 11వ రాష్ట్రంగా, జనాభాలో 12వ పెద్ద రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది. తెలంగాణ ప్రాంతాలలో రెండు పెద్ద నదులు ప్రవహిస్తున్నాయి. గోదావరి నది 79%, కృష్ణానది 69% పరివాహక ప్రాంతంలో ప్రవహిస్తున్నాయి. తెలంగాణలో ఎక్కువగా తెలుగు మాట్లాడతారు. దీనితో పాటు ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు, తమిళ్, మరాఠీ, బెంగాలీ, కన్నడ భాషలు మొదలగునవి.

తెలంగాణ రాష్ట్రం యొక్క మొత్తం భౌగోళిక వైశాల్యం 1,12,077 చదరపు కిలోమీటర్లు, తెలంగాణలో 33 జిల్లాలు ఉన్నాయి. తెలంగాణలో 74 రెవెన్యూ డివిజన్లు 594 రెవెన్యూ మండలాలు మరియు 10909 రెవెన్యూ గ్రామాలు, 12769 గ్రామ పంచాయతీలు, 129 మున్సిపాలిటీలు మరియు 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 119 అసెంబ్లీ నియోజక వర్గాలు, 17 పార్లమెంట్ నియోజక వర్గాలు ఉన్నాయి.

26.3. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి

నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర స్వరూపం తెలుసుకునే ముందు కొంత పూర్వ చరిత్ర అనివార్యం. 1వ నవంబర్, 1956వ పూర్వపు హైదరాబాద్ రాష్ట్రం, ఆంధ్ర రాష్ట్రంలో కలిసి ఆంధ్రప్రదేశ్‌గా అవతరించింది (1 నవంబర్ 1956 నుంచి 2 జూన్ 2014 వరకు).

పూర్వ హైదరాబాద్ రాష్ట్రం

హైదరాబాద్ రాష్ట్రం, నిజాం నవాబులచే 224 సంవత్సరాలుగా (అని అసఫ్‌జాహి వంశం) పాలించారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని రెండు దశలుగా విభజించవచ్చు. మొదటిదశ 1724-1857 మరియు రెండవదశ 1857-1948. మొదటి దశను వ్యవసాయ ఆధారిత కాలంగా, రెండవ దశను పారిశ్రామిక అభివృద్ధికి పునాదులు వేసిన కాలంగా పరిగణించవచ్చు. ఇది స్వంత కరెన్సీ మరియు పరిపాలనా వ్యవస్థను కలిగి ఉంది. ఉర్దూ భాష రాజ్యం యొక్క అధికార భాష, బోధనా మాధ్యమం కూడా ఉర్దూలో మాత్రమే ఉండేది.

1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు, అప్పటి హైదరాబాద్ రాష్ట్ర పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ (7వ నిజాం) రాష్ట్రాన్ని స్వతంత్ర సంస్థగా కొనసాగించాలని భావించారు. భారత యూనియన్ సాయుధ జోక్యం ద్వారా చరిత్రలో పోలీసు చర్యగా నమోదు చేయబడింది. ఈ విలీనం 17 సెప్టెంబర్ 1948న

జరిగింది. 1952లో రాష్ట్ర అసెంబ్లీకి సాధారణ ఎన్నికలు జరిగాయి. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా డాక్టర్ బూర్గుల రామ కృష్ణారావు అధికారం చేపట్టారు.

26.4. GSDP, GSVP తలసరి ఆదాయం అంచనా

రాష్ట్ర స్థూల ప్రాంతీయోత్పత్తి లేదా రాష్ట్ర ఆదాయం అనేది రాష్ట్ర ఆర్థిక వృద్ధిని కొలవడానికి ముఖ్యమైన సూచిక. రాష్ట్రంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన మొత్తం వస్తువుల, సేవల విలువల మొత్తాన్ని లెక్కించడం రాష్ట్ర స్థూల ప్రాంతీయాదాయం అని నిర్వచించవచ్చు.

ప్రస్తుత సంవత్సరంలో ఉన్న ధరల అంచనాలను, ప్రస్తుత ధరల వద్ద, ఆధార సంవత్సరాల ధరల వద్ద స్థిర ధరలతో లెక్కిస్తారు. సంవత్సర కాలంలో వాస్తవ పరంగా నిజమైన వృద్ధిని కొలిచే స్థిరమైన ధరల స్థాయి ఆధారంగా కొలుస్తారు. ధరలలో హెచ్చు తగ్గులను తగ్గించడానికి డిఫ్లేటర్‌ను వాడతారు. దీనినే ధరల సూచిక అంటారు.

తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (GSDP) ధోరణులు

2021-22లో తెలంగాణ రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (GSDP) ప్రస్తుత ధరల ప్రకారం 11.55 లక్షల కోట్లు, తెలంగాణ GSDP ప్రస్తుత ధరల ప్రకారం 19.1% పెరిగింది. కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఏర్పడిన సంక్షోభం నుండి తెలంగాణ పూర్తిగా కోలుకోనప్పటికి, రాష్ట్రం ఇప్పటికి కూడా 2020-21లో ప్రస్తుత ధరల ప్రకారం GSDPలో పెరుగుదలను సాధించగలిగింది.

26.5. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సంవత్సరం నుండి అభివృద్ధి ప్రయాణం

తెలంగాణ నామమాత్రపు వృద్ధి రేటు 2014-15లో భారతదేశం కంటే 1% ఎక్కువగా ఉంది, 2020-21 నాటికి 3.6% పెరిగింది. భారత దేశ ఆర్థిక వ్యవస్థ 2021-22 కొంత మేరకు క్షీణించింది. తెలంగాణ నామమాత్రపు GSDP 2021-22లో 21.8% ఎక్కువగా ఉంది. అయితే భారతదేశ నామమాత్రపు GDP రెండు సంవత్సర కాలంలో 17.8% మాత్రమే పెరిగింది. 2020-21 జాతీయ GDPకి తెలంగాణ దాదాపు 4.1% సహకారం అందించింది. 2014-15 మరియు 2020-21 మధ్య కాలంలో 14 జనరల్ కేటగిరి రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రం 6వ స్థానాన్ని ఆక్రమించింది. భారతదేశ GDPకి తెలంగాణ రాష్ట్ర GSDP 4.1% నుండి 4.9% పెరిగింది.

2011-22 ధరల వద్ద GSDP

2021-22 సంవత్సరానికి ముందస్తు అంచనాల ప్రకారం (AE) గణాంకాల ఆధారంగా (2011-12) స్థిరమైన ధరల వద్ద తెలంగాణ యొక్క GSDP గత సంవత్సరం కంటే 11.2% పెరిగింది. ఇది 2021-22 వాస్తవ GDPలో 8.9% పెరుగుదలను సూచించింది.

భారతదేశం GDP లో తెలంగాణ రాష్ట్ర GSDP వాటా 2014-15 నుండి 2021-22

భారతదేశ మరియు తెలంగాణ స్థూల దేశీయోత్పత్తి స్థిర ధరలలో వృద్ధి

సం॥	2014-15	2015-16	2016-17	2017-18	2018-19	2019-20	2020-21	2021-22
తెలంగాణ	4.2 6.8%	4.711.6%	5.19.3%	5.69.7%	6.19.1%	6.45.0%	6.2-3.5%	6.911.2%
భారతదేశం	10.53 7.4%	113.78.0%	123.18.3%	131.56.8%	139.96.5%	145.23.7%	135.6-6.6%	1478.9%

26.6 తలసరి ఆదాయం

స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి మొత్తం ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని ప్రతిబింబిస్తుంది. 2020-21 సంవత్సరంలో తెలంగాణ నామమాత్రపు తలసరి ఆదాయం 2,37,632 ఉంది. దీని ప్రకారం ఒక వ్యక్తి ఆర్జించిన ఆదాయం అని అర్థం. ఇది ఆర్థిక వృద్ధికి మెరుగైన కొలమానం. తలసరి ఆదాయంలో (PCI, MOSPI ద్వారా విడుదల చేయబడిన 14 జనరల్ కేటగిరి రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్రం 2వ స్థానాన్ని ఆక్రమించింది.

2021-22 సంవత్సరంలో తెలంగాణ నామమాత్రపు తలసరి ఆదాయం 2.7 లక్షలకు పెరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సంవత్సరం నుండి సగటు జాతీయ తలసరి ఆదాయం కంటే తెలంగాణ తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నది. 2014-15లో తెలంగాణ తలసరి ఆదాయం (PCI) జాతీయ తలసరి ఆదాయ కంటే 1.43 రెట్లు) ఎక్కువగా ఉంది. తెలంగాణ PCI జాతీయ PCI కంటే రూ. 37,457 ఎక్కువ 2021-22 నాటికి గుణకం 1.86కి పెరిగింది. (తెలంగాణ PCI కంటే రూ. 1,23,985 ఎక్కువగా ఉంది)

$$\text{తలసరి ఆదాయం} = \frac{\text{మొత్తం జాతీయ ఆదాయం}}{\text{మొత్తం జాతీయ జనాభా}} \times 100$$

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి సంవత్సరం భారతదేశం కంటే తెలంగాణ తలసరి ఆదాయం ఎక్కువగా ఉండటమే కాకుండా, ఆ ప్రతి సంవత్సరం భారతదేశం కంటే ఎక్కువ రేటుతో వృద్ధి చెందింది.

2020-21లో తెలంగాణ మరియు భారతదేశం యొక్క తలసరి ఆదాయం వృద్ధి రేట్ల కోరిక, కోవిడ్19 మహమ్మారి (-4.0) కారణంగా, భారతదేశం దాని నామమాత్రపు తలసరి ఆదాయంలో భారీ పతనాన్ని చవిచూసింది. తెలంగాణ తలసరి ఆదాయం ఆ సంవత్సరంగా కూడా పెరిగింది (16.%). జాతీయ నామమాత్రపు తలసరి ఆదాయ వృద్ధి రేటు కంటే 0.7% పాయింట్లు అధికం కాగా 18.8% పెరుగుదలతో తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం అత్యధికంగా పెరిగింది.

26.7. వివిధ రంగాల కూర్పు

2021-22 సంవత్సరానికి సంబంధించిన (GSVA)కు ముందస్తు అంచనాల (AE) ఆధారంగా వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు, మైనింగ్ మరియు క్వారీలతో సహా పరిశ్రమలు మరియు సేవలు అనే మూడు కీలక రంగాల ద్వారా ఆర్థిక సహకారాన్ని అందించిన ప్రకారంగా సేవారంగం వాటి 61.3%, పారిశ్రామిక రంగం 20.4%, వ్యవసాయ మరియు అనుబంధ రంగం 18.3%.

తెలంగాణ రాష్ట్రం యొక్క మొత్తం (GSVA)లో వ్యవసాయం మరియు అనుబంధ రంగాల వాటా 2014-15లో 16.3% నుండి 18.3% పెరిగింది. 2014-15లో ప్రతికూలత 0.6% నుండి 2021-22లో 9.09% నామమాత్రపు వృద్ధి రేటు గణనీయంగా పెరగడం వల్ల తెలంగాణలో ఈ రంగం సహకారం పెరిగింది.

ఉద్యోగాల కల్పనకు మరియు ఇతర రంగాలలో ఉత్పాదకతను పెంచడానికి పారిశ్రామిక అభివృద్ధి చాలా కీలకమని తెలంగాణ ప్రభుత్వం గుర్తించినందున, పారిశ్రామికంగా స్థిరమైన వృద్ధిని నిర్ధారించడానికి అనేక చర్యలు చేపట్టింది. ఇందులో TS-IPASS, T-IDEA మరియు T-PRIDE వంటి వ్యాపార సంస్థలు ఉన్నాయి. MSME రంగానికి చేయూత ఇవ్వడానికి బహుళ కార్యక్రమాలు ప్రవేశపెట్టినాయి.

2021-22లో రాష్ట్ర విలువ జోడింపులో సేవా రంగం వాటా 61.3% అందుకే తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన రంగాలలో ఒకటి. భారతదేశ నామమాత్రపు GVAలో సేవారంగం వాటా 52.8% మాత్రమే, తెలంగాణ రాష్ట్ర సేవారంగం వాటా (61.3%) కంటే తక్కువగా ఉంది.

వివిధ రంగాల వృద్ధి రేట్లు

2014-15 మరియు 2021-22 మధ్య కాలంలో దాని ప్రస్తుత ధరల వృద్ధి రేటు 9.75% పాయింట్ల పెరుగుదలతో తెలంగాణ వ్యవసాయ మరియు అనుబంధ రంగం గత 7 సంవత్సరాలుగా వృద్ధి బాటలో ఉంది. 2020-21లో కోవిడ్-19 మహమ్మారి గరిష్ఠ స్థాయికి చేరుకున్న సమయంలో దేశంలోని వ్యవసాయం మరియు

అనుబంధ రంగం ఆ సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం 12.24% వృద్ధిని సాధించింది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మరియు మిషన్ కాకతీయ వంటి కొత్త నీటి పారుదల పథకాలు మరియు రైతుబంధు పథకం మరియు రైతు బీమా వంటి వినూత్న వ్యవసాయ మద్దతు విధానాలు మరియు వ్యవసాయ రంగానికి 24×7 ఉచిత విద్యుత్ సరఫరా మరియు వ్యవసాయంలో కనీస మద్దతు ధర వంటి అంశాలు ఉన్నాయి.

తెలంగాణలో పారిశ్రామిక రంగం 2020-21లో మహమ్మారి నుండి కోలుకుంది. ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా ఉద్యోగాల కల్పనకు కీలకమైన పరిశ్రమ మరియు ఉత్పాదక ఉపరంగంను గత సంవత్సరంతో పోలిస్తే 20.23% గణనీయమైన వృద్ధిని సాధించింది.

తెలంగాణ రాష్ట్రం 2021-22లో 28.59% వార్షిక వృద్ధి రేటు నమోదు అయింది. భారతదేశ వార్షిక వృద్ధి రేటు 22.78%గా ఉంది. తెలంగాణ కంటే భారతదేశ వార్షిక వృద్ధి రేటు 5.41% తక్కువగా ఉంది. మైనింగ్ మరియు క్వారీయింగ్ రంగం 13.24% వృద్ధిని సాధించింది. నిర్మాణ రంగం 10.38%, విద్యుత్ మరియు యుటిలిటీస్ ఉపరంగం 7.38% ఉంది.

తెలంగాణ సేవల పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్ల ఉపరంగం 29.94% పెరిగింది. 2021-22లో రవాణా రంగం 11.31% పెరిగింది. రైల్వేలు 10.34%, ప్రసారానికి సంబంధించిన కమ్యూనికేషన్ మరియు సేవలు వంటి ఇతర ఉపరంగాలు 2020-21లో నామమాత్రపు GVAలో 21.10% వార్షిక వృద్ధి సాధించింది.

2020-21లో పరిపాలన విభాగం GVAలో 19.58% వార్షిక వృద్ధి సాధించగా, 14.40% రియల్ ఎస్టేట్ వార్షిక వృద్ధి సాధించింది. సేవారంగంలో వృద్ధిని పునరుజ్జీవింపజేయడానికి ఉద్దేశించిన ప్రభుత్వ విధానాలకు ఇది ప్రత్యక్ష పరిణామ క్రమం. IT మరియు ITeS రంగాన్ని ద్వితీయ శ్రేణి పట్టణాలు మరియు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రోత్సాహించడానికి తెలంగాణలో IT పెట్టుబడి విభాగాన్ని విస్తరించారు.

26.8. సారాంశం

స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (GSDP) అనేది రాష్ట్ర యొక్క భౌగోళిక సరిహద్దులో ఉత్పత్తి చేయబడిన అన్ని అంతిమ వస్తువులు మరియు సేవల విలువను సూచిస్తుంది. నిరిష్ట సంవత్సర కాలంలో లెక్కించబడుతుంది. సాధారణంగా ఒక సంవత్సరం మొత్తం మీద తెలంగాణ వృద్ధి రేటు, మొత్తం భారతదేశ వృద్ధి రేటు కంటే ఎక్కువ.

తెలంగాణ వృద్ధి రేటు, మొత్తం భారతదేశ వృద్ధి రేటు కంటే ఎక్కువ. తెలంగాణ ప్రభుత్వం తన GSDP అంచనాలను కొత్త ఆధార సంవత్సరం (2011-12) ప్రకారం మరియు, కేంద్ర గణాంక సంస్థతో సమానంగా అంచనా వేయడం జరిగింది.

పై అంచనాల ప్రకారం మొత్తం భారతదేశం GDPలో తెలంగాణ వాటా ప్రస్తుత ధరలు మరియు స్థిర ధరలు 2011-12 నుండి 2018-19 వరకు 4.11% నుండి 4.5% మధ్య ఉన్నాయి. తెలంగాణలో 2012-13 నుండి 2018-19 వరకు ప్రస్తుత మరియు స్థిరమైన ధరలలో మిశ్రమ ధోరణి ఉంది.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల వాటా విషయంలో ద్వితీయ మరియు తృతీయ రంగాల విషయానికొస్తే దీనికి భిన్నంగా వ్యవసాయ మరియు పరిశ్రమల వాటా వృద్ధి సరళిలో అస్థిరత ఉంది. 2011లో సేవా రంగం వాటా క్రమంగా మరియు స్థిరంగా పెరిగింది. 2011-12 నుండి 2021-22 సంవత్సర మధ్య కాలంలో జాతీయ తలసరి ఆదాయం కంటే, తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయం ఎక్కువగా నమోదు అయింది.

26.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. TS IPASS
2. తలసరి ఆదాయం
3. వృద్ధి రేటు

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. తెలంగాణ GSDP వృద్ధి నమూనా గురించి క్లుప్తంగా వ్రాయండి.
2. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ యొక్క రంగాల వృద్ధి రేటు ధోరణుల గురించి వివరించండి.

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. GSDP అంటే ఏమిటి? తెలంగాణలో GSDP మరియు తలసరి ఆదాయంలో గల ధోరణులను వివరించండి.
2. తెలంగాణ స్థూల రాష్ట్ర విలువలో వివిధ రంగాల గురించి వివరించండి.

26.10. పదకోశం

• **స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి:** రాష్ట్ర భౌగోళిక సరిహద్దులో ఉత్పత్తి చేయబడి అంతిమ వస్తువులు మరియు సేవల విలువలను కలుపగా వచ్చేది GSDP. ఇది ఒక ప్రత్యేకకాలంలో ఒక సంవత్సర కాల వ్యవధిలోనే లెక్కించాలి.

• **వార్షిక వృద్ధి రేటు:** $\frac{\text{ప్రస్తుత సం॥ విలువ – గత సంవత్సర విలువ}}{\text{గత సంవత్సరం విలువ}} \times 100$

• **ప్రస్తుత మరియు స్థిర ధరలు:** ఒక వస్తువు విలువను ప్రస్తుత సంవత్సర ధరలలో లెక్కిస్తే ప్రస్తుత సంసంవత్సర ధరలు అని అయితే ఆధార సంవత్సరం లేదా బేస్ ఇయర్ (Base year) ధరల వద్ద లెక్కిస్తే దీనినే స్థిర ధరలు అంటారు. స్థిర ధరలు అంటే ధరలలో హెచ్చు తగ్గులు లేని సంవత్సరంలో ధరలు లెక్కిస్తారు.

• **వివిధ రంగాల వాటా:** ఇది ప్రాథమిక, ద్వితీయ మరియు తృతీయ రంగాలలో మొత్తం స్థూల రాష్ట్ర విలువ అనేది కలుపబడుతుంది (GVA).

26.11. ఉపయుక్త గ్రంథాలు

1) తెలంగాణ ప్రణాళికా విభాగం, సామాజిక ఆర్థిక ముఖ చిత్రం 2021–22

2) ఆర్థిక గణాంకశాఖ, Statisticial Year Book 2021

3) తెలుగు అకాడమి – ఇంటర్ ద్వితీయ సంవత్సరం

4) తెలుగు అకాడమి 2016 – తెలంగాణ ఆర్థిక వ్యవస్థ

5) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బి.ఎ. సెమిస్టర్ VI పుస్తకం

Appendix-I

Annexure 9

Gross Domestic Product and Per Capita Income of All India at Current Prices from 2014-15 to 2020-21

(Rs. in crore)

Sl. No.	Sector	2014-15	2015-16	2016-17	2017-18	2018-19 (TRE)	2019-20 (SRE)	2020-21 (FRE)	2021-22 (SAE)
1	2	3	4	5	6	7	8	9	10
1	Agriculture, Livestock, Forestry and Fishing	20,93,612	22,27,533	25,18,662	28,29,826	30,29,925	33,58,364	36,09,494	
1.1	Crops	12,92,874	13,27,992	14,86,044	16,33,264	16,80,777	18,91,966	19,97,147	
1.2	Livestock	5,10,411	5,82,410	6,72,611	7,85,683	8,82,009	9,77,730	11,14,249	
1.3	Forestry and Logging	1,73,760	1,84,411	2,05,364	2,17,603	2,55,053	2,60,603	2,65,479	
1.4	Fishing and Aquaculture	1,16,567	1,32,720	1,54,643	1,93,275	2,12,087	2,28,065	2,32,620	39,64,312
2	Mining and Quarrying	3,08,476	2,94,011	3,26,808	3,36,109	3,77,661	3,58,517	3,24,980	5,18,170
	Primary	**24,02,088**	**25,21,544**	**28,45,470**	**31,65,935**	**34,07,586**	**37,16,881**	**39,34,474**	**44,82,482**
3	Manufacturing	18,78,369	21,46,189	23,33,721	25,66,623	28,12,560	27,04,809	27,09,435	33,26,746
4	Electricity, Gas, Water supply and Other Utility Services	2,82,258	3,34,965	3,55,709	4,25,718	4,49,459	5,01,618	5,07,352	5,70,125
5	Construction	9,79,086	9,91,084	10,80,870	12,00,414	13,52,118	13,72,759	13,15,608	17,02,055
	Secondary	**31,39,713**	**34,72,238**	**37,70,300**	**41,92,755**	**46,14,137**	**45,79,186**	**45,32,395**	**55,98,926**
6	Trade, Repair, Hotels and Restaurants	13,20,833	14,33,969	16,09,001	18,81,395	21,36,707	23,25,812	18,18,981	
6.1	Trade and Repair Services	12,06,474	13,07,323	14,68,583	17,22,671	19,55,798	21,29,686	17,32,821	
6.2	Hotels and Restaurants	1,14,359	1,26,646	1,40,418	1,58,723	1,80,909	1,96,127	86,160	
7	Transport, Storage, Communication & Services related to Broadcasting	7,86,763	8,60,544	9,30,155	9,97,528	10,66,055	11,52,680	10,47,412	35,43,624
7.1	Railways	92,459	1,00,451	1,06,786	1,16,584	1,23,596	1,35,477	1,36,807	
7.2	Road Transport	3,70,364	3,99,902	4,34,947	4,84,134	5,36,552	5,65,438	4,47,164	
7.3	Water Transport	7,590	7,298	9,206	13,021	13,059	13,350	13,418	
7.4	Air Transport	11,820	20,344	21,496	22,444	12,730	22,508	10,323	
7.5	Services incidental to Transport	91,681	88,246	1,02,468	97,602	1,03,341	1,03,301	98,170	
7.6	Storage	6,407	7,021	7,442	16,194	18,597	19,513	19,628	
7.7	Communication & Services related to Broadcasting	2,06,442	2,37,282	2,47,809	2,47,549	2,58,179	2,93,094	3,21,902	
8	Financial Services	6,61,411	7,26,286	7,50,201	8,46,194	9,41,778	10,27,359	10,88,222	45,67,241
9	Real Estate, Ownership of Dwellings and Professional Services	17,01,935	18,99,852	21,61,236	22,81,018	25,87,720	28,51,979	29,57,538	
10	Public Administration and Defence	6,76,818	7,31,578	8,27,438	9,45,082	10,45,488	11,47,741	12,38,383	
11	Other Services	8,14,718	9,28,489	10,71,399	11,95,759	13,75,658	15,53,471	14,40,404	31,65,000
	Tertiary	**59,62,478**	**65,80,718**	**73,49,430**	**81,46,976**	**91,53,406**	**1,00,59,042**	**95,90,940**	**1,12,75,865**
12	**Total GSVA at Basic Prices**	**1,15,04,279**	**1,25,74,499**	**1,39,65,200**	**1,55,05,665**	**1,71,75,128**	**1,83,55,109**	**1,80,57,810**	**2,13,57,273**
13	Taxes on Products	12,91,662	15,18,496	17,46,288	18,98,896	20,43,568	20,76,662	22,55,495	
14	Subsidies on Products	3,27,982	3,21,121	3,19,819	3,14,518	3,19,028	3,56,916	5,12,391	22,86,602
15	**Gross Domestic Product**	**1,24,67,959**	**1,37,71,874**	**1,53,91,669**	**1,70,90,042**	**1,88,99,668**	**2,00,74,856**	**1,98,00,914**	**2,36,43,875**
16	**Per Capita Income (Rs.)**	**86,647**	**94,797**	**1,04,880**	**1,15,224**	**1,25,946**	**1,32,115**	**1,26,855**	**1,49,848**

SAE-Second Advance Estimates, FRE- First Revised Estimates, SRE- Second Revised Estimates, TRE- Third Revised Estimates
Source: Ministry of Statistics and Programme Implementation, Government of India

Appendix-II

Annexure 10

Sectoral Growth Rates (%) of Gross Domestic Product and Per Capita Income of all India at Current Prices

(Percent)

Sl. No.	Sector	2015-16	2016-17	2017-18	2018-19 (TRE)	2019-20 (SRE)	2020-21 (FRE)	2021-22 (SAE)
1	2	3	4	5	6	7	8	9
1	Agriculture, Livestock, Forestry and Fishing	6.4	13.1	12.4	7.1	10.8	7.5	
1.1	Crops	2.7	11.9	9.9	2.9	12.6	5.6	
1.2	Livestock	14.1	15.5	16.8	12.3	10.9	14.0	
1.3	Forestry and Logging	6.1	11.4	6.0	17.2	2.2	1.9	
1.4	Fishing and Aquaculture	13.9	16.5	25.0	9.7	7.5	2.0	9.8
2	Mining and Quarrying	-4.7	11.2	2.8	12.4	-5.1	-9.4	59.4
	Primary	**5.0**	**12.8**	**11.3**	**7.6**	**9.1**	**5.9**	
3	Manufacturing	14.3	8.7	10.0	9.6	-3.8	0.2	22.8
4	Electricity, Gas, Water supply and Other Utility Services	18.7	6.2	19.7	5.6	11.6	1.1	12.4
5	Construction	1.2	9.1	11.1	12.6	1.5	-4.2	29.4
	Secondary	**10.6**	**8.6**	**11.2**	**10.1**	**-0.8**	**-1.0**	
6	Trade, Repair, Hotels and Restaurants	8.6	12.2	16.9	13.6	8.9	-21.8	
6.1	Trade and Repair Services	8.4	12.3	17.3	13.5	8.9	-18.6	
6.2	Hotels and Restaurants	10.7	10.9	13.0	14.0	8.4	-56.1	
7	Transport, Storage, Communication & Services related to Broadcasting	9.4	8.1	7.2	6.9	8.1	-9.1	
7.1	Railways	8.6	6.3	9.2	6.0	9.6	1.0	
7.2	Road Transport	8.0	8.8	11.3	10.8	5.4	-20.9	
7.3	Water Transport	-3.8	26.1	41.4	0.3	2.2	0.5	
7.4	Air Transport	72.1	5.7	4.4	-43.3	76.8	-54.1	
7.5	Services incidental to Transport	-3.7	16.1	-4.7	5.9	0.0	-5.0	
7.6	Storage	9.6	6.0	117.6	14.8	4.9	0.6	
7.7	Communication & Services related to Broadcasting	14.9	4.4	-0.1	4.3	13.5	9.8	23.6
8	Financial Services	9.8	3.3	12.8	11.3	9.1	5.9	
9	Real Estate, Ownership of Dwellings and Professional Services	11.6	13.8	5.5	13.4	10.2	3.7	12.9
10	Public Administration and Defence	8.1	13.1	14.2	10.6	9.8	7.9	
11	Other Services	14.0	15.4	11.6	15.0	12.9	-7.3	18.2
	Tertiary	**10.4**	**11.7**	**10.9**	**12.4**	**9.9**	**-4.7**	
12	**Total GSVA at Basic Prices**	**9.3**	**11.1**	**11.0**	**10.8**	**6.9**	**-1.6**	**18.3**
13	Taxes on Products	17.6	15.0	8.7	7.6	1.6	8.6	
14	Subsidies on Products	-2.1	-0.4	-1.7	1.4	11.9	43.6	
15	**Gross Domestic Product**	**10.5**	**11.8**	**11.0**	**10.6**	**6.2**	**-1.4**	**19.4**
16	**Per Capita Income (Rs.)**	**9.4**	**10.6**	**9.9**	**9.3**	**4.9**	**-4.0**	**18.1**

SAE-Second Advance Estimates, FRE- First Revised Estimates, SRE- Second Revised Estimates, TRE- Third Revised Estimates
Source: Ministry of Statistics and Programme Implementation, Government of India

అధ్యాయం

27

మానవ వనరులు

27.0 లక్ష్యాలు

27.1 పరిచయం

27.2. తెలంగాణ జనాభా లక్షణాలు

27.2.1. తెలంగాణలో జనాభా పరిమాణం

27.2.2. తెలంగాణలో జనసాంద్రత

27.2.3 అక్షరాస్యత

27.3 జనాభా యొక్క వృత్తిపరమైన విభజన

27.4. తెలంగాణలో మానవ వనరుల అభివృద్ధి

27.5. విద్యారంగంలో ప్రభుత్వ పాత్ర

27.5.1. ఉచిత మరియు నిర్బంధ విద్య (ఆర్.టి.ఇ.) చట్టం, 2009

27.5.2. పరిశోధనా విద్యా సంస్థలు

27.5.3. నాణ్యమైన మౌలిక సదుపాయాలను కల్పించడం

27.5.4. మన ఊరు-మన బడి/ మన బస్తీ-మన బడి పథకం

27.5.5. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదును మెరుగుపరచడం

27.5.6. అభ్యసన అవకాశాలను విస్తరించడం

27.5.7. పరిశ్రమ-విద్యా భాగస్వామ్యాలను నిర్మించడం

27.5.8. తెలంగాణ ఐసిటి పాలసీ 2021-26

27.6 ఆరోగ్య రంగంలో ప్రభుత్వ పాత్ర

27.7 సారాంశం

27.8. మాదిరి పరీక్ష ప్రశ్నలు

27.9. పదకోశం

27.10. ఉపయుక్త గ్రంథాలు

27.0 లక్ష్యాలు

- తెలంగాణ జనాభా లక్షణాలను అర్థం చేసుకోవడం
- జనాభా యొక్క వృత్తిపరమైన విభజనను అర్థం చేసుకోవడం
- తెలంగాణలో మానవ వనరుల అభివృద్ధి గురించి తెలుసుకోవడం
- తెలంగాణలో ఆరోగ్యం, విద్యల పాత్ర ఏమిటో తెలుసుకోవడం

27.1 పరిచయం

తెలంగాణ భారతదేశం యొక్క దక్షిణ భాగంలో ఉంది. ఇది జూన్ 2014 వరకు ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉంది. ప్రత్యేక రాష్ట్రం కోసం దశాబ్దాల తరబడి ఉద్యమించిన తరువాత పార్లమెంటు ఉభయ సభల్లో ఏపీ రాష్ట్ర పునర్విభజన బిల్లును ఆమోదించడం ద్వారా తెలంగాణ ఏర్పడింది. తెలంగాణ చుట్టూ ఉత్తరాన మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, పశ్చిమాన కర్ణాటక, దక్షిణ, తూర్పు దిక్కుల్లో ఆంధ్ర ప్రదేశ్ ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రాన్ని 33 జిల్లాలుగా విభజించారు. 1,12,077 కి.మీ వైశాల్యం కలిగిన తెలంగాణ భారతదేశంలో పన్నెండవ అతిపెద్ద రాష్ట్రంగా ఉంది.

27.2 తెలంగాణ జనాభా లక్షణాలు

ఒక రాష్ట్రం యొక్క ఆర్థిక అభివృద్ధి రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులపై ఆధారపడి ఉంటుంది. వనరులను ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. (1) మానవ వనరులు (2) భౌతిక సహజ వనరులు (3) మానవ నిర్మిత వనరులు. భౌతిక సహజ వనరులు సూర్యరశ్మి, భూమి, గాలి, నీరు, వృక్ష సంపద మొదలైనవి. మానవ వనరులు అనగా జనాభా. దేశంలో నాణ్యమైన మానవ వనరులు ఉంటే సహజ వనరులను సమర్థవంతమైనవిగా ఉపయోగించుకోవచ్చు. మానవ నిర్మిత వనరులు (యంత్రాలు, కర్మాగారాలు, ఓడలు మొదలైనవి) కూడా మానవ వనరుల సామర్థ్యంపై ఆధారపడి ఉంటాయి. ఆర్థిక వ్యవస్థలో జనాభా పరిమాణం, జనాభా కూర్పు, విద్యా స్థాయి, ఆరోగ్యం, పోషకాహార లభ్యత, ఆదాయ పంపిణీ వ్యవస్థ, పర్యావరణ నాణ్యత మొదలైన అంశాలు మానవ వనరుల నాణ్యత మరియు సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయి.

27.2.1. తెలంగాణలో జనాభా పరిమాణం

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రం 3,50,03,674 జనాభాతో భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన 12వ రాష్ట్రంగా ఉంది. అంటే మన దేశ మొత్తం జనాభాలో ఇది 2.89 శాతం. లింగ నిష్పత్తి అనేది జనాభాలో ప్రతి 1000 మంది పురుషులకు మహిళల సంఖ్యగా నిర్వచించబడింది. రాష్ట్రం యొక్క లింగ నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 988, ఇది దేశం యొక్క లింగ నిష్పత్తి కంటే ఎక్కువ. జిల్లాల విషయానికి వస్తే నిర్మల్ మొదటి స్థానంలో నిలవగా, ఆ తర్వాతి స్థానాల్లో నిజామాబాద్, జగిత్యాల రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. కానీ, జయశంకర్ భూపాలపల్లి, సంగారెడ్డి జిల్లాల్లో లింగ నిష్పత్తి తక్కువగా ఉంది. తెలంగాణ యొక్క జనాభా వివరాలు పట్టిక-1లో చూపబడ్డాయి.

2001-2021 దశాబ్దంలో మన రాష్ట్రంలో జనాభా 11.47% పెరగగా, 1991-2001 దశాబ్దంలో జనాభా పెరుగుదల 15.07%గా నమోదైంది. అదే సమయంలో దేశం మొత్తం జనాభా పెరుగుదల రేటు 21.34%. పై గణాంక వివరాలు రెండు విషయాలను స్పష్టం చేస్తాయి (1) 1991-2001 దశాబ్దంలో తెలంగాణ జనాభా పెరుగుదల 1981-91 దశాబ్దంతో పోలిస్తే తక్కువగా ఉంది. (2) 1991-2001 దశాబ్దంలో జాతీయ జనాభా పెరుగుదల రేటు (17.71%) కంటే మన రాష్ట్రంలో జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉంది. అయితే, 1961 నుండి 2011 వరకు, 50 సంవత్సరాలలో, మన రాష్ట్రంలో జనాభా పరిమాణం 63.68% పెరిగింది. ఇది దేశ వృద్ధి రేటుకు సమానం అంటే 63.72%.

27.2.2. తెలంగాణలో జనసాంద్రత

జనసాంద్రత అనేది ఒక రాష్ట్రంలో చదరపు కిలోమీటరుకు నివసించే ప్రజల సంఖ్య. 1961 లో చదరపు కిలోమీటరుకు జన సాంద్రత 111 మంది ఉండగా, 2011 లెక్కల ప్రకారం చదరపు కిలోమీటరుకు 312 మందికి పెరిగినట్లు పట్టిక.2 వెల్లడిస్తుంది. ఇది దేశ జనసాంద్రత కంటే తక్కువగా ఉంది. 39,43,323 జనాభాతో హైదరాబాద్ అత్యధిక జనసాంద్రత కలిగిన జిల్లాగా, ములుగు అత్యల్పంగా 29,4671 జనాభా కలిగిన జిల్లాగా గుర్తించబడుతుంది.

27.2.3 జనాభా - అక్షరాస్యత రేటు

అక్షరాస్యత రేటును చదవడం మరియు రాయడం చేయగల ఒక నిర్దిష్ట వయస్సు సమూహం యొక్క జనాభా శాతం ద్వారా నిర్వచించబడుతుంది. పట్టిక-4 తెలంగాణలో అక్షరాస్యత రేటు 1961 నుండి 2011 వరకు చూపబడింది. గత నాలుగు దశాబ్దాలుగా తెలంగాణలో అక్షరాస్యత రేటు పురుషులు మరియు స్త్రీలలో పెరుగుతున్నదని గమనించవచ్చు. 1961లో మొత్తం అక్షరాస్యత రేటు 17.34% మరియు 2001లో 58% గా

ఉంది, అప్పుడు ఈ రేటు 66.46 శాతానికి పెరిగింది. కానీ ఇది దేశం యొక్క అక్షరాస్యత రేటు 74.04 కంటే తక్కువ. తెలంగాణలో అత్యధిక అక్షరాస్యత రేటు కలిగిన హైదరాబాద్ కాగా, ఆ తర్వాతి స్థానాల్లో మేడ్చల్ మల్కాజ్గిరి, హనుమకొండ ఉన్నాయి. అయినప్పటికీ, అక్షరాస్యత రేటులో లింగ అంతరం చాలా ఎక్కువగా ఉంది. పురుషుల అక్షరాస్యత రేటు 75.04, ఇది మహిళా అక్షరాస్యత రేటు 57.99% కంటే ఎక్కువ.

27.3 జనాభా యొక్క వృత్తిపరమైన పంపిణీ

పట్టిక-1: 1961 నుండి 2011 వరకు తెలంగాణ రాష్ట్ర జనాభా

సంవత్సరం	1961	1981	1991	2001	2011
తెలంగాణ	1,27,11,785	2,01,81,085	2,60,89,074	3,09,87,271	3,50,03,674
భారతదేశం	43,92,34,771	68,33,29,097	84,64,21,039	1,02,86,10,328	1,21,08,54,977

మూలం: తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం 2022

పట్టిక-2: 1961 నుండి 2011 వరకు జనసాంద్రత

సంవత్సరం	1961	1971	1981	1991	2001	2011
తెలంగాణ	111	138	176	227	270	312
భారతదేశం	144	177	216	273	325	382

మూలం: తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం

పట్టిక-3: 1961 నుండి 2011 వరకు జనాభా అక్షరాస్యత రేటు

Year	1961	1971	1981	1991	2001	2011
Telangana	975	969	971	967	971	988
India	941	930	934	927	933	943

మూలం: తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం

జనాభా యొక్క వృత్తిపరమైన పంపిణీ అనేది ఆర్థిక వ్యవస్థ యొక్క వివిధ రంగాలలో నిమగ్నమైన మొత్తం శ్రామిక జనాభా నిష్పత్తిని సూచిస్తుంది. అవి ప్రాథమిక రంగం, ద్వితీయ, సేవా రంగం లేదా తృతీయ రంగం. మన రాష్ట్రంలో మూడు ప్రధాన ఆర్థిక రంగాలు ఉన్నాయి. అవి

ప్రాథమిక రంగం: వ్యవసాయం, పశుపోషణ, చేపల పెంపకం, అటవీశాఖ మొదలైనవి ఉన్నాయి.

ద్వితీయ రంగం: ఇందులో పరిశ్రమలు, గ్యాస్, నీటి సరఫరా, విద్యుత్, నిర్మాణం మొదలైనవి ఉన్నాయి.

తృతీయ రంగం లేదా సేవల రంగం: ఇది ఆర్థిక వ్యవస్థ యొక్క అన్ని రంగాలకు చెందిన సేవలను కలిగి ఉంటుంది. రవాణా, సాంకేతిక సమాచారం, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్, సామాజిక మరియు ఆర్థిక సంస్థలు మొదలైనవి.

కార్మికులు వ్యవసాయ రంగం నుండి పారిశ్రామిక మరియు సేవా రంగాలు వంటి ఇతర రంగాలకు బదిలీ అయితే, దీని ఫలితంగా ఆర్థిక పురోగతిలో మార్పులు చోటు చేసుకుంటాయి. వ్యవసాయ రంగం సాంకేతికంగా, శాస్త్రీయంగా ఎంత అభివృద్ధి చెందితే, ఆ రంగంలోని మిగులు కార్మికులు అంత వేగంగా ఇతర రంగాలకు బదిలీ చేయబడతారు. ఈ రకమైన వృత్తిపరమైన మార్పు ఆర్థిక వ్యవస్థ పురోగతిని సూచిస్తుంది. 2015-16 ప్రకారం జనాభాలో 55.6% మంది ప్రాథమిక రంగంపై మరియు 17.8% మంది జనాభా వరుసగా ద్వితీయ మరియు సేవా రంగాలపై ఆధారపడి ఉన్నారు.

27.4 తెలంగాణలో మానవ వనరుల అభివృద్ధి

మానవాభివృద్ధి, సామాజిక అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి విడదీయరానివి, ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి. సాధారణంగా, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రక్షిత మంచినీరు, గృహనిర్మాణం (ఆవాసం) ఇవన్నీ సామాజిక రంగంగా పరిగణించబడతాయి. ఇవన్నీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మానవ అభివృద్ధిని సూచిస్తాయి. అంటే సామాజిక రంగం యొక్క అభివృద్ధి మానవ అభివృద్ధి అవుతుంది. ఇప్పుడు మనం తెలంగాణ రాష్ట్రంలో విద్య మరియు ఆరోగ్య రంగాల గురించి చర్చిద్దాం.

27.5. విద్యారంగంలో ప్రభుత్వ పాత్ర

ప్రస్తుత తరాన్ని నైపుణ్యం కలిగిన మరియు సమర్థవంతమైన భవిష్యత్తు శ్రామిక శక్తిగా మార్చడంలో మరియు వారి సంపాదన సామర్థ్యాలను పెంపొందించడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుంది. విద్యలో పెట్టుబడి అనేది పేదరికాన్నితగ్గిస్తూ మానవ అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. మానవ వనరుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఈ క్రింది కార్యక్రమాలను చేపట్టింది.

27.5.1. ఉచిత మరియు నిర్బంధ విద్య (ఆర్.టి.ఇ.) చట్టం, 2009

భారత రాజ్యాంగంలోని 86వ సవరణలో ఆర్టికల్ 21ఎను చేర్చారు, ఇది "6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ప్రభుత్వం చట్టం ద్వారా నిర్ణయించే విధంగా ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించాలి" అని పేర్కొంది. ఉచిత మరియు నిర్బంధ విద్యకు పిల్లల హక్కు (ఆర్.టి.ఇ.) చట్టం 2009, ప్రాథమిక విద్య పూర్తయ్యే వరకు పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్యను తప్పనిసరి చేస్తుంది. విద్య విశ్వజనీనంగా అందుబాటులోకి వచ్చేందుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

27.5.2. పరిశోధనా విద్యా సంస్థలు

పై సంస్థాగత సౌకర్యాలతో పాటు, ఒక్క హైదరాబాద్ లోనే ఫార్మా, డిఫెన్స్ రీసెర్చ్, గ్రామీణాభివృద్ధి మొదలైన వివిధ రంగాలలో 40 ప్రధాన పరిశోధనా విద్యా సంస్థలు ఉన్నాయి. ఈ సంస్థలు వివిధ రంగాల యొక్క పరిశోధన అవసరాలకు దోహదపడటమే కాకుండా, సంబంధిత రంగాలకు అధిక ప్రభావ నిపుణులను కూడా అభివృద్ధి చేస్తాయి.

27.5.3. నాణ్యమైన మౌలిక సదుపాయాలను కల్పించడం

నాణ్యమైన మౌలిక సదుపాయాలు అభ్యసన వాతావరణాన్ని మెరుగు పరుస్తూ మరియు విద్యార్థుల సంఖ్యను పెంచుతుంది. మరియు అభ్యసన ఫలితాలపై సానుకూల ప్రభావాన్ని, భద్రతా భావనను కల్పిస్తుంది. 2019-20 సంవత్సరానికి గాను విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల సదుపాయాలు, లైబ్రరీలు మరియు ప్రత్యేక అవసరాలతో ఉన్న పిల్లల కొరకు ర్యాంప్‌లు వంటి సౌకర్యాలపై తెలంగాణ భారత సగటు కంటే మెరుగ్గా పని చేస్తోంది. రాష్ట్రంలో 2020-21లో, త్రాగు నీటి సౌకర్యాలు ఉన్న పాఠశాలలు, కంప్యూటర్ సౌకర్యాలతో ఉన్న పాఠశాలలు, మరియు ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం మరుగుదొడ్లు (సిడబ్ల్యుఎస్ఎన్) ఉన్న పాఠశాలలు వరుసగా 95.6%, 34.3%, మరియు 6.25% గా ఉన్నాయి, ఇది 2019-20లో వరుసగా 92.45%, 20.81%, మరియు 2.44% గా ఉన్నాయి.

27.5.4. మన ఊరు - మన బడి/ మన బస్తీ- మన బడి పథకం

రూ.7,289.54 కోట్ల ఆమోదంతో మూడేళ్ల కాలానికి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం 2022 జనవరిలో "మన ఊరు - మన బడి/ మన బస్తీ-మన బగా" అనే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించింది. 26,067 ప్రభుత్వ మరియు స్థానిక సంస్థల పాఠశాలలు మరియు 19,84,167 మంది విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారు.

27.5.5. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదును మెరుగుపరచడం

ప్రభుత్వ పాఠశాలల్లో నమోదును మెరుగుపరచడానికి, రాష్ట్రం అనేక కార్యక్రమాలను చేపట్టింది, వీటిలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా మాధ్యమంగా ఆంగ్లాన్ని ప్రవేశపెట్టడం, సమాచార సాంకేతిక నైపుణ్యాలను ప్రవేశపెట్టడం మొదలైనవి ఉన్నాయి.

ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో మొత్తం పాఠశాలల సంఖ్య 2019-20లో 40,900 ఉండగా, 2020-21 నాటికి 41,220కి పెరిగింది. 2021-22లో రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల్లో మొత్తం 60.47 లక్షల మంది పిల్లలు చేరారు. వీరిలో 53.71% మంది ప్రైవేటు పాఠశాలల్లో, 46.29% మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు.

27.5.6. అభ్యసన అవకాశాలను విస్తరించడం

2020-21 విద్యా సంవత్సరంలో, స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (ఎస్.ఐ.ఇ.టి) 2180 డిజిటల్ పాఠాలను అభివృద్ధి చేసి, తెలుగు, ఇంగ్లీష్ మరియు ఉర్దూ మాధ్యమాల్లో డిడి ఛానెళ్ల ద్వారా 3 నుండి 10 వ తరగతి వరకు విద్యార్థుల కొరకు ప్రసారం చేశారు. సగటున 85% మంది విద్యార్థులు ఈ డిజిటల్ పాఠాలను వీక్షించారు.

27.5.7. విద్యా-పరిశ్రమల భాగస్వామ్యం

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విద్యా సంస్థలను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతిభావంతులైన యువతకు మరియు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కావలసిన నైపుణ్యాలను పెంపొందించుకోవడం కోసం పరిశ్రమ - విద్య భాగస్వామ్యాలను చేయడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది. పరిశ్రమలకు సంబంధించిన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్లు (టి.ఎస్.కె.సి), తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) మరియు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్‌లు వంటి వివిధ నైపుణ్య సంస్థలను ఏర్పాటు చేశారు.

27.5.8. తెలంగాణ ఐసిటి విధానం 2021-26

స్థానిక ప్రతిభ ద్వారా 80% శ్రామిక శక్తి అవసరాలను తీర్చే లక్ష్యంతో తెలంగాణ పౌరులకు నైపుణ్యం, రీస్కిల్ మరియు శిక్షణ ఇవ్వడానికి ఇది ప్రయత్నిస్తుంది. దీని కోసం, ప్రభుత్వం ప్రతి సంవత్సరం 5 లక్షల మందికి పైగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి ప్రయత్నిస్తుంది. ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2022 ప్రకారం, తెలంగాణలో అత్యధికంగా మహిళా ఉపాధి అవకాశాలు ఉన్నాయి. కంప్యూటర్ నైపుణ్యాల లభ్యతకు సంబంధించి తెలంగాణ దేశంలో 3వ స్థానంలో నిలిచింది. ఇది రాష్ట్రంలో సానుకూల నియామక ధోరణిని చూపిస్తుంది, ఇది ఉద్యోగ అవకాశాలలో సమాన అవకాశాలు మరియు ప్రాతినిధ్యాన్ని అందిస్తుంది. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి ప్రధాన మార్గాలు వృత్తి విద్య, వృత్తిపరమైన కళాశాలల్లో సాంకేతిక విద్య మరియు పారిశ్రామిక శిక్షణను చేపట్టడం జరిగింది.

27.6. ఆరోగ్య రంగంలో ప్రభుత్వ పాత్ర

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఓ) 'ఆరోగ్యం'ను సంపూర్ణ శారీరక, మానసిక మరియు సామాజిక శ్రేయస్సు యొక్క స్థితిగా నిర్వచిస్తుంది, మరియు కేవలం వ్యాధి లేదా బలహీనత లేకపోవడం మాత్రమే కాదు. అత్యున్నతమైన ఆరోగ్య ప్రమాణాన్ని ఆస్వాదించడం అనేది ప్రతి మనిషి యొక్క ప్రాథమిక హక్కులలో ఒకటి అని ఇది నొక్కి చెబుతుంది. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి జనాభాను ఆరోగ్యంగా ఉంచడంలో రాష్ట్ర జోక్యం యొక్క పాత్రను తెలంగాణ ప్రభుత్వం గుర్తించింది.

1. రాష్ట్రంలో ఆరోగ్య వసతులను మెరుగుపరచడానికి, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన వ్యక్తుల కోసం, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ యొక్క లభ్యత, ప్రాప్యత మరియు స్థోమతను మెరుగుపరచడంపై దృష్టి సారించే అనేక పథకాలను ప్రభుత్వం ప్రారంభించింది. అంతేకాక, "ఆరోగ్య తెలంగాణ" అనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా, మరియు ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై కొత్త విశ్వాసాన్ని నెలకొల్పడానికి, 2021-22లో ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం రూ. 6,295 కోట్ల బడ్జెట్ కేటాయింపు చేసింది. ఇందులో ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడానికి జాతీయ ఆరోగ్య మిషన్ కోసం రూ. 1,010 కోట్లు కేటాయించబడ్డాయి.

2. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ ఆరోగ్య స్థితిగతులను మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం సమిష్టి కృషి చేస్తోంది. దాని ప్రయత్నాల ఫలితం ఇటీవలి నీతి ఆయోగ్ వార్షిక ఆరోగ్య సూచిక, 2019-20 లో రాష్ట్రం యొక్క గణనీయమైన పనితీరులో ప్రతిబింబిస్తుంది. 19 పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం 3వ స్థానంలో నిలవగా, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు వరుసగా మొదటి, రెండు స్థానాల్లో నిలిచాయి.

3. ఆరోగ్య మౌలిక సదుపాయాలను తరచుగా "ఆరోగ్య వ్యవస్థ యొక్క నాడీ కేంద్రం" అని పిలుస్తారు. స్థూలంగా, ఇది సమర్థవంతమైన మరియు అర్హత కలిగిన శ్రామిక శక్తి, తాజా డేటా మరియు సమాచార వ్యవస్థలు, మరియు ప్రజారోగ్య అవసరాలను అంచనా వేయగల మరియు ప్రతిస్పందించే సామర్థ్యాన్ని కలిగి ఉన్న ఏజెన్సీలను కలిగి ఉంది, మరియు ఇది ప్రజారోగ్యం యొక్క ప్రాథమిక బాధ్యతలను చేపట్టడానికి అవసరమైన పునాదిని అందిస్తుంది. 2014-15 నుంచి రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం గణనీయమైన పెట్టుబడులు పెడుతోంది.

4. గచ్చిబౌలి, సనత్‌నగర్, అల్వాల్, దిల్‌సుఖ్‌నగర్‌లో కార్పొరేట్ ఆసుపత్రులతో సమానంగా మౌలిక సదుపాయాలతో నాలుగు తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (టిమ్స్) ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు 2021లో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. వరంగల్‌ను హెల్త్ సిటీగా, మెడికల్ టూరిజం గమ్య స్థానంగా అభివృద్ధి చేయాలనే ప్రణాళికలో భాగంగా 2021లో వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం శంకుస్థాపన చేసి రూ.1,100 కోట్లు మంజూరు చేసింది.

5. 2014-15లో ద్వితీయ శ్రేణి ఆసుపత్రులు (ఎంపిక చేసిన జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, మాతాశిశు ఆరోగ్య ఆసుపత్రులు, అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సివిల్ డిస్పెన్సరీలతో సహా) నిర్వహించడానికి తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) ఏర్పాటు చేయబడింది. ప్రస్తుతం 9,320 పడకలతో 122 టీవీవీపీ ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులు ఎక్కువగా ప్రసూతి మరియు శిశు ఆరోగ్య సేవలతో పాటు సాధారణ వైద్యం, సాధారణ శస్త్రచికిత్స, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఇ.ఎన్.టి. మొదలైన సేవలను అందిస్తాయి.

6. పట్టణ పేదలకు ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం 2018లో 'బస్తీ దావఖానాలు' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. పట్టణ మురికివాడల్లో ఇప్పటి వరకు 256 బస్తీ దావఖానాలు ఏర్పాటు చేయగా, ఒక బస్తీ దవాఖానా 5,000 నుంచి 10,000 మందికి సేవలందిస్తోంది. ఈ కేంద్రాలు ఔట్ పేషెంట్ కన్సల్టేషన్, ఔషధాలు, ప్రాథమిక వ్యాధి నిర్ధారణ మరియు అసాంక్రమిక వ్యాధుల కొరకు పరీక్షలు సహా వివిధ రకాల ఉచిత ఆరోగ్య సేవలను అందిస్తాయి. టెలీమెడిసిన్ ద్వారా బస్తీ దవాఖానాల వద్ద స్పెషలిస్ట్ కన్సల్టేషన్ కూడా అందించబడుతుంది. బస్తీ దవాఖానాలు రోగులకు ప్రయాణ మరియు వేచి ఉండే సమయాన్ని తగ్గిస్తాయి, రోగులకు వైద్యంపై ఆయ్యే ఖర్చును తగ్గిస్తాయి.

7. తరువాత, గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలకు వారి పట్టణ సహచరుల మాదిరిగానే నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి ప్రభుత్వం 'పల్లె దావఖానాలను' ప్రారంభించింది, ఇందులో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటారు. పల్లె దావఖానాలు స్థానిక ప్రజలకు సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తాయి, సాధారణ రుగ్మతలకు మందులను నిల్వ చేస్తాయి మరియు ప్రాథమిక రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి పూర్తి-సన్నద్ధమైన ప్రయోగశాలను కలిగి ఉంటాయి. టెలిమెడిసిన్ సౌకర్యాల ద్వారా స్పెషలిస్ట్ కన్సల్టేషన్ లు కూడా లభ్యం అవుతాయి.

8. ఆరోగ్యశ్రీ పథకం (ఎఎస్) అనేది తెలంగాణలోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అమలు చేయబడుతున్న ఒక ప్రత్యేకమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్య బీమా పథకం. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 87.5 లక్షల కుటుంబాలకు నగదు రహిత మరియు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణకు సమానమైన ప్రాప్యత ద్వారా ఆరోగ్య ఖర్చులను తగ్గించడం ద్వారా సహాయం చేయడమే ఈ పథకం యొక్క లక్ష్యం. ఈ పథకం లబ్దిదారుల కు ప్రతి సంవత్సరం రూ.5 లక్షల వరకు సదుపాయం కల్పిస్తుంది, పెద్ద వ్యాధులకు గాను రూ.10 లక్షల వరకు అదనపు ఆర్థిక సదుపాయం అందిస్తుంది. మే 2021లో, తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని భారత ప్రభుత్వం యొక్క ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఎబిపిఎం-జెఎవై) తో అనుసంధానించింది. సంక్షిప్తంగా, విద్య మరియు ఆరోగ్య రంగాలలో ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవలు రాష్ట్రంలో మానవ వనరులను మెరుగుపరుస్తాయి.

27.7 సారాంశం

మానవ వనరుల అభివృద్ధిలో సమాజంలో వివిధ స్థాయిలలో అభివృద్ధి ఉంటుంది. కమ్యూనిటీ డెవలప్ మెంట్ కు ట్రైనింగ్ మరియు ఆర్గనైజేషన్ డెవలప్ మెంట్ వంటి HRD ప్రయత్నాలు అవసరం అవుతాయి. పౌరులకు అవగాహన కల్పించడానికి మరియు శిక్షణ ఇవ్వడానికి కమ్యూనిటీ డెవలప్మెంట్ ఒక ప్రత్యామ్నాయ మార్గం, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, మార్పులను తీసుకురావడానికి ముందు సాంస్కృతిక విభిన్నతలు, నమ్మకాలు, సంప్రదాయాలు వంటి అనేక అంశాలను మానవాభివృద్ధి అభ్యాసకులు పరిగణనలోకి తీసుకోవాలి. స్వభావ రీత్యా సామాజిక అభివృద్ధి అనేది బహుళ కారకాల అభివృద్ధి, అందువలన కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌ను సముచితంగా అర్థం చేసుకోవడానికి సంకుచిత దృష్టితో సిద్ధాంతాలను ఉపయోగించడం జరిగినది. గత ఐదేళ్లలో సగటు వార్షిక వృద్ధి రేటు 13.90 శాతంతో భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి.

27.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 4-5 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. జనసాంద్రత అంటే ఏమిటి?

2. ప్రాథమిక రంగం అంటే ఏమిటి?

3. బస్తీ దావఖానాలు అంటే ఏమిటి?

III. కింది ప్రశ్నలకు 8-10 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. జనాభా యొక్క వృత్తిపరమైన పంపిణీని వివరించండి.

2. తెలంగాణ రాష్ట్రంలో ఐసిటి పాలసీ 2021-26 గురించి వివరించండి.

III. కింది ప్రశ్నలకు 16-20 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమిటి?

2. ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమిటి?

27.9. పదకోశం

1. అక్షరాస్యత రేటు: అక్షరాస్యత రేటు అనేది 7 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు గల అక్షరాస్యులైన జనాభాను అదే వయస్సు గల మొత్తం జనాభాతో భాగించబడుతుంది.

2. జనసాంద్రత: ఒక చదరపు కిలోమీటర్ల పరిధిలో నివసించే జనాభా సంఖ్యను జనసాంద్రత అంటారు. జనాభాను వైశాల్యం చేత భాగించగా జనసాంద్రతను గణించవచ్చు.

3. టి.ఎస్.కె.సి.: తెలంగాణ కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ కార్యక్రమాన్ని కొత్త ఉత్సాహంతో అనుసరిస్తున్నారు. మునుపటి JKC కేంద్రాలు ఇప్పుడు తెలంగాణ నైపుణ్యాలు మరియు విజ్ఞాన కేంద్రాలుగా పిలువబడుతున్నాయి, వాటి పరిధిని మరియు సామర్థ్యాలను విస్తరించాయి.

4. ఏబీపీఎం-జేఏవై: 2030 నాటికి సార్వజనీన ఆరోగ్య కవరేజీ (UHC) లక్ష్యాన్ని సాధించడంలో దేశానికి సహాయపడటానికి, ఆరోగ్య సంరక్షణ సేవలను పౌరులకు మరింత అందుబాటులో మరియు చౌకగా అందించడానికి భారత ప్రభుత్వం 2018 లో 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని ప్రారంభించింది. మే 2021లో, తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం (AS)ను భారత ప్రభుత్వం యొక్క ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఎబిపిఎం-జెఎవై)తో అనుసంధానించింది.

27.10. ఉపయుక్త గ్రంథాలు

1. వి.కె.మిశ్రా, ఎస్.కె.పూరి రచించిన ఇండియా ఎకానమీ
2. తెలంగాణ సామాజిక, ఆర్థిక దృక్పథం 2022
3. తెలుగు అకాడమీ నుంచి తెలంగాణ ఎకానమీ

అధ్యాయం
28

తెలంగాణ - ఆర్థిక వ్యవస్థ రంగాలు

28.0 లక్ష్యాలు

28.1 పరిచయం

28.2 తెలంగాణ ఆర్థిక వ్యవస్థ రంగాలు

28.3 వ్యవసాయ రంగం

28.3.1 తెలంగాణ వ్యవసాయ ప్రాముఖ్యత

28.3.2 వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలు

28.3.3 వ్యవసాయం – ప్రభుత్వ ప్రోత్సాహక కార్యక్రమాలు

28.3.4 రాష్ట్ర వ్యవసాయ విజన్

28.4 పారిశ్రామిక రంగం

28.4.1 తెలంగాణ పారిశ్రామిక విధానం

28.4.2 పారిశ్రామిక విధానం యొక్క విజన్

28.4.3 తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ మరియు సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్ (TS-IPASS) Act - 2014

28.4.4 తెలంగాణ స్టేట్ ప్రోగ్రామ్ ఫర్ రాపిడ్ ఇంకుబేషన్ దళిత్ ఎంటర్‌ప్రెన్యూర్ (T-PRIDE)

28.4.5 మహిళా పారిశ్రామికవేత్తల హబ్ (We-Hub)

28.4.6 టెక్నాలజీ–హబ్ (T-Hub)

28.4.7 తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ అడ్వాన్స్‌మెంట్ (T-IDEA)

28.5 సేవా రంగం

28.5.1 సేవారంగం యొక్క ముఖ్య ఉప విభాగాలు

28.5.2 సేవారంగంపై ప్రభుత్వ విజన్

28.6 సారాంశం

28.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

28.8 పదకోశం

28.9 ఉపయుక్త గ్రంథాలు

28.0 లక్ష్యాలు

- తెలంగాణ ఆర్థిక వ్యవస్థలోని రంగాల లక్షణాలను వివరిస్తారు
- తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల ప్రాముఖ్యతను గుర్తిస్తారు.
- వ్యవసాయోత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమాలను వివరిస్తారు.
- పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వాల ప్రోత్సాహకాలను వివరిస్తారు.
- సేవారంగాల ఉపరంగాలను వర్గీకరిస్తారు.

28.1 పరిచయం

రాష్ట్ర ఆర్థిక వృద్ధిని కొలవడానికి అత్యంత ముఖ్యమైన సూచిక రాష్ట్ర ఆదాయం లేదా రాష్ట్ర దేశీయ ఉత్పత్తి. నిర్ణీత కాల వ్యవధిలో ఆర్థిక అభివృద్ధి స్థాయిలలో వచ్చిన మార్పుల పరిధి మరియు దిశను ఆర్థిక వ్యవస్థ యొక్క ఈ అంచనాలు వెల్లడిస్తాయి. ఈ అధ్యాయంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక రంగాల గురించి చర్చిస్తాం.

28.2 ఆర్థిక వ్యవస్థ యొక్క రంగాలు

ఆర్థిక కార్యకలాపాలు అని పిలువబడే మానవ కార్యకలాపాల ద్వారా రాష్ట్ర దేశీయ ఉత్పత్తి చేయబడుతుంది. ఈ ఆర్థిక కార్యకలాపాలు ఆర్థిక రంగాలు అని పిలువబడే మూడు విస్తృత రంగాల క్రింద వర్గీకరించబడ్డాయి. ఈ రంగాలు

1. వ్యవసాయరంగం
2. పారిశ్రామికరంగం
3. తృతీయరంగం (సేవల రంగం)



28.3 వ్యవసాయ రంగం

తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. రాష్ట్ర సమ్మిళిత వృద్ధికి వ్యవసాయ రంగంయొక్క మెరుగైన పనితీరు చాలా ముఖ్యమైనది. తెలంగాణ రాష్ట్రం మంచి నేలలు, వైవిధ్యభరితమైన పంటల సరళి మరియు గోదావరి మరియు కృష్ణా వంటి నదుల ద్వారా ప్రధాన నీటిపారుదల వ్యవస్థలతో కూడిన సమృద్ధి వనరులను కలిగి ఉంది. వ్యవసాయం ఒక జీవన విధానం మరియు తెలంగాణ ప్రజల సంస్కృతి మరియు ఆర్థిక జీవితాన్ని తీర్చిదిద్దిన ఒక సంప్రదాయం. తెలంగాణలో వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు స్థూల విలువ జోడింపు (GVA)లో క్రమ క్రమంగా వృద్ధిని సాధించాయి.

28.3.1 తెలంగాణ వ్యవసాయ ప్రాముఖ్యత

తెలంగాణ రాష్ట్రం 276.96 లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంతో భారతదేశంలో 11వ అతి పెద్ద రాష్ట్రం. మొత్తం విస్తీర్ణంలో, 49.07% విస్తీర్ణం నికర విత్తన విస్తీర్ణంలో మరియు 24.07 శాతం అటవీ విస్తీర్ణంలో ఉంది. వ్యవసాయేతర ఉపయోగాలకు పెట్టబడిన భూమి దాదాపు 7.46 శాతం, బీడు భూములు (9.02 శాతం), బంజరు మరియు సాగుచేయలేని భూమి (5.42 శాతం) మరియు మిగిలినవి శాశ్వత పచ్చికబయళ్ళు మరియు ఇతర భూముల క్రింద ఉన్నాయి. 59.72 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో రాష్ట్రంలోని మొత్తం కార్యకలపాల క్రింద ఉన్న కమతలు 59.48 లక్షలు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. స్థూల విత్తన విస్తీర్ణం (GSA) 2014-15లో 131 లక్షల ఎకరాలు కాగా 2021-22 నాటికి 198 లక్షల ఎకరాలకు (51% పెరుగుదల) పెరిగింది. ఈ పెరుగుదల ప్రధానంగా కొత్త నీటిపారుదల ప్రాజెక్టులలో ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు, ఇప్పటికే ఉన్న నీటిపారుదల వ్యవస్థల పునరుద్ధరణ మరియు ప్రభుత్వం అమలు చేసిన క్రమబద్ధమైన సేకరణ యంత్రాంగాల కారణాల వలన జరిగినది.

తెలంగాణ నేలలు మంచి సాగు నీటి పారుదలతో నుండి మధ్యస్తంగా బాగా పారుదలను కలిగివుండి సారవంతమైన నేల నిర్వహణకు అనుకూలమైన వాతావరణాన్ని అందిస్తాయి. ఇక్కడి నేలలు ఆహార ధాన్యాలు, నూనెగింజలు, పప్పుధాన్యాలు, పండ్ల పంటలు, పచ్చికబయళ్ళు, అటవీ తదితర అనేక రకాల పంటలకు అనుకూలం.

28.3.2 వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలు

వ్యవసాయం స్థూల ధోరణులు మరియు దాని అనుబంధ కార్యకలాపాలు రాష్ట్రంలోని చాలా మంది ప్రజల జీవితాలు మరియు జీవనోపాధికి అంతర్భాగంగా ఉన్నాయి. ఆహార భద్రతను నిర్ధారించడంలో ఈ రంగం సాయపడడమే కాకుండా, రాష్ట్రంలోని సగానికి పైగా శ్రామిక శక్తికి జీవనోపాధిని కూడా అందిస్తుంది.

28.3.3 వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వ కార్యక్రమాలు

ఆత్మహత్యలు, అప్పులు, సాగునీటి సౌకర్యం లేమి వంటి గత కాలపు నీడల నుంచి తెలంగాణ త్వరగా బయటపడి రైతుకు ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంతో వ్యవసాయ రంగంలో ఎన్నో కొత్త కార్యక్రమాలను అమలు చేస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలలో కొన్నింటిని తెలుసుకుందాం.

ఎ. భూమి రికార్డుల నవీకరణ కార్యక్రమం – ధరణి

రాష్ట్రంలోని అన్ని మండలాల్లోని అన్ని గ్రామాల్లో భూరికార్డుల ప్రక్షాళన చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమం.

బి. విత్తన ఉత్పత్తి

వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో విత్తనం కీలకమైన అంశం. అందువల్ల, ప్రణాళిక బడ్జెట్‌లో ప్రతిపాదించబడిన ముఖ్యమైన అంశాలలో రైతులకు నాణ్యమైన విత్తన ఉత్పత్తి మరియు సరఫరా ఒకటి, దీని కోసం విత్తనోత్పత్తిని బలోపేతం చేసేందుకు రూ. 50 కోట్లు కేటాయించారు. వివిధ పంటల నాణ్యమైన విత్తనోత్పత్తికి అనుకూలమైన వాతావరణ పరిస్థితులు మరియు నేలలతో రాష్ట్రాన్ని దేశంలోనే "సీడ్ బౌల్"గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం వ్యూహాన్ని రూపొందిస్తోంది.

సి. భూసార పరీక్ష

భూసార పరీక్షల యొక్క ప్రాముఖ్యత మరియు భూసార పరీక్ష డేటా ఆధారంగా ఎరువులను న్యాయబద్ధంగా మరియు సమగ్రంగా ఉపయోగించడం గురించి రైతులకు అవగాహన కల్పించడానికి, తద్వారా సాగు ఖర్చును తగ్గించడానికి సాయిల్ హెల్త్ కార్డ్స్ పథకం అమలు చేయబడుతోంది.

డి. వ్యవసాయ మార్కెటింగ్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, సమగ్ర ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయం ఉత్పత్తి మరియు పశువుల) మార్కెట్ల చట్టం 18.11.1996 నుండి అమల్లోకి వచ్చింది మరియు తెలంగాణా రాష్ట్రానికి కూడా ఇది ఆమోదించబడింది. వ్యవసాయోత్పత్తుల విక్రయాలలో రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం మరియు వారికి లాభదాయకమైన ధర కల్పించడం మరియు దళారి వ్యాపారుల బారి నుండి వారిని రక్షించడం మార్కెట్ చట్టం యొక్క లక్ష్యం.

ఇ. నీటిపారుదల ప్రాజెక్టులు

తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభించబడిన ప్రధాన ప్రాజెక్టులు

1) కాళేశ్వరం ప్రాజెక్టు (18.25 లక్షల ఎకరాలు),
2) సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (3.87 లక్షల ఎకరాలు),
3) జె.చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (5.58 లక్షల ఎకరాలు),
4) రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (2.03 లక్షల ఎకరాలు),
5) మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (4.24 లక్షల ఎకరాలు),
6) జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (2.00 లక్షల ఎకరాలు).

ఎఫ్. రైతుబంధు (పెట్టుబడి మద్దతు)

సాగులో ప్రాథమిక పెట్టుబడి ఖర్చుల కోసం రైతులకు ఆర్థిక మద్దతు యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, ప్రభుత్వం 2018లో రైతుబంధు పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో భూమిని కలిగి ఉన్న రైతులకు సంవత్సరానికి ఎకరానికి రూ.10,000/-. ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది రాష్ట్రంలో భూమిని కలిగి ఉన్న రైతులకు సంవత్సరానికి రెండు విడతలుగా ఇస్తుంది. భూమి పరిమాణంతో సంబంధం లేకుండా భూమి ఉన్న రైతులందరికీ ప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింపజేసింది.

జి. రైతు బీమా

తెలంగాణ ప్రభుత్వం 2018 నుండి రైతులకు ఆర్థిక మరియు సామాజిక భద్రతను నిర్ధారించడానికి, తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగంలోని ఇతర కార్యక్రమాలతో పాటు రైతు సమూహ జీవిత బీమా పథకం (రైతు బీమా) పేరుతో ఒక వినూత్న పథకాన్ని రూపొందించింది అమలు చేస్తోంది. భీమా నమోదు చేసుకున్న రైతు సహజ మరణంతో సహా ఏదైనా కారణం వల్ల మరణించిన సందర్భంలో, రూ.5.00 లక్షల బీమా మొత్తం 10 రోజుల్లోగా నియమించబడిన నామినీ ఖాతాలో జమ చేయబడుతుంది.

హెచ్. వ్యవసాయానికి ఉచిత విద్యుత్

2018 జనవరి 1 నుంచి రాష్ట్రంలోని వ్యవసాయ వినియోగదారులకు ప్రభుత్వం 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందజేస్తోంది. రాష్ట్రం ఏర్పడక ముందు 1,500 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండగా, ప్రస్తుతం 3,500 మెగావాట్లకు పెరిగింది.

28.3.4 రాష్ట్ర వ్యవసాయ విజన్

తెలంగాణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఒక విజన్‌ను రూపొందించింది. ఈ విజన్ యొక్క ప్రధాన లక్ష్యాలు:

- రైతులకు విత్తన సాధికారత కల్పించడం.
- వ్యవసాయాన్ని వాణిజ్య పరంగా లాభదాయకమైన ప్రయత్నంగా చేయడం.
- ఉత్పాదకాలు, పెట్టుబడి, సాంకేతికత మరియు IT సులభంగా అందుబాటులో ఉంచడం.
- అందుబాటులో ఉన్న ఉపరితల మరియు భూగర్భ జలాల సామర్థ్యాన్ని ఉపయోగించడం ద్వారా సాగు నీటి ప్రాంతాన్నిపెంచడం.
- సమర్ధవంతమైన నేల మరియు నీటి నిర్వహణ కోసం భూమి అభివృద్ధికి మార్గాలను అందించడం.
- రైతుల ఇంటి వద్దకే సాంకేతికత బదిలీ కోసం శిక్షణ పొందిన విస్తరణ సిబ్బందిని అందించడం.

28.4 పారిశ్రామిక రంగం

తెలంగాణ రాష్ట్రం భారీ ఉత్పాదక పరిశ్రమలకు నిలయం. బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, ఆగ్రో ప్రాసెసింగ్, సిమెంట్ మరియు మినరల్ ఆధారిత పరిశ్రమలు, టెక్స్‌టైల్స్ మరియు అపెరల్స్, హార్టికల్చర్ మరియు పౌల్ట్రీ ప్రస్తుతం తెలంగాణలో ఉన్న ప్రధాన పరిశ్రమలు. రాష్ట్రం దేశంలోని ప్రధాన పారిశ్రామిక రాష్ట్రాలలో ఒకటి మరియు పరిశ్రమల పరంగా 6వ స్థానంలో ఉంది మరియు పరిశ్రమల నుండి జోడించిన స్థూల విలువ పరంగా 8వ స్థానంలో ఉంది. తెలంగాణలో కూడా పరిశ్రమల రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మరియు గణనీయమైన జీవనోపాధి అవకాశాలను కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

28.4.1. తెలంగాణ పారిశ్రామిక విధానం

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక విధానం ఈ క్రింది కొన్ని ప్రధాన విలువలతో కూడుకొని ఉంది:

1. క్రమబద్ధమైన ప్రభుత్వ నియంత్రణ పారిశ్రామిక వృద్ధిని సులభతరం చేస్తుంది.
2. శాంతియుత, సురక్షితమైన మరియు ప్రగతిశీల వ్యాపార నియంత్రణ వాతావరణంలో వ్యాపారవేత్తలు అభివృద్ధి చెందడం.
3. పారిశ్రామిక అభివృద్ధి, స్థానిక యువతకు ప్రయోజనం చేకూర్చే విధంగా భారీ ఉద్యోగాల సృష్టికి దారి తీస్తుంది.
4. పారిశ్రామికీకరణ అనేది అందరినీ కలుపుకొని ఉంటూ మరియు సామాజిక సమానత్వాన్ని సులభతరం చేస్తుంది.
5. పారిశ్రామికీకరణ ప్రయోజనాలు రాష్ట్రంలోని ఉపాంత మరియు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చేరాలి.
6. పర్యావరణం రక్షించబడుట మరియు అధిక కాలుష్యతను కలిగించే ప్రభావాలను తగ్గించడమే తెలంగాణ పారిశ్రామిక విధానం.

28.4.2 పారిశ్రామిక విధానం యొక్క విజన్

తెలంగాణ పారిశ్రామికీకరణ దార్శనికత "నూతన ఆవిష్కరణ కోసం పరిశోధన, పరిశ్రమలకు ఆవిష్కరణ శ్రేయస్సు కోసం పరిశ్రమ". పారిశ్రామిక విధాన ముసాయిదా "తెలంగాణలో–ఇన్నోవేట్, ఇంక్యుబేట్, ఇన్‌కార్పొరేట్" అనే నినాదంతో నడపబడుతుంది. పాలసీ విధాన ముసాయిదా వ్యాపార నియంత్రణ వాతావరణాన్ని అందించడానికి ఉద్దేశించింది, ఇక్కడ వ్యాపారం చేయడం కరచాలనం చేసినంత సులభం. నూతన ఆవిష్కరణలు మరియు టెక్నాలజీ రాష్ట్రంలోని పరిశ్రమలను ముందుకు నడిపిస్తున్నాయి.

28.4.3 తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ మరియు సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్ (TS-iPASS) చట్టం 2014

తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన వివిధ అనుమతుల కోసం, పారిశ్రామికవేత్త అందించిన స్వీయ-ధృవీకరణ పత్రం ఆధారంగా ఒకే పాయింట్‌లో దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించడం మరియు పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం కోసం తెలంగాణ ప్రభుత్వం "తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ మరియు సెల్ఫ్-సర్టిఫికేషన్ సిస్టమ్ (TS-iPASS) చట్టం, 2014"ను రూపొందించింది.

TS-iPASS యొక్క ప్రధాన లక్షణాలు:

- సంస్థల స్థాపన మరియు నిర్వహణ కోసం అనుసంధానించబడిన అన్ని విభాగాలు TS-iPASS పరిధిలోకి తీసుకురాబడినవి.
- ప్రతి ధరఖాస్తు ఆమోదానికి 1 రోజు నుండి గరిష్టంగా 30 రోజుల ఆమోదం యొక్క సంక్లిష్టతపై ఆధారపడి కాల పరిమితులు నిర్దేశించబడినవి.
- దరఖాస్తులను సక్రమంగా సమర్పించడంలో వ్యవస్థాపకులకు సహాయం చేయడానికి మరియు శాఖల ద్వారా దరఖాస్తుల పరిశీలనలో జాప్యాన్ని నివారించడానికి రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయిలో దరఖాస్తుల ముందస్తు పరిశీలన జరుగుతుంది.
- ఏదైనా అవసరమైన కొరత/అదనపు సమాచారం పొందడం తప్పనిసరి అయినపుడు దరఖాస్తు అందినప్పటి నుండి మూడు రోజులలోపు సంబందిత అధికారులకు వాటిని కోరవచ్చు.
- TS-iPASS కింద క్లియరెన్స్‌లు పొందే హక్కుతో వ్యవస్థాపకులకు సాధికారత కల్పించడం, కాలపరిమితి లోపు క్లియరెన్స్ పొందడంలో జాప్యానికి గల కారణాలను తెలుసుకోవడానికి మరియు ఆలస్యానికి కారణమైన అధికారులకు జరిమానా విధించడం.

28.4.4 తెలంగాణ రాష్ట్ర దళిత పారిశ్రామిక వేత్తల వేగవంతమైన వృద్ధి కోసం కార్యక్రమం

Telangana State Program for Rapid Incubation Dalit Entrepreneurs (T-PRIDE)

రాపిడ్ ఇంక్యుబేషన్ దళిత ఎంటర్‌ప్రెన్యూర్స్ కోసం తెలంగాణ రాష్ట్ర కార్యక్రమం (T-PRIDE) T-PRIDE ప్రత్యేకంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మహిళలు మరియు ప్రత్యేక సామర్థ్యం గల వ్యక్తుల (SAP) నుండి పారిశ్రామికవేత్తల ప్రాతినిధ్యాన్ని పెంచడం ద్వారా పారిశ్రామిక రంగాన్ని మరింత సమానత్వంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది.

28.4.5 మహిళా పారిశ్రామికవేత్తల హబ్ (We-Hub)

We-హబ్ అనేది తెలంగాణాలో మహిళా వ్యవస్థాపకతను పెంపొందించడంలో సహాయపడటానికి 2017లో స్థాపించబడిన రాష్ట్ర-నేతృత్వంలోని ఇంక్యుబేటర్. ఇది రాష్ట్రంలోని కొత్త మహిళా పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్ సౌకర్యాలు, ప్రభుత్వ అందుబాటు మరియు ప్రపంచ వ్యాప్తంగా తమతో కలసి పని చేయదలచుకునే సహకారుల నెట్‌వర్క్‌ను అందిస్తుంది.

28.4.6 టెక్నాలజీ-హబ్ (T-హబ్)

తెలంగాణలో పారిశ్రామిక వృద్ధికి నూతన ఆవిష్కరణలు మరియు టెక్నాలజీ ప్రధాన చోదకాలుగా పరిగణించబడుతున్నాయి. ప్రస్తుతం, రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్, ఫిన్‌టెక్, అగ్రిటెక్, డిజిటల్ మొదలైన వివిధ రంగాలపై నిర్దిష్ట దృష్టితో 78 ఇంక్యుబేటర్లు, యాక్సిలరేటర్లు మరియు కో-వర్కింగ్ స్పేస్‌లు ఉన్నాయి. రాష్ట్ర ఇన్నోవేషన్ విధానం మరియు స్టార్టప్‌లకు అందించిన ప్రోత్సాహకాలు రాష్ట్రాన్ని అనేక అభివృద్ధి చెందుతున్న అంకుర సంస్థలకు ప్రధాన కేంద్రంగా మార్చాయి మరియు వాటిలో కొన్ని జాతీయ ప్రాముఖ్యతను పొందాయి.

28.4.7 తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ అడ్వాన్స్‌మెంట్ (T-IDEA)

T-IDEA కింద స్టాంప్ డ్యూటీ, పవర్ ఖర్చు, వడ్డీ మరియు పెట్టుబడి రాయితీలు, మూలధన సహాయం తిరిగి చెల్లించడం ద్వారా మరియు నాణ్యత నియంత్రణ మరియు పేటెంట్ నమోదుకు మద్దతును అందించడం ద్వారా పరిశ్రమల స్థాపన కోసం రాష్ట్రం వ్యవస్థాపకులకు ప్రోత్సాహకాలను అందిస్తుంది.

28.5 సేవా రంగం

ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అతిపెద్ద రంగం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో సేవా రంగం ప్రబలమైన రంగం. సేవల రంగంలో వాణిజ్యం, మరమ్మతులు, హోటళ్లు మరియు రెస్టారెంట్లు, రవాణా, నిల్వ, కమ్యూనికేషన్, ప్రసారం, రవాణా, ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్ మరియు ఇతరాలు ఉన్నాయి. విద్యుదీకరణ, కమ్యూనికేషన్, రవాణా, బ్యాంకింగ్ మొదలైన వాటిలో మెరుగుదలద్వారా పారిశ్రామిక మరియు వ్యవసాయ రంగాల వృద్ధికి సేవల రంగం చాలా కీలకం. సేవలు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ మరియు విద్యను పొందడం ద్వారా మొత్తం జీవన నాణ్యత మెరుగవుతుంది. అదనంగా, ఈ రంగం మొత్తం శ్రామికశక్తిలో మూడింట ఒక వంతు మందికి ఉపాధి కల్పిస్తుంది. రాష్ట్రంలో ఉత్పత్తి, వృద్ధి మరియు ఉద్యోగాలకు సేవల రంగం కీలకమైన వనరుగా ఉంది

మరియు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోకి గణనీయమైన మొత్తంలో విదేశీ మూలధనాన్ని తీసుకువచ్చింది. గత ఏడు సంవత్సరాల్లో, తెలంగాణలోనిసేవల రంగం మరియు ఇతర సంబంధిత రంగాల వృద్ధి చెందాటానికి విజ్ఞానం మరియు సమాచారంపై పెట్టుబడులు మరియు వేగవంతమైన సాంకేతిక పురోగతి దోహదం చేశాయి.

28.5.1. సేవల యొక్క ముఖ్య ఉప విభాగాలు

1. సమాచార సాంకేతిక రంగం: తెలంగాణ రాష్ట్రం సమాచార సాంకేతికతలో చాలా ప్రసిద్ధి పొందినది. ఈ రంగంలో బలమైన ఉనికి కారణంగా ఇది భారతదేశ సైబరాబాద్‌గా గుర్తించబడింది. హైదరాబాద్ మరియు చుట్టుప్రక్కల ప్రధానమైన ఐ.టి. సంస్థలు, ఐ.టి. పార్కులు నెలకొల్పబడ్డాయి. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఐ.టి. కన్సల్టెన్సీ, బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ (బి.పి.ఓ.) వంటి సమాచార, సాంకేతిక రంగంలోని భాగాలు. ఇది రాష్ట్ర ఐ.టి.హబ్‌గా పని చేస్తుంది.

2. ఆతిథ్యం మరియు పర్యాటయం: తెలంగాణ గొప్ప సంస్కృతి మరియు చారిత్రక వారసత్వాన్ని కలిగి ఉంది. ఇక్కడ చార్మినార్, గోల్కొండ, రామోజీ ఫిల్మ్ సిటీ, యునెస్కో గుర్తించిన రామప్ప దేవాలయం వంటి చూడదగిన ప్రదేశాలు అనేకం కలవు. పెరుగుతున్న పర్యాటకులకు అనుగుణంగా పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి, మౌలిక సదుపాయాలను కల్పించడానికి రాష్ట్రం పెట్టుబడులు పెడుతోంది. హోటళ్ళు, రిసార్టులు, ట్రావెల్ ఏజెన్సీలు మొదలైనవి దీనిలో భాగం.

3. ఆరోగ్య సేవలు: తెలంగాణ అనేక ఆస్పత్రులను వైద్య సంస్థలను కలిగి ప్రసిద్ధి పొందిన ఆరోగ్య సంరక్షణ సేలను కలిగి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలతో పాటు వైద్య కళాశాలలు మరియు పరిశోధనా సంస్థలతో పెట్టుబడులు పెడుతోంది. ఈ ఉప విభాగంలో వైద్య పర్యాటకం (మెడికల్ టూరిజం) ఫార్మాసూటకల్ కంపెనీలు. ఆరోగ్య సంరక్షణ సేవలు అందించే సంస్థలు కూడా ఉంటాయి.

4. రవాణా: తెలంగాణ రోడ్డు రైలు మరియు విమాన అనుసంధానంతో సహా భాగం అభివృద్ధి చెందిన రవాణా వ్యవస్థను కలిగి ఉంది. ఈ ఉప విభాగంలో ప్రజా రవాణా, సరుకు రవాణా, కొరియర్ సేవలు మరియు వేర్‌హౌసింగ్‌లు కలిగి ఉండి చాలా మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది.

5. ఆర్థిక సేవలు: తెలంగాణ అనేక బ్యాంకులు, బీమా కంపెనీలు ఇతర ఆర్థిక సంస్థలకు ప్రసిద్ధిగాంచింది. ఈ రంగంలో స్టాక్ బ్రోకింగ్, పెట్టుబడి సలహా సేవలు మరియు ఆర్థిక సలహాలు ఉంటాయి.

28.5.2 సేవారంగంపై ప్రభుత్వ విజన్

గ్రామీణ ప్రాంతాల్లో ఆధిపత్యం చెలాయించే వ్యవసాయం వంటి ఇతర రంగాలతో సేవా రంగంలోని ఆవిష్కరణలను ఏకీకృతం చేయడానికి మరియు ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో దృష్టి కేంద్రీకరించిన IT/ ITeSలో ఆవిష్కరణల నుండి ప్రయోజనం పొందేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉంది.

సేవారంగం అన్ని రంగాలలో అత్యధిక ఉపాధి కల్పనను కలిగి ఉంది. సేవా రంగ వృద్ధిలో సాంకేతికత యొక్క ప్రధాన పాత్రను గుర్తిస్తూ, T-Hub, Y-Hub, WE-Hub, TSIC వంటి కార్యక్రమాల ద్వారా సంస్థలకు, ముఖ్యంగా స్టార్టప్‌లకు సంస్థాగత మద్దతు ద్వారా ప్రస్తుత సామర్థ్యాన్ని భర్తీ చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. T-వర్క్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ మరియు డ్రోన్ టెక్నాలజీల వినియోగాన్ని కూడా ప్రభుత్వం చురుకుగా ప్రోత్సహిస్తోంది. గ్రేటర్ క్రాస్ సెక్టోరల్ ఇంటిగ్రేషన్‌ను ప్రోత్సహించడానికి, ప్రభుత్వం T-ఫైబర్ మరియు అధిక-నాణ్యత రహదారి నెట్‌వర్క్ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. కలిసి చూస్తే, ఈ కార్యక్రమాలు ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి, రంగాలలో ఉత్పాదకతను పెంపొందించడానికి మరియు బలమైన ఉపాధిని సృష్టించడానికి సహాయపడతాయి.

28.6 సారాంశం

వ్యవసాయం ఒక జీవన విధానం, తెలంగాణ ప్రజల సంస్కృతి మరియు ఆర్థిక జీవితాన్ని తీర్చిదిద్దిన సంప్రదాయం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది మరియు సమ్మిళిత వృద్ధికి ఈ రంగం యొక్క మెరుగైన పనితీరు చాలా ముఖ్యమైనది. తెలంగాణ రాష్ట్రం భారీ ఉత్పాదక పరిశ్రమలకు నిలయం.

రాష్ట్రం దేశంలోని ప్రధాన పారిశ్రామిక రాష్ట్రాలలో ఒకటి మరియు పరిశ్రమల పరంగా 6వ స్థానంలో ఉంది మరియు పరిశ్రమల నుండి జోడించిన స్థూల విలువ పరంగా 8వ స్థానంలో ఉంది. తెలంగాణలోనూ పరిశ్రమల రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మరియు జీవనోపాధి అవకాశాలను కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. దేశంలో పారిశ్రామిక అనుమతులు పొందే హక్కును కల్పించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఉత్పత్తి మరియు ఎగుమతుల పరంగా దేశంలోనే IT మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ సర్వీసెస్ (ITeS)లో రాష్ట్రం ప్రముఖ స్థానాన్ని కలిగి ఉంది. ఐటీ రంగంలో సాంకేతికతలో వేగవంతమైన మార్పులు కొత్త అవకాశాలకు దారితీశాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ ఐటీ హబ్‌లలో ఒకటిగా గుర్తింపు పొందింది.

28.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ఆర్థిక వ్యవస్థ యొక్క రంగాలను పేర్కొనండి మరియు ప్రతి రంగానికి ఒక ఉదాహరణ ఇవ్వండి.
2. ధరణి కార్యక్రమం అంటే ఏమిటి?
3. టి-ప్రైడ్ (T-PRIDE) గురించి వ్రాయండి.
4. సేవా రంగాల ఉప రంగాలను వ్రాయండి.

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం చేపట్టిన ఏవైనా 2 కార్యక్రమాల గురించి వ్రాయండి.
2. తెలంగాణ పారిశ్రామిక విధానం మరియు విజన్ గురించి రాయండి
3. TS-iPASS యొక్క ప్రధాన లక్షణాలు ఏమిటి?

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించండి.
2. తెలంగాణ పారిశ్రామిక విధానంలో ముఖ్యమైన కార్యక్రమాలను వివరించండి.
3. తెలంగాణలో సేవారంగ ప్రాముఖ్యతను వివరించండి.

28.8 పదకోశం

- ప్రాథమిక రంగం: పంటల పెంపకం, చేపలు పట్టడం, అటవీ మరియు మైనింగ్ వంటి వాటిని వ్యవసాయ రంగం అంటారు.
- తృతీయ రంగం: సేవా రంగం, తృతీయ రంగం అని కూడా పిలుస్తారు. ఇది మూడు రంగాల ఆర్థిక వ్యవస్థలో మూడవ శ్రేణి.
- రైతు బంధు: వ్యవసాయంలో ప్రాథమిక ఇన్‌పుట్‌ల కోసం తెలంగాణలోని రైతులకు ఆర్థిక మద్దతు.
- TS-iPASS: సింగిల్ విండో సర్టిఫికేషన్ సర్వీస్.
- T-Hub: తెలంగాణను ప్రపంచంలోనే స్టార్టప్ గమ్యస్థానంగా నిర్మించడంలో ఉత్ప్రేరకంగా ఉండాలనే లక్ష్యంతో ఉంది.

28.9. ఉపయుక్త గ్రంథాలు

1. TSBIE, ఎకనామిక్స్ పాఠ్య పుస్తకం రెండవ సంవత్సరం.
2. తెలంగాణ సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్.

అధ్యాయం

29

తెలంగాణ బడ్జెట్

29.0. లక్ష్యాలు

29.1. పరిచయం

29.2. బడ్జెట్ అర్థం మరియు నిర్వచనం

29.3. బడ్జెట్ వర్గీకరణ

29.4. తెలంగాణ బడ్జెట్ 2023-24

29.5. రెవెన్యూ ఖాతా, రాబడి మరియు వ్యయం

29.6. రెవెన్యూ వ్యయం

29.7. సారాంశం

29.8. మాదిరి పరీక్ష ప్రశ్నలు

29.9. పదకోశం

29.10. ఉపయుక్త గ్రంథాలు

29.0. లక్ష్యాలు

- బడ్జెట్ నిర్వచనం మరియు లక్షణాలు
- బడ్జెట్ వర్గీకరణ
- తెలంగాణ బడ్జెట్ 2023-24
- బడ్జెట్ యొక్క రాబడి ఖాతా మరియు రాబడులు
- రాబడి, వ్యయం మరియు ఋణం

29.1. పరిచయం

బడ్జెట్ అనేది కేవలం సాంకేతిక ఆర్థిక పత్రం కాదు. ఇది ఆర్థికవేత్తలకు, సాధారణ పౌరులకు సాధికారత చేకూర్చే శక్తివంతమైన సాధనం. బడ్జెట్ అనే పదం బోగెట్ అనే ఫ్రెంచ్ పదం నుండి ఉద్భవించింది. దీని అర్థం ఒక చిన్న తోలు సంచి. ఇది మొట్టమొదట ఇంగ్లాండ్ దేశంలో ఖజానా న్యాయస్థానం యొక్క ముద్రను కలిగి ఉన్న తెల్లటి తోలు సంచిని కలిగి ఉన్నది.

29.2. బడ్జెట్ : అర్థం మరియు నిర్వచనం

ప్రభుత్వ బడ్జెట్ ఒక ఆర్థిక ప్రణాళిక, సాధారణంగా ఒక సంవత్సరం పాటు ఆదాయ, వ్యయాలను తెలిపేది. సాధారణంగా ప్రభుత్వ ఆర్థిక, సామాజిక లక్ష్యాలను సాధించడానికి ఒక సంవత్సరపు కాలానికి సంబంధించిన ఆదాయ మరియు వ్యయ ప్రణాళిక.

బడ్జెట్ యొక్క ప్రధాన లక్షణాలు

- ఇది ఒక భవిష్యత్ ప్రణాళిక
- దీనికి కేవలం ప్రాథమిక ప్రతిపాదనగా పరిగణించకూడదు. ఇది ఒక కార్యాచరణ ప్రణాళిక.
- బడ్జెట్‌లో చేర్చబడిన అంశాలు కేవలం అంచనాలు మాత్రమే.
- ఇది ఒక సమగ్రమైన ప్రణాళిక
- ఇది సాధారణంగా వార్షిక ప్రణాళిక
- ఇది కార్యనిర్వాహక వర్గం తరపున ప్రతి సంవత్సరం సమర్పించబడుతుంది.
- ఓటు వేయడానికి శాసనసభ ముందు ఉంచబడుతుంది.

29.3. బడ్జెట్ వర్గీకరణ

ప్రభుత్వ బడ్జెట్ అనేది దాని విధుల ఆధారంగా వర్గీకరించబడింది.

సమతుల్య బడ్జెట్: ప్రతిపాదిత వ్యయం మరియు ఊహించిన రాబడి రెండూ సమానంగా ఉన్నప్పుడు బడ్జెట్ సమతుల్యంగా ఉంటుంది. సమతుల్య బడ్జెట్‌లో లోటు కాని, మిగులు కాని ఉండదు. బడ్జెట్‌ను రూపొందించేటప్పుడు సమతుల్య బడ్జెట్‌ను కలిగి ఉండడానికి ప్రయత్నం చేయాలి.

అసమతుల్య బడ్జెట్: ప్రభుత్వం ప్రతిపాదించిన వ్యయం మరియు ఆశించిన ఆదాయం సమానంగా లేవని బడ్జెట్ చూపినపుడు అది సమతుల్య బడ్జెట్ అని చెప్పబడుతుంది. అసమతుల్య బడ్జెట్‌లో ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా ఉంటుంది.

రెవెన్యూ బడ్జెట్: రెవెన్యూ బడ్జెట్‌లో ప్రభుత్వ రాబడి (ఆదాయం) మరియు వ్యయం ఉంటుంది. ఈ రాబడి నుండి ఖర్చు అవుతుంది. పన్ను ఆదాయం అనేది కేంద్ర ప్రభుత్వం విధించిన పన్నులు మరియు ఇతర సుంకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని కలిగి ఉంటుంది. ప్రభుత్వం యొక్క ఇతర ఆదాయాలు ప్రధానంగా ప్రభుత్వం చేసిన పెట్టుబడులపై వడ్డీ మరియు డివిడెండ్‌లు వారు అందించే సేవలకు చెల్లించే రుసుము మొదలైనవి ఉంటాయి.

మూలధన బడ్జెట్: మూలధన బడ్జెట్‌లో మూలధన రాబడి మరియు చెల్లింపులు ఉంటాయి. మూలధన రాబడుల యొక్క ప్రధాన అంశాలు. ఇవి ప్రభుత్వ మూలధన వ్యయం నుండి ప్రభుత్వం సేకరించిన సుంకాలతో పాటుగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు మంజూరు చేసిన సుంకాల అడ్వాన్స్‌లు, మూలధన బడ్జెట్‌లో, ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లు, ఇతర రకాల సంస్థలను కూడా చేర్చబడ్డాయి.

మిగులు బడ్జెట్: ప్రభుత్వ ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా ఉంటే, దానిని మిగులు బడ్జెట్ అంటారు. మిగులు బడ్జెట్ అనేది ప్రభుత్వం యొక్క బాధ్యతలను తగ్గిస్తుంది.

మధ్యంతర బడ్జెట్: ఇది 12 నెలల కంటే తక్కువ సమయం ఉండే బడ్జెట్. ఇది మధ్యంతర కాలానికి సిద్ధం చేయబడుతుంది. పూర్తి సంవత్సరానికి బడ్జెట్‌ను తయారు చేయడంలో జాప్యం జరిగినట్లయితే మధ్యంతర బడ్జెట్‌ను మధ్యలో ఖర్చు చేయడానికి వీలుగా తయారు చేస్తారు.

సాధారణ బడ్జెట్: ఒక సంవత్సరం సాధారణ పరిస్థితుల్లో తయారు చేయబడింది. ఇది సాధారణ సమయంలో తయారు చేయబడుతుంది.

లోటు బడ్జెట్: ప్రతిపాదిత వ్యయం అనేది ఊహించిన ఆదాయాన్ని మించిపోయినప్పుడు లోటు బడ్జెట్ ఏర్పడుతుంది. ప్రణాళిక ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం అభివృద్ధి వ్యయానికి అనుగుణంగా లోటు బడ్జెట్‌ను తయారు చేస్తుంది. ఈ బడ్జెట్ ప్రభుత్వం యొక్క బాధ్యతను పెంచుతుంది. ఈ బడ్జెట్ వలన ప్రజలకు చాలా లాభదాయకం.

అనుబంధ బడ్జెట్: సాధారణ బడ్జెట్ సమయంలో ఖర్చు ఆదాయాన్ని మంచి ఉంటే లేదా సాధారణ బడ్జెట్‌తో ఎటువంటి కేటాయింపులు చేయని నిర్దిష్ట ప్రాజెక్టులపై ప్రభుత్వం ఖర్చు చేయవలసి వస్తే, ఈ అదనపు అవసరాలను తీర్చడానికి ఈ అనుబంధ బడ్జెట్‌ను రూపొందిస్తారు.

అత్యవసర బడ్జెట్: యుద్ధం, ప్రకృతి వైపరీత్యాలు లాంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనుటకు సిద్ధం చేయబడిన బడ్జెట్‌ను అత్యవసర బడ్జెట్ అని అంటారు.

29.4. తెలంగాణ బడ్జెట్ 2023-24

				కోట్లలో
వివరాలు	Accounts 2021-22	BE 2022-23	RE 2022-23	BE 2023-24
(1)	*(2)*	*(3)*	*(4)*	*(5)*
I ప్రారంభ నిల్వ	**-5.67**	**-111.34**	**63.83**	**336.86**
II రెవెన్యూ వసూళ్ళు	**1,27,468.59**	**1,93,029.40**	**1,75,802.18**	**2,16,566.97**
1 కేంద్ర పన్నుల్లో వాటా	18,720.54	18,394.11	19,668.15	21,470.84
2 పన్ను రాబడి	91,271.38	1,08,211.93	1,10,592.28	1,31,028.65
3 పన్నేతర రాబడి	8,857.42	25,421.63	15,291.53	22,808.31
4 గ్రాంట్స్ ఇన్ ఎయిడ్	8,619.26	41,001.73	30,250.22	41,259.17
III మూలధన వసూళ్ళు	**55,598.70**	**63,832.37**	**54,582.37**	**55,277.68**
5 బహిరంగ మార్కెట్ రుణాలు	45,716.00	53,970.00	44,970.00	40,615.68
6 ఫ్లోటింగ్ అప్పు (నికర)	0.00	0.00	0.00	0.00
7 భారత ప్రభుత్వం నుండి రుణాలు	214.14	4,102.00	3,852.00	4,102.00
8 ఇతర రుణాలు	1,278.53	1,500.00	1,500.00	1,500.00
9 డిపాజిట్లు, లావాదేవీలు మొ॥వి (నికర)	3,772.89	4,200.37	4,200.37	4,000.00
10 లోన్లు & అడ్వాన్సులు	47.70	60.00	60.00	5,060.00
11 ఇతర రాబడులు	4,569.49	0	0	0
12 ఆగంతుక నిధి (నికర)	-0.05	0.00	0.00	0.00
13 అంతర్ రాష్ట్ర పరిష్కారం (సెటిల్మెంట్)	0.00	0.00	7,500.00	17,828.00
IV మొత్తం వసూళ్ళు (II+III+13)	**1,83,067.29**	**2,56,861.77**	**2,37,884.55**	**2,89,672.65**
V రెవెన్యూ వ్యయం	**1,36,803.43**	**1,89,274.82**	**1,72,822.25**	**2,11,685.23**
14 Of which Interest Payments	19,161.41	18,911.88	18,911.88	22,407.67
VI మూలధన వ్యయం	**28,874.35**	**29,728.44**	**26,934.02**	**37,524.70**
VII లోన్లు & అడ్వాన్సులు	**8,469.41**	**26,253.36**	**26,253.36**	**28,479.98**
VIII మూలధన పంపిణీలు (15 to 18)	**8,850.60**	**11,601.90**	**11,601.90**	**12,606.09**
15 ప్రభుత్వ రుణ తిరిగి చెల్లింపు	6,460.42	8,336.00	8,336.00	9,341.17
16 కేంద్ర ప్రభుత్వం నుండి రుణాలు	509.92	367.94	367.94	427.16
17 ఇతర రుణాలు	1,872.09	2,897.96	2,897.96	2,837.76
18 అంతర్ రాష్ట్ర పరిష్కారం	8.18	0.00	0.00	0.00
IX మొత్తం వ్యయం	**1,82,997.80**	**2,56,858.51**	**2,37,611.52**	**2,90,296.00**
X మొత్తం లావాదేవీలు (IV–IX)	**69.50**	**3.26**	**273.03**	**-623.35**
XI ముగింపు నిల్వ (I + X)	**63.83**	**-108.08**	**336.86**	**-286.49**
XII రెవెన్యూ మిగులు (II – V)	**-9,334.84**	**3,754.58**	**2,979.93**	**4,881.74**
XIII ద్రవ్య లోటు (XII - VI - VII + 10 -13 -18)	**46,639.09**	**52,167.21**	**42,647.44**	**38,234.94**
XIV ప్రాథమిక లోటు (XIII - 14)	**27,477.67**	**33,255.33**	**23,735.56**	**15,827.27**

• **Accounts = లెక్కలు; BE = బడ్జెట్ అంచనాలు; RE = సవరించిన అంచనాలు**

వనరు: 1. తెలంగాణ బడ్జెట్ 2023–24

2. సోషియో ఎకానమిక్ ఔట్‌లుక్, తెలంగాణ 2023

29.5. తెలంగాణ బడ్జెట్ 2023-24

2023-24 సంవత్సరంలో రెవెన్యూ ఖాతాపై 2,16,566.97 కోట్లుగా అంచనా వేయబడ్డాయి. వ్యయం 2,11,685.23 కోట్లుగా అంచనా వేశారు. రెవెన్యూ మిగులు 4,881.74 కోట్లు.

పట్టిక-2			(కోట్లలో)
అంశాలు	ఖాతాలు 2021-22	సవరించిన అంచనాలు 2022-23	బడ్జెట్ అంచనాలు 2023-24
(1)	*(2)*	*(3)*	*(4)*
రెవెన్యూ రాబడులు	**1,27,468.59**	**1,75,802.18**	**2,16,566.97**
రెవెన్యూ వ్యయం	**1,36,803.43**	**1,72,822.25**	**2,11,685.23**
మిగులు	-9,334.84	2,979.93	4,881.74

తెలంగాణ రెవెన్యూ మరియు వ్యయం

పట్టిక-3			కోట్లలో
రాబడులు		వ్యయం	
పన్నులు, సుంకాలు		అభివృద్ధి వ్యయం	**1,61,467.03**
కేంద్ర పన్నులో రాష్ట్ర వాటా	**21,470.84**	రుణ సేవలు	**22,412.67**
రాష్ట్ర పన్నులు, సుంకాలు	**1,31,028.65**	పరిపాలన సేవలు	**12,367.44**
పన్నేతర రాబడి		పన్ను వసూలు చార్జీలు	**1,282.17**
వడ్డీ రసీదులు	**162.79**	ఇతర వ్యయం	**14,155.92**
ఇతర పన్నేతర రాబడి (కేంద్రం నుండి గ్రాంట్-ఇన్-ఎయిడ్)	**64,067.48**		
మొత్తం	**2,16,566.97**	మొత్తం	**2,11,685.23**
లోటు	**0.00**	మిగులు	**4,881.74**
స్థూల మొత్తం	**2,16,566.97**	స్థూల మొత్తం	**2,16,566.97**

వనరు: తెలంగాణ బడ్జెట్ 2023-24

29.5. రెవెన్యూ ఖాతా, రాబడి మరియు వ్యయం

పట్టిక-4				కోట్లలో
అంశాలు	**Accounts 2020-21**	**Accounts 2021-22**	**R.E 2022-23**	**B.E 2023-24**
1 పన్నులు, సుంకాలు	79,341.99	1,09,991.96	1,30,260.43	1,52,499.49
I కేంద్ర పన్నులో రాష్ట్ర వాటా	12,691.62	18,720.54	19,668.15	21,470.84
II రాష్ట్ర పన్నులు	66,650.37	91,271.42	1,10,592.28	1,31,028.65
A భూమి రాబడి	0.50	0.26	6.71	12.05
B అమ్మకపు పన్ను	43,094.24	55,890.70	69,203.00	83,500.00
C రాష్ట్ర ఎక్సైజ్ సుంకం	14,369.84	17,482.19	17,500.00	19,884.90
D ఇతరములు	9,185.79	17,898.27	23,882.57	27,631.70
2 పన్నేతర రాబడి	6,101.24	8,857.42	15,291.53	22,808.31
3. గ్రాంట్-ఇన్-ఎయిడ్	15,471.13	8,619.26	30,250.22	41,259.17
మొత్తం	1,00,914.36	1,27,468.63	1,75,802.18	2,16,566.97



వనరు: తెలంగాణ బడ్జెట్ 2023-24

పై పట్టిక కేంద్ర పనులలో రాష్ట్ర రెవెన్యూ రాబడి వాటా ధోరణులను తెలుపుతుంది. 2020-21 సంవత్సరంలో 12691 కోట్ల నుండి 2023-24లో రూ. 21470 కోట్లకు రాష్ట్ర వాటా పెరిగింది. అదే సమయంలో రాష్ట్ర పన్నుల ఆదాయం 2020-21లో 66650 కోట్ల నుండి 2023-24 సంవత్సరానికి 1,31,029 కోట్లకు చేరింది. పన్నేతర ఆదాయం (రాబడి) 2020-21 నుండి 6101 కోట్ల నుండి 2023-24 సంవత్సరం నాటికి 22,208 కోట్లకు చేరింది. దీనితో పాటు 2021 నుండి క్రమంగా గ్రాంట్-ఇన్-ఎయిడ్ ద్వారా కూడా రెవెన్యూ రాబడి నిరంతరం పెరుగుతూ వస్తుంది.

29.6. సారాంశం

తెలంగాణ ఆర్థిక మంత్రి టి.హరీశ్ రావు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఫిబ్రవరి 6, 2023న రాష్ట్ర బడ్జెట్‌ను 2,90,396 కోట్ల అంచనా వ్యయంతో సమర్పించారు. ఇందులో ఆదాయ వ్యయం 2,11,685 కోట్లు కాగా, మూలధన వ్యయం 37,525 కోట్లు మరియు 28,224 కోట్లు ఆర్థిక లోటుగా చూపించారు. ప్రభుత్వం సామాజిక, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి తన విధులను నిర్వర్తించే పనిలో భాగంగా ప్రభుత్వం అనేక విధానాలను కలిగి ఉంది. రక్షణ, పరిపాలన మరియు అభివృద్ధి, సంక్షేమ, ప్రాజెక్టులు మరియు అనేక ఇతర సహాయ కార్యకలాపాలపై భారీ మొత్తాన్ని ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందువల్ల నిధులను రాబట్టుకునేందుకు తీర్చడానికి తగినంత రాబడి పొందడానికి ప్రయత్నం చేయాలి.

29.7. మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. బడ్జెట్ అంటే ఏమిటి?
2. మిగులు బడ్జెట్‌ను వివరించండి.

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. బడ్జెట్ రకాలను వివరించండి.
2. బడ్జెట్ అర్థం రియు నిర్వచనాన్ని వివరించండి.

III. క్రింది ప్రశ్నలకు 10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. బడ్జెట్ వర్గీకరణను వివరించండి.
2. 2023-24 సంవత్సరం బడ్జెట్‌ను వివరించండి.

29.8. పదకోశం

- సమతుల్య బడ్జెట్: ప్రతిపాదిత వ్యయం మరియు ఊహించిన రాబడి రెండూ సమానంగా ఉన్నప్పుడు సమతుల్య బడ్జెట్ అంటారు.

  సమతుల్య బడ్జెట్ = రాబడి = వ్యయం

- రెవెన్యూ బడ్జెట్: ఇందులో ప్రభుత్వ ఆదాయాల నుండి వ్యయం సమకూరుతాయి.
- అత్యవసర బడ్జెట్: యుద్ధం, ప్రకృతి వైపరీత్యాలు మొదలైన అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనుటకు సిద్ధం చేయబడిన బడ్జెట్.

29.9. ఉపయుక్త గ్రంథాలు

1. 2023-24 తెలంగాణ బడ్జెట్ సంగ్రహం
2. తెలంగాణ, ఆర్థిక, సామాజిక, విశ్లేషణ 2022-23
3. తెలంగాణ బడ్జెట్ 2023-24

తెలంగాణా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, ఉపాధికల్పన మరియు సంక్షేమ కార్యక్రమాలు

అధ్యాయం

30

30.0 లక్ష్యాలు

30.1 పరిచయం

30.2 తెలంగాణాలో పేదరికం ఒక అవగాహన

30.2.1 పేదరికం రకాలు

30.2.2 తెలంగాణాలో పేదరిక అంచనాలు

పేదరికం అంచనాలు – సురేష్ టెండూల్కర్ నిపుణుల కమిటీ

పేదరికం అంచనాలు – రంగరాజన్ కమిటీ రిపోర్ట్

30.3 తెలంగాణా రాష్ట్రంలో నిరుద్యోగిత

30.4 తెలంగాణా రాష్ట్రంలో నిరుద్యోగిత గణాంకాలు

30.5 తెలంగాణా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు

30.5.1 రైతు సంక్షేమ పథకాలు

30.5.1.1 రైతు బంధు (FISS)

30.5.1.2 రైతు బీమా

30.5.1.3 మిషన్ కాకతీయ

30.5.2 స్త్రీ, శిశు సంక్షేమ పథకాలు

30.5.2.1 కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్

30.5.2.2 స్వయం సహాయక బృందాలు (SGHలు)

30.5.2.3 కె.సి.ఆర్. కిట్ పథకం

30.5.2.4 అమ్మ ఒడి

30.5.2.5 ఆరోగ్యలక్ష్మి

30.5.3. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు

30.5.3.1 ఆసరా పెన్షన్‌లు

30.5.3.2 ఆరోగ్యశ్రీ (ఆయుష్మాన్ భారత్ – ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన (AB PM-JAY)

30.5.3.3 ప్రజాపంపిణీ వ్యవస్థ

30.5.4 ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలు

30.5.4.1 దళిత బందు

30.5.4.2 మిషన్ భగీరథ

30.5.4.3 రెండు పడకల గదుల ఇంటి నిర్మాణం

30.5.4.4 ఉపకార వేతనాలు

30.5.4.5 గొర్రెల పంపిణీ పథకం

30.6 సారాంశం

30.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

30.8 పదకోశం

30.9 ఉపయుక్త గ్రంథాలు

- పేదరికం రకాల గురించి తెలియచేస్తారు.
- తెలంగాణాలో పేదరిక అంచనాల గురించి వివరిస్తారు.
- తెలంగాణా రాష్ట్రంలో గల నిరుద్యోగిత గురించి గణాంకాల ఆధారంగా చర్చిస్తారు.
- తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను వివరిస్తారు.
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు పేదరికాన్ని ఎలా రూపుమాపుతున్నాయో అవగాహన చేసుకుని, చర్చిస్తారు.

30.1 పరిచయం

అధికారానికి ఒకే బాధ్యత ఉంది. అది ప్రజల సామాజిక సంక్షేమాన్ని సాధించడమే.

– బెంజమిన్ డిస్రాయలీ

పేదరికం అనేది ఒక దీర్ఘకాలిక సామాజిక, , ఆర్థిక సమస్యగా ఉంది. సమాజంలో ప్రజలు తమ కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికం అంటారు పేదరికంతో బాధపడుతున్న వారిని పేదలు అంటారు. వివిధ పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన మరియూ సంక్షేమ కార్యక్రమాలు అసలైన లబ్ధిదారులకు చేరవేయడం ద్వారా మనం ఈ పేదరిక నిర్మూలన చేయవచ్చు. పేదరికాన్ని 2030 నాటికి అంతం చేయాలన్నది ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఒకటి. ప్రజా సంక్షేమాన్ని పెంచి పోషించడమే ప్రతి ప్రభుత్వము యొక్క ముఖ్య అజెండా.

ఒక రాష్ట్రం ప్రగతి పథంలో ఏ మేరకు సాగుతుంది అనే విషయాన్ని ఆ రాష్ట్రం యొక్క పేదరిక లెక్కలతో తేలికగా అంచనా వేయవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికం, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం అన్నవి ప్రధాన ఆర్థిక, సాంఘిక సమస్యలు. ఇవి ఒకదానితో ఒకటి ముడిపడి వుంటాయి. ఈ సమస్యలు ఆ దేశ లేదా రాష్ట్ర అభివృద్ధికి ఆటంకాలుగా మారుతున్నాయి. ఎన్నో దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తరువాత "నీళ్ళు, నిధులు, నియామకాలు" అన్న ప్రధాన కోరికతొ ఏర్పడిన తెలంగాణా రాష్ట్రం కూడా ఈ పేదరికాన్ని రూపుమాపడానికి అనేక ప్రణాళికలు రూపొందిస్తూ సంక్షేమ కార్యక్రమాలను రూపొందించి అమలు పరుస్తున్నది. సంక్షేమ పథకాలు అమలు చేసేటప్పుడు రాష్ట్రంలో పేదవారు ఎవరో గుర్తించాల్సిన అవసరం ఉన్నది.

తెలంగాణా ఇటీవల ఏర్పడిన రాష్ట్రమైనప్పటికీ భారతదేశంలో మిగిలిన ప్రాంతాలతో పోల్చి చూస్తే దీని ఆర్థిక పనితీరు పటిష్టంగా ఉంది. ముఖ్యంగా తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన సంక్షేమ సంస్కరణలు మరియు ఉపాధికల్పన కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేర్చుటకు ప్రయత్నిస్తున్నది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి పేదప్రజల సంక్షేమం మరియు ఉపాధి కల్పన కోసం అనేక రకాలైన కార్యక్రమాలను చేపట్టడం జరిగినది.

30.2 తెలంగాణాలో పేదరికం ఒక అవగాహన

30.2.1 పేదరికం రకాలు

అర్థశాస్త్రం ప్రకారం పేదరికం రెండు రకాలు అవి

1. నిరపేక్ష పేదరికం

2. సాపేక్ష పేదరికం

జీవించడానికి కనీసం అయ్యే వినియోగ వ్యయాన్ని కూడా చేయలేని పరిస్థితిని నిరపేక్ష పేదరికం అంటారు. ఇది ఎక్కువగా భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో కనిపిస్తుంది. మన దేశంలో కానీ లేదా మన రాష్ట్రమైన తెలంగాణాలో కానీ పేదరికపు సమస్యను పరిశీ లించేటప్పుడు నిరపేక్ష పేదరికాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకోవాలి. ఈ నిరపేక్ష పేదరికం లెక్కించేటప్పుడు పరిగణలోనికి తీసుకునే జీవన వినియోగ వ్యయాన్ని మార్కెట్ ధరల ఆధారంగా లెక్కిస్తారు.

సాపేక్ష పేదరికం అనునది సమాజంలో కల ఆర్థిక అసమానతలను సూచిస్తుంది. దీని ప్రకారం జీవన ప్రమాణం తక్కువగా ఉన్న ప్రజల యొక్క ఆదాయస్థాయి, జీవన ప్రమాణం ఎక్కువగా ఉన్న ప్రజలతో పోల్చి తక్కువ ఆదాయం పొందుతున్న ప్రజలను సాపేక్షంగా పేదవారిగా పరిగణిస్తారు. ఈ సాపేక్ష పేదరికం అన్న భావనను సంపన్న దేశాలలో అధికంగా ఉపయోగిస్తారు.

30.2.2 తెలంగాణాలో పేదరిక అంచనాలు

భారతదేశంలో పేదరికాన్ని లెక్కంచడానికి 1950 సంవత్సరంలో నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ (NSSO) అనే ఒక సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పేదరికాన్ని అంచనా వేస్తుంది. ఈ సంస్థ యొక్క అంచనాలను నీతి ఆయోగ్ (ఇంతకు మునుపు ప్రణాళికా సంఘం) అధికారికంగా ప్రకటిస్తుంది.

పేదరికం అంచనాలు - సురేష్ టెండూల్కర్ నిపుణుల కమిటీ:

1993-94 సంవత్సరంలో తెలంగాణాలో పేదరికాన్ని అంచనా వేయడానికి తలసరి ఆదాయాన్ని సంవత్సరానికి గ్రామీణ ప్రాంతంలో రూ. 11,244లు గానూ, పట్టణ ప్రాంతాలలో రూ. 11,282/-లు గానూ తీసుకోబడినది. అదే విధంగా పేదరికపు తలసరి ఆదాయం 2011-12లో గ్రామీణ ప్రాంతాలలో 860 రూ.లు గానూ పట్టణ ప్రాంతాలకు రూ. 1,009లు గానూ తీసుకోబడినది. ఈ సురేష్ టెండూల్కర్ కమిటీ అంచనాల ప్రకారం 1993-94 నుండి 2011-12 మధ్య కాలంలో తెలంగాణాలో గ్రామీణ పేదరికం 49 శాతంగా ఉండగా పట్టణ ప్రాంతపు పేదరికం 30.5 శాతం. ఇదే సంవత్సరంలో భారతదేశ గ్రామీణ పేదరికం 50.1 శాతంగా ఉండగా పట్టణ ప్రాంతపు పేదరికం 31.8 శాతంగా ఉన్నది. కాబట్ట్ భాతరదేశ పేదరిక స్థాయి కన్నా తెలంగాణాలో పేదరిక స్థాయి తక్కువగానే ఉందని చెప్పవచ్చు. 2011-12 సంవత్సరములో తెలంగాణాలో గ్రామీణ పేదరిక స్థాయి 11.5గా ఉండగా భారతదేశ గ్రామీణ పేదరిక స్థాయి 25.7 శాతంగా ఉన్నది. ఇదే సంవత్సరంలో తెలంగాణాలో

పట్టణ పేదరిక స్థాయి 5 శాతంగా ఉండగా భారతదేశ గ్రామీణ పేదరిక స్థాయి 13.7 శాతంగా ఉన్నది. 2011-12 సంవత్సరంలో తెలంగాణాలో పట్టణ, గ్రామీణ పేదరిక స్థాయి మొత్తం కలుపుకుని 8.77 శాతంగా ఉండగా అదేకాలంలో భారతదేశ పట్టణ, గ్రామీణ పేదరికస్థాయి మొత్తం కలుపుకుని 21.9 శాతంగా ఉంది. 1993-94 నుండి 2011-12 మధ్య కాలంలో తెలంగాణాలో గ్రామీణ పేదరికస్థాయి 49 శాతం నుండి 11.5 శాతానికి తగ్గినది. అదే సమయంలో తెలంగాణాలో పట్టణ పేదరిక స్థాయి 30.5 శాతం నుండి 5 శాతానికి తగ్గింది. 1993-94 నుండి 2011-22 మధ్య కాలంలో తెలంగాణాలో పేదరికంలో ఉన్న ప్రజల జనాభా 12 మిలియన్‌ల నుండి 3 మిలియన్ లకు తగ్గడమే ఈ పేదరిక స్థాయి తగ్గుదలకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

1990 దశాబ్దంలో సామాజిక పరంగా ప్రతికూలత కలిగిన వర్గాలలో పేదరికపు స్థాయి అధిక స్థాయిలో ఉండగా అది 2011-12 సంవత్సరం నాటికి తగ్గినది. 2011-12 లో తెలంగాణలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఎస్.సి. వర్గాల వారి కంటే ఎస్.టి. వర్గాల వారిలో ఈ పేదరిక స్థాయి ఎక్కువగా ఉంది. 1993-94 సంవత్సరంలో తెలంగాణాలో ఉమ్మడి హైదరాబాద్ జిల్లాలో పేదరిక స్థాయి 16.5 శాతం కాగా అదే సంవత్సరంలో ఉమ్మడి మహబూబ్ నగర్‌లో పేదరిక స్థాయి 50 శాతంగా ఉంది. కానీ 2011-12 సంవత్సరం నాటికి ఈ పరిస్థితి మారినది. హైదరాబాద్‌లో ఈ స్థాయి 2.4 శాతంగా ఉండగా నిజామాబాదులో ఇది 11.6 శాతంగా ఉన్నది.

పేదరికం అంచనాలు - రంగరాజన్ కమిటీ రిపోర్ట్:

రంగరాజన్ కమిటీ రిపోర్ట్ ప్రకారం 2011-12లో తెలంగాణలో పేదరికపు స్థాయి, భారతదేశ పేదరికపు స్థాయికన్నా చాలా తక్కువ. 2011-12లో తెలంగాణలో గ్రామీణ ప్రాంత పేదరిక స్థాయి 9.3 శాతంగా ఉండగా అదే సంవత్సరంలో భారతదేశపు గ్రామీణ పేదవారి శాతం 30.9 శాతంగా ఉన్నది. అదే విధంగా తెలంగాణాలో పట్టణ ప్రాంత పేదరికస్థాయి 11.1 శాతంగా ఉండగా భారతదేశ పట్టణ ప్రాంత పేదరికస్థాయి 26.4గా ఉన్నది. గ్రామీణ, పట్టణ పేదరిక స్థాయిలు మొత్తంగా చూసినట్లైతే తెలంగాణాలో 10 శాతంగానూ భారతదేశంలో 29.5 శాతంగానూ ఉన్నవి. తెలంగాణాలో పేదవారి సంఖ్యను పరిశీలించినట్లైతే గ్రామీణ ప్రాంతాలలో పేదవారు 20.1 లక్షలు ఉండగా పట్టణ ప్రాంతాలలో పేదవారి సంఖ్య 15.2 లక్షలుగా ఉన్నది. 2011-12 రంగరాజన్ కమిటీ సాపేక్ష కమిటీ అంచనాలప్రకారం మొత్తం తెలంగాణాలో పేదవారి సంఖ్య 35.3 లక్షలుగా ఉన్నది.

పేదరికాన్ని సమూలంగా నిర్మూలించడానికి తెలంగాణా రాష్ట్రప్రభుత్వం బహుముఖ అంశాల ఆధారంగా రూపొందించిన మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (బహిమితీయ పేదరిక సూచిక (MPI) ఆధారంగా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. నీతి ఆయోగ్ (NITI Aayog) యొక్క బహుమితీయ పేదరిక సూచిక ప్రాథమిక నివేదిక 2021 ప్రకారం, మూడు సమానమైన వెయిటేజీ గల ఆరోగ్యం, విద్య మరియు జీవన ప్రమాణాల ప్రకారం భారతదేశంలో ప్రతీ నలుగురిలో ఒకరు పేదవారు కాగా తెలంగాణ లో ఇది కేవలం ఏడుగురు వ్యక్తులలో ఒకరు మాత్రమే పేదవారు ఉన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం ఆరోగ్యం (KCR కిట్‌లు, ఆరోగ్యలక్ష్మి, గిరి పోషణ, ప్రజారోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం), విద్య (మన ఊరు మన బడి ద్వారా పాఠశాలల మౌలిక సదుపాయాలను పునరుద్ధరించడం) మరియు జీవన ప్రమాణాలలో (గృహం, నైపుణ్యాభివృద్ధి, ఆస్తుల కల్పన, ఉచిత విద్యుత్ మొదలైనవి) మెరుగైన ఫలితాలు సాధించాలని లక్ష్యంగా వివిధ పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు రూపకల్పన చేయడం జరిగింది.

30.3 తెలంగాణా రాష్ట్రంలో నిరుద్యోగిత

తెలంగాణ ఏర్పడిన తరువాత వర్షపాతం మీద, ఋతువుల ఆగ్రహానుగ్రహాల మీద భారీగా ఆధారపడుతున్నది వ్యవసాయ రంగం. అయినప్పటికీ రాష్ట్రంలో ఈ రంగం ఇప్పటికీ ప్రాధాన్య రంగంగా కొనసాగుతున్నది. కారణం ఉపాధి కల్పనకు, ఆహారభద్రతకు, పేదసాదలు సైతం అభివృద్ధిలో భాగం కావడానికి, నిలదొక్కుకోవడానికి ఆలంబన అయిన రంగమిదే. శ్రామికులలో దాదాపు 55.7 శాతం మందికి ఈ రంగం మరియు దాని అనుబంధ రంగాలు ఉద్యోగితను కల్పిస్తున్నవి. ఉపాధి కల్పనకు, ఆదాయాల అభివృద్ధికి, అంతిమంగా అందరికి ఆహార భద్రతను సమకూర్చడానికి శీఘ్రతరమైన వ్యవసాయ వృద్ధే కీలకంగా నిలుస్తుంది. అందువలన పేదరికాన్ని తగ్గించడానికి సంపదవృద్ధిని నికరంగా సాగించడానికి వ్యవసాయ ఆదాయాలు పెంచడం చాలా కీలకం. ఈ రంగంలో అధికంగా ఉన్న శ్రామిక బలగాన్ని నైపుణ్యాల అభివృద్ధి ద్వారా గ్రామీణ పరిశ్రమల వంటి వ్యవసాయేతర గ్రామీణ రంగాలకు మళ్లించాలనే లక్ష్యంతోనే తెలంగాణా రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యాన్ని ఇవ్వడం జరుగుతుంది.

సారవంతమైన భూములు, వైవిధ్యం కలిగిన పంటలు, కృష్ణా, గోదావరి నదుల నీటిని అందుకునే భారీ సేద్యపు నీటి వ్యవస్థలు మొదలైన పుష్కలమైన వనరులు తెలంగాణాకు వరం. తెలంగాణా ప్రజల సంస్కృతిని, ఆర్థిక జీవితాన్ని రూపుదిద్దిన వ్యవసాయం ఒక సంప్రదాయం, ఒక జీవనవిధానం.కాబట్టి రాష్ట్ర ప్రణాళికాబద్ధమైన సాంఘిక-ఆర్థిక అభివృద్ధికి బాటలు వేసే సమస్త వ్యూహాలకు కేంద్రబిందువు వ్యవసాయమే. మెరుగుపరిచిన సాంకేతిక సదుపాయాల ద్వారా సదుపాయాలను ఎక్కువ మందికి అందించడం ద్వారా, యాంత్రీకరణ ద్వారా అవసరమైన వాటిని సకాలంలో సమర్థంగా అందించడం ద్వారా, విక్రయ అనుబంధాల ద్వారా, తగినంత రుణ సదుపాయం కల్పించడం ద్వారా, పంటల భీమా ద్వారా రైతులకు పెట్టుబడి మీద మెరుగైన ఫలితాలను పొందడం ద్వారా తెలంగాణాలో పేదరికాన్ని, నిరుద్యోగితను దూరం చేయవచ్చు. అదే విధంగా వ్యవసాయ ఆధారిత ఉపరంగాలైన మత్స్య పరిశ్రమ, పశుసంపద, మొదలైనవి కూడా ఉద్యోగితను కల్పిస్తాయి. కానీ పరిశ్రమలు ఎక్కువగా హైదరాబాదు, రంగారెడ్డి చుట్టు మాత్రమే కేంద్రీకృతమయ్యాయి. ఇతర జిల్లాల్లో పరిశ్రమలు లేకపోవడమో లేదా ఉన్న కొన్ని పరిశ్రమలలో అర్హతలు తక్కువగా ఉండి తక్కువ నైపుణ్యం గల కార్మికులు పని చేస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో సేవారంగం లో ఉపాధి నిరంతరంగా పెరుగుతుంది.కానీ సేవారంగంలో పనిచేసేవారు నైపుణ్యం కలిగినవారై ఉండాలి. ఉపాధి కొరకై గ్రామీణ ప్రాంతాలనుండి పట్టణ ప్రాంతాలకు వలస వెలుతున్నవారు ఎక్కువగా నైపుణ్యం లేని కార్మికులే. కానీ వారికి సరిపడా ఉపాధిని పారిశ్రామిక రంగం కానీ సేవారంగం కానీ కల్పించలేకపోతున్నాయి.

30.4 తెలంగాణా రాష్ట్రంలో నిరుద్యోగిత గణాంకాలు

ఉపాధి అనగా మనిషి తాను మరియూ తన కుటుంబ సభ్యుల యొక్క జీవన అవసరాలను తీర్చుకోవడానికి ఎంచుకున్న ఒక ఆదాయ మార్గం. ఉపాధి లభించకపోయినట్లయితే దానిని నిరుద్యోగం అంటారు. దేశంలో పని చేయాలన్న కోరిక కలిగినవారు ఎక్కువగా ఉండి సరియైన ఉద్యోగాల సంఖ్య తక్కువగా ఉండే స్థితి అని దీనిని చెప్పవచ్చు. అమలులో ఉన్న వేతనం దగ్గర ఒక వ్యక్తి శారీరకంగానూ, మానసికంగానూ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ పనిదొరకని స్థితిని నిరుద్యోగిత" అని చెప్పవచ్చు.

భారతదేశంలో నిరుద్యోగాన్ని ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి

ఎ) గ్రామీణ నిరుద్యోగం బి) పట్టణ నిరుద్యోగం

గ్రామీణ ప్రాంతాలలో జనాభా ఒత్తిడి వలన అధిక జనాభా వ్యవసాయంపై ఆధారపడి వ్యవసాయ రంగంలో అవసరమైన దానికన్నా ఎక్కువ జనాభా పనిచేస్తున్నారు. ఏదేని రంగంలో అవసరానికి మించి పనిచేసే జనాభా ఉన్నట్లయితే దానిని **ప్రచ్ఛన్న నిరుద్యోగం** అంటారు. వ్యవసాయాధారమైన వ్యవసాయ రంగంలోని కూలీలకు సంవత్సరానికి 7 లేదా 8 నెలలు మాత్రమే పని దొరుకుతుంది మిగిలిన కాలంలో వారు నిరుద్యోగులుగా ఉంటారు. దీనినే **ఋతుసంబంధ నిరుద్యోగం** అంటారు. అధిక ఉద్యోగార్హతలు కలిగి ఉండి తమ సామర్థ్యం కంటే తక్కువ స్థాయిలో ఉపాధి దొరుకుతుంది. దీనినే **అల్ప ఉపాధి** లేదా **అల్ప ఉద్యోగిత** అంటారు.

తెలంగాణా రాష్ట్రంలో 2004-05 సంవత్సరంలో గ్రామీణ నిరుద్యోగితా రేటు 11.3 శాతంగా ఉండగా భారతదేశ గ్రామీణ నిరుద్యోగిత రేటు 8.2 శాతంగా ఉన్నది. 2011-12 సంవత్సరంలో గ్రామీణ నిరుద్యోగితా రేటు 4 శాతంగా ఉండగా భారతదేశ గ్రామీణ నిరుద్యోగిత రేటు 5.7 శాతంగా ఉన్నది. అంటే గ్రామీణ నిరుద్యోగం ఈ సంవత్సరాలలో తెలంగాణాలో గణనీయంగా తగ్గినదని అర్థమగుచున్నది. తెలంగాణా రాష్ట్రంలో 2004-05 సంవత్సరంలో పట్టణ నిరుద్యోగితా రేటు 7.2 శాతంగా ఉండగా భారతదేశ పట్టణ నిరుద్యోగిత రేటు 8.3 శాతంగా ఉన్నది. 2011-12 సంవత్సరంలో తెలంగాణాలో పట్టణ నిరుద్యోగితా రేటు 6 శాతంగా ఉండగా భారతదేశ పట్టణ నిరుద్యోగిత రేటు 5.5 శాతంగా ఉన్నది. మొత్తంగా చూసినట్లయితే పురుషులకన్నా స్త్రీలలో నిరుద్యోగితా రేటు ఎక్కువగా ఉన్నది. అదీ కాక తెలంగాణా రాష్ట్రంలో కన్నా దేశ నిరుద్యోగితా రేటు ఎక్కువగా ఉన్నది.

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగాన్ని తగ్గించాలంటే పారిశ్రామిక వికేంద్రీకరణ కూడా ఒక మార్గమే. పారిశ్రామిక వికేంద్రీకరణ జరిగినట్లయితే ప్రాంతీయ అసమానతలు, అదాయాలలో అంతరాలు తగ్గుతాయి. స్థానిక మానవ వనరుల వినియోగం జరిగి ఉపాధి పెరిగి నిరుద్యోగం తగ్గుతుంది. వ్యవసాయ రంగంలో శ్రమ సాంద్రత పద్ధతులను ఉపయోగించడం వలన వ్యవసాయ విస్తృత అభివృద్ధికి, ఉపాధికల్పనకు ఉత్పత్తికి దోహదపడి నిరుద్యోగితను తగ్గించవచ్చు. వ్యవసాయం దాని అనుభంద కార్యకలాపాలకు కావలసిన అవస్థాపనా సౌకర్యాలు కల్పించడం, సాంద్ర, విస్తృత వ్యవసాయానికి అవసరమైన పరపతిని చిన్న సన్నకారు రైతులకు అందించడం ద్వారా, గ్రామీణ విద్యావంతులకు ఏదో ఒక వృత్తిలో శిక్షణను ఇచ్చి పెట్టుబడి సహాయం అందించడం ద్వారా నిరుద్యోగితను నివారించవచ్చు. అయితే ఉపాధిని కల్పించడం ద్వారా మాత్రమే పేదరికం సమసిపోదు. తమ నైపుణ్యానికి, శక్తికి తగిన ఉపాధిని కల్పించినప్పుడు మాత్రమే పేదరికాన్ని పారద్రోలగలం.

30.5 తెలంగాణా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు

తెలంగాణా రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి తెలంగాణా ప్రభుత్వం ప్రజలకు ఉపాధిని కల్పించడం, ప్రజా ఆరోగ్య వ్యవస్థను మెరుగుపర్చుకోవడం, సంక్షేమ కార్యక్రమాలను అమలుపర్చడం వంటి కార్యక్రమాలు చేస్తున్నది. ముఖ్యంగా ప్రజల యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం కోసం పెద్ద ఎత్తున పథకాలను ప్రవేశ పెట్టడం, సమాజంలో పేద, ధనిక అనే తేడా లేకుండా విద్యా, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచడం మహిళలకు ప్రతి విషయంలోనూ

సమాన అవకాశాలను కల్పించడం కోసం వారికి ఆర్థికంగా, రాజకీయంగా స్వావలంబనను కల్పించడం మొదలైన కార్యక్రమాలను రచించి అమలు పరుస్తున్నది. ఇదే కాకుండా తెలంగాణా వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న ప్రజల సంక్షేమానికి తగిన ప్రాధాన్యతను ఇవ్వవలసి ఉంటుంది. తెలంగాణాలో సాధించబడే వ్యవసాయరంగ అభివృద్ధి వలన రెండింతల పేదరికం తగ్గుతుందని ఆర్థికవేత్తల అంచనా. ఎందుకంటే వ్యవసాయ రంగం మాత్రమే అభివృద్ధి కాకుండా దాని అనుబంధ రంగాలు కూడా అబివృద్ధి చెందే వీలు ఉంది. పరిశ్రమల స్థాపన అధికంగా జరగడం వలన యువతకు విరివిగా అవకాశాలు పెరిగి నిరుద్యోగిత తగ్గుతుంది. దీని కొరకై తెలంగాణా ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానం, యువత నైపుణ్యాల కల్పనకు వివిధ పథకాలను ప్రవేశ పెట్టినది. ఇవన్నీ తెలంగాణా ప్రభుత్వం పేదరికంపై పోరులో ముందడుగులుగా చెప్పుకోవచ్చు.

తెలంగాణా ప్రభుత్వం పేద ప్రజల జీవన ప్రమాణస్థాయిలు మెరుగు పరచడానికి, బలహీన, మైనారిటీ వర్గాల సంక్షేమానికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు, రైతు సంక్షేమానికి అనేక రకాలైన సంక్షేమ పథకాలను ప్రవేశ పేట్టింది. వాటిని మనం నాలుగు రకాలుగా విభజించవచ్చు.

1. రైతు సంక్షేమ పథకాలు
2. స్త్రీ, శిశు సంక్షేమ పథకాలు
3. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు
4. ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలు

30.5.1 రైతు సంక్షేమ పథకాలు

30.5.1.1. రైతు బంధు (FISS)

వ్యవసాయంలో అత్యధిక దిగుబడులు సాధించి రైతు స్వయం సంవృద్ధి సాధించాలంటే నీరు, విద్యుత్, రసాయన ఎరువులు, విత్తనాలు, శ్రామికులు మరియూ యంత్రపరికరాలు ఎంతో అవసరం. వీటి వలననే సమర్థవంతమైన ఉత్పత్తి, ఉత్పాదకత అందుతుంది. అయితే గ్రామీణ ప్రాంత రైతు వీటన్నిటినీ పొందడానికి రుణాల పై ఆధారపడేవాడు. ఈ గ్రామీణ రుణాల యొక్క దుర్మార్గపు చక్రాన్ని విచ్ఛిన్నం చేసి మళ్లీ రైతులు రుణ ఉచ్చులో పడకుండా చూడడానికి తెలంగాణా ప్రభుత్వం "రైతు బంధు" (వ్యవసాయ పెట్టుబడి సహాయ పథకం) అన్న పథకాన్ని తెలంగాణా ప్రభుత్వం 2018–19 ఖరీఫ్ సీజన్ నుండి అమలుచేయుచున్నది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, శ్రమ మరియు పంట సీజన్ కోసం రైతు ఎంపిక చేసిన క్షేత్ర కార్యకలాపాలలో ఇతర పెట్టుబడుల కొనుగోలు కోసం ప్రతి సీజన్‌లో భూయజమానులైన రైతులకు ఎకరాకు రూ. 5,000/– చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుంది. ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమచేస్తారు.

30.5.1.2 రైతు బీమా

తెలంగాణ రాష్ట్ర రైతుల కోసం తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం రైతు బీమా పథకం. ఈ పథకం ముఖ్యంగా రైతు మరియు రైతు కుటుంబాలకు ఆర్థిక బరోసాను అందించడానికి

ఉద్దేశించబడినది. రాష్ట్రంలో చాలామంది రైతులు తమ కుటుంబానికి ఆదాయాన్ని సంపాదించేవారుగా ఉన్నారు. కుటుంబం మొత్తం ఆ రైతు సంపాదనపై మాత్రమే అధారపడి ఉంటున్నది. రైతు ఏదన్నా కారణం చేత మరణించినట్లయితే ఆ రైతు యొక్క మొత్తం కుటుంబం ఆర్థికంగా చితికిపోయి తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతుంది. ఈ నేపథ్యంలో తెలంగాణా ప్రభుత్వం 2018లో రైతు బీమా పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఎవరైనా రైతు ఆకస్మిక మరణానికి గురి ఐనప్పుడు ఈ పథకంక్రింద ఆ రైతు కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లిస్తారు. 18 నుండి 59 సంవత్సరాల మధ్య వయస్కులైన రైతులు ఈ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఈ పథకం క్రిందనమోదైన రైతుల యొక్క బీమా ప్రీమియంను ప్రభుత్వమే LIC కి చెల్లిస్తుంది. రాష్ట్రంలోని సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరింది. ఈ పథకం క్రింద ఆర్థిక సహాయాన్ని రైతు కుటుంబానికి క్లెయిమ్ చేసిన 10 రోజులలోపే చెల్లిస్తారు. ఈ ఐదు లక్షల రూపాయలను దళారుల బెడద లేకుండా నేరుగా లబ్దిదారుల యొక్క బ్యాంకు ఖాతాలోకి జమ చేయబడుతాయి. నమోదు దగ్గర నుండి క్లెయిం వరకు అన్ని కార్యకలాపాలన్ని కంప్యూటరైజ్డ్ కావడంతో, ఆన్‌లైన్‌లో పూర్తి చేస్తారు. 2018-19 నుండి ప్రభుత్వం రూ. 3,763.80 కోట్ల మేరకు క్లెయిమ్‌లను పరిష్కరించింది.

30.5.1.3 మిషన్ కాకతీయ:

చిన్న సన్నకారు రైతులకు వ్యవసాయ ఆధారిత ఆదాయాన్ని పెంపొందించడం, చిన్న నీటిపారుదల మౌళిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడం, కమ్యునిటీ ఆధారిత సాగునీటి యాజమాన్యాన్ని బలోపేతం చేయడం మరియు చెరువుల పునరుద్ధరణకు సమగ్ర కార్యక్రమాన్ని చేపట్టడం మిషన్ కాకతీయ యొక్క ముఖ్య లక్ష్యాలు. 2014 జూన్‌లో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన తొలి కార్యక్రమం ఇది. ఈ పథకం మార్చి, 12, 2015 నాడు కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పాతచెరువులో ఈ పథకం ప్రారంభించబడినది. వేల ఏండ్లపాటు తెలంగాణను సస్యశ్యామలం చేసి, కొన్ని దశాబ్దాలుగా పూడుకుపోయిన దాదాపు 46 వేలకుపైగా చెరువులను మళ్ళీ పునరుద్ధరించడమే మిషన్ కాకతీయ ప్రధాన లక్ష్యం.

ఈ ప్రాజెక్ట్ మొత్తం ఐదు దశలలో చేపట్టబడింది.

1. చెరువులలో పూడిక తీయడం ద్వారా చెరువులలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్దరించడం.
2. శిధిలావస్థలో ఉన్న స్లూయిజ్‌లు, వీయర్లు మొదలైన వాటిని రిపేర్ చేయడం.
3. చెరువు కట్టలను బలోపేతం చేయడం.
4. ఫీడర్ చానల్స్‌కు మరమ్మత్తులు చేపట్టడం ద్వారా గొలుసుకట్టు చెరువులలో నీటిని పెంచడం
5. కృష్ణా మరియు గోదావరి నదులపై చేపట్టిన మేజర్, మీడియం మరియు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కాలువ నెట్‌వర్క్‌ల ద్వారా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను నింపడానికి అవసరమైన పనులను చేపట్టడం
6. నీటిపారుదల మార్గాలను ప్రమాణాలకు అనుగుణంగా పునర్విభజన చేయడం మరియు అవసరాలకు అనుగుణంగా పొలాలకు నీటి పంపిణీ సాఫీగా జరగడానికి పనులు చేయించడం.

ఈ కార్యక్రమం భూగర్భ జలాల మెరుగుదలకు, వ్యవసాయరంగంలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు, పశువుల పెరుగుదలకు, మత్స్యపరిశ్రమ పెరుగుదలకు, ప్రోత్సాహం అందించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను చైతన్యం

చేసిందని చెప్పవచ్చు. ఈ మిషన్ కాకతీయ పథకం 2018 సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ నుండి బెస్ట్ ఇరిగేషన్ ప్రాక్టీసెస్ అవార్డును మరియు 2021లో జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డ్‌ను గెలుచుకుంది.

30.5.2 స్త్రీ, శిశు సంక్షేమ పథకాలు

తెలంగాణా రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 1,73,92,041 మంది స్త్రీలు కాగా 1,76,11,633 మంది పురుష్యులు ఉన్నారు. రాష్ట్ర జనాభాలో స్త్రీ పురుష జనాభా వరుసగా 49.69% మరియు 50.31%.

తెలంగాణా జనాభాలో సుమారు అర్ధభాగంగా ఉన్న స్త్రీల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. తెలంగాణలో వెనుకబడిన, మైనారిటీ మరియు ఆర్థిక వెనుకబాటుకు గురి ఐన ఆడబిడ్డల వివాహానికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని, సంస్థాగత కాన్పులను పెంచడం, మాతా శిశు మరణాలను తగ్గించడానికి కె.సి.ఆర్. కిట్ పథకం, అమ్మ ఒడి పేరుతో ఆపత్కాల వాహన సేవలను, ఆరోగ్యలక్ష్మి పథకం క్రింద గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు ఆరోగ్యకరమైన పౌష్ఠిక ఆహారం అందజేత మొదలైన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు స్త్రీలు మరియూ శిశువుల కొరకై ప్రారంభించబడినాయి. వాటి గురించి ఈ భాగంలో వివరంగా చర్చిద్దాం.

30.5.2.1 కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్

B.C., S.C., S.T., O.B.C., మైనారిటీ నిరుపేద కుటుంబాలలోని 18 ఏళ్లు నిండిన వధువు కుటుంబానికి పెళ్లి ఖర్చుల నిమిత్తం ప్రవేశపెట్టబడిన పథకం ఇది. ఈ పథకం అక్టోబరు 2, 2014 నుండి అమలులోనికి వచ్చింది. పట్టణాలలో వార్షిక ఆదాయం రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాలలో వార్షిక ఆదాయం లక్షన్నర ఉన్న కుటుంబాలలోని 18 సంవత్సరాలు నిండిన ఆడ పిల్లలు ఈ పథకానికి అర్హులు. వివాహం జరిగిన తరువాత కళ్యాణలక్ష్మి – షాదీ ముబారక్ పథకం కింద ఆర్థిక సాయం చేయాలనే నిబంధనను మార్చి, పెళ్ళి అవసరాల కోసం డబ్బును ముందే అందించాలన్న ఉద్దేశంతో దరఖాస్తు చేసిన కొద్ది రోజులలోనే ఆ దరఖాస్తు ఫారాలను పరిశీలించి, రూ.1,00,116 ఆర్థిక సాయం వధువు పేరు మీద ఉన్న బ్యాంకు ఖాతాలో జమచేస్తారు.

30.5.2.2 స్వయం సహాయక బృందాలు (SGHలు)

మహిళల్లో ఒక నూతన చైతన్యాన్ని కలిగించి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకు రావడానికి ఉద్దేశించిన పథకమే స్వయం సహాయక బృందాలు. ఈ స్వయం సహాయక బృందాలను మరింత బలోపేతం చేయడానికి "సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (SERP)" ద్వారా మహిళల సమాఖ్యలను ఏర్పరచడం మరియు వారికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను ఇవ్వడం తద్వారా మహిళలను ఆర్థికంగా స్వయం సంవృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ స్వయం సహాయక సంఘాలన్నింటికి బ్యాంకు లింకేజీలు సులభతరం చేయడంలో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. తెలంగాణ ఏర్పడిన నాటినుండి స్వయంసహాయక సంఘాలకు ప్రతిసంవత్సరం పంపిణీ చేయబడిన మొత్తం మూడు రెట్లకు పెరిగింది. (2014–15 సం.లో రూ.3,738.67 కోట్ల నుండి 2020–21 డిసెంబరు వరకు రూ.10,445.03 కోట్లకు పెరిగింది.) రాష్ట్రంలో మొత్తం 47.53 లక్షల మంది మహిళలు 4.39 లక్షల స్వయం సహాయక బృందాలు మరియు 17,886 విలేజ్ ఆర్గనైజేషన్‌లుగా ఏర్పాటు చేయబడ్డారు.

30.5.2.3. కె.సి.ఆర్. కిట్ పథకం

సంస్థాగత కాన్పులను పెంచడం, మాతా శిశు మరణాలను తగ్గించడం, ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కె.సి.ఆర్.కిట్ పథకాన్ని 2017 జూన్ 3వ తేదీన ప్రవేశపెట్టడం జరిగింది. ఈ పథకం క్రింద గర్భిణీ తల్లులకు గర్భదారణ సమయంలో మరియూ ప్రసవానంతర కాలంలోని వేతన నష్టాన్ని భర్తీ చేసే ఉద్దేశ్యంతో మగ శిశువు జన్మించినట్లయితే రూ.12,000/- ఆడశిశువు జన్మించినట్లయితే 13,000/- ఆర్థిక సహాయం అందిస్తారు. ప్రసవానంతరం 15 రకాల వస్తువులతో కూడిన కిట్‌ను అందిస్తారు. ఈ కిట్ నూతన శిశువును వెచ్చగా ఉంచడానికి మరియు శిశువు శుభ్రతకు ఉపయోగపడుతుంది. 2020-21లో దాదాపు 2.1 లక్షల కిట్‌లు లబ్దిదారులకు సరఫరా చేయగా, 2021-22 (ఏప్రిల్ మరియు నవంబర్ 2021ల మధ్య) దాదాపు 1.5 కిట్లు పంపిణీ చేయబడ్డాయి. ఈ పథకం ప్రారంభించిన తరువాత మాతృ, శిశు మరణాలు గణనీయంగా తగ్గాయి. ఆసుపత్రులలో జరిగిన ప్రసవాలలో అతి తక్కువ సిజేరియన్ ప్రసవాలు జరిగాయి. దీని వలన తల్లులకు ఆరోగ్య సమస్యలు తగ్గి, ప్రసవానంతర ఖర్చులు కూడా తగ్గాయి. ఈ పథకం వలన 2015-16 మరియు 2019-20 మధ్య ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య (30.5% నుండి 49.7%కి పెరిగింది) దాదాపు రెండింతలైంది.

30.5.2.4 అమ్మ ఒడి:

తెలంగాణ ప్రభుత్వం 2018 సంవత్సరంలో గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలకు, ప్రసవానికి మరియూ ప్రసవానంతరం శిశువుకు రోగనిరోధక టీకాలు మరియూ పాలిచ్చే తల్లుల ఆరోగ్య సంరక్షణ అవసరాలకు అమ్మ ఒడి పేరుతో ఆపత్కాల వాహన (అంబులెన్స్) సేవలు మరియూ ఉచిత రవాణా సేవలు ఏర్పాటు చేయబడ్డాయి. రాష్ట్రంలో 33 జిల్లాల్లో 300 వాహనాలు హెల్ప్ లైన్ ద్వారా ఈ సేవలను అందిస్తున్నాయి. 2020-21లో దాదాపు 10.85 లక్షల లబ్ధిదారులు, 2021 సంవత్సరంలో నవంబరు వరకు 7.95 లక్షల మంది లబ్ధిదారులు ఈ పథకం క్రింద ప్రయోజనం పొందారు.

30.5.2.5 ఆరోగ్య లక్ష్మి:

అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదు చేసుకున్న గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు ఆరోగ్యలక్ష్మి పథకం క్రింద ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందించబడుతుంది. ఈ పథకంలో నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. ఈ నిధులే కాకుండా తెలంగాణా ప్రభుత్వం మహిళల ఆరోగ్యం సంక్షేమం దృష్ట్యా ఒకొక్కరికి రూ. 14/- చొప్పున అదనంగా కేటాయిస్తున్నది. ఈ పథకంలో లబ్ధిదారులకు నెలలో 25 రోజులు పూర్తి పౌష్టికాహారం 30 రోజుల పాటు 200 మి.లీ. పాలు, ఒక గుడ్డు అందించబడతాయి. దీనితో పాటు గర్భిణీ స్త్రీలకు 100 రోజులపాటు ఐరన్ మరియూ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించబడతాయి.

30.5.3. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు

30.5.3.1 ఆసరా పెన్షన్‌లు:

సమాజంలోని అత్యంత బలహీన వర్గాలను ఆదుకోవడానికి ప్రభుత్వం 2014 నవంబరులో "ఆసరా పెన్షన్ "పథకాన్ని ప్రారంభించింది. సంక్షేమం మరియూ సామాజిక భద్రత అనే కీలమైన లక్ష్యంతో ఈ పథకం ప్రారంభించబడినది. ఈ పథకములో ప్రత్యేకించి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, HIV తో బాధపడుతున్న వ్యక్తులు, కల్లుగీత

కార్మికులు, ఫైలేరియా ప్రభావితులు, నిస్సహాయులైన నేత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి స్త్రీలు ఈ పథకానికి అర్హులు. ఈ పథకం ప్రారంభించిన నాటి నుండి సగటున 39 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. ఈ పథకంలో జూన్ 2019 నుండి వికలాంగులకు నెలకు పెన్షన్ మొత్తాన్ని రూ.1500 నుండి రూ.3016 కు పెంచబడింది మరియు ఇతర వర్గాల వారికి నెలకు రూ.1000 నుండి రూ. 2016 కు పెంచబడినది. నవంబరు 2014లో ఈ పథకాన్ని ప్రారంభించిన నాటినుండి జనవరి 2022 సం. వరకు దాదాపు రూ.45,882 కోట్లు పంపిణీ చేయబడినాయి.

30.5.3.2 ఆరోగ్యశ్రీ (ఆయుష్మాన్ భారత్ - ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన (AB PM-JAY):

ఆరోగ్యశ్రీ అనేది ఒక సామాజిక ఆరోగ్య పథకం. వార్షిక ఆదాయం రెండు లక్షల కంటే తక్కువ ఉన్న కుటుంబాలు ఆరోగ్యశ్రీ పథకంలో చేరేందుకు అర్హులు. ఈ ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారు ఆసుపత్రిలో చికిత్స మరియు శస్త్రచికిత్సల సదుపాయం పొందవచ్చు. ఆరోగ్యశ్రీ పథకం తెలంగాణలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అమలు చేయబడుచున్న ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్య భీమా పథకం. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకుఆరోగ్యం మీద చేసే ఖర్చును తగ్గించి నగదు రహిత నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడం ఈ పథకం యొక్క ముఖ్య లక్ష్యం. దీని క్రింద లబ్దిదారులకు సంవత్సరానికి ఒక కుటుంబానికి ఐదు లక్షల విలువైన ఆరోగ్య సేవలు మరియూ అత్యాధునికమైన వైద్య సేవలు, వ్యాధులకు పది లక్షల వరకు లబ్ధి చేకూర్చబడుతుంది.మే 2021 లో తెలంగాణా ప్రభుత్వం ఈ పథకాన్ని భారతప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ - ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన (AB PM-JAY)తో అనుసంధానం చేసింది.ప్రస్తుత ఆరోగ్యశ్రీ లబ్ధిదారులందరూ ఈ పథకం పరిధిలోకి వస్తారు, అదనంగా PMJAY క్రింద పొందగలిగే 646 రకాల వైద్యసేవలు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులద్వారా అందించబడతాయి. 2014-15 మరియు 2019-20 మధ్య ఈ పథకం లబ్ధిదారుల సంఖ్య 42.3% పెరిగింది మరియు చేసిన వ్యయం 48.6% పెరిగింది. కానీ కరోనా మహమ్మారి సమయంలో లబ్ధిదారుల సంఖ్య మరియు పథకం యొక్క ఖర్చు రెండు తగ్గినవి.

30.5.3.3 ప్రజాపంపిణీ వ్యవస్థ:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అహార ధాన్యాలను మరియు నిత్యావసర వస్తువులను 17,013 చౌకధరల దుకాణాల (FPS) ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థను (PDS) చురుకుగా అమలుచేస్తున్నది. తెలంగాణా ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టం కింద భారత ప్రభుత్వం నిర్దేశించిన 1.91 కోట్ల వ్యక్తులకు మాత్రమే కాకుండా మరో 96 లక్షల మందికి అదనంగా ఈ PDS వ్యవస్థను విస్తరించింది. తద్వారా ఈ ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా డిసెంబరు 2021 నాటికి రాష్ట్రంలో 2.87 కోట్ల మంది లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక వ్యక్తికి ఆరు కేజీల బియ్యం, కేజీకి రూపాయి చొప్పున నిర్ణయించి కుటుంబంలోని సభ్యులందరికీ ఒకొక్కరికి 6 కేజీల చొప్పున పంపిణీ చేస్తున్నది.

30.5.4 ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలు

బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా స్వయం సంవృద్ధి సాధించడానికి అవసరమైన సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. వీటి యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఆర్థిక సహాయాన్ని అందించడం ద్వారా ఆస్తుల పెంపుదల, స్వయం ఉపాధికి దారితీసే నైపుణ్యాల పెంపుదల కోసం శిక్షణా కార్యక్రమాలు అందించడం, వ్యవస్థలో ఉన్న ఆర్థిక

సామాజిక అంతరాలను తొలగించడానికి అవసరమైన ఆర్థిక సహాయ సహకారాలను అందించడం. దీనిలో భాగంగా ప్రవేశ పెట్టబడిన సహాయ పథకాలను గురించి ఇప్పుడు చర్చిద్దాం.

30.5.4.1 దళిత బంధు:

2021–22 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం ప్రవేశపెట్టబడినది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేర్ అసెంబ్లీ నియోజక వర్గంలోని వాసాలమర్రి గ్రామంలో ఆగస్టు 1, 2021 నాడు ఈ పథకం ప్రారంభించబడినది. "షెడ్యూల్ కులాల ప్రజల ఆర్థిక అభ్యున్నతి కోసం "ఈ పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగినది. ఈ పథకం క్రింద ప్రతి లబ్దిదారుని కుటుంబానికి రూ.10 లక్షలు పూర్తి గ్రాంట్‌గా ఎటువంటి బ్యాంక్ యొక్క ఋణం లేకుండా తన ఆదాయాన్ని పెంచుకోవడానికి అవసరమైన వాహనాలు, దుకాణాలు, యంత్ర పరికరాల వంటి వాటికి యజమానులను చేయడం జరుగుతుంది. దీని ద్వారా లబ్దిదారులకు ఉపాధి మార్గం లభించి ఆర్థిక కష్టాల నుండి బయటపడేందుకు అవకాశం లభిస్తుందనేది ప్రభుత్వ ఉద్దేశం.

30.5.4.2 మిషన్ భగీరథ:

ఐక్యరాజ్యసమితి 2010లో సురక్షితమైన తాగునీరు, పారిశుద్యం రెండింటిని ప్రాథమిక హక్కులుగా గుర్తించింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో 6 లక్ష్యంగా దీనిని చేర్చడం జరిగింది. అదే కాకుండా "అందరికీ స్వచ్ఛమైన నీరు, అందరికీ పారిశుధ్యం" అనే నినాదాన్ని కూడా ఇవ్వడం జరిగింది. మానవాభివృద్దికి మరియూ ఆర్థికాభివృద్దికి నీటి లభ్యత అత్యంత కీలకం.

సురక్షితమైన, తగినంత, స్థిరమైన మరియూ శుద్ధి చేయబడిన తాగునీటిని రాష్ట్రం మొత్తానికి అందించడానికి తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ అనే ప్రధానమైన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. మిషన్ భగీరథ పైలాన్‌ను దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు 2016, ఆగస్టు 7 ఆదివారం రోజున మధ్యాహ్నం 3 గంటలకు గజ్వేల్ శాసనసభ నియోజకవర్గంలోని కోమటిబండలో ఆవిష్కరించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపరితల శుద్ధి చేసిన నీటిని మిషన్ భగీరథ పథకం యొక్క 26 విభాగాల ద్వారా నల్లా కలెక్షన్‌లతో అన్ని గ్రామీణ ప్రాంత నివాసాలకు సరఫరా చేయబడుతుంది. మరోవైపు ఈ పథకం ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు పెద్దమొత్తంలో నీటి సరఫరా చేయబడుతుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో తలసరి రోజుకు 100 లీటర్లు (LPCD), మున్సిపాలిటీలు/ నగర పంచాయితీలలో 135 LPCD మరియు మున్సిపల్ కార్పోరేషన్‌లకు 150 LPCD చొప్పున శుద్ధి చేయబడిన తాగునీరు అందించబడుతుంది. ఈ మొత్తం నీటిలో 10% నీరు పారిశ్రామిక అవసరాలు తీర్చడానికి ఉద్దేశించబడినది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 22,882 పాఠశాలలకు, 27,310 అంగన్వాడీ కేంద్రాలు మరియూ ప్రభుత్వ సంస్థలకు నల్లా కనెక్షన్‌ల ద్వారా నీటిని సరఫరా చేయబడుతుంది. నూటికి నూరుశాతం అంటే 24,028 గ్రామీణ ఆవాస ప్రాంతాలకు 202 లో పైపుల ద్వారా నీటి సదుపాయం కల్పించబడింది. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం, భారతదేశంలో అన్ని గ్రామీణ ప్రాంతాలల్లో ఉన్న కుటుంబాలకు స్థిరమైన ఉపరితల వనరుల ద్వారా 100% కుళాయి కనెక్షన్‌లు అందించిన హర్యానా, గోవా రాష్ట్రాలతో కలిపి తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచింది. డిసెంబరు 2021 వరకు మిషన్ భగీరథ క్రింద తాగునీటి పథకాలకు తెలంగాణా ప్రభుత్వం దాదాపు రూ.35,836 కోట్లు ఖర్చు చేశారు.

30.5.4.3 రెండు పడకల గదుల ఇంటి నిర్మాణం :

వివిధ భౌతిక ముప్పుల నుండి రక్షించడానికి, సామాజిక, గౌరవప్రదమైన జీవనాన్ని సాధించడానికి గృహము కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతీ మధ్య తరగతి మరియూ బలహీన వర్గాల ప్రజలకు సొంతింటి కల తప్పక ఉంటుంది. కుటుంబం యొక్క సంక్షేమంలో సురక్షితమైన, నివాసయోగ్యమైన సొంతిల్లు ముఖ్యపాత్ర పోషిస్తుంది. సరైన త్రాగునీటి సరఫరా, పారిశుధ్య సౌకర్యాలు కలిగి, పరిశుభ్ర వాతావరణంలో ఉన్న సొంతిల్లు ఎంతో అవసరం.

పేదలకు నాణ్యమైన గృహాలను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అక్టోబర్ 2015 లో రెండు పడకగదులల్ గృహాల కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ కార్యక్రమం క్రింద 2016 మరియు 2021 మధ్య మొత్తం 2,91,057 గృహాలు మంజూరు చేయబడ్డాయి. వాటిలో 1,07,612 ఇళ్ల నిర్మాణం నవంబర్ 2021 వరకు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమం ప్రారంభించినప్పటినుండి ఇప్పటివరకు (నవంబర్ 2021) 10,445 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరిగింది. ఈ గృహ నిర్మాణ కార్యక్రమాలను హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ మినహా మిగిలిన రాష్ట్రం మొత్తానికి తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ (TSHC) అమలు చేస్తుంది. హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ (GHMC) అమలు చేస్తుంది. ఈ పథకంలో నిర్మించే ప్రతి ఇల్లు 560 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక వంట గది మరియూ రెండు మరుగుదొడ్లను కలిగి ఉంటుంది. ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం గ్రామీణ ప్రాంతాలలో రూ. 5.04 లక్షలు, పట్టణ ప్రాంతాలలో 5.30 లక్షలుగా ఉంది. ఈ 2BHK ప్రోగ్రామ్, 2018-19 సంవత్సరంలో అద్భుతమైన పనితీరు కనబర్చడం వలన PMAY-U ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ అవార్డును అందుకుంది.

30.5.4.4 ఉపకార వేతనాలు:

తెలంగాణా రాష్ట్రప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల విద్యకై స్కాలర్షిప్‌లు మరియూ ట్యూషన్ ఫీజు రీయంబర్స్‌మెంట్ ద్వారా ఆర్థిక సహాయం చేస్తుంది.ప్రతి విద్య సంవత్సరంలో 4.86 లక్షల మంది యస్సీ విద్యార్థులు, 1.27 లక్షల మంది యస్టీ విద్యార్థులు, ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్‌లతో సహాయం పొందుతున్నారు. సుమారు 2.5 లక్షల మంది యస్సీ విద్యార్థులు, 1.4 లక్షల మంది యస్టీ విద్యార్థులు, 1.2 లక్షల మంది మైనార్టీ విద్యార్థులు మరియు 10.10 లక్షల మంది బీసీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్‌లు, ట్యూషన్ ఫీజు రీయంబర్స్‌మెంట్ ద్వారా ఆర్థిక సహాయం పొందుతున్నారు. సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన విద్యార్థులు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి అవసరమైన ఆర్థిక సహాయం క్రింద రాష్ట్ర ప్రభుత్వం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను అందిస్తుంది. ఈ ఉపకార వేతనం పొందాలనుకునే కుటుంబ వార్షిక ఆదాయం 5 లక్షల లోపు ఉండాలి. యస్.సి., యస్.టి విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్‌షిప్ పథకానికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి అని, బి.సి. మరియూ ఈబిసి విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్షిప్ పథకానికి మహాత్మజ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి అని మరియూ మైనారిటీ విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్షిప్ పథకానికి చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం అనే పేర్లు పెట్టడం జరిగింది. దీని కింద ప్రతీ విద్యార్థికి 20 లక్షల వరకు సహాయం అందజేయడం జరుగుతుంది.

30.5.4.5 గొర్రెల పంపిణీ పథకం:

యాదవ, గొల్ల కుర్మ సామాజిక వర్గాలకు 75% సబ్సిడీతో గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం 2017 సంవత్సరంలో ప్రారంభించబడినది. పథకాన్ని ప్రారంభించిన నాటి నుండి ఇప్పటివరకు 3.81 లక్షల మంది లబ్ధిదారులకు మొత్తం 79.98 లక్షల గొర్రెలను పంపిణీ చేశారు.

30.5.4.6 విద్య సంబంధిత సంక్షేమ కార్యక్రమాలు

తెలంగాణ ప్రాంత అభివృద్ధికి విద్య అనునది అత్యంత కీలకం. దీర్ఘకాలిక ఉత్పాదక పెంపునకు, తరతరాలుగా కొనసాగుతున్న పేదరిక నిర్మూలనకు, జనాభా పరిణామ క్రమానికి, ఆరోగ్య పరిరక్షణ, మహిళా సాధికారత, అసమానతల తొలగింపునకు విద్య ఎంతగానో దోహదం చేస్తుంది. అన్ని వర్గాలకు సమాన, నాణ్యమైన విద్య తెలంగాణా ప్రభుత్వ లక్ష్యం.

రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం గురుకుల విద్యాసంస్థలను నెలకొల్పడం జరిగింది.గురుకుల విద్యాసంస్థల సంఖ్య 2014లో 298 గా ఉండగా 2022 సంవత్సరం వరకు ఆ సంఖ్య 978 కి పెరిగినది. మన ఊరు-మన బడి/ మన బస్తి-మన బడి కార్యక్రమాన్ని 2022 జనవరిలో రూ.7,289.54 కోట్లతో ప్రభుత్వం ప్రారంభించింది. దీని ప్రకారం రాబోయే మూడు సంవత్సరాలలో పాఠశాలలో అవస్థాపనా సౌకర్యాలను మెరుగుపర్చడం జరుగుతుంది.

30.6 సారాంశం

ఇప్పటివరకు మనం నిరుద్యోగం, ఉపాధి ప్రభుత్వం అమలుపరుస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించిన సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించాం. పైన తెలిపిన సంక్షేమ కార్యక్రమాలే కాకుండా ఇక్కడ తెలుపని అనేక రకాలైన కార్యక్రమాలను కూడా ప్రభుత్వం అమలు పరుస్తున్నది.పంచాయితీ రాజ్ మరియూ గ్రామీణాభివృద్ధి, మహిళా అభివృద్ధి మరియూ మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలు మరియూ వ్యవసాయ సంబంధ సంక్షేమ కార్యక్రమాల అమలు కొరకై సేవా సిబ్బంది యొక్క సామర్థ్యాన్ని మెరుగుపర్చడానికి వివిధ శాఖలలో బలమైన మానవ వనరుల నిర్వహణా వ్యవస్థ కొరకు ప్రభుత్వం నిరంతరం సిబ్బందికి శిక్షణను అందించవలసి ఉంటుంది. కులం, లింగం, వృత్తి పరమైన మరియూ ఇతర వర్గాలలో ఉన్న అట్టడుగు, బలహీన వర్గాల సామాజిక ఆర్థిక ఫలితాలను మెరుగుపర్చడానికి ప్రభుత్వం స్థిరంగా అనేక రకాలైన కార్యక్రమాలు చేపట్టవలసి ఉంటుంది. ప్రభుత్వ దృక్కోణానికి అనుగుణంగా పథకాలు సక్రమంగా సక్రమంగా అమలు అయ్యేలా చూసుకోవడం పైననే సంక్షేమ కార్యక్రమాల విజయం ఆధారపడి ఉంటుంది.

30.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు 4-5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. పేదరికం అనగానేమి?
2. పేదరికంలోని రకాలను వివరించండి.

3. తెలంగాణలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఎన్నిరకాలుగా విభజించవచ్చు. అవి ఏవి?
4. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికై ప్రవేశపెట్టిన కార్యక్రమాలు ఏవి?
5. తెలంగాణా ప్రభుత్వం పేదరికాన్ని రూపుమాపడానికి దేని ఆధారంగా తన కార్యక్రమాలను రూపొందించింది.

II. క్రింది ప్రశ్నలకు 8-10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. రైతుబంధు అమలు తీరును వివరించండి.
2. రైతుభీమా పథకం రైతులకు ఏవిధంగా లాభదాయకమైనది?
3. స్త్రీ శిశు సంక్షేమ పథకాలు తెలంగాణా అభివృద్ధికి ఎలా దోహదం చేస్తాయో తెలపండి?
4. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకొరకై ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ఏవి?
5. ప్రజాపంపిణీ వ్యవస్థలో తెలంగాణ ప్రభుత్వ విధానమెట్టిది?

III. క్రింది ప్రశ్నలకు 16-20 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. తెలంగాణా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు సంక్షేమ పథకాల పై మీ అభిప్రాయాన్ని వ్యక్తీకరించండి.
2. తెలంగాణ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ కార్యక్రమాల యొక్క ముఖ్య లక్ష్యాలు ఏవి?
3. మీ ప్రాంతంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్న తీరును వివరించండి.

30.8 పదకోశం

మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (బహిమితీయ పేదరిక సూచిక)

నిరపేక్ష పేదరికం: జీవించడానికి కనీసం అయ్యే వినియోగ వ్యయాన్ని కూడా చేయలేని పరిస్థితిని నిరపేక్ష పేదరికం అంటారు. నిరపేక్ష పేదరికం లెక్కించేటప్పుడు పరిగణలోనికి తీసుకునే జీవన వినియోగ వ్యయాన్ని మార్కెట్ ధరల ఆధారంగాలెక్కిస్తారు. ఇది ఎక్కువగా భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో కనిపిస్తుంది.

సాపేక్ష పేదరికం: సాపేక్ష పేదరికం అనునది సమాజంలో కల ఆర్థిక అసమానతలను సూచిస్తుంది. దీని ప్రకారం జీవన ప్రమాణం తక్కువగా ఉన్న ప్రజల యొక్క ఆదాయ స్థాయి, జీవన ప్రమాణం ఎక్కువగా ఉన్న ప్రజలతో పోల్చి తక్కువ ఆదాయం పొందుతున్న ప్రజలను సాపేక్షంగా పేదవారిగా పరిగణిస్తారు. ఈ సాపేక్షపేదరికం అన్న భావనను సంపన్న దేశాలలో అధికంగా ఉపయోగిస్తారు.

అల్ప ఉపాధి లేదా అల్ప ఉద్యోగిత: అధిక ఉద్యోగార్హతలు కలిగి ఉండి తమ సామర్థ్యం కంటే తక్కువ స్థాయిలో ఉపాధి దొరుకుతుంది దీనినే అల్ప ఉపాధి లేదా అల్ప ఉద్యోగిత అంటారు.

ప్రచ్ఛన్న నిరుద్యోగం: ఏదేని రంగంలో అవసరానికి మించి పనిచేసే జనాభా ఉన్నట్లయితే దానిని ప్రచ్ఛన్న నిరుద్యోగం అంటారు.

30.09 ఉపయుక్త గ్రంథాలు

1. తెలంగాణా రాష్ట్ర గణాంక సంక్షిప్త నివేదిక 2021
2. National Multidimensional Poverty Index Baseline Report NITI Aayog, 2021.
3. Telangana Socio-Economic Outlook 2022.